Telugu Classics Popular Edition Series

ఓం

ఆంధ్రమహాభారతము

శాంతిపర్వము

(తిక్కనసోమయాజిప్రణీతము)

పరిష్కర్త :
డా॥ జి. వి. సుబ్రహ్మణ్యం
రీడరు, తెలుగుశాఖ,
ఉస్మానియా విశ్వవిద్యాలయము
హైదరాబాదు.



294.5923
TIK

ప్రచురణ :
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి
కళాభవన్, సైఫాబాదు, హైదరాబాదు-500 004.

CV

AOUA103B123

శ్రీ

ఆంధ్ర మహాభారతము

శాంతిపర్వము

(తిక్కనసోమయాజిప్రణీతము)

పరిష్కర్త :

డా॥ జి. వి. సుబ్రహ్మణ్యం

రీడరు, తెలుగుశాఖ,

ఉస్మానియా విశ్వవిద్యాలయము

హైదరాబాదు.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
10,170

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10170

ప్రచురణ :

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

కళాభవన్, సైఫాబాదు, హైదరాబాదు-500 004.

ప్రథమ ముద్రణ :
జనవరి, 1977
ప్రతులు : 2000

294.5923
TIK

వెల: రు. 7-50

Paper used for the printing of this book
was made available by the
Government of India at concessional rate.

ముద్రణ :
నాగలక్ష్మి ఆర్టు ప్రింటర్స్,
బషీర్‌బాగ్, హైదరాబాద్-29.

తొలిపలుకు

ఆంధ్రప్రదేశ్ మాజీమంత్రివర్యులు శ్రీ యం. ఆర్. అప్పారావుగారు చేసిన సూచన ననుసరించి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ తెలుగుభాషలోని ప్రాచీనసాహిత్యము అందరికి అందుబాటులో నుండునట్లుగా ముద్రించి ప్రకటింపవలెనని నిశ్చయించినది. తెలుగుభాషలోని పూర్వగ్రంథసముదాయము ఈనాడు పాఠకునకు సక్రమముగా సరసమైనధరకు లభ్యమగుటలేదు. ఈ లోటును తీర్చి ప్రాచీనగ్రంథసముదాయమును విడివిడిగా ప్రకటించుటకు సాహిత్య అకాడమీ ఒక ప్రణాళిక సిద్ధము చేసినది. ఈ ప్రణాళిక ప్రకారము ఈ కార్యక్రమము మూడుతరగతులుగా విభజించనైనది. మొదటిది ప్రాచీన ప్రబంధాల ప్రకటన; రెండవది మహాభారత ప్రచురణ; మూడవది హరివంశ, భాస్కరరామాయణ, బసవపురాణ, భోజరాజీయములను సంగ్రహించి ప్రకటించుట. పై ప్రణాళిక ప్రకారము ప్రచురింపబడు ప్రతిగ్రంథములో గ్రంథకర్తనుగూర్చి, గ్రంథప్రాశస్త్యమునుగూర్చి వివరించు సుమారు 40 పేజీల పీఠికను చేర్చవలెనని నిశ్చయించనైనది.

ఈ కార్యక్రమములో ప్రాచీన ప్రబంధాల ప్రకటనము పూర్తియైనది. సంక్షిప్త గ్రంథప్రచురణ కార్యక్రమములో బసవపురాణ, భాస్కరరామాయణ, హరివంశ, భోజరాజీయములు ప్రచురింపబడినవి. ప్రస్తుతము ఆంధ్రమహాభారత ప్రకటనము చేపట్టనైనది. ప్రసిద్ధులైన విద్వాంసులచే భారతసంపుటముల పరిష్కారము నిర్వహింపబడుచున్నది.

ఆంధ్రమహాభారత సంపుటములలో శాంతిపర్వమును పరిష్కరించి, పీఠిక వెలయించి మా కందించిన డా॥ జి. వి. సుబ్రహ్మణ్యం గారికి అకాడమీ పక్షాన కృతజ్ఞతలు.

పైన పేర్కొనబడిన గ్రంథసంపుటాల వ్రాతప్రతులను సిద్ధముచేసి ముద్రించుటకు అవసరమైన డబ్బును పూర్తిగా అకాడమీకి ఇచ్చుటకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు వాగ్దానము గావించి అందులో చాలమట్టుకు డబ్బును విడుదలకూడ చేసినవి. అందుకు అకాడమీ పక్షాన కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు. సాధ్యమైనంత త్వరలో మహాభారత సంపుటముల నన్నింటిని సిద్ధముచేసి, ఆంధ్ర పాఠకలోకానికి అందజేయుట జరుగగలదని విశ్వసించుచున్నాను.

హైదరాబాదు
1-1-1977

దేవులపల్లి రామానుజరావు
కార్యదర్శి.

1

శాంతనవగీత

పదునెనిమిది పర్వముల ఆంధ్ర మహాభారతమునందు శాంతిపర్వము పండ్రెండవది. ఇది పరిమాణమునందే కాక పరమార్థమునందు కూడ పర్వము లన్నింటి కంటెను మిన్నయైనది.

భారతమునకు పంచమవేద మను ప్రశస్తితోపాటు కార్ష్ణవేద మను కీర్తియు కలదు. ఆ కీర్తికి ప్రధానకారణము భగవద్గీత. అది భీష్మ పర్వమున ప్రవచింప బడినది. భీష్మునకు భీష్మపర్వమున ప్రచండవీరు డను ప్రఖ్యాతి దక్కినది; శాంతిపర్వమున పరమధర్మజ్ఞు డను ప్రశస్తి నిలిచినది. శాంతిపర్వము శాంత నవుడు బోధించిన ధర్మగీత. భగవద్గీత పరమార్థమును బోధించినను నరుని చేత గాండీవమును పట్టించినది. శాంతనవగీత పురుషార్థసారమును బోధించినను ధర్మజుని ధర్మసింహాసనము నెక్కించినది. ఈ రెండింటియందును ప్రవృత్తి నివృత్తి ధర్మములు ప్రబోధితములైనను అవి పృచ్ఛకునియందు ప్రవృత్తి ధర్మ ప్రతిష్ఠాపనమునకు ప్రకృష్టసాధనము లైనవి. నివృత్తి ధర్మము నిర్మల జ్ఞానమును ప్రసాదించినది; ప్రవృత్తి ధర్మము విధినిర్వహణమునకు వెలుగుబాట చూపించినది. రెండింటివెనుక నున్న శక్తి శ్రీకృష్ణుడు.ఒకచోట నతడు ప్రవక్త; రెండవచోట నతడు ప్రయోక్త.

భారత పర్వాఖ్యలలో శాంతిపర్వ నామమున కొక వైశిష్ట్యము కలదు. ఆది పర్వము మొదలుకొని ఉద్యోగ పర్వము వరకును పాండవేతివృత్తము నందు గాననగు ప్రధానాంశముల నధికరించి నామము లుంచబడినవి. యుద్ధ షట్కమున నాలుగు పేర్లు కౌరవ సేనానుల నధికరించియుంచినవి. సౌప్తిక పర్వ నామము యుద్ధము ప్రవర్తిల్లిన కాలావస్థను సూచించునది. స్త్రీపర్వము కౌరవ వనితా శోక ప్రవంతిని పొంగించినది. ఆనుశాసనిక, అశ్వమేధములు పాండవ రాజ్యపాలన ప్రవృత్తిని ప్రతిపాదించునవి; ఆశ్రమవాసమున కురువృద్ధుల స్థితి వ్యక్తమొనర్పబడినది. మౌసలమున యాదవవంశ పరిసమాప్తి ప్రస్తావింప బడినది. మహాప్రస్థాన, స్వర్గారోహణములు పాండవ చరమస్థితిని వర్ణించునవి.

ఇవియన్నియు నాయకులైన పాండవులకును, వారి సమష్టి జీవితమునకును సంబంధించినవి. మఱి శాంతిపర్వమో? పాండవులందరికంటె ధర్మజుని గుఱించియే ప్రవర్తిల్లినది. శాంతి ఎవరికి? భీమాదులకు కాదు. ధర్మరాజునకే. ధర్మజ చిత్తవృత్తియందు భాసించెడి అవస్థా విశేషము నధికరించి పేరుపెట్టబడిన నామము 'శాంతిపర్వము.'

ధర్మజునకు రాజ్యము దక్కినది కాని ఇది రక్తపుకూడే యైనది. గంగా తీరమున నశుచిత్వం బపనయించుటకై మూడు నెలలున్నతరి ధర్మజుని యొద్దకు నారద వ్యాసాది మునీంద్రు లేతెంచిరి. వారితో ధర్మరాజు నుడివిన పలుకులు విజయోత్సాహ ముద్రితములై లేవు, విషాదమగ్నములై యున్నవి.

'కృష్ణుండు మామీఁదఁ గృపసేయుటయు బ్రాహ్మ
ణానుగ్రహంబున ననిలపుత్ర
పార్థుల పటుబాహుబలమున మేదిని
యంతయుఁ జేకుఱునట్టిదయ్యె;
నైనను నతిఘోర మగు నఖిలజ్ఞాతి
వధ మొనరించుటవలన నధిక
గుణుని సౌభద్రునిఁ గులభూషణంబు బాం
చాల తనూజ పంచకముఁ గోలు
పోకఁ జేసియు గెల్పు గెల్పుగ మదీయ
బుద్ధి గైకొన దయ్యెడు సిద్ధముఖ్య! శాం. 1.6

బందుగులనెల్లఁ బలివెట్టి సాధించిన విజయము విజయమే కాదని తలంచినాడు. బందుగులలో నిఖిలజ్ఞాతివర్గ మొకయెత్తు; నిజసుతవర్గ మొకయెత్తు. ఈరెండెత్తులొక యెత్తు; కర్ణవధ యొక్కటి యొక్క యెత్తు. కర్ణుఁడు కౌంతేయుఁడని యుదక ప్రదాన సమయమున గొంతివలన వినిన ధర్మజుని యంతరంగము నిప్పులలోఁ బొరలినట్లైనది. గతస్మృతు లాతని చిత్తమునందలి శోకము నుత్తుంగ తరంగ సదృశముగా పై కెగజిమ్మినవి. నారదునితో ధర్మజు డిట్లనినాడు.

'గాండివి నొవ్వఁబల్కఁ తిటు గర్ణునిఁ జంపక వచ్చితేని త
మ్ముండవు గావు నాకు నని మూర్ఖత సోదరఖాతి నైన క
ష్టుండ మనంబునం బెఱుగు శోకము నెట్లు సహింతుఁ; దప్పె నా
తండును నేమునైన విబుధప్రకరంబును మాకు నడ్డమే?' 1.14

కర్ణవధ ధర్మజుని చిత్తమున సహింపలేని శోకభావాతిశయమును గలిగించినది. ఆ శోకమువలన నతనియందు భాసింపవలసిన విజయోత్సాహము కుంఠితమైనది. అంతటితో నాగలేదు. అతిశోక మాతనికి విరక్తిని కలిగించినది. తమ్ములచేతిలో రాజ్యమునుంచి తపోవనమున కేగఁదలంచి విష్వచ్చుని యెమట నిట్లు వేదనను వెలిబుచ్చినాడు.

'జ్ఞాతుల నందఱఁ జంపితి మది యాత్మ
వధమ కాదే! రాజపరనంబుఁ
గాల్పు; మహింస నిక్కము దాల్మి మత్సర
వర్జన మిది వనవాస జనుల
కాగమవిహితంబు లఁటె; యింత యెప్పునే;
వనమున వసియింపవలయు; వించె;
యసుఖదంబైన రాజ్యామిషంబునకుఁ గు
క్కలభంగిఁ దమలోనఁ గాటులాడి
కులము నెల్లను బొలియింపఁ గుత్సితంపు
బ్రదుకు వచ్చెనె యనువగ పాలువడఁగఁ
బ్రమద మొసఁగదు త్రైలోక్యరాజ్య మైనఁ;
గాన యే నొల్ల మహి; మీర కైకొనుండు: 1.42

శోకము నిర్వేద మైనది: నిర్వేదము విరక్తికి మార్గము చూపినది. ధర్మజుని మానసికస్థితి శాంతిపర్వారంభమున నిట్లున్నది.

ఇందు శాంతి దేనికి? ఇట్టి స్థితికి మూలమైన శోకమునకు. అది శాంతించినచో నాపై నిర్వేదాదులు శాంతించినట్లే. కావున తాత్పర్యమునందు-శోకశాంతియే శాంతిపర్వ సర్వార్థ ప్రయోజనము.

ధర్మజుని శోకము రెండు పాయలుగా ప్రవహించుచున్నది. ఒకటి బంధు జన వియోగ జనితమైనది. రెండు: బంధుజనవధ వలన కలిగెడి పాపమును గూర్చిన భీతి. ఒకటి ఇహమునకు సంబంధించినది. రెండవది పరమునకు సంబంధించినది. బంధుజన వియోగ జనిత శోకము ఉపశమనవాక్యములతో శమింపవచ్చును: రెండవది శమింపవలె నన్నచో ఉపదేశ మవసరము. శాంతి పర్వమునందలి ప్రథమాశ్వాసమున భీమాదులును, ద్రౌపదియు, పారాశర్య వాసు దేవాదులును బోధించిన ఉపశమన వాక్యతాత్పర్యములవలన ధర్మజుని చిత్తము కలంక దేరినది. పట్టాభిషేకమున కాత డంగీకరించినాడు. పట్టము కట్టుకొని నాడే కాని పాపశంకమాత్ర మాతని హృదయశల్యమై వేధింపజొచ్చినది. అశ్వ మేధ యాగముతో గాని అది యాతనిని వీడిపోలేదు.

అట్లగుటచే శాంతి, అనుశాసనిక, అశ్వమేధ పర్వములను గలిపి 'శాంతి త్రయ'మని వ్యవహరించు పరిపాటి కలదు. ఈ పర్వత్రయమునందు ధర్మజుని శోకము అవస్థాత్రయము నాశ్రయించి యుపశమించిన దని విమర్శకులు గుర్తించి నారు. "ధర్మరాజు సింహాసన మధిష్ఠించుటకు పూర్వము, యుద్ధానంతరము, వ్యాసార్జునాదులచేత బోధింపబడినప్పుడు "చిత్తంబు కలంకదేరి కౌంతేయాగ్ర జుండు రాజ్యభార నిర్వహణోత్సాహము" (శాం. 1.345) కలవాడై నాడని కవి చేత చెప్పబడినది. భీష్మోపదేశము ముగిసిన తరువాత "ధర్మజుడు తెలివొందె భవదుపదేశామృతంబున" (అను.5.440)అని వ్యాసుడు భీష్మునితో చెప్పినాడు. భీష్మనిర్యాణానంతరము శ్రీకృష్ణుడు, వ్యాసుడు అశ్వమేధమునందు చిత్తమును ప్రవర్తింపజేసిన తరువాత ధర్మరాజు "మీ కారుణ్యంబున నా శోకంబంతయును బాసె సుమనస్కత కలిగె" (అశ్వ 1.137) నని తానుగా చెప్పినాడు. ఇది శాంతిత్రయమున ధర్మజుని శోకము క్రమముగా నుపశమించిన విధము లక్షణము."[1]

బంధుజన వియోగ శోకము ధర్మజుని మనస్సునకు సంబంధించినది. పాపశంక బుద్ధికి సంబంధించినది. మనస్సు బుద్ధిచేత శాసింపబడునది. బుద్ధి జ్ఞానముచేత శాసింపబడునది. జ్ఞానమువలన వివేక ముదయించును. వివేకము మనమునందలి శోకము నుపశమింపజేయును. మనము కలంక దేరినచో, ఇక తెలివి గలుగవలసినది బుద్ధికి. బంధువధవలన జనించెడి మహాఘము తరింపరాని

---

1. తిక్కన కావ్యశిల్పము డా॥ కే. వేం. రామకోటిశాస్త్రి పుట. 322.

దని ధర్మజుని యభిప్రాయము. రాజ్యమును పరిగ్రహించినచో తత్పలము కట్టి కుడుపునని తత్పరిహరణము వలన తత్పాపపరిహారము చేసికొన దలంచినాడు ధర్మజుడు. ఇది ధర్మజుని ధర్మశీల లక్షణము. అతడు కళంక రహితమైన ధర్మము నాచరించుట జీవిత వ్రతముగా కలవాడు. రాజ్యమును గ్రహించుట రాజధర్మ మనియే యుద్ధోద్యోగము గావించినాడు. యుద్ధానంతర మా రాజ్య గ్రహణమునకు వెనుకాడుట అది అపుదూషితమను తలంపుచేతనే. పాప విరహిత మైనచో నాతనికి రాజ్యపాలన ధర్మ ముపాదేయమే. భీష్మాదుల యుపదేశము వలన నతనికి జ్ఞానముదయించినది; అశ్వమేధాదులచే పాపపరిక్షాళన మైనది. ధర్మజుని రాజ్యస్థితి అనఘమై భారతమున భాసించినది. శాంత్రిత్రయ కథా తాత్పర్యము ధర్మజున కనఘస్థితి కల్పించుట కేర్పడినది. అందు శాంతిపర్వము శాఖాద్వయ విశిష్టమైన శోక ముపశమించుటకు ప్రవర్తిల్లినది. అం దొకటి ఫలించినది; మఱియొకటి ఫలింపలేదు.

మనస్సు వికారములకెట్లు మూలకందమో, బుద్ధి శంకలకట్లు ఆలవాలము. లోకమున నహింసదయాదు లుత్తమ ధర్మములు. ధర్మజునకు రాజ్యము హింస వలన లభించినది. హింసార్జిత విత్తభోగము ధర్మవిరుద్ధ మని లోకమున వినవచ్చు చున్నది. అట్లగుటచే ధర్మజురాజ్యభోగ మధర్మమే యగును. ఇది సామాన్య ధర్మ దృష్టి. దీనిని ధర్మ సూక్ష్మ జ్ఞానముచే తరింపవచ్చును. అందు మొదటిది రాజ ధర్మ పరిజ్ఞానము. క్షత్రియుడు స్వార్థము కొఱకు రాజ్యము నార్జించినచో హింస కావచ్చును. ధర్మ స్థాపనము కొఱకై రాజ్యము సాధించినచో ఆ హింస హింసకాదు. ఒకవేళ అది హింస యైనను ధర్మమును రాజ్యమున రక్షించినచో తద్దోషము తీరిపోవును. అధర్మపాలనమువలన లోక మంతయు హింసింపబడును. ధర్మముకొరకై కొంత ప్రజాహింస యైనను భూతలమంతయు సుఖించును. ఇట్టి విశ్వధర్మమును సాధించుటకు ధర్మపరులు సాయుధపోరాటము చేయవచ్చును. దానివలన లోకహిత మధికముగా ప్రవర్తిల్లుటచే తత్సాధనలో నైన హింస ఉత్తమ ప్రయోజన నిమిత్తమై ఉజ్జ్వలమై భాసించును. ఈ ధర్మ సూక్ష్మము పాలకుని కెంత తెలియవలెనో, అతని చరితమును పఠించు పఠితకును అంత తెలియవలెను. అందువలన శాంతిపర్వము ధర్మజున కెంత అవసరమో, పఠితకుకూడ అంత అవసరము.

మనస్సున శోకము మోహము వలన జనించును. బంధుజన నష్టము, ప్రజానష్టము, ధర్మజుని చిత్తమునకు శోకము నాపాదించినవి. ధర్మజు డెంత మానిసియో అంతటి ధీరుడు. ధీరునికి కలుగు శోకము ఎంత తీవ్రమైనను దీర్ఘకాలికము కాదు. అందువలన నది సంచారభావము వంటిదే యగును. ఆది ఉపశమన వాక్యములతో శాంతించును. ప్రథమాశ్వాసమున నట్లే యైనది. మోహ మహంకార జనితము. రణమున బంధుజనులను తాను చంపె ననుకర్తృత్వబుద్ధియుండుటచే ధర్మజుడు తత్ఫలమైన శోకము ననుభవించుచున్నాడు. రణకర్మ విధాత్ర సంఘటన మని భావించినచో తచ్ఛోక మతని కంటదు. అర్జును డిట్టి తాత్పర్యము నిదివరకే శ్రీకృష్ణుని వలన విని యుద్ధకర్మను కర్తృత్వ విరహిత బుద్ధితో నిర్వహించినాడు. అట్టి సంస్కారముతో అన్నను ఓదార్చినాడు-

"వైరి వధంబు నీకును నవశ్యము జేయక పోవరానిదై
వైరులకున్ భవత్సమరవాంఛన సద్గతి కేగ బాలిదై
చేరె విధాత్రసంఘటన జింతకు గారణ మేమి ధర్మవి
స్తారవిదుండ వీ వకట! ధైర్యసమగ్రుడవై వెలుంగవే! 1.154

శ్రీకృష్ణు డాతాత్పర్యమునే వక్రమార్గమున బోధించినాడు-

"పురుషవ్యాఘ్ర! మనంబు గుంద వగలం బొందంగ నీ కేల సం
గరకేలిన్ భవదీయబంధు లతిలోకంబైన పెంపొప్ప బో
యిరి నాకంబున కట్లుగాక కలగాదే రాజవృత్తంబు దా
నరయన్ రాజుల యేజ యేజకులు నిత్యాయుష్యులే సెప్పుమా!"
(1.225)

తన యుపదేశమున కుపబలకముగా షోడశరాజుల చరిత్రములు చెప్పినాడు. సువర్ణష్ఠివి కథ నెఱిగించినాడు. పారాశరు డీ యంశమునే వాచ్యముచేసి చెప్పినాడు—

'మనుజులు సేయ నెవ్వరు సమస్తము నీశ్వరునాజ్ఞ జెల్లెడు
న్వినుము కుఠారపాణి ధరణీరుహముల్ నఱికంగ భూప మొం

దునొకొ కురారమున్ జనులు దోసముఁ బొందరు కర్త యీశ్వరుం
డనియెడు నిశ్చయంబు దృఢమై మది నిల్పినఁ జాలు భూవరా ! "
(1.277)

'కర్మఫలం బీశ్వరుని యనియ తదర్పణబుద్ధి సహితంబుగాఁ బ్రబుద్ధులు వేద చోదిత కర్మంబు లనుష్ఠింతు' రని ప్రబోధించినాడు. యుద్ధమునకు పూర్వము నరునకు నారాయణుడు బోధించిన తాత్పర్యము కూడ నిట్టిదే.

"కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన
మాక ర్మ ఫల హేతు ర్భూర్మాతే సంగోఽస్త్వకర్మణి" గీత-2.47

అప్పుడు నరునకు కలిగిన విషాదమే యిప్పుడు ధర్మజునకు కలిగినది. "పుత్రులుం బౌత్రులు నన్నలుం దమ్ములు జనకులుం దాతలు మామలు గురువులు సబంధులు సఖులు నల్లురు బావలు మఱందులు మఱియుఁ బవిత్త్రిలగు ధాత్రీపతులు నాచేత మడిసిరి. దదీయ స్త్రీజనంబులు పతి సుత సోదర పిత్ర మరణ శోక సంతాపాతిశయంబునం బలవించి పలవించి ప్రాణంబులు విడుతురు గావున దాని సూక్ష్మంబుగా విచారించిన వనితావధపాతకంబునుం బాటిల్లు; నెయ్యది కడగా నిష్కల్మషుండ నగుదు ననువెగడున మునింగిన మనంబు మహీభరణంబున కెట్లు సొచ్చు; నుగ్రంబైన తపంబునం దనువు దొఱంగుట దక్క నొండు విధంబు నాకుం జూడలేకున్నయది"యని ధర్మజుడు వాపోయినాడు. పారాశరు డాతని మర్మము నెఱిగి యి ట్లుపలాలించినాడు-

'విడువు ముమ్మలికంబు; వినుము; నీ చెప్పిన
యందఱు భూముల కాసపడియుఁ
బెంపును దేజంబుఁ బేరును గోరియు
నీసున సమరంబు సేసి చచ్చి;
రాపని కిల్బిషం బగునె నీ; కట్లును
గాక వార ల నెట్టి కర్మగతులు
మృతులఁ గావించెనో మతి నెఱుంగుదె వాని
నెఱుఁగుఁ గాలుఁడు చావనేరి కెద్ది

తఱి యతం డప్పు దెగటార్చు దాని నీవు
సేసినాడవుగా మఁడఁ జింత సొనిపి
యుడుకు టొకవెట్టి; దీనిపై నొల్ల గృహము
విడుతుఁగా కను టిది పెద్దవెట్టి యధిప !" (1.282)

ఈమాటలతో నతని డెందము తేఱినది. సింహాసన మెక్కుటకు సిద్ధమైనాడు. కర్త తాను కాడని తలచినంతనే కలత తీరినది. రాజ్యచక్రము త్రిప్పవలసివచ్చినపుడు చేయవలసిన ధర్మమెట్టిదో, తెలిసినకాని భావిచరిత్రము ప్రసన్నముకాదు. అది మనసునకు సంబంధించిన విషయము కాదు. బుద్ధివిషయము. అది జ్ఞానమునాశ్రయింపవలెను. తరువాతి కథ యంతయు నీ సూత్రము నంటిపెట్టుకొని సాగినది.

నిర్మల ధర్మాచరణము కత్తి మీద సాముపంటిది. ధర్మసాధకునకు అధర్మభీతిమెండు. భర్తృహరి లోకులయం దుండెడి భయస్వరూపమును లెస్సగా నిరూపించినాడు.

'భోగే రోగభయం కులే చ్యుతిభయం విత్తే నృపాలా ద్భయం
మానే దైన్యభయం బలే రిపుభయం రూపే జరాయాభయం
శాస్త్రే వాదభయం గుణే ఖలభయం కామే కృతాంతాద్భయం
సర్వంవస్తుభయాన్వితం భువి నృణాం వైరాగ్యమేవాభయమ్' [2]

ధర్మజునకు గూడ నిట్టి భయమే కలదు.

'వినుము; వివిధసుఖము లనుభవింపఁగ రాజ్య
విభవయుక్తిఁ దిరుగ వేడ్క లేదు;
నాకు ధర్మరక్షణము మీఁది భరముఁ ద
ల్లోపభయము మనములోనఁ బెద్ద' శాం. 2.331

నిట్టి భయ ముండుట ఉత్తమ ధర్మసాధకుని లక్షణము. ధర్మ నిర్వహణమునందనుక్షణము జాగరూకుడై యుండుట కది సాధకము. ధర్మజిజ్ఞాసువున కది జ్ఞానసముపార్జన హేతువు.

---

[2] భర్తృహరి సుభాషితము - వైరాగ్య శతకము. శ్లో. 31.

ధర్మజుడు గద్దె కెక్కిన మరునాటినుండియే అతని చిత్తమునందు ధర్మ లోపభీతివలన ధర్మజిజ్ఞాస అంకురించినది. జిజ్ఞాస బుద్ధిలక్షణము. సర్వజ్ఞుడైన వాసుదేవుని పాలికేగి తన జిజ్ఞాసప్రవృత్తిని బైటపెట్టినాడు. అతడు శాంత నవుని ఉపదేష్టగా నిశ్చయించి యతనిపాలికి నాతని గొంపోయినాడు. భీష్ముని బుద్ధియందు పురుషోత్తముడు తన బుద్ధిస్ఫురణము నావాహనము చేసినాడు. తా నొకసారి గీతను ప్రవచించినట్లు- భీష్మునిచే ధర్మగీతను ప్రబోధింప జేసినాడు. ఇక్కడ ధర్మజుడు శ్రోత; శాంతనవుడు వక్త. పలికెడివాడు గాంగేయుడు; పలికించెడివాడు గోవిందుడు. పలికెడి పలుకులు వేదతుల్యములు.

'ధరణి యెందాఁక నుండు సుస్థిరత నీదు
కీర్తి యందాక నక్షయస్ఫూర్తిఁ దాల్చి
నడవఁగల యది నీవు సెప్పెడి సువాక్య
ములును వేదతుల్యంబులై వెలయుచుండు' (2.148)

అని ప్రకటించినాడు పురుషోత్తముడు. వేదోపమానముచే పరమ ప్రామాణికము లని ధ్వనింపజేసినాడు. ధర్మజు డావాక్య శ్రోతగా నిలచుటవలన నవి వెలువడి నవి. ధర్మజుని కెటిగించిన తత్వవిశేషములు ధరణిజనుల కందరికిని ఉపాదేయములే-

'ధర్మజునకు నీ చెప్పెడు
ధర్మస్థితివాక్యసమితి తాత్పర్యముతో
నిర్మలులై కొనియాడెడు
ధార్మికులకు నుభయజగదుదాత్తత కలుగున్' (2.149)

విశ్వజనీనమైన విజ్ఞాన మీ పర్వతాత్పర్య వివేచనము. ధర్మజుడు ధర్మజిజ్ఞాసకు ప్రతీక; శాంతనవుడు సర్వలోక హితబోధకు ప్రతీక!

శాంతిపర్వమున సాగిన ధర్మజభీష్మ సంవాదము లోకహితార్థమై ప్రవర్తిల్లిన జ్ఞానయజ్ఞము. దానివలన ధర్మజుడు పొందిన ఫలము వైయక్తికము; పాఠకులు పొందెడి ఫలము విశ్వజనీనము.

శాంతిపర్వ ద్వితీయాశ్వాసమున భీష్ముడు శ్రీకృష్ణుని స్తుతించి, దానిని వాఙ్మయాధ్వరముగా భావించి, తదర్పణము చేసినాడు.

'తపమునకు విద్యకును జనుస్థానమైన
జననరహితుని యజ్ఞాత్మ శౌరి వాఙ్మ
యాధ్వరార్చితుఁ జేసితి నాజనార్ద
నుండు మద్భజనమునఁ బ్రీతుండుగాత!' శాం. 2.56

ఇట్టి యుత్తమ సంస్కారముతో నారంభించిన ఉపదేశము శాంతిపర్వతాత్పర్యము. అట్లగుట నిదియు వాఙ్మయాధ్వరమే; జ్ఞానయజ్ఞమే.

'విజ్ఞానం బ్రహ్మేతి వ్యజానాత్' అను ఉపనిషత్సూక్తి ననుసరించి ధర్మజ గాంగేయు లిరువురును జ్ఞానరూపమైన బ్రహ్మము నర్చించి రనవచ్చును. అందు మరియొక విశేషము ధర్మజుఁ డడిగిన ప్రశ్నలు అష్టోత్తరశత సంఖ్యలో నున్నవి. అర్చన కన్వయించు సంఖ్య అది. ఆసంఖ్యలో వానిని నిబంధించుట తిక్కన గావించిన వాఙ్మయార్చనము. అతడు తీర్చిదిద్దిన శాంతిపర్వము శాంత నవగీత.

శాంతనవగీతలో రాజధర్మ, ఆపద్ధర్మ, మోక్షధర్మములు మూలమున చెప్పబడినవి. నన్నయయు పర్వసంగ్రహమునందు వీనిని పేర్కొని యున్నాడు.[3] కాని, తిక్కన యీ విభాగమును యథామూలముగా పాటింప లేదని విమర్శకులు భావించుచున్నారు. "రచనాప్రణాళిక యందు తిక్కనసోమ యాజి ఏకారణముననో ఈ త్రివిధభాగమును పాటింపలేదు. ఆయా విభాగము యొక్క సీమారేఖలు అంత స్పష్టముగా లేవని ఆయన భావించియుండనోపును. ఒకవిభాగమునందు మరియొక విభాగముయొక్క అంశములు ప్రవేశించుచుండును. రాజధర్మ ఆపద్ధర్మపర్వములు మైథిలీప్రతిలోను (బెంగాలీ), కొన్ని దాక్షిణాత్య ప్రతులలోను వేరువేరుగా నిర్దేశింపబడలేదని భండార్కరు సంస్థవారు గుర్తించి నారు. తిక్కనసోమయాజి ఈసంప్రదాయమును పాటించి యుండును. మూలము నందు రాజధర్మపర్వము 1–128 అధ్యాయముల వరకును, ఆపద్ధర్మపర్వము 129–167 వరకును, మోక్షధర్మపర్వము 168–353 అధ్యాయముల వరకును వ్యాపించియున్నవి. తెలుగు భారతమునందు 12–1–335 వచనమునందు రాజ ధర్మ ఆపద్ధర్మ ప్రశంసకలదు.[4]" స్థూల విభాగమునకు ద్వితీయ తృతీయాశ్వాస ములలో రాజధర్మ, ఆపద్ధర్మములును, చతుర్థ పంచమ షష్ఠాశ్వాసములలో

---

3. "ధర్మజునకు శరతల్ప గతుండైన భీష్ముండు ధర్మవిదులైన రాజుల కెల్ల హితంబుగా రాజధర్మంబులు, నాపదర్థంబులు, నేవాని నెఱింగిన సర్వ జ్ఞానసంపన్నులగుదు రట్టి మోక్షధర్మంబులుఁ జెప్పుటయు"...ఆది. 1. 57.
4. ఆం. మ. భా. సంశోధిత ముద్రణము. శాంతిపర్వము. పీఠిక శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనము- పుట. 3-4.

మోక్షధర్మములును తిక్కన రచనలో కాననగుచున్నవి. అందును రాజధర్మాదులయం దేబది ప్రశ్నలును, మిగిలినవి మోక్షధర్మాదులయందు నడుగబడినవి.

"ధర్మవిదులు రాజు ధర్మస్వరూపుఁగాఁ
జెప్ప విందుఁ దద్విశేషవృత్తి
భరముగాఁ దలంతు నరవర! చెప్పవే
మున్ను రాజధర్మముల తెఱంగు" (2.162)

ధర్మరా జడిగిన మొదటి ప్రశ్న యిది. రాజు ధర్మము రూపుకట్టిన వాడుగా నుండవలయునన్న తన బాధ్యతను గుర్తించి యడిగిన ప్రథమప్రశ్న యిది. దీనికి భీష్ముడు నృపధర్మములను, విపులఫలవంతమగు ధర్మపథమును వివరించెద నని సమాధాన మారంభించెను. నిజమున కీ యొక్క ప్రశ్నయే చాలును రాజధర్మముల నన్నింటిని చెప్పుటకు. ఇది ఆధికారికమైన ప్రశ్న. ఆ ప్రశ్నకు సమాధానము చెప్పు నెడ ననుబంధ ప్రశ్న లడుగబడెను. వానికి భీష్ముడు సమాధానము చెప్పుచు వచ్చెను. నిజమున కానలుబ తొమ్మిది ప్రశ్నలును దీని యందు గతార్థములే. ఇది యొక భాగము.

చతుర్థాశ్వాసారంభమున ధర్మజుడు—

'రాజోచిత ధర్మంబుల
యోజ విశదభంగిఁ జెప్పి తుజ్జ్వలవిసర
త్తేజోధన! నాకు సకల
భూజనపరమహితధర్మముం దెలుపు దయన్' 4.3

అని ప్రస్తావించి యుత్తమ ధర్మమును గూర్చి ప్రశ్నించెను. భీష్ముఁడు—

'విను మనేక విధంబుల విస్తరిల్లు
ధర్మములయం దొకండును దలఁప నిష్ప
లంబు లే; దాత్మమోక్షావలంబి యైన
ధర్మ ముత్తమ మంద్రు తత్త్వజ్ఞు లధిప' 4.5

అని మోక్ష ధర్మము నుపదేశించుట కారంభించెను. ఇందును మిగిలిన ప్రశ్న లనుబంధ ప్రశ్నలే. వాక్యరూపమైన సంవాదమే ఈ ధర్మబోధ

కాయుస్సూత్రము. శ్రోత్రగహణ మనన జిజ్ఞాసలనుబట్టి వక్త విషయ వివరణముచేయవలెను. అది శ్రోత్రచిత్త పరిపాకమునకు ప్రాతిపదిక కావలెను. ఇది యితిహాసమునందలి రసపోషణ రహస్యము.

ధర్మజ భీష్మ సంవాద రూపమైన శాంతిపర్వార్థములను వినిన జనమే జయుడు కూడ జిజ్ఞాసువై పారాశర శిష్యుని ప్రశ్న పరంపరల నడుగుట కారంభించినాడు. (6.398) అది తత్పర్వ శ్రవణ ప్రభావము.

పై జెప్పబడిన ధర్మములలో రాజధర్మములు విశేషధర్మములు; మోక్షాది ధర్మములు సామాన్య ధర్మములు. రాజునకు కులధర్మమైన విశేషధర్మము సామాన్య ధర్మమైన మోక్ష ధర్మము రెండును వర్తించును. అతడు వర్ణ ధర్మమును నిర్వహించుచు పరమధర్మమును సాధింపవలెను. ఒకటి మార్గము, మరియొకటి గమ్యము. గమ్యమునకు మార్గములు భిన్నములు కావచ్చును. సాధనను బట్టి సిద్ధి. ఇందు మొదటిది ప్రవృత్తి ధర్మము; రెండవది నివృత్తి ధర్మము. ప్రవృత్తిలో నివృత్తిని సాధించిన వారు జీవన్ముక్తులు. రాజర్షులలో జనకు డట్టి వాడు; బ్రహ్మర్షులలో శుకు డట్టివాడు. వారి కథలు రెండును భీష్ముడు ధర్మజునకు జెప్పినాడు. ఐనను ధర్మజునకు వారిరువురకున్న సిద్ధిలేదు. కాని, తత్పరిజ్ఞానలబ్ధి శాంతిపర్వమున కలిగినది. ధర్మజుడు రాజర్షి కాడు; ధర్మావతారుడైన ప్రభువు. ధర్మ మనగా ప్రవృత్తి నివృత్తి రూపమున నున్నదికదా యనవచ్చును. ప్రవృత్తిధర్మమే రాజధర్మము. అది ధర్మజునకు సహజసంపత్తి; నివృత్తి సాధ్యవ్యుత్పత్తి. అతడు ప్రవృత్తి ధర్మమున పరిపూర్ణత సాధించిన మహితాత్ముడు. నివృత్తిధర్మపరిజ్ఞాన మాతనిప్రవృత్తి ధర్మనిష్ఠకు పరివేషముగా ప్రకాశించినది. ధర్మజుని సిద్ధి యంతవరకే. అతడు జీవితాంతమున పొందెడిది దేవత్వము కాని బ్రహ్మత్వము కాదు. ఆ సత్య మాగోవిందునకు తెలియును, ఆ శాంతనవు డెఱింగి యుండును.

ధర్మజుని యిట్టిసంస్కారమును తిక్కన శాంతిపర్వమున ప్రశ్న లడుగు తీరునందును, శాంతనవు డిచ్చు సమాధానముల సొరుపునందును వ్యంగ్య మొనర్చెను. ధర్మజుడు రాజధర్మములను వినును; దాదాపు పది ప్రశ్నలవేసి చాతుర్వర్ణ్య వర్తనము,ఆశ్రమచతుష్టయవిధి,రాష్ట్ర,జనపదపరిపాలనములు, శత్రువధాది విశేషములు, దండనీతివిధానము, మొదలగు నెన్నియో విషయము లెఱింగి చివరకు

ధర్మలోప భయమును వ్యక్తపరచి రాజ్య మొల్లనని మోడివేయును. భీష్ముడు ప్రసిద్ధేతిహాసముల నెన్నింటినో చెప్పి యతనిని మరల మార్గము పట్టించును. మరల పది ప్రశ్న లాత డడుగును, ఈతడు ప్రత్యుత్తరించును. చివర కతని నాలుకపై నాట్యమాడినది నిర్వేదము. 'రాజధర్మంబుకంటెం బాపకర్మంబు లేదుపో'మ్మని చీదరించుకొనినాడు. (2.4:5) మరల నెట్లో మనసుకుదుట పడు నట్లా మందాకినీ తనయుడు మనుమనికి బుద్ధులు చెప్పినాడు. విశ్వామిత్ర చండాల సంవాదము వినిన ధర్మజుడు 'ఈ యితిహాసం బాకర్ణించుట నాడెందంబు విషాదంబు నొందె' నని వెలవెలపోయినాడు. ఈంతనవు డతని నాశ్వాసించి 'ధర్మంబు బహు శాఖాసమన్వితంబై యుండు రాజుధర్మ మెల్లత్రెలుంగుల నెఱుంగవలయు విషాదం బేల?' యని బుజ్జగించి చెప్పినాడు. రాజ్యపాలనమున ధర్మల ఏమో వాటిల్లునేమో యను ధర్మజుని భీతి యడుగడుగున నతనిమాటలలో ధ్వనించినది; అతని చిత్త మెచ్చట విషాదాయత్త మగునో యని భీష్ముడు తన నేర్పును, ఓర్పును ప్రకటించి ఉపదేశము నిర్వహించుట యైనది. రాజధర్మములు వినిన విధ మిట్లున్నది. ఇక మోక్ష ధర్మముల మాట చూచెదము గాక !

'ఉత్తమ ధర్మ మెద్ది?' అని ప్రశ్నించగా మోక్షావలంబియైన ధర్మ ముత్తమ మని పితామహుడు పేర్కొనినాడు. ఆపై మనుమ డెన్నియో ప్రశ్నలు వేసినాడు. విసుగులేకుండ విశదపరచినాడు తాత. 'అధ్యాత్మవిద్య వినవలతుఁ జెప్పవే!' (4.120) అని అడిగినాడు; ఆపైన నిరతిశయజ్ఞాన యోగమును చెప్పుమనినాడు; మృత్యువునుగురించి మోక్షమార్గమును గుఱించి అడిగినాడు. నడుమనడుమ నానావిధ ప్రశ్నలు వేసినాడు. సాంఖ్యయోగదర్శన తత్వముల నడిగి వినిపించుకొనినాడు. జనకమహారాజు మోక్షము సాధించిన విధమును విని నాడు. 'ధర్మాధర్మ వియుక్తంబును, సర్వసంశయ విముక్తంబును' జన్మమృత్యు రహితంబును, నిత్యంబును, శుచియు, శివంబును, నవ్యయంబును, బరంబును, ననాయాసంబునునగు నట్టిదాని నెఱింగింపవే' (6.79) యని తరచి తరచి అడిగి చెప్పించుకొనినాడు. భీష్ముడు యాజ్ఞవల్క్య జనక సంవాదంబు నుపదేశించి 'ఆర్య గర్హితములైన శోకమోహాది ప్రాకృతభావములం దొఱంగి సుఖివగుము'(6.169) అని దీవించినాడు. దానికి ధర్మజుడు సంతుష్టాంతరంగుడై' గృహస్థధర్మంబు పరిత్యజింపక మోక్షంబు వడయుట గలుగనోపునే మదీయచిత్తంబు సంశయా

యత్తం బగుచుండు; నిక్కా-లుష్యంబు వాపవే' (6.169)యని యభ్యర్థించినాడు. భీష్ముడు జనకసులభా సంవాదము చెప్పినాడు. మరల శుకుని వైరాగ్యమును గూర్చి ప్రశ్నించినాడు. తాత శుక చరిత్రము చెప్పినాడు. ఇంకను సకలలోక సంభావనీయ సత్క-థలెన్నియో తెలిపినాడు. అన్నియు విని పాండవాగ్రజుడు-

'అమిరతటినీసుతున కిట్టులనియె రాజ
ధర్మముఖ్యంబు లగు సర్వధర్మముల ను
దాత్త కృప నెఱిగించి తత్యుత్తమంపు
ధర్మ మెయ్యది సెప్పుము ధర్మనిత్య!' (6.543)

ఉత్తమ ధర్మముతో నారంభమైన మోక్షధర్మచర్చ 'అత్యుత్తమ ధర్మ మెద్ది'యని పునఃప్రశ్నించువరకు వచ్చినది. భీష్ముడుంఛవృత్తి మహిమనుల్లేఖించి 'సర్వ సమతాసముపహితంబైన యనాకాంక్షిత్వంబు ధర్మోత్తమం'బని స్పష్ట పరచినాడు. ఇంతయు విని ఆ ధర్మనందను డనిన మాట లివి-

'అనఘ! నాదగుచిత్తమునకు శమంబు గా
వించుటకై నీవు వివిధ విశద
భంగుల బరమ కృపానిరతుండ వై
సకల ధర్మోపదేశములు జేసి
తిమ్మెయి జెప్పగా నించుకయేనియు
శమము లేకున్నది సలముకొని య
నేకబంధుల వధియించితి నదియొక్క-
తలయు నీ కలిగిన దారుణత్వ
మొక్క-తలయు నైన యుగ్ర కర్మంబులు
చిత్తవృత్తి దగిలి యుత్తలంబు
జేయ శాంతి యెట్లు సిద్ధించు మునిమాన
నీయ! యింక నేమి సేయువాడ?' ఆను. 1.3.

పరమార్థ శ్రవణానంతరమైనను ధర్మజునియందు శమము కుదురలేదు. కుదురుట ఆతని నుడుట వ్రాసియుండలేదు. శోకమోహము అతని హృదయమున

తనుత్యాగ మగునంత వఱకు తగిలియే యున్నవి. యమధర్మరాజు స్వర్గారోహణ పర్వమున–

'నీ వియ్యాకాశనదీ
పావనసలిలమున మునుఁగు భవ్యాత్మ భవ
ద్భావంబు విడుచు మానుష
భావ వికారములు శోకబంధము లడఁగున్'. (స్వర్గా-50)

అని అమరగంగలో ముంచునంత వరకు ధర్మజుడు శోకబంధములనుండి విముక్తుడు కాలేదు. చివర కాతనికి కలిగినది దేహవిముక్తి ; దేవత్వము. అది మోక్షము కాదు. సర్గప్రాప్తి. సశరీర స్వర్గగమనమునకును జీవన్ముక్తుడు పొందు మోక్షమునకును అంతర మెంతయో కలదు. ఒకటి ప్రవృత్తిధర్మవీరఫలము; మరొకటి నివృత్తి ధర్మఫలము. ధర్మజుడు సాధించినది మొదటిదే కాని రెండవది కాదు.

భీష్ముడు మోక్షధర్మముల నుపదేశించునెడ ప్రవృత్తి ధర్మమును నివృత్తి ధర్మముకంటె తక్కువగా తలంపలేదు. అత్యుత్తమధర్మము నెఱిగింపుమని యడిగినవేళ అత డిచ్చిన మొదటి సమాధాన మిది–

'అరయఁగ ధర్మతంత్రములయందు నిరర్థము లే దొకండు నె
వ్వరిమది యొందు ప్రాలెఁ దగ వారలు దానిన పూని యాచరిం
తు రదియ వారి కిష్టఫల దోహన కార్య మొనర్చు నెల్లెడం
బురుషులఁ జూడమే తమకుఁ బోలిన ధర్మములన్ వెలుంగగన్'(6.545)

ధర్మజునకుఁ బోలిన ధర్మ మతఁ డాచరించినచో నది నిరర్థము కాదు. నిఖిలజన పూజాభాజనమే యగును. ధర్మజుని ప్రవృత్తి వీరమునకు నివృత్తి వీరమున కున్నంత గౌరవ మున్న దని శాంతనవుడే సమర్థించినాడు. నిజమునకు ధర్మజుని నాదర్శ ధర్మవీరునిగా తీర్చి దిద్దవలయు ననియే శాంతిత్రయమున శాంతనవగోవింద పారాశర్యాదులు చేసిన తీవ్ర ప్రయత్నము.

శాంతి పర్వమున ధర్మజుని చిత్తవృత్తియందు-పట్టాభిషేకమున కడ్డము వచ్చిన శోకము శమించినది కాని, పాపశంకకు సంబంధించిన కల్మషము వాయ

లేదు. ప్రవృత్తినివృత్తి జ్ఞానము లతని వ్యుత్పత్తిని పండించినవి. అతనికి తెలివి కలిగినదే కాని, తేట కలుగలేదు. అది అశ్వమేధయాగ ప్రవర్తనముతోగాని సిద్ధింపలేదు. యాగము కర్మ సంబంధి. జ్ఞానము కర్మ నుద్దీప్త మొనర్చును. కర్మకు పూర్వరంగమైన జ్ఞానము శాంతిపర్వమునందు లభించినది. ఆపై ధర్మజు డేమి చేసినను తెలిసి చేసినాడు ఆ తెలివిడికి తొలివెలుగును ప్రసాదించినది శాంతిపర్వము.

2

శాంతి పర్వమున కథ తక్కువ, బోధ యెక్కువ, బోధ శాస్త్ర శరీరము. కథ కావ్యశరీరము. భారత మితిహాసము. ఇతిహాసము శాస్త్ర రూపమనియు, కావ్యచ్ఛాయాన్వయి యనియు ఆనందవర్ధనుడు పేర్కొని యున్నాడు. బోధకు కథ తోడైనచో ఇతిహాస మగును.

ఇతిహాసమనగా పూర్వవృత్తము. అది యిట్లు జరిగిన దని పారంపర్యముగా చెప్పుకొనుచున్న కథయై యుండవలెను. 'ఇతిహాసః – ఇతిహ పారంపర్యోపదేశ ఆస్తే అస్మిన్ ఆస ఆధారే ఘఞ్. ధర్మార్థకామమోక్షాణాం ఉపదేశ సమన్వితమ్, పూర్వముక్త కథాయుక్తం ఇతిహాసం ప్రచక్షతే॥ ఇత్యుక్త లక్షణే పురావృత్త ప్రకాశకే భారతాదిగ్రంథే" అని శబ్దకల్పద్రుమము. పారంపర్యముగా చెప్పుకొనబడు కథార్థములకు ప్రజలలో ప్రచారముతోపాటు ప్రామాణిక భావము కూడ నుండును. పదికాలములపాటు నిలిచెడి పాటవము లేకపోయినచో పది మంది నోట పదిలముగా బ్రతుకుట కష్టము.

భీష్ముడు ధర్మజునకు చెప్పిన బోధలకో నితిహాసము లగు నుపాఖ్యానములను, పురాణకథలను, సంవాదములను పెక్కింటిని పేర్కొనెను. నాడు ధర్మజు డడిగిన ప్రశ్న ఏనాడో ఒక జిజ్ఞాసు వడిగి యుండినాడు. ఒక బోధ దానికి సమాధానము చెప్పియున్నాడు. వారిరువురికి సంబంధించిన కథ యొకటి లోకమున వెలసినది. అది పరంపరగా జనస్మృతిలో సాగినది. ఇతిహాసమైనది. ధర్మబోధలలో దృష్టాంతములుగా నితిహాసములైన కథార్థములను నిబంధించు వైఖరి శాంతిపర్వమున సర్వత్ర సమకూర్పబడినది. ఇతిహాసమైన భారతమున ఐతిహాసిక ప్రవృత్తితో శాస్త్రబోధ నొనర్చు ఆఖ్యానశిల్పమున కీశాంతి పర్వ మొక చక్కని యుదాహరణము.

'పరిక్రియా పురాకల్ప ఇతిహాసగతి ర్ద్విధా
స్యా దేకనాయకా పూర్వా, ద్వితీయా బహునాయకా'

అని రాజశేఖరుడు కావ్యమీమాంసలో పేర్కొనిన యంశ మిచ్చట గమనింప దగినది. ఏకనాయకము పరిక్రియ యనియు, బహునాయకము పురాకల్ప మనియు నాతడు భావించినాడు. దీని తత్వ మరసినచో నిట్లు తలంచుటకు వీలున్నది.— రాజశేఖరు డీ శబ్దములను దార్శనిక పరిభాష నుండి గ్రహించినట్లున్నాడు. దార్శనికులు పరిక్రియా పురాకల్పము లనునవి అర్థవాదములుగా పేర్కొని యున్నారు. అర్థవాదములు వస్తుతః నిందా-ప్రశంసా-పరకృతి-పురాకల్ప భేదముచే నాలుగు విధములు. మహాపురుషు డొకడు పూర్వ మొనర్చిన యొక యంశమును ప్రమాణముగా చూపించుట పరకృతి యనబడును. 'అగ్ని యనువాడు సర్వభక్షకుడు కాగోరి అగ్ని నారాధించెను; సర్వభక్షకు డయ్యెను'[5] అను పూర్వ ప్రవృత్తేతిహ్యమును ప్రమాణముగా చూపించుట పరకృతి. పూర్వ మొకనిచే చెప్పబడిన యర్థమును ప్రతిపాదించునది పురాకల్పము. 'పూర్వ మగ్ని హోత్రములు మోయ నిష్టము లేక నీటిలో దాగెను. దేవత లగ్ని నన్వేషించు చుండిరి. చేప లగ్ని నీటియందు దాగి యుండె నని చెప్పినవి. అగ్ని తన రహస్యమును బయలువరచిన చేపలపై నాగ్రహించి 'లోకులు మిమ్ముల నిష్టము వచ్చినట్లు చంపెదరు గాక!' యని వానిని శపించెను.[6] —అను పరవక్త్రర్థ ప్రతిపాదనము పురాకల్పము. ఇవి చెప్పబడిన విధము గమనించినచో పరకృతి యేకవక్త్రక మనియు, పురాకల్పము బహు వక్త్రక మనియు, నేర్పడుచున్నది. ఒక విధముగా నిరెండును అతీతార్థ ప్రధానములే.[7] కాని పరకృతి అద్యతన భూతార్థము. పరకృతి యందు ప్రాచీనోదంతము ప్రప్రథముగా నొకవక్త్రచే

---

5. తైత్తిరీయ బ్రాహ్మణము III. 1. IV. I.
6. తైత్తిరీయ సూత్రము II. vi. vi. 1.
7. 'అతీతార్థప్రధాన్యా దితిహాసః' సరస్వతీ కంఠాభరణము 2. 368

చెప్పబడినది; పురాకల్పము పారంపర్య కథనముగా బహువక్త్రలచేత చెప్ప బడినది. బహుశః మీమాంసకులు చెప్పెడి యీ అర్థవాద భేదములను రాజశేఖ రుడు గ్రహించి తన కావ్యమీమాంసయందు స్థాపించి యుండవచ్చును. కాని, వాని సహజ లక్షణములగు నేకవక్త్రబహువక్త్రకత్వములను మార్చి పేక నాయక బహు నాయకత్వములుగా నాతడు నిబంధించి యుండవచ్చును. పర క్రియా శబ్దము పరిక్రియగా మార్చి యుండవచ్చును. ఈ దృష్టితో చూచినను శాంతిపర్వమున అర్థవాదరూపములుగా బేర్కొనిన ఇతిహాసములు సార్థకములగు చున్నవి. ఉపదేశించెడి ధర్మార్థముల కుపపత్తులుగా నితిహాసోపాఖ్యానములు నిలు పుట వక్త సాధించెడి ప్రయోజనము. వానిపై నున్న ప్రామాణిక భావమువలన భక్తిప్రపత్తులు శ్రోత కేర్పడుట ఇతిహాస కథా ప్రభావము.

నన్నయ భట్టారకుడు శాంతి పర్వము 14525 శ్లోకముల గ్రంథమనెను. మూల భారతమున 14731 శ్లోకములు కానవచ్చుచున్నవి. ఈ రెండింటికిని భేదము చెప్పుకొనదగినంతగా లేదు. ఈ పర్వమును తిక్కన 3, 069 పద్య గద్యములలో పిరచించెను (ఆఖ్యానాద్యంతములు వదలి). తిక్కన మూలపరిమాణ మును సంగ్రహించి తెలుగున ననువదించెనని చెప్పవచ్చును. మూలగ్రంథమును సంగ్రహించుట కవిత్రయమువారు పాటించిన అనువాద లక్షణమే. కాని, ధర్మ శాస్త్ర విషయములలో నతిగ్రహ రచన కుద్యమించిన తిక్కన శాంతిపర్వమున నామార్గము ననుసరింపలేదు. ఈ సత్యము విమర్శకులు గుర్తించినదే.

'కురుక్షేత్ర యుద్ధానంతరము మిగిలిన భారతకథ స్వల్పము. విరాటో ద్యోగములు, యుద్ధపర్వములు, యుద్ధపర్వములకు అనుబంధప్రాయమైన సౌప్తిక స్త్రీ పర్వములు కథాప్రధానముగ దెలుగున వినిర్మించిన తిక్కనకు గథకంటె యాధ్యాత్మిక విషయమే బహుళముగా నున్న శాంతిసప్తకము (శాంతిపర్వము నుండి స్వర్గారోహణ పర్వమువఱకు)నందు సంక్షేపించు నవసరము వెనుకటికంటె నధిక తరమైనది. భగవద్గీతాసారము కతిపయ పద్యములలో, సనత్సుజాతీయము నొక్కవాక్యములో సంక్షేపించిన తిక్కన, ఆ పద్ధతినే శాంతిపర్వమునం దనుసరించి

నచో శాంతిపర్వమంతయు దెలుగున గతిపయ పద్యములతో సరిపోయెడిది.'[8] మోక్ష ధర్మప్రబోధకములైన భగవద్గీతా, శాంతిపర్వములను తిక్కన అనువదించుటలోగల ఈ భేదమునకు కారణ మరయవలసి యున్నది.

తిక్కన భగవద్గీత నత్యంతము సంగ్రహించుటకు విమర్శకు లనేక కారణములను జూపించిరి. వానిలో ముఖ్యమైనవి : 1. రణోన్ముఖమైన యుద్ధభూమియందు విస్తృతమైన గీత బోధింపబడుట సందర్భోచిత్యము కాదు. 2. భగవద్గీతలో చెప్పబడిన తత్వార్థములు భారతమున నెడనెడ పరచబడి ప్రవచింపబడియున్నవి. 3. శ్రీకృష్ణు డర్జునునకు మఱల నాయర్థములను అశ్వమేధపర్వమున పునఃప్రబోధించినాడు కావున తిక్కన భీష్మపర్వమున వాని నత్యంత సంగ్రహముగ బేరొక్కనెను. 4. తిక్కన భారతమున కావ్యశిల్పమును వెలార్చదలచి ధర్మార్థములను సంక్షేపించినాడు. ఇట్టివి మఱికొన్ని కారణములు సూచింపవచ్చును. ఏమైనను ఆంధ్ర భారతమున కా భగవద్గీత యట్లు కుదింపబడుటవలన నెట్టిలోపమును వాటిల్ల లేదని విమర్శకులు వాక్రుచ్చియున్నారు. ఇక శాంతిపర్వమును గూడ తిక్కన యట్లెందులకు చేయలే దు? అది యిక్కడ విచారింపదగినది.

దీనికి ప్రధానముగా మూడు కారణములు చెప్పవచ్చును.

1. శాంతి పర్వమున ప్రవర్తిల్లిన ధర్మబోధ నాయకుడైన ధర్మజుని నుద్దేశించి జరిగినది. భగవద్గీత అనునాయకుడైన అర్జును నుద్దేశించి చెప్పబడినది.

2. శాంతిపర్వ కథన మంగిరస పోషణ కనుకూలము. భగవద్గీత అట్లు కాదు.

3. శాంతిపర్వమునందలి రాజధర్మ మోక్షధర్మాది కథనము ఇతిహాస రచన కనుకూలము.

---

8. తిక్కన భారత దర్శనము-శ్రీ నండూరి కృష్ణమాచార్య .పుట. 310

మహాభారతమున నాయకుడు ధర్మజుడు. అతని నాశ్రయించి స్థాయి భావము నడచును. భీమార్జునాదులు అనునాయకులు. వారి ప్రవృత్తులును, ప్రవర్తనలును ధర్మజుని స్థాయి భావమును పోషింపవలెను. ఇది కథలోని రస పోషణ రహస్యము పంచమవేద మని ప్రసిద్ధిగాంచిన భగవద్గీతపై తిక్కనకు తక్కువ చూపులేదు. కాని, అది అనునాయకుడైన అర్జును నుద్దేశించి ప్రవర్తిల్లి నది. అర్జునుడు లేనిది ఆహవ విజయము లేదనుమాట సత్యము. అయినను అత డంగికి అంగము. గాండీవియే కాదు గోవిందుడు కూడ మహాభారతమున నాయకు నకు అంగభూతుడే. మహిమాన్వితుడైన ఉపనాయకుడు లభించిన అదృష్ట మా అజాత శత్రువునకు దక్కనది. అంగభూతు లైన నరనారాయణుల వృత్తము ప్రధాన వృత్త పరిధి నధిగమించరాదు. అందువలన దానిని పరిమితిని మించి పెంచలేదు తిక్కనగారు. అచ్చటి సంక్షిప్త రచనము తిక్కనను సంయమిగా నిరూపించినది.

మోక్ష ధర్మశాస్త్రమైన భగవద్గీత ధర్మజుని ధర్మవీర ప్రవృత్తిని మించి నట్లుండరాదు. అట్లే శాంతి పర్వమునందలి మోక్షధర్మము లతని విరక్తునిగా మార్చరాదు. శోకోపశాంతి వలన ధర్మజుడు రాజ్యమును నిర్వహింపవలెను. ధర్మహాని యగునని భయపడు ధర్మజునకు సకలధర్మస్వరూపము తెలియ వలెను. పరమ ధర్మము తెలిసిన ప్రజ్ఞావంతుడు గాని పరమ పురుషార్థ సాధకుల మహిమ నెఱుంగలేడు. జ్ఞాన స్వరూపము తెలిసినగాని కర్మమౌఢ్యము వీడదు. బ్రహ్మర్షియందు మోక్షమున కంగములుగా ధర్మార్థ కామములు వర్తించును. శుకాదుల యందది చెల్లినది. రాజర్షియైన జనకునియందు ధర్మము మోక్షానువర్తియైనది. మఱి ధర్మజుడు ధర్మస్వరూపుడైన ఆదర్శప్రభువు. ధర్మప్రభువు నందు ధర్మమున కంగములుగా అర్థ కామమోక్షములు వర్తించును. అతడు సకల ధర్మములను రాజధర్మమునకు పోషకములుగా ననువదించుకొనును. ధర్మరాజు నకు దక్కనది మోక్షము కాకపోవచ్చును. స్వర్గమే కావచ్చును. అతడు నిర్వ హించునది ప్రవృత్తి ధర్మమే కావచ్చును. దానిని తక్కువగా భావింప వలదని భీష్మాదుల ప్రబోధము. ప్రజలకొఱకై స్వీయ పరమ పురుషార్థమును పణము పెట్టు ప్రభువు లోకారాధ్యుడు. అతడు శక్తిమంతుడై మోక్షము సాధించుకొనిన జనులు సంతోషింతురు, జ్ఞాను లభినందింతురు. కాని, రాజధర్మమును విస్మరించి

నాతనికే కాక దేశప్రజలకు కూడ ఇహపరము లుండవు. అనగా ధర్మజుని వృత్తి ప్రధానముగా రాజధర్మము నాశ్రయింపవలెను. మోక్ష జ్ఞానాదులతని మోహాదులను దూరము చేయవలెను. జ్ఞానవిశిష్టమైన ధర్మము సాత్త్వికము; అహంకారపూరితమైన ధర్మము రాజసము; మోహావిష్టమైన ధర్మము తామసము. ధర్మజుడు సాత్త్విక ధర్మ సాధకుడు. అతడు జీవితమున సాధించినది శుద్ధధర్మము. అతని చిత్తము నాశ్రయించినస్థాయి ధర్మోత్సాహము.

ధర్మజుడు శాంతి త్రయమున పాపరహితమైన రాజధర్మము యొక్క స్వరూపమును తెలిసికొనినాడు. అశ్వమేధ మతని ప్రభుత్వమును నిష్కళంక మొనర్చినది. అతడు పుటము పెట్టిన బంగారమువలె పుణ్యధర్మశీలి యైనాడు. అతడు శాంతి పర్వారంభమున బంధువుల జంపిన క్రూరకర్మవలన శోకమును గాంచినాడు. అశ్వమేధ పర్వారంభమున గూడ నదియే శోక మాతని చిత్తమును వికల మొనర్చినది. (అశ్వ. 1.11). అప్పు డాతడు వనముల కేగుట కనుజ్ఞ యిండని శ్రీకృష్ణ సాత్యవతేయాదుల నడిగినాడు. మఱల కథ మొదటికి వచ్చి నది. చెప్పెడి పెద్దలకును ప్రాణములు విసికినవి. కృష్ణుడు–

'వినవలయువాని నెల్లను
జననాయక వింటి వీవు శాంతనవునిచే
వనట యుడుగు మిక దుర్మతి
యునుబోలెను వగచుచుండు టుచితమె నీకున్' (అశ్వ. 1.8)

అని మందలించినాడు; పారాశర్యుడు–'నిష్ఠించి యిబ్భంగి నీ కేము చెప్పిన వాక్యంబు లెల్లను వలదఁ గలిసిపోయెనేఁ నీ దగుబుద్ధి 'యింతొప్పదో?' (అశ్వ. 1.12)అని నిష్ఠురము లాడినాడు. పాపకర్మశంక బాయుటకు అశ్వమేధము చేయు మని సూచించినాడు. ఈ సూచన యిప్పటిది కాదు. శాంతి పర్వారంభమున నర్జునుడే చేసినాడు (శాం. 1.49]. అప్పటి శోక తీవ్రత వలన నది తలకెక్క లేదు. అప్పు డతడు మోహావిష్టుడు. ఇప్పు డతనికి జ్ఞానము తెలియును. కాని అతడు జ్ఞానివలె మాటలాడుట లేదు. శంక యున్నచోట జ్ఞానము భాసింపదు. జ్ఞాన బోధ యైనను శంక తీరలే దనగా అతని చిత్తవృత్తి కనువైన ప్రతిపాదనము రాలేదనిభావము. అశ్వమేధ యాగ సూచన మతని చిత్తమునకు హత్తినది.

'అన విని యమ్మునీశ్వరున కాన్నృపుఁ డిట్లను నశ్వమేధయా
గనిరతి భూమిపాలు గతకల్మషుఁ జేయఁగఁ జాలు నాఁగ ము
న్నును వెడ వింటి సజ్జన మనోజ్ఞవచో మహనీయ! నీవు చె
ప్పిన పలు కూఁది యాక్రతువు ప్రీతి నొనర్చెద నెల్లభంగులన్'
(అశ్వ. 1.13)

అని హర్షమును వ్యక్తపఱచినాడు. యాగము సంకల్పింపబడినది. ముని వర్గముతో ధర్మజు డిట్లనినాడు–

'మీ కారుణ్యంబున నా
శోకం బంతయును బాసె; సుమనస్కత సు
శ్లోకాత్ములార ! కలిగెన్;
నాకున్ విచ్చేయుఁడింక ననుఁ మఱవకుఁడీ' (అశ్వ. 1.137)

వనముల కేగెద నని నిర్వేదపడినవాడు శోకము విడిచి ధరణీ పాలనా ధ్వరకరణముల కిమ్మ్య కొనినాడు. అనగా నిజ ధర్మమునందు నిష్ఠ బూనినాడు. ఇతని యిప్పటి స్థితి నివృత్తి మార్గము నాశ్రయించి లేదు కదా ! ప్రవృత్తి మార్గమున ప్రకృష్టముగ ప్రతిష్ఠాపింప బడినది.

శాంతి త్రయమున రససమన్వయ మిట్లుండును. ధర్మజుని చిత్తము నాశ్రయించినది శోకము. దానికి హేతువు పాపకర్మ శంక. మరి భీష్ముని నాశ్రయించినది నిర్వికారమైన జ్ఞానబోధ. అత డొక జ్ఞాన యజ్ఞముగా దానిని నిర్వహించినాడు. జ్ఞానమువలన శంక నశింపవలయును కదా ! నశింపలేదు. మరల శోకముద్బుద్ధమగుచునే యున్నది. దానికి కారణము పాపకర్మ శంక పరిహారము కాకపోవుటయే. దానివలన ధర్మజుని శోకతీవ్రత ధ్వనింపబడుచున్నది. జ్ఞాన భాస్కరు డెంత ప్రచండముగా వెలింగినను శోకతిమిరము సమూలముగ నున్మూలింపబడలేదు. అనగా జ్ఞానబోధ వలన కలుగవలసిన శమము ధర్మజునకు కలుగలేదు. శమైక లక్షితమైన జ్ఞానబోధ ఆభాసయైనది. అందుచే శాంతము నాయకుని యందు దీపింపలేక పోయినది. శోకమే స్థాయిగా మిగిలినది. దానిని శమింప జేయుటకు అశ్వమేధ యాగ ప్రయత్నము సాగినది. అనగా పాపకర్మ

శంక ధర్మకర్మాచరణమున గాని ఉపశమింప లేదన్నమాట ! దీని తాత్పర్య మేమి ? శమము శోకము నుపశమింప సమర్థమయ్యు ధర్మజుని చిత్తవృత్తి యం దది ఆభాసమై శోకమునకే అంగమైపోయిన విచిత్రస్థితి యేర్పడినది. అతని శోకము ఉత్సాహమును భంజించుటయే కాక శాంతమును రూపుకట్టనీయలేదు. శాంత మాతనికి స్థాయి కాదని తెలిసిన పాఠాశర్యుడు పుణ్యకర్మను చూపించి యతని యందలి ధర్మోత్సాహమునకు త్రాణ గల్పించినాడు. పాపనాశని యైన సవనకర్మ అతనికి సంతోషహేతు వైనది. శోకము నశించినది; కార్యోత్సాహ రూపమున రాజధర్మము రాణించినది. దయాసత్య శౌచాది ధర్మము లాతని నిర్మల ధర్మవర్తనమును పోషించినవి. అతనియందు అశ్వమేధపర్వమునుండి భాసించినది సాత్త్విక ధర్మవీరము.

యుద్ధపంచకమున రౌద్రకర్మ వర్తిల్లినది. రౌద్రమునుండి కరుణము పుట్టును. అది స్త్రీపర్వమున రూపుకట్టినది. నాయక రౌద్రకర్మ వలన ప్రతి నాయక పక్షమున గలుగు కరుణము తరింపలేనిది. ప్రతినాయక రౌద్రకర్మ వలన నాయకునకు గలుగు కరుణము తరింప గలిగినదియై యుండవలెను. అట్టి కరుణము శాంతిపర్వ ప్రథమాశ్వాసముననే తరింప బడినది. అది ధర్మజుని శోకములోని యొకశాఖ యటిమికదా ! పాపకర్మ శంక వలని శోకము సాత్త్వికునకు గాని కలుగదు. అట్టిశోకము బంధువధకై విలపించిన విశ్వచ్ఛనియందే లేదు. ఇక భీమాపలయం దెక్కడ కలుగును. పాండవులలో సాత్త్వికుడు ధర్మజుడు. అందువలననే అతని కంత బాధ. అయిదు పర్వముల గాఢవలనిశోకము రెండు పర్వముల బోధవలనగాని శాంతింపలేదు; అది అతని గాఢ శీలమును ధ్వనింపజేయుచున్నది. దానిని చిత్రించుటకే తిక్కనగారి గ్రంథమును కొంత సంగ్రహపరచియు దాని విస్తృతిని తగ్గింపలేదు. నాయకునకు, రసమునకు సంబంధ ముండె నని దీనిని మన్నించెదుగాని లేనిచో తిక్కనగారు భగవంతుడు చెప్పినను ప్రకరణౌచిత్యమునకు భంగము రానీయడు ! అనౌచిత్యము రసభంగ హేతువుకదా ;

ధర్మజుడు మననశీలి. అది బుద్ధిజీవి లక్షణము. అట్టివానికి చిత్త పరిణామము కలుగవలె నన్నచో శ్రవణము కావలెను అరణ్యపర్వము నందును ధర్మజుడు మహర్షులు చెప్పిన యుపాఖ్యానములను విని మనములోని యుమ్మలికను

నుపశమింప జేసికొనినాడు. అట్లే శాంత్యనుశాసనిక పర్వములందును బోధచేత బాధ నపనయింప జేసికొన యత్నించినాడు. శ్రవణము మననమునకు వచ్చిన గాని మనమునకు శాంతి కలుగదు. ధర్మజుని శోకశాంతికై యత్నించిన వాసుదేవ భీష్మ పారాశర్యాదు లందువలననే ధర్మార్థములను ధారావాహినిగా నాతని చెవులలో నూరిపోసినారు. వానిని సంగ్రహించినచో వారి ప్రయోజనము చెడును. పాత్రశీల పోషణము పాడగును. పరమార్థము దెబ్బతినును. అందువలన తిక్కన ఈ పర్వములను పరువము చెడకుండ తెనుగున పరివర్తనము చేసినాడు.

శాంతి పర్వమునందలి శాంతనవ ధర్మబోధ ఇతిహాస స్వభావమున కత్యంత మనుకూలముగా నున్నది. శిల్పదృష్టితో చూచినచో భగవద్గీత ఇతిహాసమున కనుకూలము కాదనవలసి వచ్చును. ఎట్లన భగవద్గీత గురుబోధ వంటిది; శాంతనవ గీత హితబోధ వంటిది. గురుబోధలో గురువాక్యమే ప్రమాణము. హితబోధలో హితవాక్యముతోపాటు బుధవాక్యము కూడ ప్రమాణము. ధర్మజుడు బుద్ధి జీవి యగుటచే తాను పినెడి ధర్మార్థములకు ప్రమాణముల నభిలషించును. భీష్ముడు తాను చెప్పినవి చెప్పినాడు. చెప్పిన పెక్కింటికి పూర్వేతిహాసములను ప్రమాణములుగా జూపించినాడు. ఇతిహాసమున నితిహాసములచే ప్రమాణీకరింప బడిన ధర్మ ప్రపంచమును ప్రపంచించుట రచనా శిల్ప రహస్యము. తిక్కన తదనుకూల వృత్తిని శాంతిపర్వాదుల యందు దర్శించి వానిని తదుచితముగా తీర్చి దిద్దినాడు.

శాంతిపర్వమునందలి భీష్ముని ప్రబోధము సంవాద రూపము. సంవాదము సామాన్యముగా వాక్కోవాక్యరూపమునగాని, అర్థ వాద స్వరూపమున గాని యుండవచ్చును. ఈ పర్వమునందలి ద్వితీయ తృతీయాశ్వాసములందలి సంవాదములు వాక్కోవాక్యరూపములుగను చతుర్థాశ్వాసమునుండి ప్రవర్తిల్లినవి అర్థవాదరూపములుగను, తిక్కనగారు తీర్చి దిద్దినారు. వారి ప్రణాళిక స్వరూపమును జనమేజయుని వాక్యములయందు నిపుణముగా సూచించినారు.

1. ద్వితీయాశ్వాసాంతమున— 'అటమీఁద వార ల సంప్రశ్నోత్తరంబులు ప్రవర్తిల్లిన విధంబులు వినిపింపుము' (2.446)

2. తృతీయాశ్వాసాంతమున—'అయ్యు త్తమ పురుషుల యడుగుటలును ను త్తరం బిచ్చుటలును నింతలెస్సలై చెల్లెడునే ← యటమీఁద జెల్లిన తెఱంగు లెఱింగింపుము' (3.528)

చతుర్థాశ్వాసారంభమున భీష్ముఁడు — 'నా యెఱింగిన తెఱంగునం బ్రజ్ఞా కరంబులగు వాక్యప్రకరంబు లుపన్యసించితి నింక నేమి విన నిచ్చ సేసెదవు'— (4.2)

3. చతుర్థాశ్వాసాంతమున-- 'మఱియేమి సత్క-థలు సెల్లెఁ జెప్పుము (4.454)

4. పంచమాశ్వాసాంతమున— 'అఁటమీఁద వర్ణించిన విశిష్టసల్లాపం బులు సెప్పవే' (5.629)

5. షష్ఠాశ్వాసాంతమున— 'ఇ త్తెఱంగునఁ బితామహుండు హితోప దేశంబు సేసిన నమ్మహిశుఁ డెవ్విధంబు దశావిశేషంబు నొందె మునీంద్రా ! చెప్పవే'— (6.621)

ద్వితీయ తృతీయాశ్వాసములలో, చెప్పబడినవి రాజధర్మ విశేషములు. తరువాతి మూడాశ్వాసములలో చెప్పబడినవి మోక్షధర్మములు- రాజధర్మముల ప్రవచనము ప్రశ్నోత్తరరూపముగా నడచినదనియు, మోక్షధర్మప్రవచనమునందు సత్క-థలును, విశిష్టసల్లాపములును కూర్పబడినవనియు తిక్క-నగారి వివేచనము. శాంతిపర్వ రచనము గాంచినచో చతుర్థాశ్వాసమునకు పూర్వమున్న భాగము నందు కంటె పరమునందున్న భాగమునందే ఇతిహాస ప్రమాణకథన మెక్కు-వగా సాగినది. జటిలమైన తాత్త్వికార్థముల నర్థవాదములవంటి ఇతిహాస కథల ద్వార మున శ్రోతకు మిత్రసమ్మితముగా బోధించుట కథనమునందు పాటించినశిల్పము. ఇది ఇతిహాస స్వభావమున కత్యంత సన్నిహితము. దానిని గుర్తించి తిక్క-న షష్ఠాశ్వాసాంతమున 'పితామహుండు హితోపదేశంబు' చేసెనని పేర్కొ-నినాడు.

శాంతి పర్వమున ప్రవక్తగా భీష్ముఁడు నియుక్తుడగుటలోని యౌచిత్య మును విమర్శకు లిట్లు గుర్తించినారు. 'శ్రీకృష్ణుడే ఈ గురుత్వమునకు అర్హతము

డని శాంతనవుడు రెండు మూడు మారులు పలికెను. అయినను పరాత్మ వివేక శాలియైన దేవకీనందనుడు వేరుగా నిర్ణయించెను. దీనికి ఒకటి రెండు కారణము లూహింపవచ్చును. శ్రోతయైన ధర్మరాజు కన్న శ్రీకృష్ణుడు వయసు నందు చిన్నవాడు. పిన్నవారు పెద్దవారికి ధర్మోపన్యాసము చేయుట అసంబద్ధము కాక పోయినను చూచువారికి వింతగా నుండును. తత్కాలీన క్షత్రియ సమాజము నందు శాంతనవుని కన్న వయోవృద్ధుడును, జ్ఞాన మహితుడును లేకుండుట తెల్లము. కావున భీష్ముడు ధర్మజున కుపదేష్ట అగుటయే అత్యంత సముచిత మని బుద్ధిశాలియైన శ్రీకృష్ణుడు నిర్ణయించెను. మరియొక హేతువు కూడ యోచింపదగి యున్నది. శ్రీకృష్ణుడు మోక్ష ధర్మవేత్తలలో అగ్రేసరుడైనను రాజధర్మము నందు నిశితానుభవము కలవాడు కాడేమో అనుసందియము కలుగుచున్నది. ఆతడు మహాయోద్ధ. జీవితములో విశేషభాగము దుష్ట శిక్షణము నందు గడుపవలసిన వాడాయెను. యాదవులకు రాజ్యార్హత లేకుండెను. కావున శ్రీకృష్ణునకు గల రాజధర్మానుభవము దేవవ్రతుని అపారానుభవముతో సరితూగదు. రెండు మూడు తరముల పర్యంతము భీష్ముడు కౌరవరాజ్య కర్ణధారి. శంతనుడు వయసు మీరి నను వనితాభిలాషి యైనట్లు కాన్పించును. చిత్రాంగదుడు యౌవనమునసే మరణించెను. విచిత్రవీర్య ధృతరాష్ట్రుల కాలమున భీష్ముడే రాజ్యమున పెద్ద. ఈ విధముగా, రాజు గాకున్నను గాంగేయుడు మహారాజ్య సంవిధాతగా నెగడినవాడు. ఆయనకు రాజధర్మానుభవము అపారముగా సిద్ధించినది. మరియు ఎంతకాదన్నను సమకాల సమాజము నందు శ్రీకృష్ణుని యెడ కొందరకు ఒక అపోహ యుండెను. ఆయన పాండవ పక్షపాతి యనియు, సమర్థుడయ్యును కురు పాండవులకు సంధి సమకూర్చ లేదనియు ఒక-విమర్శ యుండెను. మహర్షి సంఘము నందు కూడ కొంద రిట్లు తలచినవారు లేకపోలేదు. దీనికి ఉదాహరణము ఉదంక మహర్షి-ఈయన వృత్తాంతము అశ్వమేధము నందు వచ్చును. పక్షపాత బుద్ధియై కురు పాండవులకు సంధి గావింపక లోకక్షయకారక మైన మహాసంగ్రామమునకు. కారకు డయ్యెనని ఉదంకుడు శ్రీకృష్ణుని ఆతని సమక్షముననే విమర్శించి శపించుటకు ఉద్యుక్తుడయ్యెను. ఇట్టి ఉచితానుచిత విమర్శలకు దూరముగా నుండుటకై ధర్మరాజు ననుశాసించుటకు శ్రీకృష్ణుడు భీష్మునే ఒప్పించెను".[9]

---

9. శ్రీమదాంధ్ర మహాభారతము సంశోధిత ముద్రణము–శాంతిపర్వము పీఠిక. పుట 2.

3

శాంతిపర్వమున వస్తువు ఉపదేశము, అదియు విస్తారమైనది. ఉపదేశము నుపరంజకముగా నిర్వహించుట కష్టము. తిక్కన ఇట్టి కష్టములైన పనులను తన కావ్యకళా కౌశలముతో హృదయాహ్లాద జనకములుగా సంతరించెను. ఉప దేశమునకు రంజకత్వము కలిగించునవి సూక్తులు, ఉపాఖ్యానములు. సూక్తి ఉపదేశకుని అనుభవసారము, సంగ్రహ రచనలో సూత్రప్రాయము, అర్థదీప్తిక అర్కసమానము. ఉపదేశ వస్తు నిర్వహణము నందు కవి సూక్తి రచనా పాటవ మాతని కవితా శక్తికి నికషోపలము. ఉపాఖ్యాన మొక ధర్మమునకు దృష్టాం తము. దానియందు కథ యున్నను పర్యంతమున నొక బోధ కది యంగమై పోవును. సూక్తు లుపాఖ్యానము లందును శుక్తి ముక్తికములుగా శోభిల్లు చుండును. ఇట్లగుటచే ఆఖ్యానోపాఖ్యానముల రెండింటికిని సూక్తులు సహజా లంకారములు. తెలుగు వారి నాల్కల మీద తరతరాలుగా నిలువగలిగిన సూక్తు లీ శాంతిపర్వమున శతాధికముగా నున్నవి.

'ఒరు లేమేమి యొనర్చిన
నరవర! యప్రియము దనమనంబున కగుఁ దా
నొరులకు నవి సేయకునికి
పరాయణము వరమధర్మపదముల కెల్లన్' 5.228

ఈ సూక్తి తెలుగునాట ప్రసిద్ధమైనది. భీష్ముడు 'ధర్మసర్వస్వ నైజస్వరూప నిరూపణంబు సేసి కరతలామలకంబుగా' బలికిన మాట యిది. ధర్మస్వరూపుడైన ప్రభువు ధర్మములలో సార మెల్ల తెలియవలెను. కౌరవులు పాండవుల కెగ్గు చేసి నారు. దానివలన పాండవులకు పాట్లు తప్పలేదు; కురుక్షేత్ర యుద్ధము తప్ప లేదు. పాలకులు పాలితులను హింసించుటవలన సంఘర్షణ మేర్పడినది. ఇప్పుడు పాలితులే పాలకులైనారు. మరల వీరు పూర్వము వారు చేసిన తప్పే చేసినచో మరి భూమిపై శాంతి యుండదు. పరు లొనర్చిన యప్రియములు మఱల ధర్మ జుడు పరులకు చేయరాదు. దాని కెంతయో సహనము కావలెను. నియమము కావలెను. 'ఆత్మవ త్సర్వభూతాని' యను తత్వమును రా జెఱింగి యాచరింప

వలెను. అప్పుడు రాజున కంతశ్శాంతియు, రాజ్యమున సుఖశాంతులును కలుగును.

'రాజునకుఁ బ్రజ శరీరము
రాజు ప్రజకు నాత్మ గాన రాజుం బ్రజయున్
రాజో త్తమ! యన్యోన్య వి
రాజితులై యుండవలయు రక్షార్చనలన్' 2.274

ఇది బృహస్పతి వసుమనునకుఁ చెప్పిన ప్రజాపాలన రహస్యము. ఆత్మ కాలంబనము శరీరము. శరీరమున కాత్మ చైతన్యము. 'శరీర మాద్యంఖలు ధర్మసాధన'మ్మను న్యాయము ననుసరించి రాజు ప్రజారక్షణ చేయుటవలన ధర్మసాధనకనువైన తన శరీరమును రక్షించుకొనవలెను. ప్రజ తనకు రక్ష కలిగించు రాజుపై విశ్వాస ముంచి యతని నర్చించవలెను. ఇట్లు ప్రభువును, ప్రజలును పరస్పరాశ్రితభావముతో పరిపాలనము సాగింపవలెను. ప్రభుత్వ స్వరూప స్వభావములు మారవచ్చునుగాని ప్రజాపాలనకు సంబంధించిన ఈ సార్వకాలిక సత్యము మాత్రము సమసిపోవునది కాదు.

'అర్థసిద్ధికంటె నరయ నెక్కుడు ధర్మ
సిద్ధి దాన సకలసిద్ధులును బ్ర
శ స్తభంగిఁ జేరు శాశ్వతకీర్తియు
సంభవించుఁ గలుగు సద్గతియును' 2 408

రాజు ధనముకంటె ధర్మమున కధికస్థాన మీయవలెను. ధర్మమువలన సర్వసిద్ధులు చేకూరును. ధర్మవిరహితమైన అర్థకామము లనర్థ హేతువులు. కావున రాజునకు ధర్మవివేచనము ముఖ్యము.

'ధర్మ మధర్మము భంగి న
ధర్మము ధర్మంబు మాడ్కిఁ దనయా! తోఁచున్

నిర్మలమతి నరయవలయు
ధార్మికతన కోరువాఁడు దన కేర్పడఁగన్' 3.71

ధర్మ నిర్ణయమును నిర్మలమతియే చేయకలదు. అర్థకామదూషితమైన చిత్తము ధర్మాధర్మవివేచనము చేయజాలదు. ధర్మజునికి నిర్మలమతి కలిగించుటకే శాంతి పర్వమున ధర్మప్రబోధము నిర్వహింపబడినది.

భీష్ముడు చెప్పిన రాజధర్ములే కాక లోకధర్ములును లోకమున ప్రశస్తి నందియున్నవి. మిత్రుని గూర్చియు, మిత్ర ధర్మమును గూర్చియు తెలిపిన ఈ సూక్తులు మిక్కిలి హితములు.

'మిత్రుం డైహికములు నా
ముత్రికములునై న భద్రములు దలకొలుపున్
మిత్ర ధనంబులలోనను
మిత్రుఁడ యెక్కు డనుమాట మెత్తురు ప్రాజ్ఞుల్' 3.526

'మైత్రింబోలెడు ధర్మము
ధాత్రీదివిజులకు లేదు దాని నడిపినం
బుత్రా! యేకర్మంబు ప
విత్రతయును వలవ దది వివేకముఁ జేర్చున్' 5.102

చిరకారి కథలో జననీజనకుల ప్రాధాన్య ముగ్గడింపబడినది. తల్లి ధాత్రి వంటిది; తండ్రి బీజము వెట్టువాడు. మొలకవంటివాడు పుత్రుడు. తండ్రి బీజము వెట్టి తన పని ముగించును. తల్లి పుత్రుని భారమంతయు మోయును. అందువలన తల్లిదండ్రులలో తల్లికే ముందు వందన మిడుట న్యాయము. తండ్రి పుత్రుడు కుల దీపకుడైనచో వాత్సల్యము నొలుకబోయును. మూఢుడైనచో నొచ్చుకొనును. తల్లి యట్లుగాదు. పుత్రు డెట్టివాడైనను ఆమె వత్సలమూర్తియే. కావున,

'కలవాఁడు లేనివాఁడు స
బలుఁ డబలుఁడు మూఢబుద్ధి ప్రౌఢుం డనఁగా

వల దెవ్వరికైన జనని
కలిమియ యత్యంత సౌఖ్యకరమై యుండున్.' 5.278

సూక్తు లెంత సరళముగా నుండునో అంతగా సామాజికుల చిత్తములలో స్థానము నేర్పరచుకొనును. తిక్కన తెలుగు పలుకుబడులలో నెంతటి గంభీరార్థముల నైనను గడుసరిగా చెప్పగలడు.

'శ్రోతకుఁ దనకుం బ్రియ మగు
నే తెరువున నట్టిమెయి సమీరిత మైనం
జూ తగువాక్యం బది నృప
సూతీ! వెఱపలుకు బాలిశుల చొప్పరయన్' 6.190

అని జనక సులభాసంవాదమున సూక్తి యెట్లుండవలెనో సూత్రించి చెప్పినాడు. లోకధర్మములే కాదు మోక్షధర్మములు సైత మాసోమయాజి ముఖమున తెలుగు తియ్యందనము లూరు మాకందములవలె రుచికరములై భాసిల్లును.

'జ్ఞానము గేవలకృప న
జ్ఞానికి నుపదేశవిధిఁ బ్రజనితము సేయం
గా నది సకలధరిత్రీ
దానంబునకంటె నధికతరఫలద మగుఁ' 4.255

జ్ఞానదానము ధరిత్రీదానముకంటె గొప్పదని గుర్తించినగానిభీష్మునిబోధయొక్క మహత్వము మనకు తేటపడదు. ఉపదేశము చక్కని ఉపమానముతో నలంకరించినచో అర్థసౌందర్యముతోపాటు, ఆలోచనామృతమును సిద్ధించును. సంసారమున బంధుసంయోగ వియోగములనుగూర్చి అజగరుడు ప్రహ్లాదునితో చెప్పినవాక్యము తేటగీతిలో తేటతెల్లముగా నిట్లున్నది.

'వఱదఁ గాష్ఠముల్ గూడిన వడువ బంధు
సంగముం బవి వాసిన చాడ్ప తద్వి

యోగ మింత సూచిన వాని నుమ్మలికము
వొరయ నేరము దానవవరతనూజ !' 4.56

సంసారమునం దంధునివలె తిరుగుచు మోక్షమార్గమును గాంచలేని సంగుని సంగతి పరాశరుడు జనకమహర్షికి చిత్తము హత్తునట్లు చెప్పినాడు.

'తన గృహమున నభ్యాసం
బున మెలఁగెడు నంధుచందమున సంసారం
బునఁ దిరుగు మూఢుఁ డెఱుఁగడు
వినుతం బగు మోక్షపదము విమలవివేకా!' 5.532

సాంఖ్యయోగమునందు ఆత్మ ప్రకృతుల అనుబంధమును కమల జల సంబంధముగా నిరూపించి చెప్పుట ప్రసిద్ధము. దానిని తిక్కన—

'జలముఁ గదిసియుండ జలముచే నార్ద్రింబు
గాక యుండునటి కమలదళము
భఁగి నంతరాత్మ ప్రకృతిఁ బొందియును ద
ద్వికృతిఁ బొందకుండు వీతదోష !' 6.109

యోగి యోగమార్గమున నిశ్చలుడై బ్రహ్మానంద స్థితిని పొందు విధమును జనుల కత్యంత సమీచీనమైన యుపమానమును గొని చెప్పుట విశేషము.

'తేనియకుండఁ గొనుచు పో
పానము లేమఱుట లేక ప్రాఁకిన క్రియ నా
త్మానందరసం బొకకణ
మైనఁ జిలుక నీక తుదికి నాతం డెక్కున్. 6.121

ఇంతకంటె నబ్బురము కలిగించునది గుణత్రయము దేహి నంటిపెట్టుకొని యుండెడి విధము నెఱిగించెడి పథము.

'కట్టిన చీరయునుం బై
బెట్టిన చీరయును మౌళి బిగియారంగాఁ

జుట్టిన చీరయుఁ బోలెను
నెట్టన పొదివినది దేహిని గుణత్రయమున్. 4.331

ఎన్ని చెప్పినను చివరకు తెలియవలసినది మోక్షము. దాని నెంత సూటిగా, తేటగా చెప్పినచో నంత తెలివిడి కలుగుటకు వీలున్నది.

'పునరావర్తన రహితుం
డనఘుఁ పరమాత్ముఁ జెందినట్టి పురుషుఁ డ
వ్వినుతావస్థను మోక్షం
బని చెప్పుదు రంతకంటె నధికము గలదేఁ' 5.619

పునరావృత్తి రహితమైన శాశ్వత బ్రహ్మ పదస్థితి మోక్షము. తద్వివేకము పరమ జ్ఞానము. దానిని తెలిసి బ్రతుకుట గమ్యము నెఱింగి నడచుట. భీష్ముడు ధర్మజునకు గమ్యము చూపినాడు, గతిని బోధించినాడు. హితబోధకు పరమార్థ మింతియే.

4

ఏ కావ్యము నందైనను ఆఖ్యాన మనగా ప్రథానకథ. కథను ముందుకు నడపువాడును, ఫలభోక్తయు నైన నాయకుని ఇతివృత్త మది. నాయకునకు కార్యసాధనలో సహాయకులుగా నుండువారి కథలును అందుండవచ్చును. వానిని ఉపాంగ కథ లనవచ్చును. సామాన్యముగా ఉపనాయకాదులు స్వీయ ప్రయో జనమును సాధించుకొనుచు నాయక ప్రయోజనమును సాధించుచుందురు. వారికథ లుపాఖ్యానము లనుటకు వీలున్నది. పతాకానాయకుల కథ లిట్టివి. భారతమున కర్ణాదులకథ లిట్టివాని కుదాహరణములుగా బేర్కొనవచ్చును. కాని, ఉపాఖ్యాన శబ్ద మంతటితో ముగియుటలేదు. ప్రకరి స్థానీయులైన పాత్రల కథలకును అను వర్తించుచున్నది. ఇట్టి కథలు స్వీయ ప్రయోజన సిద్ధికొరకు కాక నాయక కథా ప్రయోజన సిద్ధికొఱకే ప్రవర్తిల్లునవి. ఇవి కాక అర్థవాద రూపములైన కథ లును కొన్ని యుండవచ్చును. ఇవి కావ్యమునందు ప్రవర్తించెడి కథార్థములను సమర్థించుటకు చెప్పబడునవి. ఇవి సామాన్యముగా ప్రసంగ వశమున ప్రవర్తిల్లు

చుండును. ఇవి ప్రతిపాద్యాంశములకు ప్రమాణతుల్యములై నాయకాదుల చిత్త వృత్తులకును, ఉపదేశార్థములకును పరిపోషకములుగా నుండును. వీనిని గూడ ఉపాఖ్యానము లని పేర్కొనుట రూఢికెక్కియున్నది. శాంతి పర్వమున భీష్ముడు ధర్మజునకు గావించిన ప్రబోధమునందు ప్రవర్తిల్లిన కథ లన్నియు నిట్టి అర్థవాద రూపములై న ఉపాఖ్యానములే. వీనిని ఇతిహాసములై న కథలుగా తిక్కన గారు పేర్కొనిరి. అనగా పరంపరాగతముగా లోకములో చెప్పుకొనబడుచున్న కథలని తాత్పర్యము.

అగ్నిపురాణము గద్యకావ్య భేదములను బేర్కొనుచు
'ఆఖ్యాయికా, కథా, ఖండకథా, పరికథా, తథా
కథాని కేతి మన్యంతే గద్యకావ్యం చ పంచథా'

అని అయిదు విధములై న ఆఖ్యాన భేదములను తెలిపినది. వీనిని వినుర్కకు లిట్లు వివేచించిరి. 'మొదటిది ఆఖ్యాయిక. ఇందు ఇతరులు రచించిన పద్యములు అచ్చటచ్చట ఉదాహృతములు కావచ్చును. ఉచ్ఛ్వాసాది విభాగములు గూడ నిందుండును. అందందు శ్లోకము లున్నను, నిది గద్యకావ్య భేదముగనే పరిగణింపబడియున్నది. అవి ఉదాహృతము లగుటయే అందులకు కారణమై యుండును. కథ కేవల గద్యమయము. ఉచ్ఛ్వాసాద్యవాంతర విభాగశూన్యము. ఈ కావ్య భేదములను రెండింటిని రచనారీతిని బట్టికాక, ఇతివృత్త స్వభావమును బట్టి, మరొక విధముగా గూడ నిర్వచింపవచ్చును. కల్పితేతి వృత్తము గలది కథ; యథార్థేతివృత్తము గలది యాఖ్యాయిక. ఇది మతాంతరము. నాయకుడు తనచరిత్రమును తానే చెప్పుచో నది ఆఖ్యాయిక యగు నని కొంద రందురు. అనఁగా, అప్పు డిందు ఉత్తమపురుషలో కథాకథనము జరుగు ననుట. ఖండకథ యందలి యితివృత్తము గ్రంథాంతర ప్రసిద్ధమై యుండును. కథయం దితివృత్తము కల్పితము; ఇందు గ్రంథాంతర ప్రసిద్ధము. అనగా ప్రఖ్యాత మనుట. పరికథకును సకలకథకును గల భేదము గ్రంథ విస్తృతియందే కలదు. అనతి విస్తృతము పరికథ; అతివిస్తృతము సకలకథ. మొదటిదానియందు చతుర్విధ పురుషార్థములలో నేదో ఒకటి మాత్రమే తత్ఫలసిద్ధి పర్యంతము నిబద్ధమగును. రెండవదానియందు ఫలసిద్ధి పర్యంతము పురుషార్థములు నాలుగును నిబద్ధము లగును. కొందఱాలంకారికులు ఉపకథ, బృహత్కథ అను మరిరెండు గద్యకావ్య భేదములను చెప్పిరి. ప్రసిద్ధేతివృత్తమును గైకొని, కవి దానిని వర్ణనలతో

పేంచి ప్రవాసిన నుపకథ యగును. బృహత్కథయం దితివృత్త మతివిస్తృతమై యుండును.'10

ఈ గద్య కావ్య భేదములను చంపూ కావ్యములకు వర్తింపజేసినను దోషము లేదేమో. వీనియందలి గద్య ప్రక్రియా స్వరూపము నటుంచి, ప్రకృతి స్వభావములను మాత్రము గ్రహించి చంపూ కావ్యముల కన్వయింపవచ్చును. అట్లయినచో ఉపాఖ్యాన స్వరూప స్వభావములను వివేచించుట కివి తోడుపడగలవు. ఉపనాయక వృత్తాంతము నాతడే చెప్పుకొనినట్లు వర్ణించినచో నది ఆఖ్యాయికా స్వభావ విశిష్టమైన ఉపాఖ్యానమగును. నాయకుని ధర్మసందేహములకు దృష్టాంతములుగా జెప్పబడెడి ఉపాఖ్యానములు ఖండకథా స్వభావ విశిష్టములై యుండవచ్చును. అర్థవాద రూపములైన ఉపాఖ్యానములు ఉపకథా, కథా స్వభావములను సంతరించుకొనవచ్చును. వీని నితిహాసము లని చెప్పినవుడు అవి లోకప్రసిద్ధములై యుండు నవి యని భావింపవచ్చును. అర్థవాద రూపములైన ఉపాఖ్యానములు పరిమాణమునందు చిన్నవి యగుటచే వానియందు కథానికా లక్షణములుండుటకు వీలుండును. కథానికా లక్షణ మిట్లు కలదు-

'భయానకం సుఖతరం గర్భేచ కరుణోరసః
అద్భుతోఽన్తే సుక్ష్మార్థా నోదాత్తా సా కథానికా'

కథానిక భయానకమును, సుఖతరమునై యుండవలెను. కథాగర్భము నందు కరుణరస ముండవలెను. అంతమునం దద్భుతము పోషింపబడవలెను. అది సంక్షిప్తమును, ఉదాత్తము కానిదియునై యుండవలెను. భయానక మనగా భయావహ మైన సన్నివేశము లనియే గ్రహింపరాదు ఉద్వేగజనకములైన కథార్థము లనియు, ఉత్కంఠావహము లనియు తాత్పర్యము. అవి ఆస్వాదనీయములుగా రమణీయములుగాజిత్రింపబడుటచే సుఖతరములగును. కరుణరసగర్భము లనగా శోకరస కథాఘట్టము లనియే కాదు, హృదయము నార్ద్రపరచెడి సన్నివేశము లేవైన కావచ్చును. కథ అద్భుతాంత మగుటయు, క్లుప్తముగా నుండుటయు, నిర్వహణ కథాకథన శిల్పములకు సంబంధించిన అంశములు. 'నోదాత్తా'

---

10. సాహిత్యదర్పనము. డా॥ కె.వి.ఆర్. నరసింహము. పుట 635-636

అను లక్షణము కథాస్వభావమునకు చెందిన లక్షణము. అర్థవాద రూపములైన ఉపాఖ్యానము లీకథానికా స్వభావ ముద్రితము లయియుండుట శిల్పవిశేషమగుట యే కాక, వాని సహజ స్వభావమున కత్యంత సన్నిహితమైన గుణ మనియు సహృద యులు గమనింపగలరు. ఈ దృష్టితో శాంతిపర్వమునందలి యుపాఖ్యానముల యొక్క రచనాశిల్పమును సమీక్షించినచో వానిలోని అందచందములు మన కవ గత మగు ననుట నిస్సంశయము.

శాంతి పర్వము నందలి యుపాఖ్యానములలో తిర్యగ్జడములు మొదలుకొని దేవర్షుల వఱకు సంబంధించిన కథలు గలవు. రాజధర్మ లోక ధర్మములను జెప్పునెడ తిర్యగ్జడములకు సంబంధించిన ఉపాఖ్యానములను విశేషించి చెప్పి యుండుట గమనింపదగినది. పంచతంత్రాదులలో నిట్టి కథా నిర్మాణ శిల్పము ప్రసిద్ధము. ఈ కథలకు ప్రతీకాత్మక ప్రవృత్తి ప్రాణభూతమైనది. ఒక్కొక్క పాత్ర ఒక స్వభావమునకో, ఒక ధర్మమునకో ప్రతీకగా భాసించి, మానవ ప్రవృత్తులకు ప్రతినిధులుగా వర్తించి పఠితల కుపదేశము నిర్వహించుచుండును. వారే మానవులైనచో శ్రోతల కావ్యక్తుల్యం దనురాగద్వేషాదు లుదయించు టకు వీలుండును. తిర్యగ్జడము లయినప్పుడు 'వానికే యిన్ని తెలివితేట లున్న ప్పుడు మానవు లెంత యున్నతులు కావలయు'నను జిజ్ఞాసతో కూడుకొనిన అవ ధానము వారి యందు కలుగును. భీష్ము డీరహస్యమును గుర్తించి కొన్ని కథ లిట్టివి తన యుపదేశమున ననుసంధించినాడు. అట్టివానిలో— 1. వ్యాఘ్ర గోమాయు సంవాదము (3.53-71), 2. ఉష్ట్రము కథ (3.83-85), 3. సముద్ర సరిత్ సంవాదము (3.86-90), 4. కుర్కుర కథ (3.92-96), 5. దీర్ఘదర్శి మొదలగు మత్స్యముల వృత్తాంతము (3.185-201), 6. మార్జాల మూషిక సంవాదము (3.202-243), 7. లుబ్ధ కపోతోపాఖ్యానము (3.307-341), 8. గృధ్ర జంబుకోపాఖ్యానము (3.366-381), 9. పవన శాల్మలీ తరు సంవాదము (3.383-397) పేర్కొనదగినవి. వీని పరిమాణమును గమ నించినచో మూడు పద్యముల నుండి నలుబది రెండు పద్యముల వరకు వ్యాపిం చిన చిన్న పద్యకథ లివి యని తేటపడ గలదు. ఇవి సంగ్రహములయ్యు చక్కని కథానికా శిల్పమును సంతరించుకొనిన శిల్పఖండములు. వానిని తిక్కన తీర్చిన తీరు ప్రశంసనీయము.

పై ఉపాఖ్యానములలో నన్నింటి కంటె చిన్నకథ ఉష్ట్రము కథ, లేక-ఉష్ట్రగ్రీవోపాఖ్యానము. మూలమున నది ఇరువది యొక్క శ్లోకములలో చెప్ప బడినది.దానిని తిక్కన సంగ్రహించి మూడు నాల్గు పద్య గద్యములలో చెప్పెను.

యుధిష్ఠిరః : కిం పార్థివేన కర్తవ్యం కిం చ కృత్వా సుఖీ భవేత్
ఏత దాచక్ష్వ తత్త్వేన సర్వధర్మ భృతాంవర !

భీష్మః : హంతతేహం ప్రవక్ష్యామి శ్రుణు కార్త్యిక నిశ్చయమ్
యథా రాజ్ఞేహ కర్తవ్యం యచ్చ కృత్వా సుఖీ భవేత్
నచైవం వర్తితవ్యం స్మ్యయథేద మను శుశ్రుమ
ఉష్ట్రిస్యతు మహద్వ్యర్తం తన్నిబోధ యుధిష్ఠిర !
జాతిస్మరో మహానుష్ట్రిః ప్రాజాపత్యయుగే భవేత్
వరణే చ్ఛంద్యామాస తతశ్చైనం పితామహః
తపస్సు మహదా తిష్ఠ దరణ్యే శంసితవ్రతః
తపస స్తస్యచాం తేథ ప్రీతిమాన భవ ద్విభుః
వరేణ ఛందయామాస తతశ్చైనం పితామహఃం.

ఉష్ట్రిః : భగవన్! త్వత్ప్రసాదా న్మే దీర్ఘగ్రీవా భవే దియం
యోజనానాం శతం సాగ్రం గచ్ఛామి చరితుం విభో !
ఏవ మస్త్వితి చోక్త స్స వరదేన మహాత్మనా
ప్రతిలభ్య వరం శ్రేష్ఠం యయా వుష్ట్రి స్స్వకంవనమ్
సచకార తదాలస్యం వరదానా త్సు దుర్మతిః
నచైచ్ఛ చ్చరితుం గంతుం దురాత్మా కాలమోహితఃం.
సకదాచి త్ప్రసాద్యైవ తాంగ్రీవాం శతయోజనామ్
చచార శ్రాంత హృదయో వాత శ్చాగా త్తతో మహాన్.
సగుహాయాం శిరోగ్రీవాం నిధాయ పశురాత్మనఃం
ఆస్తేమ వర్ష మభ్యాగా త్సుమహాత్ ప్లావయ జ్జగత్.
అథ శీతపరీతాంగో జంబుకః క్ష్యుచ్చ మన్వితఃం
సదారస్తాం గుహామాశు ప్రవివేశ జలార్దితఃం.

సదృష్ట్వా మాంసజీవీతు స్సుభృశం క్ళుచ్ఛ మన్వితః
అభక్షయ త్తతోగ్రీవా ముష్ట్రస్య భరతర్షభ !
యదా త్వబుధ్య తాత్మానం భక్ష్యమాణం సవై పశుః
తదా సంకోచనే యత్న మకరో ద్భృశ దుఃఖితః.
యావ దూర్ధ్వ మధశ్చైవ గ్రీవాం సంక్షిపతే పశుః
తావ త్తేన సదారేణ జంబుకేన సభక్షితః.
సహత్వా భక్షయిత్వాచ తముష్ట్రం జంబుక స్తదా
విగతే వాతవర్షేతు నిశ్చక్రామ గుహాముఖాత్.
ఏవం దుర్బుద్ధినా ప్రాప్త ముష్ట్రేణ నిధనం తదా
ఆలస్యస్య క్రమాత్పశ్య మహాంతం దోషమాగతమ్.
తమ ప్యేవంవిధం హిత్వా యోగేన నిహతేంద్రియుః
వర్తస్వ బుద్ధి మూలంతు విజయం మను రబ్రవీత్.
బుద్ధి శ్రేష్ఠాణి కర్మాణి బాహుమధ్యాని భారత :
తాని జంఘా జఘన్యాని భారప్రత్యవరాణి చ.
రాజ్యం తిష్ఠతి దక్షస్య సంగృహీ తేంద్రియస్య చ
ఆర్తస్య బుద్ధి మూలం హి విజయం మను రబ్రవీత్.
గుహ్యం మంత్రం శ్రుతవత స్స సహాయస్య చానఘ
పరీక్ష్య కారిణో హ్యర్థా స్సిద్ధిం తీహ యుధిష్ఠిర :
సహాయయు క్తేన మహీకృత్స్న శక్యా ప్రశాసితుమ్...

తిక్కన: కౌంతేయాగ్రజుం డేమిభంగివ ర్తనంబున భూపాలుండు సుఖియై
యుండు ననుటయు న న్నరపతికిం గురుపితామహుం డిట్లనియె.

సీ. ఆలస్యమును నసహాయత్వమును నొప్ప వవి లేని పతి సుఖియై చరించు
విను తొల్లి యొకయుష్ట్రి మనితరసాధ్యతపంబు సేయఁగ మెచ్చి
బ్రహ్మ వచ్చి

యర్థించినది యేమి యనిన నాలొట్టేనుఁ గొప్ప నామెడ శతయోజన ప్ర
మాణం బగుట కోర్కి వాణిశ! నావుడు నట్లగుం గా కని యతఁడు సనియె

ఉ. సదియు వరగర్వమున సహాయంబు నొల్ల
కలసభావంబుతో నుండి వలచి యొక్క
నాఁడు దన యఱ్ఱు సాఁచి కాననములోన
దీనుకొని మేయఁగాఁ బెనువాన వచ్చె.

క. వచ్చినఁ తనమెడ సాఁగిన
యచ్చటి గుహలోన నుత్తమాంగం బిడి తా
నిచ్చమెయి నిదురపోవఁగ
విచ్చలవిడి నొక్కనక్క వెలఁదియు ఁదానున్.

వ. ఆ గుహ సొచ్చెం జొచ్చి యాఁకటి పెల్లున నాలుం దానును నొక్కట
నా లొట్టినుఁగు కుత్తుక కబళించి నెత్తురుం గండలుం నొండొండ ప్రొంగం
దొడంగిన నది మేలుకని మెడ పొరల్చు నంతకు నా నక్కలు నరంబులు
ద్రెవ్వంగఱచిన నెఱిదప్పి యయ్యుష్ట్రంబు నిర్గతప్రాణంబయ్యె నట్టి
చందంబు గాక నీవనాలస్యుండవును, సహాయసంపన్నుండవును నై నెగడు
మనిన-- 3.82-85.

తిక్కన అనువాదమున స్పష్టతతో కూడిన ప్రతిపాదనము కలదు. కథా రంభముననే 'ఆలస్యమును, అసహాయత్వమును నొప్పవనియు, నవి లేని పతి సుఖి యగు ననియు ప్రతిపాద్యాంశమును తేటపరచెను. మూలమున నట్టి ప్రక్రియ కానరాదు. కథ చదివిన తరువాత గాని తెలియదు. మూలమున నుష్ట్రమునకు 'దుర్మతిఁ', 'కాలమోహితఁ' 'పశుఁ' మొదలైన విశేషణములను వేసి దాని స్వభావమును వ్యక్తీకరించుటయైనది. తిక్కన కథనములో తత్ప్రవర్తనము మాత్రము చెప్పబడినది. దాని స్వభావము ధ్వనింపఁబడినది. మొదట ప్రతి పాద్యాంశమును చెప్పి చివర దాని నొక్క వాక్యముతో పునశ్చరణము చేసి ధర్మజునకు నీతి గరపినట్లు చెప్పుట పూర్వాపర సమన్వయాత్మకమైన కథా కథనమునకు దృష్టాంతము. కథ మొదలైనది మొదలు పఠిత యొక్కబిగితో దానిని చదివి తత్సారమును గ్రహింపగలడు. తిక్కన రచనలో ప్రతి పదము సార్థకము. ఏ పదమును తీసినను కథకు భంగము వాటిల్లును. సాకవదుపా

ఖ్యానరచన మనగా నిట్టిది. తిక్కన యనువాద మంతయు శాంతిపర్వమున నిట్లే సాగినది.

సముద్ర సరిత్సంవాదము మూలమున పదునాల్గు శ్లోకములకథ. దాని నైదుగద్య పద్యములలో తిక్కన చిత్రించెను. 'శత్రువు బలాధికుడైనచో అల్ప బలుడై నరా జేవిధమున నాపదను తరింపగల' డను ధర్మజుని ప్రశ్నకు భీష్ముడు చెప్పిన సమాధాన మీకథ. ఒకనాడు సముద్రుడు నదులతో సుఖసల్లాపములు చేయుచు నిట్లనినాడు. 'మీరు పొంగి పారునప్పుడు మీ తటములందున్న తరువు లున్మూలితము లగునుగాని ప్రబ్బలిచెట్లేల పెఱుకబడవు. వానిని పీకివేయుటకు మీకు శక్తి చాలదా? లేక అవి యేమైన ప్రియము మీకు కావించినవా?'. గంగ దానికి సమాధానముగా నిట్లనినది. 'చెట్లు తమ బిగువు వీడక మా ప్రవాహమున కెదురునిలిచి కూలిపోవును. ప్రబ్బలిచెట్లు నమ్రములై మా పొంగు చల్లారిన తరువాత యథాస్థితికి వచ్చును.' ఒక ప్రశ్న—ఒక ఉత్తరము. ఇంతే కథ. దీని వలన తెలియదగిన నీతి యిది.—

'అరిసృపాలుపెంపు నాత్మీయశక్తియు
నెఱిగి మూర్ఖవృత్తి నెదురుపడక
యుచితవృత్తి నతని యుద్ధతి మేవడి
గడపి హీనబలుఁడు సెడక నిలుచు'. 3-90

అల్పుల కధికార మిచ్చినచో యజమానికే అపకారము తలపెట్టెద రని చెప్పెడి కథ కుర్కురోపాఖ్యానము. మూలమున 21 శ్లోకముల దానిని తిక్కన 5 పద్యగద్యములలో సంగ్రహించినాడు.

దీర్ఘదర్శి వృత్తాంతము, గృధ్రజంబుకోపాఖ్యానము, పవన శాల్మలీతరు సంవాదము—ఈ మూడును సమాన పరిమాణములు కల ఉపాఖ్యానములు. దీర్ఘ దర్శి, ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రుఁడు-అను మూడు చేపల కథ మొదటిది. వాని పేళ్ళలోనే వాని స్వభావములు సూచింపబడినవి. పంచతంత్రమున నీ కథ ప్రసిద్ధము. వాని వర్తనముల వలన తెలియఁ దగిన నీతు లివి—

క. వినుఁ! దొదవ్వులఁ గార్యము
గనిగొని వలయుపని మున్న కావింపఁగ నే
రనిజనుఁడు దీర్ఘసూత్రుం
డనున మ్మృత్స్యంబు భంగి నాపద నొందున్.

తే. ఆప్పటికిఁ దోచినట్టులు దప్పకుండ
ననువుతో ధృతి గల్గి కార్యంబు నడపు
నతఁడు ప్రాప్తకాలజ్ఞాఖ్యునట్ల పోలెఁ
బరమసంశయ మయ్యెడు బ్రదుకుఁ గాంచు.

క. భుర్యత ననాగతము లగు
కార్యము లూహించి పని తగం జేయు నయా
చార్యుఁడు సౌఖ్యముఁ బొరయును
నార్యస్థితి దీర్ఘదర్శి యను మీనుక్రియన్.

'ఆ ర్తజన బాష్ప ప్రమార్జనంబు ప్రభువునకుం గ ర్తవ్యం బగుటకును నిజకార్యార్థ లగు కపటుల నేర్పు మాటల తెఱువు లెఱింగికొనుటకు' నుదాహర ణంబై నది గృధ్రజంబుకోపాఖ్యానము. బాలశవమును భక్షించు నాశతో ప్రొద్దు కూకకముందే బంధుజనులను పొమ్మని చెప్పినది గ్రద్ద. చీకటి పడినచో తన కా శవ పల్వలము దక్కునని బంధుజనులను వేచియుండు డని బోధించినది నక్క. ఈ రెండును స్వీయకార్య సాధనోపాయముల నెఱిగి నేర్పు మాటలు పచరించి నవి. వీరిరువురి పోరును శివుడు తీర్చినాడు. బాలునికి ప్రాణములు దక్కినవి; గృధ్ర జంబుకముల కాకలి దప్పులు వొడమని వరములు దక్కినవి. వావ నైపుణ్య మును చిత్రించుట యందు తిక్కన చూపిన నేర్పు మానసిక చిత్రణ శిల్పమునకు చక్కని ఉదాహరణము. ఫలశ్రుతి చెప్పిన యుత్తమ కథ యిది.

శాఖావిస్తృతిచే నొప్పారు శాల్మలీ వృక్షము నారదునితో గర్వోక్తు లాడు టయు, నా మహర్షి దాని గర్వము నణచుటకు వాయుదేవుని ప్రేరేపించుటయు, వాయువిజృంభణమునకు పూర్వమే శాల్మలి తన కొమ్మలను తానే విరుచుకొను

టయు ననెడి కథార్థములు గల ఉపాఖ్యాన మిది. మూలమున 77 శ్లోకముల కథను తిక్కన పదునేను పద్య గద్యములలో రచించెను. ఇది సంగ్రహ రచన అయ్యును కథలోని సంభాషణ ఘట్టములు చెక్కుచెదర లేదు. శాల్మలీ వృక్ష గర్వోక్తులు, నారదుని హితోక్తులు, శాల్మలి నిర్వేదము-అనునవి రసవద్రచన కనుకూలము లగుటచే తిక్కన ఆ భాగములను చికిలిపెట్టి చిత్రించెను. మూలము నందలి పునరుక్తులను పెక్కింటిని వారించెను. మూలము నందలి పది శ్లోకము లందు పలచి చెప్పబడిన ఫలితాంశమును తిక్కన యొక్క వాక్యములో చిక్కగా నెప్పివదలెను. 'ప్రబలుని తోడ దుర్బలుండు దొడరి మత్సరగ్రస్తుండయిన నపాస్త విభవుం డగు' నని ఉపాఖ్యానము వలన తెలియదగిన నీతి. ఈ కథల యందు తిక్కన సారవంతమును, వేగవంతమును నైన కథాకథన పద్ధతి ననుస రించినాడు.

ప్రభువు చెప్పుడుమాటలు చెవిబెట్టక హితులను, అహితులను తానే వివే చించి తెలిసికొనవలయు ననుట రాజధర్మమున కుదాహరణముగా భీష్ముడు చెప్పినది వ్యాఘ్ర గోమాయు సంవాదము. నక్క సామాన్యముగా జిత్తులమారిగా చిత్రింపబడును. కాని, ఇందు మహితవ్రతశీల. పూర్వజన్మమున రాజుగా బ్రబికి నది. వ్యాఘ్రము మొకటి దాని వ్రతశీలమును గాంచి చెలిమి కోరినది. తన చెలిమి వ్యాఘ్ర భృత్యుల కసూయాహేతు వగు ననియు, వారు తనపై నెగ్గులు పన్నెద రనియు, అట్టియెడ వారి మాటలకు కలత చెందక సమయము పాటించినచో మైత్రిచేసి హితవు నడపెదననియు నక్క నియమము పెట్టినది. వ్యాఘ్రము మందుల కంగీకరించి యతని యుపదేశములను పాటించి రాజ్యమును ధర్మబద్ధముగా చేయుచుండెను. భృత్యు లందుల కసూయపడి మిత్రభేదమును కల్పించిరి. వ్యాఘ్రు మాజంబుకమును శిక్షింప నిశ్చయించెను. అతని తల్లి కలరూ పెరింగించి యతనికి హితవుచెప్పెను. అతడు తన పొరపాటును గ్రహించి నక్కను మరల దరికి తీసెను. నక్క అత డిదివరలో చేసిన బాసను గుర్తుచేసి,

'ఎఱిగి యైన నెఱుగ కేనియు నొక్కని
భంగపెట్టి పిదప సంగతుఁడుగఁ
జేసికొనుట మేలె సిరి గలవారికి
నట్టి నిలుపు వాని కగునె హితము ?' 3.78

అని అధిక్షేపించి తా నడవుల కేగి తపము చేసి మోక్షము పొందినది. ఈ కథలోని 'పూర్వాపర వాక్యంబుల యందలి తాత్పర్యంబు నిరూపించుటయే' శిల్పము; తెలియదగిన పరమార్థము. తిక్కన ఇందు పాత్రోచిత సంభాషణ శిల్పమును మెఱపువలె ప్రదర్శించినాడు. మచ్చునకు వ్యాధభృత్యుల వాక్యములు-

'తానటె మాంసము దిన దటె
యానక్కయు బేలువెట్టె నిన్నాళ్లును నీ
యాన ! మఱుమాట వలుకం
గా నోడితి మిదియ నడపఁ గార్యముల యెడన్' 3.66

ఆ దీర్ఘములు, ఆ యొట్టులు, ఆ వక్రతలు, వారి వికట వినయములను వాక్కులలో పట్టి యిచ్చుచున్నవి.

శరణాగతరక్షణము వలన నరునకు గలుగు ఫలమెట్టి దని యడిగిన ప్రశ్నకు భీష్ముడు-ముచుకుందునకు శుక్రుడు చెప్పిన యితిహాసమగు - లుబ్ధ కపోతోపాఖ్యానమును ధర్మజుని కెఱిగించెను. ఇది మూలమున 133 శ్లోకములలో చెప్పబడిన కథ. తెలుగులో తిక్కన 35 పద్యగద్యములలో ననువదించెను. కరుణమునకును, త్యాగమునకును కాణాచి యీకథ. పిట్టలవేటయే వృత్తిగాగల బోయవాడొకనాడు గాలివానలో చిక్కువడి యొక్క చెట్టుక్రింది శిలపై రాత్రి గడుపుచుండెను. ఆ చెట్టుతొఱ్ఱలో నొక కపోతము మేతకు పోయిన పెంటిపక్కి తిరిగిరానందులకు దాని గుణగణముల కీర్తించుచు వాపోవుచుండెను. బోయవాని వలలో చిక్కియున్న ఆడుపావుర మానాథుని మాటలు విని తనజన్మ కృతార్థ మైనదని సంతసించి, తన యునికి పతి కెఱుక పఱచి, వృక్షమును శరణువేడిన బోయనికి రక్షణము కల్పింపుమని పతిని వేడుకొనును. ఆ మగపావుర మా బోయని యభీష్టముల నెఱిగి చలిమంట వేయుటయే కాక, అందు తాను దూకి ఆతని కాహార మయ్యెను. దానిని గాంచి విలపించుచు నాడుగువ్వ పతితోడిదే తన ప్రాణమని భావించి తాను నామంటలో బడి సహగమనము చేసెను. వారిరువురి దివ్యవర్తనమును గాంచి బోయవాడు తానును వనమున కేగి దావాగ్నియందు

తనువును ప్రవేల్చెను. ముగ్గురును దేవత్వము నొందిరి. ఈ కథలోని కపోతములు శరణాగత రక్షావ్రత దీక్షితులైన ఆదర్శ దంపతులకు ప్రతీకలు. వారి అతిథి భక్తి తనూత్యాగమున కైనను వెనుకంజ వేయనీయలేదు. తిక్కన ఆ పాత్రలను తీర్చిన తీరు, వారి మాటలసొరు సహృదయానురంజకములు.

'పతిమదికి నింత యెక్కున
యతివగదా పుణ్యవతి; ప్రియాలాపము లీ
గతి వినఁ గాంచితి; జన్మము
గృతకృత్యం బయ్యె నాకు; గెలిచితి జమునిన్' 3.311

ప్రియుని వలపును పరోక్షముగా నుండి ప్రత్యక్షముగా తెలుసుకొనిన పడతి సంతోషమున కవధి యెక్కడిది : ఈ మాటలకు మూలము నెఱిఁగినచో తిక్కన రచనలోని జిగియు, జిలుగుశిల్పమును తెలివచ్చును.

'అహోతీవసుభాగ్యాహం యస్యా మే దయితఃపతిఃl
అసతో వా సతో వాపి గుణా నేవం ప్రభాషతేll
నసాస్త్రి హ్యభిమంతవ్యా యస్యాం భర్తా న తుష్యతి
తుష్టే భర్తరి నారీణాం తుష్టాస్స్యా స్సర్వదేవతాఃll
అగ్ని సాక్షిక మిత్యేవ భర్తా వై దైవతం పరమ్
దావాగ్ని నేవ నిర్దగ్ధా సపుష్ప స్తబకాలతా ll
భస్మీభవతి సా నారీ యస్యా భర్తా న తుష్యతి'

మూలములోని మాటలు పాలైనచో తెలుగులోని పలుకులు వెన్నముద్దలు. 'అగ్నిసాక్షిక మిత్యేవ' వంటి పలుకులు మానవవనితకు చెల్లినంతగా కపోతికి చెల్లవు. అందుచే వానిని తిక్కన వదలివైచెను. తెలుగులో 'గెలిచితి జమునిన్' అన్న పలుకుబడి అమూలకమైనదే. ఆమె హర్షమున కాపలుకు పరాంకోటి. తిక్కన తెలుగు తనములోని జిలుగు పనితనము.

'ఓయన్న డస్సినాఁడవు
మా యింటికి నతిథి వైతి మసలక నీకుం

జేయవలయు నాతిథ్యం
బేయది భవదీప్సితార్థ మెఱిఁగింపవనా!' 3.315

ఈ మాటలు కపోత మనినవి. తెలుగునాట సంస్కారవంతులైన గృహస్థుల నోటిలో నేటికిని ఈ పద్యము అతిథిసత్కార సమయములయందు వినబడు చున్నది. తిక్కన తీర్చిన మాటలు తెలుగువారి ఆచారములకు అందమైన బాటలు !

తిక్కన కావ్యకళాశిల్పమున ఉపాఖ్యానము నుద్దీప్త మొనర్చినది కపోత విలాపఘట్టము. మూలముతో పోల్చి చూచినచో నది సహృదయులకు స్పష్టము కాగలదు.

మూలము:—

"నా హం తే విప్రియం కాంత కదాచి దపి సంస్మరే
సర్వాపి విధవా నారీ బహుపుత్రాపి శోచతే॥
శోచ్యా భవతి బంధూనాం పతిహీనా తపస్వినీ
లాలితాహం త్వయా నిత్యం బహుమానా చ్చ పూజితా ॥
వచనై ర్మధురై స్స్నిగ్ధై రసంక్లిష్ట మనోహరై ఃr
కందరేషు చ శైలానాం నదీనాం నిర్ఝరేషు చ ॥
ద్రుమాగ్రేషు చ రమ్యేషు రమి తాహం త్వయాసహ
ఆకాశ గమనే చైవ విహృతాహం త్వయాసుఖమ్ ॥
రమామిస్మ పురాకాంత తనే్మనా స్త్యద్యకించన
మితం దదాతిహి పితా మితం భ్రాతామితం సుతః ॥
అమితస్యహి దాతారం భర్తారం కానపూజయేత్
నా స్తి భర్తృ సమో నాథో నా స్తి భర్తృ సమం సుఖమ్ ॥
విసృజ్య ధనసర్వస్వం భర్తా వై శరణం స్త్రియాఃr
న కార్య మిహ మే నాథ జీవితేన త్వయా వినా॥
పతిహీనాతు కా నారీ సతీ జీవితు ముత్సహేత్
ఏవం విలప్య బహుధా కరుణం సా సుదుఃఖితా॥"

అనువాదము—

'నా యాఁకలి కోర్వ వెపుడు
వే యైనను నేఁ గొనంగ వెండి యనుభవిం
తాయాస పడుటఁ గనుఁగొని
నోయుదు ననుఁ బాసి యిటు సనుట తగవగునే?''

అని వెండియు,

'ఇగురు జొంపంబుల నింపారు విరులను
బలుపై న పొదల క్రేవలకుఁ దార్చి
సెలయేఱులందలి తెలినీటఁ దనుపుసొం
పెలసిన గిరుల తెప్పలకుఁ జేర్చి
మావిమ్రోకల నెలదీవలఁ జెన్నొందు
తోఁటలకడ నలితోడఁ జెంది
యలరు నెత్తమ్ముల కలిమిఁ జెల్వగు డిగ్గి
యల తీరభూముల నల్లఁ బొంది

సన్ను మనమునఁ దేల్చి యానంద మొందఁ
గేలిసలిపెడు నీదగు లీల మఱువ
నా వశంబె ప్రాణేశ! ప్రాణంబు లిపుడ
నిన్నకూర్చి యేతెంతు నీ సన్నకడకు.

అట్లుంగాక,

జేని యనుమరణమునఁ దన
మేను విడిచినట్టి కాంత మేలిపదవికిం
దాను నతండును నరిగి య
నూనస్థిరసుఖము లందుచుండుట విందున్.' 3.330-334

మూలమున కపోతి విధవాజీవిత దుర్భరత్వమును స్మరించి పతితో సహ గమనమున కుత్సహించినట్లు కొన్ని మాటలు కలవు. వానిని తిక్కన వదలి ఔచిత్యమును కాపాడుటయే కాక ఆమె పేరంటాలి తనమును ధ్వనింపజేసినాడు. పతి తనపై చూపు ప్రేమను కందములో చెప్పించి, అత డామెను రతులఁ దేలించిన లీలలను సీసమున వివరించుచు విలపింపఁ జేయుట కరుణ పోషణ రహస్య మెఱిఁగిన శిల్పి చేసెడి పని. కపోత మయ్యును కరుణమునందు రతీదేవిని మరపింప చేసిన దీఘట్టమున. మూలమున లీలగా నున్న విలాస స్మృతికి విరాడ్రూపము కల్పించినాడు తిక్కన. సతీ సహగమనము సతిపతుల కుత్తమ గతిని కల్పించునని తాను వినిన ధర్మము నాధారముగా గొని వహ్నియందు ప్రవేశించి నది కపోతి. తిక్కన ఆమెనోట విధవాశబ్దమునుగాని, పతిహీనాశబ్దమునుగాని రానీయలేదు. తిక్కన ఔచిత్య పరిపోషణమునకును, అనౌచిత్య పరిహరణమున కును ఈ సన్నివేశ ముజ్జ్వలోదాహరణము.

లుబ్ధకపోతోపాఖ్యానము పైన చెప్పబడిన కథానికా లక్షణము లన్నియు సంతరించుకొనిన కథ. ఇందలి వాతావరణము భయానకము. పాత్రల చిత్ర వృత్తులు సుఖావహములు. కథ కరుణగర్భమే కాదు; కరుణాంతము కూడ. కథ చివర అద్భుతము. ఇందలి పాత్రలు తిర్యగ్వ్యన్య జాతులకు సంబంధిన వగుటచే వస్తువనుదాత్తమనియు చెప్పవచ్చును. ఆకృతిచే నవి పక్షులైనను ప్రకృతిచే నవి పుణ్యమూర్తులు. అందులకే ఈ ఉపాఖ్యానమునకు ఫలశ్రుతి చెప్పబడినది.

మూషిక మార్జాలోపాఖ్యానము ఉత్కంఠావహమును, ఉపదేశాత్మకమును నైన కథ. పై కథ లన్నింటికంటె పెద్దది యిది. 'పెక్కండ్రు పగతురకు నగ్గమై హీనబలుండైన నరపతి యెప్పరుసున నాపద నిస్తరించు వా' డను ప్రశ్నకు భీష్ముడీకథను ఉత్తరముగా పేర్కొనును. ఒక చెట్టు క్రింది బొరియలో నొక యెలుకయు, నా చెట్టుపై నొక పిల్లియు నివసించు చుండెను. ఒకనాడు పిల్లి వలలో చిక్కుకొనెను. ఎలుక ఆ వైపు వెడలుచుండగా నొక నకులము ఉలూకము దానిని తినుటకు వచ్చినవి. అది వలలో చిక్కిన పిల్లిని సమీపించి అదను చూచి వలను కొరికెదనని ఒప్పించి,దాని చెంత నుండి నకులాములబాధలను తప్పించు కొనెను. ఆ పైన నెంత సేపటికిని ఎలుక వలను కొరకదు. కొరికినచో నా పైన పిల్లి తనను తిని వేయునని దాని భయము. అంతలో తెల్లవార వచ్చినది. బోయ

వాడొక డావైపునకు వచ్చుచుండెను. ఆ సమయము గాంచి ఎలుక వలను కొంకి నది. పిల్లి చెట్టెక్కినది. ఎలుక కలుగులో దూరినది. పిల్లికి గండము తప్పినది. ఆ తరువాత పిల్లి ఎలుకను తనతో కలిసి తిరుగుచు స్నేహము పాటింపుమని కోరినది. కాని, ఎలుక దూరస్నేహమును మాత్రమే వాంఛించినది. స్థూలముగా కథ యిది. దీని నీతి యిది--

'బలు పగఱ వలని యాపద
దలఁగుటకును రిపుని హీనతరునైనఁ దనుం
గలిపికొని బ్రదుకుటకు ని
య్యెలుకయుఁ బిల్లియును వెరవు లెఱిఁగించెఁ దగన్.' 3.243

మూషిక మార్జాల సంవాదమునందు తిక్కన కలము చిలకరించిన సూక్తి మౌక్తికములు కొన్ని కలవు. మచ్చున కొక్కటి-

"నమ్మదగని వారి నమ్మిక యున్నది
తగిన వారి నైనఁ దద్ద నమ్మి
యుండఁ దగదు తన్ను నొరుల నమ్మెడునట్ల
యుండి యొరుల నమ్మకునికి నీతి".

శాంతిపర్వమున తిర్యగ్జడేతరములైన సంవాదములు, ఇతిహాసోపాఖ్యానములు పెక్కులు కలవు. వానిలో వైస్యు చరిత్రము, మాంధాత్రచరిత్రము, బృహస్పతి వసుమను సంవాదము, వాయుదేవ పురూరవ సంవాదము, ఐల కశ్యప సంవాదము, ముచుకుంద కుబేర సంవాదము, కేకయరాక్షస సంవాదము, కాలకవృక్షీయశ్యేనదర్శి సంవాదము, మాంధాత్రఋతధ్వ సంవాదము, వసుమన వాయుదేవ సంవాదము, శక్రాంబరీష సంవాదము, బృహస్పతి దివస్పతి సంవాదము, వసుహోమ మాంధాత్ర సంవాదము, ప్రహ్లాద సుమిత్ర వృత్తాంతములు, కామందక ఆంగరిష్ఠ సంవాదము. కాపవ్యోపాఖ్యానము, బ్రహ్మదత్తపూజని సంవాదము, కణిక శత్రుంజయ సంవాదము, విశ్వామిత్ర చండాలసంవాదము, నాడీజంఘు చరిత్రము, సేనజిత విప్ర సంవాదము, పితాపుత్ర సంవాదము, శమ్యాకభీష్మ సంవాదము, మంకి యను బ్రాహ్మణుని చరితము, అజగరప్రహ్లాద

సంవాదము, భారద్వాజ భృగు సంవాదము, యమ కాలమృత్యు భూసురేశ్వాకుల సంవాదము, మను బృహస్పతి సంవాదము, పంచశిఖ జనక సంవాదము, ఇంద్ర ప్రహ్లాద సంవాదము, ఇంద్రబలిచక్రవర్తి సంవాదము, ఇంద్రనముచిసంవాదము, శ్రీశక్ర సంవాదము, దేవలజైగీషవ్య సంవాదము, ఉగ్రసేనశ్రీకృష్ణ సంవాదము, శుకవ్యాస సంవాదము, అకంపన నారద సంవాదము, జాబాలి తులాధారుల సంవాదము, చిరకారి వృత్తాంతము, ద్యుమత్సేన సత్యవంత సంవాదము, కపిల గో సంవాదము, కుండధార వృత్తాంతము, జనక మాండవ్య సంవాదము, జ్వర వృత్తాంతము, నారద గాలవ సంవాదము, అరిష్టనేమి సగర సంవాదము, జనక పరాశర సంవాదము, వసిష్ఠ జనక సంవాదము, యాజ్ఞవల్క్యజనక సంవాదము, జనకసులభా సంవాదము, శుక చరిత్రము, నారాయణనారద సంవాదము, ఉపరి చరవసువు చరిత్రము, ఏకద్వికత్రితులకు బృహస్పతికి నైన 'సంవాదము — పేర్కొనదగినవి. శాంతనవగీత కీసంవాదోపాఖ్యానములు ప్రామాణికత్వమును కల్పించుచున్నవి; అపూర్వ ధర్మజ్ఞాన సంకలన గ్రంథ ప్రశస్తిని ప్రతిపాదించు చున్నవి.

మోక్షధర్మములు చెప్పెడి సంవాదోపాఖ్యానములలో జనకమహర్షి సంబంధించినవి బహుళముగా గాననగుచున్నవి. జీవన్ముక్తుడైన ఆ రాజర్షి పార మార్థిక చింతనమున నాధ్యాత్మవిద్య పరిమళములను వెదజల్లినది.

తే. 'నరుఁడు సుఖదుఃఖముల వెంటఁ బొరయనీక
మలఁచి యాత్మునిఁ జేర్చిన మానసంబు
లీన మగు నంద జలములలోన నిడిన
లవణకణము చందమ్మున నవనినాథ!' 4.357

అనెడి పంచశిఖుని ప్రబోధ మా రాజర్షియందు వైరాగ్యమును గలిగించినది.

'దొరకొన్న ననుభవించుచు
దొరకొనమికిఁ జింత నొంది దురపిల్లక ని
ర్భరుఁడై యున్నను దృష్టకుఁ
జొరవచ్చునె యతని మనసు సుప్రతశీలా!' 5.376

అను మాండవ్యమహాముని యుపదేశ మాతనిలో తృష్ణారాహిత్యమును గలిగించినది.

'ఇనరుచిఁ బాషాణము ర
శ్మినిరూఢం బైన యట్ల చిత్తము సదా
వనమున సదాత్మకం బగు
ననామయసితికి మూల మది మనుజేం(దా!' 5.529

అను పరాశరగీతా తాత్పర్య మాతని చిత్తమున కనామయస్థితిని గల్పించినది. వసిష్ఠుని తత్త్వబోధవలన జనకునకు—

'మమతం గాదే బహు జ
న్మము లయ్యేఁడు దీని విడిచి నానాయోని
భ్రమణంబుం బాసెద న
త్యమలుఁడ నగు నాకుఁ బ్రకృతియాశ్రయ మేలా?' 6.53

అను వివేక ముదయించినది.

'జలముఁ గదిసియుండ జలముచే నార్ద్రింబు
గాక యుండునట్టి కమలదళము
భంగి నంతరాత్మ ప్రకృతిఁ బొందియును ద
ద్వికృతిఁ బొందకుండు వీతదోష!' 6.109

అను యాజ్ఞవల్క్యవచన మాతనిని జీవన్ముక్తుడైన రాజర్షిగా తీర్చిదిద్దినది. జనకుఁడు జీవన్ముక్తుఁ డగునా కాదా యని పరీక్షింప వచ్చి విఫలురాలైనది సులభ. సులభ యాతని గూర్చి యొనర్చిన ప్రశంస ఆతని ముక్తావస్థ కబ్బిన మౌక్తిక కిరీటము.

'అగ్ని వెచ్చనో చల్లనో యని మనమునఁ
గరము సందియ మందుటగాదె నిన్ను
నధిప ముక్తుండవో కావో యని తలంచు
టది మదీయ బాలిశభావ మని తలంపు' 6.216

శాంతనవ గీతాకాశమున జనకుడు సూర్యునివలె ప్రకాశించుచుండ, శుకుడు చంద్రునివలె వెలుగుల జిమ్ముచున్నాడు. వ్యాసుడు శుకుని కన్నతండ్రి, జనకుడాతని బోధగురువు, ఇరువురిబోధ లా శుకునియందు అధ్యాత్మవిద్యాసంస్కారమును ప్రవర్థిల్ల జేసినవి. పుట్టిన తోడనే తండ్రి జీవాత్మ స్వరూపము నెఱిగించుచు దానిని పంజరబద్ధమైన శుకముగా బోల్చి చెప్పినాడు.

'నురువున నొనరించిన పం
జరంబులో నున్న పులుఁగు చాడ్పున మేనం
బురుషవర! జీవ ముండుట
పరికింపక యేమఱంగఁ బాడియె నీకున్' 6.223

ఆ ప్రబోధ మాతని దృష్టిని ఆత్మవైపు మరలించినది. ఆత్మాన్వేషకు డైన శుకునకు జితేంద్రియత్వమును చిత్రముగా బోధించినాడు తండ్రి.

'ధన మది యేల భోగమును దానము లేదగునేని; శత్రుమ
ర్దన మొనరింపఁడేని బలదర్పము లేల; నధర్మవృత్తికిన్
గొనకొన డేని విక్ర మునికుంజర! యేల; జితేంద్రియుండు గా
డనఁ జనునేని నాత్మవిధ మారయు నాక్రమ మేల చెప్పుమా!' 6.243

శుకుడు జితేంద్రియుడై తండ్రిని మోక్షమార్గమును బోధింపు మనికోరినాడు. జనకుడా శుకునకు జనకమహారాజును చూపినాడు. అత డాతని నాశ్రయించినాడు.

'కోరిక యు నొల్లమియు లే
కేరూపున భూతములకు నెగ్గను తెఱఁగుం
జేరక యకామవృత్తిఁ ద
పోరతి నున్నతఁడు బ్రహ్మముం బ్రాపించున్'. 6-234

అను జనకుని ప్రబోధ మాతనికి బ్రహ్మపాప్త్యుపాయము నందించినది. ఆపై శుకునకు నారదమహర్షి మోక్షమును గను నేరిమిని బోధించినాడు. శుకుడు యోగసిద్ధిని గాంచి యదృచ్ఛుడై ఆకాశ గమనము సాగించినాడు. అతని గమనమునకు పర్వతములు సైతము పటాపంచలై పోయినవి. నిర్మోహు డైన అతని

గాంచి అమరగంగా నదిలో తానమాడు అప్సరసలు కూడ శంకింపరైరి. పుత్రుని నన్వేషించుచు నాతని వెంట నరుదెంచిన వ్యాసుని గాంచి కాంతలు లజ్జాతిశయ మున పరిధానములను ధరించిరి. శుకుడు వాయుపథము నతిక్రమించి బ్రహ్మతేజో మయుడై దేవతలు పొందరాని పరమగతి ప్రాపించెను. పుత్రశోకావిలుడైన వ్యాసునకు పార్వతీపతి శుకమాహాత్మ్యము నెఱిగించి కలంక తీర్చెను.

'ఇలయు గిరులును శరధులు నెంతదాక
గలుగు నంతకాలంబును వెలయుచుండు
శుకుని కీర్తియు నీదు యశోవిభూతి
యును జనంబుల వీనుల కుత్సవముగ' 6-341

ఆని సదాశివుడు ప్రకటించినాడు. అట్టి శుకచరిత మీ పర్వమున శ్రోత్ర పర్వము. మిగిలిన కథ లన్నియు చుక్కలు. దానిలో చంద్రుడు శుకోపాఖ్యా నము.

తత్త్వబోధార్ణవ మైన శాంతిపర్వమునకు వ్యాఖ్యలు కూడ వెలసినవి.. 'అర్జున మిశ్రుని భారతార్థదీపిక, నీలకంఠుని భారతభావదీపిక, పరమానంద భట్టా చార్యుని మోక్షధర్మటీక, విద్యాసాగరుని వ్యాఖ్యానరత్నావళి (ఇది మోక్షధర్మ విభాగమునకే గలదు), వాదిరాజుని లక్షాలంకారము (ఇది శాంతిపర్వమున కంత కును వాఖ్య), దేవబోధుని జ్ఞానదీపిక, విమలబోధుని దుర్ఘటార్థ ప్రకాశిని (ఇది శాంతిపర్వము నంతను వ్యాఖ్యానించుచున్నది.)' ప్రసిద్ధములు. 'భారతము లక్ష్మీ పతి సోమయాజి 'మహాభారత కూలంకష' వాఖ్యయు, తెలుగునందు నేలటూరి పార్థసారథి అయ్యంగారి 'ఆమ్నాయకళానిధి' వాఖ్యయు, తెలియవచ్చుచున్నవి.[11]

శాంతిపర్వమున విష్ణు మహత్వము ప్రతిపాదింపబడినది. భీష్ము డొనర్చిన శ్రీకృష్ణస్తవ మాతత్త్వమున కారాధన విశేషము. శ్వేతద్వీపవాసి యగు నారాయ ణుడే స్వయముగా నారదమహర్షి కుపదేశించిన తత్త్వము నారాయణ పరతత్త్వము.

---

11. శ్రీమదాంధ్ర మహాభారతము - సంశోధిత ముద్రణము - పీఠిక - ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనము గారు. పుట. 4.

'ఇంద్రియంబుల కందఁ డెల్లభూతంబులుఁ
దెగినను దెగకుండుఁ ద్రిగుణరహితుఁ
డఖిలంబునకు నాత్మ యన సర్వసాక్షి నా
నఁజుఁ డన నిష్కలుం డన వెలుంగు
క్షేత్రజ్ఞుఁ డాతండు జీవుండు వాసుదే
వుండును సంకర్షణుండుఁ జూవె
వారు మనం బహంకారంబు వరుసఁ బ్ర
ద్యుమ్నానిరుద్ధ నామోపహితము

లింతయును మన్మయంబ యే నిరువదియును
నాల్గు నగు తత్త్వకోటికి నాథుఁ డైన
పంచవింశకాభిఖ్యుండఁ బరమపురుషుఁ
డనియు నాపేరు మఱి పరమ మఱయ లేదు'. 6.381

ఆ నారాయణుడే శివునితో హరిహరాభేదము నిట్లు తెల్పినాడు—

'నిను నెవ్వఁడెఱిగె నాతఁడు
నను నెఱిఁగినవాఁడ నిన్ను నమ్మిగ సేవిం
చిన నదియ నన్నుఁగొల్చుట
యనువాదిత లేదు భేద మరయఁగ మనకున్' 6.451

బ్రహ్మ- 'విష్ణుం డనఁగా శివుఁడన నొకఁ డొట దివ్యచిత్తమ యెఱుఁగన్' అని శివకేశవాద్వైతమును దర్శించినాడు. కవిబ్రహ్మయైన తిక్కన అద్వైతదృష్టికిని పరమునకు పేరేదై నను పరమార్థ మొక్కటియే. అతనికి అభిధానములు పరమ పదారోహణకు సోపానములు. భవ దుఃఖసాగర తరణోపాయములు. వేదవ్యాసు డెన్ని పేరులతో నా పరతత్త్వమును పిలిచినను హరిహరాభేద తత్త్వమున కవి వాఙ్మయాలంకారములే.

'భవదుఃఖభర నిరాస
ప్రవీణ నానాభిధాన పారాశర్య

స్తవనీయ గుణనిధాన ! స
మవబోధ నిరంతరావిదిత్మాధీనా!'

అని తిక్కన హరిహరనాథుని స్తుతించినాడు. అ సర్వాత్ముని జ్ఞానరూపునిగా నుపాసించుటకు లోకమున కందించిన ఊత! శాంతనవగీత !

'గీకారం త్యాగరూపం స్యా త్తత్త్వబోధం తకారకమ్ ।
గీతావాక్య మిదం తత్త్వం జ్ఞేయం సర్వముముక్షుభిః ॥'

'గీ' అనగా త్యాగము, 'త' అనగా తత్త్వజ్ఞానము. ధర్మజునకు శోకత్యాగము తత్త్వజ్ఞానము కలుగవలెనని చెప్పిన దీ గీత! వ్యాస హంసాది గీతలను తనలో నిమిడ్చుకొనిన బృహద్గీత ఈ శాంతనవగీత!!

శ్రీమదాంధ్ర మహాభారత పఠనమే యొకవిశేషము. దాని తత్త్వమును గూర్చి ప్రవచించుట అంతకంటె విశేషము. అందును శాంతిపర్వమును గూర్చి చర్చించుట మఱియు విశేషము. అధికారము చాలకపోయినను భారతముపై గల ఆదరభావముచే నే నీ పర్వ పరిష్కారమునకును, పీఠికా రచనకును పూను కొంటిని. ఇందు నాభక్తియే ముఖ్యము గాని నాశక్తి కాదు. విజ్ఞులు నా సాహస మునకు మన్నింప వేడుకొనుచున్నాను.

ఈ పర్వ పరిష్కారమునకు ప్రమాణముగా గొనిన గ్రంథము "ఆంధ్ర మహాభారత సంశోధిత ముద్రణ" ప్రతి. తత్ప్రచురణకర్తలైన ఉస్మానియా విశ్వవిద్యాలయమువారికి నా కృతజ్ఞతలు.

నా కిట్టి మహదవకాశమును గల్పించిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యవర్గమునకును, తదధ్యక్షులు పూజ్యులు డా॥ బెజవాడ గోపాలరెడ్డి గారికిని, కార్యదర్శులు మాన్యులు శ్రీ దేవులపల్లి రామానుజరావు గారికిని నా కృతజ్ఞతాభి వందనములు.

హైదరాబాదు
1-1-1977

జి. వి. సుబ్రహ్మణ్యం

విషయసూచిక

శాంతిపర్వము - ప్రథమాశ్వాసము

విషయము	పుట
మహర్షులు పాండవులం జూడ వచ్చుట	1
నారదుండు ధర్మరాజునకుఁ గర్ణుని చరితంబు సెప్పుట	4
ధర్మరాజు స్త్రీలకు రహస్య రక్షణంబు లేకుండ శపియించుట	9
అర్జునుఁడు ధర్మజున కుచితవచనంబుల మనస్తాపోపశమంబు సేయుట	10
నకులుఁడు ధర్మజునకు మనస్తాపోపశమంబు సేయుట	16
ద్రౌపది ధర్మజునకు హితవచనంబుల మనస్తాపోపశమంబు సేయుట	18
జనకున కతని సతితో నైన సంవాదం బర్జునుఁడు ధర్మజునికిఁ జెప్పుట	25
దేవస్థానుం డను ముని ధర్మజునకు హితోపదేశంబు సేయుట	27
పారాశర్యుఁడు సుద్యుమ్న చరితంబు ధర్మజునకుఁ జెప్పుట	30
లిఖితుండు సుద్యుమ్ననిచేత నిక్కృత్తకరుం డగుట	31
పారాశర్యుఁడు ధర్మజునకు సేనజిత్తువాక్యంబు లుపన్యసించుట	35
జనకున కశ్మకుండు సెప్పిననీతి వ్యాసుఁడు ధర్మజునకుఁ జెప్పుట	39
ధర్మరాజునకుఁ గృష్ణుఁడు షోడశరాజుల చరిత్రంబులు సెప్పుట	43
శ్రీకృష్ణుఁడు ధర్మజునకుఁ బర్వత నారదుల వృత్తాంతంబు సెప్పుట	50
శార్దూలంబుచేఁ జచ్చిన, సువర్ణష్ఠీవి నారదువలనఁ బునర్జీవితుఁ డగుట	55
కృష్ణద్వైపాయనుఁడు ధర్మజునకు ధర్మాధర్మంబు లెఱింగించుట	59
వ్యాసుఁడు ధర్మజునకుఁ బ్రాయశ్చిత్త విశేషంబు లెఱింగించుట	62
కృష్ణద్వైపాయనుఁడు ధర్మజునకు నపాత్రపురుషుల నెఱింగించుట	67
ధర్మరాజు సపరివారంబుగాఁ గరినగరంబు ప్రవేశించుట	71
చార్వాకుండను రాక్షసుఁడు బ్రాహ్మణనిగ్రహంబునఁ జచ్చుట	73
ధర్మజుఁడు శ్రీకృష్ణ నుచితవచనంబుల స్తుతించుట	80

శాంతిపర్వము - ద్వితీయాశ్వాసము

ధర్మనందనుని ప్రవర్తనము 84
ధ్యానాసక్తుడైన శ్రీకృష్ణునిం గని ధర్మజుఁడు సంభాషించుట 85
భీష్ముఁడు శ్రీకృష్ణుని భక్తియుక్తుండై స్తుతించుట 88
శ్రీకృష్ణుఁడు ధర్మజునకుఁ బరశురాముని చరిత్రంబు చెప్పుట 97
పరశురాముఁడు కార్తవీర్యార్జునిఁ జంపుట 99
భూదేవి కశ్యపునితోఁ బరశురామునిచేఁ జావనిరాజులఁజెప్పుట 102
కృష్ణుఁడు ధర్మజునకు ధర్మము లుపదేశింప భీష్మ నియమించుట 105
ధర్మరాజు కృష్ణాదులతోడ భీష్మపాలికిం బోవుట 109
భీష్ముడు ధర్మరాజును సప్రేమంబుగా గారవించుట 113
భీష్ముఁడు ధర్మజునకు విప్రులలో దండార్హుల నిరూపించుట 116
భీష్ముండు ధర్మజునకు దండనీతి జన్మప్రకారం బెఱింగించుట 121
వైన్యుండనురాజు చరిత్రంబు భీష్ముఁడు ధర్మజునకుంజెప్పుట 124
భీష్ముఁడు ధర్మజునకు వర్ణాశ్రమ ధర్మంబు లెఱింగించుట 127
రాష్ట్రీజనుల కర్హధర్మంబులు భీష్ముఁడు ధర్మజునకుఁ దెలుపుట 132
బృహస్పతి వసుమనుండను రాజునకుం జెప్పిన రాజధర్మప్రకారము 135
వాయుదేవుఁడు పురూరవునకుఁ జెప్పిన రాజధర్మప్రకారము 142
వాసుదేవునకు ముచికుందునకు గలిగిన సంవాదము 144
కేకయరాజ రాక్షస సంవాదప్రకారము 148
కాలకవృక్షీయశ్రేష్ఠమదర్శి సంవాద ప్రకారము 152
బండారంబు వృద్ధిసేయు తెఱంగు భీష్ముఁడు ధర్మజునకుఁ జెప్పుట 157
మాంధాతృన కుతథ్యుఁడు సెప్పిన హితవాక్యముల ప్రకారము 159
వసుమనుండను రాజునకు వాసుదేవుండు సెప్పిన ధర్మప్రకారము 160
ధర్మజునకు భీష్ముండు సమరంబున పాడిదెల్పుట 162
ఇంద్రాంబరీష సంవాదప్రకారము 164
సమరానివర్తనంబు వలని ఫలము 167

శాంతిపర్వము - తృతీయాశ్వాసము

కాలనిరూపణాదులగు రణోపాయంబుల ప్రకారంబు 169
ధర్మజునకు భీష్ముఁడు శకునాపశకునములఁ దెల్పుట 172
రాజు పగఱయెడ నుండవలయు విధము 173
కాలకవృక్షీయమహాముని క్షేమదర్శికిఁ జెప్పిన హితవాక్యములు 174
ధర్మజునకు భీష్ముండు గణజనులఁ బాలించు ప్రకారంబు సెప్పుట 177
ధర్మరాజునకు భీష్ముండు ధర్మసూక్ష్మత తెఱం గెఱింగించుట 178
పాపనిస్తరణ ప్రకారము 179
వ్యాఘ్రగోమాయువు సంవాదము 181
భీష్ముండు ధర్మజునకు సహాయ సంపన్నత్వం బావశ్యకం బగుట సెప్పుట 185
సముద్ర సరిత్సంవాదము 186
కుర్కుర నీచత్వముం దెలుపునట్టి యితిహాసము 187
భీష్ముఁడు ధర్మజునకు దండనీతి ప్రభావం బెఱింగించుట 191
వసుహోముఁడు మాంధాతృనకుఁ జెప్పిన దండోత్పత్తి ప్రకారము 192
భీష్ముఁడు ధర్మరాజునకు ధర్మార్థ కామంబుల తెఱం గెఱింగించుట 195
భీష్ముఁడు ధర్మజునకు సుమిత్రుఁడను రాజుచరిత్రంబు సెప్పుట 200
భీష్ముఁడు ధర్మజునకుఁ గాపవ్యోపాఖ్యానము సెప్పుట 204
భీష్ముఁడు ధర్మజునకు దీర్ఘదర్శి మొదలగు మత్స్యముల తెఱంగెఱింగించుట 206
పలితరోమశులను మూషికమార్జాలంబుల సంవాదప్రకారము 209
బ్రహ్మదత్తునితోఁ బూజని యను శకునికైన సంవాద ప్రకారము 215
కణికుఁడు శత్రుంజయున కుపదేశించిన హితవచనముల ప్రకారము 219
విశ్వామిత్ర చండాల సంవాదము 221
భీష్ముఁడు ధర్మజునకు శరణాగతరక్షణ సుకృతం బెఱింగించుట 225
కపోతంబు దన శరీరమును బోయ కాహారంబుగా నిచ్చుట 228
భీష్ముఁడు ధర్మజునకు గృధ్రజంబుకోపాఖ్యానము సెప్పుట 236
భీష్ముఁడు ధర్మజునకు బవన శాల్మలీతరు సంవాదంబులు సెప్పుట 239
భీష్ముఁడు ధర్మజునకు దమంబు ప్రభావం బెఱింగించుట 243
భీష్ముఁడు ధర్మజునకుఁ దపంబు విధము సెప్పుట 245

భీష్ముఁడు ధర్మజునకు సత్య స్వరూపాదులు సెప్పుట 245
భీష్ముఁడు ధర్మజున కరిషడ్వర్గాదులు దెలుపుట 246
భీష్ముఁడు నకులునకు ఖడ్గప్రభావంబు తెఱం గెఱింగించుట 250
ధర్మజునితో విదురాదులు ధర్మార్థకామంబుల తారతమ్యంబు సెప్పుట 252
భీష్ముఁడు ధర్మజునకు నాడీజంఘుని చరిత్రంబు సెప్పుట 255
నాడీజంఘుఁడు దుష్టబ్రాహ్మణునిచే మృతుండై మరల జీవించుట 259

శాంతిపర్వము - చతుర్థాశ్వాసము

భీష్ముఁడు ధర్మజునకు సర్వోత్తమంబగు ధర్మంబు సెప్పుట 265
మేధావియను బ్రాహ్మణకుమారుఁడు దన తండ్రితోఁ జేసిన సంవాదము 269
భీష్ముఁడు ధర్మజునకు మంకియను బ్రాహ్మణుని చరిత్రంబు సెప్పుట 272
అజగరచరిత వ్రతము 274
భీష్ముఁడు ధర్మరాజునకు బృథివ్యాదిభూతోత్పత్తి క్రమం బెఱింగించుట 279
భృగుమహాముని భరద్వాజునకుం జెప్పిన వర్ణాశ్రమాచారక్రమము 282
భీష్ముఁడు ధర్మజునకు నాచారవిధి యెఱింగించుట 286
ధర్మజునకు భీష్ముఁడు యోగప్రకారంబు సెప్పుట 288
యమ కాలమృత్యు భూసురేక్ష్వాకుల సంవాదము 289
కౌశికునకు నిక్ష్వాకుమహారాజునకు నయిన సంవాదము 291
కౌశికేక్ష్వాకులు బ్రహ్మపద ప్రాప్తులగుట 295
మను బృహస్పతి సంవాదము 296
బృహస్పతి మనువునకు ఉపదేశించిన మాయాప్రకారము 300
భీష్ముఁడు ధర్మజునకు విష్ణుమంత్ర ప్రభావంబు తెఱం గెఱింగించుట 303
భీష్ముఁడు ధర్మజునకు అధ్యాత్మ విద్యాప్రకారం బెఱింగించుట 313
భీష్ముఁడు ధర్మజునకుఁ గాలచక్ర ప్రభావం బెఱింగించుట 316
భీష్ముఁడు ధర్మజునకు స్వప్నాద్యవస్థల తెఱం గెఱింగించుట 329
పంచశిఖుండను విప్రుండు జనకునకు దత్త్వోపదేశంబు సేయుట 326
ఇంద్రప్రహ్లాద సంవాదప్రకారము 331
ఇంద్రబలి చక్రవర్తి సంవాదప్రకారము 334

ఇంద్రనముచి సంవాదప్రకారము 338
ఇంద్రబలి సంవాదప్రకారము 340

శాంతిపర్వము - పంచమాశ్వాసము

శ్రీ శక్రసంవాదప్రకారము 347
దేవల జైగీషవ్య సంవాదప్రకారము 350
ఉగ్రసేన శ్రీకృష్ణ సంవాదప్రకారము 352
వ్యాసుఁడు శుకునకుఁ జెప్పిన కాలావయవ నిరూపణము 353
చతుర్యుగ సంవత్సర పరిమితి ప్రకారము 355
దానగుణము సర్వవర్ణ సామాన్యంబుగా నిరూపించుట 361
వ్యాసుఁడు శుకున కుపదేశించిన పరబ్రహ్మప్రాప్తిసాధన ప్రకారము 365
బ్రహ్మచర్యంబు బ్రహ్మవిద్యాప్రాప్తికి ముఖ్యకారణంబని చెప్పుట 369
వ్యాసుఁడు శుకున కుపదేశించిన యంతర్యాగ ప్రకారము 372
ఇంద్రియ నిగ్రహం బుత్తమ ధర్మంబుగ నిరూపించుట 377
భీష్ముఁడు ధర్మజునకు మృత్యుదేవత తెఱం గెఱిఁగించుట 381
జాజలి తులాధారుల సంవాదప్రకారము 386
తులాధారుఁడు జాజలికిం జెప్పిన బ్రహ్మగీతలు 390
చిరకారి యను మునికుమారుని చరిత్ర 393
కపిల గో సంవాద ప్రకారము 398
కపిలుఁడు సూర్యమరీచికి వేదంబులు ముఖ్యప్రమాణంబులుగాఁ జెప్పుట 403
కుండధారుండను దేవానుచరుని వృత్తాంతము 406
నారద ప్రవర్తితంబగు నితిహాసము 409
భీష్ముఁడు ధర్మజునకు ముక్తిమార్గము దెల్పుట 410
జనకరాజ మాండవ్య మహామునుల సంవాదప్రకారము 412
పితాపుత్ర సంవాదము 413
హారీతుండు విద్వజ్జనుల కుపదేశించిన తత్త్వప్రకారము 415
వృత్రగీత 417
ఇంద్రవృత్రాసురుల యుద్ధప్రకారము 420

దక్షమఖధ్వంస-ము నప్పుడు శివునివలన జ్వరం బుద్భవించిన ప్రకారము 423
శాస్త్రత త్త్వం బెఱుఁగని వాఁడు సేయవలసిన విధము 426
అరిష్టనేమి యను ముని సగరున కుపదేశించిన ధర్మ్మప్రకారము 428
శుక్రనామంబు భార్గవునకుం గలిగిన విధము 430
జనకునకుఁ బరాశరముని యుపదేశించిన ధర్మ్మప్రకారము 431
జనకునకుఁ బరాశరముని వివరించిన హింసాహింసల ప్రకారము 437
హంసగీత 442
భీష్ముఁడు ధర్మజునకు యోగతంత్రప్రకారము చెప్పుట 447
భీష్ముఁడు ధర్మజునకు సాంఖ్యస్వరూప్ప నిరూపణంబు సేయుట 451
ఆత్మ పరమపదంబుఁ బ్రాపించెడు ప్రకారము 454

శాంతిపర్వము — షష్ఠాశ్వాసము

భీష్ముని ధర్మజుండు ప్రశంసించి యక్షరక్షరంబుల నడుగుట 459
వసిష్ఠ జనకరాజ సంవాద ప్రకారము 460
వసిష్ఠుఁడు జనకున కక్షరక్షర త త్త్వంబుల తెఱం గెఱింగించుట 464
విద్యావిద్యల ప్రకార నిరూపణము 467
యాజ్ఞవల్క్య జనకరాజ సంవాద ప్రకారము 473
అధ్యాత్మాధిభూతాధిదై వత ప్రకారము 475
యాజ్ఞవల్క్యుఁడు జనకునితో మరణ సూచకంబులఁ జెప్పుట 482
విశ్వావసునకు యాజ్ఞవల్క్యుఁ డుపదేశించిన త త్త్వ ప్రకారము 485
భీష్ముఁడు ధర్మరాజునకు జనక సులభా సంవాదంబు సెప్పుట 490
జనకుని ప్రశ్నంబులకు సులభ ప్రత్యుత్తరంబు లిచ్చుట 494
వేదవ్యాసుఁడు శుకున కుపదేశించిన వై రాగ్య ప్రకారము 499
భీష్ముఁడు ధర్మరాజునకు శుకుని జన్మప్రకారంబు సెప్పుట 503
జనకుఁడు శుకున కుపదేశించిన మోక్షధర్మ ప్రకారము 508
శుకుఁడు హిమవంతంబున నున్న వ్యాసునియొద్దకు వచ్చుట 511
నారదుఁడు శుకున కుపదేశించిన త త్త్వప్రకారము 515
వ్యాసుఁడు వెనుకొన శుకుఁడు యోగమార్గంబున నదృశ్యుండగుట 519

భీష్ముడు ధర్మజునకు నారదనారాయణ సంవాదంబు సెప్పుట	522
ఏకద్వితత్రితులు బృహస్పతికి విష్ణుదేవుమహిమ సెప్పుట	523
శ్వేతద్వీప వాసియగు నారాయణుండు నారదున కుపదేశించిన తత్త్వము	529
విష్ణుఁడదృశ్యరూపంబున బ్రహ్మాదిదేవతల కుపదేశించిన హిత ప్రకారము	534
భగవన్నామ నిర్వచన ప్రకారము	537
శివకేశవుల పరస్పర కోప ప్రసాదముల విధము	542
నరనారాయణ నారద సల్లాప ప్రకారము	545
హయగ్రీవదేవ మాహాత్మ్యాభి వర్ణనము	547
వైశంపాయనుండు జనమేజయున కేకాంతికధర్మ మెఱిఁగించుట	550
వేదవ్యాసునకు నారాయణ నందనత్వంబు గలిగిన ప్రకారము	555
ఇంద్రునకు నారదుఁడు సెప్పిన భృగునామక విప్రుని చరిత్రము	559
భృగుండను విప్రుండు పద్మాండను సర్పరాజుం గనవచ్చుట	562
పద్మాఁడను సర్పరాజు భృగుఁడను విప్రుం గానవచ్చుట	568
ఉంఛవృత్తిమహిమ	570

—: o :—

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము - ప్రథమాశ్వాసము

-: ○ :-

క. శ్రీ సంక్రామణనిపుణవి
లాసకటాక్షా: నివ్వ, త్తిలంపటచిత్తో
ల్లాసనదక్షా: వేద
వ్యాసవచోవిభవలక్ష్య : హరిహరనాథా : 1

మహర్షులు పాండవులం జూడవచ్చుట

సం. 12 - 1 - 1

వ. దేవా: వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె: నట్లు సకలబంధుమి త్రి జనంబులకు నుదకకర్మం బాచరించి పాండవులు గంగాతీరంబున నశుచిత్వం బపనయించుటకయి యొక్క సమస్థలంబునం బటకుటీరసంవిధానంబు సేయించి ధృతరాష్ట్రవిదురసర్వభరత భార్యా సమేతంబుగా నచ్చట మాస మాత్రంబు నిలిచి; రట్టియెడల కృష్ణద్వైపాయన నారద దేవల దేవస్థాణు కణ్వులు మొదలుగాఁ గల మునీంద్రు లనేకులు శిష్యవర్గసహితంబుగా ధర్మనందను సందర్శనంబునకుం జనుదెంచిన, నజ్జననాథుండు ప్రత్యుత్థానప్రణామ పాద్యాసనాకలనంబులను దత్కాలోచితార్చనంబులను నమ్మహాత్ములం బ్రీతులం గావించి కృష్ణనిజానుజయుక్తంబుగా వారల నుపాసించియుండ వారలు బహువిధంబు లగు ప్రియవచనంబుల నక్కురువంశసత్తము సంభావింప నారదుం డమ్మహనీయద్విజులం గలయం గనుంగొని యక్కొంతే యాగ్రజుతోడం దాను గుశలప్రశ్నంబు లగుమాట లాడంగలవాఁ డగుట వారి కెఱింగించి యమ్మహీపతి యాననం బాలోకించి. 2

శా. గోవిందుం డనిశంబు శోభన మెదం గోరంగ బార్థుండు వ
ర్ష్మావేశోజ్జ్వల బాహుసారమహనీయస్ఫూర్తి శోభిల్ల గాం
డీవోల్లాసవిభాసియై సమరపాండిత్యంబు వాటింప సం
భావింపన్ జగ మెల్ల రాజ్య మిటు లొప్పం గొంచె రాజోత్తమా! 3

చ. భువనభయంకరంబు లగు పోరుల, దమ్ములతోడ, గూడ నీ
వు వెడల, బాటు లెస్స యలవుం జలమున్ వెలయించుచోట ధ
ర్మ్మవున కొకింతయుం దొలగ, ద్రొక్కఁ యెంతయు మేలు; దీన, గౌ
రవకులముఖ్య! యుమ్మలిక గ్రాచితె; చిత్తము, బ్రీతి, బొందెనే? 4

వ. అనిన విని యజ్జనవిభుం డమ్మునివిభున కిట్లనియె: 5

సి. కృష్ణుండు మామీద, గృపసేయుటయు, బ్రాహ్మ
ణానుగ్రహంబున ననిలపుత్ర
పార్థులపటుబాహుబలమున మేదిని
యంతయు, జేకుఱు నట్టిదయ్యె;
నైనను నతిఘోర మగు నఖిలజ్ఞాతి
వధ మొనరించుటవలన నధిక
గుణుని సౌభద్రునిఁ గులభూషణంబుఁ బాం
చాలీతనూజపంచకముఁ గోలు

తే. పోకఁజేసియు గెల్పు గెల్పుగ మదీయ
బుద్ధి గైకొనదయ్యెడు సిద్ధముఖ్య!
యదియుఁగాక వేఱొక్కండు మదిఁ గలంచు
చున్నయది; దాని నేర్పడ విన్నవింతు.

చ. ఘనభుజవిక్రమోన్నతుఁడు కౌరవకోటికిఁ బట్టుకొమ్మ మ 6
మ్మనిమొనఁ దూలపుచ్చిన మహాత్ముఁడు గర్ణుఁడు గొంతితొల్త చూ
లని యుదక్పదానసమయంబున నాయమచేత వింటి నా
తని కుదకంబు లిచ్చుటకుఁ దా మనుఁ బంచుట గోరి చెప్పినన్. 7

వ. అప్పుడు దొడంగి యంతరంగంబు నిప్పలం బొరఁటిన ట్లయ్యెడి; నక్కాంతీ
మహాదేవి దాను దివాకరువరంబున నప్పురుషవరుం బడసి పాఱవైచుటయుం,

బిదప నతండు ధార్తరాష్ట్రులపాల దొరయై యుండ మాకును వారికిం
గలహంబు పుట్టిన నది మాన్పించుటకై యక్కొడుకుకడకుం జని యేకాం
తంబునం బుట్టువు దెలుపుటయు, లోనయిన తద్విషయవార్త లనుదినంబును
జెప్పుచుండు. 8

సీ. ఆయమ దనపుత్రుఁ డవుట యెఱింగించి
'తమ్ములలోనికి రమ్ము నీవు'
నావుడు నాతండు 'నాకుఁ గృతఘ్నత
వాటిల్లదే కురుపతిఁ దొఱఁగి
వచ్చిన; నదిగాక వాసవితోడిక
య్యంబున కితఁ డోడె ననరెఁ యతఁడు
బెరయనొండెను నన్ను బెరసియుండెను నేవు;
రింతియకాని నీ వెపుడు సీకుఁ

ఆ. దనయు లార్వు రనకు' మనియె నిద్దేవి'ద
క్కనుజు లెల్లవారి కభయ మొసఁగు'
మనిన 'నట్లకాక' యని మమ్ము నలువురఁ
బట్టిఁ గాని తెగఁడ ప్రాణములకు. 9

ఆ. తొల్లి తాన దాఁచెఁ దల్లి; పదంపడి
యతడు సెప్పవలవ దనఁగ దాఁచె;
నిట్లుగాగ నెఱుఁగ మేవురమును నతం
డిట్టిఁ డగుట; దాన నింత వుట్టె. 10

క. ఆతఁడు దుర్యోధనునకుఁ
బ్రీతిగ జూదంబునాఁడు పెక్కొడెను ధ
ర్మైతరములు; వానికి మ
చ్చేతోగతి కోపభరము సెందక యుండున్. 11

ఆ. అతనిమేను కుంతియట్టులకైవడి
యరయ నేను జూచి యాత్మ నెద్ది
కారణంబొ యిట్లు గా ననుచుండుదు;
నేమి సేయువాఁడ నింకఁ జెపుమ ! 12

క. కౌరవులు సేయు నవమతి
కారణముగఁ గోప మెత్తుఁ, గర్ణునివదనాం
భోరుహముం గనుఁగొన శమ
మారున్ నావశముగాక యంతన బుద్ధిన్. 13

ఉ. గాండివి నొవ్వఁబల్కి తిటు: 'గర్ణునిఁ జంపక వచ్చితేని త
మ్ముండవు గావు నాకు' నని మూర్ఖత; సోదరఘాతి నైన క
ష్టుండ; మనంబునం బెఱుగు శోకము నెట్లు సహింతుఁ? దప్పె; నా
తండును నేము నైన విబుధప్రకరంబును మాకు నడ్డమే! 14

వ. అని పలికి, 'మునీంద్రా! యమ్మార్తాండనందను రథచక్రంబు భూమిం గ్రుంగు టకుం గారణంబెద్ది? దాని, నవ్వీరుండు పరశురాముని చేత శప్తుం డయిన తెఱంగును నెఱింగింపవలయు; భువనంబుల వర్తనంబులు నీకుం దేటపడని యవి లేవు; గావున ని న్నడిగెద' - నని ప్రార్థించుటయు 'నవ్విధం బంతయు వివరించెద విను' మని యమ్మహీపతి కమ్మహాత్ముం డిట్లనియె:

—: నారదుండు ధర్మరాజునకుఁ గర్ణునిచరితంబు సెప్పుట :—

సం. 12-2-1

సీ. మునిదత్తమగుమంత్రమునఁ గొంతి కన్నియ
నాఁడు వేడుక దివనాథుఁ దనకుఁ
బ్రత్యక్షముగఁ జేసి పడయుటఁ దా సిగ్గు
పెంపున సుతు వెలయింప దయ్యెఁ;
గన్యాత్వవికలత గాకుండఁ దా సూర్య
వరము గల్గుటఁజేసి వంశవర్య
యై పొల్చె; దేవరహస్య మిత్తెఱఁ; గిట్లు
పాఱవైవఁగఁ బడ్డపట్టి సూతుఁ
తే. డెత్తికొనిపోయె; సూతజుం డితఁ డనంగఁ
బెరిఁగి, కర్ణుండు నీనేర్పు భీములావు
నరునివిలుబల్మి యతనికి హరికిఁ గలుగు
చెలిమి గని తద్ద వగఁ బొందుఁ జిత్త మెరియ. 16

క. నకుల సహదేవ నయ శా
స్త్రకళావేదిత్వమునకు జను లనురాగా
ధికులై మిమ్మిం గొనియా
టకు నాతఁడు మనసు చేఁ్యడం జింతిల్లున్. 17

వ ఇని తదీయస్వభావం; బట్లుంగాక దై వఘటనంబు నట్టిద; యమ్మాత్సర్యంబున నక్కర్ణుండు మీయెడ నీసు గలవాఁ డయి దుర్యోధనుం గూడికొనియెఁ; బదంపడి ధనంజయు ధనుర్విద్యాతిశయం బుపలక్షించి, కుంభసంభవుపాలికిం జని, యేకాంతంబున దనకు బ్రహ్మాస్త్రంబు సాంగోపాంగంబుగా నుపదేశింప వలయు నని యడిగి,'యేను సమరంబున సవ్యసాచికి సమానుండ నగుటఁ గోరి వచ్చితి; నీవు సర్వశిష్యసమాదరుండవు; భవత్ప్రసాదంబునం గృతాస్త్రుండ నయి వెలయవలదే' యనవుడు నద్దిననాథనందనునకు నగ్గురుం డిట్లనియె: 18

తే. వ్రతసమన్వితభూసురవర్యుఁ డొండె,
నిరుపమాన తపఃపుణ్యనృపతి యొండెఁ
గాని యన్యులు బ్రహ్మాస్త్రదానమునకుఁ
బాత్రములు గారు; నీకు నీఁ బాడి గాదు. 19

వ. అనుటయు, నట్లకాక యని నిజమందిరంబునకుం జని, మఱునాఁడు గదలి మహేంద్రమహీధరంబున కరిగి పరుశురాముని గాంచి వినయంబునం బ్రణమిల్లి, 'యేను బ్రాహ్మణుండ, భృగువంశజాతుండ, నస్త్రవిద్యాపేక్ష నిన్నాశ్రయింప వచ్చితి' ననిన నమ్మునివరుండు ప్రీతుండై కర్ణుం బరిగ్రహించి, యస్త్రపరిశ్రమంబు సేయించుచుండె; నట్టియెడ నాశ్రమపరిసరంబున నొక్కచోఁ దనయంతన లాఘవాభ్యాసంబు సేయుచుండ నొక్కమహా ద్విజుని హోమధేనువువత్సం బడ్డంబు వాఁజి బాణగోచరంబై మృతిం బొందిన గని యవ్విప్రుండు గోపంబున శాపం బిచ్చిన, దానం దేరు ధరణిం గ్రుంగె; జామదగ్న్యుండు శపించిన తెఱంగునుం జెప్పెద; నవ్వీరుం డతనికి భక్తుండై పరిశ్రమం బాచరింప నతండు బ్రహ్మాస్త్రంబు లోనుగా ననేకాస్త్రంబు లొసంగెఁ; బదంపడి యొక్కనాఁడు. 20

తే. కర్ణునుత్సంగమున మస్తకంబుఁ జేర్చి,
గురుఁడు నిద్రింప వికృతాతిఘోరరూప
మళకమనియెడు నొకకీట మద్దినేంద్ర
తనయుక్రీఁదొడఁ దొలిచె సత్వరముగాఁగ. 21

వ. అతండును గురునకు నిద్రాభంగం బగుట కోర్వక ధైర్యంబునం గీటకృతంబున కోర్చి యచలుండై యుండె; నెత్తు రొండంద పరఁగి పరుశురామశరీరంబు సోఁకిన, నమ్మహాత్ముండు మేల్కాని 'రక్తం బెక్కడి' దని యడిగినఁ, దొడయెత్తి కీటంబుం జూపి 'యిది దొలుచు చుండ మీనిదుర సెడుటకుం జాలక కదలకుండితి' ననియె; నమ్ముని గనుంగొనిన నక్కీటంబు. 22

క. మృతిఁబొంది రాక్షసుండై
ఖతలంబుననుండి పలుకుఁ 'గరుణాకర! నీ
కతమున దారుణశాప
ప్రతిహతి వాటిల్లె; నిపుడు ప్రకృతి వడసితిన్'. 23

వ. 'గ్రస్తుండను పేరం బరఁగు నొక్కరక్కసుండ; భృగుపత్ని నపహరించి తదీయ శాపంబునఁ గీటంబనై యుండి, భవదీయవిలోకనామృత సేకంబున సుఖినైతి' నని చెప్పి, నమస్కరించి నిజేచ్ఛం జనియె; రాముండు రాధేయుధైర్యంబు మనంబున నిరూపించి యతనితోడ. 24

క. 'ఈతాల్మి లేదు బ్రాహ్మణ
జాతికి; నీవెవ్వఁడవు నిజం' బనవుడు 'నే
సూతజుఁడ' ననియె వెఱచుచు
నాతం; డామునివరేణ్యుఁ డతికుపితుండై. 25

వ. 'నీవు బ్రాహ్మణుండ నని కపటంబున మత్పరిగ్రహంబు వడసితివి తత్ఫలం బనుభవింపు' మని యస్త్రవిద్యావిభవంబు వికలంబుగా శపియించెఁ; గర్ణుండును జేయునది లేక వగచుచు వచ్చి దుర్యోధనుం గాంచి, 26

ఆ. 'అధిపఁ! పరశురాము నాశ్రయించితిఁ, గృతా
స్త్రుండ నైతి, నన్ను భండనమున
మార్కొనంగలేరు మగ లిజ్జగంబున'
ననుడు నతఁడు ప్రముదితాత్ముఁ డయ్యె. 27

వ. ఇవి మీయన్న వోయిన పోక;లిట్లు దుర్యోధనునకు ననుం గైయుండఁ,గళింగపతి
యగు చిత్రాంగదుండు శుభాంగి యను నిజప్రుతికి స్వయంవర మహోత్సవంబు
సేయించు వాఁడై చాటించిన, శిశుపాలుండును నీలుండును జరాసంధుండును
రుక్మియు లోనుగా రాజు లనేకులు తదీయ రాజధాని యగు రాజపురంబునకుం
జనిరి; దుర్యోధనుండును దోహలంబున సముచితచతురంగ బలసమేతుండును
గల్పితరథారూఢుండును గర్ణసహాయుండును నై యరిగె; నట్లు గూడిన భూపతు
లకుం దగుసంవిధానంబు లాచరించి, 28

సీ. కాళింగుఁ డాత్మీయ కన్యాస్వయంవర
కార్యంబు నడప, నక్కన్యసఖులు
దాదులు పేర్వేర ధరణీపతులఁ జూపి
చెప్పంగఁ జూచుచుఁ జేతఁ బుష్ప
మాలిక యొప్పఁ దన్మధ్యవీథికి నల్ల
నడచుచు గురుపతిఁ గడచి పోయె;
నతఁ డల్లి యచ్చపలాక్షిఁ బోనీ కాఁగి
పట్టి, రథంబుపైఁ బెట్ట బనిచి, 29

ఆ. యేఁగుచున్న, రాజులెల్ల సంక్షోభించి,
కూడుకొని యుదగ్రఘోరభంగిఁ
దాఁకి; రవ్విభుండుఁ దలఁకక బల శౌర్య
ములు పొగడ్త కెక్కఁ బోరె నధిప! 30

వ. అట్టియెడ.

శా. భల్లంబుల్ వరఁగించి యుగ్రముగ భూపాలోత్త మాంగంబులన్
డొల్లం జేయుచుఁ జిత్రలాఘవము నాటోపంబు దర్పంబు రా
జిల్లం గుంభిఘటారథప్రజహయశ్రేణీపదాతిప్రతా
నోల్లాసంబుల రూపుమాపుచు నవార్యం డయ్యెఁ గర్ణుం డనిన్. 31

వ. ఇవ్విధంబున విక్రమించు నవ్వీరవర్యునిశౌర్యబాహువీర్యంబులకు భయం బుఁ
గొని హతశేషు లయిన భూపతులు పఱచినం బ్రీతుం డగుచు నక్కుమారు
కుమారుండు గన్యారత్నంబుఁ గొని కరినగరంబున కరుగుదెంచె; నప్పగ
మనంబునఁ బెట్టికొని పదంపడి జరాసంధుం డక్రమబంధుపుత్రు నెక్కటి
పోరికిం బిలిచినం బోయి. 32

సీ. ఎక్కఁటెక్కఁటి పోరి యిద్ధ దివ్యాస్త్రసం
చయవంతుఁ డగు జరాసంధు బాణ
ధనురాది వివిధ సాధనములు దనచేతఁ
దనయస్త్రశస్త్రసంతాన మెల్ల
నాతనిచే మడియంగ రథంబులు
డిగ్గి పెంపారెడు నగ్గలికల
నాతండుఁ దాను బాహాసంగరమునకుఁ
జొచ్చి పెనంగఁగ నొచ్చి యతని

ఆ. యంగసంధి వికల మగుటయుఁ బోరు సా
లించి యతఁడు గారవించి తనకు
మహితవిభవమైన మాలినీనగర మీ
నధికతేజ మొసఁగ నరుగుదెంచె. 33

వ. ఈ రెం డవదానంబులు నీవును గొంత యెఱుంగు; దిట్లు ప్రసిద్ధబల పరాక్ర
ముండైన కర్ణునుదీర్ణత్వంబు సెఱుచుటకు నై సహజ కవచ కుండలంబులు
భిక్షించి పుచ్చుకొని నాకలోకపతి నీకు హితం బాచరించె; దానం జేసి ధనం
జయుం డతనిం దెగటార్పం జాలె-ననిచెప్పి, వెండియు. 34

చ. వినుము నరేంద్ర! విప్రుఁ డలివెన్, జమదగ్నిసుతుండు శాప మి
చ్చె, నమరభర్త వంచనముసేసె, వరం బని కోరి కుంతి మా
న్చె నలుక, భీష్ముఁ డర్ధరథుఁ జేసి యడంచెఁ, గలంచె మ్రద్రరా
జనుచిత మాడి, శౌరి విధి యయ్యె, నరుం డనిఁ జంపెఁ గర్ణునిన్. 35

వ. అట్లుంగాక. 36

క. హరసురపతియమవరుణులు
గురుకృపులును దివ్యబాణకోటు లొసఁగుటన్
నరుశక్తి కర్ణు తేజ
స్స్ఫురణము నాస్పంగఁ జాలెఁ జువ్వె నృపాలా! 37

వ. అనిన విని శోకవ్యాకులుండై నయస్నరపతిగన్నీ రొలుక నిట్టూర్పు నిగిడించిసం
దత్సమీపంబున నున్న కుంతి గనుంగొని యద లుడుపుటకై యతనితో
నిట్లనియె. 38

చ. జననముఁ దెల్పి యేఁ బిలువ 'సత్యము సుమ్ము ర కుంతిభాషణం'
బని తనుజత్వజాతకృప నంబుజమిత్రుఁడు వల్కఁ; నేమిటన్
గొనకొన నేరఁడయ్యె నినుఁ గూడ సుయోధనుఁ బట్టి; యట్టిక
ర్ణునకయి నీకు నేటికి మనోవ్యథఁ బొందఁగ నిట్లు పుత్రకా ! 39

ప. అనుటయు నవ్వచనంబులు దనకు నసహ్యంబు లైనం గటకటంబడి యద్దేవి
నాలోకించి 'భవదీయమంత్రకార్య గోపనంబునం గాదె యింతపుట్టె'నని పలికి
యంత నిలువక. 40

– : ధర్మరాజు స్త్రీలకు రహస్యరక్షణంబు లేకుండ శపియించుట : –

సం 12-6-11

తే. 'అంగనాజనమ్ములకురహస్య రక్ష
ణంబునందలి శక్తి మనంబులందు
గలుగకుండెడు మెల్లలోకముల' నని శ
పించె నాధర్మదేవతాప్రియసుతుండు. 41

వ. ఇట్లు మహాతేజోధనుం డగు నజ్జననాథుం డట్లు శపియించి కుంతిచేసిన కర్ణ
గోపనంబు ప్రసంగంబుగా నంతరంగంబు గృతపడిన కార్యంబుల దెసనిగుడం
దనకతంబున మృతిఁ బొందిన యుభయపక్ష బంధుమిత్ర కోటులం దలంచి
యుమ్మలించి విశేషించి కర్ణుచావునకుఁ దూరవగచి విహ్వలించి వివ్వచ్చునాననం
బాలోకించి యిట్లనియె: 42

క. మన కేటి రాజ్యఁ మొండొక
జనపదమున కేఁగి భైక్షచర్యావిధి జీ
వనము నడిపికొనియుండుద
మనఘా! యట్లయిన సుఖుల మవుదుము సుమ్మీ! 43

వ. అని వెండియు. 44

సీ. జ్ఞాతుల నందఱఁ జంపితి, మది యాత్మ
వధము కాదే! రాజవర్తనంబుఁ
గాల్పు; మహింస నిక్కము దాల్మి మత్సర
వర్జన మిది వనవాసజనుల

కాగమవిహితంబులఁబె! యింత యొప్పునే?
వనమున వసియింప వలయు వింఁబె;
యసుఖదంబైన రాజ్యామిషంబునకుఁ గు
క్కలభంగిఁ దమలోనఁ గాటులాడి

తే. కులము నెల్లను బొలియింపఁ గుత్సితంపు
బ్రదుకువచ్చెనె యను పగపాలువడఁగఁ
బ్రమద మొసఁగదు త్రైలోక్యరాజ్యమైన;
గాననే నొల్ల మహి; మీర కైకొనుండు. 45

మ. ధృతరాష్ట్రుండు దనూజుకీడు సమబుద్ధిం జూడ కన్నీచు డే
గతిఁ జన్నం జననిచ్చెఁ గాని మగుడంగాఁ దివ్వఁ డయ్యెన్; నిరా
కృతశీలుం డగు నాసుయోధనుఁడు సంక్షీణంబు సేసెం గులం;
బతనిం జంపఁగఁ గోప మాఱె; మది శోకాక్రాంత మయ్యెం దుదిన్. 46

వ. 'ఆ దుర్జనుండు కర్జం బెఱుంగక దుర్మానంబు వాటించిన సైరించి తొలంగ
నైతి; రాజ్యపరిగ్రహపరత్వంబు మచ్చిత్తంబునం గలిమిం జేసి కిల్బిషం
బత్యంతంబు నాచరింప వలసెఁ; బరిగ్రహదోషంబు పరిగ్రహత్యాగంబునం
గాని పోదు; పరిగ్రహత్యాగశీలుండు జన్మమరణ దుఃఖంబులం బొరయం
డని శ్రుతులు సెప్పెడు; నొకనికి సకలధర్మంబులు ననుష్ఠింప శక్యం
బగునే! యపరిగ్రహం బొక్కటన శుద్ధుండ నయ్యెద; మీరు భూమి పాలన
పరిగ్రహ తత్పరత్వంబున వర్ణాశ్రమధర్మరక్షణంబు సేయుం; డేను గాన
నంబునకుం జని మఁనిజనసంకాశంబున సుఖినై యుండెద' ననిన విని
యింద్రాంశసంజనితత్వకలితతేజోధనుం డగు నద్ధనంజయుండు దనయూష్మ
లత్వంబునకు నవ్వాక్యంబులు దుస్సహంబులై నం బదరి దరస్మితంబునఁ
దద్వికారంబుఁ గప్పి యప్పుడమిఱేని కిట్లనియె: 47

అర్జునుఁడు ధర్మజున కుచితవచనంబుల మనస్తాపోపశమంబు సేయుట

సం. 12-8-1

క. ఓహో! యిట్టివి గలవే?
బాహాదర్పమునఁ బరులఁ బరిమార్చి తుదిన్

మాహాత్మ్యం బెడలఁగ భి
క్షాహారత నొందఁ దలఁప నగునె నరేంద్రా! 48

సీ. ధర్మపథంబున ధరణిసేకుటినఁ బా
లింపక సత్త్వంబు పెంపు మాలి
విడుచుట యొప్పునే; వినుఁ మిట్టులైన ము
న్నేల భూపాలుర నెల్లఁ జంపి?
తదలి రాజ్యము దక్కఁ యడవికిఁ జనిన బే
లందురు గాక, మే లంద్రె జనులు?
కిల్బిషశంక గల్గిన నశ్వమేధాది
పుణ్యకర్మంబులఁ బోదె? వంశ

ఆ. ధర్మ మెడలఁ గృపణకర్మంబుఁ గోరి; త
ర్థంబు సువ్వె సకలధర్మకారి;
'యొడమి లేనివాఁడ నడపీసుఁ' గను నహా
షో కి వినమె! దాని నూఁదవలదె? 49

క. సరిగా నెన్నుదు రార్యులు
దరిద్రునిం బతితునిం గృతఘ్నుని జడునిన్;
దొరకొను ధర్మముఁ గామముఁ
బరమగతియు నర్థమునన పౌరవముఖ్యా! 50

క. కలిమియ చుట్టలఁ జేర్చుం,
గలిమియ చెలులను ఘటించుఁ, గలిమియ శౌర్యో
జ్వలుఁ డనిపించుం, గలిమియ
పలువురు సద్బుద్ధి యనఁగఁబరఁగం జేయున్. 51

క. ఏవాని బంధుమిత్రులు
జీవధనంబులును డప్పిఁ జెందును గృహునిం
గా వాని నెన్నఁగాఁ దగుఁ;
గేవల తనుకార్శ్వయుతుఁడు గృహుఁడె నరేంద్రా! 52

వ. కావున నర్థోపార్జనంబును బంధుమిత్రపరితోషణంబును భూపతులకుం
బరమపురుషార్థం; బదియునుంగాక.

తే. జ్ఞాతినాశనమునఁ గాదె సకల దేవ
తల ప్రవర్ధన మొందుట; ధనము లడిచి
పొడిచి యొప్పని వారిచేఁ బుచ్చికొనక
యడఁగియుండఁగఁ జేరునే యంద్రు బుధులు. 54

వ. వేదంబులు నిట్లు సెప్పఁ: బృథివి బలువునం గైకొని పార్థివు లర్థంబు లుపార్జించి పర్జన్యాదు లగు నాదిత్యుల నధ్వరక్రియాజాతంబునం బ్రీతులం జేసి యుత్తమలోకంబులు వడయుదు; రిత్తెరువు వట్టి దిలీప నృగ సగర నహు షాంబరీష మాంధాతలు నడచుట వినమె! తత్పదవి నీ కొదవి యున్న యది; తదీయప్రకారంబున బహుళదక్షిణవిధానంబుగాఁ బ్రభూతంబులైన యజ్ఞంబులు సేయవై తేనిఁజూవె సకిల్బిషుండ వగుట యశ్వమేధంబు సేసిన రాజులెల్ల నవభృథంబునం బరిపూతాత్ము లగుదు-రని పలికిన నెయ్యజాత శత్రుండు. 55

క. వెడవెడ యప్పలుకులు చెవి
నిడి కొండొకసేపు చింత యెసకంబున పా
ల్పడి యూరకుండి చిత్తం
బడలునఁ జిక్కువడ నిట్టు లను నర్జునుతోన్. 56

క. సేమపుఁ దెరు వొక్కటి గల
దే మెచ్చితి దాని; నడుగు మెయ్యది యని; సు
త్రామసుతఁ యడుగ కున్నను
నేమి, వినుము చెప్పెదను మునీంద్రుల కెక్కన్. 57

సీ. సారహీనము లగు సంసారసుఖములు
విడిచి యేకాకినె యడవి కేఁగి
తాపసవాక్యామృతములు వీనులఁ గ్రోలి
చెలిమి వేర్పాటను చిరమరలకుఁ
జొరక నిందాస్తుతుల్ సరిగాఁ గొనుచుఁ గ త్తి
నొకఁడు ప్రేసినను వేఱొక్కరుండు
చందనం బలఁదిన డెంద మయ్యిరువుర
యెడ సమంబుగ, మూఁగ జడుఁ డనంగ

తే. మెలఁగి తగువేళఁ బర్ణశాలలకు నరిగి
యె త్తగా భిక్ష యెవ్వార లెట్టు లేమి
యిడినఁ గైకొని నాలుగే నెడలమాత్రఁ
గన్నదానఁ దృప్తుండనై యున్న మేలు. 58

క. అటుగాక కర్మగతిలం
పటుఁడ నగదు నేని నల్పఫలభాగితమై
నట యిట దిరుగుచు మోక్షని
కటవృ త్తికి బాహిరుండఁ గానె కుమారా: 59

ప. 'కావున నాకు దొరకొన్న విమల ప్రజ్ఞామృతం బనుభవింపక తక్కుదునే;
యిది శాశ్వతపదప్రదం'బనిన విని యనిలతనయుం డతని కిట్లనియె: 60

క. శ్రుతివిహితకర్మజాత
స్థితియోగ్యుఁడ వైన నీకుఁ జేయగ వశమే
యతిలోకజానసమ
న్విత యతిజనకృత్య మటు వివేకింపు మెదన్. 61

చ. అడలున రాజధర్మములయందు జనించె నసూయ నీకు ని
ప్పుడు; మును నిస్పృహుండ వయి పోవఁగఁ గన్నఁ గులంబు వారు ని
ప్పుడమి నృపాలురున్ ప్రతికి పోదురు నెమ్మది; నట్టులైన నే
ముడుగుదు మస్త్రజీవనసముద్ధతిఁ, జొత్తుము భైక్షవృ త్తికిన్. 62

క. వాఁడి యగు నలుక లోకము
పోఁడిమి సెడఁ గయ్యె మట్లు పొడిచి వనటమై
నే ఁడింక నడవికిం జను
వాఁడంగా కనినఁ బుడమివారలు నగరే? 63

సీ. పనివడి ప్రత్వి కూపమునందు నుదకంబు
పానంబు సేయని వాని భంగి,
యున్నతతరు వెక్కఁ జున్ను సేకుఱఁ గొని
తేనియ యూనని వానిభంగి,

యాఁకొని యొడఁగూర్చి యన్నంబు తళియకు
వచ్చినఁ గుడువని వాని భంగి,
తమకించి యొకభంగిఁ దనవశంబుగఁ జేసి
మానినిఁ గవయని వానిభంగి
ఆ. గాదె కురువరేణ్య ! ఘనశ క్తిశౌర్యసం
పన్నులైన పగఱ భండనమున
నోర్చి పూజ్యరాజ్య మొల్లక యడవికి
నేఁగు; టీవ యెఱుఁగు ది త్తెఱంగు. 64

క. నీ వడవి కరుగ నొడఁబడి
నీవెనుకన వచ్చునపుడు నిందింతురు మ
'మ్మీ వెట్టు లితని మాన్పం
గా వలఁతులు గార' యని జగజ్జను లధిపా! 65

క. భోగములఁ బాపి నిందా
భాగులఁగాఁ జేసి యడవి పాల్యఁజెదవే
నీ గారవంపుఁ దమ్ముల
సాగరవృతధరణిఁ గలుగు జనములు వగవన్. 66

వ. అని వెండియు. 67

క. కేవల నిష్కర్మత మో
క్షావహ మగునేని గిరులు నవనీజములున్
భూవర! ముక్తిం బడయం
గా వలవదె; యడవి నునికి కై వల్యదమే? 68

క. ఫలముల యెడ బ్రహ్మార్పణ
కలనపరుం డగుచుఁ గార్యకర్మము నడపన్
వలయుం; దత్త్వజ్ఞానము
దలకొనినం గర్మశమము దానై కలుగున్. 69

వ. కావునం గర్మహీనత్వం బపవర్గకరంబు గా; దనవుడు నర్జునుండు ధర్మ
నందను నుద్దేశించి 'దేవా! యొక్క యితిహాసంబు గల దవధరింపు' మని
యిట్లనియె: 70

సీ. కొందఱు బ్రాహ్మణుల్ గొండుక లాత్మకు
లోచితాచారంబు లుడిగి కాన
లకుఁ జన్న, వజ్రి వారికిఁ గృపచేసి ప
తత్త్రి రూపమునఁ దత్పార్శ్వమునకు
నరిగి, 'మీకై కొన్న తెరు వొప్ప' దనవుడు
విని, వా రఖిలమార్గవేది యద్భు
తాస్పద మీపక్షి యని దాని కభిముఖు
లై 'సత్పథం బెద్ది యనఘ! చెపుమ'

తే. యనిన 'నలుగాలివాన గోవును నశేష
శబ్దముల మంత్రమును లోహజాతి గాంచ
నమును మనుజుల విప్రుండు సమధికత్వ
భాజనము లంద్రు వేదప్రపంచవిదులు'. 71

వ. 'ఇ ట్లుత్తముం డైన విప్రుం డుత్తమమంత్రోపాశ్రితంబు లగు విహిత కర్మం
బులు నడపుట రత్నకాంచన సాంగత్యంబునుం బోలె లోక సంస్తుత్యం
బైయుండు; నాలస్యంబునఁ బ్రగోధంబున శోకంబునఁ దదనుష్ఠానంబు
విడుచుట పాతకం; బజ్ఞానులగు నర్థహీనులు సన్న్యాసకాల వివేకంబు లేక
వేగిర పడి యుభయభ్రష్టు లగుదురు; గృహస్థ ధర్మంబున వర్తించి యతిథి
దేవ పితృ సంతృప్తి సేయుచు శిష్టాన్నభోజనపరు లగు పుణ్యులకుం
బుణ్యలోకంబు లబ్బుచేతిలోనివి గావె! బ్రహ్మార్పితం బయిన సత్కర్మకలా
పంబు మహానందంబుఁ జేయు' ననుటయు. 72

క. విని వారు దెలిసి మరలం
జనిరి గృహస్థత్వధర్మ సదనుష్ఠానం
బునకు; నటు లగుట నేలుము
జనవల్లభ! పుడమి; నడపు జన్నము లెలమిన్. 73

వ. అని చెప్పె; నప్పుడు నకులుం డన్నరనాథున కిట్లనియె: 74

-: నకులుఁడు ధర్మజునకు మనస్తాపోపశమంబు సేయుట :-

సం. 12-12-1

సీ. దేవతల్ వేదవిధిప్రవర్తకులు; బ్రా
హ్మణులును వార ల యట్ల శ్రుతుల
కింకరులై కాదె కిల్బిషంబులఁ బాసి
వారిచందమున శాశ్వతవిభూతి
నొందుట; యజ్ఞాదు లుడుగుట సంపరి
త్యాగమేఁ పాడిమై నర్థముల ను
పార్జించి దేవతా బ్రాహ్మణ పూజగా
నిడుచుఁ దత్ఫలకోటి విడుపుగాక;

ఆ. క్రోధశోకహర్ష కోటుల గృహముతో
విడిచి యోగ మూఁది వృక్షమూల
వాసనిరతి నుండు వాఁడెపో సంపరి
త్యాగి; నృపుల కది సమర్హ మగునెఁ 75

క. తక్కిన మూఁడాశ్రమములు,
నొక్క దెస గృహస్థధర్మ మొకదెసఁ దులయం
దెక్కింప వానితో న
య్యొక్కటి సరిదూఁగె నందు ధర్వీశ! బుధుల్. 76

వ. కావున గృహస్థధర్మంబ యాచరణీయం; బట్లుంగాక. 77

క. జతనంబున నర్థము సం
చితముగఁ గావించి క్రతువిశేషంబుల దే
వతలం దృప్తులఁ జేయమి
యతికిల్బిషకారి యందు రాగమవేదుల్. 78

చ. వినుము: తమోమయం బయిన విశ్వముఁ దా వెలిఁగించు నీశ్వరుం
డన నొకరుండు; వర్ణతతి నాశ్రమకోటిని వాడుఁగాదె చే
సె; నిఖిలకర్మయోగసవిశేషత గల్గుటయుం దదీయక
ల్పనమ; తదాజ్ఞకుం దొలఁగఁ బాడియెఁ శోకము గారణంబుగన్. 79

వ. హింసాదోషంబు గలుగు నను శంకకుం బని లే; భవభరింపుము. 80

క. పరుల వధింపక యెవ్వఁడు
ధర యేలెం జెపుమ పూర్వధరణీశులలో;
బొరయరు పాపము సుగతిక
యరిగిరి వా; రీవు నట్ల యగు బొప్పు వృపా! 81

క. రక్ష ప్రజ గోరు నిజయో
గక్షేమార్థముగ; జనసుఖస్థితి నడపన్
దక్షుఁ డగు రాజు నడప కు
పేక్షించినఁ బాప మొందదే కురుముఖ్యా! 82

తే. గోవులను ఘోటకంబులఁ గుంజరముల
దాసులను బ్రీతి ని మ్మొల్లధాన్యములను
గ్రామముల మందిరముల నిష్క్రములఁ వేడ్క
నొసఁగు తత్తత్సుపాత్రత్వ యుక్త విధుల. 83

వ. వీని నన్నింటి రిత్తవో విడిచి పోయెద ననుట నీయట్టిమహానుభావునకుం
దగునే? యని పలికినం దదనంతరంబ సహదేవుం డమ్మహీపతి కిట్లనియె: 84

సీ. వెలివెలి వస్తువుల్ విడిచెఁ బో నరుఁడు గ
ర్మిష్ఠతం గాదె శరీరయాత్ర
నడపువాఁ; డది మోక్షణంబుగా నేరదు;
శారీరసౌఖ్యసంస క్తి వదలి
బాహ్యపదార్థముల్ పాటించి నిజవంశ
ధర్మముల్ వదలక తగఁ జరింపు
మమత బంధంబు నిర్మమత మోక్షంబును
జేయు; నింత యెఱింగి చేసి రధిప :

తే. రాజ్య మెలమి మన్వాదు; లరణ్యమునకు
నరిగి నీ వందు వలయు ద్రవ్యముల మీఁదఁ
జేయవలదె మమత్వంబు ; వేయునేల
యదియు సంసారచక్రవాహకము గాదె : 85

తే. నీవ చుట్టంబుఁ బక్కంబు నీవ చెలియు
నీవ తల్లియుఁ దండ్రియు నీవ గురువు
నీవ దైవంబుఁ గావున నావిషాద
భాషణంబులు సైరింపు భరతముఖ్య! 86

క. తథ్యము లైనను దలఁప న
తథ్యము లైనను సభక్తితాత్పర్యము వై
తథ్యంబుఁ బొరయకుండఁగఁ
బథ్యంబుగఁ గొనుము నాదు పలుకులు కరుణన్. 87

వ. అనియె; నిట్లు దమ్ములందఱును బోధించు పలుకులు విని ధర్మనందనుం డూరక యుండె; నతనియెడ సవిశేషబహుమానయు నతనిచేత సంతోపా లాలితయు ధర్మాధర్మనిదర్శనశీలయు నగు పాంచాలి భద్రిగజప్రతిమానులై న య ప్పవమానతనయధనంజయ నకులసహదేవుల మధ్యంబున యూథపతివోలె నున్న యన్నరేంద్రు నల్లన చేరి, 'యేనును నా యెఱింగినంత సెప్పెద'నని యనుజ్ఞఁగొని యవ్విభువదనంబున నిజవిశాలలోచనరోచులు పరఁగ వినయం బాననంబున నతిశయిల్ల నిట్లనియె: 88

ద్రౌపది ధర్మజునకు హితవచనంబుల మనస్తాపోపశమంబు సేయుట

సం. 12-14-1

సి. శోకాగ్ని దనికిన సొగయు నీతమ్ముల
నుపపన్న వాక్యామృతోపయుక్తిఁ
దేర్పము; గానలం ద్రిమ్మరునాఁడు వీ
రాయాసములఁ బడు టవధరించి
సమయకాలము సన్నఁజని సుయోధనుఁ జంపి
భోగంబులను బహుత్యాగములను
యాగంబులను సద్వివాహములఁ సలుపుద
మని యూరడింపవే; యరిగణంబుఁ

తే. ద్రుంచి రాజ్యంబు సేకొంటి; తొఱఁగిపోదు
గాక యని యిప్పు డుడికింప నీకుఁ దగునె?
ధర్మమును సత్యమును నుచితంబు నిన్నుఁ
గడవ నెఱిఁగెడు వారలు గలరె యధిప! 89

వ. అని ముట్టనాడి మఱియును. 90

క. వేదమన సగుట ధర్మువు
గాదు నరేంద్రునకు; జగము గావం బ్రోవం
గాదె నృపులోకపాలాం
శోదితుఁ గాఁ జేసెఁ బద్మయోని చతురతన్. 91

క. నరరూపంబున బరఁగెడు
పరదేవత గాక నృపుఁడు పాలుఁ డయిన న
ప్పురుషునెడ నేమి వొమ్మని
తిరిగిన దుర్మతులఁ బొందదే కీ డధిపా! 92

ఉ. నేరక చేర నొక్కనిన నీఱుగఁ జేయుఁ గృశానుఁ డిద్ధ ధా
త్రీరమణాగ్ని గాల్చు నతితీవ్రత వంశము నెల్ల; నిట్లుగాఁ
గౌరవకోటి దర్పమునఁ గానక నిన్నుఁ బరాభవించి దు
ర్వారభవత్ప్రకోపశిఖిఁ గ్రాఁగెఁ; గదిన్ వగ పేల దీనికిన్? 93

సీ. నృపునందు విధి దండనీతి ప్రతిష్ఠించెఁ
గావున నపరాధగతి యెఱింగి
దండించు నృపతికి రెండులోకంబులుఁ
జేకుఱు; దోషంబు సేయ నుదుట
నచ్చొత్తి వెడలంగ నడుచు విప్రునినైన
భూవరుం; డిది మెచ్చు దేవకోటి;
సభ కేకవస్త్ర రజస్వల యనక నన్
దలవట్టి యీడ్చిన తప్పుఁ, దనదు 94

తే. తొడలు సూపిన తప్పును, దుష్టకష్ట
తరవచనములఁ బలికిన తప్పు, నసుఁజు
నందు దుర్యోధనునియందు ననుఁగునందుఁ
గాంచి దండించి ; తిట్టిది కల్మషంబె ?

క. గరదుని, గృహదాహకు, మం
త్రరహస్యవిభేది, వధవిధాయిఁ, బరసతీ
హరు, బంధుఘాతిఁ, బరధన
హరణపరునిఁ జంపి పుణ్యుం డగు న్పుఁ డనఘా ! 95

క. దండార్హు లైనవారల
దండింపక యున్నఁ జువ్వె ధాత్రీవిభు నా
ఖండలసన్నిభు నైనఁ బ్ర
చండపుఁ గిల్బిషము వొందు జగతీనాథా ! 96

క. వేదలకును సాధులకును
వేదములకుఁ దాపసులకు వేయేల సమ
స్తాదిత్యులకును దండమ కాదె
బ్రదుకుఁ జేయు రాజు గావింపంగన్. 97

వ. కావున. 98

ఆ. ఉచితదండవృత్తి నుర్వీప్రజాభర
క్షణము నోపి చేఁత గాక రాజ
వంశజునకు ధర్మవా భూసురార్హంబు
లైన శమదమాదు లాత్మ నిడుట. 99

వ. అని యంత నిలువక చనవు మెఱసి మేలంపుఁజందంబున. 100

ఉ. వైదిక ధర్మచారి జనవత్సల నీమదిఁ బట్టుకొన్నయు :
న్మాదము హీనమానవుమనంబునఁ బుట్టిన వెట్టివోలె న
స్యాదులఁ దీర్చ టొప్పదు ; నిజానుజవర్గము మీఁదఁ గల్గున
ట్యాదర సాంద్రసారకరుణామృత మానఁగనిమ్ము నెమ్మదిన్. 101

వ. అని పలికి యిట్లనియె : 102

క. నాయట్లు వడిన యంగన
లేమెడలం గలరె ? యిట్టి యేనును ధర్మా
పాయము నీ కగు ననువెఱఁ
బాయన గృహధర్మవృత్తిఁ బౌరవముఖ్యా ! 103

వ. అని వెండియు. 104

క. కౌరవులు దవదురితమునఁ
దా రెరిసిరి ; కల్మషంబు దానఁ గలదె ; భూ
భారము వహింపు ; బహుయ
జ్ఞారంభణ మాచరింపు మఖిలహితముగన్. 105

క. సురగురుఁడును శుక్రుండఁను
బరిపాటిగ దండనీతిఁ బలికిరి ; ధానం
బరిణతుఁడవు; నీ వనుజులు
పరికరముగ నడపు ధర్మభాసుర ! దానిన్. 106

వ. అనినం బొంచాలితో మఱుమాట లాడక యూరక యున్న యన్నరేంద్రునకు
నింద్రనందనుం డిట్లనియె : 107

సీ. దక్షుఁడై భూపతి దండనీతి నయింప
కున్న సన్యాసులు నుత్పథప్ర
వర్తను లగుదురు ; వావిరి నన్యోన్య
ధనధాన్య పశుభూమిదారాహరణ
మాచరింతురు జను ; లప్పాప మవ్విభు
నొందు ; దండము హింసయుఁగఁ దలంప
వలదు ; దుర్వృత్తుల వధియించు రుద్రుని
గోవిందు వాసవు గుహునిఁ జూడు ;
తే. మా మహాత్ములు దక్కఁ నున్మార్గచరుల
దండితులఁ జేత వినమె; యధర్మ మడఁగు
ధర్మ మొసఁగు దండమున; నర్థంబుఁ గామ
మును నదూష్యంబులై సిద్ధిఁబొందు నధిప! 108

వ. దండంబున సకలజనశ్రీరక్షణంబు సేయం బూనిన భూనాథునక యేల
యోగ్యహింసకుం దొలంగ నెట్టివారికి వశంబు గా దవధరింపుము. 109

ఉ. కాయలఁ బండ్ల నీఱులను గల్గవె సూక్ష్మపుజంతువుల్; మునుల్
సేయరె హింస వాని; నుపజీవితఁ ద్రవ్వరె కందమూలముల్;
నీయెడఁ జూడు ప్రాణములు నిల్వఁగ నేర వహింస నేరికిన్;
వేయును నేలఁ భక్ష్యముగ వేధ విధింపఁడె ప్రాణిఁ బ్రాణికిన్. 110

క. వినుఁ పశుహింసాకృతయా
గనిరూఢుని ధర్మపరునిఁగా వేదంబుల్
గొనియాడెడు; సముచితహిం
సన మరయ నహింస గాన జగతీనాథా ! 111

క. అరివీరుల ఘోరం బగు
దురమున వధియించు టేల దోసం బయ్యెన్?
ధరణీశ! పాండుపాలిత
ధరావలయ మాసపడుట దగదే నీకున్? 112

క. ఇల నీకైకొన్న తెఱఁగు
దలఁపఁగ ధర్మంబొ కాదొ దైవం బెఱుఁగున్;
వలవని చింత యుడిగి ధృతి
దలకొని పాలింపు యజ్ఞదక్షుఁడ వగుచున్. 113

క. అని పలుకు పార్థపలుకులు
విని పలుకక యున్న, మనుజవిభుదెసఁ గోపిం
చిన తనమది వెడఁ గుడుపుచు
ననిలసుతుం డిటులనియె నాతనితోడన్. 114

ఉ. నీవు సమస్తధర్మపరినిశ్చయవేదివి; నీచరిత్ర మే
మే పసుధేశ వంక యని మెచ్చక చక్కఁగఁ జేయువార మే
ని వచనప్రపంచముల కింకఁ జొరంజొర నంచు నుండియున్
వావిరిఁ జెప్పఁగా వలసె వాలినదుఃఖము దాల్మిఁ గ్రాఁచినన్. 115

వ. అవధరింపుము. 116

క. ఒడఁగూడినసామ్రాజ్యము
నడలున దిగఁద్రావి చనిన నిఖిఁజనులు నిన్
గడుఁబేదమనసువాఁ డని
చెడ నాడుదు రనిన మము నిసీ యను టరుదే. 117

మ. కపటచ్యూతమునం బరాభవము రాఁగా సూన్యతం బూఁది భూ
మిప! మమ్ముం జులుకంగఁ జేసి నినుఁ బేర్మిం బాపికొంచున్ దురం
తపుదుఃఖంబుల కోర్చి పోయి; తది యుద్ధక్రీడ నప్పాపక
ర్మపుజాతిం దెగ టారఁ జేయగఁ బ్రకీర్త్యం బయ్యె లోకంబులన్, 118

వ. దుర్జయు లగు విరోధుల నిర్జించి యుపార్జించిన పృథివీప్రముఖ
పదార్థంబులు నిరర్థకంబులు సేసి వనంబునకుం జను చులుకఁదనం బేమిటం
బాపికొనువాఁడఁ వట్లుంగాక. 119

సీ. ఆసభలోఁ బడినట్టి బన్నంబును,
నడవులఁ దిరిగెడు నపుడు దుష్ట
దైత్యులచేత సైంధవునిచే నొఱపులఁ
బడ్డవిషాదంబుఁ, బరమదైన్య
మున కోర్చి కొలిచి, మాత్స్యనిపాలనున్నదుఃఖంబును ద్రోహులఁ గనుపుగొట్టి
వెలువరించెద నని తలఁచి, కృష్ణుని నిశ్చయం బూఁది, ధర్మంబ యగుటఁ దెలిసి 120

తే. రణ మొనర్చితి, నిను ధార్తరాష్ట్రి లొండె
నీవు వారల నొండెను జావఁ జూడ
వలయు టప్పు డెఱుంగవే వసుమతీశ!
యిప్పు డడలుట నింద్యంబ; యింత నిజము.

క. పను లేము సేయఁగా దు
ర్జనులం జెఱుచుచును సాధుజనుల మనుచుచున్
జననాథ! మహాయజ్ఞము
లొనర్చుచును వెలయు కురుకులోత్తంసమ వై. 121

వ. అనిన విని ధర్మతనయుం డిట్లనియె : 122

చ. మదమును రాగమున్ భయము మానము లోనగు కిల్బిషంబులన్
హృదయముఁ జొన్పి భూజనుల నేలుట మేలని పల్కఁ; దార్తి కా
స్పద మని రార్యు లామిషముపైతగు; లిమ్మహి యెల్ల నేలినం
దుది నరకం బొకండ; నృపతుల్ సుఖులేఁ యుపశాంతి యొప్పదేఁ 123

తే. కామభోగముల్ మేలనఁ గాదు; వాని
విడిచి చూడుము పొందెడు విపులసుఖము;
కాయ లాకులు నీళ్లను గాలి యనుభ
వించి యున్న మునీంద్రులు వెట్టివారె? 124

క. దుర్మతు లామిషగత మగు
కర్మము వాటించి బంధకలితు లగుదు; ర
య్యూర్మి గడిచి సువిచారులు
నిర్మమతను ముక్తి వడయ నేర్తు రు వత్సా! 125

వ. జనకుని వచనంబులు వినమేఁ వాని నీకుం జెప్పెద; నాకర్ణింపుము. 126

ఆ. ఒకటిదెసను దృష్ట యొలయదు గావున
నేమి యర్థములును లేమి లేదు;
కాలఁ జొచ్చె మిథిల గాలదు నాకు నం
దొక్కఁడైన; నింత నిక్కువంబు. 127

క. అని పలుకు జనకుఁ దెగడిరె
జనుఁ లుల్లము శాంతిఁ బొంది సంసారం బొ
లనివాడు నింద కరుం
డని పలుకుట నీక యొప్పు నధికవిచారా! 128

తే. వినుము: ప్రజ్ఞాధిరూఢుఁడై వనట దక్కఁ
సంస్కృతిక్లేశపరుల భూస్థలిఁ జరించు
వారి నచలంబుపై నున్నవాడు సూఁచు
నట్ల చూచుట సూవె నే ర్పమలహృదయ! 129

-: జనకున కతనిసతితోఁ జైన సంవాదం బర్జునుఁడు ధర్మజునికిఁ జెప్పుట:-

సం. 12-18-1

వ. అని పలికి మఱి పలుకకున్న యప్పుడమిజేనికిం గవ్వడి యిట్లనియె: 130

క. జననాథ! నీవు సెప్పిన
జనకనృపాలునకు నతివిశదమానస యా
తని భార్యకు నీక్రియ న
య్యెను సంవాదంబు; దాని నేర్పడ వినుమా! 131

వ. అమ్మహీపతి పూజ్యరాజ్యం బొల్లక విడిచి భిక్షావృత్తికి వెడలఁ జూచినం
దదీయభార్య యతని కిట్లనియె: 132

సీ. పుడమి యేలుట డిగ్గవిడిచి భిక్షార్థివై
పోయిన నతిథి సంపూజనంబు
దేవతర్పణ పితృదేవతర్పణములుఁ
గలుగునే? కాషాయములు ధరించి
ముండుఁడై నతఁ డన్నమునకు గృహంబుల
కరుగక యున్నె? గృహస్థుఁ డెల్ల
వారికి నన్నంబు గారుణ్యమునఁ బెట్టు;
నన్నదానము సేఁత యధికధర్మ

ఆ. మనుట వినమె! పెట్టు నతనిఁ జేయొడ్డెడు
వానిఁ దఱఁప నండు వరుఁడు పెట్టు
వాఁడ యగుట నిక్క-వం; బింత సూడక
యిట్లు దీనవృత్తి కేఁగఁ దలఁతె? 133

క. త్రైవిద్యు లగుమహాత్ములు
నివలనన బ్రదుకఁ దలఁప నిష్క-యతమె యిన్
నీ విందఱఁ జెఱిచెద; విది
దేవా! ధర్మంబు గాదు; దీని నుడుగవే. 134

తే. అధిప! మీతల్లి యుల్లంబు నడలువెల్లి
ముంచి, సతి శోకసంతాపమూర్ఛ జేసి,
వంశవిహితధర్మంబుల వదలి, వెడలి
పోయి యేగతిఁ బోయెదవో యెఱుంగ. 135

క. చలిపందిరి చందంబున
ఫలభరితంబైన తరువుభంగిఁ బ్రజల డ
ప్పులు దీర్ప నమరియుండెడు
నలఘుచరిత్రునకు లఘుత యగునే కోరన్. 136

వ. ఇది ధర్మవిరోధంబు; దీన మోక్షంబు గలుగు ననుట నాకుం జూడ సందియం
బని చెప్పె; ననపుడు నయ్యజాతశత్రుండు పురుహూతపుత్రున కిట్లనియె: 137

మ. శ్రుతివాక్యంబులు కర్మనిష్ఠ వినుతించున్; నిశ్చ్రియత్వంబు స
ద్గతిఁ గావించుట యూఁది చెప్పు; నిటు చిత్తప్రక్రియల్ రెండు చో
దితముల్; వానిని వింటి మన్న కలుచన్ దీపించునే తత్త్వసం
గతబోధంబు? సుకర్మతం గలుగు నాకం బాత్తవీరవ్రతా! 138

తే. తత్త్వబోధంబు గలుగు నతండు నన్నుఁ
దెగడ నేరఁడు; నీవు భ్రాతృత్వసౌహృ
దమునఁ గర్మంబు విడుచు టధర్మ మనిన
పలుకు ప్రియమ జగన్న్యాయ పథము గనుట. 139

సీ. వడముడియును నీవు వాయు వాసవులశ
క్తులు ధరియించిన దుర్జయులరు;
హరికరుణాతిశయమునఁ ద త్తేజంబు
మీయందుఁ దగ సంక్రమించి యుండు;
మీరు సంగరశాస్త్రసారపారగులరు
గాక తత్త్వజ్ఞానఘనమతులరె?
యనఁటికంబమునట్ల యనిరి నిస్సారత
సంసార మనఁగ నిస్సంప్రబుద్ధు;

తే. లది ప్రసిద్ధము; విను, తృష్ణ యడఁచి కర్మ
వృత్తి విడిచి నిరాలంబచిత్తుఁడైన
యాతఁడో సుఖి, దోషదుఃఖాకరంబు
లగు ధనంబులు గోరెడునతఁడొ చెపుమ. 140

ఉ. ఆదటఁ బూర్వశాస్త్రములయర్థము లారఁగఁ గ్రోలి తత్త్వసం
వేదసుధారసంబున చవిం జిరసౌఖ్యముఁ బొంద నేర కి
మ్మేదిని నెందునుం దిరిగి మే లని కర్మము యూఁది చెప్పుచుం
గా దని శాంతి యొప్పనిదిగాఁ జెరనాడుదు రల్పబోధనుల్. 141

క. విమలజ్ఞానులు శమమును
దమమును ద్యాగంబు శాశ్వతప్రచురానం
దమునకు మూలము లండ్రు; ని
జముగాఁ గైకొందు రవి ప్రసన్నవివేకుల్. 142

వ. అనిన విని దేవస్థానుం డమ్మానవపతి కిట్లనియె: 143

దేవస్థానుం డను ముని ధర్మ్మజునకు హితోపదేశంబు సేయుట

సం. 12–20–1

సి. ధనము లుత్కృష్టంబు లను ధనంజయుమాట
పాటిగాఁ గొనుము; సోపానభంగి
నున్నది మార్గంబు యోగసమారోహ
ణమునకు; దానన నడచి కాక
వడి నుల్కిపడ నీకు వచ్చునే? ధనసంగ్ర
హంబు భోగార్థకృతంబు దుష్ట
మగుటయుఁ గలదు; యజ్ఞార్థకృతం బైన
నదియ నిచ్చెన బ్రహ్మపదము నొంద;
తే. యజ్ఞపరిశిష్టధనభోగ మాత్మకలఁక
యుడుపు; నమ్మెయి శమదమయుక్తి గలుగు;
శమము దమమును దత్త్వవిజ్ఞానదములు
గాన దక్షిణాధికయజ్ఞకర్త వగుము. 144

చ హరుఁడును సర్వమేధ మను యాగమునం బ్రచుర ప్రకాశతం
బొరయఁగ వేడ్కఁ జేసె; విధివూర్వనిగీశముఖామరుల్ మహా
ధ్వరములఁ గాదె పేర్కొనుట; ధాత్రి సధర్మత నేలి యజ్ఞత
త్పరత వెలుంగరే నృపులు పార్థివముఖ్య! మరుత్తముఖ్యులున్. 145

వ. వినుము నివస్వతి యడుగ బృహస్పతి సన్మార్గనిర్దేశకుఁడై చెప్పిన
మార్గంబు. 146

ఉ. కామము ప్రగోధమున్ మనసుఁ గాడఁగఁ బాఱుట మాన్చి, యింద్రియ
స్తోమవిమార్గవర్తనము ద్రుంచుచు, నెవ్వగ లేక, రక్షణం
బేమర, కెవ్వరిం జెనకి యించుక నొంపక, లోక మేలఁగా
నా మహితాత్ము సర్వమహిమాతిశయంబును జెందు వాసవా! 147

వ. అనియె; మఱియు నాకర్ణింపుము: 148

ఉ. కర్మము మేలు నా, విగతకర్మము మే లన రెండు నొప్పునే?
కర్మఫలంబు నర్పితము గాఁ దగ నీశ్వరునందుఁ జేత స
ద్ధర్మము గా కనంగ వివిధంబగు ధర్మపథంబులోన మేల్
ధార్మికవర్య! యేర్పఱుపఁ దా వశమే నగ బుద్ధి గుందగన్. 149

ఉ. కావున సిద్ధ్యసిద్ధుల వికారముఁ బొందక ద్రోహ మెయ్యెడన్
వావిరిఁ జేయ కేలు భువనంబు భవత్కులధర్మరక్షి వై;
భూవరు లిట్లు సేసి తుదిఁ బుత్రుల గద్దియలందు నిల్పి కా
దే వనవాసు లైరి ధృఢదీప్తనిరంజనబోధసంపదన్. 150

వ. అనిన విని నిర్విణ్ణమానసుండై యున్న యన్నకు నర్జునుం డిట్లనియె: 151

సి. క్షత్త్రియధర్మనిష్ఠాపరత్వంబున
సమరంబు సేసితి; శస్త్రనిహతిఁ
బూతాత్ములై రిపుల్ వోయిరి సద్గతి;
కమ్మొయి రాచకర్మ మ్మొనర్చు
విప్రునకైనను సుప్రశస్తం; బది
రౌద్రం బగుట బాలురకును దెల్ల

మైనను నిట్లుండు నార్యోక్తి; నృపనీతి
దురింతంబు సేయునే ? యొరుడు వెట్ట
ఆ. గుడువ నృపతిమాత్రకునకును గాదన్న
గౌరవాన్వయాగ్రగణ్యఁ డైన
నీకుఁ దగునెఁ విడువు శోకంబు; వ్రజస
న్నిభము గాదె నృపుల నెమ్మనంబు. 152

వ. అట్లుంగాక. 153

ఉ. వైరివధంబు నీకును నవశ్యముఁ జేయక పోవరానిదై
వైరులకున్ భవత్సమరవాంఛన సద్గతి కేఁగఁ బాలిదై
చేరె విధాత్రసంఘటనఁ; జింతకుఁ గారణ మేమిఁ ధర్మవి
స్తారవిదుండ వీ వకటఁ ధైర్యసమగ్రుఁడ వై వెలుంగవే. 154

వ. 'రాజధర్మాపాత్తంబై భవదాయత్తంబై న పూజ్యసామ్రాజ్యంబుఁ బరిపాలించు
చుఁ బుణ్యక్రియానుష్ఠానపరుండ వగు'మని పలికిన మఱుమాట పలుక కున్న
యన్నరేంద్రునకు మునీంద్రవర్యుం డగు పారాశర్యుం డిట్లనియెఁ: 155

సీ. అర్జునుపలుకు సత్యంబు; సమీచీన
మార్యజనంబు గృహస్థధర్మ
ముత్తమం బని చెప్పు; నుర్వీశ! పశుపక్ష
లాదిగా జీవుల కాశ్రయంబు;
నృపులకు నది దక్కఁ దపమును దమమును
బ్రహ్మచర్యమును ధర్మములు గావు;
ధనములఁ దనియుట యని కోహటించుట
ప్రజల రక్షింపమి రాజకోటి
ఆ. కరయఁ బాతకంబు లంద్రు; నీ వక్కట
వేదచోదనాప్రవీణ మయిన
మనసు నేల యి ట్లమార్గవృత్తికిఁ జొర
నిచ్చె; దోపి ధరణి యేలు మనఘ! 156

క. నీ వార్యబోధితుండవు
గావే? వర్ణాశ్రమప్రకారములు వినం
గావలయునె? ధర్మంబులు
భూవరునకు దండనీతిఁ బోలం గలవే? 157

వ. సుద్యుమ్నుం డను ధరణీశుండు దండనీతిన కాదె యపవర్గంబు వడసె,' ననుటయు, నజాతశత్రుం 'డాసుద్యుమ్ను వృత్తాంతంబు విన వలతు నానతి మ్మనిన నమ్మహీపతి కమ్మునిపతి యిట్లనియె: 158

పారాశర్యుఁడు సుద్యుమ్న చరితంబు ధర్మజునకుఁ జెప్పుట

సం. 12-24-1

క. విను శంఖుండును లిఖితుం
డన నిరువురు విప్రవర్యు లన్నయుఁ దమ్ముం
డును గలరు బాహుదాతీ
రనివాసులు ధర్మతత్పరమనోవృత్తుల్. 159

సీ. వారియాశ్రమముల భూరిపుష్పఫలాభి
వృద్ధి నొప్పారెడి వివిధభూరు
హంబులు గల; వొకయపుడు శంఖుండు గృ
హమ్మున లేకుండ ననుజుఁ డచటి
కరిగి, యం దొక ద్రూన నారఁ బండిన పండ్లు
గని వేడ్కమై గోసికొని తినంగ,
నయ్యన్న యేతెంచి 'యనుజ! యీ ఫలము లె
క్కడియవి చెప్ప' నావుడును వార్చి 160

తే. ప్రణతుఁడై 'యిచ్చటివ' యని పలికె లిఖితుఁ;
డాతఁ 'డనుమతి లేక కోయంగఁ దగునె?
ద్రుచ్చిమియ కాదె యది; పాప మచ్చుపడియె ;
నృపతిచే దండితుండవై నీఁగి కొనుము.'

వ. 'రయంబున రాజసన్నిధికిం జని భవత్కర్మం బుపన్యసించి దండించుట వేఁడు' మని పలికినం, దెలిసి 'యట్లకాక' యని లిఖితుండు సుద్యుమ్నుఁ గానం బోయి నగరి వాకిట నిలిచినం, బ్రతిహారు లమ్మహాత్ము నరుగుదెంచుట యమ్మహీపతి కెఱింగించిన, నతండు సంభ్రమంబున సామాత్యుండై యాసం శితవ్రతుం డున్న యెడకుం జని, వినయంబు సేసి, 'మీర లిచ్చటికి వేంచేసిన ప్రయోజనం బేమి? యానతిండు; మీ చెప్పినట్లు చేసెద'నని విన్నవించిన నావిప్రవర్యుం డాతని కిట్లనియె: 161

ఆ. చెప్పినట్ల యేను జేసెద నని యొడం
బడినవాఁడ; వింకఁ బలుకు దిరుగఁ
గామి మఱవ కుండఁగా నీకు వలయుఁ జు
మ్మయ్య దండధారకాగ్రగణ్యఁ 162

వ. అని యూఁది పలికి, 'మద్గురుని యనుమతి లేక తదీయతరు ఫలంబులు గోసి కొని యుపయోగించితి; నది మ్రుచ్చిమి; మ్రుచ్చుల దండించు తెఱంగున దండించి నన్ను గతకల్మషుం జేయుము; రాజదండితునకు యమదండంబు లేదని పెద్దలు సెప్పుదురు; నిన్నును దండధారణవై కల్యకిల్బిషంబు వొరయ కుండ వలయు'నని తేటపడ నాడిన సమ్మాటలకు మనంబున విషాదంబునొంది యమ్మేదినీవరుండు భూసురవరుం బ్రార్థించి, 163

ఆ. 'అనఘచరిత! యిట్లు నను నియోగించుట
యుడుగు' మని యమాత్యయుతము గాఁగ
భక్తి మెఱసి యెన్నిభంగులఁ జెప్పిన
నియ్యకొనక యున్న నెట్ట కేని. 164

లిఖితుండు సుద్యుమ్ననిచేత నిక్కృత్తకరుం డగుట

సం. 12-24-19

వ. నిశ్చయించి సముచితదండనీతివ్రతశీలుం డగు నన్నరపాలుం డమ్మహాద్విజు నిం గరయుగచ్ఛేదనంబున దండితుం జేసిన, నతం డతని దీవించి, మగిడిచని, శంఖునిం గని నిక్కృత్తంబు లైన హస్తంబులు సూపి, 'సమ్యగనుభూత దండితుండ నైతి' ననిన నాతండు ప్రీతుండై. 165

తే. ధర్మమార్గ ముల్లంఘింపఁ దగదు గాన
వలసె నిష్కృతి; కుల మెల్ల వెలసె నీక
తమున; సురమునిపితృతర్పణములు సేయు
మరిగి బాహుదాపుణ్యతోయముల ననఘ ! 166

వ. వినుము. 167

తే. కల్లు ద్రావుట, గురుపత్నిఁ గవయుటయును,
విప్రుఁ జంపుట, బ్రహ్మస్వవిషయ మైన
ముచ్చిలుటయును, నివి గల క్రూరజనులఁ
బ్రీతిఁ బొందుటయును మహాపాతకములు. 168

వ. ఇమ్మహాపాతకంబు లేనింటిలోన నెద్ది సేసిన నేజాతివాఁడును దండనీయుండ; విశేషించి తస్కరుండు శారీరదండయోగ్యుండు; రాజదండితులు సుకృతవంతుల భంగిఁ బుణ్యలోకప్రాప్తు లగుదురు; నీ వమ్మహారాజుచేత దండింపంబడుటం బుణ్యాత్ముండవును వంశోద్ధరణసమర్థుండవు నైతివి; సంతోషింపుము; పొ మ్మనినం బోయి లిఖితుండు. 169

తే. బాహుదానదియం దవగాహనంబు
సేయఁ బ్రభవించె నాతని చేతు లపుడ;
విస్మయం బంది యతఁడు వేవేగ వచ్చె
నన్నపాలికి మగుడఁ బ్రహర్ష మెసఁగ. 170

వ. వచ్చి యరుణకమలంబులం దెగడు తనకరంబుల జూపిన నతండు 'దీనికి నచ్చెరు వడ నేల: యిది మదీయతపోవిభవంబున దైవకృతంబైన విశేషంబు; నీవు శుచి వగుట దైవంబున కెక్కె;సుద్యుమ్నుండును నీపుణ్యానుష్ఠానంబున నిజపితృవర్గసహితంబుగా నిర్మలాత్ముండయ్యె' ననియె నట్లగుటం జేసి. 171

చ. జననుత: నీవునుం దగఁ బ్రజాపరిరక్షణ మాచరింపు; నీ
యనుజునిమాట వేదవచనార్థనిరూఢము; రాజనీతి దం
డనమునఁగాని ముండన మొడంబడ దెన్నఁడు నార్యకోటియం
దును; వగ దక్క మేలుఁ; మిలఁ; దుష్టిగఁ జేయును మేటి జన్నముల్. 172

వ. అని చెప్పి మఱియు నిట్లనియె: 173

సీ. అడవుల మీ రున్నయపుడు నీ తమ్ములు
వివిధమనోరథావేశకలిత
హృదయు లై యుండుదు; రదయత వీరి ను
పేక్షింప కిల యేలి యెల్లభోగ
ములకును భాజనంబులఁగా నొనర్చుము ;
తురగమేధాదిక్రతుప్రయు క్తిఁ
బరఁగుము; వీరలు బహుయజ్ఞములు సేయు
వా; రటమీఁద నిర్ద్వంద్వ వృ త్తి

తే. వెడలెదవు గాక: విను: మేము వెట్టివార
మే, మహీశ్వర: నీమది మేలుగంటి
మతిథి సురపిత్ర విషయమునప్పు చిక్కు-
గలిగియుండంగ నది నీకుగాదు గాని. 174

ఆ. న్యాయశాస్త్రవేది యై యింగితాకార
చేష్ట లెఱిఁగి జనుల శిష్టదుష్ట
తావిశేష మరసి దండనీతి యొనర్చు
పతికి నెల్లమేలుఁ బడయవచ్చు. 175

క. అరి యాటవపాలు గొనుచుఁ
గరుణ గలిగి ప్రజలఁ దండ్రిగతి మధ్యస్థా
చరణంబునఁ బాలించుట
పరమపదముఁ జేర్చు; విడువు భయసంశయముల్. 176

ఆ. ఇవ్విధంబు గాక క్రొవ్వి కామక్రోధ
కలితచిత్తవృత్తిఁ దొలఁగ నడచు
పతికి నగుఁ జతుర్థభాగంబు ప్రజ సేయు
పాపములఁ గులప్రదీపచరిత: 177

చ. క్రమమున నైన శాస్త్రవుల గ్రందుననై నను జావఁజేఁత ధ
ర్మము; విను: పాపకర్ములగురాజులతోఁ దగ సంధిసేఁతఁ దో

(3

షము; విభుఁ డుర్వి యఖ్యాకొని సంగరము దొలఁగింపఁ గూడునే?
సమరజితావనీభరణశాలితఁ బోలునె యొండు ధర్మముల్. 178

వ. కావున. 179

క. పోరుడుగను సమకూరద
కారవపతితోడ సంధి గావింపమి హిం
సారుచి నైతి ననుట యవి
చారత నృపవంశకలితజని యగు నీకున్. 180

శా. భూవిస్తారము నాక్రమించి, ప్రజలం బ్రోవంగ దండింపనుం
గావన్ నేర్చి, మఖక్రియల్ నడపి, సంగ్రామాగ్ని కాజ్యాహుతుల్
గా వైరిక్షతజంబు ప్రేల్చి, తనుషంగక్షేపకుండై హయ
గ్రీవుం డుత్తమసిద్ధిఁ బొందె; రణముల్ గీడే నృపశ్రేణికిన్? 181

వ. 'సంగరంబునం జంపుటయుం జచ్చుటయును, బ్రజాపరిపాలనంబున దగిన తెఱంగున దండించుటయును నుత్తమక్షత్త్రధర్మంబులు, గావున హింస వలనిశంక విడిచి యాస్వీకీ త్రయీవార్తా దండనీతు లను రాజవిద్యలయందును బ్రవీణులగు సహాయులతోడం గూడి సర్వవ్యవహారంబులు నిర్వహింప నిర్వాణం బనతిదూరం బగు; గలంక దక్కు'మని పలికె. సకలలోకగ్రాహ్యవచనుం డగు నమ్మహాముని యిట్లు సెప్పం దెలివొందక యున్నధర్మనందనుం గనుంగొని పురందరనందనుం డుల్లంబునం గోపంబు గదుర మొగంబున దోఁపనీక యుండె; నప్పాండవాగ్రజుం డత్తపోధనవర్యావదనంబునం జూడ్కి నిలిపి నిభృతంబుగా నిట్లనియె: 182

క. పతులు మృతులైనఁ బొగిలెదు
సతుల విలాపములు శోకసంతాపం
బుత్థితముగఁ జేయఁగ నే వసు
మతి యేలిన కలచుకలఁక మానునె బుద్ధిన్. 183

వ. అనుటయు నమ్మునిపరుం డతని కిట్లనియె: 184

సీ. దుఃఖంబుఁ బొమ్మని ప్రోవ సుఖంబు ర
మ్మని తెచ్చికొన వశమయ్యె? వానిఁ

దోలుబొమునందలి దుష్కృతంబును సుకృ
తంబు హేతువులుగఁ దగిలిచేయుఁ
బురుషునికాలంబు దిరములుగా వవి
పొరిఁబొరి వచ్చుఁ బోవుచుండు;
సర్థముల్ దుర్బుద్ధికైనను సిద్ధించు
నగుకాలమున; నార్యులయ్యుఁగాని

ఆ. కాలమున ఘటింపఁగా నేర; వనిలవ
ర్షాతపేందురుచులు నధిపఃకాల
కల్పితములు; మంత్రశిల్పౌషధంబులు
మేలుసేఁత కాలకీలితంబు. 185

క. కమలంబులుఁ దొవలు వికా
సముఁ బొందుట లతలుఁ దరులు సకుసుమఫలభా
వముఁ బొందుట పశులును మృ
గములును మదకలము లగుట కాలకలితముల్. 186

వ. మఱియు జననమరణంబులును హానివృద్ధులును లోనుగా సకలంబును గాలా
ధీనంబ; కావున నీకు శోకింపం బనిలేదు; తొల్లి సేనజిత్తను మానవపతి
పుత్రమరణ శోకార్తుండై యుండి తనలోనన తెలిసి సజ్జనసన్నిధి నుపన్య
సించిన వాక్యంబు లాకర్ణింపుము: 187

-: పారాశర్యుఁడు ధర్మజునకు సేనజిత్తువాక్యంబు లుపన్యసించుట :-

సం. 12-26-13

సీ. తారు గొందఱకు బాధకు లయి నడచుట
పరులచే బాధలఁ బడుట గలుగు
నివి కాలభావ్యంబు; లెఱుక కల్గిన నొరుఁ
బఱిచితి నొరులచేఁ బడితి ననుచుఁ
బురుషుండు ప్రియశోకముల బొందఁ; ;
డర్థదారాపత్యబాంధవహాని కాత్మఁ

గుందంగ నడలుట మందబుద్ధిత్వంబు;
వగఁ గీడు మానునే? వలవ దడల;

తే. శోకభయకారణంబులు లోకమున స
నేకములు దానఁ దలసూపు; శోకములకు
భయములకు బుద్ధి నెడయాఁడు పండితుండు;
మూఢుఁ డవి ప్రోవనేరండు, మునుఁగు వగల. 188

క. విను డీ సుఖమును దుఃఖము
ననిత్యములు గాన వానియాగమకాలం
బున ముదమును శోకము మొగ
కొనమియ చు మ్మఱవు శాంతిగోరుజనులకున్. 189

తే. మూఢతమబుద్ధులగువారుఁ బ్రౌఢతమవి
వేకులును సుఖ; లట్టులుగాక కొంత
ప్రజ్ఞ గలవారలై యప్రతిభు లైన
జనులు దుఃఖార్తు లగుట నిస్సంశయంబు. 190

వ. అనియె; నాసేసజితుం డుదాత్తవివేకనిరూఢుం; డతని వచనంబులు విద్వ
దాదరణీయంబు; లిందలి యర్థంబు నీచిత్తంబున నలవరింపుము; వగ
యుజ్జగింపు–మని, వెండియు. 191

తే. వర్ణముల నాశ్రమంబులవలను మెఱసి
యరసి చక్కని తెరువున నరుగఁజేసి
ధరణి పాలింపు సముచితదండధరణ
మాచరింపుము; నీ కిది యర్హావృత్తి. 192

క. దివికిం జనినను నెవ్వని
వివిధగుణము లఖిలజనులు వినుతింతురు వాఁ
డవనీశ్వరుఁ సత్పురుషుం
డవునని కయికొండ్రు బుద్ధి నార్యజనంబుల్. 193

వ. 'కావున సకలజనహృదయప్రియహితం బగు పృథ్వీరక్షణంబు నీకుం గుల
ధర్మంబై కర్తవ్యం బగుట యుణువుగాదె' యనిన యమ్మునీంద్రునకు నమ్మసు
జేంద్రుం డిట్టనియె: 194

తే. మఱవ వచ్చునె నా కభిమన్యుద్రౌప
దేయులను గరు మత్స్యభూనాయకుండు
ద్రుపదనృపతియు ధృష్టకేతుండు మూన
సమునఁ బాయుదురే? యెట్లు శాంతి గలుగు. 195

సీ. తొడలపై నర్మిలి నిడికొని న న్నుప
లాలించుచుండు బాల్యమున నట్టి
భీష్మునిఁ జంపితి; బీభత్సభల్లముల్
ధనువు సెక్కఁగ నాతఁడు శిఖండిఁ
జూచుచు నుండుటఁ జూచితి; నది యుల్ల
మలమటఁ బెట్టెఁ; నట్లు గాక
యాభంగి నున్నప్పు డాత డాద్రుపదజు
నేయమి దలఁచిన నెరియు మనసు; 196

తే. పరశురాముని నోర్చినబల్లిదుండు
కాశిరాజకన్యకలకుఁగాఁగ బుడమి
నరపతుల నెల్ల గెలిచినబిరుదుగలన
నాఱుడియ పడు టూహింప నడలు గదురు.

ఆ. అల్పకాల భోగ్యమైనరాజ్యమునకు
గా ననల్పకీర్తిఘనుని జరత
సింహకల్పు వంశశేఖరజన్ముఁ ద్రుం
చితి మనంబు వగలఁ జివుక కున్నె. 197

మ. జనసంపూజ్యపదారవిందుఁ డగునాచార్యుండు శోకించి నం
దనుచొ ప్పారయ వేఁడి, పెద్దయు ననుం దా నమ్మి యర్థింపఁ, జా
వనివానిం గరిచావు బుద్ధి నిడి, "యశ్వత్థామ సచ్చెన్ నిజం"
బని యే భొంకితి; మేదినీశ్వరణ మర్మాంబే గురుద్రోహికిన్ ; 198

ఆ రాజ్యలాభలోభరతుఁ డయి కడుఁ బాప
మైన బొంకుమాట లాడి గురునిఁ
గూల్ప నేర్చినట్టి క్రూరాత్ముఁ డేగతిఁ
బోవువాఁడు సెపుమ బుధవరేణ్యా! 199

క. భ్రాత మహాత్ముఁడు గర్ణుం
డాతనిఁ జంపించి యేలు నవనీరాజ్యం
బాతురత సేయుఁగాక
సుఖాతిశయము మతికి నొసఁగునయ్యా మునీంద్రా! 200

చ. కడిఁదిమగండు కుంభజుఁడు గానఁగ నొడ్డినమంటవోలె నుం
డెడిమొనఁజూచి చూచి, యిది డెప్పర మన్వగలేక పంచితిం
గొడుకుఁ జొరంగ; నత్తెఱఁగు క్రూరత సైఁప సుభద్రయట్లుఁ గ
వ్యడిక్రియ నేర్తురే యొరులు; వల్లభుఁ డే లగు నట్టిఁ డుర్వికిన్. 201

చ. అడ లెదఁ బొందఁగా దగనియట్టిది ద్రోపది మేరుకల్పులం
గొడుకుల నేవురన్ జముఁడు గొన్న నలందురఁ జూడనేర్తునే?
పుడమి గిరీంద్రపంచకము పోయినఁ బాడటినట్టు లున్న య
ప్పడఁతుక యెట్టు లోర్చు గృహభారము నెమ్మది నిర్వహింపఁగన్. 202

క. ప్రాయోపవేశమున ని
ష్కాయంబు దొఱంగు తలఁపు గదిరెడి సంతా
పాయత్తచిత్తున కటక
టా యని పో నిండు ననుఁ దృఢవ్రతయుక్తిన్. 203

వ. అని పలికి బంధుమరణశోకవ్యాకులుం డయి యున్న యన్నరనాథవరేణ్యుతో
నమ్మునినాథవరేణ్యుం డిట్లనియెఁ: 204

ఆ. ఇట్లనంగఁ దగునె; యిమ్మెయి నడల నీ
యట్టిధైర్యమునున కగునె యనఘ!
బుద్ధి సెప్పవలసెఁ బునరుక్తభాషలఁ
జెవులు మదియుఁ గూడఁ జేర్చి వినుము. 205

తే. పొదలుఁ బఱుఁగుటకై పొత వొదవుఁబడుట
కై కడుంజేరుఁ బాయుటకై జనించుఁ
బొలియుటకునై సుఖంబులఁ బొందు దుఃఖ
మొందుటకునై పదార్థము లెందు నధిపఃఁ 206

ఉ. మి తులచేతలన్ సుఖము మేకొను నంటయుఁ, జెందు దుఃఖముల్
శత్రులచెయ్ది నంటయుఁ, సన్మతి దా ధనమూ ఁ బుంటయున్,
గోత్రవరేణ్యఃఁ భోగములపన్ ధనముల్ గరణంబు లంటయుం
జిత్రచరిత్రుఁడైన విధిచేష్ట దొలంగిన నీటిఁ బాంగునన్. 207

వ. కావున నెవ్వఁగ నొందం బనిలేదు. 208

ఆ. ధాత నిన్ను నేమి ధర్మంబు నడపుట
కై సృజించె దాని నాచరించి
యుండు; నీవు నీక యొడయుండవే! ధాత్ర
నోడితప్రవర్తనుఁడవు గాక! 209

వ. అని పలికి యప్పారాశర్యుండు వెండియు నిట్లనుఃఁ విదేహరాజగు జనకుండు వివేకపరిపాకంబు నొందక మున్నొకసమయంబున బంధువియోగంబు వాటిల్ల విషాదంబు నొంది గృహంబు దొఱంగి వెడలువాఁడయ్యె; నట్టియెడ నతని పాలికి నశ్మకుం డను విప్రవర్యుండు వచ్చిన, నవ్వసుమతీపతి సముచిత ప్రకారంబునం బూజితుం జేసి, 210

-:జనకున కశ్మకుండు సెప్పిననీతి వ్యాసుఁడు ధర్మజునకుఁ జెప్పుట:-

సం. 12-2-82

తే. అర్థములు బంధువులుఁ గల్గినపుడు తద్వి
యోగమైనట్టియెడను మర్త్యునకు నెద్ది
తలఁపుమై నున్న మదవిషాదంబు లడర
కుండుఁ జెప్పవె యది కృపాయుక్తి ననఘఃఁ 211

వ. అని యడిగిన నాతం డిట్లనియెఃఁ 212

సీ. దుఃఖంబు సుఖమును దోడివ సంసార
మునకుఁ దద్వ్యశగతిఁ; బోవునరుని
యాత్మ సంబుదము గా డ్పపహరించిన విధం
బున నవి సెఱుచు నేపున సుఖై క
భాగియు దుఃఖై కభాగియు లేమి లో
కంబునం దెలియంగఁ గనుట మందు
వానికి; వినుఁ జర రా నీక త్రోవంగఁ
జావక యుండ వశంబెఁ జలధి

తే. వలయ వేష్టితక్షితి నేలువానికైనఁ
నధిపఁ యెద్ది వాటిల్లిన ననుభవించు
నపుడు ప్రాప్తవ్య మిది యని యంతరంగ
విభ్రమము లేక యునికి వివేకసరణి. 213

క. నరవర సరసాన్నంబులుఁ
బరిమళ సద్వస్తువులును బరమశయనవి
ష్టరములుఁ గాలాధీనత
నరుఁ బొందుం బాయు; వాని నమ్మమియ యుఱున్. 214

చ. వల నధికంబుగాఁ గలుగు వైద్యులు శాస్త్రము లభ్యసించి మం
దుల నొడఁగూర్చ నేర్చి తనదోషము లారయు బుద్ధి గల్గి యా
ర్తులకుఁ జికిత్స సేసెదరు; రోగము వాయమి లేదె; వారు రో
గులగుట గాన; మెట్లు ప్రతికూలవిధిన్ నరునేర్పు ద్రోచునే. 215

సీ. సద్వంశజన్మంబు, సౌందర్యమును, బలం
బును, సుభగతయును, భోగములును,
భవితవ్యతానురూపం బులు పేదలై
పెంచుట కలయఁగఁ బెల్లు పుట్టు
దురు ప్రజలెంతయు సిరిగలవారు గో
రంగఁ బుట్టరు దరిద్రపుజనంబు

లాఁకటం దిని ప్రాలు నజిగించుకొందురు
భోజ్యసంపన్నులు భోజనంబుఁ

తే. బూర్ణముగఁ జేయఁజాలరు భూపవర్య!
వెలఁది జూదంబు పానంబు వేఁట యతిని
షేవితములు గాఁ దగ దిని చెప్ప వినుచు
వలను గలవార చెడుదురు వానివలన. 216

వ. ఆట్టివి దైవకృతంబులు గావున నిష్టానిష్టప్రాప్తులకుం గారణంబులు గనికొన లేవు; బాంధవలాభంబును దద్వియోగంబును వఱదం గాష్ఠంబులు సంగతంబులై పదంపడి పాసినచందంబు. 217

తే. మాతృపితృదారపుత్రకభ్రాతృశతస
హ్రసకంబులు సంసృతి ననుభవింపఁ
బడియె నిందులో నెవ్వరి కడలువాఁడు
నరుఁ డనిత్యత యూహించు టరయ నుఱవు. 218

క. జననజరామరణగ్రా
హనిబిడకాలాబ్ధిమగ్న మని జగము నెఱిం
గినవాఁడు ధర్మవర్తన
మున నుండుం జింత దక్కఁ భూపవరేణ్యా! 219

క. తన యొడ లెర వనినను మను
జునకును బంధుతతి సతమె; శోకించిన వ
చ్చునె చచ్చిన జంతువు నె
మ్మన మధికము నొచ్చుఁగాక మహితవివేకా! 220

ఉ. కావున నెవ్వగల్ విడువు; గైకొను మాత్మకులార్హకర్మసం
సేవనతత్పరత్వము; విశిష్టజనంబులసంగతిన్ భవ
ద్భావము కల్మషంబు దెగఁ బాచి శుచిత్వముఁ బొందు; లోకసం
భావితకీర్తి వయ్యెదు నృపాలక; నాపలు కూఁదు పాటిగాన్. 221

వ. 'అనుటయుం దెలిసి జనపుం డమ్మునిం నామంత్రితుంజేసి నిజకర్మతంత్రనిర్వ

హణంబునకై గృహంబున నిలిచె; నీవు నట్ల యుమ్మలికం బుజ్జగింపు; ముత్త మక్షత్రసరణి సాధితంబైన భూవలయంబుఁ బాలింపుము; తక్కటితలంపులు దక్కు'మని పలికిన విని పలుకకున్న యగ్రజుం జూచి సవ్యసాచి జనార్దనుతో నిట్లనియె :

క. బహుబంధుమరణశోక
ప్రహతవివేక మయి ధర్మరాజునకు మనో
మహిమ వికల మయ్యెం బర
మహితవచోవృత్తిఁ దేర్పు మహితవిచారా! 223

చ. అనిన, నచ్యుతుండు పాండవాగ్రజుఁ జేరంజని, యభివందనం బాచరించి, యతని కరంబు వట్టికొని, వదనంబు విరిదమ్మిచందంబు నొంద మధురాక్షర విన్యాసంబుగా నిట్లనియె : 224

మ. పురుషవ్యాఘ్ర! మనంబు గుంద వగలం బొందంగ నీ కేల? సం
గరకేలిన్ భవదీయబంధు లతిలోకంబైన తెం పొప్పఁబో
యిరి నాకంబున; కట్లుగాక కలగాదే రాజవృత్తంబు దా
నరయన్ రాజుల యేల యేజనులు నిత్యాయుర్ధనుల్ సెప్పుమా! 225

వ. అని పలికి వెండియు. 226

తే. తొల్లి సృంజయుఁ డను మహీవల్లభుండు
పుత్రశోకాతురత్వంబుఁ బొందియున్న
నుపశమంబుగఁ బ్రాక్తనస్మృతులఁ జెప్పి,
తెలిపె నిమ్మోని యంతకుబలిమికలిమి. 227

వ. అని యెటింగించి నారదుం జూపి, 'యిమ్మహాత్ముం డట్లు మరుత్తసుహో త్రాదులగు రాజుల పరమోత్కృష్టకర్మంబులును, నట్టివారికిం గాలవశత్వం బునం బొందకుండరామియుం దెలియ నుపన్యసించిన వాక్యంబు లభిమన్యు మరణశోకవ్యాకులుండవగు నీకుం దాపోపశమంబుగాఁ గృపాతిశయంబునం బరిపాటి వీరలు సెప్పి' రని పారాశర్యమునీశ్వరు నిర్దేశించి 'వీరివచనం బుల యేనుఁ జెప్పెద నాకర్ణింపు' మని యిట్లనియె : 228

-:ధర్మరాజునకుఁ గృష్ణుఁడు షోడశరాజులచరిత్రంబులు సెప్పుట:-

సం. 12.29.16

సీ. సంవర్తుఁడను మహాసంయమి దేవతా
గురుతోడి యాసున నరుగుదెంచి
పూని యుపద్రష్టయై నడపంగ హి
మాచలపాదంబునందు శక్ర
వరుణప్రభృతు లైనసురలు మహామునీం
ద్రులును సహాయులై మెలఁగుచుండ
శాలాప్రముఖభవ్యసాధనమ్ములు గన
కమయంబులుగ వస్త్రకాంచనాజ్య

ఆ. దధిపయఃఫలాదితర్పణద్రవ్యస
మృద్ధి సకలజనులు మెచ్చఁ బెక్కు
లధ్వరములు సేసె నట్టి మరుత్తుండు
నిత్యపదవి నుండ నేర్చెనయ్య. 229

సీ. సన్మార్గమున రాజ్యసంపద నొంది భూ
సురపూజ లొనరించి సుప్రతముల
బృందారకులఁ బ్రీతిఁ బొందింపఁ దన కర్థిఁ
బర్జన్యుఁ డేఁటేఁట బసిఁడివాన
కనకమయము లైన కర్కటరుషనక్ర
కూర్మచయముతోడఁ గురియుచుండ
నయ్యర్థమెల్ల ధనార్థుల కిచ్చుచుఁ
గురుజాంగలంబునఁ బరమనిష్ఠ

ఆ. నశ్వమేధముఖములై న రాజార్హా య
జ్ఞములు పెక్కు సేసి సకలజనులు
పొగడునట్టిపాట నెగడె సుహోత్రుఁ డ
ధ్వభుఁడు దెగియె ననుట వినమె యధిప ! 230

సీ. కాంచనాలంకారకాంతంబులై రూఢి
కెక్కినగజములు పెక్కువేలు
జవసత్త్వరూపాదిసకలగుణముఁ బెం
పెసఁగినహయము లనేకలక్ష
లమలినస్వర్ణ మయములగు కొమ్ములం
గొమరారుపసువులు గోటు లూర్జి
తాంగకవిలసదజావికంబులు గణ
నాతీతములు గన్య లప్రమేయ

ఆ. లఖిలరత్నవిరచితాభరణంబు ల
నల్పములు మహీసురావళులకు
నిచ్చి చేసెఁ గ్రతువు లెన్ని యేనియు నంగుఁ
డతఁడు నన్యలోకగతుఁడు గాఁడె! 231

సీ. ఏడుదీవులయందుఁ గీడాగతులఁ దన
రథము చరింప నరాతు లనఁగ
వినయు నెఱుంగక విభవ మార్జించుచోఁ
బ్రజల నొప్పింపని పరమపుణ్య
కర్మంబునకు మెచ్చి గారవంబున దన
కక్షయసాధనము ఫాలాక్షుఁ డొసఁగ
నశ్వమేధములు జాహ్నవిపొంత శిష్టజ
నాకీర్ణములుగఁ బెక్కాచరించెఁ;

ఆ. దారకములు వృష్టిధారలు లెక్కింప
వచ్చుఁగాని యతని యిచ్చుగోవు
లెన్నఁ గొలఁది గాదు; సన్నుతిపాత్రమా
శిబికి నుర్వి నునికి సెల్లె నెట్లు? 232

సీ. యౌవనంబునఁ దప మాచరింపఁగఁ దండ్రి
పంపున నరిగినపెంపుకలిమి,

సేతువు జలధిఁ బ్రఖ్యాతంబుగా నొన
ర్చిన మర్త్యలోక పావనవిభూతి,
త్రైలోక్యకంటకు దశముఖు బంధుయు
క్తంబుగాఁ జంపినకలితనమ్ము,
బాలురమరణంబు వాటిల్లకుండంగఁ
జేసిన యత్యంతచిత్రమహిమ,

ఆ. గలిగి యశ్వమేధములు మున్నుగా ననే
కాధ్వరము లొనర్చి, యఖిలజనులఁ
దల్లి వోలె నరసి, దశరథరాముండు
కాలవశత నొందెఁ గాదె యధిప! 233

సీ. పూర్వపంథ్యలఁ గాపఁబూని వియద్గంగ
నవని భాగీరథి యనఁగఁ బఱపి,
శక్రుండు మెచ్చఁ బరాక్రమంబునఁ బేర్చి
యప్రతిహతముగ నశ్వమేధ
యాగంబు లొనరించునప్పుడు వేయువే
లరథంబులందుఁ గన్యల నలంక్ర
తలఁజేసి యునిచి రథంబు రథంబున
కిభములు నూఱునూఱేసి యేనుఁ

తే. గేనుఁగునకు గుఱ్ఱములు వేయేసిపాటి
హయముహయమున కట్ల గోచయ మమర్చి
భూరి భూరియుతంబుగ భూసురులకు
నొసఁగినట్టి భగీరథుం డున్నవాఁడె ? 234

సీ. అర్థి విశ్వావసుం డాదిగాఁ గలుగు గం
ధర్వులు హృద్య వాదన మొనర్ప,
నప్సరోనికురుంబ మాటలుఁ బాటలు
నై వినోదింపగ నమరగణము

బహువిధాలంకారభంగుల విన్నాణు
పులు సూప దివ్యములు నుతింప,
మనుజలోకంబెల్ల గనకాన్నవస్త్రభూ
షణదానములఁ దృప్తి సనఁగ నశ్వ

ఆ. మేధసమితిఁ జేసి మెప్పించె నింద్రుని
శతమాధ్వరమున నతఁడు హయము
నాసపడిన నిచ్చె నాదిలీపునిఁ జూపు
మా ధరిత్రి నిపుడు మనుజనాథ : 235

సీ. జనన మాదిగఁ బాకశాసనుకరమునఁ
బ్రభవించునేయును బాలుఁ ద్రావి,
ద్వాదశదినము లాతఁడు గారవింపంగ
వర్ధిల్లి పండ్రెండువత్సరముల
ప్రాయమై రాజ్యసంప్రాప్తి కి నేతెంచి,
యర్కనియుదయంబు నస్తమయము
నగుపట్టు పొలిమేరలైన మహాక్షేత్ర
మంతయు నొక్కండ యనుభవించె,

ఆ. నన్నపర్వతముల నాజ్యనదుల విప్ర
భోజనము లొనర్చి రాజసూయ
ములును నశ్వమేధములుఁ జేసె మాంధాత్య
డిందు నిలిచెనే నరేంద్రముఖ్య! 236

సీ. అనిమిషాసురయుద్ధమున నసురావలి
సమయించి, వర్ణాశ్రమముల నేర్ప
రించి, భూమి యలంకరించి, యగ్నిష్టోమ
హయమేధవాజపేయాతిరాత్ర
పౌండరీకము లనఁ బరగిన యధ్వరంబు
లనేకములు సేసి, భూసురులకు

నఖిలభూములఁ గల యర్థంబులెల్లను
దనకని యేమియు ననుప కిచ్చె

ఆ. శుక్రునల్లఁ దనగ శోభిల్లి తనయందు
ధర్మతత్త్వ మూర్జితముగ నియమ
నిష్ఠుఁడై యయాతి నెగడె; శాశ్వతుఁ డయ్యె
నే నృపాలఁ యమ్మహీశ్వరుండు? 237

సి. ఓర్వక పెక్కండ్రు ఋర్వీశు లొక్కటఁ
బైనెత్తివచ్చిన భండనమున
వారిహేతిచ్ఛత్త్రివాహనధ్వజములు
నఱికిన నడునడ నడిఁకి, వార
లభయంబు వేఁడిన నందఱఁ గృపఁ గాచి,
యేచి యాపెన్నేలయెల్లఁ దాన
కొని యధ్వరములు పెకొక్కనరించి వేడుకఁ
బాయసంబులు నపూపములు మోద

ఆ. కములు లోసుఁగాఁగలవంటకముల ను
ర్వీసురాపతులకుఁ బ్రీతిఁజేసి
దక్షిణలుగ మణివితానంబు లిచ్చిన
యంబరీషుఁ డేమి యయ్యె జెపుమ. 238

సి. లక్షభార్యల నుపలాలించి, యొక్కొక్క
వెలదికి వేవురు వేవురాత్మ
జులు గాఁగఁ బదికోటు లలఘుమూర్తులఁ గాంచె,
వారును దోర్బలోజ్జ్వలులు నార్య
చరితులునై పేర్చి తురగమేధంబు
లందఱు బహుదక్షిణోదాత్తభంగిఁ
జేయుచుఁ దనపంపు సేసి వర్తింపఁ గఁ
దానును విశ్రుతాధ్వరము లొప్పఁ

తే. బెంపుసొంపును సుగ్రతసంపదయును
నిర్మలశ్రద్ధయును గర్మనిపుణతయును
నెఱయ శశిబిందుఁ డొనరించి నెగడె; నతడు
వడయఁ జాలెనె యెన్నఁడుఁ జెడని యొడలు. 239

సీ. అధికతపంబున నగ్ని నారాధించి
ప్రత్యక్షమగుటయు బ్రహ్మచర్య
వ్రతంబు దమమును వేదవిత్త్వము సహిం
సయుఁ బాత్రదానంబు శమము వరము
గాఁ గోరికొని, వేదికాస్థలి మణికన
కాత్మికయై ముప్పదాఱుయోజ
నములదైర్ఘ్యము నంత కమరువిస్తారంబుఁ
గలుగంగ నొనరించి, క్రతువుసేసి,

తే. విప్రవితతికి దాన మతిప్రియముగ
నిచ్చెఁ దనపేర గయ నుతి కెక్కఁ వటము
పొగడు వడయంగఁ బుణ్యుఁడై నెగడె గయుఁడు
భూవరోత్తమ! యతఁ డెందుఁ జోయెఁ జెపుమ. 240

సీ. ఇరువదివేవురు పరిణతపాచకు
లభ్యాగతులకును నతిథులకును
బాటించి క్రొత్తగాఁ బవలును రేయును
వలయునన్నము లిడ వెలసి పశువు
లర్థి నుత్తమగతికై తార చనుదేర
విశసించు చమరులు వేడ్కఁతోడఁ
బొడసూపి కడుపారఁ గుడువ హవిర్భాగ
ములు వెట్టు నివ్విధంబున మహాద్భు

తే. తముగ నొనరించె సత్రయాగము తదుత్స
వంబు గొనియాడ వచ్చినచారలెల్లఁ
బ్రచురపుణ్యాత్ముఁ డననొప్పె రంతిదేవుఁ;
డవ్విభునకును వలసె లోకాంతరంబు. 241

సీ. శరభసింహాత్యుగ్రసత్త్వచయంబుల
నేడిక లెట్టట్ల యెక్కి యాడి
కట్టుచు విడుచుచుఁ గణ్వాశ్రమంబున
దమియింపఁగా సర్వదమననామ
మిడియె నమ్మని; పదంపడి మహారాజ్యప
దస్థుఁడై కాళిందితటమునందు
భాగీరథీతీరభాగంబునను సర
స్వతిసమీపమునను వాజిమేధ

తే. రాజసూయాదివివిధాధ్వరము లొనర్చి
కనక నిర్మిత కరితురంగమరథంబు
లసదృశప్రీతి విప్రుల కొసఁగె భరతుఁ;
డన్నరేంద్రచంద్రుండును జన్నవాఁడ. 242

సీ. మిట్టుపల్లంబునై మెలఁగంగఁ దనరథ
ప్రముఖవాహనములఁ బటుప ననువు
గాకున్న మేదినిఁ గని, సమస్థలియుగ
వెరవున నొనరించి విశ్రుతముగఁ
దనపేర బృథివినాఁ జనఁ జేసి, గోరూప
మైన యివ్వసుమతి నమర నగముఁ
బనిచి యోషధులును బహురత్నములుఁ బిది
కించి జనంబుఁ బోషించెఁ బృథుఁడు

తే. సేసె నానాధ్వరము; లవి సెప్పనేల;
సకల ధాత్రి బ్రాహ్మణులకు సత్కరించె;
నమ్మహాభావునకు నతులయశమ
కాక సుస్థిర మయ్యెనే కాయ మనఘ! 243

సీ బ్రహ్మవిద్వేషంబుఁ బరికించి కోపించి
యవిజేయుఁడైన సహస్రబాహుఁ
బరిమార్చి, నృపతులఁ దరిమిడి తునుమాడె
నిరువదియొక్కమా ఱెల్లచోట
సందఱ యేలెడు నన్నిభూములుఁ దాన
యేలె ధర్మోజ్జ్వలపాలనమున,
రాజయోగ్యములు ధరామరార్హాంబులు
నగునధ్వరములు పె క్కాచరించెఁ,

ఆ. గశ్యపునకు నిచ్చి కాశ్యపి యనుపేరఁ
జనఁగఁ జేసె నుర్వి, జామదగ్న్యు
వినమె; యామహాత్ముఁడును ససంతోషవి
భ్రాంతి గలిగెనేని బ్రదుకలేఁడు. 244

వ. అని చెప్పిన యప్పుండరీకాక్షునితోఁ బాండవాగ్రజుండు 'నృంజయసుతుండైన సువర్ణష్ఠీవిజన్మంబును వాడు మృతుండయినవిధంబును వినినది యయినను సువ్యక్తంబుగా వినవలతుం జెప్పవే' యనిన నతం డతని కిట్లను: 'నీకు నాఁడు కృష్ణద్వైపాయనుం డక్కమారువృత్తాంతంబు నారదునధీనం బగుటం జేసి తద్వ్యాపారంబు సెప్పె; బర్వతునిం చెప్పండు; గాని బర్వతుండును సహకారి; యత్తెఱం గాకర్ణింపుము: 245

—:శ్రీకృష్ణుఁడు ధర్మజునకుఁ బర్వతనారదులవృత్తాంతంబు సెప్పుట:-

సం. 12-30-4

సీ. అధిపఁ నారదు చెలియలి కొడుకప్పర్వ
తుం; డిద్దఱును మహీమండలమునఁ
ద్రిమ్మరువేడుక దివినుండి యొక్కటఁ
జనుదెంచి, తమలోన సమయ మధిక
నిష్ఠమైఁ జేసిరి 'నిజచిత్తవృత్తు లొం
డొరులకు దాఁపక యుండువార

మటుకాక దాఁప శాపార్హత వాటిల్లఁ
గలయది' యని; యిట్లు గలయఁబలికి

తే. యుచితవర్తనమున నుండి, యొక్కనాఁడు
స్యంజయునిఁ గాంచి యతడు విశిష్టభక్తి
నర్చనము సేసినను 'భవదాలయమున
ననఘ! వసియింతుమే కొన్నిదినము' లనిరి. 246

వ. అని పలికిన, నాపృథ్వీపతి ప్రియంబంది, సుకుమారి యనుపేరం బరగిన నిజ నందన రావించి, 'యిక్కన్నియ మీకుం బరిచర్యసేయ సమాధానంబున నుండుం'డని, యన్నెలంతతో 'నీవు దేవోపచారంబుల వీరి నారాధింపు' మని నియోగించి, వలయువస్తువులు సమగ్రంబులుగా సమకట్టినం, బ్రీతులై యమ్మునులు సుఖం బున్నసమయంబున. 247

సీ. అల్లదనంబున యనువు మైకొనఁ జూచు
నడపుకాంతికి వింతతొడవుగాఁగ
వెడవెడనూఁగారు వింతయై యేర్పడఁ
దారనివహులలో నారు నిగుడ
నిట్టలు ద్రోచుచు నెలపులకలమేర
లెల్లను బిగియెక్కి యేర్పడంగఁ
దెలుపును గప్పును వెలయంగ మెఱుఁగెక్కి
తారకంబుల గల్కితనము దొడరఁ

ఆ. జరణములును నడుముఁ జన్నులుఁ గన్నులు
జవ్వనంబుచెన్ను నివ్వటిల్లు
చునికిఁ దెలుప స్యంజయునిపుత్రి మెలఁగువి
ధంబు నారదునకుఁ దగు లొనర్చె. 248

క. నారదుఁడు మదనబాణా
సారము దనుఁ బొదువ ధైర్యసార మెడలి దు
ర్వారమనోవ్యథ వంతం
గూరి క్రమంబునఁ గృశాంగకుం డయ్యె నృపా ! 249

వ. అట్లు కాముఁబాసి బడి నలంగియుఁ దనతో నుగ్గడింప సిగ్గుపడి. 250

చ. వెనుఁబడుచిత్తవృత్తియును వెల్వెలఁబాఱెడునాననంబు నై
యనిశముఁ గుందు మామఁ గని, యల్లుఁ 'డితం డిటు లేల వంతఁ బొం
దెనొ' యనుచింత నొందిన, తనదివ్యమతిం బరికించి కాంచి, 'కూ
డునె సమయంబు దప్పఁగఁ గడుంగుటిలాత్ముఁడ వై తి నాయెడన్'. 251

ఆ. 'రాచకూతుమీఁద రాగంబు పుట్టుట
నాకుఁ జెప్పవైతి; నీకు శాప
మిత్తు; నమ్మృగాక్షి నీవు వరింపక
నిలువలేవు మరుఁడు బలియుఁ డగుట.' 252

వ. 'పాణిగ్రసాణానంతరంబ వానరవదనుండ వగు' మనవుడు నారదుండు 'నీకు నాకలోనంబునకుం జనుట లేకుండెడు' మని ప్రతిశాపం బిచ్చినం బర్వతుం డచ్చోటు వాసిపోయి భూజనంబులు పూజింపఁ బ్రవర్తిల్లుచుండె. 253

శా. శాపప్రాప్తి కి నోర్చి తా నడిగి యాచంద్రాస్య నన్నారదుం
డాప్యుర్వీపతి యూఁబ్రియంబున వివాహంబయ్యె నమ్మాత్రలో
భూపాఃయమ్మని వానరాననతమైఁ బొల్పేద నక్కాంత త
ద్రూపప్రాప్తి విరక్తగాక తగఁ బ్రీతుం జేయునుండెం బతిన్. 254

వ. ఇట్లు పతివ్రతయై సుకుమారి నారదు నారాధించుచుండెఁ; బదంపడి యొక్కనాఁ డేమేనియుం బనికి వనంబునకు నారదుండు వోయినయెడం బర్వతుండు దబ్బాటగాంచి నమస్కరించి 'నా కిచ్చిన శాపంబు మరల్పవే' యనుటయు, నారదుండు 'నీవుగావె మున్ను శపియించినవాఁడవు ముందర నీయిచ్చిన శాపంబు మరలందగు' నని పలికిన నతం 'డట్లకాక' యనియె; నివ్విధంబున నొడంబడి యిరువురు నొండొరువులశాపంబులు మరల్చి; రయ్యల్లుండును మామతోడన వచ్చి మందిరప్రవేశంబు సేయుసమయంబున నారాజనందన నిజపురుషుం జూచి పరవురుషుండకాఁ దలచి మఱిచూడక మాఱుమొగంబు వెట్టికొని పోవుటయు. 255

ఆ. నగుచుఁ బర్వతుండు నాతి నీపతి యగు
విశ్వసింపు మని సవిస్తరముగ శాప

ములును మోక్షసంవిధానములును
జెప్పి తేర్చె దానిచిత్తవృత్తి. 256

వ. ఇట్లు నారదుండును బర్వతుండును బరస్పరప్రియకారులై రి. కారవోత్తమా! నీయడిగిన సువర్ణష్ఠీవివృత్తాంతంబు నిమ్మునివరుండు దేటపడం జెప్పెడు నని స్మృంజయపుత్రచరిత్రకథనంబు నారదుక్తయ్యంబుగాఁ బలుకుచు నతనిం జూపిన నాతం'డిప్పుడు శౌరి చెప్పినయంతయు నిట్టిద యక్కుమారుతెఱంగుఁ జెప్పెద నాకర్ణింపు'మని యప్పాండవాగ్రజున కభిముఖుండై యిట్లనియె: 257

సీ. అవ్విధంబున నేను నల్లుండు సంప్రీతి
స్మృంజయుపాల వసింపఁ గొన్ని
సంవత్సరంబులు సనినఁ దదాశ్రిత
బ్రాహ్మణోత్తముల సంప్రార్థనంబు
గలుగంగ మాకును గమనేచ్ఛ పుట్టంగ
నారాజునకు నుపకార మొకటి
సేయఁ దలంచి యే మాయనసన్నిధి
కరిగి 'కోరుము వర' మంటి మనిన

ఆ. నతఁడు 'మీరు ప్రీతులయినకంటెను నొండు
గలవె వరము' లనిన గారవించి
'యనిమిషులను మిగులుతనయునిఁ బడయుంగ
వలచి యుండు దట్టివానిఁ గనుము.' 258

వ. అంటి; మట్టియెడ నింద్రతేజోరక్షణాయత్తచిత్తుండగు నప్పర్వతుం డప్పుడమి జేనితో 'విను మక్కుమారుండు దీర్ఘాయురుపేతుండు గాకుండు' ననియె; దానికి నమ్మానవపతి యుమ్మలించి యమ్మహాత్మునాననంబునం జూడ్కి నిలిపి, 'యిట్లేల యుష్మదనుగ్రహం బనూనంబు గావలవదే' యని ప్రార్థించిన నమ్మాట కమ్ముని మఱుమాట వలుక కున్న నే నన్నరనాథుపైఁ గలుగు కరుణావిశేషంబున. 259

తే. వలదు శంకింప నింద్రునివలనఁ బుట్టు
నెడరు వొందక యుండంగఁ గొడుకు నోపి

నంత గావుము; గావంగ నైన చావు
నపుడు నన్నుఁ దలంపు; మే నది మరల్తు. 260

వ. అక్కుమారుండు నిజనిష్ఠీవనాదులు సువర్ణమయంబు లగుటంజేసి సువర్ణష్ఠీవి
యనం బరగుఁ బ్రమోదంబునం బొందుము. 261

క. అని యూఱడిలఁ బలికిన
విని యాతఁడు సంతసంబువెల్లిం దేలెం
జని యే మీప్సితవర్తన
మున నుండితి; మవ్విభుండు పుత్రునిఁ గాంచెన్. 262

వ. వాఁడును మలమూత్రలాలాశ్రు స్వేదంబులు గనకమయంబులయి తొరుగం
బెరుఁగుచుండె; నాసమయంబున నెడరువేచి వెంగలు లగు ప్రుచ్చు లబ్బాలుం
బట్టి నోరం జీర దుజిమి యడవికిం గొనిపోయి యొడలు జల్లించి పసిండి
గానక పీనుంగు వైచి పోయిరి. స్ృంజయుండును దనకొడుకు నింద్రుం
డపహరించె ననుతలంపున శోకార్తి నొంది పలవించుచు నన్నుం దలంచినం
బోలు, నీకుం బుండరీకాక్షుం డప్పుడు సెప్పినమహనీరాజివిషయంబు లగు
శోకోపశమనవచనంబులు సెప్పి యంకిలి దీర్చి యపచారపరుంగు తస్కరు
లాశిశువుం జంపుట యెఱింగించి, 263

క. ముచ్చులమూఢత్వమునం
జచ్చి నరకవాసమునకుఁ జనిన తనయు నేఁ
దెచ్చి మగుడంగ వే నీ
కిచ్చెద వగ పుడుగు మింకనేనియు నధిపా! 264

వ. అని చెప్పి యేనును. 265

క. భావమున నమ్మెయికిఁ దగు
దీవన యిచ్చుటయు, నరుగుదెంచె సువర్ణ
ష్ఠీవి గడునద్భుతమ్ముల
నావిభుఁడుఁ బ్రమోదసంభృతాత్ముం డయ్యెన్. 266

తే. అతని వీడ్కొని సంప్రీతి నరుగుచుండి
యిద్రుఁచేత గా ధిని విను మక్కుమారుఁ

జంప నింద్రుడు వేచు రక్షణము మాని
వలదు నీ వని చెప్పితి వసుమతీశ! 267

-: శార్దూలంబుచేఁ జచ్చిన, సువర్ణష్ఠీవి నారదువలనఁ
బునర్జీవితుఁ డగుట :-

సం. 12-31-41

వ. ఏను బోయినకొండొకకాలంబునకు నాభండలుం డక్కు-మారుండు దన్ను మిగులునని శంకించి చంపిఁపందలంచి, నన్నుం బర్వతునిం దలంచి పుయిలోడి బృహస్పతితో విచారించిన నతం డతనిభయం బుడిపె; నతండును దివ్యంబగుట సబుద్ధికంబైన వజ్రంబు నాలోకించి నీవు శార్దూలరూపంబున స్నంజయ సుతుండగు సువర్ణష్ఠీవిఁ జంపు మనుటయు, నప్పని పూని యది సను సమయంబున. 268

సి. స్నంజయుం డుజ్జ్వలశ్రీసముల్లాస!ప్ర
హర్ష మొప్పుంగఁ బ్రియాంగనలును
దానుఁ గుమారయుక్తముగ భాగీరథీ
తీరకాంతారప్రదేశనిత్య
వసనేచ్ఛమెయి నుండి కుసుమాపచయముఖ
బహువిధకేలితత్పరత నొంది
యొండుదలంపు లేకుండ నద్దంభోళి
పంచన నయ్యెడుఁ బొంచి నిలిచి

తే. తెఱపి గాంచి శార్దూలమై యుజ్జికి వార
బోఁప్రసమయాను నమ్మానవేంద్రతనయు
ప్రచ్చి యంతర్హితంబయ్యె; జచ్చె వాఁడు
దాది యాక్రోశమున నార్త నాద మెసఁగ. 269

క. విని స్నంజయుండును బ్రియా
జనములు వే పాఱుదెంచి చచ్చినబాల్యం

గని బహులశోకపూరం
బున మునింగిరి విప్రలాపములు పెల్లెసఁగన్. 270

ఆ. అట్టి యవసరమున నమ్మహీపతి నన్నుఁ
దలఁచె; నప్పు డేను బలవిరోధి
మదివిరోధ ముడిపి మసలక వచ్చి య
బ్బాలు ప్రాణ మెత్తి ప్రమద మెసఁగ. 271

వ. ఉచితసల్లాంపంబుల నించుకసేపు నిలిచి, యన్నరపతి యనుమతి సేయ నరి
గితి; సువర్ణష్ఠీవియుం దండ్రికి సంతసం బెసంగు తెఱంగునం బ్రభుల్లి యతని
పిమ్మటం బృథ్వీభారంబు పూని శిష్టానుగ్రహదుష్టనిగ్రహంబులు నడపుచు
జన్నంబులు సేయుచు శతాధిక సహస్రసపర్షంబులు రాజ్యంబు సేసె-నని
చెప్పి నారదుండు వెండియు. 272

చ. హరియుఁ బరాశరాత్మజుఁడు నాదరణాతిశయంబునన్ సవి
స్తరత నుపన్యసించిన వచఃప్రకరంబు మహార్థగాఢ మి
ప్పరమహితోపదేశములు పాటిగఁ బట్టి వసుంధరాధురా
ధరణ మొనర్పు మయ్యెడు నుదాత్తయశంబును ధర్మవృద్ధియున్. 273

వ. అనిన నజాతశత్రుం డూరకున్నఁ బరాశరపుత్రుండు పరమకరుణావిధేయ
చిత్తుండై యతని నుద్దేశించి యి ట్లనియెఁ: 274

సీ. క్షత్రియులకుఁ బ్రజాసంరక్షఁ గదచిన
ధర్మఁబు గలుగునేఁ దానివలన
వేదసంచోదితవిప్రకర్మంబులు
లెస్స లయ్యెడు; నదిలేకయున్నఁ
జెడియెడు; లెస్సైనఁ జెడినను రాజున
కగుఁ బుణ్యపాపంబు లగ్గలములు;
గాన జనాభిరక్షణ మొనరింపుము'
నావుడు నన్నరనాథుఁ డిట్లు

తే. 'మీరు సెప్పంగ నురియాట మేలె ? రాజ్య
కాంక్షమిగిలి యే(జంపంగ(గాని యట్టి
వారి(బలువుర(జంపిన క్రూరతావి
శేష మాత్మ దహించుట(జేసికాక.' 275

వ. అనిన విని యమునినపతి యమ్మహీపతి కిటనియె: 276

చ. మనుజులు సేయ నెవ్వరు? సమస్త మునీశ్వరునాజ్ఞ(జెల్లెడు;
న్వీనము; కుఠారపాణి ధరణీరుహముల్ సఱుకంగ(బాపమెం
దునొకొ! కుఠారమున్ జనులు దోసము(బొందరు; కర్త యీశ్వరుం
డనియెడి నిశ్చయంబు దృఢమై మదినిల్చిన(జాలు భూవరా! 277

వ. కర్మఫలం బీశ్వరుని యదియ తదర్పణబుద్ధిసహితంబుగా(బ్రబుద్ధులు వేద
చోదితకర్మంబు లనుష్ఠింతురు. 278

తే. ఒప్పకున్నను నాత్మకులో క్తకర్మ
మూర్ధ్వగతి(జేర్చు(; బరకర్మ మొప్పెనేని
నార్యజనములు గిల్బిషమంద్రు దాని(;
గాన నడుపుము నిజవంశకర్మ మధిప! 279

క. అరివధము పాప మని మది
మెరమెర గలిగినను దగినమెయి(జేయుము భూ
వర! ప్రాయశ్చిత్తము గృహ
ధుర యుడుగుట మేలె కీడుతో(జన నగునే. 280

వ. అనుటయు(గొంతేయాగ్రజుండు సాత్యవతేయునాననం బాలోకించి 'పుత్రులుం
బౌత్రులు నన్నలుం దమ్ములు జనకులుం దాతలు మామలు గురువులు
సంబంధులు సఖులు నల్లురు బావలు మఱఁదులు మఱియు(బవిత్రిలగుధాత్రీ
పతులు నాచేత మడిసిరి; తదీయస్త్రీజనంబులు పతిసుతసోదరపిత్రమరణశోక
సంతాపాతిశయంబునం బలవించి పఱవించి ప్రాణంబులు విడుతురు; గావున
దాని సూక్ష్మంబుగా విచారించిన వనితావధపాతకంబునుం బాటిల్లె; నెయ్యది

కడగా నిష్కల్మషుండ నగుదు నను వెగడున మునింగిన మనంబు మహీ
భరణంబున కెట్లు సొచ్చు? నుగ్రంబైన తపంబునం దనువు దొఱంగుటదక్క
నొండువిధంబు నాకుం జూడ లేకున్నయది' యనిన విని యమ్మునీశ్వరుండు
నిజబుద్ధి నిపుణంబుగా నిరూపించి యన్నరవతి కిట్లనియె: 281

సీ. విడువు మమ్మలికంబు; వినుము, నీచెప్పిన
యందఱు భూములు కాసపడియుఁ
బెంపును దేజంబుఁ బేరును గోరియు
నీసున సమరంబు సేసి చచ్చి;
రాపని కిల్బిషం బగునె నీ? కట్టును
గాక వారల నెట్టి కర్మగతులు
మృతులఁ గావించెనో మతి నెఱుంగుదె? వాని
నెఱుఁగు గాలుఁడు; చావ నేరి కెద్ది

తే. తఱి యతం డడ్డు దెగటార్చు; దాని నీవు
సేసినాఁడవుగా మదిఁ జింత సొనిపి
యుడుకు టొకవెట్టి; దీనిపై నొల్ల గృహము
విడుతుఁగా కను టిది పెద్దవెట్టి యధిప: 282

క. నేర్పరి పెక్కువిధంబుల
నార్పఁగ బొమ్మలు గడంగి యాడెడు చందం
బేర్పడఁ గాన్పము కాలస
మర్పితకార్యకరులైన మానవులదెసన్. 283

వ. నీకుం బాపంబునకుం బనిలేదు; పని గా కుండుంగాక. 284

క. ఇచ్చుకృపకల్మి యొప్పదె;
చచ్చిననరపతులయేలుజనపదములు నీ
విచ్చెదవు గాక మనమునఁ
బొచ్చెము లేక తగ వారిపుత్రుల కధిపా: 285

ఆ. కొడుకు లేనిచోటఁ గూఁతుఁ బ్రతిష్ఠింపు;
దానఁజేసి వారితల్లు లధిక
హర్షమొందుదురు; ప్రియంబును నీకగుఁ;
బుణ్యమును యశంబుఁ బొందు నిన్ను. 286

మ. అనుమానింపకు; తోడఁబుట్టువులు గారా తున్మితూఁటాడె నెం
దును గ్రొన్నెత్తురులేఱులై పఱవ నింద్రుం డుగ్రతన్ దైతుల్యున్;
మును లవ్వీరు భజింపరే? క్రతువు లామోదంబుతో నమ్మహా
త్మునిఁ జేయింపరె? యూర్ధ్వలోక మదిగాదో? యేలఁడో నాకమున్? 287

శా. నీవున్ ధర్మవిరోధులైన జనతానింద్యాత్ములం బుణ్యమా
ర్గావష్టంభము దేజరిల్ల నృపవంశాచార మొప్పారఁ దో
డై వీరానుజు లుల్లసిల్లఁగ మహోగ్రాజిం దెగం జూచి తా
దేవాధీశుఁడపోలె; శిష్టపరిషత్సేవ్యుండవై తాపనిన్. 288

ఆ. వలయునేని యధిప వాసవుచాడ్పునఁ
గ్రతుపరుండ వగుము; రాజధర్మ
కలితమైనపుడమిఁ గైకొమ్ము; తొలిదొలి
యశ్వమేధయాగ మాచరింపు. 289

వ. అనిన విని యంకిలి దేఱిన డెందంబుతో ధర్మనందనుం 'డెట్టికర్మంబులు
పాపంబు? లేపాపంబున కెట్టిప్రాయశ్చిత్తంబు? మునీంద్రా! యెఱింగింపవే'
యనుటయు నతనికి నమ్మహాత్ముం డిట్లనియె: 290

:—కృష్ణద్వైపాయనుఁడు ధర్మజునకు ధర్మాధర్మంబు లెఱింగించుట:-

సం. 12—35—1

ఆ. ఆగమోక్తకర్మ మాచరింపమియు, ని
షిద్ధమైనదానిఁ జేయుటయును,
బ్రాజ్ఞజనులు ధరణిపాలవరేణ్య! చె
ప్పుదురు పాపములుగ బోధ్యతతికి. 291

వ. ఇది కల్మషసామాన్యనిర్దేశంబు; విశేషంబు వినుము: 292

సీ. ఆదిత్యానుదయాస్తమయకాలముల నిద్ర
బొందుటయును, బ్రాతభూతు డింటి
కరుగుదెంచిన బూజ యాచరింపమియును,
బరదారగమనంబు, గురుల కెదురు
సేతయు, గ్రామంబు సెఱుచుటయును, వేద
విక్రయంబును, రసవిక్రయంబు,
భృత్యబ్రోవమియు, నసత్యోపచారంబు,
గహనదాహము, నన్యకర్మకృతియు,

తే. దనదుకర్మంబు విడుచుటయును, వృథాప
శుప్రహరణంబు, మేదినీసురులకలిమి
గొనుటయును, శరణార్థి జేకొనమి, విప్ర
వధయు, బాపంబులందురు బుధజనములు. 293

వ. పాపంబులుంబోలె నుండియు దూష్యంబులు గానివానిం జెప్పెద
నాకర్ణింపుము: 294

క. దురమున, గైదువు గొని తను
బొరిగొన నేతెంచునట్టిపురుషుని వేదాం
తరహస్యవేది నయినను
బొరిగొనినను గిల్బిషంబు వొందదు వత్సా! 295

క. ధరణీసురవి తము నప
హరింపగా గని వధించు నతడు దురితముం
బొరయడొకయించుకయు నని
నరేంద్ర! చెప్పుదురు ధర్మనానార్థవిదుల్. 296

క. జీవితసంశయవేళను
భూవర! యొండన్నపానములు దొరకమిగల్

ద్రోవినఁ గల్గగు బెఱుఁగక
త్రావిన నద్దురిత మధికధర్మమునఁ జెడున్. 297

క. గురుసంరక్షణమునకును
బరమపదయైనయెడను బ్రాహ్మణధనముల్
విరహితములుగాఁ బెబిచోఁ
జొరఁగా నగు ముచ్చిమికి వసుమతీనాథా ! 298

తే. ప్రాణహాని దప్పించుచోఁ, బరిణయంబు
నందు, గురుజనకార్థ్యార్థమయ్యు, నంగ
నా జనముతోడి సంభాషణమున, సర్వ
ధనముఁ జెడియెడునెడ బొంకఁజను నృపాల ! 299

క. కలలోనఁ జరమధాతు
స్ఖలనము గలిగిను బ్రహ్మచర్యము సెడ;ము
జ్వలవహ్ని నేయివేల్చినఁ
దొలఁగుం గిల్బిషము దురితదూరచరిత్రా ! 300

ఆ. అన్న పతితుఁడైన, నటుగాక సన్న్యాసి
ంపయ్యెనేని తమ్ముఁ డాతఁ డుండ
దారసంగ్రహంబుఁ దాఁ జేసి పాపంబుఁ
బొరయఁ డంద్రు బుధులు కురువరేణ్య ! 301

తే. అడవి గోవులకైకాల్చు, టధ్వరమునఁ
బశువుఁజంపుట, దాన మపాత్రభూతుఁ
డగు బెఱుంగక యిచ్చుట, దగనిబంటుఁ
ద్రోవకుండుట గీడులు గావు వత్స ! 302

వ. తపంబుల దానంబుల మఱియునుం దినపుణ్యకర్మంబులనుం బాపంబులు
పరిక్షీణంబు లగు ననునిది సామాన్యవచనంబు ; ప్రాయశ్చిత్తవిశేషంబు
లెఱింగించెద. 303

-: వ్యాసుఁడు ధర్మజునకుఁ బ్రాయశ్చిత్తవిశేషంబు లెఱింగించుట :-

సం. 12-36-1

సి. వినుము, కర్మము దెల్పుచును గపాలంబున
నెత్తిన భైక్షాన్న మేకకాల
మశనంబు గొనుచు ఖట్వాంగచిహ్నము బ్రహ్మ
చర్యంబునై యధశ్శయన మాచ
రించుచు నిట్లు పండ్రెండువర్షంబులు
వ్రతవృత్తి నడపంగ బ్రహ్మహత్య
కిల్బిషంబు దొఱంగుఁ; గృచ్ఛ్రముల్ నడపిన
నాఱువత్సరముల నడఁగు ; మూఁడు

తే. హాయనంబులు నడపఁ జాంద్రాయణములఁ
బోవు; నిష్టానిరతి మాసభోజియైన
నబ్దమునఁ బాయు; నటుగాక యశ్వమేధ
యాజి యగునేని వలదు భిక్షాదు లధిప : 304

క. అవనీశ : యశ్వమేధము
నవబృథమున నీర గ్రుంకి యన్యుఁడు శుద్ధుం
డవుఁ బాపుఁడైనఁ; దత్క-
ర్తవిశేషము లోకపూజితం బగు టరుదే : 305

తే. పుష్టగోలక్షయొండెఁ గాంభోజవాజి
శతకమొండెను భూసురతతికి నొసఁగఁ
బాయు బ్రాహ్మణార్థాహవప్రాణహాని
యైన నొండెను జెడు బ్రహ్మహత్యకీడు. 306

సీ. కల్లుద్రావినపాతకం బది యగ్నివ
ర్ణముగాఁగఁ గాఁచి పానంబు సేయఁ
గను మూసి యుఱుకంగ ననలంబుఁజొర మహా
ప్రస్థాన మాచరింపంగఁ బాయు ;
నట్లుగాక బృహస్పతిసవన మ
న్యక్రితు వొనరించిన నతివిశిష్ట
భూమిదానమునను బోవు నక్కీ ర్తిరు
తల్పగుం డనఁబ్రతప్తమైన

ఆ. యాయసాంగనాంగ మాలింగనము సేసి
యైనఁ గోసి కరమునందు మేహ
నము ధరించి యంబరముఁ జూచు చరిగియే
నియును జచ్చి యఘము నిస్తరించు. 307

క. గురుతల్పగుండు రణమున
గురునకునై చచ్చియేని కురువర ! ధరణీ
సురులకు సర్వధనము భ
క్తిరతి నొసఁగియేని పాతకిత్వముఁ దొఱఁగున్. 308

క. ధరణీసురుస్వర్ణము నప
హరించినతఁ డంతకనక మట్టిద వినయో
తరుఁడె మగుడఁగ నిచ్చిన
బరిహృత మగుఁ గల్మషంబు పౌరవముఖ్యా ! 309

క. అనృతోపచారకలనం
బునఁ బుట్టినపాతకంబు వోవుం దా నె
వ్వని నపచరించెఁ దగ నా
తనిఁ బ్రీతుంజేయ ధర్మతత్త్వప్రవణా ! 31

క. గురువులకు మాఱువల్కుటఁ
బొరసినకల్మషము వాసిపోవు నతనికిం
బరితోషముగా వినయపు
వెరవున నుపహార మిచ్చి వినతుం డయినన్. 311

క. పరదారగమనదోషము
పరిహృతమగు నొక్కయేఁడు పరమ నియతుఁడై
చరియించినఁ గృచ్ఛ్రంబులు
గురుకులజలనిధిశశాంక ! గుణమణినికరా ! 312

ఆ. వావిగానియట్టిపనితఁ బొందినపాప
మాఱునెలలఁ బాయు నార్ద్రవస్త్ర
ధరణభస్మశయనపరతఁ బాటించుచు
నియతి నుండెనేని నృపవరేణ్య ! 313

క. పరపురుషసంగమంబునఁ
బరిహృతయైయున్నయట్టిభామిని శుద్ధిం
బొరయు రజస్వలయై, కం
చరయంగ భస్మమున శుద్ధమైనవిధమునన్. 314

ఆ. నఱికఁదగనిమ్రానుఁ నఱికినఁ దిర్యగ్వ
ధంబుఁ జేసినను నఘంబుఁ బాచి
కొను నరుండు మూఁడుదినములు దనచేత
పలుకుచును సమీరభక్షుఁ డయిన. 315

వ. అని చెప్పి వెండియు. 316

క. మితభోజియై వివిక్త
క్షితి పావిత్రీజపంబు సేయునది యహ
స్థితియు నిశాసీనత్వము
మతి నేమఱ; కట్టులైన మడిఁయు నఘంబుల్. 317

తే. పుణ్యకర్మముల్ సేయుచు భూసురులకు
వివిధధనములు ప్రీతితో వినయ మొప్ప
నొసఁగుచుండెడువారు పూర్వోపచితము
లైనకిల్బిషములఁ బాతు రవనినాథ! 318

క. విను మాస్తికతాశ్రద్ధా
వినయంబులు గలుగువారు వీనికి నెల్లన్
జననాథ! యవ్వు; లవి లే
నిరులు పాపములఁ దొలఁగ నేర్తురె యెట్లున్. 319

వ. ఆస్తికతాశ్రద్ధావినయంబులు నీకు సహజంబులు గావే? కావునఁ బాయశ్చిత్తంబు లల్పంబులైనను బాపంబులం బాపనోపుఁ; బాపం బని నీవు శంకించు కర్మంబు భారతయోధవధంబ కాదె? యది యాత్మరక్షణంబునకై చేయుటం జేసియు నుత్తమక్షత్త్రి ధర్మంబగుట నిరూపింపం బాపంబు బొరయకున్న యది; యట్లుంగాక భవదంతఃకరణంబున జనియించిన కరుణయుం బశ్చాత్తాపంబును నిన్నుం బరిశుద్ధునిం జేసె; నీవు ప్రాణబాధకంబు లగు తపశ్చరణంబులకుం జొరం జూడకుము; కురుకుల చూడామణిత్వంబునకు మూలం బయిన మహీపాలనం బాచరింపు-మనిన నబ్బాదరాయణునతో నమ్మేది నీరమణుం 'డపేయంబులు నభోజ్యంబులు నెయ్యవి? యపాత్రభూతపురుషులెట్టివారు? మహాపురుషా! యెఱింగింపవే' యని యడిగిన నతండి ట్లనియె: 320

క. తురగియు నుష్ట్రియు ఖరియును
గురిసినదుగ్ధములు నింద్యకోటి గణితముల్;
ధరణీసురాదిజను ల
ప్పారువునఁ బోయిన నఘంబుఁ బొందుదు రధిపా: 321

సీ. మానుషీక్షీరంబు, నీనినపదినాళ్ళ
లోనిధేనువుల పాలును నపేయ

ములు; ప్రేతవిషయాన్న ముసు, సూతకాన్నంబు,
దలవరియన్నంబు, గులటయన్న
మును, వనితోపజీవనశీలునన్నంబు,
నాడెకుపాడెడునట్టివాని
యన్నంబు, జూదరియన్నంబు, సూనరి
యన్నంబు, బహిష్కృతనియన్న

ఆ. మును, నిజాగ్రజునకు మును పెండ్లియాడిన
పురుషునన్నము నభోజ్య మండ్రు ;
వందియన్న మధికనిందాస్పదంబు ; ప
ర్యుషితశుష్కములను నుడుగవలయు. 322

క. విను సురతోగూడగ దె
చ్చినయట్టిది యెద్దియును భుజింప రభోజ్య
త్వనిరూపణ నిపుణత గల
మనుజోత్తము లఖిలలోకమాన్యచరిత్రా ! 323

క. పులగము బాయస మట్టులు
బలలము నర్చనకుగాక పక్వములయినం
గలుగు సభోజ్యత్వము వి
చ్చలవిడి వంటకము సేసి చనదు భుజింపన్. 324

వ. ఆని వెండియు. 325

తే. అతిథి పిత్రదేవతాపూజ లాచరించి
కాని గృహమేధులకు భోజ్యమైన గుడువ
దగదు; యజ్ఞ శిష్టం బమృతంబు గాగ
నార్యజనములు సెప్పుదు రధిపవర్య ! 326

వ. ఆలును బిడ్డలు బంధులు
నై లీల జరిచుచును గృహస్థుడు దత్త
ల్లోలత్వరహితచిత్తత
మీలుగ సలపయిన పలయు మీదెజిగి నృపా ! 327

కృష్ణద్వైపాయనుఁడు ధర్మజునకు నపాత్రపురుషుల నెఱింగించుట

సం. 12-37-23

వ. అని యిట్లు చెప్పి యపాత్రభూతపురుషుల నాకర్ణింపు మని పలికి. 328

సీ. పాడియు నాడియు బ్రదుకువారలఁ, బరి
హాసకు, దుర్జను, నంగహీను,
మత్తుని, ప్రుచ్చు, నున్మత్తు, నపుంసకుఁ,
జెనఁటిమాటలఁ దేల్చు మనుజుఁ, గులము
చాలమి వేదంబుచదువమి నిజవృత్తి
హాని దుర్వృత్తి గలట్టివాని,
దానపాత్రంబులుగా నియ్యకొనరు పె
ద్ద; దీనుఁడును, విపద్బాధితుండు,

తే. నీగి కర్హులు; దయపేర్మి నిచ్చుచోట
నైన నవగుణ మెక్కు-డై కానఁబడిన
నిందితాత్ముల కిచ్చుట నిష్ఫలంబు;
పాత్రనిశ్చయ మిట్టిది పౌరవేంద్ర! 329

క. శిల చేవత్రాను దెప్పగ
జలనిధిఁ గడవ దొరఁకొనినచా డ్పగుఁ బాత్రం
బులు గానియెడల దానం
బులఁ బాపము నిస్తరింప బుద్ధిఁ దలఁచినన్. 330

ఆ. పునుకఁ గుక్కతిత్తిఁ బోసినపాలు నీ
ళ్లధిక నిందఁ బొరయు నట్లు దుష్ట
మై యపాత్రవిషయ మగు నీగి వృథవోవు
నిచ్చుచోటఁ; బాత్ర మెఱుఁగవలయు. 331

తే. షండునకు బిడ్డ నిచ్చినచంద మొందు,
బూదిలో నేయి వేల్చుటఁ బోలు, నోటి

కడవ నీళ్లులు వెట్టినకరణి యగు, న
పాత్రజనులకుఁ బెట్టుట పౌరవేంద్రఁ: 332

క. దానవిధి యరయ నసమీ
చీనం బగునేని కీడు సేయుం గురుథా
త్రీనాథఁ: మఱియుఁ బాత్రం
బైనను గొన్నతని కిచ్చునతనికి నెట్లున్. 333

క. కావున విను, పాత్రము మే
లై విహితాచరణ సౌమ్యమగుదానము థా
త్రీపరఁ: దాత్రాదాతలఁ
దా వెలయించు భువనద్వితయరంజకతన్. 334

ప. అని చెప్పి "యేను నీకు బుద్ధుల సెప్పం జొచ్చి సంక్షేపరూపంబునం గీడు మేలెఱింగించితి; నిప్పలుకులు పాటిగాఁగొని విహితానుష్ఠానపరుండ వగు" మనుటయు నమ్మనుజపతి యమ్మునిపతితో 'మహాత్మ! భవదనుగృహీతంబు లైన యివ్వాక్యంబులు హర్షంబు నావహించె; నెప్పాట ధర్మంబగు మార్గం బవలంబించి రాజ్యతంత్రంబు నడపి యభయంబునం దొఱకక జయింతు నట్టితెఱంగు గయిగం గృపసేసి, రాజధర్మంబులుం దక్కినుం గలుగు వర్ణాశ్రమధర్మంబులు నాపద్ధర్మంబులును లోనుగా నెఱుంగం దగు ధర్మంబులెల్ల నెఱింగింపవే! నాకుం జూడ రాజ్యంబును ధర్మచర్యయును బరస్పర విరుద్ధంబులయిన ట్లున్నవి గావున నివ్విధంబున విన్నవింపవలసె' నని చెప్పుటయు నత్తాపసోత్తముండు ప్రీతచిత్తుండై యతండు విన 'నారదుతోడ నీభూపతి భీష్మపాలికిం బోవలయు నయ్యార్యవర్యుచేత సకలధర్మంబులు వినువాఁడగుట యర్హప్రకారం' బనవుడు నారదుం 'డిది లెస్స' యని పలికిన నప్పరాశర పుత్రుం డయ్యజాతశత్రున కిట్లనియె: 335

ఆ. కురుపితామహుండు గురుబుద్ధి నింద్రాదు
లకును మాననీయుఁ డటులాత్మ
కుంకు పరశురాముకోదండవిద్యాది
సుగుణములకునెల్లఁ జొచ్చినిల్లు. 336

క. సురతటినీపుణ్యతమో
దరమున జన్మించినాఁ డుదాత్తవ్రతత
త్పరుఁ డతని కెల్ల ధర్మముఁ
గరస్థలామలకసన్నికాశం బధిపా ! 337

క. చ్యవనుఁడు మార్కండేయుం
డు వసిష్ఠుఁడు లోనుఁగాఁ బటుప్రాజ్ఞులు గా
రవమున వినిపింపఁగఁ దెల
య వినియె ధర్మప్రపంచ మతఁ డఖిలంబున్. 338

తే. శాంతమానసుఁ డైన యాశాంతనవుఁడు
విస్మయాహవచరితుండు: వినుము: వలసి
నపుడు విడుచుటకై ప్రాణ మూఁగినాఁడు
గాదె: యొరు లంతవా రెందుఁ గలరె నరులు. 339

చ. అతనికి నీపయిం గరుణ యగ్గల; మట్లగుటం గురుక్షమా
పతివర: పొమ్ము నీవతనిపాలికి; నాతఁడు నిన్ను సంప్రబో
ధితుఁడుఁగఁ జేయు; ధర్మములు దేటపడంగ నుపన్యసించు; మా
మత మిది; దీనఁ గీర్తియు సమంచితధర్మముఁ బెంపు నొందెడున్. 340

వ. 'అయ్యుత్తమోత్తమునకు నూర్ధ్వలోకగమనంబునకు సమయంబా సన్నంబగుచు
వచ్చెం; దడయ కట్లు సేయు' మనిన విని యవ్వసుమతీపతి 'మునీంద్రా:
బహుబంధు వధపాతకం బాచరించి యమ్మాననీయాత్మ నెదిరి కెట్లు వోదు:
నట్లుంగాక, యకృత్రిమసమరశీలి యగు నగ్గుణశాలిం గృత్రిమసమరంబునం
గూల్చి, క్రమ్మఱ నమ్మహాత్ము మొగంబు సూచి నాకు ధర్మంబు లుపదేశింపవే
యని యడుగ నేర్తునే:' యనుటయు నజ్జననాథునకు జనార్దనుం
డిట్లనియె: 341

తే. ఇంత నిర్బంధ మేటికి; నిమ్ముసీంద్రు
పనుపు సేయుదు గాక; యిప్పాట నెల్ల
పెనుపులకుఁ బాత్ర మయ్యెదు; వనటతోడ
నెద్దియును నేల; పురమున కేగు మిపుడు. 342

వ. 'మరల గాంగేయుకడకు వత్త మది మేలు లె' మ్మని పలికి వెండియు. 343

తే. 'తమ్ములును విప్రవరులును ధరణిఁగల్గు
బహువిధంబులప్రజలును బార్థివేంద్ర!
చాతకప్రకరములు పర్జన్యుఁగోరు
నట్లు నినుఁ గోరుదురు కృప నాదరింపు. 344

వ. ఈసర్వజనంబుల మనోరథంబును సఫలంబులు సేయు'మని ప్రార్థించె; నివ్వి
ధంబునం గృష్ణద్వైపాయననారదదేవలదేవస్థాణు కృష్ణులలోనుగాఁ బెక్కం
డ్రు పెక్కుదెఱంగులఁ జెప్పిన వాక్యంబులఁ జిత్తంబు కలంకదేఱి కౌంతేయాగ్ర
జుండు రాజ్యభారనిర్వహణోత్సాహం బంకురింప శిశిరాపగమసమయ
కమలంబు ననుకరించునాననంబుతో నప్పారాశర్యప్రముఖమునివరులకుం
బ్రదక్షిణంబును దండప్రణామంబును నాచరించి, వారలవలన వసుమతీ
వహనానుజ్ఞయు వివిధాశీర్వాదంబులుం బడసి వెలిఁగె; వారును నిజస్థానంబు
లకుం జనిరి; తదనంతరంబ. 345

సి. దేవభూదేవపూజావిశేషము లాచరించి
యక్కఱకులశ్రేష్ఠుఁ డుర్వి
నెడనెడ బ్రుంగుడువడి యున్న రాజులు
సనుదెంచి కనునవసరము వేచి
యునికి కృష్ణునిచేత విని పూసి తొడికట్టి
కొలువిచ్చి మణిహేమకుంజరాశ్వ
కాంతాదులగు తగు కానికల్ గైకొని,
యాన్నృపాలురకుఁ బ్రియంబొనర్చి,

తే. యమ్మకుందుండు వారును దమ్మగమియుఁ
దక్కఁగల బంధుమిత్రులు ధౌమ్యముఖ్య
సూరిజనములు బలయంగఁ దారకముల
మధ్యమున నొప్పు చంద్రునిమాడ్కిఁ బొలిచె. 346

వ. మఱునాఁడు కల్యంబునం గాలోచితకృత్యంబు లాచరించి ధవళానులేపన
మాల్యవస్త్రాభరణంబుల నలంకృతుండై. 347

క. నవమగురథమున షోడశ
ధవళహరులఁ బూన్చఁ బనిచి ధరణిపుఁడు విధుం
డవిరళసుచారథం బె
క్కఁవిధము దోఁపంగ నెక్కెఁ గురువంశనిధీ! 348

శా. సారథ్యంబు వహింప భీముఁడు, సితచ్ఛత్త్రంబు గాండీవి సె
ల్వారం బట్టఁగ, జామరల్ గవ లిడన్. హరిప్రభం బయ్యె న
త్తే రం దేవురు నగ్నిపంచకము వేడిం బొల్చిన ట్లొప్పి; రం
భోరాశిధ్వనివోలెఁ దూర్యనికరంబుల్ ప్రేమెసె నొక్కఁమ్మడిన్. 349

-: ధర్మరాజు సపరివారంబుగాఁ గరినగరంబుఁ బ్రవేశించుట :-

సం 12-38-34

వ. ఇట్లు నితాంతకాంతపకారుండై పాండవాగ్రజుండు పాండురాజాగ్రజు నతని
దేవిం బ్రభూతాందోళికారూఢులం జేసి పురస్కరించుకొని శైబ్యసుగ్రీవ
మేఘపుష్పవలాహకంబులను వాహనంబులు పూనినరథంబున సాత్యకిసహి
తుండయి వెలుంగు వెన్నునిం బితిందిదెసం బెట్టికొని, యతనికెలన మనో
జవంబులగుహయంబులం బూన్చి న యవదాతస్యందనంబున యుయుత్సుం డ
రుగుదేర, నుచితవాహనారూఢుండై విదురుండు కుంతీప్రముఖకురుస్త్రీజనంబుల
నందలంబుల నిడికొని వెనుక నడవ, నరేంద్రులు నానాముఖంబులం దమ
తమసేనలతోడం గూడఁగొలిచి చనుదెంచుచుండం జనునప్పుడు. 350

క. ద్విరదంబులు నరదంబులఁ
దురగంబులఁ గాల్బములఁ దూర్యంబుల సీ
గిరులన్ గొడుగులఁ బడగలఁ
బరిస్ఫురిత మయ్యె నతని పయనంబు గడున్. 351

వ. మఱియును. 352

క. వంచిజనులుఁ బ్రకటులుం
గ్రంథుకొనం బొగడఁ జదువఁగా మాగధు లా

నందముగఁ బాడ నుచితపు
మందత్వము గమనమునకు మహిమ యొనర్పన్. 353

వ. అన్నరనాథుండు నడచి నాగనగరంబు ప్రవేశించె; నంతకుమున్న యందలి జనంబులు గలువడములను దోరణంబులను ప్రముకకదళీస్తంభపూర్ణకుంభ స్థాపనంబులను గస్తూరికలయంపులను గర్పూరపుమ్రుగ్గులను బుష్పోపహారం బులను ప్రాలాంబమాలికలను నొప్పుమిగుల నప్పురం బలంకరించి యాబాల వృద్ధంబుగాఁ బరమాంబరానులేపనమాల్యభూషణంబులం బొలిచి బహుల ప్రమదంబున సమ్మర్దంబులగుసంచారంబులం జారుత్వవిశేషంబుల వహించి; రక్కురురాజోత్తముండు రాజమార్గంబు దటిసి చనుసమయంబున. 354

తే. హర్మ్యములనుండి పణ్యపుణ్యాంగనాని
కరము లక్షితయుతమౌక్తికములసేస
లలుకఁ గల్పలతానిచయములు పుష్ప
వృష్టి పెల్లుగఁ గురిసినవిధము దోఁచె. 355

వ. అట్టియెడఁ జూడం బరతెంచిన పౌరజానపదజనంబులు దమలోన. 356

సీ. దిగ్విజయంబునం దేజస్వియయ్యు న
జాతశత్రుండనఁ జను నితండె!
రాజసూయమహాధ్వరము సేసి విపులఁ
గనకరత్నాదులఁ దనిపె నితఁడె!
నిత్యవ్రతంబుగా సత్యంబు పాలించు
నిష్ఠ యస్ఖలితగా నెఱపె నితఁడె!
ధర్మైకనిరతుఁ డీతం డొక్కురుఁడచువ్వె
యని పల్కుటకుఁ బాత్రమయ్యె నితఁడె!

తే. బలముఁ దగవును ధర్మంబు వెలయఁ బగఱ
ననవశేషంబుగాఁ దెగటార్చె నితఁడె!
యనఁగ మఱియును వివిధకీర్తనల హర్ష
వచనముల నుల్లసిల్లు రవంబు మిగిలె. 357

క. లావులు వెరవులుఁ దాల్మిలుఁ
జేవలు నష్ఠలితములుగఁ జెల్లు పనులు నా
నా విధములఁ బేరొక్కనుచుం
బావని నరుఁ గవలఁ బొగడు పటురవ మెసఁగన్. 358

క. వ్రతచర్యయు భాగ్యంబును
ధృతియు మతియు నరయ ద్రౌపదికి నెనయగు భూ
పతివల్లభాజనము లీ
క్షితిఁ గలరే-యనురవంబు సెలఁగెం గలయన్. 359

వ. ఇట్లు పెల్లయిన ప్రమోదను దరంగితంబులైన నెరవుల పెంపునఁ బునంబు చంద్రోదయఘూర్ణమానంబైన మహార్ణవంబు ననుకరించె; నాధర్మరాజు రాజ మందిరద్వారంబు సేరఁజనియె; నప్పుడు బహు విధంబులగు శోభనద్రవ్యం బులు గరంబుల గొని భవ్యభూసురులును బుణ్యాంగనలును నెదురొక్కాన వాని నెల్లం గైకొనుచుం బవేశించి, యతం డేనుంగుమొగసాల నరదంబు డిగ్గి ధౌమ్యధృతరాష్ట్రిపురస రంబుగా నభ్యంతరనివాసంబు సొచ్చి, గృహదేవత లం బూజించి, మగుడ బహిరంగణభూమికి వచ్చి, నగరదేవతా పూజలు సేయింపం దగువారలం బనిచి, బ్రాహ్మణసంఘంబులం గానిపించుకొని, కనకంబులును గోవులు మొదలైన వివిధ వస్తువులు నొసంగె; నప్పు డాశీర్వాద నాదంబులను శంఖభేరిప్రముఖతూర్యరవంబులను రోదసి పిక్కటిల్లెఁ; దద నంతరంబ నిశ్శబ్దంబైయున్న సకలజనంబులును నజ్జనపాలు నానన బాలో కించు చుండి; రట్టియెడ దుర్యోధనసఖుండైన చార్వాకుం డను నొక్కరక్క సుండు విప్రాకారంబు గైకొని త్రిదండివేషం బలవడ నయ్యవనీదేవతా కోటిలో నిల్చి యన్నరనాథున కిట్లనియె: 360

-:చార్వాకుం డను రాతసుఁడు బ్రాహ్మణ నిగ్రహంబునఁ జచ్చుట:-

సం. 12-39-22

చ. వినుము నరేంద్ర! సర్వమగువిప్రజనంబును గూడి నన్నుఁ బం
చిన విధ: 'మీతఁ డేటిపని! సేసినపాపము పెద్ద; చంపుచో

జనకుఁడు భ్రాత పుత్రుఁ డనుశంక యొకించుక లేదు; సద్గురుం
డనియెడికొంకు బుద్ధి నిసుమంతయు బుట్టదు వీనిఁ గాల్పనేఁ' 361

వ. 'అను మని' రని పలికి వెండియు. 362

ఆ. ఇట్లు శిష్టజనము లేవగింపఁగఁజేయు
రాజ్య మేల బంధురాజి నెల్లఁ
బొలియఁజేసి యెట్టి భోగంబు లనుభవిం
చెదవు కల్మషంబు చిక్కఁ నీకు. 363

వ అనిన విని యవ్విప్రు లత్యంత వ్యథితాంతఃకరణు లగుచు నొండొరుల మొగంబులు సూచి, 'యిట్లు వుట్టం బనియేమి' యనువచనంబులతోఁ దిరుగుడు వడిరి; ధర్మనందనుండు లజ్జావనతవదనుండై యూరకుండి వారలవలను గనుంగొని కేలుమొగిచి ఫాలభాగంబునఁ గదియించి యిట్లనియె: 364

తే. బ్రమొక్కఁ వేఁడెద; ననుఁ మీరు ధిక్కరింప
కాదరింపుఁడు; మునిసమూహానుమతుఁడ
నై వినిశ్చయపరికలితాంతరంగ
వర్తనముతోడ నిచటికి వచ్చినాఁడ. 365

వ. అనవుడు భయసంభ్రమభరితు లగుచు నాభూసురులు "దేవా! యీ వాక్యం బులు మావలనం బుట్టినవి గా; విది యేమియో కాని, నీ వుత్తమక్షత్రి ధర్మంబున సముపార్జించిన యుజ్జ్వలశ్రీ సుస్థిరతం బొందెడు"మని యతనికి నాశ్వాసం బొనర్చి, యమ్మాయాభిక్షువు నాలోకించి, పరమబోధంబున నప్పురు షాధము నెటింగి, యమ్మహీపతితో 'వీఁడు దుర్యోధనసఖుం డగు రాక్ష సుండు; సన్న్యాసివేషంబున నేతెంచి యతని కీ హితం బాచరించువాఁడై యీ దుర్వచనంబు లాడె; నీకుక్క మొఱఁగినయంతన పాలమున్నీరుంబోని నీకుం గలంగనేల? ధర్మాత్ములగు తమ్ములు పనుపు సేయం బూజ్యంబగు సామ్రా జ్యంబు వహింపు' మని యాదరించి. 366

క. ఆరాక్షసుఁ గనుఁగొని కో
పారంజితనేత్రు లగుచు నవ్విప్రులు హుం

కారముఖరు లగుటయు, నతి
ఘోరాకృతితోడ వాఁడు గూలెం బుడమిన్. 367

తే. బ్రహ్మతేజోనిహతి నిట్లు పడి మహీశ
నిగ్రహతిపాతితోర్వీజనిభత నొంది
యున్నయద్దానవునిఁ జూచి యన్నరేంద్రుఁ
డెలమి సొంపు వహించెఁ దమ్ములును దాను. 368

వ. ఇట్లు ప్రీతుండై యజాతశత్రుం డవ్విప్రసమూహంబునకు సవిశేషార్చనం బొనర్చి, వీడుకొలిపె; నప్పు డచ్యుతుండు బ్రాహ్మణస్తుతి సేసి యజ్ఞపతితో నిట్లనుఁ 'గృతయుగంబునం జార్వాకుం డను దైత్యుండు తపం బొనరించి పద్మభవుండు ప్రత్యక్షంబయిన నఖిలభూతంబుల వలనను నభయంబు వేఁడిన, నద్దేవుండు 'భూదేవతల కనిష్టంబు లైన పనులు సేయకుండువాఁడవు చేసితేని యదియ నీకుఁ దుది' యని పలికి యవ్వరం బొసంగె; నట్లు లబ్ధవరుండై వాఁడు గర్వించి గీర్వాణుల బాధింపం దొడంగిన, వారు విరించిం గాంచి యా రక్కసుండు సేయు బాధలు సెప్పిన, నమ్మహాత్ముం'డేను మున్న యెఱింగి యొనర్చినవాఁడ; దుర్యోధనుం డను రాజునకు నెచ్చెలియై యచ్చపలుండు తత్కార్యం బాచరింపం జొచ్చి మహీసురులకు మనోవ్యథాకరం బగు కర్మంబు సేయు; నప్పనికారణంబుగా వారల కోపంబునం గూలం గలవాఁ'డని పలికె నద్దానవుండు నేఁ డిట వచ్చి తన దుర్వినయంబున బ్రహ్మదండనిహ తుండై పడియున్నవాఁ' డని చెప్పి యప్పీనుంగు వెడలవైపించి యా భూపాలు నుద్దేశించి వెండియు. 369

ఆ. 'మాఱుకొన్న వారి నీఱు సేయుము; ప్రజ
నరసి మనుపు: ధరణిసురులఁ బ్రోవు;
మఖిలబంధుజనుల నాశ్రితులను సుఖ
వృత్తి మనుపు పెంపువెలయ నధిప! 370

వ. రాజ్యాభిషేకశోభనం బనుభవింపు' మని పలికి యాభిషేచనిక ద్రవ్యానయ నంబునకుం దగువారిం బనిచి, బయలి పెద్దకొలువుకూటంబున నమ్మహీపతికి

మహోన్నత హేమమయసింహాసనంబు వెట్టించి, వలయువారలకెల్ల సముచిత సమంచితపీఠంబు లుపచరింప నియోగించిన, నప్పాండవాగ్రజుం డుల్లంబు కలంక యెల్ల డిగ్గఁ ద్రావి, యిచ్చం దెలివొంది చెలువొందు నిజపీఠంబునం బూర్వాభిముఖుండై కూర్చుండె; నతని కట్టెదురం గనత్కాంచనాసనంబున సాత్యకిసమేతంబుగా శౌరియు, వలపటను దాపటను మణిపీఠంబుల వడము డియుఁ గవ్వడియును, వెనుకం గనకాయుతకుబ్జాసనంబులం గవల నిరువంకల నునిచికొని కుంతీమహాదేవియు, దామోదరుని దక్షిణదిక్కున నర్చిస్సముజ్జ్వలంబగు నాసనంబున ధృతరాష్ట్రుండును, దదీయ ప్రాక్ప్రదేశంబునం బ్రస్ఫురితపీఠంబుల విదురుండును ధౌమ్యుండును, ధృతరాష్ట్రుని పిఱుంద నర్హపీఠంబుల గాంధారీయుయుత్సుసంజయులునుం గూర్చుండి; రా సమయంబున నంబుజాతభవుఁడు గృపావిశేషంబునఁ గృపాచార్యుం దగు తెఱం గున నయ్యజాతశత్రుం గానిపించి యోగ్యాసనంబున ధౌమ్యసమీపం బున నతని నునిచె; నంత నప్పుడమిజేఁడు సితకుసుమాక్షత కాంచన రజత రత్నగరా
స్పర్శనం బాచరించెఁ; దదనంతరంబ. 371

సీ. విద్వత్సమూహంబు, వివిధదేశాధీశ
సంఘంబుఁ, గార్య విచారపరులు
నర్థార్జనాది కృత్యంబుల వారలు,
బహు పరిచర్యలఁ బరఁగు జనులు,
వైశ్యప్రముఖపౌరవర్గంబులును, ముఖ్య
హలికాదిజానపదావలులును,
వైణికగాయకవాంశికాది వినోద
కరులును, వారసుందరులు, లోను

ఆ. గాఁగఁ దగినవారు గాంచి యవ్విభునిస
త్కారములఁ బ్రమోదితాత్మ లగుచు
భావములు దలిర్ప సేవించియుండ న
క్కొలువు సాల నొప్పెఁ గురువరేణ్య! 372

వ. అంత నాభిషేచనిక ద్రవ్యసంచయంబు సన్నిహితం బగుటయు మాధవానుమతుండై ధౌమ్యుండు ప్రాగుదక్ప్లవనం బైన వేదికాతలం బలంకరించి,

యందు జాతరూపసవరత్న ఖచితంబును దృఢపాదంబు నగు భద్రపీఠంబు
ప్రతిష్ఠించి, శార్దూలచర్మాస్తరణశోభితంబు సేసి యర్చించి, కాంచనదామ
జుష్టంబగు నుత్కృష్టఘనశంఖంబు సమంచితస్థండిలంబున నిలిపి పూజించి,
దానును దానిచుట్టునుం బార్థివంబులు హైమంబులు రాజతంబులు రత్నమయం
బులు నగు కుంభంబు లొనర్చి వానను గాంగంబు లగు జలంబులు నించి,
యన్నింటికి రత్నమంగళ తరుత్వక్పల్లవకుసుమంబులను బంచగవ్యంబులను
సమంత్రకంబుగా సంస్కారంబు నిర్వర్తించి, 373

సీ. వీర్యవంతము లగువివిధమంత్రంబుల
తోఁ గూడ సద్ద్విజస్తోమపరివృ
తునిఁ జేసికొని, రాజుఁ దోడ్కొని యేగి యా
వినుతపీఠంబున నునిచి, శోభ
నాలంకరణమున నభిరామయైన పాం
చాలిఁ దద్వామపార్శ్వమున సహ
మాసీనఁ గావించి, యగ్నిముఖము సేసి
కొని హోమతంత్రవర్తన మొనరి,

తే. నంత నూర్జితశుభవేళ యగుడు శంఖ
చక్రధరుఁ డా సమర్చిత శంఖ మెత్తి
'పృథివి కధిపతి వగు' మని ప్రీతి నాపృ
థాసుతుని నభిషిక్తునిఁ జేసె నధిప! 374

V.R NARLA D. P. R. I. Acc. No. 10,170

ప. అప్పుడు చిత్తం బుత్తమప్రకారంబై యాంబికేయుండు ప్రసన్నవదనుం డగు
చుం బ్రతిష్ఠితంబు లయినకలశంబులలో నుజ్జ్వలం బగు నొక్కటి ధౌమ్యుం
డంది యా నెత్తి యాభూపోత్తము నభిషేకించె; మఱియుం బ్రభూతాత్మ
లగురాజులును బ్రకృతులలోనం దగువారును దదభిషేకశోభనం బాచరించిరి;
శంఖానకదుందుభిప్రభృతిమంగళ తూర్యంబులు గంభీరనాదంబులం జెలంగె;
నివ్వీధంబున సుహృజ్జనహృదయంబు లానందింప ధర్మనందనుండు సామ్రాజ్య
పదస్థుండై భూసురదీనానాథప్రముఖ పాత్రంబులకు వివిధబహు ధనంబు
లొసంగె; నట్టియెడ విద్యావిశిష్టబ్రాహ్మణాదిపురుషసత్తము లక్కురుసత్తమున
కభిముఖులై 'దేవా! దైవమానుషంబులకలిమి నతిమానుషంబగు నీవిజయంబును

వనుధాధిపత్యసంప్రాప్తి యు నింతయొప్పునే' యనిస వీని వారంతో
నవ్వసుంధరావల్లభుండు. 375

సీ. 'కలిగె లేకుండె; నిట్లలఘుగుణంబులు
వాక్రుచ్చి మీయంతవార లిట్లు
గొని యాడఁ బాండునందనులు ధన్యాత్ముల'
యని పల్కఁ యంఁబికాతనయుఁ జూపి
'తండ్రియు గురువును దైవంబు నీతఁడ;
మాకు మీరెల్ల నీమనుజవిభుని
పనుపు సేయుటయు, నీతనికిఁ బ్రియంబుగా
వించుటయును మమ్ము వేన వేల

తే. విధులఁ బ్రీతులఁ జేత యుర్వీజనములుఁ
బౌరులును మీరలును దొంటిభంగి దప్ప
కిమ్మహారాజునెడ వినయమ్ముతోడ
నడచు చుంటయ యెంతయు నాకుఁ బ్రియము.' 376

క. 'జ్ఞాతివధ మట్లు సేసియు
నీతనిఁ గొల్చుటకుఁ గాఁగ నీగృహధర్మ్మ
పేతత్వము బొరసితి భూ
భూతికి మనకు విభుఁ డీప్రభువ మఱువకుఁడీ :' 377

వ. అని చెప్పి నిజేచ్ఛ వర్తించి సుఖంబుండువారుగాఁ బ్రార్థించి, వినయంబుతో ధృతరాష్ట్రగాంధారుల నగరిలోని కనిచి, పౌరులను జానపదులను బోవం బనిచి, సగౌరవంబుగాఁ గృపాచార్య నిజనివాసంబున కరుగ వీడ్కొలిపి, యువరాజపదంబున భీమసేను నిలిపి, కర్తవ్యవిచారంబునకు దదీయనిశ్చ యంబునకును సంధివిగ్రహాదిషాడ్గుణ్యాచింతనంబునకును విదురునిం బ్రియ వచనపూర్వకంబుగా నియోగించి, వలయుపనులు వెనుక ముంద రరసి యెఱింగించుటకు నాయవ్యయంబు లెఱింగించుటకును సంజయుం జొనిపి, సేనలకొలందులను గనుంగొనుటకు భృత్యులకు జీవితంబులు పెట్టుటకుఁ గర్మ్మకలాపంబులు సేయించుటకును నకులు నాజ్ఞాపించి, దర్పితుల మర్దించు

టకుఁ బరచక్రంబు లాక్రమించుటకు నర్జునుఁ నిర్దేశించి, బ్రాహ్మణకార్యంబు లకు శ్రౌతస్మార్తకృత్య సమనుష్ఠానంబునకు ధౌమ్యుం జూలించి, సహదేవుం జూచి 'నీవు మదీయగోపనపరుండవై సర్వావస్థలయందును మత్సమీపంబున నిల్చునది' యని పలికి, మఱియుం గరణీయంబు లగునధికారంబుల నెల్లను గల్పించి వారలమీఁదన పెట్టి, యుయుత్సుం గనుంగొని విదురసంజయుల నాలోకించి 'మీర లనుదినంబును నవధానంబు గలిగిరాచవారియోగ క్షేమంబు లేనెట్లట్ల నిర్వహింపకలయుఁ బురజనంబుల భూజనంబుల కర్జంబులు రాచవారి కెఱిఁగించి పంచినట్లు నడపంగలవార' లని యప్పగించి, యభ్యంతరమంది రంబునకు విజయంచేయు మని కుంతీదేవినిం బాంచాలీ సహితంబుగాఁ బుచ్చి. 378

తే. ప్రేమసంప్రీతివినయమిశ్రితవిలోక
నంబు గృష్ణుని ముఖకమలంబునందు
మాసరంబగు వికసనమధువునకు మ
ధువ్రతం బయి నిగుడ నాసువ్రతుండు. 379

వ. అమ్మహాత్ముని సాత్యకిసహితంబుగా వీడుపట్టున కనుప ననుజన్ముల ననిచి, యుచితవర్తనంబున నుండి, పదంపడి భండనంబునం జచ్చినవారిం జిత్తంబున నిరూపించి తొడంగి. 380

తే. బ్రాహ్మణానుజ్ఞతోఁగూడ బంధుజనుల
కందఱకు వేఱువేఱ మహావిభూతి
వెలయ నంచితశ్రాద్ధక్రియలు సభక్తి
కముగ రత్నహేమాదిదానములు మెఱయ. 381

వ. అనుష్ఠించి, ద్రోణాచార్యద్రుపదతద్బంధువిరాటతదీయజ్ఞాతులకును బ్రత్యే కంబ కర్ణాభిమన్యుప్రభృతుల కెట్లట్ల సర్వదక్షిణసామగ్రివెలయం బరలోక క్రియలు నిర్వర్తింపం జేసి, దుర్యోధనాదులకు నంతకంటె విభవం బెసంగ ధృతరాష్ట్రుం డౌర్ధ్వదైహికవిధు లాచరించునట్లుగా నొనర్చి, తా నెఱింగిన వారల కెల్ల లగ్గసేయుటకుఁ దగుబంధులు లేనివసుంధరాధిపుల నెల్ల నుద్దేశించి యుచితదానంబులతోఁ జేయ ధౌమ్యుం బనిచె; మఱియును. 382

క. చలిపందిరులను సత్త్రం
బులుఁ బెట్టించెను; దటాకములు దేవగృహ
మ్ములుఁ గల్పించెను; బంధుజ
నులకు సుగతి యగుటకై వినుతభంగి నృపాఃలు 383

క. లోకమునఁ గలుగు భూసుర
లోకమునకు నెల్ల గోవులుం బసిఁడియు నా
నాకల్పంబులు బంధుల
కై కోటివిధముల నిచ్చె నతులితభక్తిన్. 384

వ. ఇట్లు సకలబాంధవసుహృజ్జనంబులకుం బారలౌకికక్రియలు సేసి, యన్యూన త్వంబున వెలింగి జగంబులచేతం బొగడు వడసి కృతకృత్యత్వం బొందె; నివ్విధంబున ప్రాప్తసామ్రాజ్యం డయన పాండవాగ్రజుం డొక్కసముచి తావసరంబున గోవిందుని కభిముఖుం డయి వినయంబునం గేలు మొగిచి. 385

—:ధర్మజుఁడు శ్రీకృష్ణునుచితవచనంబుల స్తుతించుట:-

సం. 12-43-1

తే. అమలభవదీయసుప్రసాదమునఁ జేసి
పితృపితామహక్రమయోగ్యపీఠమైన
వినుతసామ్రాజ్యమున కేను విభుఁడనై కృ
తార్థతానందపూర్ణుండ నైతిఁ గృష్ణఃలు 386

వ. అని మఱియును. 387

క. బావలు మఱఁదులు ననుచును
నీవు కృపాతిశయ మెసఁగ నెమ్మిని మమ్మిం
గావను బ్రోవను దలఁచి ర
మావర : కలిపికొని తిరిగి మన్నించుటలన్. 388

వ. తేఁకువలేక మెలంగితిమి గాక, భవదీయమహానుభావం బున్నరూ పెఱుంగను దగం గొనియాడను నే మెంతటివార, మని పలికి వెండియు. 389

క. ఆదిమపురుషుఁడ వగుటను
వేదంబులు సెప్పు ననియు వెలుఁబలుకఁగా
నీద్యక్ప్రికారుఁ డని దా
మోదర! నీపెం పెఱుంగ నొరుల కలవియే? 390

క. దురితములఁ జెఱుప శుభములఁ
బెరిఁగింపం జాలునట్టి పేర్లులు నీకుం
బురుషో త్తమ! కడుఁబె క్కు
పరమార్థద్యోతకములు భావింపంగన్. 391

తే. ప్రయతు లగు సద్ద్విజులు వానిఁ బరమభ క్తి
యుక్తి నెపుడుఁ బఠించుచు భు క్తిము క్తి
దాయి వగు నిన్ను సతతంబుఁ దలఁచుచును న
మస్కృతులు సేసి యవ్యయమహిమఁ గంద్రు. 392

వ. అని పలికి విష్ణువిశ్వాత్మ జిష్ణు శర్వహంస దామోదర శంభుఁప్రముఖంబులగు ప్రభూతనామంబులఁ బ్రస్తుతించినఁ, బ్రీతుండై పుష్కరాక్షుండు పుష్కలంబై న వాగ్విశేషంబుల నాధర్మనందనుఁ నభినందించెఁ; దదనంతరంబ కొల్చి యున్నజనంబుల నిజనివాసంబులకుం బోవం బనిచి, యక్కురుసత్తముండు దమ్ముల నాలోకించి. 393

మ. అటవీదేశములందు గాఢబహులాయాసంబులం గంది, దు
ర్ఘటమత్స్యేశ్వరుసేవఁ గుంది, బహుసంగ్రామంబులన్ విద్విష
త్పటునానాస్త్రమహోగ్రశస్త్రచయనిర్భగ్నాంగతం బొంది, యు
త్కటదుఃఖంబుల మీర లొందితి రభేద్యస్థైర్యు లై నాకుఁగాన్. 394

వ. నన్నుం గృతకృత్యునిం జేసితిరి; కృష్ణప్రసాదలబ్ధం బయిన యీజయశోభనంబు నిజేచ్ఛాకలితసుఖావాప్తి లీల ననుభవించుచు నాత్మప్రియప్రకారంబుల వర్తించుచు నవధానంబుతో రాజ్యాంగసప్తకం బరయుం – డని చెప్పి యాంబికేయు ననుజ్ఞతోడ.

 395

సీ. బహురత్నమయఘనప్రాసాదమండప
దాసదాసీజనోద్భాసితంబుఁ
దత్తుల్యవైభవ తదధికధనధాన్య
ముఖవస్తుసంచయ సుఖకరంబుఁ
గిన్నరవల్లభగృహసమానత్వ మ
హావిభూతిస్ఫురణాంచితంబు
సర్వసంపత్పూర్ణచారువామాక్షీ ప్ర
చారసంశోభిత స్థలచయంబు

తే. నైనవాని రారాజు నిల్లనిలజునకు
దుస్ససేనుమందిరము పార్థునకు వరుస
తోడ దుర్మర్షణునియును దుర్ముఖునియు
నిచ్చ గవలకు సంప్రీతి నిచ్చె నృపతి. 396

వ. మఱియు విదురయుయుత్సు సంజయ ధౌమ్యులపదనంబు లాలోకించి మీమీ నికేతసంబులు మీరలు గైకొనుం డని నియోగించి, పెద్దనగరిలోన ధృత రాష్ట్రుండు మున్న పన్నుగా వసియించు హర్మ్యంబున నజ్జనపతి నునిచె; నివ్విధంబున గృహంబులు విభజించి యిచ్చి, కృష్ణసాత్యకుల సవ్యసాచిసదనంబున నిల్పునట్లుగా నిర్దేశించి, యందఱం బోవం బనిచి, యభ్యంతరమందిరంబున కరిగె; నాభీమసేనాదు లమ్మహనీయవాసంబులు సేకొని యందుఁ బ్రభూతాన్నపానాద్యనుభవంబుల సుఖించియుండ నవ్విభుండు నిజేచ్ఛవిహరించె—నని యిట్లు ధర్మపుత్రుచరిత్రంబు సెప్పిన విని యబ్బంగిం బ్రాప్త సామ్రాజ్యండై పాండవాగ్రజుండు పదంపడి యెత్తి ఱంగున వర్తించె సకల జగద్గురుండగు కృష్ణుండు మఱి యెట్లుండె నెఱింగింపు మనుటయు. 397

శా. భక్తాంభోరుహబాలసూర్యదనుజప్రధ్వంసనాచార్య సు
వ్యక్తావ్యక్తనిజప్రకార సదయవ్యాపార దాంతిక్షమా
సక్తస్వీకృత నిత్యవేదపరిషత్సంస్తుత్య మాయావిని
ర్ముక్తద్యోతన తార్క్ష్యశాక్వరమహామూర్తిస్ఫురత్కేతనా. 398

క. భవదుఃఖ భరనిరాస
ప్రవీణనానాభిధాన పారాశర్య
స్తవనీయగుణవిధాన స
మవబోధనిరంతరా విదాత్మాధీనా. 399

మాలిని. ప్రకృతిపురుషయోగీ భక్తతాత్పర్యరాగీ
సకృపహృదయపద్మా శాంతిచిత్తైకసద్మా
వికృతిరహితమూర్తీ విశ్వభూతప్రవర్తీ
సుకృతఫలమచూత్మా సుస్థిరానందవర్త్మా. 400

గద్యము

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధనవిరాజి
తిక్కనసోమయాజి ప్రణీతంబయిన శ్రీ మహాభారతంబున
శాంతి పర్వంబు నందుఁ బ్రథమాశ్వాసముఁ.

—: o :—

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము - ద్వితీయాశ్వాసము

-: ం :-

క. శ్రీశుచితా ధృతికరణక
లా శౌండకటాక్షలీల లౌల్యరహితలో
లా శక్తిత్రయసమయ
క్ష్మాశోభితరూపవేల హరిహరనాథా!

1

-: ధర్మనందనుని ప్రవర్తనము :-

సం. 12-45-3

వ. దేవా! వైశంపాయనుడు జనమేజయున కిట్లనియె: నిట్లు సమధిగతసామ్రా జ్యుండై ధర్మనందనుండు దేజోవిశేషంబున మహోజ్జ్వలత్వంబు నొంది, మహీ సురుల నాశ్రితజనంబుల సర్థులం గృతార్థులం గావించి, ధృతరాష్ట్ర గాంధారీ విదురులకు రాజ్యంబు సమర్పించి, 'మీర లింతటికి నొడయుల; రేను మీపని చినపని సేసి, పెట్టినయట్లు గుడిచి యుండం గలవాఁడ' నని పలికి, నిత్యం బును వారలయనుమతిగొని భవ్యమార్గంబునం బ్రజలం బాలించుచు వారికిం బూర్వప్రకారంబుకంటె నతిశయిల్ల నెల్లవర్తనంబులు సంప్రీతిం జెల్లించుచు విపత్తులై న సతుల సుమ్మలికంబు వొరయకుండం గరుణ నరయుచుఁ గృప యుయుత్సు సంజయులకుం గౌరవామాత్యులకు మన్ననలు సలుపుచుఁ, గుంతీదేవికి శుశ్రూష యాచరించుచుఁ, బాంచాలికి సౌమనస్యం బాపాదించుచు, ధౌమ్యునకు సగౌరవంబుగా సకలసంపదలు నొసంగి, తమ్ముఖంబున దేవపితృ పూజనంబులు సతిథి తర్పణంబులు వైదేశికవిప్రార్చనంబులు దీనానాథపోష

ణఁబులుం బరమసంతోషంబుతో నడపుచుం, గృష్ణు నారాధించుచు, సమస్త పౌర జనపదకోటులమనంబులఁ బ్రమోదంబు పరిపూర్ణం బగునట్లుగా నివ్విధంబునఁ బ్రవర్తిల్లుచుండి, యొక్కనాఁడు రేపకడ కృష్ణునియున్న మందిరంబునకుం బోయి. 2

-:ధ్యానాసక్తుఁడైన శ్రీకృష్ణునిం గని ధర్మజుఁడు సంభాషించుట:-

సం. 12-45-13

సీ. మణిహేమపర్యంకమహితో పవేశను
సురుచిరాభరణవిస్ఫురితగాత్రుఁ
గౌస్తుభరత్న వికాసివక్షస్థలుఁ
బీతకౌశేయ సంవీతమూర్తి
మేరుతటిగతమేఘసంకాశు, న
క్షత్రగణావృతగగనసదృశు
నూతనోదితరవిద్యోతితోదయగిరి
నిభు, రుక్మబద్ధేంద్రనీలతుల్యు

ఆ. నమ్మురారిఁ గని కృతాంజలియై భక్తిఁ
జిత్తవృత్తి గరము జొత్తిలంగ
నంతకంత కాననాంబుజ మలరంగ
నిట్టులనియెఁ దియ్య మెసకమెసఁగ. 3

తే. కడపితే రాత్రి సులభసౌఖ్యంబుగా; మ
నంబు గాఢప్రసన్నమే యంబుజాక్ష!
దైవియగునీదుబుద్ధి కతమునఁ గాదె
ధర్మగతిఁ బ్రాభవంబుఁ బొందంగఁగంటి. 4

వ. త్రిభువనవ్యాప్తపరాక్రముండవగు నీ కటాక్షంబునకలిమింగాదే జగత్త్రయ సంభావనీయుండనై వెలింగితి ననుచుం జేరఁబోయి. 5

క. తనయుచితాలాపములకు
మనుజేశ్వరుఁ మాధవుండు మఱుమాట యొకం
డును బలుకక భవ్యధ్యా
ననిరూఢత నున్న యపుడు నరపతి యతనిన్. 6

వ. నిరూపించి యిట్లనియె. 7

సీ. పంచాత్మకంబైన పవనంబు నిగృహీత
మైనది; భవదింద్రియములు మనము
నం దాఁగఁబడ్డవి; యవియును నదియును
బుద్ధియం దొదిఁగించి శుద్ధమైన
నాలవతెరువున లోలతారహితముల్
గాఁగ నిన్నియును సంకలితములుగ
నంచితక్షేత్రజ్ఞునందుఁ గూర్చినవాఁడ;
వీపరమధ్యాన మేమికతన

తే. నొలసెనొకొ! లోకములకు నొండొక్కవింత
లేక నెమ్మదియున్నదియే? కరంబు
విస్మయముఁ బొందె నామది; వినఁగ నర్హ
మేని వినిపింపవే నాకు నిత్తెఱంగు. 8

వ. అని యిట్లు ధర్మనందనుండు నివాతనిశ్చలదీపప్రకారంబున నున్న యప్పరమ
పురుషుం బ్రార్థించి మఱియును. 9

తే. ఋరము నక్షరమును నీవ; కర్తయును వి
కర్తయును నీవ; యాద్యంతగతులు నీవ;
యొక్కఁడై వెలిఁగెడు పురుషోత్తమూర్తి
ధానవాచ్య విన్నమవాత్సల్యకల్య! 10

వ. 'ప్రసన్నుండ వగుము; నాడెందంబు సందియంబు వాయంజేయవే!' యని
విన్నవించినం బాంచజన్యధరుండు బుద్ధియు మనంబు నింద్రియంబులును
గోచరత్వసంప్రాప్తంబులు గావించి కొంచెపునగవున నెమ్మోగం బొప్ప నప్పు
డమిజేని నాలోకించి యిట్లనియె: 11

సి. గంగ యెవ్వనిఁ దనగర్భంబునం దతి
శ్లాఘూసమేతయై సంభరించె
భార్గవుం డెవ్వనిఁ బరమశిష్యుఁడుగాఁగఁ
బడసి గురుత్వ మెక్కు-డుగ నెగడె
నారాముఁ డెవ్వనితో రాసి యిరువది
మూఁడు దినములకు వాఁడి దఱిఁగె
గాశికకన్యలు గారణంబుగఁ బోరి
యెవ్వని కోడి రనేకస్పులు

తే. వేదములు నాలుగును ధనుర్వేదమును మ
హాస్త్రములుఁ జెంద యెవ్వనియందు వెలిఁగె
నట్టి భీష్ముండు న న్నిప్పు డాత్మఁ దలఁచు
చునికిఁ దద్గత మయ్యె నామనసు నధిప! 12

క. అనలము శమించు చాడ్పున
ననఘ! యతండు పరమోన్ముఖాత్ముండై తా
ననుఁ దలఁచె నింద్రియంబులు
మనమునఁ దగ నిగ్రహించి మహితసమాధిన్. 13

క. శరతల్పగతుం డతఁడే
శరణంబుగ నాశ్రయించి సద్భావవ్యా
ప్తిరతుం డగుటను విను త
త్పరత నతనియందు నాదు భావం బెలసెన్. 14

వ. ఇది మదీయధ్యానంబుతెఱం; గమ్మహాత్ముండు వసిష్ఠశిష్యుండు, భూతభవిష్య
ద్వ్యవహారవేది, సర్వవిద్యాధారభూతుం; డాతం డస్తమించిన ధాత్రి యస్త
మితసుధాగభస్తియగు, రాత్రియుంబోలె నగు, సకలజ్ఞానంబులు ననాశ్రయం
బులై పొనుంగుపడుం; గావున నీ వతనిపాలికింబోయి నీయడుగం దలంచిన
యఖిల ధర్మంబులు నడిగి చెప్పించుకొని నిశ్శేషనిరస్తసంశయుండవు గావల
యు ననియానతిచ్చిన నమ్మానవపతి గద్గదకంఠుం డగుచు నాపైకుంతున
కిట్లనియె: 15

ఉ. శంతనుసూనుగౌరవము సర్వము మున్నును వింటి విప్రు ల
లత్యంతము వేడ్కఁ జెప్ప; నతఁ డట్టిఁడ; యాతని నీవు మున్నుగా
నెంతయు భక్తిఁ గాంచుటకు నే మడిఁ గోరెద; నమ్మహాత్ముఁడున్
సంతసమందు నీదయిన సన్నిధిఁ గాంచిన భక్తవత్సలా! 16

వ. 'ఉత్తరాయణంబు వేచికొనియున్న యన్నరోత్తముండు బ్రహ్మమయనిధి
యయిన నీసందర్శనంబు గోరు; నా మీఁది యనుగ్రహంబునను నతనియెడం
గలుగు పరిగ్రహంబును దేవా! నీ విట్లు సేయవలయు' ననుటయు నద్దేవకీ
నందనుండు సమీపగతుండగు సాత్యకిం గనుంగొని 'రథంబు సమకట్టుమని
దారుకునకుం జెప్పుము; భీమార్జున నకులసహదేవులను గృప యుయుత్సు
సంజయులను రావింపు'మనిన నతం డట్లచేసె; దారుకుండునుం దే రాయి
తంబు గావించె. 17

క. ఆది రత్నరుచుల పెల్లున
నుదితార్కునిఁ బోలి వెలుఁగుచుండెను జవసం
పదుదీర్ణసత్త్వసారా
స్పద సుగ్రీవాదిరథ్య సంశోభితమై. 18

వ. ఆ సమయంబున నక్కడం బారాశర్య నారద దేవల దేవస్థాణు వాత్స్య దేవ
రాత ప్రభృతి పరమ మునీంద్ర పరివేష్టణంబు గలిగి గాంగేయుండు గ్రహ
గణపరివృతుండైన చంద్రుండునుంబోలెఁ దల్పీభూత శాతశరశతంబులచేత
శోభిల్లి సందర్శనీయగభస్తివితానుం డగు నస్తమయసమయభానుం గ్రేణి
సేయుచుఁ గృష్ణుం జిత్తంబున నిట్లని స్తుతియించె. 19

-:భీష్ముఁడు శ్రీకృష్ణుని భక్తియుక్తుండై స్తుతించుట:-

సం. 12-47-7

సీ. శుచియును హంసుండు శుచిషత్తుఁ బరముండుఁ
బరమేష్ఠియును నగు భవ్యుఁ గొలుతు;
మునులును సురలు నెవ్వని యున్న రూ పెఱుం
గరు సర్వవిదుని నప్పురుషుఁ గొలుతు;

శ్రుతులు సెప్పఁగ మహామతులు దుఃఖౌషధం
బుగ నెఱిఁగెడు పుణ్యమూ ర్తిఁ గొలుతు;
లోకంబులెల్లఁ గల్గుట నిల్చు టొదుఁగుట
తనయంద యగు మహో త్తరునిఁ గొలుతుఁ;

తే. బక్షి రత్నచయంబుఁ బుష్పవ్రజంబుఁ
బంజరము త్రాడు నావ యుపాశ్రయముగ
నుండుచాఁపున విశ్వంబు నుండుటకు సు
ఖాస్పదం బగు పుండరీకాక్షుఁ గొలుతు. 20

ఆ. హరి సహస్రశీర్షుఁ బరము సహస్రాక్షు
వేదమయు సహస్రపాదు నలఁతు
లైనవారికంటె నలఁతి పెద్దలకును
జాలఁ బెద్దయగు దయాళుఁ గొలుతు. 21

క. అమృతమయు ఋగ్యజుస్సా
మముల యుపనిషద్వచస్సమాజములకు వా
చ్య మయిన పురుషో త్తము ని
ష్కముఖూ పగువాని భక్తిగమ్యుఁ దలంతున్. 22

ఆ. అరణి నగ్ని వొడముకరణి దేవకియందు
విప్రకర్మ యజ్ఞ వేదగు ప్తి
కె జనించె నెవ్వఁ డవ్వసుదేవ నం
దను భజింతు నేకతానిరూఢి. 23

తే. ఒకఁడు పండ్రెండుమూ ర్తులై యుండునట్లు
గా హిరణ్యవర్ణం బగు గర్భ మదితి
దాల్చి యెవ్వానిఁ గనియె దై త్యఘ్ను నట్టి
దేవు సూర్యాత్మకునిఁ బ్రణుతింతు విష్ణు. 24

క. సురపితృకోట్లం బూర్వా
పరపక్ష దినముల సమ్మతపాన ప్రీతిం
బొరయం జేయుచు వెలిఁగెడు
హరి సోమాత్మకునిఁ గొల్తు నాత్మేశ్వరునిన్. 25

తే. విశ్వసృజులను మునులచే వితతమగు స
హస్రవత్సర కలిత మహాధ్వరమునఁ
గశ్యపబ్రహ్మ యెవ్వానిఁ గనియెఁ గనక
పఱుఁ దార్క్ష్యాత్ముఁ దలఁతు నప్పద్మనాభు. 26

క. సువ్యక్తక్షేత్రంబున
నవ్యక్తాకృతినిరూఢి నాసీనుం డై
భవ్యత నుండెడు క్షేత్రా
త్మవ్యపదిష్టుఁ బ్రణుతింతు దామోదరునిన్. 27

క. ప్రకృతివికృతులను షోడశ
వికారముల బెరసి ప్రకృతివికృతిత్వము లొం
దక యుండఁ గాంతు రెవ్వని
సకలములుఁ దలఁతు నట్టి సాంఖ్యాత్మ హరిన్. 28

క. అంతశ్చరమారుతములు
శాంతములుగఁ జేసి యనలసత్వము శమమున్
దాంతియుఁ గల జనములు గను
నంతర్హితుఁ గొలుతు జలశయను యోగాత్మున్. 29

క. ఉపరమముం బ్రాపించిన
యపుణ్యపుణ్యములు గలుగు నతిశాంతులు భ
వ్యపుగతిఁ బొందెదు నానం
దపురూపుని విష్ణుఁ దలఁచెదను మోక్షాత్మున్. 30

తే. చరణనాభిశీర్షంబులు ధరయు నంత
రిక్షమును దివమును జగచ్ఛుర గ్ని
దిశలు దృఙ్ముఖశ్రోత్రముల్ దీప్తు లెమ్మి
హాంగునకు నట్టి హరిని లోకాత్మ దలఁతు. 31

క. భూతముల మ్రింగి లోక
వ్రాతము జలమయముఁ చేసి వశ్యాత్మత ని
ద్రాతిశయంబున బాలుం
డై తేలెడువానిఁ దలఁతు హరి మాయాత్మన్. 32

తే. అంబుదంబులు గేశంబులందు నమలు
సర్వతనుసంధులందును జలధు లుదర
దేశమునయందు నున్నట్టి దేవదేవుఁ
గొలుతుఁ దోయాత్మ దేవకికొడుకుఁ గృష్ణు. 33

తే. వదనబాహూరుపదము లెవ్వాఁడు విప్ర
రాజవైశ్యశూద్రులకు సంప్రభవదేశ
ములుగ వెలుఁగొందు నమ్మహామూర్తి విభవ
దీప్తు వర్ణాత్మకునిఁ బ్రణుతింతు విష్ణు. 34

క. మాసత్ర్యయనాబ్దమయో
ద్భాసితరూపుఁ డయి సృష్టిఁ బ్రళయంబుఁ దగం
జేసి పొలుపారు శౌరి ను
పాసింతును యోగిభోగ్యబలుఁ గాలాత్మున్. 35

క. మును దివిజాదికలోకము
లనంతుఁ డన జగతి కెల్ల నాధారంబై
పెనుపొందెడు శేషాత్మని
వినుతింతున్ విష్ణు భక్తివిభవవిధాయిన్. 36

క. ఆదిత్యమరుద్వసురు
ద్రాది దివిజగణము లెల్ల నవయవరూపో
త్పాదకలితు లెవ్వానికి
నాదేవుని సంస్తుతింతు హరి దేవాత్మున్. 37

క. సర్వమునందును దానున్
సర్వము దనయందు నుండు సంచారంబున్
సర్వమునకు దనవలనన
సర్వాత్మకు నట్టి వృష్ణిసత్తముఁ దలఁతున్. 38

క. మీ నయి తా నతలగతం
బై న నిగమచయముఁ దెచ్చి యజునకు నొసఁగం
గా నేర్చిన సుమనస్స
మ్మానితవిగ్రహు భజింతు మత్స్యాత్మ హరిన్. 39

క. అమృతమథనమున మంథన
గము లీలోద్ధరణకేఁ గైకొని సురసం
ఘమునకుఁ బ్రియ మొనరించిన
యమేయుఁ గూర్మాత్మ నంబుజాక్షుం గొలుతున్. 40

క. వారాహరూపమునఁ బెం
పారిన తనదంష్ట్రి నొకట నవని సగిరికాం
తారంబుగ నెత్తిన యా
శౌరిం గ్రోడాత్మఁ దలఁతు నమ్యగ్భక్తిన్. 41

ఆ. నారసింహవపు రుదారభావము నొఁది
ఘను హిరణ్యకశిపు ఖరసఖముల
వ్రచ్చి దీప్తమూర్తి వఱలు నృసింహాత్మ

సౌత్మభవుని భక్తి నాశ్రయింతు. 42

క. వామనరూపంబున ను
ద్దామబలున్ బలి నడంచి త్రైలోక్యాతి
క్రామితఁ బేర్చిన యద్భుత
ధాముం గ్రాంతాత్మఁ దలఁతు దామోదరునిన్. 43

ఆ. పరశురాముఁ డనఁగ భవ్యుఁడు జమదగ్ని
కుద్భవించి యిరువదొక్కమాఱు
మనుజపతులనెల్లఁ దునిమిన క్రోధాత్మ
నధికభక్తి శార్ఙ్గి నాశ్రయింతు. 44

క. క్షత్రాత్మఁ గొలుతు దశరథ
పుత్రున్ శ్రీరాముఁ డనఁగఁ బొలిచిన దేవున్
శత్రుభయదు రావణు నొక
మాత్రం దునుమాడినట్టి మధుసూదనునిన్. 45

క. హలముసలధరునిఁ గరుణా
నిలయహృదయు రాము రౌహిణేయు సితాంగున్
జలదనిభాంబరుని శుచిం
దలఁతును గోవిందు శౌర్యధను భోగాత్మున్. 46

మ. యదువంశంబున వాసుదేవుఁ డనఁ గ్రీడార్థంబు జన్మించి, దు
ర్మదదైత్యావలిఁ గూల్చి, పార్థునకు సారథ్యంబు త్రైలోక్యస
మ్మద మారంగ నొనర్చి దేవమునిసమ్మానోద్ధృతిన్ భూభరం
బు దొలంగించిన చక్రి నంబురుహనాభుం గొల్తుఁ గృష్ణాత్మునిన్. 47

క. కలికాలచలితధర్మము
నిలుపం గలయట్టి విష్ణునిం గల్క్యాత్మం
దలఁతుఁ దురగవాహను మ్లే

చ్చుల నెల్లం గీటడంచు శుభచారిత్రున్ 48

ఆ. క్షరములైన భూతసంఘంబులం దెల్ల
నక్షరస్వరూపుఁడై వెలుంగు
సకల బుద్ధివృత్తి సాక్షి సాక్ష్యాత్మ న
స్పందబోధమను ముకుందుఁ దలఁతు. 49

సీ. పరమేశ: పుణ్య: సుబ్రహ్మణ్య: భక్తవ
త్సల: మహాదేవ: విశ్వ ప్రకాశ
కరణ: హృషీకేశ: వరద: నారాయణ:
రాజీవనయన: హిరణ్యనాభ:
యఖిలలోకనమస్కృతాంఘ్రిసరోరుహ:
యజ్ఞాంగ: యచ్యుత: యమృతరూప:
నీకు మ్రొక్కెదఁ గరుణింపవే యతసీకు
సుమవర్ణపీతాంబరము ధరించి

ఆ. యున్న నిన్ను నెవ్వ రుల్లంబునందుఁ ద
లంతు రట్టివారలకు భయంబు
గలుగ దెందు నేమి కార్యంబులం దెప్డు
వినుత మంగళాయతనమ వగుట. 50

క. మంగళము విష్ణుదేవుఁడు
మంగళ మెమ్మెఁ దలంప మధురిపుఁ డుద్య
న్మంగళ మంభోజాక్షుఁడు
మంగళ మఖిలము విహంగమధ్వజుఁ డరయన్. 51

క. నారాయణపరములు నిజ
మారయ బ్రహ్మంబుఁ బరము సంచితసత్త్వ
దారతపంబులుఁ గావున
నారాయణపరత వీని నాల్గిటి నిచ్చున్. 52

తే. విష్ణుమయ మగ్ని హవియును విష్ణుమయము
విష్ణుమయము సగ్వింబును విశదబుద్ధి
నిట్లగుటఁ గంుఁ గావున నించుకేనఁ
గల్మషము నాకు లేకున్కఁ గానవచ్చు. 53

క. శరణాగతుండ భక్తుఁడఁ
బరమ పదవి గోరెదను; శుభంబుగ నన్నుం
బరికించి యేది మే ల
య్యెరవు దొరకొనంగఁ దలఁపవే కమలాక్షా: 54

తే. తపమునకు విద్యకును జనుస్థాన మైన
జననరహితుని యజ్ఞాత్మ శౌరి వాజ్మ
యాధ్వరార్చితుఁ జేసితి నాజనార్ద
నుండు మద్భజనమునఁ బ్రీతుండు గాత: 55

క. అని యి ట్లతులస్తోత్రం
బున హరిఁ బూజించి గంగపుత్రుఁడు మదిలో
న 'నమఃకృష్ణాయ' యనుచు
వినతశిరస్కుఁడయి ప్రొక్కఁ విస్మిత భక్తిన్. 56

వ. అని పలికె నని చెప్పి వైశంపాయనుం డిట్లనియె: 57

క. స్తవరాజం బనఁగ ముని
స్తవనీయం బైన యీ వృషాకపిభవ్య
స్తవనామృతార్ణవము సం
స్తవనంబున నిచ్చు సుగతి జగతీనాథా: 58

క. విను జనమేజయభూవర:
యనుత్తమం బయిన యిమ్మహాస్తవము పఠిం
చిన వినినను ప్రాసిన శ్రీ
ఘనను నాయువుఁ బెంపుఁ బేరు నొసఁగు జనులకున్. 59

వ. అని చెప్పి వైశంపాయనుండు వెండియు నిట్లనియె. 60

తే. అట్లు హరిఁ బ్రస్తుతించి శాంతాత్మవృత్తి
నూరకున్న శాంతనవుని భూరితేజు
నమ్ముకుందునిఁ గీర్తించి రచట నున్న
పరమమునులు గద్గదికతోఁ గురువరేణ్యఁ 61

వ. అంత నిక్కడ. 62

ఉ. ఆ దివిజాపగాతనయు నంచితభక్తికిఁ బ్రీతిఁ బొంది దా
మోదరుఁ డప్పు డన్నరపరోత్తముచిత్తమునందు పర్వలో
కాదృతదివ్యబోధమహిమాతిశయం బుదయింపఁ జేయుచుం
దా దయతోడ నెజ్జ డిగి ధర్మజు మోమునఁ జూడ్కి పర్వఁగన్. 63

వ. 'భీష్మపాలికిం బోదము ర'మ్మని పలికి కృతపరికర బద్ధుండై వెడలి రథంబెక్కి
సాత్య కిందన పిఱిందిఁ బలనం బెట్టికొనియె, ధర్మనందనధనంజయు లొక్కతేరును మారుతి నకుల సహదేవు లొక్కయరదంబును గృపయుయుత్సు సంజయు లొక్కస్యందనంబును నెక్కి తదీయంబులగు నే మీనినాదంబులు దిక్కులం బిక్కటిల్ల నుచితపరివార పరివృతులై నడచి; రట్లరిగి యస్థికేశ బహులంబును బహుద్విప కుంభ ఖండనరకపాల పాళి నిబిడంబును నై ప్రేత పత్యనుభూతోజ్ఝితంబైన యాపానభూభాగంబు ననుకరించు కురుక్షేత్రంబు దటియు సమయంబున నయ్యంబుజాక్షుఁడు పాండవాగ్రజు తోడ. 64

తే. దూరమున నైదుమడువులు దోఁచుచున్న
యవి నరేశ్వరఁ మును వీనియందుఁగాదె
పరశుకాముండు సేసెఁ దర్పణము నృపుల
రక్తమున భూరితరపితృభక్తి వెలయ. 65

మ. 'క్షితి నెందుం జరియించి భూపతుల నిశ్శేషంబుగా నేకవిం
శతివారంబులు ద్రుంచి యాతఁడు దుదిన్ శాంతత్వముం బొందె సు
వ్రతుఁడై' నావుడు నమ్మహీశుఁ 'డతఁ డీక్రౌర్యంబు సేయంగ నే
ల తొడంగెన్ నృపు లెట్లు గల్గి రిలయెల్లం గైకొనం గ్రమ్మఱన్'. 66

వ. అనుటయు నచ్యుతుండు 'నప్పరశురామజన్మప్రపంచంబును, దదీయ క్రోధ కారణంబును, నృపలోకమారణంబును,భూపాలవంశపురస్సంభవప్రకారంబును మునులవలన వినిన చొప్పునం జెప్పెద'నని యజ్జనపతి కిట్లనియె: 67

-: శ్రీ కృష్ణుఁడు ధర్మజునకుఁ బరశురాముని చరిత్రంబు చెప్పుట:-

సం. 12-49-41

సీ. కలఁడు జహ్నుం డనఁగా దొల్లి యొక మహీ
పతి, యుజహ్నుండు దత్సుతుఁడు, వాని
కుదయించె వల్లభుం, డుర్వీశ: యాతని
కొడుకు తపోనిష్ఠఁ గుశికుఁ డింద్రు
మెచ్చించి జగముల మేటి నాఁదగు పుత్రి
వేఁడిన దాన నవ్విభున కుద్భ
వమ్మయి కౌశికుఁ డిమ్మహి గాధినా
మమ్మునఁ బరగె; నమ్మనుజవిభుఁడు

తే. సత్యవతి యను తనకన్య సంప్రమోద
మున ఋచీకున కిచ్చె; నమ్మని సుకర్మ
నిరతి సంతానవాంఛమైఁ జరుయుగంబుఁ
దనకు మామకు నై కల్పితముగఁ జేసి. 68

వ. ఆ భృగునందనుం డచ్చరువులు నిజభార్య ముందట నిడి, 'క్షత్రి యాజేయుండును క్షత్రియసూదనుండును నగు క్షత్రియోత్తముఁ డిచ్చరు వున జన్మించు; దీని మీతల్లికి నిమ్ము; తపో ధృతినియమంబుల నుత్కృష్టుం డగు ద్విజశ్రేష్ఠుండు దీనివలనం బుట్టు; నిది నీ వుపయోగింపు' మని వాని నేర్పరించి భవజ్జనీజనకు లిప్పుడు వచ్చెద రని చెప్పి నదీస్నానార్థియయి యరిగెం; దదనంతరంబ తదాశ్రమంబునకుం దీర్థయాత్రాపరుం డయి గాధి గృహిణీసహితంబుగాఁ జనుదెంచిన సత్యవతియు నిట భర్త గావించిన చరు ద్వయంబు మాతకుం జూపి, తత్ప్రభావభేదం బుపన్యసించినం బ్రీతయై య ద్దేవి పరమపావనస్నానం బాచరించి చరు వుపయోగించునప్పు డజ్ఞానంబునం

దనచరువు కూఁతునకిచ్చి, కూఁతుచరువు దా నుపయోగించె; నయ్యువతియుం దలంపులేమి నాలేమ యిచ్చిన భంగిన కుడిచె; నంత భార్గవుండు వచ్చి పత్నిం జూచి దివ్యబోధనంబు నెఱింగి 'క్షత్రియాంతకరంబగు గర్భంబు ధరియించిన దాన' వనవుడు నత్తరుణియుఁ దత్పాదంబులకుం బ్రణతయై 'మీరిట్లానతీఁ దగునె' యని వడవడ వడంకుచుఁ గేలుమొగిచి నిలిచిన; నత్తపోధనుం డత్తెఱవతో 'నత్తెఱంగు నాతలంపున వచ్చినది గాదు; భవన్మాతృబుద్ధిహీనం జేసి చరువ్యత్యాసంబున నయ్యె; నీకుఁ గ్రూరకర్ముండును మహాబలుండును నగు పుత్రుం డుద్భవించు; నాయమకు బ్రహ్మభూతుండును దపోధనుండును నగువాఁ డుదయించు; నేను దపంబున విశ్వబ్రహ్మంబు నచ్చరువున నావహించినవాఁడ' నని పలుకుటయు. 69

క. అమ్ముగ్ధ యతని కిట్లను
'నిమ్మాఁడుజగములు మీర లితరంబులుగాఁ
గ్రమ్మనఁ జేయఁగఁ జాలుదు
రెమ్మెయినైనఁ గృపసేయరే నామీఁదన్.' 70

వ. 'క్రూరుండగు కొడుకుం గనుట కోర్వ' ననుటయు ననుగ్రహాతియంబున నమ్మహాముని 'యవ్విశేషంబు నాపుత్రునకు లేకుండెడుఁ; బౌత్రునియం దావహిల్లెడు; నీకెట్లు ప్రియం బట్లకాఁగలయది' యనియె; నట్ల యత్తన్వి తపోనిరతుండును దాంతుండును శాంతుండును నైన జమదగ్నిం గనియె; బ్రహ్మర్షి సదృశుం డగు విశ్వామిత్రుని గాధిపత్ని గాంచె. 71

క. జమదగ్ని సర్వవిద్యా
సమేతుఁడు నుదారగుణుఁడుఁ జాపాగమవే
దిమతియు నగు రామునిఁ గాం
చె మహీపతిహసనశీలు శిఖినిభమూరి న్. 72

వ. అక్కాలంబునందు హైహయవంశవరుండు. 73

ఉ. దుర్జయవిక్రమోజ్జ్వలుఁడు దోషవివర్జితబుద్ధి కార్తవీ
ర్యార్జునుఁ డేడుదీవులు నయాన్వితశూరత నేలుచుండు ధ
ర్మార్జనలోలబుద్ధియు మహాస్త్రబలంబు సహస్రబాహుతా
స్ఫూర్జనమున్ వెలుంగఁగ నృపుల్ దనయాజ్ఞఁ దలన్ వహింపఁగన్. 74

క. ఆరాజు నగ్నిదేవుఁడు
గారవమున నడుగ నత డు గడుఁబెంపున నా
హారముగ నిచ్చె గిరినగ
రారణ్యగ్రామఖర్వటాదు లతనికిన్. 75

వ. ఇచ్చిన నగ్నిదేవుం డాహారంబుగాఁ గొను తరువాత మిత్రావరుణనందను నాశ్రమకాననం బతండు లేనిసమయంబున సమసిన; నమ్మహాత్ముం డెఱింగి వచ్చి యాసర్వభక్షకునకు రక్షణం బాచరించుచు వర్తించు కార్తవీర్యునిం గని కనలి 'నీవు మదీయ తపోవనంబు పరిహరింపక గహనసామాన్యబుద్ధిం గాల్చితి గావున బాహులు రాముండు నఱకువాఁ' డని శాపంబిచ్చె; సహస్ర బాహుండును దానికి విషాదంబు నొంది యధికతాత్పర్యంబుతో ధర్మకార్యం బుల నడపుచుండె. 76

క. శాపము గారణముగ నా
భూపతి కవినీతులైన పుత్రులు సబలా
టోపాత్ములు పలువురు సిం
హోపములు జనించి ధాత్రి నుద్భటకీర్తిన్. 77

వ. ఎందునుం జరియించువా రొక్కనాఁడు జమదగ్ని యాశ్రయంబునకుం బోయి యతండునుం జామదగ్న్యుండును నఱ్యెడ లేకుండ హోమధేనువును వత్సం బునుం దమమందిరంబునకుం గొనిపచ్చి; రిట్లు దెచ్చట సహస్రబాహుం డెఱుంగడు. 78

క. అట రాముఁ డెఱిఁగి పరమో
ద్భటమగు కోపముఁ జాపపరశుముఖమహో
తకట శస్త్రాస్త్రంబులతోఁ
బటుగతి వచ్చెను సహస్రబాహునిమీఁదన్. 79

—: పరశురాముఁడు కార్తవీర్యార్జునిఁ జంపుట :—

స. 12-49-1

ఆ. వచ్చి ముట్టి కయ్యమిచ్చిన నవ్విభు
నొంచి బాహువనముఁ జించదుగ్ర

పరశు ఘోరధారపాల్ సేసి పోయి ని
జేచ్ఛ నుండె మేదినీశవర్య! 80

చ. అతఁడు సమిత్కుశాభిహరణార్థము గానకు నేఁగి యుండఁగా
నతికుపితాత్ములై కడఁగి యర్జునసూనులు వోయి ముట్టి త
త్పితృశిరమున్ వెసం దునిమి ప్రీతిమెయిం జనుదెంచి రమ్మహో
ద్ధతుఁ డట వచ్చి వారిచరితం బెఱిఁగెం దమతల్లి సెప్పఁగన్. 81

వ. అ ట్లెఱింగి. 82

శా. రాముం డుద్ధతరోషపావకశిఖాప్రస్ఫీతుఁడై తున్ముడున్
భూమీశాలిఁ గుఠారధార నని విస్ఫూర్జద్గతిన్ హైహయ
స్తోమం బాడిగఁ జొచ్చి రాజకులముం దున్మాడి చేసెన్ సము
ద్దామక్రీడను రౌద్ర మొప్ప నిల రక్తస్యందసంసిక్తఁగన్. 83

వ. ఇట్లు సేసి పరమకృపావిష్టహృదయుండై తపోవనంబునకుం జనియెఁ; బదం
పడి బహువత్సరంబులు సనిన విశ్వామిత్రపౌత్రుండైన పరావసు వనురాజు
దుర్వినీతుండై గర్వ్యాదేకంబునం బరశురాము సధిక్షేపించి, 'రాజులకు
వెఱచి డాఁగి యున్నవాఁడ' వని విశిష్టజనసన్నిధిం బలికి బాలవృద్ధ భావంబున
నుపేక్షితులై యతనిచేత మున్నుచావకయున్న ప్రతర్దనాదుల నుగ్గడించి. 84

ఆ. 'నృపులు గారె వారు? నీవు మిథ్యాప్రతి
జ్ఞాభిమాని వనుఁడు' నతఁడు మగుడ
రోషమెత్తి కడఁగి క్రూరత నాబాల
వృద్ధముగ నరేంద్రవితతి నఱకె. 85

ప. గర్భ:ఱుల నున్న యర్భకులను మఱియు వివిధప్రకారంబులఁ బోరం బఱపి
పోయి పుడమి యేలు రాజులం గాలాంతరంబుల వెదకివెదకి వధియించె;
నిట్లిరువదియొక్కమాఱు నేల నిఃక్షత్త్రింబుఁ గావించి, యశ్వమేధయా
గంబు సేసి, దక్షిణగా నీక్షితి యంతయుం గశ్యపున కిచ్చెఁ; బదంపడి
యమ్మని యాజామదగ్న్యుతో నిట్లనియె: 86

తే. అశ్వమేధయాగంబున నవనియెల్ల
నాకు దక్షిణగా నిచ్చినాఁడ వింక
నాధిపత్యంబు నీకు లే దరుగు దక్షి
ణాబ్ధిపారదేశమునకు ననఘచరిత ! 87

వ. అని పలికి యెందేని నేమేనియుం దెఱంగున శేషించిన రాజపింఛంబునకు నిశ్శేషత్వంబు వాటిల్లకుండం బరిహరించుబుద్ధిం బలికిన నప్పురుషసింహుండు 'నట్లకాక' యని పోవ నతనివలని వెఱపున నవ్వలనిసముద్రుండు భూకార్ప్రదేశంబు బెరయం గొంతదేశం బతనికి విహారస్థానంబు గావించె; నివ్విధంబునం గశ్యపమునీంద్రుండు పరిగ్రహించి భూమి భూసురప్రకరంబుల కిచ్చి తపోవనంబున కరిగె; భూమియు నతనిపేరఁ గాశ్యపి యనం నెగడెఁ; గొండొకకాలంబునకు వైశ్యశూద్రప్రముఖులు దర్పితులై వివిధప్రకారంబుల విప్రదారధనధాన్యాదు లపహరింపం దొడంగిరి. 88

సీ. పదపడి విప్రులు పథము దప్పి వధంబు
మద్యపానఁబు సన్మార్గవర్తు
లైన సాధుల ధన మపహరించుటయును
మొదలుగాఁగ నకృత్యములకుఁ జొచ్చి,
రధ్వరాదికసత్క్రియల్ ప్రవర్తింపక
తెక్కలి బంది యేదిక్కులందుఁ
దఱుచయ్యె; నిమ్మెయి ధర్మంబు సెడి యధ
ర్మంబు వర్తించి యరాజకత్వ

ఆ. దోషజాతమైన దుఃఖితబాహుళ్యంబు
గుతిలపెట భూమి యతలమునకుఁ
బోవ నెటిఁగి కశ్యపుఁడు నిజోరువు నెటి
గ్రుచ్చి దాపుగాఁగ నిచ్చి యెత్తె. 89

వ. అది కారణంబుగా ధరణి యుర్వి యనం బ్రసిద్ధి వహించె; నయ్యుద్ధరణసమయంబునం గాశ్యపి గశ్యపుని వేఁడుకొని యుత్తమక్షత్త్రియులు దండనీతిప్రయోగంబు జేసి ధర్మంబు రక్షించి తన్ను సురక్షితం జేయువారుగా వరంబు వడయుటకై యమ్మహామునితో నిట్లనియె : 90

:-భూదేవి కశ్యపునితోఁ బరశురాముని చేఁ జావనిరాజులఁ జెప్పుట:-

సం. 12-49-66

క. నాయం దచటనచట రా
మాయతబాహావిభూతి కగపడని ఘనుల్
ధీయుక్తులు గల రన్నర
నాయకులను వినుము పనుపునను రక్షింపన్. 91

వ. అనిపలికి యద్దేవి దన సురక్షితత్వంబున హైహయులు గొందఱు చావున కుం దప్పుటయు, బౌరవాన్వయ ప్రభువుం డగు విదూరథసుతుండు ఋక్ష వత్పర్వతంబున ఋక్షంబులచే రక్షితుం డగుటయు, సౌదాసవంశజనితుం డొక్కరుండు పరాశరసంయమివరు నధ్వరకాలంబునం జేరినఁ గారుణ్యా తిశయంబున నమ్మహాత్ముండు వాని శూద్రప్రవరనంబున సర్వకర్మంబులుఁ జేయించుకొని రక్షింప సర్వకర్మం డనం బరగుటయు, శిబిమనుమఁడు గోపతి యనువాఁడు వనంబున గోవులు రక్షించిన ప్రతికియునికియుం, ప్రతర్దనపుత్రుఁడు వత్సాభిధానుఁడు వత్సంబులు గోష్ఠంబున రక్షణం బాచరింప సంచరించుటయు, దివిరథతనయుం డగు దధివాహను కొడు కఁగుం డనువాఁడు గంగాకూలంబుల గౌతమమునీంద్రుని రక్షం జేసి నిర్భయుండై వర్తిల్లుటయు, బృహద్రథ కులజాతుండు భూరినామధే యుండు గృధ్రకూటశైలంబున గోలాంగూలంబులు రక్షించుటవలనఁ గలిగి యుండుటయు, మరుతసంతానసంభవులు చతుర్వర్ష వయస్కులగు వారు మువ్వురు సముద్రుండు రక్షకుండై పెనుపం దత్తీరంబునం బెఱుంగుటయుం జెప్పి, వారుత్తమక్షత్త్రియులు వారలు సమ్యక్పరిపాలనంబున నన్నరయు వారు గా ననుగ్రహించిన నచలితనై యుండెద. 92

క. వారలపెద్దలు నాకై
పోరఁ బరశురాముచేతఁ బొలిసిరి నాకున్
వారి నధిపతులఁ జేయుట
గోరందగుఁ గాన యిట్లు గోరితి ననఘా ! 93

తే. అనిన విని వారి రావించి యమ్ము వీంద్రుఁ
డందఱను జూచి యాధిపత్యమున కిమ్ము
హాభుజులు దగువా రని యవనిఁ దగిన
యట్లు విభజించి యభిషేక మాచరించె. 94

క. ఆ నృపుల వంశముల నా
నానృపతులు పుట్టి; రిట్లు నరవరఁ నృపసం
తానములు పెక్కు గలిగి మ
హీనాథత్వమున వ్రాలె నెంచను గలయన్. 95

క. అప్పురుసునఁ బెరిఁగిన నృపు
లిప్పుడు భారతరణోపహృతులై పలువుర్
గుప్పలు గొనఁబడి; రనికిం
దప్పిన వాఁడొకడొకండ ధర సంతంతన్. 96

వ. నీ వడిగిన పూర్వవృత్తాంతంబు చిత్తాయత్తంబుగా నెఱింగించితి–ననవుడు ధర్మనందనుండు గోవిందుతోడఁ 'బరశురాముఁ డింతటివాఁడగునే! కోపంబును విక్రమాటోపంబును జిత్తంబుగా ధాత్రి నిఃక్షత్త్రియంబు సేసె'నని పలికె; వెండియు. 97

తే. ధరణియును ఋక్షములుఁ బరాశరుఁడు గోస
మూహములఁ వత్సములు గౌతముండుఁ గపులుఁ
దోయధియు నింతపుణ్యంబు సేయునే జ
నంబు భాగ్యంబు నభివర్ణనమున కెక్కె. 98

వ. అని యిట్లు సల్లాపంబు సేయుచు మాధవదర్మజు లరిగి యోఘవతీతీరంబున శరతల్పగతుండై గాంగేయుం డున్నెడ కనతిదూరంబున రథావతరణంబు సేసిన భీమసేనప్రముఖులుం గృపాదులు నరదంబులు డిగ్గి;రి ట్లందఱు నంత రంగంబు లేకాగ్రంబులు సేసికొని చేరం జని సాత్యవతేయప్రభృతిమునీంద్రులకుం బ్రణమిల్లి, మఱి భీష్ముం గాంచి; రిట్లు సముచితప్రకారంబునం గని యతనిం బరివేష్టించి యాసీనులై ; రప్పు డచ్యుతుం డమ్మహాత్ము నాలోకించి యుమ్మలించుచు నతనితోడ, 99

సి. నీకు మున్నోలె నవ్యాకులమైయున్న
యదియె చిత్తంబు? దేహంబుపీడ
ఘనము మనఃపీడ కంటె నందురు బుధు;
లొకముల్క- యొడలిలో నున్న నలత
సేయు; నెమ్మెయి బహుసాయక కీలిత
మైన యంగంబునొ వ్వడుగనేల?
యిట్టు లుండియు నించుకేనియు ముఖంబు
బొరయమి పిత్సవరస్ఫూర్తి గాదె?

ఆ. దేవతలకునైన నీ వుపదేశింతు
కలిమిలేములకు వికార మొంద
కుండ; బోధ వృద్ధు లొరులు నిన్ దేర్పంగ
వలవకునికి నిజ మవార్యతేజ! 100

క. భూతంబుల సంసరణము
భూతభవద్భావికార్యములు గర్మసము
ద్యోతనభంగియు నీయఱి
చేతివి కావె కురువంశశేఖరజన్మా! 101

వ. అని వెండియు. 102

ఆ. రాజటె రాగహీనుడటె రాజితసుందరమూర్తి యట్టి వి
భ్రాజిత సంపదున్నతి విభాసితపర్తనుడట్టి కామినీ
రాజి మనోజ్ఞభంగి చతురత్వధనుం డటె బ్రహ్మచర్యదీ
క్షాజితమన్మథుండు నటె; జన్మము లిట్టివి యెందుఁ గల్గునే? 103

క. సురలును నసురులు యక్షులు
నురగులు గంధర్వులును మహోద్ధతిఁ బైపై
నురవడి వచ్చిన నొకఁడవ
పరాజితులఁ జేయు దుగ్రబాహాస్ఫురణన్. 104

చ. దమమును సత్యముం దపము దానము వేదములందుఁ జూపవే
దమునను గల్గు నై పుణియు ధర్మవిధిజ్ఞతయున్ వికోధి భూ

రమణ విమర్దనక్రమవిరాజితశౌర్యము నీకుఁ బోలె నై
జము లగువాఁడు వేఱొకఁడు శంతనునందన! పుట్టఁ డెన్నఁడున్. 105

క. వేయేల! సంభవించునె
సాయకతల్పమున నుండి వావఁగ నొల్లన్
నాయిచ్చఁ కాక యనునరుఁ
డే యుగమునఁ జూడ వినఁగ నెచ్చటనైనన్. 106

తే. వసువు లందును బెద్దన; వాసవాది
సురల మిగులుదు గుణముల; ధరణిసురులు
సెప్ప విందు నీమహిమ; నాచిత్తమునను
గందు ననుపమతేజ! గంగాతనూజ! 107

వ. అని పలికి పాండవాగ్రజుం జూపి. 108

-:కృష్ణుఁడు ధర్మజునకు ధర్మము లుపదేశింప భీష్మ నియమించుట:-
సం. 12-50-29

ఉ. నీవు తపోవిశేషమహనీయతఁ జేసి జగంబు లన్నియున్
భావమునం గనుంగొని నృపాలమహోత్తర! చాలు; దీతఁడ
త్యావిలచిత్తుఁ డయ్యె సుహృదాప్తమ్మతిన్; దురటిల్లు నెవ్వగం
బోవఁగఁ ద్రోవు నీదయిన పుణ్యతమస్తుటవాక్యపద్ధతిన్. 109

వ. నాలుగు వర్ణంబులకును నాలుగాశ్రమంబులకు నిట్టిట్టి యర్థంబు లని నాలుగు వేదంబులం జెప్పిన ధర్మంబులు నీకు విదితంబులు; ప్రవృత్తినివృత్తులును సాంఖ్యయోగంబులును బురాణేతిహాసంబులు ధర్మశాస్త్రంబులు నవగతంబులు; సర్వసంశయచ్ఛేదనదక్షుడ; వీక్షితిపతి నాదరింపుము; శోక మోహగ్రస్తం బగు జనంబు నిస్తరింపం జేయుట గదా మిముఁ బోటుల బుద్ధివిస్తారంబునకు ఫలం; బనిన విని మొగం బించుక యెత్తి కృతాంజలియై గాంగేయుండు గోవిందున కిట్లనియె: 110

క. కర్తయును భర్తయును స
హర్తయు జగములకు నీవ యాశ్రితజనపో

రాత్రి నిరాసనిపుణసం
కీర్తన యోగీశ్వరేశ! కృష్ణ! వరేణ్యా! 11

వ. అని మఱియు ననేకప్రకారములం బ్రశంసించి 'నాకు మే లెయ్యది దానిని నీదివ్యచిత్తంబునం దలంపు' మనవుడు నద్దేవుం డిట్లనియె; 112

తే. అచలభక్తి నిత్యంబు నాయందు నీకుఁ
గలిమిఁ జేసి నీయంతరంగమున నాదు
దివ్యరూపంబు నొలయించితిం; బ్రమోద
భాజనం బైతి భీష్మతపస్స్వరూప! 113

వ. మేలు వేఱ తలంపనేల యని వెండియు. 114

క. భక్తియు నార్జవమును సం
యుక్తములై యున్నయట్టి యుల్లంబున నా
సక్తి నిలుతు; నిం దొకఁడు వి
యుక్తంబైనను వసింప నుర్వీనాథా! 115

తే. అనఘ! యినుఁ డింక నేఁబదియాఱు దివస
ములకుఁ దానుత్తరాయణమునఁ జరింపఁ
దొడఁగు; నీ వప్డు దేహంబు విడిచి యేఁగు
ద పునరావృత్తిపదమున కభినుతముఁగ. 116

వ. వీరె వసువులు విమానంబులతో నంతరిక్షంబున నంతర్హితులై నీరాక ప్రతీక్షించి యున్నవా; రది యట్లుండె; 'నీవు సన్న నీలోకంబున నెఱుక పొనుంగుపడుం; గావున వీ రెల్ల సకలధర్మవివేకలబ్ధికి నయి యరుగుదెంచి పరివేష్టించి యున్నవా' రని తత్కాలసమాగతయోగ్యజనంబులం జూపి, ధర్మపుత్రు నుపలక్షించి 'శోకోపహతబహుశ్రుతుం డగు నితండు దెలివొందునట్లుగా ధర్మార్థసమాధియుక్తంబు లగు నుక్తివిశేషంబుల ననుగ్రహింపవలయు' ననుటయు నద్దేవకీనందనునకు దేవవ్రతుం డిట్లనియె: 117

క. శివనారాయణ యచ్యుత
భవదీయములైన మధురభాషణములు నా

చెవు లానిన నమృతరస
ప్లవనంబునఁ బోలెఁ బ్రమదభరితుఁడ నైతిన్ 118

తే. వాగ్విభుఁడ వైన నీవచోవైభవంబు
లో సమస్తంబు నుండుట లోకనాథ!
నీదుసన్నిధిఁ బలుకంగ నేరరాదు
పద్మభవునకు; నే నెట్లు పలుకువాఁడ? 119

వ. 'విషానలసదృశంబు లగు శరంబులు సేయు వేదనం జేసి యంగంబులు నంతరంగంబు నవశంబులై యున్నయవి; ప్రతిసంభాషణక్షమ లేదు; దౌర్బల్యంబున నెలుంగును నాలుకయుం బ్రస్ఫుటవర్తనంబులు గా, వే నెవ్విధంబున భాషింప నుత్సహింతుఁ? బ్రతిభాశక్తి లేమి సహించి నాదెసం బ్రసన్నుండ వగుము; ధర్మపుత్రున కెయ్యది హితం, బది నీవ చెప్పుము; నీవుండ నేను జెప్పుట గురుం డుండ శిష్యుండు సెప్పిన విధంబు గాదె!' యనిన విని భక్తార్తిహరుండైన హరి యతనితో నిట్లనియె: 120

క. కురువంశధురంధరుఁ డగు
పరమార్థజ్ఞునకు వినయఫణితిం దగు ని
ర్భరశరవేదన సెప్పితి;
వరములు మూఁడిత్తుఁ గొనుము పసుధాధీశా! 121

క. శరముల వలనను మూర్ఛం
బొరయక యొక్కింత డప్పిఁ బొరయక నొప్పిం
బొరయక యవిచ్ఛగాత్రుని
కరణి సుఖాత్ముఁడవు గమ్ము కౌరవనాథా! 122

ఆ. అనఘ! నీరువట్టు నాఁకలిఁ జెను నెప్డుఁ
బొరయకుండునట్టి భూరిశక్తి
నీకుఁ గలుగ నేను నెమ్మనంబుసఁ దల్లిం
చితిఁ దదీయపీడఁ జెందకుండు. 123

క. విను సకలభూతముల వ
ర్తనములు గనునపుడు బుద్ధి దవులఁబడక యెం

దును బరగి దివ్యబోధం
బున నలవడు నట్టిపెంపుఁ బొందు మనింద్యా! 124

వ. 'మత్ప్రసాదంబున నీదృశప్రభావనిరూఢుండ వయి నెగడు' మని పల్కుట
యుం బారాశర్యాది పరమార్యు లప్పద్మనాభుం బ్రశంసించిరి: దివంబున
దేవదుందుభులు మొరసె: మురారి భీష్మధర్మజులమీఁదం గుసుమవర్షంబు
గురిసె: నప్సరోగణగానంబు వితెంచె: నచ్చటియందఱు నాశ్చర్య ప్రమోద
భరిత హృదయులైరి; తదనంతరంబ యంబుజాప్తుం డపరగిరి శిఖరం బలంక
రించె: నప్పు డవ్మను లచ్యుత గాంగేయ కౌంతేయాగ్రజుల నామంత్రితులం
జేసి గమనోన్ముఖు లగుటయు, నమ్మాధవ యుధిష్ఠిరులును సాత్యకియును
భీమార్జున యమళులును గృపయుయుత్సు సంజయులును వారలకుం బ్రణమి
ల్లిరి; వారలును రేపు వచ్చెద మని నిజస్థానంబులకుం జనిరి; కృష్ణాదులును
దేవవ్రతున కభిముఖు లగుచు నట్ల పలికి వలగొని యరిగి యరదంబు లెక్కిరి;
వారి పిఱుంద మున్నువచ్చిన వారణరథ తురగపదాతులు బలసి కొల్చిపోవం
బురంబునకు వారు వోవుసమయంబున 125

చ. దినమున నెల్ల నుష్ణకరదీప్తులు పర్వి రసంబుఁ బీల్వ వం
దిన సకలౌషధిప్రవితతిం దెలివొందఁగఁ జేయునేర్పు గ
ల్గిన తనరశ్మిజాలమున లీలఁ జకోరములన్ మదింపఁ జే
య నుదయమై వెలింగె సమ్మృతాంశుఁడు సేవకుఁ దన్పు సేయచున్. 126

వ. ఇట్లుదయించిన సుధామరీచి లోచనప్రీతి యాచరింపం బెంపు సుభగంబుగా
శౌరిప్రముఖులు పురప్రవేశంబు సేసి నిజనివాసంబుల నుచితవర్తనంబుల
నాత్రి గడిపిరి; ప్రభాతం బగుటయు. 127

తే. మంజుపాఠకరవమును మధురమాగ
ధ స్వనంబును వినుచు మాధవుఁడు మేలు
కాంచి తత్కాలసముచితకర్మజాత
మాచరించి భూసురులకు నర్చ లిచ్చి. 128

వ. మంగళప్రకారంబున నలంకరించి, నిజాకృతి యాదర్శంబునందు దర్శించి,
యప్పుడు సన్నిహితుం డైన సాత్యకిపదనం బవలోకించి భీష్మపాలికిం

బోవుటకుం బాండవాగ్రజుం డాయితం బగుట యెఱింగి మన వెలు
వడు చునికి యెఱింగిఁపు మని పనిచె; నంతకుమున్ను యక్కఱపుంగ
పుండుఁ బుణ్యసంకీర్తనాశీర్వాదంబులను భద్రగాన నాదంబులను వీనులు
వికసిల్ల మేలుకాంచి సమయకృత్యంబు లనుష్ఠించియుండ నాకృష్ణానుజుం
డతనిం గని 'గాంగేయుకడ కరుగుటకె రథంబు సన్నద్ధంబు సేయించి నీర
జనాభుఁడు నీరాక వార్చి యున్నవా'డని చెప్పుటయు, నమ్మనుజపతి
పార్శ్వగతుం డగు పార్థుం గనుంగొని 'మనయరదంబు సంఘటింపుము;
నేఁడు మొదలుగా నయ్యెడకు సైనికుల రానీకు; మంతఃపరివారం
బును వచ్చు టుడుపుము, శాంతనవుండు సందడింబడ నర్హుండుగాఁడు:
విశేషించి పరమగుహ్యార్థంబు లగువాక్యంబులు మనకు ననుగ్రహింపంగల
వాఁడు: గావున నిస్సమ్మర్ధంబుగా నుపాసింప వలయు'నని పలికి యుక్కింత
విచారించి తగు రాజులం గొందఱం బేరుకొని 'ధృతరాష్ట్ర విభుండును
వారును వచ్చువారు వారింబిలువం బంపు' మనవుడుఁ బిలిపించి యతఁడు. 129

-:ధర్మరాజు కృష్ణాదులతోడ భీష్మోపాలికిం బోవుట:-

సం. 12-53-37

క. అరదము పన్నిన నాభూ
వరుఁ డతఁడును దాను నెక్కి వడముడి వేతో
క్కరథమునఁ బిన్నతమ్ముల
నిరువురఁ గలపికొని యెలమి నేతేరంగన్. 130

క. వినుము మహాభూతము లే
నును సమధికరూపమున వినుతభంగిఁ దగం
జనులెఱుఁగు దోపఁ జెలమిం
జనియెను వసుదేవసుతుని సదనంబునకున్. 131

వ. రథగవనరవంబునం గృపయుయుత్సుసంజయులుం గూడుకొని రంత. 132

క. దారుకుఁడు వన్నె తెచ్చిన
తేరను వెలువడియె వాసుదేవుండును న

తేరులు నాలుగు నేమిక
లారవ మెసఁగంగ బెరసి యఱిగె నరేంద్రా: 133

క. జనమేజయన్నప: యంతకు
మును నారదముఖ్యులైన మునివర్యులు శాం
తనవుని పాలికి వచ్చిరి
వనజభవునికడకు సురలు వచ్చువిధమునన్. 134

వ. అట్లు సంయమివర పరిషత్పరివృతుండై యున్న యద్దేవవ్రతునికడ చేర
నరిగి శౌరిప్రముఖుల రథంబులు డిగ్గి. 135

ఆ. తత్సమీపమునకు ధర్మనందనపుర
స్సరత నరిగి తొలుత సకలమునులఁ
బ్రణతిఁ దెలచి కదిసి బలసి యుపాసించి
రన్నదీతనూజు నధికభక్తి. 136

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనున కిట్లనియె: 137

మ. శరతల్పంబునఁ బొల్చు భీష్మకడకున్ సంప్రీతి నక్కౌరవే
శ్వరుఁడుం దమ్ములఁ గృష్ణుఁడుం జని మునివ్రాతంబుతోఁ గూడ న
ప్పరమోదాత్తునిచుట్టు నున్నయెడ నెబ్బంగిం బ్రవర్తించె వి
స్తరమాధుర్యమనోజ్ఞసత్కథలు విస్పష్టంబుగాఁ జెప్పవే: 138

వ. అని యడిగిన నమ్మహీవిభునకు వైశంపాయను డిట్లనియె: మున్ను ధర్మ
పుత్రుండు రావించిన ధృతరాష్ట్రేండును రాజులు నతనిపజ్జ నరిగి వారును
గాంగేయు నుచితప్రకారంబునం గాంచి కొల్చియుండి; రట్టియెడ నారదుండు
ధర్మపుత్రాదుల నమ్మేదినీపతులం గలయం గనుంగొని. 139

క. 'శంతనునందనుఁ డపరది
గంతప్రాప్తరవి యట్టిఁ డయ్యె; నితఁడు లో
కాంతరగతుఁ డగుటకు ము
న్నంతఃకరణముల సంశయము వాయంగన్. 140

వ. సకల ధర్మప్రకారంబు నడిగి తెలిసికొం' డనినఁ బ్రశ్నపాటవంబులేమి
నందఱు నొండొరువుల మొగంబులు చూచుచుండఁ బాండవాగ్రజుండు
పుండరీకాక్షున కిట్లనియె: 141

తే. నీవు తక్కంగ మందాకినీతనూజు
తోడి సల్లాపములకు నుత్తలు ముకుంద!
కలరె యెందును? ధర్మవేదులకు నెల్లఁ
గురుఁడ వీవ; సంభాషణపరుఁడ వగుము. 142

వ. అనుటయు నచ్యుతుండు భీష్మున కత్యాసన్నుండై శారీరమానసకుశల
ప్రశ్నంబుఁ జేసిన నతండు. 143

ఉ. దేవ! భవత్ప్రసాదమునఁ దీఱె శరీరమునొప్పి డప్పి; మ
ద్భావము నింద్రియంబులును బాటవసంపద నొందె; వేదవి
ద్యావిభవంబు నాకుఁ బరతత్త్వపరిస్ఫుటబోధయుక్తమై
భావితమయ్యె నాత్మఁ బరిపక్వదయాకరచిత్త! మాధవా! 144

వ. 'దేవర ధ్యానించిన నన్నుం దలంచినదానంజేసి బ్రుంహితుండనయ్యెను
గొండుక ప్రాయంబువాఁడునుం బోలె నయితిఁ; జెప్పవలయువాని నెల్లం
జెప్పెదఁ; బాండవశుభకరం బైనదాని నీ వేల చెప్పవు? నీతలం పేమి సెప్పవే!
యనినఁ గృష్ణుండు గాంగేయున కిట్లనియె: 145

తే. అనఘ! శ్రేయస్సునకు యశంబునకు నేను
మూలకందంబ; విను, చంద్రముండు శీత
కిరణుఁ డనుమాట విస్మయకరమె చెపుమ!
యశ ముపార్జింపఁ గ్రొత్తపెం పగునె నాకు? 146

క. పరమమగుయశము నీకును
ధరణిం గలిగింపఁ బూని తాత్పర్యమునం
బురుషవర! నాదుబుద్ధి
స్ఫురణము నీ మనముసంచుఁ జొనిపితి నెనయన్. 147

తే. ధరణి యెందాఁక నుండు సుస్థిరత నీదు
కీర్తి యుండాఁక నక్షయస్ఫూర్తిఁ దాల్చి
నడవఁగల యది నీవు సెప్పెడి సువాక్య
ములును వేదతుల్యంబు లై వెలయుచుండు. 148

క. ధర్మజునకు నిచెప్పెడు
ధర్మస్థితి వాక్యసమితి తాత్పర్యముతో
నిర్మలులై కొనియాడెడు
ధార్మికులకు నుభయజగదుదాత్తత కలుగున్. 149

వ. కావున నిట్లు సేసితి 'భవదీయ ధర్మవేదిత్వంబును సవిశేషప్రకారంబుగా నీ మనుమలు ధర్మజభీమార్జున నకులసహదేవులు భద్రభాజనంబులుగా నీయున్న మహీపతులు విని కృతార్థజన్ములు గా నఖిలధర్మ ప్రకారబోధకంబు లగు వాక్యంబులు సెప్పు' మనుటయు శాంతనవుం 'డట్ల చేసెద'నని పలికి యాదర భరితుం డయి యిట్లనియె: 150

సీ. ఎవ్వఁడు పుట్టిన నెల్లమునీంద్రులు
నత్యంత సంప్రమోదాత్ము లై రి,
పరమధార్మికులైన భరతుల యందును
నెవ్వరు నెవ్వని నెనయలేరు,
సత్యంబు దాంతియు శౌచంబు శాంతియు
నలవడ యెవ్వనియందు వెలయుఁ,
బాత్రదానాధ్వరబంధురక్షాది ధ
ర్మంబు లెవ్వనికిఁ ప్రియంబు లెపుడు,

తే. గామమున నై న, విపులార్థకారణమున
నై న, భయమున నైనను, నపథవర్త
నంబునకుఁ జొరఁ డెవ్వాఁడు నన్ను నేమి
యడుగఁ దలఁచె నాధర్మజుల డడుగుఁగాక: 151

వ. అనుటయు నతనితో నచ్యుతుండు. 152

చ. గురులను బంధుమిత్రులను గ్రూరశరంబులఁ గూల్చె నుగ్రతన్
నరుల ననేకకోటుల రణంబునఁ దాఁ దెగటార్చెఁ గాన యి
క్ష్వ్రరుపతి నీసమక్షమునకుం గదియం బుయిలోడెడుం గృపా
విరహితకార్యకర్మఠుఁడు వీఁ డని యాడుదొ యన్ తలంపునన్. 153

వ. అనిన విని వాసుదేవునకు దేవవ్రతుం డిట్లనియె: 154

సీ. విప్రుల కధ్యయనప్రదానాధ్వరా
ద్యము లగు కర్మము లట్ల రాజు
లకు సంగరము; తండ్రులను బుత్రపౌత్రుల
గురుల నైనను బాపపరులఁ బోరఁ
జంపుట ధర్మంబు; సమయంబు విడిచి లో
భంబున సన్యాయపథమునందు
వర్తించువారి నెవ్వరి నాహవంబునఁ
బొరి పుచ్చఁ గలిగినఁ బుణ్యకృతియ;

ఆ. యట్లుఁగాక శోణితాంబుపూరముఁ గేశ
శైవలంబుఁ గాఁగ సమరభూమి
నక్ష్వ్రజపునదీచయం బొనర్చిన రాజు
ధర్మవిదుఁ డనంగఁ దగు ముకుంద: 155

—: భీష్ముడు ధర్మరాజును సప్రేమంబుగా గారవించుట :—

చ. అన విని ధర్మసూనుఁడు కృతాంజలియై తగ భీష్మ డాయ న
ల్లన చని కేలఁ బాదకమలంబు లమర్చి శిరంబు సోఁక వం
దన మొనరించినం బిలిచి తా నభినందితుఁ జేసి, మస్తకం
బునఁ గడు నర్మిలిం దనదుమో మిడి మూర్క్షని సాదరంబుగన్. 156

వ. భీష్ముం డా భీష్మాగ్రజుం గూర్చుండం బనిచి 'శంకింపక నన్నేమియైన
సడుగు' మనిన నమ్మహీపతి మాధవునకుం బ్రణమిల్లి పారాశర్యప్రభృతి
మునివరులకు నభివాదనం బాచరించి, సర్వకౌరవుల యనుమతి వడసి,
యప్పితామహున కభిముఖుం డై సమస్కరించి యిట్లనియె: 157

చ. అరయఁగ రాజధర్మము సమాశ్రయమై నడపుం ద్రివర్గమున్;
గురుతర మోక్షధర్మమునకుం దలఁపం దన ప్రాప యూఁత; భూ
వర! విను, ఘోటకంబునకు వాగెయు దంతికి నంకుశంబు నే
కరణి నివారకంబులు జగంబుల కట్టుల తాను నెమ్మెయిన్. 158

క. వ్యాకులతఁ బొంది రూపఱు
లోకస్థితి తొంటిరాజలోకముచే నం
గీకృత మగు ధర్మ మనం
గీకృత మగునేని వీతకిల్బిషచరితా! 159

క. తరణి పొడిచి తమము చెఱుచు
కరణిని లోకమునఁ గలుగు కల్మషమెల్లన్
ధరణిపతి ధర్మ మాత్మ
స్ఫురణంబునఁ జెఱుచు విమలబోధనచరితా! 160

ఆ. అనఘ! నీదు బుద్ధి యతిలోక మగుటయుఁ
దెలిసికొనఁగ నాకు వలయునట్టి
ధర్మకోటి నీవ తగఁ జెప్ప వినఁ వల
యుటయుఁ జెప్పె నంబుజోదరుండు. 161

ఆ. ధర్మవిదులు రాజు ధర్మస్వరూపుఁగాఁ
జెప్ప విందుఁ; దద్విశేషవృత్తి
భరముగాఁ దలంతు; నరవర! చెప్పవే
మున్ను రాజధర్మముల తెఱఁగు. 162

చ. అనుటయు నాపగేయుఁడు మహత్త్వసమంచిత మైన ధర్మము
న్వినుతవిధాత్మభావమహనీయుఁడు గృష్ణుని వేదమూర్తి నాఁ
జను ధరణీసురావలిఁ బ్రసక్తిఁ దలంచి నమస్కరించి య
జ్జనపతివక్త్ర మాదరరసప్లుతదృష్టిని జూచి యిట్లనున్. 163

క. నృపధర్మము లన్నియు నీ
కుపదేశించెద విసంశయోక్తుల మఱీయున్
విపులఫలవంత మగు ధ
ర్మపథంబును నడుగునెఱఁగ గరము విపరింతున్. 164

వ. అవహితమతి వై యాకర్ణింపుము. 165

ఆ. మేలు దసకుఁ గోరు మేదినీశుఁడు మున్ను
దేవతలకు భూమిదేవతలకుఁ
బూజ యాచరించు నోజ యత్నముఁ జేయు
వలయు రెండుఁ గార్యఫలకరములు. 166

మ. విను ముద్యోగము రెంటియందుఁ బర మూర్వీనాథ! యుద్యోగవం
తునకున్ దైవము దోడ్పడంగ ఫలసిద్ధుల్ సేకుఱున్, మానుష
మున కొక్కొక్కెడ సిద్ధి దప్పిన వగల్ వొందంగ రానీక య
ప్పని దైవోపహంతబుగాఁ గనుట భూపాలార్హవృత్తం బగున్. 167

క. దాంతియు విజితాత్మత్వము
శాంతియు శీలంబుఁ గలుగు జగతీశుఁడ శ్రీ
మంతుండు యశస్వియు నై
యెంతయు సౌఖ్యంబు నొందు నిభపురనాథా! 168

తే. ప్రకృతు లేడింటి నెఱి నడపంగ వలయు;
దాని కార్జవసత్యముల్ దావలములు;
దండనీతివిధాన మంతటికి రక్ష;
యర్హమగు మెల్పుతోఁ జేయ నది వెలుంగు. 169

వ. అదియును బుద్ధిమంతులు బ్రాహ్మణులవలనం బ్రయోగింప; రయ్యర్థంబునకు మనువాక్యంబులు గల వాకర్ణింపుము. 170

ఆ. ఇనుము జాత నీర ననలంబు విప్రుల
వలన రాజు లుద్భవంబుఁ బొందు
టిది నిజంబు; తత్సమిద్ధతేజము లెందుఁ
జెల్లుఁ బుట్టినెడలఁ జేటు నొందు. 171

క. శిలఁ ద్రెంపఁబోయి యినుమును
జలములు గొని కాల్పఁ గడఁగి చని యనలంబుం
బొలియును రాజును విప్రుల
కలిగి చెఱుపఁబోయి తాన యనయంబు జెడున్. 172

శా. ఈవాక్యంబులు రెండుఁ జిత్తమున నీ వెల్లప్పుడున్ నిల్పి భూ
దేవశ్రేణియెడం గృపాన్వితుఁడవై దీప్తార్హదండంబు స
ద్భావం బొప్పఁగ నొండెడన్ నడపు శాంతశ్మాసురోదారజి
హ్వావిశ్రాంతము బ్రహ్మ మట్లగుట దైవం బండ్రు విప్రున్ బధుల్. 173

వ. విప్రుని దండించు నెడలునుం గలవు శుక్రుండును జెప్పినవాఁడు వినుము. 174

భీష్ముఁడు ధర్మజునకు విప్రులలో దండార్హాల నిరూపించుట

సం. 12-56-29

క. శాంతుఁడు గా కని నాయుధ
వంతుండై కవియు విప్రు వసుధేశుఁడు వే
దాంతి నయిన హింసించుట
యెంతయు ధర్మంబు శ్రుతులు నిట్లని చెప్పున్. 175

క. గురుతల్పగు భ్రూణహనున్
నరేంద్రవిద్వేషి బ్రాహ్మణఘ్నునిఁ బెలుచన్
ధరణి వెడల నడువవలయు
శరీరనిగ్రహము సేయఁజన దెయ్యెడలన్. 176

వ. దుర్గంబు లనేకవిధంబులు గలవు; వానియందు సరదుర్గంబు వరిష్ఠంబు; గావున వర్ణంబులు నాలిగింటిమీఁదను మేదినీశ్వరుండు దయ గలుగవలయుఁ; గేవల క్షమావంతుం డగుటకు సాదుచేనుంగుచందంబై యుండు; నివ్విషయంబున బృహస్పతివచనంబులు గలవు తదీయార్థంబులు వివరించెద. 177

సీ. మేదినీపతి యతిమృదు వైన మావంతుఁ
డేనుంగు నెట్లట్ల యెక్కి యాడఁ
జూచుఁ; దేఁకువ సెడి నీచపుఁబ్రజ క్రూరుఁ
డగునేని లోకంబు బెగడు గుడుచుఁ;
గాన వసంతంబు భానునిచాడ్పునఁ
దగియెడు పాటితో ధరణిప్రజల
నుచితవ ర్తనముల నొందించునది; యిది
రాజధర్మములకు రాజుసుమ్ము;

ఆ. కౌరవేంద్ర! యదియుఁగాక దండము పరీ
క్షావిశుద్ధిపూర్వకముగ వలయుఁ;
దనతలంపు వెంటఁ దమకించి ప్రజకు నొ
వ్వుగఁ జరించుటయును దగదు పతికి. 178

క. విను, గర్భిణి ప్రజబడుకున
కనురూపము లై నయట్టి యాహారంబుల్
గొనుగతిఁ బతి ధరణీప్రజ
మనికికిఁ ధగ నభిమతనధి భమక్తిగా కెపుడున్, 179

మ. పరిహాసంబునఁ దేలి భృత్యులయెడం బ్రహ్లాదముం బొందు భూ
వరునాజ్ఞం జన, రీగి మెచ్చరు, పనిన్ వంచింతు, రెగ్గాదఁ జొ
త్తురు, కౌతూహలవేషభాషణములం దుల్యత్వముం బొంది యే
తురు, వా రెల్లపదంబు వేఁడుదురు సింతుర్ భూమి మాయొడ్డుబన్. 180

వ. కావున భృత్యులయెడ నత్యంతహర్షమునం దేలి తేఁకువ సెడఁ జరింపవలదు; సప్తాంగంబులయెడ విరోధం బాచరించువాని నెవ్వానినై నను విడువవలయు; నని చెప్పి వెండియు. 181

క. అవలేపంబునఁ గర్త
వ్యవివేకము లేక వలసినట్టుల యెవ్వం
డవినీతి సేయు ధరణీ
ధవుఁడు విడువవలయుఁ దన కితఁడు గురుఁడై నన్. 182

వ. అని మరుత్తుం డను మహారాజునకు బృహస్పతి యొడంబడం బలికె; నట్ల గుట గురుండు మిత్త్రుండు పుత్రుం డని మన్నింప వలవదు తప్పుగలిగిన ధరణిపతులకు దండింపవలయు; సగరుండు దనకొడుకు నసమంజసునిం బౌర బాలబాధకుండుగాఁ దెలిసియు నుద్దాలకముని నిజతనయు శ్వేతకేతుని విప్రులయెడ మిథ్యోపచారకుం డని యెఱింగియుఁ బరిత్యజించి రన వినమి యిట్టిచరితంబుల రాజు ప్రజారంజకుండుఁ గావలయు; నిక్కంబును జక్కటి యునుం గలిగి జనుల చిత్తంబులు నొప్పింపక పెట్ట వలయు; నట్టివి దతి తోన పెట్టుచు సైరణగలిగి వర్తిల్లు భూవల్లభుం డభివృద్ధి నొంది యతి శయిల్లు. 183

క. తనకీడు వైదికపు వ
ర్తనములఁ గొని యడఁపవలయు; దానిం గడవన్
జనపతికి మేలు గలదే?
వినుము, చతుర్వర్గపరత విహిత మతనికిన్. 184

ఆ. సకల వర్ణ ధర్మ సంకరరక్షయు
సంధివిగ్రహాదిషడ్గుణములు
నలయ కరయుటయును నర్థసమ్యగుపార్జ
నమును నృపతి యెపుడు నడపవలయు. 185

క. పొనరిచి యాడెడుమాటలఁ
గొనఁ దలఁపక దుర్వినీతకోటిధనంబుల్
దన కెక్కినట్టి తప్పులఁ
గొని సుజనుల కీగి నృపతిగుణ మంద్రు బుధుల్. 186

క. కడు నమ్మి యునికియును, నె
క్కుడు నమ్మమియును, సుశీల : కుశలత గా, దె
య్యెడ నైనను బుద్ధి సొనిపి
తడవి కనికొనంగ వలయుఁ దగవుఁ దగమియున్. 187

క. ధన మపహరించుటయ తన
కనిశముఁ బనిగాఁగ బ్రదుకు నతిలుబ్ధునకున్
విను, శత్రులచే నౌటకు
మును దనప్రజచేన చేటు మూఁడు నరేంద్రా ! 188

ఆ. ధర్మరతులు నర్థనిర్మాణచతురులు
లౌల్యరహితులును నలంఘితాజ్ఞు
లును సునీతినిపుణులును గులజులు నగు
పరిజనములఁ బెనుపు పతికి హితము. 189

చ. కపటము లేక వైభవము గప్పక యొండొరుమీఁద రాజుపై
నపరిమితప్రియం బెసఁగ నల్గక యుండు ముదంబుఁ బొంది యే
నృపు విషయంబునం బ్రజ వినిర్మలవృత్తతఁ బ్రతిభంగి నా
నృపు నృపుఁ డండ్రు గా; కితరునిం బగువా రెద నియ్యకొందురే; 190

క. 'ధనదారాదికముల నె
వ్వనికిని రక్షించికొనఁగ వసమే రక్షా
ఘనుఁ డగు పతి గల్గినఁ గా'
కనఁడే శుక్రుండు సుమతు లభినందింపన్. 191

క. 'అనధీయానుం డితఁ డనఁ
జను ఋత్విజునట్ల చూవె సంరక్షక
లసహీనఁడైన, నృపుఁ డని
వనువు పలికెఁ గాదె బుద్ధిమంతులు మెచ్చన్. 192

వ. మఱియు, బృహస్పతి మహేంద్ర భరద్వాజప్రముఖు లగు రాజధర్మాను శాసకులు రాజత్వ మూలకారణంబు ప్రజాసంరక్షయ యనిరి; గావున నెట్లై అంగున నైనను లోకరక్షణంబు రాజున కవశ్యకర్తవ్యంబు. 193

తే. సంతతోత్సాహవంతుఁడై శత్రుకోటి
నార్జవంబున నైన ననార్జవమున
నైనఁ జెఱుపన వలయు; నత్యల్పుఁ డైనఁ
బగతుఁ డగ్నివిషంబుల పగిది నొంచు. 194

క. విను నృపుఁ రాజ్యామిషముం
గొనఁ బలువురచేతఁ బ్రాణగొడ్డంబై యు
న్నను ధీరుఁ డేమఱుమి నది
దనకును దక్కించుకొను బుధస్తుత్యముగన్. 195

వ. అని చెప్పి భీష్ముం'డేను రాజధర్మప్రకారంబు సంక్షేపరూపంబున నెఱింగించితి; నీకు సందేహంబు గలయట్టిది యెయ్యది యడుగు' మనిన ధర్మనందనుం డమ్మహాత్మునితో 'నరుణగభస్తి యస్తగిరి సేరెడు; నేఁటికిం బనివినియెద; రేపు వచ్చి యడిగెద' ననుచుం దత్పాదంబులకుం బ్రణతుండై వీడ్కొనియెఁ; బద్మనాభ ప్రముఖులును వీడ్కొనిరి; వారలందఱును మునులకు నభివాదనంబు లాచరించిరి; మునులు నిజస్థానంబుల కరుగం దారును దృషద్వతీ యనుమహానదిం గృతసంధ్యావందనులై చని కరిపురప్రవేశంబు సేసి సుఖ

వృత్తి నారాత్రి గడపి, కల్యంబునం గాలోచితకృత్యంబు లాచరించి, భీష్మ పాలికింబోయి, యంతకు మున్న వచ్చి యున్న మునిలోకంబునకు నమస్కరించి సవినయంబును సకుశలప్రశ్నంబునుంగా నగ్గాంగేయునిం గదిసి బలసి కూర్చుంచి; రాసమయంబునఁ బాండవాగ్రజుండు ప్రాంజలియై యతని కిట్లనియె: 196

సి. రాజనాపసునకు భాజనంబై మహా
ద్భుత చరిత్రుం డగుపురుషుఁ డొకఁడు
గలిమికి మూలంబు ఘనవిశేషము గల్గ
నోపుఁ గౌరవకులదీపజనన!
యది యెటింగింపవే! యపయపంబులుఁ ప్రాణ
మానసంబులు జన్మమరణములు శ
రీరయాత్రలు నెల్లవారికి నెట్లట్ల
కాని విభేదంబు గాన; మిట్టి

ఆ. రా జొకండు శూరతేజస్వి బుద్ధిమ
జ్జనుల నెట్లు దనవశంబు సేయ
నిలుపఁ జెఱుప నెల్లయిలయును నేల దై
వనిభుఁ డగుచు ప్రొక్కుగొనఁగఁ జాలె? 197

-: భీష్ముండు ధర్మజునకు దండనీతిజన్మప్రకారం బెటింగించుట ;-

సం. 12-59-11

వ. అదియును వినవలతు నని యడిగిన నమ్మనుజపతి కమ్మహాత్ముం డిట్లనియె: 198

క. విను, తొల్లి కృతయుగంబున
మనుజులయెడ దండనీతిమంతుండై రా
జన నొకఁడు గలిగి యరయుట
ఘనుజేశ్వర! లేదు ధర్మమత మంత్రు తగన్. 199

క. ఒండొరులకు రక్షకులై
యుండుదు రట్లుండ దైన్య మొదవిన లోభం
బొండొండ పెరిఁగి ధర్మము
ఖండితమై మొదలుకొని రకార్యంబులకున్. 200

క. క్రమమునఁ గామము రాగము
దమమనముల నొదవఁగా మదం బెక్కిన వి
భ్రమ మొందుచు విచ్చలవిడి
విమార్గచరితముల వేదవిధ్వంసకులై. 201

క. మనుజులు ధర్ముఁ బొడవడఁ
చిన వేదముఁ గర్మములును జెడుటకు భయ మం
దినయింద్రాదులు గమలా
సనుఁ గానఁగ మునులుఁ దారుఁ జనిరి నరేంద్రా! 202

వ. చని యద్దేవునిం గని, 'మనుజలోకంబున వేదంబులు ధర్మంబులుం బొడవ డంగిన నధ్వరరాహిత్యంబున నేమును దుర్బలులమై భయంబఁది వచ్చితిమి రక్షింపు' మని యవ్విబుధులు విన్నవించిన, విరించి 'దానికిం బ్రతి విధానంబు సేసెద: మీరు వెఱవ వల' దని పలికి స్వామ్యమాత్య రాష్ట్రదుర్గ కోశసుహృద్బలంబులు, నాన్వీక్షకీత్రయీవార్తాదండనీతులును, నరిమిత్రోదాసీ నాదిక ద్వాదశరాజమండలంబును, సంధివిగ్రహ యానాసన ద్వైధీభావ సమాశ్రయంబులును మొదలుగావలయువానికిం బ్రబోధకంబులగు నానావయ వంబులుం గలిగి ధర్మార్థకామమోక్షంబులకు సాధకంబు లయి యుండునట్లుగా నూఱువేలధ్యాయంబుల నఖిలలోకహితంబగు నీతిశాస్త్రంబు రచియించి, 'యిది లోకచరిత్ర నిర్మలీకరణంబునకుం గారణం బగు'నని యనుగ్ర హించె; నాలోకపితామహులలాటంబున ననాదినిధనుండును విశ్వజగత్కర్త యు సర్వభూతాత్ముండును సనాతనుండును నగు విరూపాక్షుండు విశాలాక్షుం డనునామంబున నావిర్భవించి, యాగ్రంథం బధిగమించి, దాని నభ్యసించుటకు మర్త్యుల కాయుర్బద్ధులు సాల వని యుమ్మలించి, యమ్మహనీయతంత్రంబు సంక్షేపరూపంబునం బదివే లధ్యాయంబుల వైశాలాక్షం బన నిర్మించె. 203

ఆ. హరునివలనఁ బడసి యాశాస్త్ర మమరేంద్రుఁ
డయిదువేలు సేసె; నమరగురుఁడు
దేటపడ నొనర్చెఁ ద్రిసహస్రతాధ్యాయ
రూప సమ్మితముగ భూపవర్య! 204

వ. దాని ఋక్కుంతు సహస్రాధ్యాయపరిమితంబు గావించె; మఱియు మను మ్మలశక్తి యెఱిఁగి మునులు క్రమంబున సంక్షిప్తరూపంబులుగా గ్రంథం బులు గావించి; రిది నీతిశాస్త్రప్రవర్తనప్రకారం; బట్లు సుర లమ్మేలు పడసి విశ్వలోకేశ్వరుండగు విష్ణుపాలికిం జని తగం గని కార్యంబు విన్నవించి, నీతి శాస్త్రసముద్భవం బెఱింగించి, దీని నధిగమింపను దదీయాచారంబు నడపను శక్తుం డగువాని నొక్కరుని నిర్దేశింపవలయు నని యభ్యర్థించిన, నద్దేవుండు నిజతేజోమయుండుగా నొక్కమానసపుత్త్రి నిర్మించి, విరజుం డను పే రి డియె; నతండు భూమికిం బ్రభువుగా నొల్లకుండెఁ; దత్సుతుండు కర్దముండు ననపేక్షితరాజ్యుండై తపంబున కరిగెఁ; దదీయపుత్రుం డనంగుండు దండనీతి నయించి భూప్రజలం బాలించె; నతనికొడుకు నీతి యనువా డమ్మహా రాజ్యంబున కభిషిక్తుండై యింద్రియవశత్వంబు నొంది మృత్యుపుత్రి సునీథ యనుకామినిం గమనీయాకారనతిమనోహరగుణవిభాసినిం బరిణ యంబైన దానియందు వేనుండు గలిగి మాతామహ దోషంబునంజేసి రాగద్వేషంబుల బ్రజకు విరుద్ధుండయ్యె; నట్లగుటయు మహామునులు గూడి యేతెంచి మంత్రపూతంబులగు కుశసంచయంబుల నతనిం బ్రశమితుం జేసి తద్దక్షిణోరుతలంబు మథించిన. 205

క. విను, కాలినకొఱవితెఱం
గున నల్లఁదనంబు మిగులుకుఱుచయొడలు నె
ఱ్ఱనికన్నులు నై యశుచి
త్వనిరూఢుం డొకఁడు పుట్టె ధర్మతనూజా! 206

-:వైన్యుం డనురాజు చరిత్రంబు భీష్ముఁడు ధర్మజునకుం జెప్పుట:-

సం. 12-59-201

వ. వానిం జూచి యాబుషులు 'నిషీద' యని పలికి వర్జించుటంజేసి తత్సంతాన జాతులు నిషాదు లనంబరగి వింధ్యాదిగిరివనప్రదేశంబులఁ గ్రూరత్వంబున వర్తిల్లి; రమ్మునులు మథియు నారాజుదక్షిణబాహువు మథించిన నుజ్జ్వల తక్షవచశరశరాసనభాసమానుండును వేదవేదాంగధనుర్వేదపారగుండును నగు పరమాకారవంతుం డుదయించె; సకలదండనీతియు నప్పురుషునాశ్ర యించె; నతం డమ్మహాత్ముల కభిముఖుండును బ్రాంజలియునై వినయంబున 207

తే. 'వినుఁడు ధర్మార్థత త్త్వప్రవీణ యగుచు
సూక్ష్మదర్శిని యైనది, సుకృతులార:,
నాదుబుద్ధి; మీకెప్పని నడపవలయు
దీనఁ గొని నన్నుఁ బనుపరే దాని' కనిన. 208

వ. వారునుం దత్సమయసమాగతు లయిన విబుధులును నవ్వైన్యాభిధాను నభి నందించి. 209

సీ. 'మానలోభములఁ గామక్రోధములఁ బాసి
సర్వజంతువులకు సముఁడ వగుచు
నియతధర్మము నీవు నిశ్శంక నడపుము
ప్రియము నప్రియము నుపేక్షఁ గూర్పు;
దండనీత్యాశ్రయధర్మంబు నాపని
దీనిఁ జేయుదు సావధానవృత్తి
రక్షింతు శ్రుతుల వర్ణముల సంకరములు
సౌరని నధ్వర్యులు ధరణిదివిజు

తే. లరయువాఁడ నే భూప్రజ నని ప్రతిజ్ఞ
యను మహోన్నతపద మెక్కు'మనుడు 'నాతఁ
డవనిసురులు సహాయత్వ మాచరించి
రేని నట్లగుఁగా' కనియెం గుమార : 210

వ. అనిన విని వారలు ప్రీతచిత్తులై యతనికి మహీసురులు సహాయత్వం బాచ రించువారుగా ననుమతిసేసి; రయ్యవసరంబున వాత్సల్యంబున సకలదివ్య పరివృతులై వచ్చి విష్ణువిధాతలు నమ్మునీశ్వరులును నక్కుమారు నఖిల ధరణీసామ్రాజ్యాభిషేకంబు నిర్వర్తించి; రవ్విభునకు భుక్రుండు పురోహి తుండును వాలఖిల్యాలయందు సారస్వత్యగణం బమాత్యులును గర్గుండు సాంవత్సరికుండునై నడచిరి; మున్ను మహి విషమ యగుటయు నమ్మనుజ పతి సమమూర్తి గావించుటయు విందుము; కరచరణాద్యవయవంబులతో నవనియు సాగరంబులును మహాగిరులును నగ్గురుప్రభావుని భజియించె. 211

క. సురపతి విభవము, మేరువు
హిరణ్యమును, గిన్నరేశుఁ డీడిత సంప
ద్గురుతయు నొసఁగితి, రథకరి
తురగభటావళులు దలఁపుతో నొడఁగూడెన్. 212

వ. ఇట్లు మహనీయప్రభుత్వపదస్థుండై యమ్మహాత్ముండు శాస్త్రోక్తమార్గంబున దండనీతిపరిపాలనంబు ధర్మతాత్పర్యసమీచీనంబుగా నాచరించె. 213

క. ఉరగాదులవలని భయముఁ
బొరయక యొండొరులతోడఁ బొసఁగి రుజలుఁ జి
త్తరుజలు లేక యతనితటి
ధరణీప్రజ సస్యసంపదయుఁ గల్గి మనున్. 214

తే. బ్రాహ్మణ క్షత్రాణతత్పరతఁ జేసి
క్షత్త్రియాభిధానంబు రంజనము నెల్ల
ప్రజకుఁ జేయుటకతమున రాజనామ
మును బ్రవర్తిల్లె నాన్నృపాలునకు నధిప ! 215

వ. తత్సంతతిజాతులెల్లను దత్క్షుల్లై రాజత్వంబు వహించి దండనీతి పాలించిరి; రా జని యొకండు గలిగిన తెఱంగును, రాజ్యస్థాపనంబును, రాజు మిగిలి వర్తింపం దక్కినజనంబులకు రాకుండుటయు విష్ణువిహితంబులు; విష్ణుండు రాజుల నిజతేజోంశంబుల బ్రవేశించి యుండు; నట్లగుటంజేసి దైవనిభుం డగుచు రా జెల్లవారిచేతను మ్రొక్కుం గొనంజాలుఁ; దద్రక్షణంబును నాచరించు; నొక్కనివశంబున లోకం బంతయు వర్తిల్లుటకు దేవసంబంధ కలితం బయిన గుణంబు వెలిగా నొండుకారణంబు గలదే! యాకర్ణింపుము. 216

మ. హరిపాదంబునఁ బుట్టి ధర్మమున కాలై యర్థమ న్బ్రత్రకున్
సిరి గాంచెన్ దగ వారు మువ్వురును సుస్థేమోన్నతిన్ సంశ్రయిం
తురు భూపాలకు నాతఁ డన్యజనతాతుల్యోద్భవుం డెట్లు ని
ర్జరలోకార్హసమగ్రపుణ్యవితతిప్రాప్తుండు గా కారయన్. 217

వ. దివంబుననుండి దండనీతి నయించుటకు వచ్చి వాసుదేవ మహాత్మ్య కావి
తుండైన మహానుభావుండు గావున వర్ణంబులు నాశ్రమంబులుం దదాచార
ప్రవర్తనంబులైన వేదపురాణేతిహాసంబులును రాజున కధీనంబులు; తదీయ
మాహాత్మ్యంబున నతనియందు సౌందర్య శౌర్యచాతుర్యాదిగుణంబులు గలుగ
జనంబులు దలంతురు; తదాజ్ఞకు లోనై వర్తింతు; రిది రాజులు దేవ సము
లైన తెఱంగు; మఱియు నడుగవలయువాని నడుగు మనిన నయ్యాపగా
నందనునకుం బ్రణమిల్లి యప్పాండునందనుం డిట్లనియె : 218

తే. అనఘ ! నాలుగువర్ణము లాశ్రమములు
నెన్ని గల వెవ్విధంబుల నన్నిటికిని
వర్తనమ్ములు; వేర్వేఱ వానిఁ దెలుపు;
విశ్వరాజధర్మములను విస్తరింపు. 219

భీష్ముఁడు ధర్మజునకు వర్ణాశ్రమధర్మంబు లెఱింగించుట

సం. 12-60-1

వ. అని యడిగిన నాదేవవ్రతుం డన్నరదేవోత్తమున కిట్లనియె: 220

క. కోపంబు లేమి, సత్యా
లాపము, నిజదారపరవిలాసము, శుచితా
గోపన, మద్రోహం బవ
నీపాలక సర్వవర్ణనియతగుణంబుల్. 221

ఆ. బ్రాహ్మణునకు దమము పరమధర్మం బవ
శ్యంబుఁ గృత్య మధ్యయనము; దాన
సర్వకర్మములును శాసితంబులు; వాని
నడప వలయు నిష్ఠ యెడప కతఁడు. 222

ఉ. కానిపథంబునం జనక కారుణికత్వము గల్గి శాంతమై
దా నడవంగ విప్రున కుదాత్తధనం బొడఁగూడె నేని సం
తానముఁ గూర్ప నర్హులకు ధర్మనిరూఢతఁ బంచిపెట్టు దు
ర్మానవిదూరుఁడై పరగఁ బ్రాప్తుఁడు కౌరవవంశదీపకా ! 223

చ. యజనము, దానకర్మమును, నధ్యయనంబును, దస్యుహింసయుం,
బ్రజ కనురాగ మొందఁ బరిపాలన సేఁతయు, సంగరంబున
న్వ్యజితవిభీతిమై నురవణించుటయున్ నృపధర్మముల్; గురు
ప్రజ తిలకాయమాన! సమరంబు సుధర్మ్మవు వీనిలోపలన్. 224

తే. అధ్యయన దాన యజ్ఞంబు లధిపః వైశ్య
నకును గృత్యముల్; ఋద్ధార్జనమున ధనము
సంచితవ్యంబు; పసుల రక్షించువాఁ డ
తండు; వానికి నిది మహాధర్మ మనఘ: 225

క. ఈమూఁడు వర్ణములకును
దా మంచిగఁ బనులు సేఁత ధర్మ్మవు కురుధా
త్రీ మహిళేశ్వర: శూద్రున;
కామెయి జీవనము వాని కజుఁడు విధించెన్. 226

క. ధనధాన్యంబులు గూర్చుట
జనపతి యనుమతము లేక చన దతనికి దా
న నిరూఢి శ్రద్ధ గలిగినఁ
జన నది సుపవిత్ర యగుట జగతీనాథా: 227

తే. అధిప: త్రైవర్ణికుఁకును యజ్ఞవిధుల
శ్రద్ధకలిమికి మిగులు ధర్మంబు లేదు;
యజ్ఞమునకంటె నధికమైనదియుఁ గలదె:
యజ్ఞకర్తయ చూవె సర్వాధికుండు. 228

వ. ఆశ్రమధర్మంబు లాకర్ణింపుము : 229

మ. గురుశుశ్రూషయు, నాగమాధ్యయనమున్, గోష్ఠీనిరాసంబుఁ ద
త్పరతన్ మేన్దొడయంగఁ దాఁ జొరమియున్, భైక్షాశనత్వంబు,ష
డ్వరకర్మంబులయందు రాగభరగాఢద్వేషముల్ లేక యె
వ్వరితోడం బగగాక యున్కియును భవ్యబ్రహ్మచర్యోక్తముల్. 230

మ. నిజదారైకపరత్వముం, గరుణయున్, నిక్కంబునుం, దాల్మియున్
సుజనాసంగము, దేవపిత్రతిథిసంశుద్ధార్చనల్, హవ్యభు

గృజనంబున్, సకలాశ్రమస్థులను శక్యప్రక్రియం బ్రోపుఁ బం
కజగర్భుండు గృహస్థధర్మములుగాఁ గల్పించె నుర్వీశ్వరా! 231

శా. తానున్ భార్యయు నేఁగుఁ బేరడవికిం, దా నొక్కఁడై నం జనున్,
మానాహంకృతు లూడ్చి, నింద్రియములన్ మర్దించు, నచ్చో జడల్
పూనుం, దాపసశాస్త్రముల్ సదువుఁ, జల్పున్ గోష్ఠి తజ్జ్ఞాతితో
వానప్రస్థవిధాప్రవిష్టుఁడు ప్రజావాత్సల్య నిఘ్నాత్మతన్. 232

శా. ఎచ్చోనైనను నిల్చు, నాఁకటికి నేమేనిం గొనున్, రాత్రియై
నచ్చోనెమ్మి శయించు, నగ్ని పరిచర్యం బాపి వర్తించుఁ దా
నచ్చం గోరఁ డొకండు, నింద్రియజయం బేపారు భోగంబులన్
మెచ్చున్ మ్రొక్కుచు నొల్లకుండు యతి పేర్మిన్ నిర్మముండై నృపా! 233

క. ఈనాలుగాశ్రమములకుఁ
బూని చొరందగినవాఁడు భూదేవుఁడు; రా
జైనను వీనను వైశ్యుం
డేనియు వర్తించు శుద్ధహృదయతకల్మిన్. 234

తే. సుమతిఁ ద్రైవర్ణికులకు శుశ్రూషసేసి
యాప్తసంతానుఁ డయ్యు నిలాధినాథ
ననుమతంబున భూద్రున కాశ్రమాంత
రంబు దగుఁ ; గాదు యతిగాఁగ రాజముఖ్య! 235

క. నిజధర్మవర్తి యగు స
ద్విజుఁ డగుఁ బాత్రంబు దానవిధి మఖముల క
ట్ల జనేశ్వర! నృపముఖులకు
నిజవిత్తము లీయ మాననీయత గలుగున్. 236

తే. వర్ణములు నాశ్రమంబులు వసుమతీశుఁ
డు క్తపథమున నడపించి యుభయలోక
సిద్ధిగనుఁ; దప్పఁ ద్రొక్కని శిష్టజనులు
గలనరేంద్రున కింద్రుఁడుఁ దలఁప సరియె. 237

వ. అదియునుం గాక 238

సీ. ఏనుంగు హజ్జులో నెల్లస త్త్వంబుల
హజ్జలు నడఁగిన యట్లపోలె
రాజితష త్త్రిధర్మమునకు లోనయి
సర్వధర్మంబులుఁ జను; మఖములు
వేదంబులును శుభవృ త్తంబులును దండ
నీతి మాసినఁ జెడు, భూతలంబు
సంస్కారరహితమై చాల హీనతఁ బొందు;
నట్లైనఁ బ్రజకుఁ జే టావహిల్లు; 239

తే. రాజు లరసిన నెమ్మది ప్రబుకుఁగాన
రాజు సర్వో త్తముఁడు; ధర్మరాజియందు
రాజధర్మంబ యెక్కు-డు; రా జనంగ
ధర్మదేవత యన వేఱె ధర్మతనయ!

వ. ఆకర్ణింపుము. 240

తే. తొల్లి మాంధాత్యఁ డను మహీవల్లభుండు
విష్ణుసందర్శనము సేయ వేఁడి యొకమ
హాధ్వరము నిష్ఠమైఁ జేయ నమరవిభుఁడు
సన్నిహితుఁ డయ్యెఁ బ్రీతి నజ్జనవిభునకు. 241

వ. అ ట్లింద్రుండు ప్రత్యక్షం బగుటయు. 242

క. అన్నరపాలుఁడు దానున్
జన్నమునకు వచ్చినట్టి జగతీశులు భ
క్తి న్నమ్రులై రి దేహము
లు న్నేలయు ముదము మనములుం గలయంగన్. 243

వ. అట్లు దండప్రణామంబులు సేసి లేచి, చేతులు మొగిచి నిలిచిన సురేంద్రుఁ
డన్నరేంద్రునితో నిట్లనియె : 244

ఆ. విష్ణుఁ జూడ నీపు వేడుకపడితి; నా
కైన నజునకైన నరిది విష్ణు
దర్శనంబు; నీదుతలఁ పెద్ది యెఱిఁగింపు
మది యెనర్చెదను మహానుభావ ! 245

క. అనవుడు 'సాంసారిక వ
ర్తన ముడుపుము; భైక్షచరణతత్పరత మనం
బున దృఢముగ నొందింపుము;
ననుఁ జరితార్థునిఁగఁజేయు' నావుడు నగుచున్. 246

మ. ధరణీశా ! నృపధర్మ ముత్తమము సద్ధర్మంబులఁదెల్ల; నే
తెరువున్ రా జరయంగఁ గాదె తగ సిద్ధింబొందుఁ గామంబుఁ గ్రో
ధరయంబున్ మగిడించి దండము సమత్వవ్యాప్తిఁ జెల్లించుచున్
ధరఁ బాలించిన రాజు వొందుగతిఁ బొందన్ శక్యమే యేరికిన్ ? 247

వ. అని పలికి పురందరుం డందఱు రాజులం గలయం గనుంగొని. 248

తే. లోకపాలాత్మలరు మీరు; మీకు భైక్ష
చరణ మర్హమే ? ప్రజఁ బ్రోవు సమరయుక్త
దేహులగుటయు నమ్మేలు దెచ్చు; సంశ
యంబు వలవదు; మీ పద మధికతరము. 249

వ. అని చెప్పి దేవేంద్రుండు దివంబునకుం జనియె. 250

చ. అది యొక్కఁ డేల వేదములయందుఁ బురాణములం బ్రసిద్ధకో
విదులు బహుప్రదేశముల వేమఱుఁ గాంచి మనుష్యులెల్ల భూ
మిదయితుకంటెఁ దక్కువ యమేయసుధర్ముము లీడుగావు ని
ర్మదకృతదండనీతి కనరా మనమెల్ల వినంగ నెప్పుడున్. 251

ఉ. కావునఁ గామరోషములఁ గ్రాఁచుచు, నాశ్రమకోటిఁ గాచుచున్,
భూవలయప్రజన్ సమతఁబ్రోచుచు, రాజ్యముసేఁత మేలు; భి
క్షావిధిలోనుగాఁ గలుగు సారపుధర్ములన్ ఘటించు మేల్
వావిరి నప్రయత్నమున వానికి వచ్చు నృపాల! యెమ్మెయిన్. 252

చ. అతిథుల దీనకోటుల ధనార్థిత లేని యతిప్రజంబు స
మ్మతిఁ బరికింపు హర్షమదమాన విషాదములం జొరంగ నీ
క తొలఁగఁబ్రోవు నాయెడలు గావక భూప్రజఁ గాతు నన్వినిం
శ్చిత దృఢబుద్ధి గల్గు మిదిసేయు సమస్తసుధర్మసిద్ధులన్. 253

వ. అనిన విని యజాతశత్రుండు 'మహాపురుషా! వర్ణాశ్రమధర్మంబుల విధంబు
లుం దద్రక్షణంబు చొప్పును దాన వచ్చు పెంపును నెఱింగించితి;రాష్ట్రజనంబు
లెయ్యది యాచరించి సుఖ లగుదు రెఱింగింపవే!' యని యడిగిన నమ్మహీ
కాంతునకు శాంతనవుం డిట్లనియె: 254

—: రాష్ట్రజనుల కర్తవ్యధర్మంబులు భీష్ముఁడు ధర్మజునకుఁ దెలుపుట:—

సం. 12-67-2

సీ. రాజు నుత్తమగుణభ్రాజిష్ణు నభిషిక్తుఁ
గావించుకొని యెల్లకార్యములును
దన్ముఖంబునఁజెల్లఁ దద్దయు సుఖముండఁ
బడయుదు; రొకఁడు భూపాలనంబు
సేఁతలేకున్న దుశ్చేష్టితులై జను
లన్యోన్యదారధనాపహరణ
మాచరింతురు; మీలయట్టుల బలవంతు
లల్పులఁ దమకు నాహారములుగఁ

తే. గొండ్రు; భూపతి లేకున్న మండ్రె జనము;
లధిప! కృషి సేయుటయును బేహారమాడు
టయును గోరక్ష గావించుటయును మొదలు
గాగ బ్రదికెడు తెరువులు గాసిగావె. 255

వ. వినుము. 256

సీ. జను లొక్కతఱి దొల్లి సమయంబు దమలోన
జేసి క్రూరతయు ద్రుచ్చిమియు బింకు
సైపక యట్టిదుర్జను నండఁబును గూడి
శాసించువారుగా జాలి తమకు
నధిపతియుగ నొరు నాసపడక యుండి
నడవడి బహుకారణములఁ జిక్కి
వడిన విషణ్ణులై బ్రహ్మ గానగఁ బోయి
'మాకు రక్షకుఁడుగ మహిపుఁ డొకఁడు

తే. వలయు, రూపింపు; మాతనిఁగొలిచి బ్రదుకు
వార' మనుటయు నజుఁడును వారివలని
కరుణ మనువు నిరూపించె; నరు లసత్య
చరితు లని పాలనమునకుఁ జొరఁడ యతఁడు. 257

వ. చొరకున్న నజ్జనంబు లమ్మహాత్మునితో 'నీకుం బుయిలోడ నేల? ప్రజలచేతఁ బశువులయందును బసిండిని నేఁబడియగు నంశంబును ధాన్యంబున దశమ భాగంబును భండారంబుగాఁ బుచ్చికొని, శస్త్రోపజీవులనెల్ల నీవారిం జేసికొని, బలవంతుండవై దుష్టనిగ్రహశిష్టప్రతిపాలనం బాచరింపు; మేమందఱము ననుసరించి నీపనుపు సేయంగలవార; మధర్మవర్తనులు నీచేతం జెడువారు; ధర్మవర్తనులు సేసినధర్మంబున నాఱవపాలు నిమ్మం జేరంగలయదిగా నొడంబడితి; మింద్రుండు దేవతల రక్షించునూడ్చి మమ్ము రక్షించుకొని సుఖంబుండు, మనుటయు. 259

క. అతఁ డొడఁబడి యత్తెఱఁగున
నతిబలవంతుఁ డయి నీతి నంచితమగు ను
ద్ధతవిక్రమమునఁ దగ నీ
క్షితిఁ బాలించె; సుఖులై రశేషజనములున్. 259

ఉ. కావున మేలు సేయదె ఉగజ్జనకోటికి రాజునాజ్ఞమై
బోవుట, యాతనిం దగినపూజలఁ ద్రప్తునిఁజేతఁ, దేవసం
భావనఁ గొ, ల్వ్రతం డొకటఁ బాడి దొఱంగిన సైఁచు, టిట్లు సం
భావితుఁ జేయఁగా సతని పం పొనరింతురు ప్రొక్కి శత్రులున్. 260

క. తనవారు పెద్దసేయని
మనుజేశు నరాతిజనులు మదిని సరకుగాఁ
గొన; రది భూప్రజ కొప్పదు;
విను, కావునఁ బతికిఁ బ్రజలు వెఱచుట యొప్పున్. 261

తే. వాహనాసనశయ్యానివాసములును
భోజ్యగంధమాల్యాంబర భూషణములు
గు ప్తియును నరపతికి నెక్కుడుగ వలయు
ననుతలంపుతో మనుట భూజనుల గుణము. 262

చ. అతఁడును మందహాస సహితాలపనంబును, సత్యభాషణ
వ్రతమును, సంవిభాగనిరవద్యతయున్, సమభావముం, గృత
జ్ఞతయు, జితేంద్రియత్వముఁ, ప్రసాద ఫలంబును గల్గి భూమికిం
బితృసముఁడై విరోధిజనభీషణసారత నొప్పుఁ బెం పగున్. 263

వ. అనుటయుం గొంతేయాగ్రజుండు 'మనుష్యుల కెల్ల రా జధిపతియును దై వంబు
నుంగా విప్రులు సెప్పి; ర ట్లగుట యేమిటనో యని యుంకుదు; నది మీవల
నం ప్రస్ఫుటంబుగా వింటి'నని పలికిన గాంగేయుం డింకనుం జెప్పెదఁ
'దొల్లి వసుమనుం డనుమానవేంద్రుఁడు నీవపోలె వితర్కించి బృహస్పతి
నడిగిన నతం డతనికిఁ జెప్పిన భంగి యాకర్ణింపు'మని యిట్లనియె: 264

-బృహస్పతి వసుమనుం డను రాజునకుం జెప్పిన రాజధర్మప్రకారము-

సం. 12-68-

తే. లోకపులు లోకధర్మంబులును నృపాల!
రాజమూలమ;ల్; రాజవిరహిత మైన
పుడమిజనులకు నింకిన మడువులోని
జలచరంబులు పడఁపాటు సంభవిల్లు. 265

క. తరణి శశాంకులతేజ
స్స్ఫురణము లేకున్నయట్లు భూజనములు ని
ర్భరదురితతఁ జేడ్పడుదురు
నరపాలక విహితపాలనము లేకున్నన్. 266

క. తనధన మిది యని యూఱడి
ఁ నఁ బరిణయ మాడియైన మహితోత్సవముల్
గొనియాడ నెవ్వరికి వ
చ్చునె జనపాలుండు లేనిచో నిర్భయతన్. 267

తే. విభుఁడు లేకున్న జనములు సభయహృదయ
లగుచు హాహానినాదంబు లడరఁ దల్లి
డిల్లుదురు; రాజులేమియ యెల్లవారు
లేమి; కల్మియ కల్మి, దుర్లేపరహిత ! 268

క. యాగములును భోగములును
ద్యాగములును బహువిధముల ధర్మములు మహా
భాగా ! నరపతి రక్షా
యోగంబునఁ జెల్లుఁ బ్రజకు నుల్లాసముగన్. 269

క ఒకరునికి నలిగి యాతని
సకలహిరణ్యంబు రత్నసంచయమును బు

చ్చుకొనుం దనవలచినవా
నికి నిచ్చు ధనేశుఁ డంద్రు నృపు నట్టితఱిన్. 270

తే. చారచక్షుఁడై కను నెల్లజగము; నపుడు
సూర్యుఁ డంద్రు నరేంద్రు; నకార్యకరులఁ
దునుము నయ్యెడ జముఁడు నాఁ జను; నతండు
దేవతాత్మకుఁ డగుట సందియమె యధిప! 271

క. విను నృప! సమ్రాట్టు విరా
ట్టనియెడు శబ్దములఁ బొగడు నాగమములు నె
ట్టన భూపాలకు ననిన న
తనిఁ దగ నర్చింప కుండఁ దగునె యొరులకున్. 272

క. నియతిమెయి నెవ్వఁ డింద్రియ
జయమును భక్తియును జిత్తసారము దృఢసం
శ్రయతయుఁ గలిగి కొలుచు నృపు
నయసంపన్నుఁడుగ జేయు నధిపతి యతనిన్. 273

క. రాజునకుఁ బ్రజ శరీరము;
రాజు ప్రజకు నాత్మ; గాన రాజుం బ్రజయున్
రాజోత్తమ! యన్యోన్యవి
రాజితులై యుండవలయు రక్షార్చనలన్. 274

వ. అని యిట్లు బృహస్పతి యుపదేశించినం గౌసల్యపతి యగు నవ్వసుమనుండు ప్రయత్నంబునం బ్రజాపాలనం బాచరించె నని చెప్పుటయు ధర్మనందనుండు 'రాజు జనపదపరిపాలనంబును శత్రువధంబును మొదలై నకృత్యంబులు నడపు తెఱం గెఱింగింపవే!' యనుటయు భీష్ముం డిట్లనియె: 275

క. తనుఁ దాన తొలుత గెలువన్
మనుజపతికి వలయుఁ; బిదప మా ర్తుర గెలువన్
మనమునఁ దలంచునదియును;
దను గెలువని పతికి గెలువఁదరమే పగలన్? 276

ఆ. వినుము, తన్ను గెలుచుటన వేఱొకండె పం
చేంద్రియములఁ దూలనీక కొలది
నాఁగుటయ; జితేంద్రియత్వంబు గలరాజు
రిపులఁ జెఱుపఁ జాలు నృపవరేణ్య! 277

క. ఆరామాదిక నిజసం
చారస్థలములకు దేశసంధులకుఁ బురీ
ద్వారములకు నగరికిని ధ
రారమణుఁ డొనర్పవలయు రక్షలు నియతిన్. 278

తే. అరులకడ నిజభూమియం దనుజతనుజ
బాంధవామాత్యమిత్ర్తిల పాల వేష
ధరుల వేగులఁ బెట్ట ధరణిపునకు
వలయు నొండొరు నెఱుఁగనివారిఁ గాఁగ. 279

క. తను హీనుం డని యెఱుఁగక
మును ప్రబలుని తోడ శీఘ్రమున సంధానం
బొనరింప వలయు; నతనికి
ధనం బొసఁగియైనఁ బతికిఁ దగు నిలఁ గావన్. 280

క. మత్తుఁ బ్రమత్తుని విషయా
యత్తుని దుర్బలునిఁ జూచి యట్టిపగతుపై
నెత్తునది; శిఖివిషాదుల
నుత్తలపెట్టుకది యతని యుక్విఁ గడంకన్. 281

ఆ. కయ్యమునకు వలదు కాల్దివ్వ; నధిపఁ సా
మమున భేదమునను మార్తు మసము
మెత్తజేసి చెఱుచు మెయివడిఁ దప్పించు
కొను తెఱం గెఱిఁగికొనుట మేలు. 282

చ. జనకుఁడుఁబోలె నర్మిలిఁ బ్రజం బరికించుచు షష్ఠభాగముం
గొనునది; వారిచేత నరిఁ గోటివిధంబుల నాప్తదక్షులం
గని వనగోకులాకరనగ ప్రముఖార్థకరంబు లారయం
బనుచుచు నన్నిటన్ ధరణిపాలుఁడు గన్నిడియున్నఁ బెంపగున్. 283

సీ. కోట యేమఱ కెవ్వఁ బాటించి గడ్డియు
ఖాణంబుఁ గొల్చును గట్టియలును
నేయు నూనియయును నాయుధమ్ములు నౌష
ధము లు నాభీలయంత్రములుఁ గూప
ములు లోనుగా నందు వలయువాని సమగ్ర
ములుగ సంపాదించి భూరిధైర్య
శౌర్యాదిగుణముల సడిసన్న యాప్తయో
ధులఁ బెల్లమర్చుట యలఘునీతి;

ఆ. పగతుఁ డలిగి నడచుపథమునఁ దృణకాష్ఠ
ములును ధాన్యతోయములును లేక
యుండఁజేసి, మిత్రమండలేశుల నెత్తి
యరుగుదేరఁ బనుచునది విభుండు. 284

వ. మఱియు రాజునకు రక్షింపవలయునది; స్వామ్యమాత్యజనపదకోశసైన్య
మిత్రదుర్గంబులను రాజ్యాంగసప్తకంబు గన్నిడి యరయవలయునది; సంధి
విగ్రహయానాసనద్వైధీభావసమాశ్రయంబు లను షాడ్గుణ్యంబు నడపవలయు

నది; ధర్మార్థకామంబు లను వర్గత్రితయంబు పాటింపవలయునది, మంత్ర ప్రభుత్వోత్సాహంబు లను శక్తిత్రయంబు నిజవశవర్తిం జేయవలయునది; సత్త్వరజస్తమంబు లను గుణత్రికంబు విశేషించి ధర్మసేవ సంతతంబు నాచరింపవలయునది; ప్రమాదంబున నర్థకామంబులు హీనంబులైనను ధర్మ నిష్ఠంజేసి ధరణీపాలనంబు సుస్థిరంబై చెల్లు; నాంగిరసభార్గవాదు లగు పెద్ద లిట్లని చెప్పిరి; త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణంబులును బుద్ధీంద్రియంబులును వాక్పాణి పాదపాయూపస్థంబు లను కర్మేంద్రియంబులును మనంబునుం గూడి నేకాదశ సంఖ్యంబైన యింద్రియజాతంబు జయించి, కామజంబులగు నక్షమృగ యా స్త్రీపానార్థదూషణంబులునుం గ్రోధజంబులగు వాక్పారుష్యదండపారుష్యం బులునైన సప్తవ్యసనంబులం దగులక, యజ్ఞాధ్యయనదానతత్పరుం డగుచు, దుర్మంత్రుల కుటిలవాక్యంబులకు లోనుగాక, నయవిక్రమక్రమజ్ఞు లైన యమాత్యులతో దైవమానుషచింతనంబు సేయుచు, దేవ బాహ్మణప్రజా మతర్పణరక్షణంబులంజేసి, యశుభనిరాసనంబును శుభాధానంబును నొన ర్చుచుఁ బ్రజలం బాలించు భూపతి యుభయలోకసిద్ధులం బొందు. 285

తే. అనిన విని ప్రీతి ధర్మనందనుఁడు 'రాజు
దండనీతియు ననఁగ నుదాత్త యుక్త
వస్తువులు రెండు నార్యప్రశస్తకార్య
సిద్ధి గావించు తరములు సెప్పు మనఘ! 286

వ. అని యడిగిన నప్పుడమిజేనికి సరిత్సానుం డిట్లనియె: 287

క. భూరమణుఁడు గాలమునకుఁ
గారణ; మె ట్లన్న ధర్మగతి పూర్ణత నొ
ప్పారంగ దండనీతి స
మారంభము నడపుఁ గృతయుగాగతి నధిపా! 288

వ. అందు. 289

క. ధర్మంబు వెరుఁగు, వైదిక
కర్మఫలము లెసఁగు, ఋతునికాయము ప్రజకున్
శర్మం బొనర్చు, నాయువు
పేర్మిఁ బొరయు, దునక పెద్ద పృథివి ఫలించున్. 290

క. రాజు మూఁడు భాగముల ధర్మంబు నడపుఁ
ద్రేత సమ్మెయి నది ప్రజాప్రీతి సలువు
ద్వాపరంబున నర్ధంబ యోపి చెల్లఁ
జేయు నక్కాల మమ్మాత్రఁ జెందు మేలు. 291

క. నరపతి ధర్మాపేక్షా
పరుఁ డగు గలియుగమునందుఁ బాయును ధర్మ
స్ఫురణ మధర్మం బెందును
బరగును వర్ణాశ్రమముల పథములు దప్పున్. 292

వ. కాలప్రభావం బిట్టిద యైనను. 293

ఆ. విభుని సకలధర్మవృత్తి నత్తఱి కృత
యుగముఁబోలు ధర్మయుక్తిమాత్ర
లరయ విభుల కెట్టు లయ్యె నయ్యోతఱు
లవుల యుగలములట్ల యగు నృపాల! 294

వ. అనుటయు నెట్టివాఁడైన విభుని శుభంబులు వొందు ననుటయు ధర్మనందను
నకు ముందానికినీసందనుం డిట్లనియె: 295

మ. 'అరయుం దప్పు, కృతం బెఱుంగు, మదలోభావేశముల్ లే, వము
ష్కరుఁ, డాత్మస్తుతి లేదు, సేయు నియతిం గార్యంబు. లీగుల్ ఘన
స్థిరముల్, శూరుఁడు, గర్వి గాఁ, డశఠుఁ, డస్త్రీలోలుఁ, డక్రోధనుం,
డరి నొవ్వంగొనఁ' డ న్నొగడ్తఁ గనుకా జత్యంతదీప్తుం డగున్. 296

వ. అని చెప్పి వెండియు. 297

ఆ. సాంగవేదవేది యగు పురోహితుఁ డెప్డు
నగర మెలఁగవలయుఁ దగవుఁ గృపయుఁ
జక్కటియును గలుగు సచివునప్పనములు
నరులు నరయఁ బనుచునది విభుండు. 298

క. పరుసఁదనము మెయినరి గొనఁ
జొరఁదగ; దది పొదుఁగు గోయు చొప్పగు; విను, పా
ల్గురియించుకొనఁ దలంచిన
నరయవలదె గోవుఁ; బ్రజయు నట్టిద యధిపా ! 299

ఆ. కోరి తోఁటవాఁడు కుసుమఫలంబులు
గోయునట్లు రాజు గొనఁగవలయు;
నవ్వనములు నటికి యంగారములు సేయు
భంగి యైన భూమి పాడుగాదె ? 300

క. దయఁ బ్రజ రక్షించుటకు నె
నయె తపములు నధ్వరములు నరవర! దానన్
జయమును లక్ష్మియునుం గీ
ర్తియు సుగతియుఁ గలుగు వసుమతీనాథునకున్. 301

—:వాయుదేవుఁడు పురూరవునకుఁ జెప్పిన రాజధర్మప్రకారము:—

సం. 12-673-2

వ. విశేషించి పురోహితుం బాటింప వలయు; ఖినుము, తొల్లి యైలుం డగు పురూరవుండు వసుధ విప్రక్షత్త్రియులం దెవ్వానిధనంబై యుండు నని వాయుదేవు నడిగిన, నమ్మహాత్ముండు చతుర్ముఖుని ముఖబాహూరుపాదంబులు బ్రాహ్మణక్షత్త్రియ వైశ్యశూద్రులకుఁ బ్రభవస్థానంబు లగుటఁ జెప్పి, యిట్లుత్కృష్టప్రభవుండై సర్వవర్ణంబులకు నీశ్వరుం డగు బ్రాహ్మణుం డీపృథివీధనధాన్యాది సమస్తవస్తువులును దా ననుభవింపను నొడ్డకు నొసంగను నుక్తుం డగుట, దండనీతిధారణంబునకు క్షత్త్రియుం జొనిపె; బ్రాహ్మణశాంతిపరత్వంబున క్షత్త్రియాధిపత్యప్రాప్తి పతిలేమి నంగన దేవరునిం బ్రతిగ్రహించి నట్లున్నది; యిది భూమి తెఱం; గిట్లగుటం జేసి నిజధర్మక్షిప్తుండును విద్వాంసుండును శాంతుండును నగు పురోహితునకు సర్వసంపదలును సమర్పించి జనపతి శుశ్రూషాపరుండును నహంకారరహితుండును నై దండనీతి నయించి యుభయలోకంబులనుం బెంపు వహించు. 302

క. రసగంధాద్యనుభవములు
పొసఁగవు భీతమగుచిత్తమున భయముం బా
ప సమర్థుఁడు గావున నృపుఁ
డసమానప్రభుతఁ బొందె నవనీనాథా! 303

క. అని వాయుదేవుఁ డిట్ల
జ్జనపతి బోధించె ననుడు శాంతనవున క
మ్మనుజపతి యిట్టులను 'నే
పనులఁ బురోహితుఁడు మాన్యభావము నొందున్?' 304

వ, అనిన నాధర్మతనయుతో నద్దేవవ్రతుండు 'పురోహిత విషయంబులుగా భక్రుండు సెప్పినవాక్యంబులు గల వ్రవన్యసించెద నాకర్ణింపు'మని యిట్లనియె: 305

తే. అమరగరుడగంధర్వవిద్యాధరాది
దివ్యులకు లధ్వరంబులఁ దృప్తిసేసి
పరమశుభములఁ బొందు భూవరుఁడు; దాని
కెల్ల మూలంబు దగు పురోహితునిబుద్ధి. 306

క. రక్షఃపిశాచ గుహ్యక
యక్షాదులు బాధవెట్టు నవనీనాథున్
దక్షపురోహితమంత్రసు
రక్షాసంస్కారవిధివిరహితుం డైనన్. 307

క వివిధోత్పాతంబులకున్
నవళులలోఁ దోఁచు కీడునకుఁ దోడ్తో శాం
తివిధానంబున నిరసన
మవును బురోహితునిచేత ననవద్యముగన్. 308

వ. ఈవాక్యంబులం దాత్పర్యంబు గలుగుము; బృహస్పతియును శాంతికంబును
బౌష్టికంబును శత్రుశాంబును మంత్రాధ్యపురోహితసాధ్యంబు లనియెం
గావున నీవును సంభావితపురోహితుండ వగుము. 309

క. పరిశుద్ధి లేని కుత్సిత
పురోహితులు నీచదశలఁ బొందుదురు; మహీ
వర! యల్పమె బుద్ధుండై
పురోహితత్వంబు సేఁత భూపతినగరన్? 310

క. ఆరోగ్యము గల యుత్తముఁ
బౌరోహిత్యంబు నడపఁ బనుచునది ధరి
త్రీరమణుఁ; డతఁడు దాను స
మారంభము లెల్ల నేకమతి గను బొప్పున్. 311

క. బ్రహ్మక్షత్త్రము లొంది య
జిహ్మములై కృత్యములు విశిష్టత నడపన్
బ్రహ్మాదులు హర్షింతురు,
బ్రాహ్మణముఖవర్ణసమితి ప్రమదముఁ బొందున్. 312

వ. ఈయర్థంబునం దైలకశ్యపసంవాదం బను నితిహాసంబు గలదు వినుఁ;
మైలుండు గశ్యపుని బ్రహ్మక్షత్త్రిప్రకారం బడిగిన నమ్మనుజపతికి నమ్ము
నీంద్రుం డిట్లనియె. 313

ఆ. క్షత్త్రిమునకుఁ బుట్టఁగాఁ బట్టు బ్రహ్మంబు
బ్రాహ్మణునకు యోని రాజు గాన
యుభయవర్థనంబు నొండొంటి విడువమి
వెలుఁగు రెండు మాయు విడిచెనేని. 314

క. తమలోనఁ బొందుగల వి
ప్రమహీశులఁ బ్రజయుఁ బొదువుఁ; బ్రజచే మాన్య
త్వము వడయఁగ నేరరు భే
దము గలిగిన; నలఁతు రొలసి దస్యులు ప్రజలన్. 315

తే. అట్టి దశఁ బుట్టు రుద్రుని యలుక; దాన
సకలమునకు వినాశంబు సంభవిల్లుఁ;
గాన యెల్లవిధంబులఁ గలసియుండ
వలయు నృపుఁడుఁ బురోధయు వసుమతీశ ! 316

క. వినుము, విశేషించి జనన
జనితోన్నతి విప్రుఁ డతని జనపతి విషయం
బున నడపవలయు దానను
మనుగడ యిరువురకుఁ బ్రజకు మహనీయమగున్. 317

-:కుబేరునకు ముచుకుందునకుఁ గలిగిన సంవాదము:-

సం. 12-75-3

వ. అనిచెప్పి పురోహితుని విశేషంబు ముచుకుందుం డను రాజునకు వైశ్రవ
ణునకుం గలిగిన సంవాదంబున ప్రకటం బయ్యె నత్తెఱం గెఱింగించెద.

మ. వినుమా రాజు సమస్త దిగ్విజయమున్ విస్ఫూర్తిమైఁ జేసి తాఁ
దన లా వారయబుద్ధి వైశ్రవణమీఁదం బోవ నాతండు దై
త్యనికాయంబులఁ బంచినం దెరువునం దత్సైన్యముల్ రాజు మూఁ
క నతిక్షుభ్యము గాఁగఁ జేయుటయు స్రుక్కంబడ్డ చిత్తంబుతోన్. 319

క. నృవతి పురోహితు దూఱినఁ
దపముల మంత్రముల దేవతాపూజల వీ
ర్యపటుత్వ మతనిసేనకు
నపరిమితము సేసె నమ్మహాత్ముం డధిపా! 320

ఆ. బ్రహ్మశక్తిఁ బేర్చి రాజుసైన్యము దైత్య
సేన బడలువడఁగఁ జేయ నాతఁ
డతిరయమున మెట్టి నలకఁ గుబేరుండు
ననికి వెడలె నిజబలాన్వితముగ. 321

వ. వెడలి సమరంబు సేయుసమయంబునం గిన్నరేశ్వరుం డన్నరేశ్వరు
నాలోకించి. 322

శా. 'దనుఁడై తిటు బ్రహ్మశక్తిన భవద్బాహావిలాసం బమి
త్రక్షోభం బొనరించెనే' యనుడు నాతం'డిట్లు నీవంటి బ్ర
హ్మర్షిత్రింబుల కేకయోనిజననం బవ్వేధ గల్పించె యో
గక్షేమాకలనంబు సంగతములై కావింపఁ బంపండొకో' 323

వ. అనుటయు ధనదుండు సాంత్వనస్వరంబున. 324

ఉ. 'నాకును నీకు నేటికి రణం బొనరింపఁగ నేను బంప నీ
వేకముఖంబుగా ధరణి యేలుము' నావుడు నవ్వి యవ్విభుం
'డీకుపతిత్వ మెల్ల నొడునీగి మహత్వకరంబె విద్విష
ద్భీకరమధ్భుజార్జితమ పెంపొనరంగ భుజింతు దిక్పతీ!' 325

వ. అనిన విని పౌలస్త్యుండు 'నీ వధికుండ వట్లు సేయు' మని గారవించిన ముచు కుండుండు ముదితుండై చని సకలోర్వీయు నిర్వక్రవిక్రమంబున నేలె నని చెప్పిన విని యజాతశత్రుండు 'రాజధర్మంబులయం దైశ్వర్యప్రీతిపుణ్య లోకంబులు నిరతిశయంబుగాఁ జేయం జాలునది యెయ్యేది' యని యడిగిన. 326

ఆ. అతని కిట్టు లనియె నమరతరంగిణీ
సూనుఁ 'డధికభీతులై న సజ్జ
నులకు నభయ మొసఁగి యలఘుసౌఖ్యాత్ములఁ
జేఁత యెంతయును విశిష్ట మధిపుఁ' 327

వ. అని వెండియు. 328

క. విను పర్జన్యుఁడు భూతము
లను బండిన ప్రాను పక్షులను బ్రోచువిధం
బున నీవు బంధువుల స
జ్జనయుతముగఁ బ్రోవు మది ప్రశస్తం బనఘా ! 329

వ. అనిన విని ధర్మనందనుండు 'విప్రప్రభృతులకు నిజధర్మవర్తనంబుల జీవనం బులు నడవక తక్కిన నెట్టని యడిగినఁ బితామహుం డతనితో 'నాపద దని కిన నితరజాతివృత్తంబు గర్హితంబుగా, దట్టయినను నాయుధోపజీవనాదిక్షత్త్రి ధర్మంబులంజేసి బ్రాహ్మణ్యంబు పట్టపడి బ్రాహ్మణులు క్షత్త్రసములగు దురు, వాణిజ్య ప్రముఖ వైశ్యక్రియ నాచరించి వైశ్యసము లగుదురు, నిత్యా నుష్ఠానంబులు లోనుగాఁ గలయవి దిగ విడిచి ధనలోభతాత్పర్యంబున శూద్ర ప్రాయులై చరించి శూద్రసము లగుదురు, దక్కిన జాతుల వారందఱుఁ దమతమ తారతమ్యంబులతో నిన్ని నిజజాతివిహీను లగుదు; రట్టివారు జాత్యుత్తమకృత్యంబునకుఁ బాత్రంబులు గారు; భూకాంతుం డింతయు నెఱింగి యర్హాపకారంబులం బ్రజ నడపి రక్షించినం బ్రజాకృతంబగు ధర్మం బునందుఁ జతుర్థాంశంబునకు నుక్తుండగుఁ; బ్రజలఁ బాతకంబులం బొరయ

కుండ నరయంజాలక దండ్యదండనరహితుండైన మహీవిభుని వారల చేసిన
పాతకంబుల నాలవపాలు వొందుఁ; గొందరు బుధులంతయుం బొందు నని
చెప్పుదు రనుటయు నమ్మనుజనాథుండు. 330

ఆ. వినుము, వివిధసుఖము లనుభవింపఁగ రాజ్య
విభవయుక్తిఁ దిరుగ వేడ్కలేదు;
నాకు ధర్మరక్షణముమీఁది భరముఁ ద
ల్లోపభయము మనములోనఁ బెద్ద. 331

వ. కావున. 332

చ. 'అనఘ! యనేకదోషమగునట్టి మహీవహనంబు నొల్ల; దం
డనపరుషత్వ మేటికి? దృఢ ప్రశమంబున నేను గానకుం
జనియెద'నన్న భీష్ముఁ'డిది జాడ్యము గాక నృపాలధర్మమే?
మనుజవరేణ్య! నీమనము మార్దవ ముగ్గల, మిట్టు నొప్పునే? 333

వ. నిన్నొత్తిచెప్పుటకుఁ బాండువిచిత్రవీర్యశంతను లున్నవారే? నాబుద్ధి వినుము. 334

ఆ. ఈఁగకాలియంతయేనియు వీసర
పోవకుండ ధర్మమునన నడచి
రయ్య తొంటిరాజు; లక్రోధ కామప్ర
యుక్తదండధరణ మొప్పుఁగాక! 335

క. దానాధ్యయన యజనముల
తో నుర్వీజనులఁ గావఁ దొడఁగుట పతికిం
దా నజకల్పిత ధర్మము;
దీని విడుపు నరకమునకుఁ దెరు వగు నధిపా! 336

క. కావున వర్ణాశ్రమముల
నేవిధమున నైన నడపు మెడలక యుండం
గావంగ నోవునృపతికి
లే వలజ క్షణయలోకలీలల యందున్. 337

వ. ఇట్లగుటం దెలుపునది యొక్కయితిహాసంబు గల దాకర్ణింపుము: 338

-: కేకయరాజ రాక్షససంవాద ప్రకారము :-

సం. 12-78-ఠి

క: పరమనియతి నొకఁ గేకయ
నరవతి యధ్యయనవిధి యొనర్పఁగ నటవి
పరిసరమున కేఁగినయెడ
ధరధీశ్వరఁ పట్టి నొక్కదానవుఁ డతనిన్. 339

వ. పట్టినఁ బ్రబలుం డగు నద్దనుజునిం ద్రోచి పోవం జాలక యమ్మహీపాలుండు
వాని కిట్లనియె : 340

సీ. ప్రుచ్చిమియును ఱంకు నెచ్చోటనైన నా
భూమిలోపల లేదు; భూమిసురులు
వేదాధ్యయన యజ్ఞవిధి దానతత్పరుల్,
రాజులు బ్రాహ్మణారాధనంబు
జన్నముల్ సేఁతయు సమానివర్తన
వ్రతములు గలరు, గోరక్షణాది
వార్తావినీతులై వైశ్యులు నడపుదు,
రమ్మాఁడుజాతుల కధికభక్తి

తే. తోడ శుశ్రూషసేసి శూద్రులు చరింతు;
రేమి రంధ్రంబు గాంచి నీ విట్లు వెరపు
మాలి పట్టి తత్ప్రుద్ధతలీల నన్నుఁ?
దలఁప నిది నీకుఁ బథ్యమే దానవేంద్ర! 341

చ. అనుటయు నమ్మహాదనుజు డాతని కిట్లను నట్టివానిఁగా
నినుఁ గని రక్షణంబు దగ నిర్మలచిత్తతఁజేయు రాజు కీ
డునఁ బడకున్కి దెల్పఁగఁ గడుం బ్రియమై చనుదెంచితిన్ మహీ
జనపరిరక్ష యస్ఖలిత సౌమ్యత నిట్ల మొనర్పు భూవరా : 342

వ. అని పలికి సఖ్యంబుసేసి చనియె నని చెప్పినం గౌంత్రేయాగ్రజుండు సంతో
షించి 'జీవనాభావంబైనచో క్షత్రియకర్మానుష్ఠానంబునకు నశక్తుండగు
విప్రుం డెట్లు బ్రదుకువాఁ' డని యడిగిన భీష్ముం డిట్లనియె: 343

చ. మనుజను నుప్పు నువ్వులను మాంసము గోవు వృషంబుఁ గూడుఁ గ
ల్లును ఘృతతైల మాక్షికములున్ ధృతకేసరమైన జంతువున్
ధన మధికంబుగాఁ బడయు దానికి నేనియు విక్రయింపఁగా
దనుమతి యూఁది వైశ్యకృతి నైనను విప్రున కాప దాగతిన్. 344

వ. అనిన విని ధర్మతనయుండు యజ్ఞంబు లెట్లయిన సమీచీనంబులగు నని యడి
గిన వనిమిషనదీనందనుం డతని కిట్లనియె: 345

ఆ. శ్రద్ధ వలయు; మిథ్య చనదు; వేదంబులఁ
బరిభవింపఁదగదు; భవ్యయజ్ఞ
కర్త కెపుడు; నదియుఁగాక దక్షిణలు మం
త్రార్థపోషకంబు లందు రధిప : 346

క. ఈగతి యెఱింగి చేసిన
యాగము సోమాప్తుఁ జేయు నప్పురుషునిఁ ద
ద్యోగ మొనర్చు మహాసుఖ
యోగము సోమాధిరాజ్యయుక్తము శ్రుతులన్. 347

ఆ. అధ్వరంబుకంటె నధికంబు దపము ద
పం బనంగ మేని ప్రస్నఁదనము
నివురఁజేతగా దహింసయు సత్యవా
క్యంబు దపము దయయుగాని యథర్మ. 348

వ. అనిన 349

చ. ప్రియమున ధర్మనందనుఁడు భీష్మునితో 'నృపుఁ డెట్టిభంగివా
నియెడఁ గరంబు నమ్మఁదగు నిక్కపు మిత్త్రిడు లేని భర్తకున్
నయగతి సెల్లనేర' దనినన్ ఘని యిట్లను నాతఁ 'డేక బు
ద్ధియుతుఁడవై వినన్ వలయు దెల్లముగా నెఱిఁగింతు భూవరా ! 350

క. నమ్మమి మృత్యువు, పెద్దయు
నమ్ముట యపమృత్యువగుట నరపతి నమ్మి
నమ్మక పనిగొనునది ని
త్యమ్మును సూక్ష్మమతిఁ దాను నరయగవలయున్. 351

తే. తనకు మేలొనరించు నాతండు మిత్త్రిఁ;
డతఁడు నడపంగ నెల్లకార్యములు శుభము
నొందు; నేమిట నేమఱకునికితోడ
నృపుఁడు మిత్త్రిపైఁ గార్యముల్ నిలుపవలయు. 352

ఉ. మన్ననకున్ మదింప, కవమానము వచ్చిన ద్రుక్కఁ, కొక్కభం
గిన్నెఱిఁ గార్యముల్ విగతకిల్బిషుఁడై తగఁ జేయునట్టి మి
త్త్రి న్నరనాయకుండు దనరూపుగ నగ్గలమైన శ్రీయు న
త్యున్నతియున్ ఘటించు మహిమోజ్జ్వలుఁజేఁత సుఖావహం బగున్. 353

క. విను, మట్టి మంత్రి గామం
బునఁ ద్రోధఁబునను లోభమున భయమునఁ గా
ర్యనిరూపణంబు వదలక
వినీతుఁడై నడచు టధికవిభవముఁజేయున్.' 354

వ. అని చెప్పి వెండియు. 355

క. 'అన్నలుఁ దమ్ములుఁ గలుగుటి
యున్నతుఁజేయు నృపు నెంతయొఱపి శ్లయినన్

మన్ననయు నీగియును సం
పన్నంబులుగాఁగ వారిఁ బాటించు టురున్. 356

వ. అది యెట్లంటేని 357

క. బలఁగము గల భూపాలుఁడు
గెలని మహీశ్వరుల బుద్ధికిని వ్రేఁగగుచున్
బలియుఁ డగు లేనివానిం
జులకంగా జూతు రెట్టి శూరుండైనన్. 358

క. ఎక్కువతక్కువ మాటలు
నుక్కువములు బంది గీడు లొందించుటలుం
బెక్కు దనయన్నదమ్ముల
దిక్కున నన్నియును సైఁపఁ దేజము సేయున్. 359

క. లోపల రాఁజుచు బొగయుచుఁ
బాపంబులు దలఁతు రోపి బలిమియు వెఱపుం
జూపక తక్కురు కెలనికి
నేపాటను వారి నడపు టెంతయు నొప్పున్. 360

తే. చాలుదురు వారు నృపతికి మేలు సేయఁ
గీ డొనర్పంగఁ గావున గిల్బిషములఁ
బొరయకుండంగ వారల నరసికొనుచుఁ
బొదివి నడపుట కార్యంబు భూవిభునకు.' 361

వ. అనుటయు ధర్మజుండు 'ధనార్జనం బేమిటం బ్రస్ఫుటంబై నడచు'నని యడిగిన
నతనికి భీష్ముం డి ట్లనియె: 362

—:కాలకవృక్షీయ క్షేమదర్శిసంవాద ప్రకారము:—

సం. 12-8-1

క. అయతికాఁడు వలయు నర
నాయకునకు వాని కెలనరులుం జేటుం
జేయఁదలంతురు దాన వ
ధాయకుఁ డై కావవలయు ధరణిపుఁ డతనిన్. 363

వ. ఈయర్థంబున నితిహాసంబు గల దాకర్ణింపుము_కాలకవృక్షీయనామధేయుం డగు నొక్కముని క్షేమదర్శి యనియెడు కోసలభూవిభుని భూమికిం బంజర స్థంబుఁ జేసికొని యొక్క కాకంబుఁ దెచ్చి యిప్పక్షి త్రికాల్యవేది యని యెల్లజనంబులకుం జెప్పుచుం దిరిగి క్రమంబున నాజుం గన యతని కక్కాకంబుఁ జూపి నీయంవర్థార్జనాదినృపకార్యంబులవలన నేమఱుట గలదు దానం బుట్టిన నేగి యెల్లనిప్పులుఁగు సెప్పి నీకుం దప్పిన ప్రుచ్చులం బట్టింపఁ జాలు ననుపలుకు వలికి యమ్మహీపరునాదరంబు వడసి వీడుఁబట్టున కరిగిన. 364

క. అ రాత్రి యవ్విభుని యధి
కారులు సంపి రొకఁడంగిఁ గాకము మఱునాఁ
డారాజున కవ్విప్రుడు
గోరి రహస్యంబుఁ జేసికొని యెటిం గించెన్. 365

వ. అట్లు నియోగులకపటోపాయంబునం గాకి మృతంబగుట సాభిజ్ఞానంబుగా నెఱిం గించి తన పేరు సెప్పి 'యేను మీతండ్రిసఖుండ; నతనిపిమ్మట నిచ్చట నిలువనొల్లక వనంబున కరిగి తపంబు సేయుచుండి నీమీఁది యధికస్నేహం బునం జేసి నీదగు యోగక్షేమంబు లరయ వేఁడివచ్చి యారాష్ట్రంబునం బురంబునను వర్తించుచు భవదీయరాజ్యలక్ష్మి మధురభంగి యయ్యును నధ ములగు నానియుక్తులవలనం జోరజనసంవృతంబై న కావేరియుంబోలె నుప యోగ్య గాకునికి యెటిం గి నీకెటిం గించుటకై మిథ్యాభివర్ణితంబై న కాకంబు

నెపంబిడి చొచ్చితి; దుర్మతులైన ద్రోహులు దానిం జంపుటకతంబున లోనం
గీడు గలుగుట నీకుం గొంత గాననయ్యె; గనుగలిగి యరసిన నింకనుం దేట
పడియెడు; నా యా ప్తి యును గార్యవివేకంబుకలిమియు నమ్మి మదీయోపదే
శంబు నాదరింపు;మిప్పుడు నన్నాదరింపక విడిచినవాఁడ వగుము వంచకులైన
యధికారపుషులకు నేర్పుమైఁ ద్రమంబునఁ బరస్పరవిరోధంబుఁ గలిగించి
సంప్రీతి సెరిచి నివలసి న నట్లొకనొకని దండింపు'మని వారలం బేరుగ్రుచ్చి
యుపదేశించిన. 366

క. ఆరాజు నట్ల చేసి మ
హారాజ్య స్థితికి నెల్ల నవ్విప్రు మహో
దార గుణు మంత్రిఁగా గొని
సారధనప్రీతి సుఖయశంబులు వడసెన్. 367

వ. అనిన విని కౌంతేయాగ్రజుండు 'మంత్రి' యెట్టివాఁడు గావలయు నెఱింగింపు
మనుటయు గాంగేయుం డతని కిట్లనియె: 368

సీ. జ్ఞానపరుఁడు, బౌరజానపదాప్తుండుఁ,
గార్యజ్ఞుఁడును, ధైర్యశౌర్యఘనుఁడు,
నక్రూరుఁడును, విశుద్ధాత్ముండుఁ, బతియెడ
భక్త్యనురాగసంభ్రమము లెసఁగ
సమసుఖదుఃఖుఁడై చెమరు నెత్తురుగాఁగఁ
దలచుచు, నరయక తప్పు మీఁదఁ
బెట్టిన నలుకమెఁ దిట్టినఁ గలఁక దా
నొందక తేర్చుచోఁ బొందుసెడక

తే. మెలఁగువాఁడును, నిజరంధ్రములకు మాటు
సేయఁ బరరంధ్రములు గని చిక్కువఱుపఁ
జాలునిపుణుండు నైన విశాలబుద్ధి
గావలయు మంత్రిముఖ్యుండు గౌరవేంద్ర! 369

వ. అని చెప్పి. 370

క. మృదుమధురవాక్యముల నిం
పొదవెడు చిఱునవ్వుతోడ నుర్వీశుఁడు స
మ్మదము సచివులకు ప్రజలకు
నొదవింపఁగ వలయు నది మహోన్నతిఁ జేయున్. 371

తే. ఈగియును బ్రియవచన సంయోగమునన
కాని జనులకు సంతోషకారి గాదు;
పుచ్చుకొను నప్డు పల్కులపొందు కలిమి
యెదిరి మదిఁగందనీ దింత యొఱుఁగుమధిప! 372

వ. అనుటయు ధర్మతనయుండు 'జనంబుల వివాదం బుడుపునప్పుడు పుడమి జేఁడు దూఱునుం బాపంబును బొరయకుండు తెఱంగు దెలుపవే' యనిన దేవవ్రతుం డిట్లనియె: 373

సీ. వ్యవహారశుద్ధి సర్వప్రజాప్రియకారి;
యదియ భూపతికి ధర్మాతిసయముఁ
గీర్తియుఁ జేయు; నక్షీణసత్యులు ధర్మ
పరులును నైన భూసురులు నీవుఁ
ద్రాసులుంబోని చిత్తంబుల తోడుతఁ
బ్రజవివాదములెడఁ బక్ష ముడిగి
విని ధనవాంఛమై ధనికులదెస వ్రాలి
తీర్పక ధర్మంబుతెరువు దప్ప

ఆ. కుండఁ బాడిఁదీర్చి దండింపఁ దగునెడ
ననుగుణంపు దండ మాచరింపు;
మొఱఁగ బలికితేని నుండదు ప్రజ డేగఁ
గనిన పులుఁగుపిండు కరఁచి జెదరు. 374

వ. దండిచుట దానును. 375

క. నఱకుట యర్థముఁ గొనుటయుఁ
జెఱ నునుచుట కట్టియడిచి చేడ్పాటొందం
బఱచుట మొదలుగఁగల పలు
దెఱగులఁ దగవుమెయి నడచు ధీరవిచారా! 376

వ. అనిచెప్పి భీష్ముండు వెండియు నిట్లనియె: 377

క. తనకడకు వచ్చి మొగమో
డని వాఁ డగు దూత పల్కుటకుఁ గోపింపం
జనదు జననాథునకు దూ
తునిఁ జంపిన నరక మగుట ధ్రువ మని రార్యుల్. 378

తే. కులము శీలంబు హితవాక్యములును నేర్పుఁ
గార్యవాదిత్వ సద్వచోగౌరవంబుఁ
దలపుఁగలుగుట దక్షత యలఘుగుణము
లండ్రు దూతకు నియ్యేడు నార్యజనులు. 379

క. మొన దీర్చువెరవు యంత్రము
లనేకము లొనర్చు నేర్పు నాయుధములవి
న్ననువును బోటులకర్జం
బును సేనాపతికి నైజములు గావలయున్. 380

క. తనయులనైనను నమ్మిన
జనపతి సిరి గోలుపోవుఁ జతురతమై న
మ్మినవాఁడపోలె నమ్మక
యునికి సకలజనులయెడల సురవై యుండున్. 38

తే. అనిన విని పాండవాగ్రజుం 'డనఘ! పురము
భంగి యెట్లైన మేలు సెప్పంగవలయు'
ననుడు నమ్మహీవిభునకు ననిమిషాప
గాతనూభవుఁ డిట్లనుఁ బ్రీతితోడ. 382

సీ. పరపులోఁతును గలపరిఘతోఁ బొడవును
ఘనమును నగుకోట గలిగి తగిన
వాకిళ్ళ బలుపుఁ గావలి నొప్ప రమ్యగృ
హవ్రాతములు గొమరారువీథు
లందంబులగు మేటియంగళ్ళ నెల్లవ
స్తుపులను శోభిల్ల సుజనబహుళ
మై ధాన్యములును ఘృతాదిరసద్రవ్య
ములును నానాయంత్రములును బహువి

ఆ. ధాయుధములు బిరుదు లగుయోధులును బండి
తులు విలాసినులును దూతముఖ్య
పరిజనములునెఱయఁ బరమోత్సవంబులు
మెఱయఁ బురము చెలువు మిగుల వలయు. 383

ఆ. అట్టిపురవరంబునందు రత్నస్వర్ణ
ముఖములగు పదార్థములకు బంధు
తతికిఁ బతి సురక్షితస్థితి సేయువాఁ
డధిప! వినుము భూమి యరయ తెఱఁగు. 384

వ. అనిపలికి మఱియు. 385

క. స్థలముఖ్యము లయ్యెడు పే
ర్కొలయూళ్లుల నెల్ల వెరపు గలిగిన విశ్వా
సులఁ బ్రభుత యిచ్చి భూపతి
నిలుపవలయు వర్ణరక్షణీయుత వెలయన్. 386

క. చోరులచేఁ జెడకుండం
గ్రూరులచేఁ జావకుండఁ గువలయజనులన్
జారులచేఁ బడకుండ ధ
రారమణుఁడు నేర్పు గలిగి రక్షింపఁ దగుటన్. 387

క. అవుబేహారముఁ గృషియు
న్సవరణలును బసులసొంపునన యట్లగున్
భువిఁ బసులు గలుగు కాఁపుల
నవనీశుఁడు గన్నప్రజలయ ట్లరయఁదగుటన్. 388

క. అరి మిగులగొనుట గ్రేపులఁ
బొరిమాలం బిదికినట్ల భూవర కదుపున్
వెరవునఁ బెనిచినయట్టగు
నరపతి ప్రజచేత నప్పనము దగఁ గొనినన్. 389

-: బండారంబువృద్ధిసేయు తెలుంగు భీష్ముఁడు ధర్మజునకుఁ జెప్పుట :-

సం. 12-89-1

వ. అనిన విని పాండవాగ్రంజుండు 'బండారంబు గలిగించు వెర వెట్టిదిఁ తెలుపు' మని యడిగిన నాపగాతయుం డతని కిట్లనియెఁ 390

క. విను కర్షకులును వణిజులు
ననఘుఁ గోరక్షకులు ధరాధీశునకున్
ధన మొడఁగూడెడు చోటుల
ననేకవిధములకు నెల్ల నాద్యస్థలముల్. 391

తే. ధనములకు ధాన్యములకు నుత్పత్తి తలము
లయినవాని కించుకయును హానిగాక
యుండఁ దనకును బండార మొదవఁ దగు ను
పార్జనము సేయవలయు భూపాలకుండు. 392

క. పులి గూనల దిను చందము
గలిగిన నంతటన నిలుచుగాక ధనంబుల్
గలుగునె మీఁ దం గావున
జలగ దిగిచినట్లు గొనఁగ జను నిల సొమ్ముల్. 393

క. అరయుటఁ బ్రజవర్ధింపఁగఁ
నరి యేట గ్రమ్రపవృద్ధ మౌనట్టులుగా
నరపతికిఁ గొనగవచ్చు
న్వెరపులఁ బెంపంగఁ జాల నెఱయు ధనంబుల్. 394

క. దమియింపఁ దగినవార
సమయమున దమించి వారిసంపదలు మహీ
రమణుఁడు దనదుబండా
రముగా సమకూర్చు జనము రాగిల్లంగన్. 395

క. ఆపనికిఁ గీడు రోయుచు
భూపాలుడు ధనము గలుగుపురుషులసిరిఁ దాఁ
జూపోపక కొనఁదగదు; ద
యాపరుఁడై పెంపవలయు నఖిలజనములన్. 396

క. ప్రభువుల నుపచారంబుల
విభుఁ డసురాగిల్లఁ జేసి వెదగొనుఁ గాఁపుల్
సభయులు గాకుండ ధనం
బుభయజగత్సిద్ధి పొంచె నుర్వీనాథా ! 397

క. ఆయతి కిమ్మెయిఁ గలుగు ను
పాయంబులు ధర్మమార్గ ఫలితంబులు గాఁ
జేయుటయు మేలు నృపతికి
మాయాకృతినిపుణుఁ డగుట మతి గాదుసుమీ ! 398

క. ధనము సవరించినఁ బ్రియో
జన మేమి యపాత్రములకుఁ జల్లి చెఱుచునే
ని నరేంద్రముఖ్యుఁ వ్యయములు
విను, రక్షయ సిరికిఁ బాత్రవిషయము లై నన్. 339

వ. ఈ భంగియైనం గోళమి త్త్రిరాష్ట్రిబలంబులు వృద్ధిఁబొందు; నీవిట్టి తెఱంగు వాఁడవై ప్రజల రక్షింపుము; రణంబుల కలయక విరోధుల వధియింపుము; మఖంబు లొనరింపుము; దరిద్రులై న ధరణీసురాదిసాధుల నరసి కుటుంబ రక్షణంబు సేయుము; మాంధాతృనకు నాంగిరసుండగు నుతథ్యుండు సెప్పిన హితవాక్యంబు లుపన్యసించెద నాకర్ణింపుము. 400

-:మాంధాతృన కుతథ్యుఁడు సెప్పిన హితవాక్యముల ప్రకారము:-

సం. 12-91-1

తే. భూతవృద్ధులు ధనలాభములును గలుగు
ధర్మమునను రాజనువాఁడు ధర్మరక్ష
కై జనించెను గావున నతఁ డరోష
కాముఁడై ధర్మనిరతుండు గాఁగ వలయు. 401

క. విను, ధర్మమునకు బ్రాహ్మణ
జనము జననదేశ మగుట జనపతి భక్తిం
గొనియాడి యసూయావ
ర్జనుఁడై తగు విప్రకోటి సంభావింపన్. 402

చ. అనిమిషులుం విభీతులగునట్టి పదంబునఁ బేర్చి మున్ విరో
చనతనయుండు భూమిసురజాతిసుమృత్తి కసూయచేసి నె
ట్టన సిరిఁబాయుడే బలిదృఢంబగు భక్తివిశేష మూఁదఁగా
ననఘ! యతండు దాఁ బిదప నవ్యయసౌఖ్యవిభూతి నొందఁడే. 403

ఆ. ధర్మమునకు సిరికిఁ దగ జనించినయది
దర్ప; మనిమిషులు నుదా త్తమునులు
నై న నగ్గుణమున నూనినఁ జెడుదురు;
దాని గెలువ వలయు ధరణిపుసకు. 404

మ. పరనారీగమనాదిదోషములు భూపాలుండు సేయంగఁ ద
ద్ధరకుం వర్షములేక యుండుఁ, బ్రజకుం దై న్యంబు వాటిల్లుఁ, బె
క్కురుజల్ పైకొను, నెందునుం గలయ నుక్కుం దేజముం దక్కును
ద్ధుర సైన్యంబుల శత్రు లొత్తుదురు, బంధుశ్రేణికిం జేటగున్. 405

క. కాని చెయిదములు సేయక
నూనపుధర్మమున నడుచు నుర్వీశుఁడు సం
తానము బంధులుఁ బ్రజయును
దానును సేనలును శుభము దలకొనఁ బేర్చున్. 406

వ. అని యిట్లు సెప్పినవాక్యంబులం దెలివొంది ధర్మతత్పరుండై మాంధాత్యుండు మహావిభూతిం బొంది నెగడె; నీవును నట్ల నెగడు—మనిన ధర్మతనయుఁడు 'ధర్మంబున నెగడ దొరకొనుట యెట్టిభంగిం గలుగు' నని యడుగుటయు నతఁతో నక్కుటుపితామహుండు 'దొల్లి కౌసల్యాండగు వసుమనుండనురాజు వామదేవమహాముని నిట్ల యడిగిన నతం డతనికి నుపదేశించిన తెఱం గెఱిం గించెద వినుమని యిట్లనియె: 407

-:వసుమనుం డనురాజునకు వామదేవుండు సెప్పిన ధర్మప్రకారము:-

సం. 12-93-1

అ. అర్థసిద్ధికంటె నరయ నెక్కుడు ధర్మ
సిద్ధి; దాన సకలసిద్ధులును ప్ర
శస్తభంగిఁ జేరు; శాశ్వతకీర్తియు
సంభవించుఁ; గలుగు సద్గతియును. 408

క. ధనమునకై ధర్మముదెస
నసాదరము సేసె నేని నాపృపతికి న
ద్ధనమును జెడు, దుర్యశముం
బనుగొను, దుది దుర్గతియును బాటిలు సనఘా : 409

క. లాభంబు ధర్మముఖ్యము
గా భరపడి మార్గభ్రి గనుఁగొని కై కో
లా భూవరునకు నిహపర
శోభనములు సేఁత చెప్పు శ్రుతివాక్యంబుల్. 410

క. ధర్మప్రవృత్తి యయ్యును
ధర్మము నాకింతకంటెఁ దత్తద్విధులం
బేర్మిం బొరయవలయు ననుం
ధార్మికతాతృష్ణ నత్యుదాత్తుఁడు వొందున్. 411

వ. అని తనవచనంబులం దెలివొందిన వసుమనుం డనురాజుతో వామదేవుండు
'రాజ్ఞతంత్రంబున కెల్ల నాధారభూతంబు లగు సామదానభేదదండంబులం
బ్రయోగించు తెఱం గెఱింగించెద నాకర్ణింపు' మని యిట్లనియె: 412

క. మూలబలము సంతుష్టం
బై లాలిత మగుచు నున్న యప్పు డసదృఁ జో
టాలోకించి నడవ భూ
పాలకునకు దండ మతిశుభం బొనరించున్. 413

చ. సమరము సాహసం బధికసంపద యమ్మెయిఁ దెచ్చికోలు ప
థ్యమె? రిపు లేల కల్గుదు రహంకృతి పెంపును నుత్కటంపుఁ గో
పము మగిడింపఁ జాలు నరపాలున; కట్లగుటన్ హితంబు సా
మము దనయంతవాఁడయిన మానవనాథునెడన్ మహీశ్వరా : 414

క. తనభటులు గలఁగినప్పుడు
ధన మిచ్చి విరోధి నల్పతరు నై నను శాం
తునిఁ జేయవలయు; దానము
నన యధికునిఁ దేర్చు టురవు నరపతి కెపుడున్. 415

తే. ఆయుపాయముల్ మూఁటికి ననువుగాని
యట్టి పగతునియెడ భేద మాచరింప
వలయు రంధ్రముల్ దగ వేచువలను గలిగి
తత్పరతఁ జేయఁజాలు సాధకులఁ బనిచి. 416

వ. శుక్రమతంబునం బంచమోపాయంబైన యుపేక్ష వర్తిల్లు; దానిం బ్రయో
గించు భంగియుఁ జెప్పెద. 417

మ. కలహంబుల్ దమలోనఁ జేసిన నుపేక్షానైపుణం బొప్ప శ
త్రులఁ జూడందగు భూతదానవులపోరుం జూచిన; ట్లెమ్మెయి
న్మ్మలు ముంటం దగఁ బుచ్చుభంగి గలుగు న్భానాథ: కీడైన మం
త్రులయేపున్ విభుఁ డిట్ల మాపునది నేర్పుం బెంపుఁ బొల్పారఁగన్. 418

వ. అని యత్తెఱంగున వామదేవుఁడు సెప్పిన హితవచనంబులు పాటించి కోసల
పతి భాసమానుం డయ్యె; నీవును నట్ల వర్తిల్లి వెలయు' మనినఁ బాండవాగ్ర
జుండు 'సమరంబున శత్రుల జయించునప్పటిపాడి యెట్లుండు?' ననుటయు
భీష్ముం డతని కిట్లనియె : 419

-:ధర్మజునకు భీష్ముండు సమరంబున పాడి దెల్పుట:-

సం. 12-96-6

సీ. పగవాఁడు బలములఁ బన్ని త్రోచినఁ దాను
సబలుఁడై యొంటిమై సంగరంబు
గోరిన నమ్మెయి గొనకొని మాయ లొ
నర్చిన మాయఁ జేర్చి గెలుపు

గొనునది; వెన్నిచ్చినను బ్రమాదంబునం
బడినను గైదువు భగ్నమైన
శరణన్న బ్రొక్కినం దురగాళి యెడలిన
నారుతోడం బోరుచునున్న నెట్టి

ఆ. పగతు నైనం జంపం దగ; దధర్మంబునం
జంపుకంటె ధర్మసమక కేలిం
జావు మేలు; రాజు శయ్యం జచ్చుట గొఱ
గాదు; గాన యోడంగాదు పోర. 420

క. విను చిల్ల యిడిన యాయుధ
మును విషలిప్తము శస్త్రమును నెట్టి యమి
త్రునిపై నైన బ్రయోగిం
చిననరపతి నరకమున వసించు నృపాలా ! 421

క. తనకుం దోడ్పడి యని నొ
చ్చినవానిం గాంచి కడంగి చేష్టింపక యు
న్ననరేంద్రుం బొందు పాపం
బు కుం గొలంది గలదె భరతపుంగవ! తలంపన్. 422

వ. అని చెప్పి వెండియు. 423

చ. అరిపయిం బోయి వానిపుర మగ్గలికం జెఱుపంగం దద్ధరం
బరంగుప్రజం జలంబుమెయి బాధలం బెట్టు టధర్మ; మట్టిని
ష్ఠురత యొనర్చు టప్పటికిం జూడంగ మానంగ రాదయేని భూ
సురగృహ దేవగేహముల చూఱ నవశ్యము మాన్చు టొప్పగున్. 424

వ. అనిన విని యజాతశత్రుండు 'రాజధర్మంబుకంటె బాపకర్మంబు లేదు
పొ'మ్మని పలికి 'యిట్టేని రాజున కెట్లును నధోగతి వాటిల్లంగదే' యనుటయు
నాపగాతనయుం డిట్టనియె: 425

క. శరణాగతుఁ గాచియు నని
నరిపోటులఁ బడ్డఁ దెచ్చి యరసియు ధరణీ
సురులం బ్రోచియు నానా
ధ్వరములు సేసియును రాజు దలుఁగు దురితముల్. 426

క. అన విని యమ్మనుజేశ్వరుఁ
'డని ననివర్తులయి శౌర్య మభినుతి కెక్కం
దనువుఁ దొఱంగినవారికి
ననఘాఃయెబ్భంగిలోక మగు' నని యడిగెన్. 427

వ. అడుగుటయు నమ్మహీకాంతునితో శాంతనవుండు 'శక్రాంబరీషసంవాదంబు
చెప్పెద దాన నీయడిగినయది దేటపడు' నని యిట్లనియెఃసం. 12-99-1.

-: ఇంద్రాంబరీష సంవాద ప్రకారము :-

సీ. అంబరీషుండు నానాధ్వరంబులు సేసి
కడచని వాసవుకడకు నేఁగి
యచట నుజ్జ్వలవిమానారూఢుఁడును మనో
హారి సంక్రీడనోదారచరితుఁ
డును నై వెలింగెడు తనదుబంటు సుదేవుఁ
డనువానిఁ జూచి యయ్యనిమిషేంద్రు
తోడ 'మదీయభృత్యుడు వీఁడు క్రతుముఖ్య
కర్మముల్ సేయఁ డెక్కాఁరణమున

తే. ననఘ! నాకంటెఁ గడుఁ బేర్చి యునికి గలిగెఁ'
ననుడు నాజిష్ణుఁ డిమ్మహాత్ముని తెఱంగు
సెప్పెఁ జిట్టలు వినఁగ వాంఛించితేని
వినుము చెప్పెద నని యిట్టు లనియెఁ బ్రీతి. 429

వ. శతశృంగుం డనియెడు దానవునితనూజులు సదముండును విదముండును
దముండును ననియెడు వారలు. 430

శా. బాహాగర్వము సూపఁగోరి పటుదర్పం బొప్ప నుగ్రాహవో
త్సాహం బూర్జితభంగిగా భయద ఘోషస్ఫీతనానావిధ
వ్యూహంబుల్ ధరణీప్రకంపనములై యుద్దామసర్వాంగస
న్నాహత్వంబునఁ బెచ్చి తోడ నడవ న్సంరంభశుంభద్గతిన్. 431

ఉ. మంచి మగండ వైన నిను మార్కొ-నుహారయి దాడివెట్టి యె
క్కించుక శంక లేక ప్రజయెల్లను బిగ్గిల ముట్టి యర్థముల్
గొంచు ధరిత్రి గైకొనుటకుం గన లగ్గల మొంది యీతనిం
బంచితి సైన్యయుక్తముగఁ బార్థివ! యిట్లని పల్క తత్తఱిన్. 432

మ. పసగన్ వే చని దోర్బలంబున రణప్రావీణ్యముం జూపి నీ
వసురానీకముఁ ద్రుంచి భూప్రజలకున్ హర్షంబు గావించి రా
కసుమీ రాక; జయంబు లేక ప్రజ దుఃఖం బొందగా రాక నీ
యసువర్గంబుల పోకగా నెఱుఁగు; పెక్కొడంగ నిం కేటికిన్. 433

మహాప్రస్థర.
అనినన్ సంగ్రామకేళీవ్యసనరసికుఁడై యట్లకా కంచు నిన్ వీ
డొక్కని యీతం డేఁగి తా నప్డు దనుజతతి యాటోపమున్ గూఢచారుం
డనుదృష్టిం జూచి తా నిట్లను మనమున సైన్యంబుచే చేల శత్రుం
గొన నీ నేలా; పురారిం గొలుతు నతనికిం గోసి యిత్తున్ శిరంబున్. 434

మ. అని నిశ్చాయకుఁడై రణం బుడిగి సైన్యం బంతయుం గ్రమ్మఱం
జనఁగాఁ జేసి పరేతభూమికి దృఢోత్సాహంబునం బోయి శం
భునిఁ జిత్తంబున నిల్పి వాలుసు గళంబుం గూర్చినన్ సత్కృపా
ఘనుఁ డద్దేవుఁడు ముందటన్ నిలిచి ఖడ్గంబుం దొలంగించుచున్. 435

మ. చనునే సాహస మిట్లు చేయ? నిది కర్జంబే? కతం బేమి యి
ప్పని? కన్నం గని చక్క-ఁజాఁగి ధరయున్ ఫాలంబునుం బొంద వం
దనముం జేసి యితండు నీపలుకులున్ దై తేయులం దాఁక నొ
ల్లనివాఁడైన తెఱఁగుఁ జెప్పె శివునుల్లం బార్ద్రితం బొందఁగన్. 436

ఉ. ఆపరమేశ్వరుం డితని కవ్వుడు దివ్యరథో త్తమంబునుం
జాపము నస్త్రకోటియుఁ బ్రసన్నత నిచ్చి రణంబునందు నీ
యేపున కోర్వ దేవతల కేనియు దైత్యుల కేని రాదు పొ
మ్మే పగజేని గెల్వుము మహిం జరణం బిడకుండు మాజిలోన్. 437

మ. ఆని వీడ్కొల్పిన నీతఁ డుబ్బుమదిఁ బొంగారంగఁ దే రెక్కి వే
చని దైత్యధ్వజినీప్రతామహిమోహ్సాహంబులం జీరికిం
గొన కుగ్రోద్ధతిఁ దాఁకి పీనుఁగుల పెంగుప్పల్ గొనం జేసె న
య్యనిఁ బై ద్రోచిన నిద్దఱం దునిమె దై త్యాధీశులన్ ప్రేల్మిడిన్. 438

వ. ఇవ్విధంబున సదమండును దముండును బడినం గని కోపోద్దీపితుండై. 439

ప్రసగ్ధర.
వీరోదారోగ్రలీలన్ విదముఁడు సమరోర్విన్ బలోల్లాస మొప్పం
జేరెన్ బాహాసముల్లాసిత ఘనరుచిరాసిప్రభాభాసురుం డై
యారక్షోనాథుపై బేరలుక మఱపుఁ జేయంగ నీతండు డిగ్గెం
దే రుద్యత్ఖడ్గదీప్తుల్ దెసల నిగుడ దై తేయవీరుల్ చలింపన్. 440

వ. ఇట్లు విధాత్రవశంబునఁ బాదచారియై. 441

మ. దనుజుం దాఁకి కృపాణఖేలనము చిత్రం బై వెలుగొందఁ ద
త్తనుసంఛేదనకేలి సల్ప నతఁడుం దన్నుం బటుప్రస్ఫుర
ద్ఘనకౌక్షేయకధారఁ జీరఁ బడియెం దా నాతనిం గూల్చెఁ ద
క్కిన దైత్యావలి విచ్చె నల్గడఁ బరిక్షీణోగ్రమత్వంబునన్. 442

వ. ఇట్లు నిశ్శేషంబుగాఁ బరవీరులం బరిమార్చిన నీరాజ్యంబు పూజ్యంబై వెలసె; భూప్రజయుం బ్రమోదంబు నొందె; నిత్తెఱంగున నీసుదేవుండు సుకృతవంతుడై యింతటిపదంబున కర్హుండయ్యె; నే యజ్ఞంబులును సంగ్రామయజ్ఞంబునకు సదృశంబులు గావు; వినుము; వీరమస్తకరాశి వేదికగాఁ గృపాణబాణాదిసాధనంబులు సమిత్స్రుక్స్రువంబులుగా శోణితం బాజ్యంబుగా మాంసంబు పురోడాశంబుగా వీరవ్రతదీక్షితుండు సమారాధ్వంబు సలిపి రుధిరజల పూరయు మస్తిష్కకర్దమయుఁ గేశశైవాలయు నాంత్రఫేనయు భేరీమండూకయు హేతిమీనయు గజకళేబరపులినయు నగు సమరపుణ్యనది నవభృథస్నాన ము సేసి మహీయలోకంబున సుశ్లోకుండై నిత్యస్థితి నత్యుదాత్త పదవిం బ్రవర్తిల్లుఁ బుణ్యాతముం డగుటకుం దనువు దొఱంగ వలయుననిలేదు తెగువతోడి యనివర్తనగతియ చాలు;నిట్టిది రణాచరణ ప్రభావం; బేనును బ్రబలుడై తేయవ్రాత శాననసుకృతంబునం గాదె యీదేవేంద్రత్వంబు నొందితి నని పలికిన నంబరీషుండు సమరభూములసమధికపుణ్యత్వంబు దెలిసి సంభావించె నని చెప్పి దేవవ్రతుండు వెండియు. 443

— : సమరానివర్తనంబు వలని ఫలము : —

సం. 12_3-1

క. జనకుఁడు ప్రతర్దనునకుం
దనకును రణ మైన యపుడు తన యోధులకున్
వినుఁ నాకంబును నరకముఁ
గనుఁగొనుఁ డని చూపి చెప్పెఁ గౌరవముఖ్యా! 444

తే. పుణ్యతమము భోగాస్పదంబును మనోహ
రాంగనాజనబహులంబు నై నయది ర
ణంబు బిరుదు లై చేసిన నరులనెఱవు
దూరఁ బ్రదలచో టిది దుఃఖమయము. 445

ప. అని తనమాహాత్మ్యంబునం జూప నోపిన యుభయస్థలంబులుం జూపం జూచి
యేచి యవ్వీరులు దెంపు వొంపిరివోవం బతియ నుటికి వైరుల జయించిరి;
సమరంబు తెగువ దీప్తలక్ష్మీంగరం బొనరఁ; బుణ్యాతమలోకంబు లిచ్చుం;
గావున శూరుం డధికపుణ్యోదారుం డని యిట్లు దేవవ్రతుండు ధర్మశూరునకు
సమానివర్తన జనవిశేషం బెఱింగించె-ననిచెప్పిన విని యటమీఁద వారల
సంప్రశ్నోత్తరంబులు ప్రవర్తిల్లినవిధంబులు వినుపింపు మనుటయు 446

మ. పరమాయుఃపరమార్థసిద్ధి పరమప్రౌఢిమ్య సంపాదనా
దర సంభావిత భక్తలోకఃనిగమాంతస్థితహార్ద్యాగ్రసం
చరణప్రౌఢమయూరఃచిత్రమహిమాఃసర్వాత్మవిజ్ఞాన సం
పరిపాకప్రకటాకృతీఃశమదమోద్భావాహితస్వీకృతీఃగ 447

క. యమనియమాద్యష్టాంగ
క్రమాభ్యసననిర్మథిత వికారసుచేతఃకమలామోదమయాత్మా
సమతారాహిత్యశస్య సర్వసమస్యాఃగ 448

మాలినిఃసమధికనిరవద్య స్థైర్యనిత్యప్రభుత్వాఃవిమల మహిమ హేలావిర్భవ త్సర్వసత్వాఃనమదమలిన చిత్తాన్నత్య దీవ్యన్మహత్వాఃదమమహితతపస్సద్భావసంవేద్యతత్వాఃగ 449

గద్యము

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధన
విరాజి తిక్కనసోమయాజి ప్రణీతంబైన శ్రీ మహా
భారతంబున శాంతిపర్వంబునందు
ద్వితీయాశ్వాసము.

-: o :-

శ్రీ మదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము - తృతీయాశ్వాసము

-:o o:-

శ్రీధుర్యకరణ సమ్య
గ్బోధాత్మవిహరణ దివిజపూజ్యచరణ యా
రాధకభరణ నిరాధి
వ్యాధికరణ సౌమ్యకిరణ హరిహరనాథా ! 1

-: కాలనిరూపణాదు లగు రణోపాయంబుల ప్రాకారము:-

సం. 12-101-2

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె: నట్లు శూరులు పుణ్యతమ పురుషు లని విని కుంతీనందనాగ్రజుండు గంగానందనునితో, 'కాల నిరూపణాదు లగు రణోపాయంబు లెఱింగింపు' మనుటయు నతండు భరితాదరుండై. 2

సీ. వానయు సీతును వర్జించి మండువే
సవి గాకమున్న సస్యములపంట
లొదవెడుతఱి నెత్తునది శత్రుపయి; బూరి
గట్టియల్ నీళ్ళులు, గలుగు తెరువు
గా జూచి నడచుట కర్జంబు; సిడములు,
గంకటంబులును బల్క-లును విండ్లు
మొదలగునాయుధంబులు రథగజహయం
బులసవరణలు నపూర్వభంగి

తే. నొప్పి యరిభీకరంబులై యుండవలయు;
శంకకాహళపటహనిస్సాణముఖము
లైనతూర్యముల్ మంచివి యైన లెస్స;
యధిప! విడిదల సమతల మగుట మేలు. 3

క. చరులఁ బనిచి యరుల తెఱం
గరయుచు, వా రెదురు నడచునట్టి దయిన దె
ప్పరపుం దెరువున డప్పిం
బొరసినయెడ విడియుచోటఁ బొడుచు టురవగున్. 4

ఆ. నిదుర పోవుచోట, నీరు దవ్వై వడఁ
బడినయెడను, గూడు దడసి సొలసి
నపుడుఁ, జెదరి యున్న యవసరమునఁ బగ
వారిఁ బొడిచి చెఱుపవలయు నధిప! 5

సీ. చెట్టును పాయియు మిట్టయుఁ బల్లంబుఁ
గలిగినచోటు గాల్బలమునేల;
వినుము, నీళ్లును రొంపియును లేక సమవిశా
లము నైనచోటు గుఱ్ఱములనేల;
కమ్మ గ్రుంగక గదుగదుప రొంపులు గలు
గమి నొప్పుచోటు రథములనేల;
యెడనెడ గ్రాఁకులు మడువులుఁ గలచోటు
కురునాథ! యెఱుఁగుము కరులనేల;

ఆ. యేబలంబు దనకు నెక్కుడు గలిగె న
బ్బలమునేల పోరుగలను గాఁగ
నినుఁడు సీతు గాలి వెనుకగా మొన నడ
పించి పొడువ సంభవించు జయము. 6

చ. పలకలవార లగ్రమునఁ బన్నఁగ, విండులవారిమోటకం
బులఁ గరులన్ రథంబులను భూవర! వెన్వెకుకం గ్రమంబునన్

నిలిపినఁ గూడి నిల్చినయనీకమునం గడుమంచియోధులం
గలయఁగ నెందు నయ్యిప్రకారము వారల నిల్ప బల్పగున్. 7

ఆ. బంటు లుత్సహించి పగఱ పోయిరి పోయి
రంచుఁ గడఁగి బొబ్బలార్పు లెసఁగ
నతిరయమున నడరునట్లుగ దొర సము
ద్ధతి యొనర్పవలయుఁ దాఁకుదలల. 8

వ. అనుటయుఁ గొంతేయాగ్రజుండు శాంతనవునితో 'బం డ్లెట్టివారు గావలయు'
నని యడిగిన నతం డిట్లనియె : 9

తే. ఏనుఁ గేనుంగుఁ బేర్చిన డ్లెసకమెసఁగు
నంగముల సొంపుఁ, బులికిని సింగమునకు
బుట్టినట్టియుగ్రతయును, గట్టి మెఱయ
వలనుఁ గలయోధవీరులు వలయు ననికి. 10

వ. 'దేశవిశేషంబు లాకర్ణింపుము; గాంధారసింధుసౌవీరులు కఠారంబులసబళం
బులం బరిశ్రమంబు గలిగి బలశౌర్యసమగ్రులై సర్వసమరంబులకుఁ జాలి
యుండుదు; రౌశీనరు లెల్లకైదువులకు నేర్చి సత్త్వవంతులై యుండుదురు;
ప్రాచ్యు లేనికకయ్యంబునకు నేర్తురు, కపటయోధులై యుండుదురు; యవ
నులుఁ గాంభోజులును మధురచుట్లదేశంబులవారును గుఱ్ఱపుబవరంబులకు
నలవడి యుండుదురు; ఘూర్జరులు బ్రద్ధపరుల నడిదంబులం బరిణతులై
యుండుదురు; మాళవులు రథంబులు మొదలైన చతురంగబలంబుల సంగరం
బులం జతురులై యొక్కడొక్కండ పెక్కండ్రకైన నోర్చియుండుదురు;
గొందఱఁ గొందఱ నిర్దేశించితి; మఱియు ననేకదేశంబులవారు వివిధప్రకా
రంబుల నుండుదు;రయ్యెతెఱంగు లెఱింగి పెనంగించి జయంబు గొనునది'
యనిన ధర్మనందనుండు 'జయించుసైన్యంబులం దోఁచులక్షణంబులు విన
వలతు'ననవుఁడు భీష్ముఁ డతని కిట్లనియె : 11

-: ధర్మజునకు భీష్ముఁడు శకునాపశకునములు దెలుపుట :-

సం. 12-103-2

క. సైనికులమనము లుత్సా
హానూనము లగుచునుండు, హయహేషణముల్
వీనులకును సొ ియించు, గ
జానీకము లుబ్బు విజయ మగు సైన్యమునన్. 12

క. మృగములుఁ బక్షులు ననులో
మగతిం జరియించు, వెనుక మందానిలుఁ డిం
పుగ వచ్చి మెలఁగుఁ, గడుమే
లగుమాటలు వొడము గెలుచునట్టిబలమునన్. 13

క. వెలుదునెడఁ దెలివితో న
గ్నులు వలపల సుడియు శిఖలఁ గొమరగుఁ దూర్యం
బులు గఁభీరధ్వనులం
జెలఁగును జయము గొనునట్టిసేనఁ గుమారా ! 14

క. అని చెప్పి మఱియు నడఁ డి
ట్లను ముట్టినపగఅసొంపు నడఁచుట యొప్పున్
విను, కయ్యమునకుఁ గాల్దీ
వినఁ బాటిలు దురిత మెట్టివిభునకు నైనన్. 15

క. చెఱువునడు మవిసినను బెను
వెఱమెకములు సెదరినను వివేకనిధీ ! యు
క్కటి బహుళసైన్య మటిముటిఁ
బఱచిన నాఁగంగరాదు బలియుర కైనన్. 16

క. విను, కొందఱైనఁ గడుఁదెం
పున మార్కొని కడిమి మీఱి పొంగి యడరినన్

మొన యెంతయైన విఱుగుం
జనునే కయ్యంబు వొడువ శక్తులకైనన్. 17

క. క్షమ మేలగు; నై న నతి
క్షమ దైన్యముఁ దెచ్చు; నెదురు గర్వించినఁ గ
య్యము వొడిచి గెలిచి యరిశే
షమునెడ నదయక్షమావిశదుఁ డగు టొప్పున్. 18

-: రాజు పగఱయెడ నుండవలయువిధము :-

సం. 12-104-2

వ. అనిన నప్పాండవో త్తముండు 'పుడమిజేఁడు పగఱయెడ నెట్టివాఁడు గావ
లయు' ననపుడు నాభూపతితో భీష్ముండు 'బృహస్పతి దివస్పతి కెఱింగించిన
తెఱం గుపదేశించెద'నని యిట్లనియె : 19

చ. విను, మరిఁ జంపనుం జెఱుప వేచుట లెస్స; ప్రతాపభాషణం
బున వెడ నుల్లికుట్టులను బొంకుల వానిఁ గలంగఁజేసి రేఁ
చినఁ దనపూఁపు దప్పు నఱ సేయనిచందము నమ్మియున్న చా
డ్పును మెఱయంగఁ బల్కుచుఁ గడున్ మది నమ్మక యుండఁగాఁ దగున్. 20

చ. అరిపయి వీఁక నె త్తి చనునప్పుడుఁ దేనియ లుట్టునట్లుగా
నరపతి వానివారలు వినం బ్రియమాడుట మేలు; పక్షిఁ దాఁ
దిరముగఁ జేయగా మృగముతేఁకువ వాపను వేఁటకాఁడు త
త్స్వరములు సూపి కాదె తుదిఁ జంపఁ దెగుం దనబారిఁ బాఱినన్. 21

ఉ. వేమఱు శత్రునిం బరిభవించుట రి త్తకు రి త్తవె రముం
దా మది బెట్టికోలు సుఖతంత్రము గాదు; సుసంధికాలమున్
సీమ దగంగ రూపడఁగఁ జేయుటయున్ వల దగ్గమైనవాఁ
డేమెయి నై న వధ్యుఁ డను నిట్టి వినిశ్చయ మాత్మఁ గల్గినన్. 22

క. కాలవిపర్యయమున నర
పాలుఁడు దా మ్రొక్కి యైనఁ బగతుఁ గలసి త

చ్ఛిల మెఱిఁగి తఱియైనం
గాలుపురి కనఁచునది సుకరముగా వానిన్. 23

క. అనదతనంబును బెడిదపుఁ
దనమును లేకుండఁ బరగి దరి యొత్తెడు నే
ఱునుబోలె నొ త్తవలయును
మనుజేంద్రుఁడు మార్తురం గ్రమంబున నధిపా! 24

క. పెక్కండ్రతోడ నీరస
మొక్కతఱిన కొనక, తఱిఁగియున్న పగతుతో
నుక్కుడి బంధుభావముఁ
దక్కటిపగఱ యెడ వలయుఁ దా నెఱపంగన్. 25

—:కాలకవృక్షీయమహాముని క్షేమదర్శికిఁ జెప్పిన హితవాక్యములు:—
సం. 12-105-2

వ. అనిన శంతనుపుత్రుతో నజాతశత్రుండు 'నిజపరివారదోషంబున నై నను బరులచేత నేనియు సంపద నెడుట నాపదం బొరసినధరణీశుండు నెవ్వగ నెవ్వి థంబునం బాపికొను నెఱింగింపు' మనుటయుఁ 'దొల్లి కోసలపతి యైన క్షేమదర్శి విదేహపతిచేత భూమి గోల్పోయి వగం బొంది మున్ను దనకు మంత్రియై యుండి తాను రాజ్యంబు సేయుచుండం బరమశాంతి నొంది వనంబునకుం జనిన కాలవృక్షీయు నాశ్రయించి యిట్లు యడిగిన నమ్మనుజపతికి నమ్మునిపతి నెప్పిన వాక్యంబులు నెప్పెద విను' మని యక్కురుపితామహుం డిటనియె : 26

తే. అర్థవంతుఁడై భోగంబు లనుభవించు
చున్న యప్పుడు యిది యిట్టు లుండ నేర
దస్థిరము తాను లోను గానని యెఱుంగు
నతఁడు వగఁ బొందఁ డేది యెల్లైన నధిప! 27

క. కానియటు లుండి నెఱిఁబడు
నైన తెఱఁగు దోఁచి మాయ మగు నిబ్భంగిన్
మానసమున కుబ్బు వగయుఁ
దేనోపుం బనులు; బుధుఁడు దేఁ ఁడు రెంటన్. 28

క. జననీజనకులును సుహృ
జ్జనులును దెగు నపుడు గావఁ జనమి దెలియదే ?
ధనములు వారలకంటెనె ?
మనుజేశ్వర! వగపువాని మగిడించునొకో! 29

క. గతమునకును వగవ, కనా
గతమునకును నోరు దెఱచి కడుఁ గోరక,దీ
నతఁ బొందక, దైవం బే
గతిఁ బుచ్చిన దానఁ బోదుఁ గా కసవలయున్. 30

క. వెరవును లావును గలిగిన
పురుషులు లే రెట్లు లోకమున నెవ్వరికిన్
సిరి శాశ్వతంబె యని వగఁ
బొరయఁడు ధీరుండు గలిమిపోకకు నధిపా! 31

క. సారపు సిరిచేటు నరుఁడు
గోరకయే వచ్చునట్లు కోరక యుండన్
శ్రీరాక గలుగు దైవము
కారుణ్యము గలిగెనేని గాధవివేకా! 32

క. సిరి విడుచును బురుషుని విను,
పురుషుఁడు సిరిఁ దొరగు; నిది యపూర్వమె? ఫలమూ
లరతుండై వాఙ్మోయతిం
బొరసి యునికి యట్టిచోటఁ బురుషున కమరున్. 33

క. కలఁగిన పెద్దమడువు వినుఁ,
తెలివిఁ బొరయునట్లు దానధీరుం డట్లి
గ్గలము లయినదురితంబులఁ
గలఁగియుఁ దనయంతఁ దేఱు గౌరవ మొప్పన్. 34

వ. అని చెప్పి 'యిది యుపశమనప్రకారంబు; నీతి యెటిఁగించెద నాకర్ణింపు' మనుటయు నమ్మనివరుతో నమ్మనుజపరుండు 'మహాత్మా! నిన్నుఁ జేరి యేను దురితంబులం దొలంగ వలదె యాన' తిమ్మనిన నతం డతని కిట్లనియె: 35

సీ. తద్దయు శాంతుఁడై తక్కువ కోర్చిశ
త్రునిఁ గని యొడఁ గూడి మనగవలయు;
మన్నెరాజులభూమి మర్దించి సైన్య మ
ల్లన కూర్చి వైరిపైఁ జనఁగవలయుఁ;
బలునిఁ జేరి యారాధించి యాతని
సేనతోడుగ నరిఁ జెఱుపవలయుఁ;
విషమున మాంత్రికవిధిఁ బంపుపోటున
నలయక రిపుఁ దెగటార్పవలయుఁ;

తే. బొంచి భేదం బొనర్చి కలంచియేని
నంగనలఁ గొని వారిమాయలఁ దగిల్చి
యైన మఱియును బహువిధోపాయములను
దెగువ డింపక పగతు సాధింపవలయు. 36

వ. అని చెప్పె ననిచెప్పి, గాంగేయుండు వెండియు జెప్పు-నాకౌసల్యుం డధర్మోపాయవిధాయకంబు లగునుపాయంబులకుం జొరంజాల ననిన; నమ్మని తద్విరోధియగు విదేహవిభు రావించి యేకాంతంబున నాక్షేమదర్శిం బేర్కొని నీవతనిరాజ్యంబు గొనియున్నవాఁడ, వన్నరవతి యొండుమైఁ గార్యంబు సూచుట యొప్పదు, సంధిసేయు మని వెరవుకలిమి నొడంబఱిచి యిరువురకును సంధి యొనర్చి నెయ్యంబు చాటించి వీడుకొల్పినఁ గౌసల్యుం దోడ్కొని

చని యతనికిఁ దనకూఁతు నిచ్చి కరితురగాది వివిధపద్ధారఁబు లొసంగి విదేహ
జనవల్లభుం డవ్వసుమతీవల్లభుని నిజపురంబున కనిచిపుచ్చె; రాజులకు
జయాపజయంబు లనుభావ్యంబులు: మదవిషాదంబు లనాదరణీయంబు ల
నవుడు; ధర్మనందనుండు 'పరిజనంబులయందు గణంబులై యున్నవారిం
బరిపాలించు సమ్యక్ప్రకారంబు సెప్పు' మనుటయు నమ్మహీకాంతునకుశాంత
నవుఁ డిట్లనియె : 37

—: ధర్మజునకు భీష్ముండు గణజనులం
బాలించు ప్రకారంబు సెప్పుట: —
సం. 12-108-10

క. వినుఁ, మర్త్యకులును, గా
ర్యనిపుణమానసులు, నాయుధజీవులుఁ ద
క్కినుగలపనులజనులుఁ గల
రనఘా! యొక్కిండ్లవార లైనజనంబుల్. 38

క. వారు గదా గణములు; పతి
వారలలోఁగలసి మెలగువడువున నయ్యె
వారితెఱఁ గెఱుఁగవలయును
వారికి నెమ్మి గలిగించు వలనొదవుటకున్. 39

సీ. కుల మొక్కఁడైన దేఁకువలేక బుద్ధియు
శౌర్యంబుఁ బెంపును సరకుగొనక
యెట్టివారలతోడ నెవ్వరై నను మత్స
రంబు గల్గుదురు గణంబు జనులు,

దాన నంతర్భేదమైన శత్రులు వాపి
కొండ్రు గొందఱు; నది గ్రొచ్చు రాజ్య
మూలంబుఁ; గావున మున్ను భూపాలుండు
వారి నందఱఁ దగువచనరచన

తే. నీగి మన్ననఁ గలగంగ నీక పొదివి
యధికముగ గణముఖ్యుల నాదరించి
పనులు గొనునది తమలోనఁ బాయకుండఁ
బ్రోవు లెడలిన రాజ్యంబు పొలుపు దప్పు. 40

క. ఎక్కార్యములను గణజను
లొక్కటియై మెలఁగుచున్న నుర్వీశునకున్
మిక్కిలిసిరి యగుఁ గావునఁ
దక్కక యరయంగవలయుఁ దగ గణవిధముల్ 41

—: ధర్మరాజునకు భీష్ముండు ధర్మసూక్ష్మత తెలుం గెఱింగించుట :—
సం. 12-109-3

వ. అనుటయు ధర్మజుండు 'ధర్మంబులు బహుశాఖలు గలిగి యుండు; నన్నియు ననుష్ఠింపవచ్చునే? యెయ్యది యాచరించి పురుషుం డైహికాముష్మికసుఖం బులం బొందు?' నినన మందాకినీనందనుం డతని కిట్లనియె: 42

సీ. విను, తల్లియును దండ్రియును గురుండును సేవ
నీయులు; సద్భక్తి నిత్యనిరతి
వారలఁ గొలుచుచు వా రెడ్డి సెప్పిన
నది యాచరించుట యధికధర్మ;
మాగమత్రయమును నగ్నిత్రయంబు లో
కత్రయంబును దేవతాత్రయంబు
ననువస్తువులు వార లందును జనని గౌ
రవమున నెక్కు డు రాజపర్య:

తే. యాజగంబున దివమునం బూజ వడయు
మాతృభక్తుండు పితృభక్తిమానసుండు
నట్ల యవ్యయానందసంప్రాపణంబు
గురుపబాజ్ఞసమారాధకుండు గాంచు. 43

వ. అనవుడు నజాతశత్రుండు గంగాపుత్రునితో 'సత్యానృతంబులు జగంబులం
బరగియుండు; బురుషుండు వానియెడ నెబ్బంగివాడై ధర్మపరుం డగు'
నని యడిగిన నమ్మహీపతి కమ్మహాత్ముం డిట్లనియె: 44

సీ. సత్యంబు పలుకుట సర్వధర్మములకు
మిక్కిలి; యసత్యంబు మేటిపాత
కము; తద్విశేషంబు గలదు చెప్పెద-నొరు
నరం బుపాణంబు నపహరింప
జూచుపాతకులతో సూనృతం బాడుట
పాపంబు; బొంకులు పలికి యట్లు
వారి హింసించుట వరధర్మ; మిది యొక్కఁ
డేల? భూతములకు హితము సేయు

తే. బొంకు లెల్లను ధర్మముల్; భూతబాధ
కంబు లగు నిక్కములు పాతకములు; వినుము,
భూతముల దుష్టశిష్టత్వములు వివేక
సూక్ష్మతావేద్యములు వానిఁ జూడవలయు. 45

—: పాప నిస్తరణ ప్రకారము :—
సం. 12-111-2

వ. అనినం గొంతేయాగ్రజుం 'డెట్టివారు దురితంబులు నిస్తరింప నేర్తు' రని
యడిగిన సురనదీసూనుం డిట్లనియె: 46

సీ. వర్ణాశ్రమాచారవంతులు, నవిషయా
సక్తులుఁ, బ్రతికారశక్తులయ్యుఁ
దిట్టాట వడి సైఁచు ధీరు, లుదారులు,
నతిథిపూజకులు, నధ్యయనరతులు,
నగ్నిహోత్రపరులు, నాజిఁ బిఱిందికి
నడుగు వెట్టక తెగి నడచువారు,
సత్యవాదులు, సాధుజనపోషకులు. సర్వ
దేవతాసములు నై భావ మెందు

తే. నిలిచె నమ్మూర్తి భక్తిమైఁ గొలుచువారు,
దురితదుర్గముల్ నిస్తరింతురు; పురాణ
పురుషుఁ డవిచింత్యుఁ డచలుండు పుండరీక
లోచనుండు సద్భక్తులఁ గాచు నధిపఁ 47

క. విను మగ్గోవిందుఁడు సఖుఁ
డును బంధుఁడుఁ గార్యకర్మకుండు నై నిన్నుం
గొనియాడుచుఁడ దురితం
బను పేరును గలదె నీకు ననఘచరిత్రా! 48

ఆ. ఇంద్రుఁ డజుఁడు విష్ణుఁ డెవ్వాని వైదిక
స్తోత్రములఁ బ్రసాదితునిఁగఁ జేసి
యెలమిఁ గొలుతు రమ్మహేశ్వరుఁ గొలుచు వా
రెందు నెపుడుఁ గీడు నొంద రధిప! 49

క. వినుఁ, మివ్వాక్యము లెవ్వఁడు
గొనియాడుఁ బఠించు విప్రకోటికిఁ జెప్పున్
జననాథ! వాఁడు దురితం
బనుదుర్గము నిస్తరించు నక్లేశమునన్. 50

వ. అనిన విని ధర్మనందనుండు. 51

—: వ్యాఘ్రిగోమాయు సంవాదము :—

సం- 12-112-2

క. సౌమ్యు లసౌమ్యులభంగి న
సౌమ్యులు సౌమ్యులవిధమున జనవర చిత్తా
గమ్యతఁ దోఁతురు వారిని
సమ్యజ్ఞిశ్చయతఁ గాంచుచందము సెపుమా! 52

వ. అనుటయు నాపగాతనయుం డేతత్ప్రియోజనం బైన వ్యాఘ్రగోమాయు సం
వాదం బను నితిహాసంబు గల దాకర్ణింపు మని యిట్లనియె: 53

ఆ. పురిక యనఁగఁ నెగడుపురి బౌరికుం డను
నృపతి క్రూరకర్మనిష్ఠఁ బరగు;
నవ్విభుండు సచ్చి యధిప! గోమాయువై
పుట్టెఁ బుట్టెఱుంగుబుద్ధితోడ. 54

వ. ఇబ్భంగిం బుట్టినయానక్క మహితవ్రతశీలం బయి మాంసంబు దినక హింస
సేయక వనంబునం బతితఫలంబులుఁ బత్రంబులు నాహారంబులుగా వర్తించు
చుండఁ, దోడినక్క 'లిది యేటి వ్రతంబు, మాంసం బేము దెచ్చి యిచ్చెద,
ముపయోగించి సుఖివై యుండు' మని ప్రార్థించిన నమ్మెయికిం జొరక దృఢ
నిశ్చయంబై యుండె; నంత నొక్కనాఁడు మృగంబుల కెల్ల ముఖ్యం బైన
శార్దూలం బత్తెఱం గెఱింగి వచ్చి యగ్గోమాయువుతో నిట్లనియె: 55

క. నిను సౌమ్యుఁడ వని యెఱిఁగితి
ననఘా! ననుఁ జెంది నిలిచి యతులసుఖము లం
దిన మేలు; నన్నుఁ గ్రూరుం
డను లోకం; బిదియు నుడుప నగు నీశిక్షన్. 56

వ. నాతోడిబాంధవంబు సేయు మనిన నగ్గోమాయు విట్లనియె: 57

క. 'నీ వాశ్రయణీయుండవు
గావే; విను, భోగపరము గా కున్నది మ
ద్భావం; బటు గావున నా
కీవచనము లింపు సేయ విద్ధగుణాఢ్యా! 58

వ. అది యట్లుండె; భోగంబులు గాకున్న నేమి? నీకుం గార్యాకార్యంబులు నాయెఱింగినతెఱంగున నుపదేశించుచు మైత్రి వాటించి యునికి గర్హణీయంబై భవదీయమూలభృత్య లసూయ సేసి ఖేదింతురు; దాన నొప్పమి వచ్చు; నీవు వారలు గలంచినఁ గలంగ కుండుటకును నాబుద్ధి పాటించుటకును సమయంబు సేసి నన్ను మన్నించికొని యుండు; మట్లైన నీకడ వర్తించి యుండెద' ననుటయు నావ్యాఘ్రం బాభంగి నడపం గలయది యై యియ్యకొని. 59

ఆ. సంతసంబుతోడ సమయంబు సేసిన,
నెలమిఁ బొంది నక్క- పులికి బుద్ధి
సెప్పికొనుచుఁ దగ వసించెఁ దదీయ ని
కేతనమునఁ; బులియుఁ బ్రీతి సలిపె. 60

వ. కొండొకకాలంబునకు నమ్మృగరాజు మన్నించువిధంబును నగ్గోమాయువు దదీయహితాహితంబు లరసి బుద్ధిసాచివ్యంబు సేయు తెఱంగును జూచిచూచి చూపోపక యప్పులిమూలభృత్యులు దమలోనఁ గూడికొని యొక్క-నాఁడు. 61

క. పులి నమలెడు మాంసము వెర
వలవడఁ దా మపహరించి యానక్క-కు ని
మ్ముల నిల్వం గావించిన
నిలయంబున గొందిఁ బెట్టి నేర్పారంగన్. 62

వ. ఉన్నంత భక్ష్యపదార్థ పరిరక్షణంబును దాన చేయునది గావున నగ్గోమాయు వప్పనికిం జొచ్చి మాంసంబు గానక యెవ్వరేని ముచ్చిలికొనుటగా నెఱింగినదియై శార్దూలంబున కెఱింగించిన, నాముచ్చిమి యప్పులి యరయం దొడంగిన నెప్పటి భృత్యులు గుపటోపాయంబు వన్ని. 63

క. నెమకుపరివార మమ్మాం
సము గనుతెఱఁగును ఘటింప శార్దూలము చి
త్తము నక్కఁవలన పిరస
త్వము నొందిన నెఱిఁగి భృత్యతతి యిట్లనియెన్. 64

ఆ. నక్క కేటివ్రతము? ర్రుక్కక యిమ్మాంస
మపహరించినపుడ యబ్బెనేని
నేమి యైనఁ జేయు; నిది పాపశీలంబు;
గపటధర్మకంచుకంబు సువ్వె. 65

క. తానటె మాంసముఁ దిన దటె!
యీనక్క యు బేలువెట్టె నిన్నాళ్ళును నీ
యాన! మఱుమాట వలుకం
గా నోడితి మిదియ నడపఁ గార్యములయెడన్. 66

క. అనుటయు మృగపతి మనమునఁ
గన లడరిన నక్కఁ బట్టఁగా బంచి వధిం
పఁ బుచ్చె; దాన నంతయు
విని యప్పులితల్లి గరము వెసఁ జనుదెంచెన్. 67

వ. చనుదెంచి యావ్యాఘ్రవరునితో నిట్లనియె. 68

క. ఇట్టివి కృత్రిమములు గల;
వట్టిదె యీనక్క? బేల వైతివి; భృత్యుల్
వుట్టినకోలెను గుటిలత
లెట్టెట్టివి సేయ రకట! యెఱుక గలఁగెనే? 69

తే. బుద్ధిమంతునివలన దుర్బుద్ధు లధికు
వలన హీనులు భూపసివలనఁ గొనటి

వా రసూయలు సేయుదు రీరసమున;
నింత యెఱుఁగంగవలవదే యీవు గొడుక: 70

క. ధర్మ మధర్మముభంగి న
ధర్మము ధర్మంబుమాడ్కిఁ దనయా: తోఁచున్;
నిర్మలమతి నరయ వలయు
ధార్మికతం గోరువాఁడు దన కేర్పడఁగన్. 71

క. విను, మీగోమాయువు వ
చ్చినయంతటనుండి మనకుఁ జేసినహితముల్
గనికొన వలవదెఁ యీతర
మున వాఁ డిటు సేయఁ దను సమూహయు వలదే? 72

క. హితుఁ డగుమంత్రిం గుటిలుల
యతికపటోపాయములకు నగపడి చెఱుపన్
మతిఁ దలఁతురెఁ పతి సుపరీ
క్షితంబు గావింప కొకటి సేయం దగునే? 73

చ. అనవుడు నక్క రాఁ బనిచి. యప్పులి గౌఁగిటఁ జేర్చి బాష్పము
ల్గనుఁగవఁ గ్రమ్మనుం బలుకులం దగఁ బెద్దయు గారవించి న,
న్వినుము, మృగేంద్ర! మున్నటుల నీవు సభన్ ననుఁ వీఁడు మంచివాఁ
డని కొనియాడి యిప్డు దెగటార్చితి పెంపును నాదుమాననమున్. 74

వ. అని పలికి యగ్గోమాయువు వెండియు 75

క. నను నీవు పదస్థునిగా
ననఘా! చేయంగఁ దలచినప్పుడ నీభృ
త్యనికాయము కటపులఁ బడ
కునికియు నాబుద్ధి వినుటయును మఱవమికిన్. 76

వ. బాస సేయవే యట్లుంగాక. 77

ఆ. ఎటిఁగి యైన నెఱిఁగ కేనియు నొక్క-ని
భంగపెట్టి పిదప సంగతుఁడుగఁ
జేసికొనుట మేలె సిరి గలవారికి
నట్టినిలుపు వాని కగునె హితము. 78

క. అని పాసి శరణ్యమునకుఁ
జని యనశనదీక్ష నొంది సద్భావఖ్యా
తి నెఱయఁ బరమస్థానం
బున కగ్గోమాయు వరిగెఁ బురుషవరేణ్యా : 79

వ. ఈకథ పూర్వాపరవాక్యంబులయందలి తాత్పర్యంబు నిరూపించి. 80

క. వావిరి మాటలఁ దేలక
భావంబునఁ గీడు మేలుఁ బరికించి యస
ద్భావుని సద్భావుని నవ
నివరఁ యేర్పఱుప నెఱిఁగ నేరఁగ వలయున్. 81

భీష్ముండు ధర్మజునకు సహాయ సంపన్నత్వం బావశ్యక ంబగుట చెప్పుట

సం. 12-113-1,2

వ. అనిన విని సంతోషించి కౌంతేయాగ్రజుం 'డేమిభంగివర్తనంబున భూపా
లుండు సుఖియై యుండు' ననుటయు నన్నరపతికిం గురుపితామహుం
డిట్లనియె: 82

సీ. ఆలస్యమును నసహాయత్వమును నొప్ప;
వవి లేనిపతి సుఖి యై చరించు;
విను, తొల్లి యొకయుత్త మనితరసాధ్యత
పంబు సేయఁగ, మెచ్చి బ్రహ్మ వచ్చి,

'యర్థించినది యేమి' యనిన నాలొట్టియ
'యొప్ప నామెడ శతయోజనప్ర
మాణం బగుట కోర్కి వాణీశ!' నావుడు
'నట్లగుం గా'కని యత డు సనియె ;

తే. నదియు వరగర్వమున సహాయంబు నొల్ల
కలసభావంబుతో నుండి పలచి యొక్క
నాడు దనయట్టు సాచి కాననములోన
దీనుకొని మేయగా బెరువాన వచ్చె. 83

క. వచ్చిన దన మెడ సాగిన
యచ్చటి గుహలోన నుత్తమాంగం బిడి తా
నిచ్చమెయి నిదురపోవగ
విచ్చలవిడి నొక్క నక్కవెఱ్ఱియు దానున్. 84

వ. ఆగుహ సొచ్చెం జొచ్చి యాకటిపెల్లున నాలుం దానును నొక్కట నాలొట్టి
నుగుకుత్తుక కబళించి నెత్తురుం గండలు నొండొండ మ్రింగం దొడంగిన
నది మేలుకని యాలొట్టియ మెడ పొరల్చునంతకు నానక్కలు నరంబులు
ద్రెవ్వంగఱిచిన నెటి దప్పి యయ్యుష్ట్రంబు నిర్గతప్రాణం బయ్యె; 'నట్టి
చందంబు గాక నీవనాలస్యుండవును సహాయసంపన్నుండవును నై నెగడు'
మనిన నజ్జగతీశుం డతనితో 'శత్రుం డధికుం డై న నల్పబలుం డగురా జే
యోజ నాపద నిస్తరించు' ననపుడు నతండు 'సముద్రసరిత్సంవాదం
బాకర్ణింపుము; దాన నీయడిగిన యర్థంబు దేట పడియెడు' నని పలికి యిట్ట
నియె : 85

-: సముద్ర సరిత్సంవాదము :-

సం 12-114-2

తే. ఉదధి సుఖగోష్ఠి నున్నప్డు నదులతోడ
'మీతటంబుల తరువులు మీరు వొంగి

తఱిమిపాఱిన గూలు; వేతసము లేల
పెఱికిపో? వవి మీకేమిప్రియ మొనర్చె? 86

వ. వాని నున్మూలింప మీకు శక్యంబు గామింజేసియో వానికిం జేటు వాటిల్ల;
దిది యేమి?' యనవుడు నదులందు గంగ యిట్లనియె: 87

క. బిగు వెడలక నిలిచి పడున్
నగములు, వేతసచయంబు నభ్రంబై పె
ల్లగుమావేగము గడపి యె
సఁగుఁ బూర్వస్థితిన బ్రదుకు సమకూరంగన్. 88

వ. అనియె నాప్రబ్బలిచెట్ల తెఱంగు కనికొని. 89

ఆ. అరినృపాలుపెంపు నాత్మీయశక్తియు
నెఱిఁగి మూర్ఖవృత్తి నెదురుపడక
యుచితవృత్తి నతని యుద్ధతి మేవడి
గడపి హీనబలుఁడు సెడక నిలుచు. 90

వ. అనిన విని యుధిష్ఠిరుండు 'దగుపదంబులకుఁ గులవంతు లగుపరిజనులు
దొరకొనకున్న నరనాథు డేమి సేయంగలవాఁ' డని యడిగిన నప్పుడమి
పేనికి భీష్మం డిట్లనియె: 91

-: కుర్కుర నీచత్వముం దెలుపునట్టి యితిహాసము :-

సం 12-117-2

సీ. వినుఁ, మొక్కయితిహాస; మనుపమం బగుతపం
బునఁ బేర్చువాఁ డొక్కమునివరేణ్యు
నాశ్రమంబునఁ దద్దయావిశేషంబున
నఖిలజంతువులును నచట నచట
వసియించి సుఖ ముండు; వానిలో నొక్కకు
ర్కుర మెప్డుఁ భక్తిమైఁ గొలిచి తిరుగు;

నమ్ముని మెలఁగిన యచట నెల్లను దాను
వర్తింప నొకదువ్వు వైర మెత్తి

తే. కఱవ వచ్చిన నమ్మునికడకుఁ బాఱు
తెంచె; నాకుక్క నాతఁడు దీప్తరూప
మైన దువ్వుగాఁ జేసిన నది గడంగి
కవియ భయమంది పాఱె మున్కవియు దువ్వు. 92

సీ. అట్లు బెబ్బులి వచ్చి యడరిన బెబ్బులిఁ
గాఁ జేసి గెలిపించెఁ గరుణ మెఱయ ;
నొకమత్తకరిఁ జూచి యోటమై నొడిఁగిన
నుద్ధత కరిఁ జేసి యొసఁగె జయము;
సింహంబుదెసఁ భీతి జెడి పాఱుతెంచిన
ఘనసింహమఁగఁ జేసి గర్వ మిచ్చె;
శరభంబుధాటికిఁ జకిత మైన నుదగ్ర
శరభఁబుఁ జేసి యత్సాహఁ జేసె ;

తే. నిట్లు దివసక్రమంబున నెక్కుడైన
సత్త్వముగఁ జేయఁగాఁ గుక్క శరభభావ
మండితం బయి తిరుగుచు నుండి పూర్వ
వాసనానీచ మగు మనోవర్తనమున. 93

వ. ఇట్లని విచారించె. 94

చ. ననుఁగని యొండు సత్త్వము మనంబున బెగ్గిలి పాఱునప్పు డి
మ్మునివరుఁ డిట్లపోలెఁ గృప మొక్కలమై శరభఁబు గాఁగఁ జే
యునొ తగ దాని నట్లయిన నుద్ధతి నాకుఁ జరింప లేదు గా
వున నితనిన్ వధింతు వెరవున్ బలమున్ సరి నుల్లసిల్లఁగన్. 95

తే. అనువిచారంబు దివ్యబోధాఢ్యుఁ డైన
యమ్మునీశ్వరుఁ డెఱిఁగి 'యీయధమజాతి
యున్నతస్థితి యెఱుఁగునే? మున్నపోలెఁ
గుక్క- యయి యుండుఁ గా' కన్నఁగుక్క- యయ్యె. 96

వ. కావునం గులహీనులు మాననీయులు గా;రట్లుంగాక విశేషం బాకర్ణింపుము. 97

చ. కుల మని పట్టి చిత్తమునఁ గూరినకీ డరయంగ లేక య
గ్గలపువిభూతి దుష్టునకుఁ గల్గఁగ జేయుట గర్జ మెట్లు భృ
త్యులమది యున్నరూ పరసి యుత్తమ మధ్యమహీనరూపమా
త్రులకుఁ దగంగ నయ్యయి పదంబుల నిల్పుట నీతి భర్తకున్. 98

క. శౌర్యము, సత్యంబును, స
త్కార్యజ్ఞానమును, భక్తి తాత్పర్యము, గాం
భీర్యముఁ గలిగినఁ గురుకుల
వర్యుఁ కులం బేల సిరికి వాఁ డుక్కుఁ డగున్. 99

క. ఇది సిద్ధాంతం బన రా;
దుదితయశా! యెట్టులైన నున్నతవంశ్యున్
విదితగుణుం డగుపురుషు
న్వేదకి నిలుపవలయు మాననీయ పదమునన్. 100

వ. అది యెట్లంటేసి. 101

ఉ. ఒక్కటి యేను జెప్పెద; మహోగ్రపుఁ గేసరికైనఁ దోడుగా
నుక్కును లావునుం గలుగు నుజ్జ్వలసత్త్వచయంబుఁ గొన్నఁ గా
కెక్కుడుకృత్యముల్ నడప నెట్టగు? నిట్టివి చాలు నంచుఁ దాఁ
గుక్కలఁ గూర్చి చేయఁ దనకుం దలఁపుల్ దలకూడ నేర్చునే? 102

చ. వలనుఁ గులంబు లేని పరివారము గోటియు నేల నేర్పు న
గ్గలికయు భక్తిపెంపు మదిఁ గల్గి సుహృజ్జనమిశ్ర మౌ బలం

బిలువఁగి గల్గెనేని నిలయెల్లను నేలఁగఁ జాలు వేయురా
జుల; విను, రాజు నేర్చరియు శూరుఁడుఁ గావలయుంజుమీ నృపా! 103

వ. అని చెప్పి వెండియు. 104

సీ. వినుము, మయూరంబు విధమున బహుచిత్ర
భంగులఁ బ్రజయంతరంగ మాత్మ
వశము సేయుచు, మృదువాక్యముల్ వలుకుచు,
మంత్రంబునెడఁ దనమాట వెడల
కునికి శరత్సమయోచితక్రియచాడ్పు
గాఁగ ధర్మంబు శిఖాప్రకార
మొంది తనర్ప సమ్మోసపక్ష మై
యానంబు గై కొంచు నధికతరస

తే. మున్నతత్వంబు సంశ్రయయోగ్య మగుటఁ
గాంచుచును దటి వచ్చినఁ గారుకాల
మేచుతెఱఁగున నేచుచు నీచకుటిల
గతులఁ దునుముచు నెగడుట పతికి నీతి. 105

క. కిరణముల భంగిఁ జతురపుఁ
బరిజనముల నెందుఁ జొనిపి పరకృత్యంబుల్
నిరతంబును గనుఁగొనుచును
ధరణి కరణి వెలుఁగుటొప్పు ధరణీశునకున్. 106

తే. అలుక గూరిమి ఫలదంబు లగుచునుండఁ
గృత్యములఁ దా నెఱుంగుచు నిత్యవిధుల
నాయములును వ్యయంబులు నరసి కోశ
సంపదలు గాంచి యునికి రాజన్యగుణము. 107

వ. అనిన విని యుధిష్ఠిరుండు 'రాజులకు దండంబు సర్వసాధారణంబు; తదీయస్వ
రూపఁబు విన పలతుంజెప్పు' మనిన నన్నరదేవునకు దేవవ్రతుం డిట్లనియె: 108

-:భీష్ముఁడు ధర్మజునకు దండనీతిప్రభావం బెఱిఁగించుట -

సం. 11-121-8

సీ. అసితోత్పలచ్ఛాయమై దంష్ట్రికాచతు
ష్టయమును భుజచతుష్టయము జిహ్వా
కలురెండుఁ బాదాష్ట కంబును శంకుక
ర్ణములును బహునయనములుఁ గల్గి
యూర్ధ్వరోమంబులు నుగ్రారుణాస్యంబుఁ
గపిలజటాజాలకంబు నొప్ప
నసిగదాశక్తి శరాసన ముసల చ
క్ర ప్రాస శర తోమర త్రిశూల

తే. పరశుముఖసాధనంబులఁ బాపజనులుఁ
దరతరంబ సంఛేదనతాడనాదు
లైన వివిధ ప్రహతుల నే పడఁచుచును జ
లించు దండంబు సుజనులు ప్రియము నొంద. 109

సీ. పరుఁ డసంగుఁడు ధర్మపాలుండు ధర్మ్యుండు
విజయుండు శాస్త్రంబు విశసనుండు
గ్రహమక్షరుఁడు ప్రజాగరము దురాసదుఁ
డతిసత్యగుండు నిత్యగుఁడు శాస్త్ర
ప్రాగ్వచనుండు శస్త్రంబు బ్రహ్మము తీక్ష
వర్ముండు మనువు శివంకరుండు
కౌమారిసుతుఁడు శ్రీగర్భుండు వ్యవహార
తంత్రంబు సంగుప్తమంత్ర మనఁగఁ

తే. బరఁగు పేళుల నొప్పి యధ్వరమయాత్ముఁ
డైన విష్ణుండ దండమై యావహిల్లు
శ్రీసరస్వతి యను నివి శిష్టదండ
నీతినామాంతరంబులు నృపవరేణ్య! 110

వ. ధర్మాధర్మంబులు సుఖదుఃఖంబులు నయానయంబులు నర్థానర్థంబులు బలాబలంబులఁ బ్రసాదాప్రసాదంబులు మొదలైన సకలావస్థలును దండంబున సమ్యగసమ్యక్ప్రకారంబుల గలుగుం గావున సమ్యక్ప్రకారంబుచేత దండంబున రక్షింపంబడినప్రజ రాజు నభివృద్ధి నొందించు; నట్లగుట దండంబు రాజునకుం బరాయణంబు. 111

క. సత్యప్రకార ధర్మము
నిత్యానుష్ఠేయ; మది సునీత మగుచు నా
దిత్యపతిఁ బ్రీతుఁ జేయఁగ
నత్యున్నతి నెసఁగు నాతఁ డన్నప్రదుఁడై. 112

వ. దానంజేసి దండంబు ప్రసన్నంబై వెలుంగుఁ, దదీయాభిధానంబులు మఱి యునుం గల వాకర్ణింపుము. 113

ఆ. పురుషఁ డీశ్వరుండు భూతాత్మకుండు జీ
వుండు ప్రాణుఁ డక్షయుండు సత్త్వ
మనఁగ నేడుపేరు; లష్టమంబు ప్రజాప
తి యనఁ బరఁగు దండదేవు పేరు. 114

-:వసుహోముఁడు మాంధాతృనకుఁ జెప్పిన దండోత్పత్తిప్రకారము:-

సం. 12-122-1

వ. దండంబు సాక్షాద్దేవుం డట్లగుటఁ దెలిపెడునది యొక్కయితిహాసంబు గల, దంగదేశాధీశుండు వసుహోముం డను రాజు హిమశైలంబున ముంజపృష్ఠం బనం బ్రసిద్ధం బగు శృంగంబునకు దేవీసహితంబుగాఁ జని యందు వసియించి మునిగణపూజితం బగువృత్తంబున నుదాత్తుం డయి యుండ, నమ్మహీపతికడకు మాంధాతృండు సముదెంచి సవినయంబుగాఁ బ్రణమిల్లిన, నాభూవల్లభునకు నంత దర్ఘ్యపాద్యాదు లగు నుపచారంబు లాచరించి 'వచ్చిన పని యేమి' యని యడిగిన, నప్పుడమిఱేఁడు 'సవిస్తరంబుగా దండప్రకారంబు

వినుటకై నిన్నాశ్రయింప వచ్చితి' ననవుడు నమ్మహాత్ముం డతని
కిట్లనియె : 115

సీ. అజుఁ డధ్వరంబు సేయంగఁ దలంచి ఋ
త్విజు నాత్మసదృశుని వెదకి యెందుఁ
గానక తా నొక్క గర్భంబు ధరియించి
వేయేండ్లకును దుమ్మి వెలువరించె;
ఋతసంభవతఁ జేసి ఋతుఁ డనుపేరిట్టఁ
బరగెడు; నా ప్రజాపతియు ఋత్వి
జుండుగఁ గ్రతు వొనర్చుచునుండ నంతర్హి
తంబయ్యె వలచు చందమున నడచు

ఆ. నట్టి దగుట దండ మధిప కార్యాకార్య
తంత్రభేద మెడలెఁ; దానఁ జేసి
మహి గలంగెఁ గడు నమర్యాద వర్తించెఁ;
గమలజుండు విష్ణు కడకుఁ జనియె. 116

క. చని సంప్రార్థించి యతని
గొని రుద్రునిఁ గాంచి నీసఖుం డీతఁడు వ
చ్చిన కార్యము గృపతోడను
విను మని దండంబు తెఱఁగు విన్నపించెఁ దగన్. 117

వ. అట్లు లోకరక్షకుం డగు పుండరీకాక్షు దండగొని దండాభావంబున జగంబు
గలంగు టెఱింగించిన నవ్వరించి పలుకులు మనస్కరించి మహాదేవుండు
నిజప్రభావంబు దండంబుగాఁ గల్పించి దండనీతి కాశ్రయుండై పరగు
చుండె. 118

సీ. వినుము, ఋగ్వేదాదివేదముల్ నాలుగుఁ,
గల్పాదులైన యంగంబు లాఱు,
బెరసి విద్యలు పది. పేర్చు పురాణంబు
లన్నియు నొకవిద్య; యధిపఁ ధర్మ
విదులు సెప్పెడు శాస్త్రనితియుతయు నొక
విద్య; సర్వన్యాయవిస్తరంబు
నొకటి, మీమాంస దా నొక్కటి; యిట్టులు
వివరింపఁ బదునాల్గువిద్య లయ్యె ;

తే. వైద్య కోదండ గాంధర్వవిద్య లర్థ
శాస్త్రమగు నీతివిద్య తత్సహితవృత్తి
వెలయఁగాఁ బదునెనిమిది విద్య లభవుఁ
దేర్పరించె జగత్ప్రహితము పొంది. 119

వ. ఇట్లు సమకట్టి దండంబును దండనీతిప్రపంచంబు లయిన యవ్విద్యలను విష్ణువశగతంబులు సేసె నా సర్వేశ్వరుం డత్తన్మ్మచూలికిఁ దుమ్మ ఘటించి యీభంగిం బ్రజాపతి ప్రసవంబు గావించె; దండనీతి సమగ్రరూపయై చెల్లె; నెల్లజగంబులుం బ్రియంబందె; నరవిందభవునియాగంబునుఁ బ్రయోగంబై నడచె; విష్ణుండు దండనీతిశాస్త్రంబు సకలంబు నాంగిరసున కిచ్చె నాంగిరసుం డింద్రమరీచులకు మరీచి భృగునకు భృగుం డనేకమునులకు నిచ్చె నీ క్రమంబున నది జగంబులం బరగె; దండంబు జాగరణంబున లోకంబు మర్యాదా మహితంబై వర్తిల్లెఁ; గపర్ది శంకరుండు రుద్రుండు భవుండు స్థాణుం డుమాపతి యనుపేళ్ళం బరగు నద్దండదేవుని నతులధర్మంబున నయించుభూపాలుం డైహికాముష్మిక సిద్ధులం బొందు. 120

క. అని వసుహోముఁడు సెప్పిన
విని మాంధాత్యుండు దండవిభవజ్ఞుండై
యనఘ ! మహీపరిపాలన
మొనరించెను నీతిదండయుక్తి వెలయఁగన్. 121

క. ఈయాఖ్యానము విని భూ
నాయకుఁ డెవ్వం డిలాజనంబుల నతుల
న్యాయఁబునఁ బాలించుఁ జి
రాయుష్మిరపుణ్యభాగి యగు నతఁడు నృపా ! 122

-:భీష్ముఁడు ధర్మరాజునకు ధర్మార్థకామంబులతెఱం గెఱింగించుట:-

సం. 12-123-3

వ. అనిన విని ధర్మనందనుండు ధర్మార్థకామంబుల నడవడి యెట్లయిన మేలై చెల్లునని యడిగిన భీష్మం డిట్లనుఁ "దొల్లి యాంగరిష్మం డను నరవరుండు కామందకనామం డైనమునిని నిట్లని యడుగ నతం డతనికిఁ జెప్పినభంగిం జెప్పెద నాకర్ణింపుము. 123

చ. అనయముఁ బేర్చుకామమున నర్థము ధర్మముఁ గ్రాఁగుఁ; గామతం
త్రనిరతుఁడైనవాఁడు సుపథప్రతిపన్నుఁడు గాఁడుఁ; దుష్టదం
డన మొనరింపఁ; డట్టిపతి డాయరు సాధులు నార్యులన్ సుహృ
జ్జనులును; దానఁ జేటు నగుఁ; జావును బాటిలు నెల్లభంగులన్. 124

ఉ. కాపున ధర్మసిద్ధికి ముఖంబగు నర్థమునందు నిష్ఠమై
నేవిధినైన ధర్మరతి యొక్కఁడుగా మదిఁ జొన్పుటొప్పుఁ; గా
మావిలబుద్ధిగాక యుచితాగతసౌఖ్యము లాచరించుచున్
భూవిభుఁ డెప్డు భూమిసతిఁ బొంది రమింప మహోన్నతుం డగున్.' 125

క. అన విని ధర్మతనూజుఁడు
'జనమ్ము శీలమ్ము నధికసంస్తుత్యముగాఁ
గొనియాడుఁ దత్స్వరూపం
బనఘా ! వివరింపవే దయారతి నాకున్.' 126

వ. అనుటయు నాపగాతనయుండు వినుమని యతనికిట్లనియె : 127

క. మున్నింద్రప్రస్థంబున
నున్నతి మెయి ననుజతనుజయుక్తంబుగ నీ
వున్నతెఱఁగు దుర్యోధను
కన్నులు గమరింప, నతఁడు గడు పగ నొందెన్. 128

వ. భవదీయసభయొప్పనకును రాజసూయంబు చెల్లినయుల్లాసంబునకును నట్ల సహ్యపడి ధృతరాష్ట్రునితో భవద్గృహంబున నిచ్చలుం బదివేవురు భూసురులు పసిండిపళ్ళెరంబులం బాయసాహారంబులు గొనుట మొదలుగాఁగ లక్ష్మిపెం పుగ్గడించి తనవగపుదోఁపం బలికిన నతం డతని కిట్లను 'మధురాన్నపాన మణిభూషణవరవాహనాదులం జేసి యుజ్జ్వలంబై యున్నదిగాక నీ యైశ్వర్యం బసదే పాండవాగ్రజుం డెక్కుడు మెఱసియునికియుం గలదు విసుము చెప్పెద. 129

ఆ. శీలవంతులైన సిరిఁ బొంతమురు ధర్మ
తనయునింటిసిరికి నెనయనంగ
నెక్కుడఁగ లక్ష్మి యెసకం బెసఁగ నీవు
శీల మలవరింపు చిత్తమునను. 130

వ. మాంధాతృండు నాభాగుండు మొదలయినమేదినీపతులు శీలంబునంగాదె యీ లోకంబునం బెంపువడసి; రివ్విషయంబునకు నొక్కయితిహాసంబు గల దాకర్ణింపుము. 131

క. దనుజవిభుఁడు ప్రహ్లాదుం
డనిమిషపతి రాజ్యలక్ష్మి యతులితశీలం
బునఁ గొని త్రైలోక్యంబును
దనకు వశగతంబు సేసె ధర్మం బలరన్. 132

క. దానికి రోసి బృహస్పతి
లో నమరేంద్రుడు "మేలు దొరకొనువిధ మె

ట్లో' నావుడు 'భార్గవునిం
గాసఁగ జను; మతఁడు సెప్పుఁ గరుణాన్వితుఁడై.' 133

క. అని గురుఁడు వంప నింద్రుఁడు
సని భార్గవుఁ గాంచి 'మేలు సమకూరుతెఱం
గనఘా ! యుపదేశింపవే'
యనినం 'బ్రహ్లాదుఁ జెంప మతఁ డెటిఁగించున్ ' 134

ఆ. అతని నాశ్రయించి యవ్వేఁ విప్పించి
కొనిన మేలువొందు' ననియె భార్గ
వుండు; వజ్రి బ్రాహ్మణుం డయి ప్రహ్లాదుఁ
జేరి శిష్యవిధులు సేయుచుండె. 135

వ. అంత నద్దానవేంద్రుండు ప్రసన్నుండై భూసురాకృతి యయినసురపతితో
సంభాషించిన నతఁడు 'నీకుఁ ద్రైలోక్యరాజ్యంబు సంప్రాప్తంబైన కారణం
బేమి యెటిఁగింపవే' యనుటయు. 136

ఆ. దనుజనాథుఁ డిట్టులను 'రాజనను గర్వ
మున ధరామరులకు మనసు గందఁ
జేయ నెపుడు నే నసూయాదు; లమ్మహా
త్ములకు ధనము లిత్తు నెలమితోడ. 137

వ. వారలు మెచ్చునట్టి శీలంబునం బ్రవర్తిల్లు దానంజేసి మహోన్న
తుండ నైతి. 138

క. అనవుడు 'నీశీలము నా
కనఘా ! దయ నొసఁగవే' మహాత్ములఁ దగఁ జెం
దినవారు బ్రదుకవలదే"
యని దీనత దోఁప ననిమిషాధిపుఁ డడిగెన్. 139

క. విని ప్రహ్లాదుఁడు గృప దన
మనమునఁ గదురంగ విప్రమాత్రుఁడు గాఁడీ
తనిభంగిఁ జూడ ననువెఱ
పును బుట్టుఁగ నిచ్చె శీలముం బెంపెసఁగన్. 140

తే. పడసి యింద్రుఁడు శీలసంపన్న డగుచుఁ
జనియెఁ దదనంతరంబ యద్దనుజవరుని
తనువునందుండి తేజిష్ఠతనువిలాసుఁ
డైన పురుషుండు వెడలిన నతఁడు సూచి. 141

వ. 'నీ వెవ్వండ' వన నప్పురుషుం 'డేను శీలంబ; నీ విచ్చిన యవ్విప్రుపాల
వసియింపం జనియెద' నని చెప్పి పోయెం; దదనంతరంబ క్రమంబునం
దేజోమయరూపంబులు నిజదేహంబుననుండి నిర్గమింప నద్దానవేశ్వరుం
డడుగుచు. 142

క. ఉత్తమధర్మము సత్యము
వృత్తంబు బలంబు నగుట వినఁబడె బడిఁ ద
చ్చిత్తము విషాదమందఁ ము
హత్తరమూర్తి యొకవారిజానన వెడలెన్. 143

క. వెడలిన 'నీ వెవ్వత' వని
యడిగిన నాతనికి నిట్టు లను దీనత న
ప్పుడఁతి 'సిరి నేను' బల మె
క్కుడకు నరుగు నందుఁ బోవఁ గడఁగి వెడలితిన్'. 144

చ. అనిన భయంబు నొంది యతఁ డాసతితోఁ 'బరమేశ్వరీ! మహా
వినయమతిన్ దనుం గొలిచె విప్రవరుం; డతఁ డెవ్వఁ' డన్న న
వ్వనిత 'సురాధినాథుఁడు భపద్ధనరాజ్యవిభూతి యింతయుం
గొనుటకు నిచ్చుఁ జెందె; నిటు గోల్పడి తీవును నీదుశీలమున్.' 145

వ. వినుము చెప్పెద;శీలంబున ధర్మంబున. వెలయు; ధర్మంబున సత్యంబు దొర కొను; సత్యంబున వృత్తంబు సొప్పడు; వృత్తంబున బలంబు వాటిల్లు; బలం బున నేను గలుగుదుం; గావున సమస్తంబునకు మూలంబు శీలం'బని చెప్పి 'సిరి పురందరు పాలికి ధర్మాదులతోడ(గూడం జనియె' ననుటయు దుర్యో ధనుండు శీలం బెట్టి దనిన ధృతరాష్ట్రుం డతని కి ట్లనియె: 146

క. ఒలసి మనోవాక్కాయం
బుల ద్రోహాభావ మఖిలభూతముల యెడం
గలిమి విను శీల;మది మే
లొలయించును; దాన నుల్ల మూన్పుము పుత్రా! 147

క. పరహితము సిగ్గు సొటుం
బొరయక యుండంగ నెదిరి బోధించుటయున్
నరసముదయంబు వొగడెడు
చరితము శీలమున కంగసంపద వత్సా! 148

క. అనియె నని చెప్పి భీష్మం
డను ధర్మజుతోడ 'నీకు నది నైజము; యే
నును బోధించితి; శీలము
మనమ్మునం దిరము సేయుము మనుజాధీశా!' 149

వ. అనిన విని యజ్ఞపతి భీష్మునితో 'నాశ యను నది యనంత యై యుండు; నది నిరర్థకయైన నయ్యేడు దుఃఖం బధికం; బది దుర్యోధనుం బేర్చి కలసి యుండం జూచితి; నమ్మహాత్ముండు దేబిక సుఖీయాశం గుంఠితంబుం జేసి నన్ను దుర్బుద్ధిం గావించె నది విషాదంబు సేయు; నాశ నడంచుట యెట్టిది గదే' యనుటయు నాశాదోష నిరాసకం బైన యొక్కయితిహాసంబు గలదు విను మని యక్కురుసత్తముం డిట్లనియె: 150

-:భీష్ముఁడు ధర్మజునకు సుమిత్రుఁ డనురాజు చరిత్రంబు సెప్పుట:-

సం. 12-125-8

సీ. హైహయుండు సుమిత్రుఁ డనురాజు వేఁటవో
యినచోటఁ దనచేత నేటువడిన
మృగ మమ్మితోఁ బాఱఁదగిలె వెన్వెంటన;
యదియును నొక మరి యగ్గమయ్యె
నొకమరి దవ్వయ్యె నొకమరి దృష్టిక
గోచరం బయ్యెను ఖురపదంబు
లరసిపాఱిన నింతనంతఁ దోఁచియు నాశఁ
బెనుచుచుఁ జని మహావనము సొచ్చె;

ఆ. నవ్విభుండు డస్సి యచ్చట నొకముని
పల్లె కేఁగి మునులు ఫలజలములఁ
దృప్తుఁ జేయ డప్పి దేఱి యున్నెడ ఋష
భాఖ్యుఁడైన తపసి యతనితోడ. 151

క. వనమున నెక్కటి నీవే
పనికై చనుదెంచి తేల పరమవిషాదం
బునఁ బొందె దనిన నాతం
డను నొకమృగమమ్మితోడ నరుగఁగ వెనుకన్. 152

క. ఆసాసల వచ్చితి ననుఁ
గాసిం బెట్టి యది యడవిఁ గలసెను మృగయా
వ్యాసక్తుఁడు వగచుం దన
యేసిన మృగ మనఘ! తప్పి యేఁగుటకుఁ గడున్. 153

వ. 'ఆశ యింత దుర్నివార యగునే' యనిన నమ్మునిపతి యమ్మనుజపతి
కిట్లనియె: 154

క. విను తీర్థయాత్ర సని యే
నను త్తమంబైన బదరికాశ్రమున నొ
క్కనిఁ గాంచితిఁ గృశగాత్రునిఁ
దనుఁ డను పేరింటివానిఁ దాపసవర్యున్. 155

క. కని భక్తిం బ్రణమిల్లుడు
ముని యాతిథ్యం బొనర్ప మోదంబున నా
తనిపాల ధర్మఫణితులు
వినుచుండఁగ నొక్కధరణివిభుఁ డేతెంచెన్. 156

వ. విషాదవివర్ణం డగుచు సపరివారంబును సదారంబునుగాఁ జనుదెంచి యజ్జన
పతి మునిపతిం గాంచిన నతం డతిథి పూజాసత్కారంబులు సేసి యాగమన
కారణం బడిగిన నన్నరనాథుండు. 157

చ. తనయుఁ డొకండ; వాఁడు గుణధాముఁడు; క్రీడనవాంఛ సాంద్రకా
ననమున కేఁగి కాడుపడినం దడవం జనుదెంచి యెమ్ముఁ గా
నన మదియాశ ద్రిప్పికొనినన్ వెగడందుచు వచ్చినాఁడ న
న్న నతఁడు పల్కకుండె వదనం బొకయించుక వాంచి చింతతోన్. 158

క. చింతించునతనితో భూ
కాంతుం డిట్లనియె మఱియు 'గాధతరాశా
క్రాంతత దుర్లభఫల యగు
టింత యసహ్యమగునయ్య యెడఁద మునీంద్రా!' 159

వ. అనుటయు నత్తాపసో త్తముం డమ్మహీపతియాననం బాలోకించి. 160

క. వీనరుఁడు మానసము ధృతి
నూన నుచితవృత్తి నుండు నుదిలగొనక యెం
దైనను నెయ్యదియేనియు
వానికి దుర్లభము లేదు వసుధాధీశా! 161

క. అర్థాదులగుఫలంబులు
ప్రార్థించినచోట సిగ్గువఱుపక తగ-న
య్యర్థి సులభార్థు జేయు కృ
తార్థుఁడు దుర్లభుఁడు దలఁప నఖిల జగములన్. 162

వ. అని పలికి పూర్వావారస్మారకత్వంబున నిట్లనియె: 163

క. వినుము,గుణవంతుఁ డొకరుఁడు
ధనవంతుండైన యొక్కధరణీనాథుం
దనకూడుసిరకై కాం
చన మడిగి తదీయ బాలికత్వము పేర్మిన్. 164

క. విహతాశుండై లజ్జా
మహితంబగు నాశ దొఱఁగు మదితో సకల
స్పృహయును నెవ్వనియందును
వహింప నని యతులమైనవ్రతముం బూనెన్. 165

వ. అని చెప్పి యప్పార్థివుం దొల్లి తాను ధన మర్థించి యఫలితప్రయత్నుండై తత్కాలజనితవైరాగ్యంబునం దపస్వి యగుట దేటపఱచి వెండియు. 166

చ. ఒడఁబడి యానివానియెడ నుల్లమునందుఁ గృతఘ్నతం గడుం
జెడుగగు దుర్వినీతునెడఁ జిత్తము కోర్కికిఁ బట్టుసేసి లే
పడి యగునీచకాంతయెడ వారక యాసలు సాఁగు; నిట్లుపై
క్కెడలను బాఱు నాసగమియెల్లఁ దొఱంగుము సౌఖ్య మొందెడున్. 167

వ. అని యాసపజ్జంబోవమి సుఖకరం బగుటం దెలిపి యవ్వీరద్యుమ్ననకుం గురుణించి యతనికొడుకు భూరిద్యుమ్నుం దనతపోమహిమ నాకర్షించి వీడు కొలిపె ననిచెప్పి ఋషభుండు సుమిత్రునిచిత్తంబు మృగయాశాయత్తంబు గాకుండునట్లుగా బోధించెఁ; బాండవాగ్రజా! నీవును నివ్వాక్యంబు లాచరించి

సుస్థిరుండవై నిరాశత్వంబున సంతాపంబు దక్కి సుఖివి గమ్మని పలికిన భీష్ముఁతో నబ్భూపతి 'భవదీయవచనామృతాస్వాదనంబున మనంబు దృప్తి సన;దింకను ధర్మప్రకారంబులు వివరింపు'మనిన నతం డతని కిట్లనియె: 168

క తనభూమిఁ బరులభూమిని
ధనము లుపార్జింపవలయు ధరణీశునకున్ ;
ధనములు మూలము రాజ్యం
బునకును మూల మగుధర్మమునకు నరేంద్రా ! 169

క. అది బెట్టిదంపువెరవున
మృదుభూతోపాయమునను మెయికొనద ప్రజం
బొదువవలయు నాజ్ఞాసం
పద గలసాకతముతోడఁ బతి యవహితుఁడై . 170

క. విను, బండారము వెరుఁగని
జనపతికి బలంబు మి త్రిసంపదయును గ
ల్గునెఁ బలమి త్రివిహీనున
కొనరునె రాజ్యంబు ? విభవ మున్నత మగునే? 171

ఉ. కావున నర్థసంపదలు గల్మియ యింతకు మూలమైన ను
ర్వీవరుఁ డాత్మశ క్తి కతిరి క్తము లై న సముద్యమంబులం
దా వెలయం దలంచి సమదగతఁ గె కొను టొప్పు; దవిధం
బావిభుతొంటికల్మికిని హాని యొనర్చు; హరించుఁ బ్రాణముల్ . 172

క. తనకొలఁది నుపాయంబులు
వొనరిచి ధనవంతుఁ డగుట భూపగుణము; ని
ర్ధనుని నిజప్రజయును గై
కొనదు, వికోధులను సరసు గొనరు కుమారా: 173

క. తెరువాటున ద్రుచ్చిమి ను
ద్ధరులగు క్రూరులకు మూఁక దోరంబగు న
వ్వెరవరిదొరల బలంబుగ
ధరణీశుఁడు గూర్చుకొనుట ద్వైన్యము దెచ్చున్. 174

క. అన్యాయంబునఁ బొదలిన
సైన్యముచే సమరజయము సమకూఁ;దనూ
నన్యాయపరులు గాంతురు
మాన్యత్వము దస్యులైన మనుజాధీశా ! 175

వ. ఇట్లగుటకు నుదాహరణం బగు నొక్కయితిహాసంబుగల దాకర్ణింపుము: 176

—:భీష్ముండు ధర్మజునకుఁ గాపవ్యోపాఖ్యానము సెప్పుట:—

సం. 12-91-1

సీ. అవనీశ! పారియాత్రాచలంబున నుండు
నొకబోయ ధర్మసంయుక్తబుద్ధి
వింట నేర్పరి మృగవితతి ప్రకారజ్ఞుఁ
డారణ్యదేశసంచారశాలి
తల్లికిఁ దండ్రికిఁ దద్దయుభక్తుఁడై
ఫలమూలమధుమాంసములును మేలి
కూడుగూరలు దొరకొల్పి వారికిఁ దృప్తి
యావహించుచు శయనాసనాదు

తే. లగుపదార్థముత్ హృద్యంబులుగ నొనర్చి,
వలయునాహారములు వ నివరుల కిచ్చుఁ.
బగఱఁ దోఁచినఁ బరిమార్చు భండనమున
నొకఁడ వేవురనైన మహోగ్రగతుల. 177

క. కాపవ్యం డను పేరను
దీపించిన యతనిభూరితేజము గని ర
క్షాపరుఁడు వలయు మన కని
యాపొలమునఁ గల్గు దస్యులంచఱుఁ దమలోన్. 178

ఆ. అతనిఁ దమకు నెల్ల నాధిపత్యము సేయు
వానిఁగా వరించువారు గాఁగ
నిశ్చయించి కూడి నెమ్మిమైఁ జనుదెంచి
కాంచి యిట్టు లనిరి గారవమున. 179

క. బలవిక్రమసంపన్నుఁడ
పలఘు చరిత్రుఁడవు; మమ్ము నందఱఁ బ్రభువై
తలకొని రక్షింపుము; నీ
పలచినపని గొనుము పుత్త్రివర్గముఁ బోలెన్. 180

వ. అనిన విని యతండు వారల కిట్లనియె: 181

సీ. శిశుజన ముని జన స్త్రీజనంబులఁ జంపఁ
గా; దెట్టివాఁడైన నఁ గడఁగి మీఁదఁ
గవియక పొడుచుట కల్మషం; బంగనఁ
జెఱపట్టఁ దగదు; విశేష మొకఁడు
వినుఁ; డెల్లస త్త్వంబులను బెంటిఁ జంపుట
పాపంబు; గోవుల బ్రాహ్మణులను
సంకటపెట్టంగఁ జనదు; తదీయహి
తము గోరి పూని యుద్ధంబు సేఁత

తే. యధికపుణ్యంబు; సస్యక్రియావిఘాత
మాచరించుట గడుదోష; మవనిప్రజకు
బాధ గావించి కుడిచి శవంబు దొలుచు
ప్రుచ్ఛ్వగతి నది వొలియంగఁ బొలియు నతఁడు. 182

వ. అని చెప్పి 'మీర లీధర్మాధర్మంబు లెఱింగి నాపంచిన తెఱంగున బ్రదికెద రేని మీకు ముఖ్యుండు నయి సఖ్యంబు సౌఖ్యంబుఁ బెనుప మీయోగ క్షేమంబు లరసెద' ననియె దానికి వారలందఱుఁ బ్రీతిం బొంది, యాతని వశంబున వర్తించి వర్ధిల్లి; రిట్లు కాపవ్యుండు సాధులకు హితం బగునట్లుగా దస్యులం బాపంబులకుం బాపి తానును వారును నిహపరసిద్ధులం బఱగి వహించె. 183

క. కాపవ్యోపాఖ్యానము

పాపహరము దీనిశ్రవణపఠనము లటవీ
వ్యాపారక్షేమంకర
రూపములగు దస్యుమృగవిరోధము లడఁచున్. 184

భీష్ముడు ధర్మజునకుదీర్ఘదర్శిమొదలగుమత్స్యముల తెఱంగెఱింగించుట

సం. 12-135-1

వ. అని చెప్పి భీష్ముండు వెండియు నిట్లను; దీర్ఘదర్శియుఁ బ్రాప్తకాలజ్ఞుండును దీర్ఘసూత్రుండును ననుమత్స్యంబులు మూఁడు జలచరబహుళం బగునొక్క యేటిమడువునఁ దమలోనం బొందు గలిగి యుండునవి; వేసవి సొచ్చిన డీర్ఘదర్శి దక్కటి రెంటినిం గూడం బిలిచి. 185

క. 'మడు వింకఁగఁ బాఱెడు; నీ
రెడ్డ్రెవ్విన నొండుసోటి కేఁగఁగ రా; దె
ప్పుడు నింకని నేళ్లులు గల
మడువునకుం బోవవలదె మన కిట్టియెడన్'. 186

తే. అనినఁ బ్రాప్తకాలజ్ఞుఁ డిట్లనియె 'నేది
ప్రాప్తమయ్యె నకార్యంబుభంగి నెఱిఁగి
యప్పటికిఁ దగునట్లు సేయంగవలయు
మానితోపాయవృత్తి నేమఱుట లేక.' 187

వ. అనిన న్యూనాధికాంగుల పలుకులు విని దీర్ఘసూత్రుం డిట్లనియె: 188

క. 'జడసిధిచంచంబున ని
మ్మడు వొప్పఁగ నిప్పు డేమి మాఁడెనె యిమ్మె
సడిచిపడ ? రి త్తనెవ్వగ
లుడుగుఁడు; మటి చూచికొంద మెయ్యన తటితోన్'. 189

క. అనుటయు నిది కర్జముగా
దని పలుక్-చు దీర్ఘ దర్శి యఁబుస్రోతో
జనితాయ మగు పథమునఁ
ఒని చొచ్చెం బెద్దమడువు సమ్మదలీలన్. 190

వ. తక్కిన రెండును నంద నిలిచె; నిట్లు నిలిచిన యమ్మత్స్యద్వ్యయంబునకు
భయంబు జనియింపం గతిపయదివసంబులకు. 191

క. పాఱెడునీ రెడ త్రెవ్వఁగఁ
దాఱు బెడిదమైనయెండ దనుకఁగ నివురం
బాఱె మడుఁ; పంత వేడుక
కాఱులు జాలరులు సొచ్చి క్రందుకొనంగన్. 192

క. వెఱవున నూఁతల నెత్తెలఁ
గరముల మత్స్యములఁ బట్టి కడుసంతసముం
బొరయుచుఁ ద్రాళ్ళం గ్రువ్వంగ
గర మూహించి మదిఁ బ్రా ప్తకాలజ్ఞుండున్. 193

క. ఇం దొకత్రాడు గఱచి యే
నొందంగాఁ గ్రుచ్చినట్ల యుండెద వీరీ
క్రందుకొనుట మానంగ న
మందత నది యెడల విడిచి మడువు దరిసెదన్. 194

క. అని యొక గుదిమీల నడుమ
నెనయంగాఁ దూఱి కఱచి యిరుదొడలఁ ద్రా
డొనరంగఁ బట్టుకొని క్రు
చ్చినచందము దోఁప మూర్ఛఁజెందిన భంగిన్. 195

వ. ఉన్నంత వేఁటదీజి యగ్గుని గలయతండు. 196

క. తెలినీట రొంపివోవం
దొలుచునెడం ద్రాడు విడిచి దురితంబునకుం
దొలఁగి పొరదప్పి యం దొక
జలచర మున్నయెడ కేఁగె సంభ్రాంతిగతిన్ 197

క. ముట్టఁబడి దీర్ఘ సూత్రుం
డిట్టట్టుగఁగ నుపాయమేది యొకనిచేఁ
బట్టువడెఁ దనదుడెందము
పట్టువదలి చకితవికలభావేంద్రియుఁడై. 198

క. విసు, దొడవ్వులఁ గార్యము
గనికొని వలయుపని మున్న కావింపఁగ నే
రని జడుఁడు దీర్ఘసూత్రుం
డను సమ్మత్స్యంబుభంగి నాపద నొందున్. 199

తే. అప్పటికిఁ దోఁచినట్టులు దప్పకుండ
ననువుతో ధృతిగల్గి కార్యంబు నడపు
నతఁడు ప్రాప్తకాలజ్ఞాఖ్య నట్లపోలెఁ
బరమ సంశయమయ్యెడు బ్రదుకు గాంచు. 200

క. ధుర్యత ననాగతము లగు
కార్యము లూహించి పని తగం జేయునయా
చార్యుఁడు సౌఖ్యముఁ బొరయును
నార్యస్థితి దీర్ఘదర్శియనుమీన క్రియన్. 201

వ. అనిన విని ధర్మనందనుండు 'పెక్కండ్రు పగఱకు నగ్గమై హీనబలుండైన నరపతి యెప్పరుసున నాపద నిస్తరించుటా'డని యడిగిన నప్పుడమిజేనితో భీష్ముండు 'మార్జాలమూషికసంవాదం బను నితిహాసంబు గల; దది నీదగు ప్రశ్నంబునకు సమత్తరంబగు విను'మని యిట్లనియె: 202

-:పలిత రోమశు లను మూషిక మార్జాలంబుల సంవాద ప్రకారము:-

సం. 12-136-18

సీ అడవిలో నొకమఱ్ఱియడుగున లాఁగలఁ
బలితుండు నా నొక్క- యెలుక యుండు;
నమ్మహీజము మీఁద ననిశంబు రోమశుం
డనుపిల్లి వసియించు; నాసమీప
మున సంజకడ నిత్యమును మృగంబుల కురు
లొడ్డి వేకువ వచ్చి యొక్కమాలఁ
డగపడ్డవానిఁ గొంచరుగు; నొకప్పు డా
హారంబునకుఁ బిల్లి యచటఁ దిరుగఁ

తే. బోయి యురిఁ బటియుఁడఁగఁ బొంచి చూచి
భయము దక్కి యచ్చోటన పలితుఁ డెరకుఁ
గ్రమ్మరఁగఁ జంద్రకుం డను గూబపులుఁగు
హాలికుఁ డనుముంగియు నింతనంతఁ దోఁచె. 203

వ. ఎరలకై వచ్చి యిట్లు దోఁచిన నయ్యెలుక యారెంటిబారికిం దప్పిపోవరామి
దలంచి బెగ్గలించియు ధైర్యంబు కలిమిం గార్యం బూహించి యప్పిల్లిం
గొండొకసేరం జనుచు దానితో నిట్లనియె: 204

క. ఉరి ద్రెవ్వ గొఱికి యిప్పుడ
వెరవారఁగ నీకు నేను విడుగర సేయం
దొరకొనుట నీదుభాగ్యం;
బరిత్వము దొఱంగి మైత్రి యలవఱుపు మదిన్. 205

క. ముంగికి గూబకు నగపడి
యంగంబులు వడఁకుచున్నయవి నా కిమ్మై

సంగతి గలిగిన నీయు
త్సంగంబున నుండి భయము దక్కుదు నేనున్. 206

చ. అనవుడుఁ బిల్లి యిట్టులను 'నా ర్తశరణ్యుఁడ వయ్యె దిట్టి నీ
కనఘ! హితంబు సేయపలవయ్య? జగత్పతిసాక్షి గాఁగ ని
ప్పని చగఁ బూనితిన్; వెఱపుఁ బాచి నసుం గదియంగ రమ్ము వ
చ్చిన నకులంబు గూబయును జేరఁగ నేరవు నాకు నోడుటన్. 207

ఆ. అనిన 'నట్ల యగుట నాత్మ నెఱింగియు
కాదె సంధియైన నాదుబ్రదుకు
నీదు విడుగరయును నిజమగు టూహించి
నిన్నుఁ జెందె బుద్ధి నిశ్చయంబు.' 208

క. అని పలికి పిల్లి పొదిగిట
ననయము నిశ్శంకవృత్తి నయ్యెలుక పసిం
చినఁ జూచి యయ్యెలూకం
బును నకులము నచటు వాసిపోయె నిజేచ్ఛన్. 209

క. నకులము నులూకమును బో
కకు సంతసమందియుండి గ్రక్కున నమ్మా
షిక మయ్యురిచేరులు గొఱు
కక యలసత నల్లనల్లఁ గఱచుచు నుండెన్. 210

వ. అమ్మెయిఁ బలితుండు గొనకొని యయ్యురిం గొఱుక కుండుట యెఱింగి
రోమహుం డిట్లనియె. 211

క. తగునే యిట్లు కృతార్థుఁడ
వగునీ కురి గొఱుక కిట్టు లాలస్యము సేఁ
త! గటా! కృతఘ్నతకు నెల
వగు టొప్పునె? కొఱుకు కడఁక నద్రోహుఁడవై. 212

చ. అనుటయు నెల్ల- యిట్టులను 'నాశ్రితరక్షణశీలు నిన్నుఁగీ
డునఁ బొరయింతునే యిది కడుం జెడుగుం దన మేను భీతి నూ
నిన మదితోడ నమ్మమిన నెట్టన యియ్యురిఁ ద్రెంప నయ్యెదన్;
మనముస నెగ్గుగాఁ గొనకు; మాలనిఁ గాంచిన యప్డ త్రెంచెదన్. 213

క. ఉరిఁ బాసి యేమి దలఁతో
యరిత్వమున వినుము ప్రబలుఁడైన యతనితో
వెరవున సంధియొనర్చియుఁ
గరంబు నమ్మమియ నీతిగాఁ గొండ్రు బుధుల్. 214

ఉ. మాలసిరాక చూచి భయమర్దిత మైన మనఁబుతోడ న
క్కాలమునంచు నీకుఁ జనఁగా వలయున్ వెస ప్రాణిపైకి; నా
యాలయమున్ జొరన్ సమయ మప్పుడ నాకును; గాన యత్తఱి
న్మేలొనరింతు నమ్ము మిది నిక్కము గర్జము నీ వెఱుంగవే: 215

క. అనవుఁడు నట్లేల తలఁప
వినుము, భవత్ప్రాణరక్ష వెసఁ జేసితి నే
ననఘా! నీవును నమ్మెయి
నను నాపదఁ బాప వలదె నమ్మి రయమునన్. 216

ఆ. అనినఁ బిల్లి కిట్టులను నెల్ల- 'వేగిర
పడకు ముచితకాలభావ్య మైన
యత్నవిధి గదా సమగ్రఫలత్వంబు
నొందు; నొండు దలఁప కూరకుండు' 217

వ. అని యి ట్లప్పలితుండును రోమశుండును నొండొరులతో మాటలాడుచుండ
వేకువయయ్యె నట్టియెడ. 218

క. తనతోఁ గొందఱు గుక్కల
గొని యేతేరంగఁ గేలఁ గ్రూరకృపాణం

బును భీకరభంగిన వెసఁ
జనుదెంచెన్ మాలఁ డధికసంరంభమునన్. 219

ఆ. పరిఘనాముఁడై న పాపాత్ముఁ గని భయ
మడరఁ బిల్లి యిట్టులనియె 'నింక
నేమి సేయువాఁడ నిదె వచ్చె జముదూత
వోలె సత్వరముగ మాలవాఁడు'. 220

క. అనిన విని 'యోడ కోడకు'
మనుచుం దెగఁ గొఱికె వేగ మయ్యోరిఁ బలితుం
డనయముఁ జకితాత్ముండై
చనియెన్ రోమశుఁడు నవనిజముపైకి వెసన్. 221

చ. ఎలుకయు బొక్కలోపనికి నేఁగి ముదంబునఁ బొంచి చూడ సం
కులముగ నేఁగుదెంచి పరిఘం డురి నుగ్గుపెల్లఁ జూచి ని
ష్ఫలతకుఁ జిత్త మెంతయు విషాదము వొందఁగఁ బోయెఁ; బిల్లి య
య్యేలుకకు నిట్లనుం జెవికి నింపగురీతి సుదాత్తభంగిగన్. 222

ఆ. మేలు సేసి తగినమిత్రునిఁ బడసి త
త్సుచరితముల వచ్చు సుఖము లనుభ
వింపఁ జూచు టుడిగి వేర్పడి యుండుట
యరయ నీతివిదుల తెరువుగాదు. 223

చ. అనఘ! భయంబు నొందు టిదియారయ బేలతనంబు; నెమ్మిమై
మును నను నమ్మి చెంది భయమోక్షణముం గని నాకుఁ జాల మే
లొనరఁగఁ జేసి తీవు; తుది నుల్లమునం దగ విశ్వసింప కి
ట్లునికి సుఖంబెఁ; నాదుసిరి కుక్తుఁడ వయ్యెదు రమ్ము ప్రీతితోన్. 224

క. బలపంతులై న చుట్టం
బులు నేనును నీకు మేలు వొనరింపఁగ ని

మ్మొల మనుట యొప్పదే? ననుఁ
గలసి మెలఁగు; విడువు శంకఁ; గను మభిమతమ్మల్. 225

వ. అనిన విని యప్పలితుండు రోమశునితో 'నీపలుకు లుచితంబులు; నా మాటలు
వినుఁ' మని యిట్లనియెఁ: 226

చ. అరులను మిత్రులం దెలియ నారయు బెంతయు సూక్ష్మకృత్య; మ
వ్వెర వతి దుర్లభం; బరులు వీరననుండియు మిత్రభావమున్
బొరయుటయున్ సుహృజ్జనులపోలికి గల్గియు శత్రుతాగుణ
స్ఫురణ మొకప్డు సూపుటయుఁ జూతురు గాదె ధరిత్రి నెల్లెడన్. 227

వ. కావున నిన్నుఁ బెద్దగదియుఁ కర్జంబు గాదు; నీవును మద్వశగతిం బొందుటఁ
జూచితేనియు నేమఱం జన; నెట్లంటేని. 228

క. బలవద్రివులు ప్రయోజన
ములకై లోఁబడుటగల్గుఁ బొలములు నేనుం
గులు దీమంబులపజ్జ ర
గిలి నెట్టన పట్టువడిన క్రియఁ జతురమతీ! 229

చ. అరియెడ మిత్రభావ మొకయప్పుడు కార్యముపొంటెఁ గల్గిన
న్నేరవునఁ బామఁ బట్టునెడ నిక్కము నమ్మక దాని వాతికిం
గరము దొలంగఁ జేయుసరుకర్జము వట్టి చరించు టొప్పదే?
పొరుగున నుండి నీకు హితమం దగఁ జేసెద నెప్డు పంచినన్. 230

మ. విను, నీ కామిష మేను;నీయెడఁ గడున్ విశ్వాసముం బూని చే
రిన సచిత్త మొకప్డు దుగ్ధతవికారీభూతమై దుర్వినో
దనహింసారుచి నొందు;సుతసుహృద్బంధుప్రజం బేని మున్
ననుఁగన్నన్ సహియింప దాత్మ; గరుణ న్మన్నింపు మిట్లుండెదన్. 231

వ. అని యంత నిలువక. 232

క. 'బలుపుటురిఁజిక్కఁ బేరాఁ
కలితో రేయెల్లనున్న కతమున నీకుం
జలిది వలసి పిలిచెద; విటు
వలయునె నీపలుకు నమ్మివత్తునె చేరన్?' 233

ఆ. అనుడు నిట్లు దలఁప నగునె 'మ్రాణ ర
క్షకుఁడ వైన నిన్ను శత్రుఁ గాఁగఁ
దలఁతునేఁ కృతజ్ఞతయుఁ బౌరుషంబును
గలుగ నేను వెఱవ వలవ దనఘ! 234

వ. అనిన రోమశుకుఁ బలితుం డిట్లనియె. 235

క. నీవలన నేను బ్రదికితి;
నీవును నాక తన మాలనికి నగపడ వె;
తీవిధమునఁ గల్గుసుహృ
ద్భావమ చాలు;నినుఁ జేరఁ దగ దిటమీఁదన్. 236

వ. ఇవ్విధంబునకు శుక్రువాక్యంబులుం గల వాకర్ణింపుము: 237

క. బలవంతుఁడై నశత్రుని
వలనఁ బ్రయోజనము గలిగి వలనుకలిమిఁ దాఁ
గలసియు నది గడచనఁగాఁ
దొలఁగ వలయు; నమ్మెనేనిఁ దుదిఁ గీడొలయున్. 238

ఆ. నమ్మఁదగనివారి నమ్మకయున్నది
తగినవారినైన నఁ దద్ద నమ్మి
యుండఁదగదు; తన్ను నొరులు నమ్మెడునట్ల
యుండి యొరుల నమ్మకునికి నీతి. 239

వ. ఇట్టిద బ్రదుకుఁ దెరు వగుటం జేసి. 240

క. నిను బోంట్లను నమ్మక యే
నును బ్రతికెద ననఘ! నీవునుం గని చండా
లుని యట్టివారి మాయలు
నినుఁ బొందక యుండ బ్రదుకునెఱిఁ బొమ్మింకన్. 241

క. అనిన విని సిగ్గుపడి తన
చనుచోటికిఁ జనియెఁ బిల్లి సమ్మతిఁ బలికుం
డును వేఱొకతగులాఁగకుఁ
జని సముచితవ ర్తనమున సౌఖ్యముఁ బొందెన్. 242

క. బలుపగఱవలనియాపద
దలఁగుటకును రిపుని హీనతరునైనఁ దనుం
గలపికొని బ్రదుకుటకు ని
య్యెలుకయుఁ బిల్లియును వెరవు లెఱిఁగించెఁ దగన్. 243

వ. అనిన విని కౌంతేయాగ్రజుండు శాంతనవునితో 'నెవ్వరియెడను విశ్వసింప కున్నం జిత్తంబునకు విశ్రామంబు గల్గదు; విశ్వసించిన దుఃఖంబులు దొడరు; నట్లగుటం జేసి విశ్వసించుటయు విశ్వసింపక యుండుటయు ననుగెంటిలో ననుం బరమకర్తవ్యం బెయ్యదియో నిశ్చయింపనేర' ననుటయు నమ్మహీపతి కమ్మహాత్ముం డిట్లనియె 'నీయర్థంబు దేటపఱుచుకట్టియిఁకహాసంబు సెప్పెద నాకర్ణింపుము.' 244

-: బ్రహ్మదత్తునితోఁ బూజనియను శకునికైన సంవాద ప్రకారము:-

సం. 12-137-4.5

సీ. బ్రహ్మదత్తుం డనఁ బరఁగిన నరపతి
నగరఁ బూజని యనునామ మొప్పఁ

జతురభాషిణి యొక్క శారిక వర్తించు
నదిపిల్ల, బెట్టి యింపారుపండ్లు
దెచ్చి యర్మిలి దాని కిచ్చుచో మేలేమి
యధిపుపుత్రున కిచ్చు; నందు, గొన్ని
వాడును మచ్చిక పచ్చి యప్పిల్లతో,
జర్లాట మాడుచు సంచరించు;

ఆ. నొక్క-నాడు దాది యొద్ద లేకుండ న
ద్దారకుండు పిల్లతల నొగిల్చి
చంపె;దానితల్లి సనుదెంచి కని మది
నిట్టు లనియె శోక మెసక మెసగ. 245

తే. అకట! కూడి మెలంగి యే మొకటియైన
నర్థి నిడియును దానును ననుభవించు,
బట్టియాడుచు నుండు; నిప్పాపజాతి,
పడుచు చంపునె యిటు దీని మిడుక మిడుక. 246

ఆ. రాచకొడుకుగాడె రాచవారికి నేటి
పరిచయంబు వేగ కరుణ విడుచు,
హితవు మఱచు;రాజు లెందు నమ్మికకు బా
త్రములె? సమదమతులు క్రౌర్యరతులు. 247

వ. అని నిందించి. 248

క. ఈపగ దీర్చెద నంచుం
గోపంబున రాజుకొడుకు గ్రుడ్డులు రెండుం
బోపడునట్లుగ గోళ్ళన్
వే పెటికి రయమున గగనవీథికి నెగసెన్. 249

వ. ఎగసి యచ్చోట నిలిచి బ్రహ్మదత్తుండు విన నిట్లనియె: 250

క. చేసె నఘము; దత్ఫలముం
జేసేతం గుడిచెఁ; గాని శిశువునెడన్ నా
చేసిన క్రౌర్యము లే; దేఁ
జేసితి మా; తొండుగీడు సెందదు నన్నున్. 251

చ. అనవుడు బ్రహ్మదత్తు 'డది యట్టిద నీదెసఁ గీడు లేదు; నీ
చనుటకు నామనం బతివిషాదముఁ బొందెడుఁ; దొంటియట్ల నె
మ్మిన నిలు' మన్నఁ; బూజని 'శమించునె యొండొరుచేతఁ బడ్డ యీ
పెను పగనొంచి మాటపస బేల్పడిక్రమ్మఱఁ జేరు టొప్పునే?' 252

వ. అనిన విని యతండు. 253

క. చేసినదానికి మాఱుగఁ
జేసినఁ బగ యంతతోడఁ జెడుఁగాక గుణుల్
డాసిన నమ్మేలు విడిచి
దోసముఁ బట్టుదురె యెట్టి తుచ్ఛులుఁ జతురా! 254

వ. అనిన నతనికి శారిక యిట్లనియెఁ: 255

క. నెయ్యము సెడినను మాటల
తియ్యఁదనము వట్టి పగ మదిన్ మఱచినఁజా
వయ్యెం జేటయ్యెఁ గలఁక
యయ్యె నొకటి మూఁడుగాక యది మేలగునే. 256

ఆ. వినుము, నేల దోఁచికొనిచను, దాయాదు
లైన, మాటమాట కేని,నాఁడు
వారి యెడను గీడు వారక చేసినఁ
బగ జనించు నిట్లు భంగు లైదు. 257

ఆ. పగయుఁ గల్గెనేని పాయునె గూఢమై
ధ్రువున నగ్ని యున్న మాడ్కి నుండుఁ;
గాన నమ్మి బేలఁ కాలాంతరంబున
నైనఁ జెడును;సందియంబు వలదు. 258

క. జననీజనకసహోదర
తనూభవుల సఖుల నమ్మఁదగ దనిన మనం
బునఁ బగ గల్గినవారలఁ
జనునే నమ్మంగ విదువు చతురవచనముల్. 259

వ. అనుటయు బ్రహ్మదత్తుం డిట్లనియెఁ: 260

కి. కాలవశంబునఁ గీడు
న్మేలును జనులకును మూఁడు;నీకును నాకున్
వాలి యని సేయవచ్చునె;
బేలనె యేనంత? యేల పెడఁబాయంగన్? 261

వ. అనిన విని శారిక యతనిమొగంబు దేఱికొనం జూచి. 262

క. విను, చల్లనిమాటలలో
మునిఁగి యలుక గుబ్బతిలు సముద్రజలములో
నన యుండి యాఁ కెప్పుడు
గనగన మనుబాడబాగ్నికరణి నరేంద్రా! 263

క. అని పలికి యవిశ్వాసము
మనమున నెలకొల్పి రాజుమాటలకుం దే
లని వెరవుతోడ నాపూ
జని దనకిమ్మైనయెడకుఁ జనియెఁ గుమారా! 264

వ. అదియునుం గాక. 265

క. 'జననాథునకు నవిశ్వా
సనిరూఢత వలయు నెల్లజనములయందుం
దనుఁ దనసిరిఁ గాచుటకై'
యని నీతులు సెప్పుదురు బృహస్పతిముఖ్యుల్. 266

-: కణికుఁడు శత్రుంజయున కుపదేశించిన
హితవచనముల ప్రకారము: -
సం. 12-138-4

వ. అవ్వాక్యంబు లాదరింప వలయు నని పల్కఁ వెండియు భీష్ముండు పాండవాగ్రజుతో సౌవీరపతి యగు శత్రుంజయునకు భారద్వాజవంశవర్యుండైన కణికుండుపదేశించిన హితవచనంబులు గలవు వానిం జెప్పెద నాకర్ణింపు మని యిట్లనియె: 267

క. వికచముఖ్యు డగుచు శాత్రవు
లకు హితులగునట్టివారలం గని భూపా
లకుఁ డెడ్డ కత్తెరయు నా
లుక బెల్లముఁ నై మనంబులుం గనవలయున్. 268

ఉ. జ్ఞాతుల నమ్మి తోడుకొని శత్రుల నోర్చి యహీనరాజ్యముం
బ్రీతి యెలర్పఁ జేకొనిన షిమ్మట సౌఖ్యసమృద్ధితోషిత
జ్ఞాతినికాయుఁడై మది సజస్రము నమ్మక సర్వసంయుతం
బై తనరారురమ్యనిలయంబున నున్నటు లుండఁగాఁ దగున్. 269

వ. అని మఱియును. 270

క. వినుము, తఱి వేచి రిపుమూఁ
పున మోవఁగ వలయుఁ; సమయముం గనికొని గ్ర
క్కునఁ గడవ శిలాస్థలి వై
చినచాడ్పున నేర్పు మెఱయఁ జెలుఁగుట యొప్పున్. 271

క. పానము జూదము వేఁటయు
మానినియును భూపతులకు మధురవినోద
స్థానము లగు; నైనను దగ
నైన విధము దక్కఁ దగుల మాపద దెచ్చున్. 272

క. విని విననివాఁడపోలెం
గని కాననివాఁడపోలెఁ గావలయు విభుం
డొనరింపఁ దలఁచినపని
కనువగునంతకు నభేద్యుఁడై జనుల యెడన్. 273

క. ఒల్లని కార్యం బాసల
నల్లన కాలగతిఁ గటపునది; కాలముచేఁ
బెల్లొదవు విఘ్నములు భూ
వల్లభునకు నెపము వెట్టవచ్చుం బిదపన్. 274

తే. బహుళమగుగర్వమునఁ గార్యభంగియును న
కార్యసరణియు నెఱుఁగ కనార్యవృత్తిఁ
గానితెరువున నడచుచున్నేని గురుని
నైన శాసింపఁగాఁ దగునంఁడు బుధులు. 275

క. తెగఁ దీర్పక తగత నార్పక
తెగటార్పక కడమ కొంత ద్రిక్కఁగ నున్నన్
జగతీశ! యప్పు నగ్నియుఁ
బగయును గడుఁ బెరుఁగుఁ గీడు వాటిల్లుఁ దుదిన్. 276

ఆ. మార్దవమున మృదువు మర్దింపఁగా వచ్చు;
మార్దవమున ఖరవిమర్దనంబుఁ
జెల్లు; మార్దవమునఁ జెల్లనియదిలేదు;
గాన మృదువ తలఁప ఖరము సువ్వె. 277

వ. అనిన విని యజాతశత్రుండు 'ధర్మంబు నవవక యవగ్రహావిపరితంబులు దుస్తర బులయిన నాహారంబులు దొరకొనయట్టిచో ద్విజాతు వేమిభంగిం బ్రాణంబులు రక్షించుకొనువా' రనుటయు నాపగానందనుండు 'విశ్వామిత్ర చండాలసంవాదంబను నితిహాసంబు గల; చది భవత్ప్రశ్నంబునకు నుత్తరం బైయుండు నాకర్ణింపు' మని యిట్లనియె : 278

-: విశ్వామిత్ర చండాల సంవాదము :-

సం. 12-199-12

క. ఏపారి తొల్లి త్రేతా
ద్వాపరములసంధి నొక్కవఱపు థరిత్రీ
తాపంబుఁ జేసె జనముల
పాపంబున వత్సరములు పండ్రెం డధిపా ! 279

సీ. ఏఱులుఁ జెఱువులు నివురఁ, గర్ననము లెం
దును జెడఁ, దరులతదులును గమర,
భూమియుఁ బసమాల గోమహిషాదిజీ
వధనంబు వొలియ, భూవరులు మేర
దప్పి లోకములోని ధాన్యముల్ గొన, నధ
ర్మం బంతకంతకుఁ బ్రబ్బ నధికు
లనదలఁ జెఱుపంగ, యాగముల్ దేవతా
పూజలు నెడలంగ భూసురప్ర

ఆ. ముఖములైన వర్ణములచొప్పు దప్ప, నా
హారరహితజనము లచట నచటఁ
బడఁగఁ జూడ ఘోరభంగిగాఁ దఱచయ్యె
డొక్కలున్నవారి కెక్కభయము. 280

వ. అట్టి సమయంబున. 281

క. మునిపతి విశ్వామిత్రుఁడు
దనయాఁకలి కెందు మెలఁగి ధైర్య మెడలి యొ
దనమాంసమూలఫలము లు
జనుల నడిగి యెందుఁ బడయఁ జాలక డప్పిన్. 282

వ. తూఁగాడుచుం జనువాఁడు ముందట. 283

చ. పసరపుఁ బెంపఁ బ్రోపులును బందులడొక్కలుఁ గుక్క గుట్టలున్
ముసుఁగువడంగ భూమితలముం దఱచారఁగఁ గప్పుచున్ మదిం
బస యొక యింత లేక పెఱ ప్రాణులనుం బొరిగొందు నెట్టి దు
ర్వ్యసనతఁ గూరియున్న వెలివాండ్రుర పల్లియఁ జేరి యయ్యెడన్. 284

వ. ఆర్తి నొంది యిట యట వోవంజాలక నేలంబడి యుండి, 'ప్రాణంబులు
వోవుట యుపేక్షింపం దగదు; ప్రాణరక్షణంబ పరమధర్మం' బని వితర్కించి
తగునుపాయంబు చింతించు వా' డప్పుడ చంపి తిత్తొలిచి గాలిగొన వైచిన
కుక్క కడిమంబుఁ గనుఁగొని. 285

క. ఇది దప్ప నిప్పు డియ్యెడ
నొదవదు ప్రాణంబు గావ నొండొకఁ డిదియున్
మది నూహింపఁగ ప్రచ్చిమి
నొదవించికొనంగ వలసియున్నది నాకున్. 286

తే. ప్రాణములు వోవ కుండంగఁ బరిహరింప
నొండుపాయ మెయ్యది యు లేకుండెనేని
ప్రుచ్చిమియు ధర్మ మగు నధమునిధనంబు
గొనుట యెందును ముఖ్యమై చనుట గలదు. 287

వ. "కావునఁ జండాలధనం బగు సారమేయమాంసం బపహరించి ప్రాణహాని
పరిహరించుకొందు"నని నిశ్చయించి యుండ నర్ధరాత్రం బగుటయుఁ జండాలు
రెల్ల నిద్రింప నల్లన లేచి చని యమ్మాంసంబు పట్టి తిగిచిన నచ్చేరువ

నిద్రించు చండాలుండు విధిసంబున మేలుకని 'నీ వెవ్వండవు ?
మాంసంబు ప్రుచ్చిలించెదవు నిద్రవోవం జుమ్ము; నిన్నుఁ బొరిగొనియెద'
ననుటయు భయంపడి గ్రక్కున నమ్మునిపతి 'యేను విశ్వామిత్రుండ' నని
పలికిన వాఁడు వినయంబున శయ్య డిగ్గి, కరుణం గన్నీరొలుకం బ్రణమిల్లి,
కేలుమొగిడ్చి, 'మహాత్మ ! నీతలంపేమి' యని యడిగిన నతండు సాంత్వన
వచనంబుల నిట్లనియె : 288

చ; దరికొను నాఁకలిం దను విదాహము పుట్టినఁ బ్రాణహానికిం
బరిహరణంబు సేఁత కిది పాపమయైనను గుక్కనంజుఁడే
భరపడి ప్రుచ్చిలించెద; విభావసుఁ డెంతశుచిత్వసంపదం
బొరసియు సర్వభక్షకతఁ బొందును నన్నును జూడు మట్లుగన్. 289

వ. అనిన విని చండాలుండు. 290

తే. 'కుక్క మృగములలో నెల్ల గుత్సితంబు;
దీనిఁ దిని ధర్మమున కేల హాని సేయ;
నొం డుపాయంబు వెదకికొ మ్ముజ్జ్వలాత్మ !'
యనుడు వానికి ముని యిట్టు లనియె నధిప ! 291

క. విను, బ్రహ్మ వహ్ని నాకుం
బెనుఁబ్రాపై యుండ నేకు వెఱతునె ప్లై
ననుఁ బోవ నీక ప్రాణము
దనువున నిల్పుటయ చూవె ధర్మం బరయన్. 292

ఆ. బ్రదికియున్ననేఁ దపంబున విద్యను
బాచికొనఁగ నేర్తుఁ బాతకంబు;
నట్టులగుట జీవితాధారమైన యీ
సంజు డిప్పు డెట్లు సమల కుడుగ. 293

చ. అనుటయు నంత్యజుండు నగి 'యట్టివిధం బధమంబు గాక నె
ట్టన యది ధర్మమే ! కిటకటా! మిముబోంట్లకు నిట్లు సేయుగా
జనునొకొ !" యన్న నమ్ముని "ప్రశస్తుఁ డగస్త్యుఁడు" దైత్యమాంసముం
దినఁడెఁ నశించెనే యతనితేజముఁ బెంపునఁ నంతనుండియున్" 294

వ అనవుడు వాఁ డిట్లనియె. 295

క. పరహితము సేయఁబూనిన
పురుషుఁడు పాపంబు సేసి పొందఁడు గీడుం
బరమమును యగునగస్త్యుఁడు
పరోపకారార్థకృతి నభవ్యం డగునే. 296

క. నావుడు మదాత్మ బ్రాహ్మణ
తావిద్వత్తాస్పదంబు దానికిఁగా నే
నీవిధి యొనరించుట పా
పావేశము లేదు దీని కడ్డపడకువే. 297

క. అని ముని వల్కిన నంత్యజుఁ
డసు 'మాంసము విడువనోప కనుటగఁ దలఁపం
జనునె భవదీయతేజో
ధనహానికిఁ గరుణ వుట్టదా యెవ్వరికిన్'. 298

వ. అనవుడు గాధినందనుండు. 299

తే. కరుణ గలవేనిఁ బ్రాణంబు గాచికొనఁగఁ
దలఁచునాకు నిమ్మాంస మి మ్మలఘుచరిత :
యట్టులైన ప్రుచ్చిమియులే; దన్యత మెడలి
పడయువస్తువు సేయదు పాతకంబు. 300

వ. అనిన విని చండాలుం డిట్లనియె: 301

క. అతిశయితపుణ్యదీప్తులు
ప్రతిగ్రహము నీచసరునిపాలం జేయన్
మతిఁ దలఁపఁ గూడునే వి
శ్రుతిగుణ! యే వెఱతు నింకఁ జూచుచుఁ బల్కన్. 302

వ. 'నీవలచినయట్లు సేయు'మని సారమేయమాంసం బిచ్చినఁ బుచ్చికొని దానం బ్రాణంబులు రక్షించుకొని విశ్వామిత్రుండు సనియె; నింద్రుడు తదనంతరంబు లోకంబులవడడేఁ వర్షించె; నంత హర్షించి యత్తపస్వి వర్యుండు దపోవిశేషంబున దోషంబు నీఁగికొని మనీషిజనస్తుత్యం బగునిత్య వ్రతంబున విలసిల్లె; నాపత్సమయసమాచారం బిట్టిద;- యని చెప్పిన భీష్మునితో భూవల్లభుండు 'ధర్మసూక్ష్మప్రకారం బింత దురవగాహం బగునే? యీ యితిహాసం బాకర్ణించుట నాడెందంబు విషాదంబు నొందె' ననవుడు నతండు 'ధర్మంబు బహుశాఖాసమన్వితంబై యుండు; రాజులకు నెల్లతెఱంగులు నెఱుంగవలయు; విషాదం బేల?' యనవుడు సజ్జనవిభుండు. 303

-: భీష్ముఁడు ధర్మజునకు శరణాగత రక్షణ సుకృతం బెఱింగించుట :-

స. 12-141-4

క. శరణాగతసంరక్షణ
పరులకు సమకూరు నెట్టిపాటిఫలము ని
ర్భరకరుణాకర పరమా
దరమున నెఱిఁగింపు నాకు దానితెఱంగున్. 304

ఆ. అనిన భీష్ముఁ డిట్టు లనుఁ: ముచికుందుండు
నాఁగఁబరఁగు ధరణినాయకుండు
దనుజమంత్రిచేత వినినది యొకకథ
యఖిలపాపహరణ మాచరించు. 305

వ. అయ్యితిహాసంబు సెప్పెద దాన సీయడిగిన యర్థంబు దెలియు నవహి
తుండవై యాకర్ణింపుము 306

సీ. పాపాత్ముఁ డొకబోయ పక్షుల వధియించి
తినియును బెక్కమ్మికొనియు నదియ
బ్రదుకుగా దానికి బహుసాధనంబులు
సవరించుకొని మహాటవిఁ జరింప
నొకనాఁడు పెనువానయును గాలియును ముట్టి
సకలజీవులకు నాశంబువుట్టు
నట్టిదియై కాన యంతయు జలమయం
బైన బెగ్గిలి యన్నరాధముండు

తే. వేగ వట్టోడి యెల్లను వెడలి మిఱుత
నొకవనస్పతిజొంపమై యున్నదానిఁ
జెంది రాతిరి యగుటయు శిలయ సెజ్జ
గాఁగ శీతార్తుఁడై యుండెఁ గౌరవేంద్ర! 307

క. అలుబ్ధకుఁ డత్తరువర
మాలోకించి కడుభక్తి ననియె 'నిచటి ధూ
తాలిం గొలిచెదఁ గరుణా
శీలత ననుఁ గాచుటకు విశిష్ట వినీతిన్ :' 308

వ. అని యిట్లప్పక్షిధ్వంసకుండు శయనంబు ప్రాపించియుండ నమ్మహీరుహంబు
కోటరంబున వసియించి యుండునది యొక్కకపోతంబు దనవల్లభ యెట
యేని మేఁతకుం బోయి రాక తడసిన శోకించి. 309

సీ. 'ఎచట నున్నది యొకొ? యింతప్రొ ద్దొక చోట
నుండునే ననుఁ బాసి యుజ్జ్వలాంగి!
యేకారణంబున నేమయ్యెనో? వాన
యేపునఁ దెగియెఁ గానోపు నకట!
యమ్మేను లేకున్న నిమ్మేనికలిమి ని

రర్థకం బధికానురాగయు క్త ;
యగుసతి గుణముల యైహీకాముష్మిక
సుఖసాధనంబులు సువ్వె పతికి ;

తే. నేమి సేయుదుఁ మందిరం బిపుడు పాడు
వాఱుచున్నది' యనఁగ నప్పలుకు లెల్ల
బోయవలలోన నున్నకపోతి విని మ
నంబు సంతోషపూరమగ్నంబు గాఁగ. 310

క. పతిమదికి నింత యెక్కి-న
యతివగదా పుణ్యవతి; ప్రియాలాపము లీ
గతి వినఁ గాంచితి; జన్మము
గృతకృత్యం బయ్యె నాకు; గెలిచితి జగునిన్. 311

వ. అని యుల్లంబునన యుగ్గడించి వతికిం దన తెఱం గెఱింగించి' 'విధిక్ర
తంబునకు వగవం బనిలే దని పలికి మఱియు నిట్లనియె: 312

చ. శరణము సొచ్చినం దగఁ బ్రసన్నతఁ గై కొని రక్షణంబు సా
దరముగఁ జేయు టత్యధికధర్మముగా బుధకోటి సెప్పు; నీ
వరసి మహార్తు వీని శరణాగతు నోపినభంగి నాపదం
బొరయక యుండఁ జేయుము ప్రభూతపుసీతునఁ గొంకు వోయెడున్. 313

క. అని యేర్పడ భాషించిన
విని శోకము డిగ్గ విడిచి విహగము గరుణం
దనజాతి సెప్పి తగ ని
ట్లనియె మనుజభాషణముల నాలుబ్ధకుతోన్. 314

క. 'ఓయన్న! డస్సినాఁడవు;
మాయింటికి నతిథివైతి; మసలక నీకుం

జేయవలయు నాతిథ్యం;
బేయది భవదీప్సితార్థ మెఱిఁగిం పవనా !' 315

చ. అనవుడు నుల్ల మెంతయుఁ బ్రియంబు వహింపఁగఁ బక్షివై రి 'నీ
తున సకలాంగకంబులుఁ బ్రతున్నము లయ్యెడు దీనిఁ బాపవే,
యనిన విహంగమంబు రయ మారఁగఁ నచ్చటిపుల్లలెల్ల ము
క్కునఁ గొని తెచ్చి ప్రోవిడి యకుంఠితమైనదయాగుణంబునన్. 316

వ. ఆపొంతపల్లియకు రయంబున జని పుల్లతల సంగతంబైన యింగలంబు. 317

క. కొనివచ్చి పుల్లప్రోవునఁ
దనుకంగాఁ జేసి నెమ్మి దళుకొ త్తఁగ ని
ట్లను బోయతోడ 'మే నీ
యనలంబునఁ గాఁచికొనుటకై లె మ్మనఘా!' 318

చ. అనవుడు వాఁడు గువ్వహృదయం బలరం దనయంగకంబు ల
య్యనలశిఖాకలాపమున నల్లన యల్లన కాంచి శీతబా
ధన ముడుగంగఁ జేయఁగఁ బదంపడి యాఁకరి సాలఁదోఁచెఁ; దోఁ
చిన నెఱిఁగించె గువ్వ కదిసేయ నుపాయము లేక యాత్మలోన్. 319

వ. వగచి వెలువెలంబాటి తలంచికొని వాని కిట్లనియె : 320

తే. ఖగములకు జీవనం బనఁ గలదె ? సంగ్ర
హించినటిది యాఁకలి కేమి యైన
మాకు దొరకొన్నఁ దిందుము గాక; యైన
నీవు డస్సితి వాతిథ్యనియతి వలయు. 321

-: కపోతంబు దన శరీరమును బోయ కాహారంబుగా నిచ్చుట :-

సం 12-142-41

వ. నాశరీరం బాహారంబుగా నిచ్చెదఁ గొనుము: 322

క. అని పలికి యగ్ని వలగొని
తనదేహము దానిలోనఁ దడయక యిడినం
గని బోయ విస్మయంబున
మనమూనఁగఁ గొంతసేపు మ్రాన్పడి యుండెన్. 323

వ. పదంపడి. 324

మ. కలదే యిమ్మెయి పౌరుషంబు జగతిం; గారుణ్య మేపార ని
ప్పులుఁ గిట్టించునె మేను? నాదుచరితంబుల్ నిందకుం బట్టులై
తలఁపన్‌వచ్చిన నింతకీ దగునె? యేతత్క్రూరతాఘోరచే
ష్టలు మానంగలవాఁడ; బక్షి గురువై సంధించె సద్బోధమున్. 325

వ. అని యంతరంగంబున వైరాగ్యంబు నిరంతరం బగుటయు నంత నిలుపక.

మ. 'ఇది యిట్లాలిని బంధులం దొఱఁగి తా నీయగ్నిలోఁ గూలె; నొ
ప్పిదమై యుండఁగ నిట్టితెంపు వెలయం బెంపారు వైరాగ్యసం
పద పాపంబుల నెల్ల ద్రుంపఁగ మహాప్రస్థానపుణ్యత్వ మొం
దెద నే నిప్పుడ' యంచు మానసము శాంతిం బొంద నిర్మోహుఁడై. 327

క. వలలోన నున్నపులుఁగుల
వెలువడఁగా విడచి వలయు వెండియుం దనకుం
గల పక్షినిహతిసాధన
ములు నచటనె యుండఁబోయె బోయ నియతుఁడై. 328

ఆ. అక్కపోతినాథుఁ డగ్నిలోఁ బడుటకు
శోకవహ్నిఁ జిత్త మాకులముగ
నెలుఁగు రాలుపడగ నిట్టని పలవించె
నశ్రుజలతరంగితాస్య యగుచు. 329

క. నాయాఁకలి కోర్వ వెపుడు;
వేయైనను నే గొనంగ వెండి యనుభవిం;
తాయాసపడుట గనుఁగొని
నోయుదు; ననుఁ బాసి యిటు సనుట దగ వగునే! 330

వ. అని వెండియు. 331

సి. ఱగురుజొంపంబుల నింపారువిరులను
బొలుపైన పొదలక్రేవలకుఁ దార్చి,
సెలయేఱులందలి తెలినీటఁ దనుపుసొం
పెలసినగిరుల తెప్పలకుఁ జేర్చి,
మావిమ్రోకల నెలదీవలఁ జెన్నొందు
తోఁటలకడ నలితోడఁ జెంది,
యలరునెత్తమ్ములకలిమిఁ జెల్వగుడిగ్గి
యలతీరభూముల నల్లఁ బొంది,

తే. నన్ను మనమునఁ దేల్చి యానంద మొందఁ
గేలి సలిపెడునీదగులీల మఱన
నావశంబె ప్రాణేశ! ప్రాణంబు లిపుడ
నిన్నుఁ గూర్చి యేతెంతు నీచన్నకడకు. 332

వ. అట్లుంగాక. 333

క. ఱేనియనుమరణమునఁ దన
మేను విడిచినట్టికాంత మేలిపదవికిం
దాను నతండును నరిగి య
నూన స్థిరసుఖము లందుచుండుట విందున్. 334

క. అని పలికి యపుడ యనలము
ఘనముగ దరికొల్పి మది వికాసముఁ బొందం
దనవల్లభుఁ దలఁచుచు వల
గొని లీలం జొచ్చి యతనిఁ గూడం జనియెన్. 335

క. స్ఫురితవిమానముమీఁద న
మరతతి వేష్టింప రత్నమయభూషణసుం
దరదివ్యమూర్తి వెలిఁగెడు
వరునిఁ గలసి పరమసౌఖ్యవై భవ మెసఁగన్. 336

తే. లీల మూరిఁబో నచ్చరలేమపిండు
బలసి యభినందనముసేయఁ బొలిచె; నిట్లు
సనిన పక్షియుగ్మంబు వర్తనము దోఁచెఁ
బుణ్యవర్తనుఁ డగుట నాబోయ కపుడు. 337

వ. తోఁచిన నతండు 338

క. ఏనును నిట్లగుదు ననుచు
నూనిన కౌతూహలమున నుల్లము వొదలన్
మేనెల్ల ముండ్లు సింపఁగఁ
గానఁ దటిసి గళితరక్తకలితాకృతియై. 339

తే. అరుగుచుండువాఁ డొకచో దవానలంబు
గట్టెదిరి కాననంబెల్ల ముట్టి మండ
సంప్రమోదితచిత్తుఁడై చకృఁ జొచ్చి
యొడలు దొఱఁగి దేవత్వంబు వడసి యొప్పె. 340

ఉ. ఈ యితిహాస మర్థిమెయి నెజ్జనముల్ వినినం బఠించిన
శ్రాయు నుదాత్తగోహననపాతకమైనను భూరిసౌఖ్యముల్

వేయివిధంబులం బొరయు; విన్ము, తగన్ శరణార్థిఁ దోషితుం
జేయనినాఁడు కల్మషముఁ జెందు; నొకప్పుడుఁ బాయ దేమిటన్. 341

వ. అని యిట్లు శరణాగతరక్షణఫలవిశేషప్రకటనం బగు లుబ్ధకకపోతాఖ్యానంబు
సెప్పిన విని యప్పితామహునిమీఁదం బ్రీతివినయవిస్తారవిలోకనం బెలయ
నప్పాండవాగ్రజుండు. 342

క. పాపంబు బుద్ధిపూర్వ
వ్యాపారము గాక తొడరినప్పుడు మనుజుం
డేపాట దానినంతయుఁ
బాపికొనంజాలు సుజనబాంధవ! చెపుమా. 343

వ. అని యడిగిన నయ్యార్యవర్యుం డాధరణీభరణధుర్యునకు నిట్లనియెఁ 'దొల్లి
పరీక్షిత్తనయుం డగు జనమేజయుం డను మహారాజు తన కబుద్ధిపూర్వక
బ్రహ్మహత్య వాటిల్లినం దత్ప్రాయశ్చిత్తంబు వాపికొనియె; నది పురాణకథయై
మునులవలన వినంబడు; న త్తెఱం గెఱింగించెద నాకర్ణింపుము.' 344

క. పాపంబు దొడరుటయు నా
భూపాలకుఁ బ్రజయు విడిచె; భూసురులును నిం
దాపాత్రంబుగఁ జేసిరి;
తాపము మదిఁ గదిరి యతఁడు తల్లడమందెన్. 345

తే. అటు జనమేజయు డు వగ నారఁగూరి
పురము వెడలి యొక్కఁడుఁడును బోయి కాన
నాంతరము సొచ్చి, శౌనకుం డనుమునీంద్రు
నాశ్రమము రోసికొని చని యమ్మహాత్ము. 346

వ. కాంచి దండప్రణామం బాచరించి, సవినయంబుగఁ గరంబులు మొగిచి నిల్చి
నం జూచి యతండు. 347

చ. పెనుఁబొల వల్చుచున్నయది; పీనుఁగుఁ జూచినయట్లు లయ్యెడున్
నినుఁ గనుఁగొన్న; నీయెడకు నీ విది యేటికి వచ్చెఁ దెక్కఁడే
జనుము; శిరంబు క్రిందుగ నజస్రము వ్రేలఁ గలాఁడ వీ భవం
బున తుదిఁ గ్రూరకాకచయముల్ దొలువన్ నరకాధివాసివై. 348

చ. అనుటయు గర్హా కర్హుఁడగునట్టి దురాత్మునిఁ బూజితవ్రతుల్
గని యిటు లంట యుక్త ;మటుగాన కదాఃభవదీయపాదవం
దన మొనరించి మీవలన దారుణపాపము వాచికొందు నే
నను మది వచ్చినాఁడ; సదయం బగు చూడ్కిఁ బరిగ్రహింపవే. 349

వ. అనిన విని కరుణాయత్తచిత్తుం డగు నత్తపోధనసత్తముం డిట్లనియెఃఁ 350

క. విను కొంద అల్పబుద్ధులు
నను నెంతయు ధిక్కరింప నవ్వఁగ వారిం
గొనక బుధులై నవిగ్రులు
ననిమిషులును మెచ్చుచుండ ననియెద నీతోన్. 351

క. హీనప్రజ్ఞుఁ డకార్యము
లైనవి సేసి తుది వగచు నతులప్రజ్ఞా
సానుమదారూఢుఁడు వగ
నూనఁడు దురిత మను వటితి కోడక యునికిన్. 352

వ. ప్రజ్ఞాకార్యంబు లైనవి యనుష్ఠింప వలయు వానిం జెప్పెద; 'నీకుం బాపంబు
నెడ ననుతాపంబు గలిగి ధర్మప్రవణుండ వైతే' యనుటయు నమ్మనుజ
నాథుండు. 353

క. తాపసవరఃతీవ్రం బగు
పాపాగ్నిజ్వాలచయము పాలుపడి పరీ
తాపము నొందుచు ధర్మ
వ్యాపారజలాభిలాషినై యున్నాఁడన్. 354

వ. 'భవదీయ కృప నాశ్రయింప వచ్చితి;నన్ను రక్షింపవే!' యనపుడు నమ్మునీం
ద్రుండు. 355

క. భీతి యొకటి గోరుటయును
నీ తలఁపులలోన దీని కిది గత మనఁగా
నేతెరువును గలుగదు మ
చ్చేతోగతి ధర్మవృత్తిఁ జిక్కుట దక్కన్. 356

క. ఆతురత నీవు నాకడ
కేతెంచినదాన: జేసి యెలసిన ధర్మ
ద్యోతనకౌతూహలమున
నీతోఁ బడవలసె వినుము, నిశ్చలమతివై. 357

క. భూవిబుధుల కెయ్యడి హిత
మావిధమున నడచు వాఁడ వగునది ద్రోహా
భావంబు ప్రతిజ్ఞాతం
బై వెలయఁగ వలయు నీకు నాజాతి యెడన్. 358

చ. అనపుడు-ధర్మవృత్తము మదాత్మకు నైజము; దోషవృత్తికిన్
మునివర: యేను భీతుఁడ; సముజ్జ్వల విప్రకులంబు నాకు మ
న్ననలకుఁ బాత్ర; మెవ్విధమునం దెగి ద్రోహము దానియందు నా
మనము దలంప దింతకును; మాన్య భవచ్చరణంబు లంచెదన్. 359

వ. అనుచుఁ దదీయపాదస్పర్శనంబు సేసి యవ్విధంబునం గృతశపథుం డగు
టయుఁ గరుణాగోచరం బగు చిత్తంబుతో నత్తపోధనవర్యుం డాదరమేదురా
వలోకనం బాభూపాలునిమీఁద నొలయ నిట్లను నట్లేనిం జెప్పెద నవహితుండ
వయి యాకర్ణింపుము: 360

సీ. శ్రీమంతుఁడును బలశ్రేష్ఠుండు నగురాజు
భోగంబు దర్పంబుఁ బోవవిడిచి

ధర్మంబు గైకొని తపమును దానంబు
నధ్యయనంబును యాగవిధులు
నాచరింపగఁ జూచి యచ్చెరువడి యను
గ్రహముసేయదె భూతరాజి యతని
కధిప! యయాతివాక్యము నర మెఱిఁగింతు
వినుము; సరస్వతియును దృషద్వ

తే. తియును ననువుణ్యనదులందుఁ దిరిగి తీర్థ
సేవ సేయుచు నధ్యయనావధాన
దాననిర్ధూతరాగత్వదయలు గలిగి
పరగఁ బాపకళంక లేపంబు వాయు. 361

వ. అదియునుం గాక యొక్క పరమస్మృతి సెప్పెద వినుము: 362

చ. దురితము సేసి తాపమునఁ దూలిన నిం కిటు సేయ నన్మతిం
బొరసిన ధర్మసంచరణబుద్ధియ మే లని యూఁదినం గ్రియా
పరుఁ డయి మేలు సేసినను బాదము పాదముగాఁ గ్రమంబునన్
విరియు సమస్తముం దదభివిష్టకళంకము నిర్భయంబుగన్. 363

చ. నరవర! వాసవుం డడిగినన్ గురుఁ డిట్లని చెప్పె బుద్ధితోఁ
బొరయని పాతకంబులు నబుద్ధికపుణ్యములన్ నశించు నం
బరమునఁ బట్టినట్టిమలపంకము గారములోన నద్దగా
విరసినయట్లు నమ్ము మిది వేదము సెప్పిన నేనుఁ జెప్పితిన్. 364

వ. అని యిట్లు బహుప్రకారంబులం గారుణికో త్తముం డగు నత్తాపసో త్తముం
డాభూవరు బోధించి తీర్థసేవాది పునశ్చరణంబుల బరిపూతాత్మం గావించి
యశ్వమేధంబు సేయించిన నుజ్జ్వలుండయి యజ్జనమేజయుండు నిజరాజ్యంబు
పరిపాలనంబు సేసె నని చెప్పి వెండియు. 365

-: భీష్ముఁడు ధర్మజునకు గృధ్ర జంబుకోపాఖ్యానము చెప్పుట: -

సం-12-149-1

సి. గాంగేయుఁ డిట్లనుఁ గౌంతేయపూర్వజు
నకు 'విదిశాపట్టణమున నొక్క-
బాలుండు మృతుఁడైన బంధులు ప్రేతభూ
మికిఁ గొనిపోయి యమేయశోక
వివశాత్ము లై పలవింపగాఁ, గద్దయొ
క్కటి వచ్చి 'మీర లిక్కడ భయంబు
దక్కి- యేడ్చుచునుండఁ దగ; దిదె క్రుంకెడుఁ
బొద్దు; రాక్షసులును భూతములుఁ బి

తే. శాచములు వ్రచ్చి తిన నిపు డేచి వచ్చు;
జననమరణముతో వింతలెఁ చన్న శిశువు
తోన యందఱుఁ జనుటకుఁ బూనియుండు
వారలెఁ పొండు పీనుంగు వైచి వేగ. 366

క. తెగిపోయినవా రేడ్చిన
మగుడుదురే? వెఱ్ఱులార! మానుఁడు; మీరుం
దెగుదురు తడసిన; నావుడు
నగు నట్టిద కర్జ మనుచు నందఱు భీతిన్. 367

వ. శవంబు విడిచిపోవం జూచిన నొక్క- నక్క- బొక్క-లోనుండి వెడలి వారల
తోడ నిట్లనియె: 368

సి. 'గ్రగ్ధ మాటల కేల కడుభీతిఁ బొందితి?
రక్క-టా! బాలుని నబ్బవదను
నిటు వైచి పోవఁ గాళ్లెట్లాడెఁ నేడ్వుఁడు
శోకంబు వోవ నిచ్చోటఁ గొంత

బ్రౌ; ద్దంతలో విధి క్రూరుండు గాకున్నఁ
బ్రాణంబు గ్రమ్మఱ రాకగల్గు
నో యెఱుంగుదురే! 'యినుండును నస్తాద్రిఁ
జేరఁడు; వెఱవక మీరు నిలువుఁ'

తే. డనిన వారును మనమున నాసపుట్టి
మగిడివచ్చిన గ్రద్ద 'యిమ్మందబుద్ధి
యైన నక్కమాటలు విననగునెఁ విక్రృత
మయ్యెఁ బీనుంగు; వచ్చునే యసువు లింకఁ 369

క. కడు బెట్టిదుండు కాలుఁడు;
మిడుక మిడుక నపహరించు; మీ రీయాసల్
విడువుఁడు: బాలునికి సుగతిఁ
బడయుఁడు దానాదులైన బహుధర్మములన్. 370

వ. అని పలికిన నాగృధ్రంబు వచనంబు లాక్షేపించి యజ్జంబుకంబు వార
నుద్దేశించి. 371

క. 'క్రూరంబు గృధ్ర మిట్టిక
మారకునిం జూచిచూచి మసలక పోవన్
మీ రెట్లోర్చెదరో క
న్నీ రిటు ననుబోఁటులకును నిలువ కొలికెడున్. 372

క. దయమాలి పోవనేటికిఁ ?
బ్రయత్నమునఁ బొదువ దైవబలమున మీకుం
బ్రియమెసఁగ బ్రదుకు; బ్రదుకం
డయినను మఱి పోవరాదె' యని చెప్పుటయున్. 373

వ. గ్రద్ద యిట్లనియె : 374

ఆ. ఏను బుట్టి వేయునిన్నాఱుమన్నాఱుఁ
గలవు వత్సరములు; గాన నెందు
బాలు యౌవనస్థుఁ బ్రౌఢుని వృద్ధునిఁ
జచ్చిపోయి మగిడి వచ్చుచాని. 375

క. ఒకటి గలదు; వత్తురు వే
ఱొకగర్భంబునకు మృతులు; నుక్కఁవ మౌ న
క్కకు నేటిబుద్ధిఁ పీనుఁగు
నకు బ్రదుకఁ బె గలుగుఁ నిట్టినవ్వులు గలవే? 376

సీ. అనవుడు నెగవెక్కఁ యాబిడ్డ వై చిపో
యెడువారలకు నడ్డపడుచు నక్క
'విసుఁడు, రాఘవుఁడు నేర్పున బ్రదికింపఁడే
మృతుఁడై న భూసురసుతుని మగుడ;
స్యఁజయుకొడుకు సచ్చిన నారదుఁడు ప్రభా
వంబునఁ గ్రమ్మఱ వానిఁ దేఁడె;
యట్టుల యొకసిద్ధుఁ డమరుండు మీయేచ్ఛ
లాలించి దయ బాలునసువు లొసఁగె

ఆ. నేని మేల కాదెఁ యిది యేల పోయెద?'
రనిన వారు మగిడి యరుగుదెంచి
శిశువు శవముచుట్టుఁజేరి పె ల్లేర్చిరి
పనవి పనవి యంత నినుఁడు గ్రుంకె. 377

వ. ఆ గృధ్రంబును జంబుకంబును నాఁకలిచేత వందురుచుండి తాన తాన బాల
శవంబు నాహారంబు గొనుటకై యివ్విధంబునం దమతమ పల్కనేర్పున
నజ్ఞనంబుఁ గ్రమ్మఱించెఁ; బ్రొద్దుగ్రుంకినం దా నచ్చోట నిలువనేరదు
గావున గ్రద్ద యటమున్న వారు వోపునట్టితెఱంగు మాటలాడె; రాత్రియైనం
దనకు మేలు గావున నక్క వారలు దడయుటకుం దగినవచనంబు జెప్పెఁ; నది

వానితెఱంగు ప్రేతవనవిహారనిరతుం డగు శంకరుండు కరుణాకింకరుం
డగుట నప్పుడు. 378

ఆ. అట్లు పనవి యేడ్చు నజ్జనంబునకు ప్ర
త్యక్షమై వరంబు లడుగుఁ డనిన
సంప్రమోదభ క్తి సంభ్రమభరితులై
చక్క నవనిఁజాఁగి మ్రొక్కి వారు. 379

క. బాలమరణశోకంబునఁ
దేలక యుండంగఁ గావు దేవో త్తమ! నీ
వాలించిన బ్రదికితిమి ద
యాళుహృదయ! పార్వతీప్రియా! చంద్రధరా! 380

వ. అనుచు లేచి నిలుచుటయు శివుం డాశిశుప్రాణంబు లొసంగి, వీఁడు శతా
యుస్సంపన్నుండగువాఁ డని యానతిచ్చి, యాగృధ్రజంబుకంబులకు
నాఁకలి యెన్నండును లేకయుండం బ్రసాదించి యంతర్హితుం డయ్యె; సంతో
షంబున నంతరంగబు నంగంబులుం బొదల నజ్జనంబులు బాలు నెత్తికొని
పలుమఱుం జూచుచుం గౌఁగిలించుచుం జనిరి; గృధ్రంబును జంబుకంబును
ముదంబునం బొంగుచు బోయి తమతమకులంబులలోఁ బ్రభూతంబులై
ప్రవర్తిల్లె; నార్తజనబాష్పప్రమార్జనంబు ప్రభువులకుం గర్తవ్యం బగుటకును
నిజకార్యార్థ లగు కపటుల నేర్పుమాటల తెరువు లెఱింగికొనుటకును నుదా
హరణంబైన యీగృధ్రజంబుకోపాఖ్యానంబు. 381

క. వినినఁ బఠించినఁ బ్రాసిన
గొనియాడిన దురిత కీడకుం దొలఁగి నరుం
డనుపమధర్మసుతకు భా
జన మగు; నాయుఃప్రవృద్ధి సంపద నొందున్. 382

—: భీష్మోఁడు ధర్మజునకు బవనశాల్మలీతరుసంవాదంబు సెప్పుట :—

సం. 12-150-1

సీ. అని వినతుం డగు నాధర్మసుతునకు
ముదమునఁ జెప్పి భీష్ముండు మఱియు

నిట్లను నిది యొక్కయితిహాస మధిప! యా
కర్ణింపు; హిమవన్నగంబునందుఁ
గల దొక్క బూరువు గడుఁ బెద్దకాలంబు
ముదురు శాఖాశోభిమూలదృఢము;
నారదముని యొక్కనాఁడ త్తరువుపొంతఁ
జనిచని వేడ్క నిట్లనియె నెమ్మి

తే. 'బూరువా! యింతవటపును బొడవుఁ గల్గి
నీవు మృగపక్షిసంశ్రయణీయ మగుచు
నునికి గని ప్రీతి నడిగెద ననిలుచేతఁ
బడు నొకప్పుడు తరులు; నీపడమి యెట్లు? 383

క. పవనునకును నీకును బాం
ధవము గలదొ? యతఁడు నిన్ను దయ రక్షింపన్
సవినయవృత్తిని బ్రతికితొ?
చెపులకు నిం పెసఁగ నిజము సెప్పుము నాకున్. 384

క. అనిన విని బూరు విట్లను:
'ననిలుని జల మస్మదీయమైన బలముతో
నెనగ; దేర్పడ విను. పదు
నెనిమిది యగునంశమునకు నెనయ దరయఁగన్.' 385

వ. అని పలుకుటయు నమ్మునీంద్రుండు. 386

ఆ. 'అమ్మ చెల్ల! యిట్టు లనకుము; కొండలు
లోనుగాఁగఁ బవనుచే నపాస్త
మహిమ లగుట యెఱుఁగుమా! భూతములు చేష్టి
తములు వాయువశగతములు గావె.' 387

క. అనుటయుఁ బెలుచని యెలుఁగున
'ఘనమూలప్రబలశాఖికాదుర్జయు న
న్నును దాఁకిన నతని ప్రభం
జనుఁ డను నామంబునకు నసత్యత వచ్చున్.' 388

వ. అని గర్వంపుమాట లాడిన యాశాల్మలిం జూచినురమునిప్రవరుండు. 389

చ. 'మఱవక యుండు నీబిరుదుమాటలు నీ విటు లంట; మారుతుం
డెఱిఁగెడు నెట్లు' నంచు వెస నేఁగి సమస్తముఁ జెప్ప నాతఁ డే
డ్తెఱఁ జనుదెంచి 'నీ వటె కడింది మగండవు; నిన్నుఁ దాఁకినం
జెఱుతటె పేరు; బూరుగ నశించితి గా కిట పల్కఁ లేటికిన్?' 390

మ. అని కోపంబునఁ బల్క నప్పవనుతో నాభూరుహం 'బింత పె
ల్చన నీ వాడెడునంతతక్కువనె? బేలా! లోకసామాన్యవృ
క్షనికాయంబును నన్ను నొక్కటిగ నిచ్చం జూచితే?' యన్న న
ల్లనిన వ్వాప్పఁగ నాసమీరణుఁడు హేలాస్ఫారుఁడై యిట్లనున్. 391

క. 'ఒకనాఁ డజుండు నీనీ
డకు డబ్బా టరుగుదెంచుటయు నమ్మేలా
త్మకు వ్రేఁగై మన్నించిన
మెకమెక పడి; తిట్ల పలుకుమీ తగ రేపున్.' 392

వ. పలికి బలుమొగంబుతోడఁ బోయిన నబ్బారువు దలంకి. 393

చ. 'మనుగడ దప్పునొక్కొ మునిమాటలు గై కొననైతి; నాబలం
బన నదియెంతఁ యుగ్రత మహాబలురాకకు నోర్వఁజాల; నా
తని నొకభంగి గెల్తు'నని దాఁ దలపోసి హరించె నాకులుం
గొనలును జొంపముల్ నిడుదకొమ్మలు రే యగుడున్ భయంబునన్. 394

వ. అట్లు తన్నుం దాన విఱుచుకొని యున్నంత పేగుటఁము. 395

చ. ప్రతినకు నీడుగా భయదభంగిఁ బ్రభంజనుఁ డేఁగుదెంచి యా
క్షితిరుహముం గనుంగొని 'యిసీ! యిది నాపని నీవ చేసి; తీ
ధృతిమతి సంతసింపు; మిఁట తేజముఁ బొందుము! నీదుబాంధవ
ప్రతతికి నిర్విఘంబు సదుపాయము మే లెఱిఁగింపు పెంపునన్.' 396

వ. అని యుల్లసంబాడి సముల్లసద్గతినాసదాగతి సనియె; నట్లు శాల్మలి పవను
చేత భంగంబునొంది వగంగుందెఁ; బ్రబలునితోడ దుర్బలుండు దొడరి మత్సర
గ్రస్తుం డయిన నపాస్త విభవుం డగు నని తెల్పు నప్పవనశాల్మలీసంవాదంబు
పుణ్యప్రదం బయిన యుపాఖ్యానం బని చెప్పిన. 397

ఆ. పాండవాగ్రజుండు 'పాపంబునకు నధి
ష్ఠాన మెద్ది భరతసత్తమాగ్ర
గణ్య! దాని నెఱుఁగఁగాఁ జెప్పు' మనుడు నా
తనికి భీష్ముఁ డిట్టు లనియెఁ బ్రీతి. 398

సీ. వినుము, పాపముల కెల్లను నధిష్ఠానంబు
లోభంబ;యది కామలోలతయును
క్రోధంబు మత్సరద్రోహంబులును బర
ధనదారవాంఛలు వైన్యపాటు
వ్రీడాక్షమాసత్యవిముఖభావంబును
గలిగించి ధర్మంబు గలఁచి నరునిఁ
బ్రయామాలి యేమిటికయినను గర్దించు
వానిఁగా సమకట్టుఁగాన లుబ్ధ

ఆ. జనులఁ దొఱఁగి లోభ మను తిరింబడనిస
త్యవ్రతులను బరమధార్మికులను
బాపభీతమతులఁ బనిగొను; లోభంబుఁ
జెందనీకు సీదు చిత్తవృత్తి. 399

వ. అనిన విని యజాతశత్రుం 'డజ్ఞానం బాపదలకును దుర్గతికిని మూలం జని
విందు; దాని తెఱం గెఱిఁగింపు'మనిన నాపగాతనయుం డమ్మనుజపతి కిట్ల
నియె: 400

క. రోషము శోకము రాగ
ద్వేషము లభిమానదర్ప వేగాలస్యా
శ్లేషము; లజ్ఞాన మని మ
నీషిజనము సెప్పు మాననీయచరిత్రాఁ! 401

క. విను, లోభము నజ్ఞానం
బును సద్యశఫలప్రదముల; పుట్టును లోభం
బున నజ్ఞానము; గావున
జననాయకఁ! లోభ ముడుగ సౌఖ్యము లొందున్. 402

ఆ. అనిన, ధర్మపుత్రుఁ 'డనఘుఁ! ధర్మంబు నా
నా ప్రకారగతి వినంగఁబడు మ
దీయచిత్తమునకుఁ దేటపడంగ వి
శిష్టధర్మ మెద్ది సెప్పు' మనుడు. 403

వ. ప్రియంబంది భీష్ముం డతని కిట్లనియె: 404

-:భీష్ముఁడు ధర్మజునకు దమంబు ప్రభావం బెఱింగించుట:-

సం. 12–154-6.

క. తమతమ కలవడువిజ్ఞా
నముల తెరువు లాదరించి నానాగతులన్
సుమతులు ధర్మము దెలిపిరి;
దమము పరాయణము ధీరతమ! యన్నిటికిన్. 405

తే. దమము నిశ్రేయసము పుణ్యతమము ధర్మ
సార; మది వెలిగా ధర్మసంచయంబు
సిద్ధిఁ బొందునె? దమముతో బుద్ధి పొందు
గనినఁ బొందనియున్నతుల్ గలవె యధిప! 406

క. దమముం గడచిన సద్ధ
ర్మము లే దని విందు నాశ్రమము లన్నిటికిన్;
దమవంతుఁడు గామము గ్రో
ధము లోభము మత్సరంబు దర్పము గెల్చున్. 407

క. శీలంబు మైత్రి కరుణ య
లోలుపభావము తితిక్ష లోనగు మునిలో
కాలంబనీయసద్గుణ
జాలంబు దమంబు రూపసంపద యధిపా! 408

.క గుహయందు నిహిత మనియెడు
మహనీయబ్రహ్మపదము మహితదమత్వో
పహితుండగువానికి స
న్నిహితం బని చెప్పుదురు మనీషిజనంబుల్. 409

వ. అని విశదంబుగా వివరించె. 410

ఆ. అట్లు దమము మహిమ యాదరంబువ విని
యమృతసేవ సేసినట్లపోలె
హర్షమయమనస్కుఁడై భీష్ము నడిగె నా
ధర్మనందనుంతు దపము విధము. 411

వ. అడిగిన నతం డతని కిట్లనియె: 412

—: భీష్ముఁడు ధర్మజునకుఁ దపంబు విధము సెప్పుట :—

సం. 12-155-1

క. తపము నిదానము ధర్మ
ప్రపంచమున కెల్ల; దానిఁ గ్రమమున ప్రతతం
ప్రపరాయణు లొనరింతు ర
ధిపఁ ఫలమూలాంబువృత్తిఁ దృప్తిఁ బొరయుచున్. 413

క. విను, మశసనిగ్రహము దప
మను నభిధానంబు గల మహాధర్మము త
ద్ధనవంతుచిత్తవశగతిఁ
జను నఖిలస్థావరములు జంగమతతులున్. 414

తే. పంచవిధవృత్తు లగు మహాపాతకములును
లోనుగాఁ గిల్బిషము లెల్ల లుంఠితంబు
లగుఁ దపంబున సత్యశౌచాదు లొలయు,
నఖిలసిద్ధులు నఱచేత నావహిల్లు. 415

వ. అనిన విని 'దేవపిత్భూదేవగణంబులు సత్యంబు ప్రశంసించుఁ; దదీయ స్వరూపంబును, నది దొరకొను తెఱంగును నెఱింగింపు' మని యడిగిన నజాతశత్రునకు శంతనుపుత్రుం డిట్లనియె: 416

—: భీష్ముఁడు ధర్మజునకు సత్య స్వరూపాదులు సెప్పుట :—

సం. 12-156-3

క. సమతయు దమముఁ దితిక్షయు
నమత్సరము హ్రీయు ధృతియు ననసూయార్య
త్వములు నహింసాదాన
క్షమాత్యజనసూనృతములు సత్యము మూర్తుల్. 417

క. సత్యాకృతులగుగుణములు
నిత్యానుష్ఠితసమగ్రనిర్మలయోగ
స్థిత్యభిముఖునకు సులభము
లత్యంతసుఖప్రదంబు లవి కార్యంబుల్. 418

చ. కుదురు సమస్తధర్మములకున్ వినుసత్యము; యోగమోక్షస
త్పదములు సత్యకార్యములు; పాప మసత్యముకంటె నొండు లే
దు; దలఁప నశ్వమేధములు దొమ్మిదినూఱులు వెండి నూఱునై
యొదవిన నీడుగావు భరతో త్తమ! సత్యముతోడ నారయన్. 419

వ. అనిన విని ధర్మతనయుం 'డరిషడ్వర్గం బేమిట నుదయించుఁ నెట్లు సమయు;
నెఱింగింపవే' యనుటయు ననిమిషనదీనందనుండు ధర్మనందునున కిట్లనియె:
420

—: భీష్ముఁడు ధర్మజున కరిషడ్వర్గాదులు దెలుపుట :—

సం. 12-157-3, 4

సి. మనుజేంద్ర! సంకల్పమునఁ బుట్టు గామంబు;
రూపము దేహనిరూపణమునఁ;
బరులదోషంబునఁ బ్రభవించుఁ గ్రోధ; మ
క్షీణక్షమాయుక్తిఁ జేసి పొలియు;
భూతాస్థిరత్వంబు బుద్ధిఁ గానమి లోభ
మనఘ! జనించుఁ, గాంచిన నడంగు;
నజ్ఞానమున మోహ మావహిల్లు నధర్మ
లేపవర్జమున లేకతక్కుఁ;

తే. గులమునను విద్య; ధనమునఁ గలుగు మదము;
మరలి వానిపెం పూహింప ద్రుందిపోవు;
సాత్త్వికుఁడు గామిఁ బొదము మాత్సర్య మిదియుఁ
జెడుఁ గురూత్తమ సాధుసంసేవనమున. 421

క. ఈయాటింటను సకలా
పాయంబులు మానవులకుఁ బాటిల్లు; వీనిం
బాయఁగ జడియగ నోపిన
ధీయుతునకు శుభము సద్గతియు సమకూరున్. 422

క. ఇవి దోఁడేఁబలభంగి
గనియుఁ బురుషధైర్యహానిఁ గనుగొని; ధైర్యం
బవలంబించిననరుఁ జే
రవు; వీనికి నిదియ తెఱఁగు రాజవరేణ్యా! 423

తే. అధిప! యివి ధార్తరాష్ట్రిలయందు జాలఁ
గలిగియుండు; నీబుద్ధి నొక్కఁడుఁ జొరదు;
సారధీరతాసంప దుదారమతివి
గాన యింకను నిర్జింతు వీనినెల్ల. 424

వ. అని వెండియు. 425

క. హింసావిహారియైన నృ
శంసుఁ డీయాఱుఁ గలుగు జనుకంటెను గీ
డంసప్రదేశలలితో
త్తంసీకరణోపలాల్య ధరణీవలయా! 426

క. మే లనుభవించుఁ జుట్టము
లాలోకింపఁగఁ గుజనుఁ డదియు నృశంసా
శీలమ పంచి కుడుచు నటఁ
డేలోకంబునను బేర్మి యెసఁగ సుఖించున్. 427

వ. అని చెప్పి వెండియు. 428

ఆ. విను, కుటుంబభృత్యజనజీవనంబుఁ ద్రి
వర్షములకుఁ గల్గు వాఁడు నధిక

మొదవినట్టి యతఁడు నుర్వీశ! యర్హులు
మాననీయసోమపానమునకు. 429

క. క్రతువు లొనరించు భూసుర
తతికిఁ గ్రియాశేషయోగ్యదానాదులు దు
ర్గతిఁ గొఱఁతవడిన ధరణీ
పతి నెఱపఁగవలయు వానిఁ బరికించి తగన్. 430

క. ధనధాన్యపశుసమగ్రుం
డనఁ బరఁగెడునట్టి వైశ్యుఁ డధ్వరముం జే
యనినాఁడు బ్రాహ్మణాధ్వర
మునకు నతనిసొమ్ము రాజు పుచ్చి యిడఁ దగున్. 431

క. కుడువక పెట్టక శూద్రుఁడు
కడునెక్కుడు గూర్చినట్టికనకము గొలుచుం
బుడమిపతి ధర్మకృతులకు
నిడునది సగముగొని మేదినీశ్వరవర్యా! 432

క. విను, విప్రులు పేద లగుట
మనుజేంద్రుని బుద్ధిలేమి; మాతాపితృభా
వన నతఁడు వారిఁ బ్రోచినఁ
గను మేలునకెల్ల గలదె కౌరవనాథా! 433

క. ఆమద్రవ్యము మణియును
రామయు శుచు లగుటఁగాదె రామారత్నా
రామత దగవగు దుష్కృ-ల
మై మెచ్చమి దోఁచెనేని ననిరి మునీంద్రుల్. 434

క. అమృతము విన్యయుఁ బరమహి
తము సేయుటఁ బుచ్చికొండ్రు దానిని దానిన్

సుమతులు విషమువలననై
న మహీశ్వర! సీచమగుజనమచే నైనన్. 435

క. భూపాలక! విను పంచమ
హాపాతకకరులుఁ బతితు లక్కొడులు ప్రా
ణాపాయాంతప్రతిక్రితిఁ
బాపుదు రత్యధికపుణ్యపరతను బాయున్. 436

క. యానాసనాన్నపానవి
ధానాదులఁ బతితు బెరసి తాఁ బతితుఁ డగున్
మానవుఁడు దహోముఖధ
ర్మానుష్ఠానములఁ బాచు నక్కల్బిషమున్. 437

క. అన్యతము పాతక మగు; నై
నను వనితల యెడను, బెండ్లి, నవ్వున, మృతి వ
చ్చిన, సర్వధనముఁ జెడుచో,
విను, మది పాపంబు గాదు విమలచరిత్రా! 438

క. ఏపాపమేని లేనిది
కాపురుషత నొకనిమీఁదఁ గలిగించిన న
ప్పాపము సేసినవాఁ డగు
నాపొలువ యనంగ విందు మార్యులచేతన్. 439

ఆ. తల్లిఁ దండ్రిఁ బాయఁ దగ దకారణమునఁ;
బాసెనేని వాఁడు పతితుఁ; డాస
నంబు సెజ్జ భోజనము చీర వటుకుమా
రులకుఁ బ్రీతి నొసఁగఁ బొలియుఁ గీడు. 440

వ. అనియె నట్టియెడం గృపాణరణనిపుణుండగు నకులుండు సకలాస్త్రశస్త్ర
సారవిశారదుండై న యాబ్భాగీరథీసుతునకు సవినయంబుగాఁ బ్రణమిల్లి,'ధను

వృత్తమాయుధం బని చెప్పదు; రది సర్వజనసమ్మతంబు; ధనువునకు బాణంబు లకు వైకల్యంబు వాటిల్లినయెడం బరవీర ప్రహరణంబునకు నాత్మత్రాణంబు నకుం గృపాణంబు మేలని యుండదు;నాతలం పెట్టిదియో తెలిసికొనవలయు; దత్ప్రభవ ప్రభావంబులుం దదీయపూర్వాచార్యునిం జెప్పవే'యని యడిగిన; 441

-: భీష్ముఁడు నకులునకు ఖడ్గప్రభావంబు తెలుం గెఱింగించుట :-

సం. 12–160–9

సీ. అతనికి నాతఁ డిట్లను: బ్రహ్మ జగములు
సృజియించి భూతసంస్కృష్టి సేయ
దివిజమర్త్యాదిజంతువు లమ్మహాత్ముని
ధించినతెరువులఁ దిరిగి బ్రదుకు
చుండ, దైత్యులు సమృద్ధంబత నన్యాయ
వర్తులై సురమునిప్రాతములకు
బాధ లొనర్ప నప్పరమేష్ఠి హిమశైల
తటమున వేయివత్సరము లధిక

తే. నియతిమెయిఁ దప మొనరించి నిష్ఠఁ గ్రతువు
సేసె; నయ్యగ్నిఁ బుట్టె నశేషలోక
భీతికర మగు నుగ్రంపుభూత మొకటి
ప్రాంశుకృష్ణమై దంష్ట్రిలు ప్రజ్వరిల్ల. 442

ఆ. అప్పు డినుఁడు మాసె, నసిలుండు సుడివడి
వీచె, నుల్క లురలె వెఱఁదలంకు
సురల మునులఁ జూచి సరసిజభవుఁ డిది
నాదుమతమ యొండు గాదు వినుఁడు. 443

వ. ఇది 'రాక్షసనాశనంబునకుం దోఁచినయుత్పాతంబు; లోకంబుల రక్షింపను రాక్షసుల వధియింపను సాధనంబుగా ఖడ్గంబుఁ గల్పించితి'నని వలుక నా

భూతం బారూపంబు విడిచి ఖడ్గాకృతి గైకొని తనమెఱుంగులు దిక్కుల దీ
టుకొనం బొల్చిన. 444

క. కమలాససుండు నిజచి
త్తము భక్తిమయుంబుసేసి తలఁచె హరుని; ఘా
లము కంటిమంటతో న
య్యమరవరదుఁ డేఁగుదెంచె నచటికి నెమ్మిన్. 445

ఉ. వచ్చినఁ దత్పదాంబురుహవందనపూర్వముగాఁగఁ బద్మజుం
డిచ్చెఁ గృపాణ; మవ్విభుఁ డహీనసముద్యమలీలఁ గ్రాలుచుం
బుచ్చికొనంగ నాసభ యపూర్వమనఃప్రమదంబుతోడి పే
రచ్చెరువాటు నొందె; నటు లయ్యసిఁ గైకొని మేను వెంచుచున్. 446

తే. హరుఁడు బెట్టుగ నవ్వి పెల్లార్చుటయును
విని సముద్ధతరయమున దనుజకోటి
మునుగఁ బఱతెంచి తాఁకిన మునుముకొని వ
ధించి యిలయెల్ల నెత్తుట ముంచె నతఁడు. 447

ఉ. దైత్యుల నిట్లు గీ టడఁచి ధర్మము నిల్పి ప్రసన్నమూర్తిసాం
గత్యము నొంది యప్పరమకారుణికుండు త్రిలోకరక్షణా
దాత్యమునన్ వెలుంగుహరిఁ దద్దయు వేడుకఁ బిల్వఁబంచి సం
ప్రీత్యభిరాముఁడై యొసఁగెఁ బెంపుగ నమ్మహనీయఖడ్గమున్. 448

వ అట్లొసంగినం గైకొని దుష్టదమనం బాచరించుచు నుండెడు; నవ్విష్ణుండు మహోగ్రరూపం బగునయ్యాయుధంబు పదంపడి మరీచి కొసంగె; మరీచి భార్గవునకు, భార్గవుం డనేకమనులకు. మను లింద్రునకు, నింద్రుండు లోక పాలురకు. నొసంగెఁ; గ్రమంబున మనుప్రభృతులైన మానవేంద్రులు వడసి నిజసంతతికి నిచ్చుచు వచ్చి; రందు దుష్యంతుండు భరతున కిచ్చె, నాభరతు వంశంబునందు ఖడ్గసంప్రదాయంబు గలిగి వచ్చె; నొకమని యనుగ్రహింప ద్రోణుం డధిగమించి కృపున కిచ్చెఁ; గృపునిచేత మీరేవురుం బడసితిరి; విశే

షించి యీవిద్యయందత్యంతాదరణవంతుండ వగుటంజేసి దీనివలన వెలసితివి; నిస్త్రింశంబునకు నక్షత్రంబు గృత్తిక; యగ్ని యధిదేవత; గురుండు రుద్రుం' డని చెప్పి వెండియు నిట్లను 'నసి విశసనంబు ఖడ్గంబు తీక్ష్ణధారంబు దురాసదంబు శ్రీగర్భంబు విజయంబు ధర్మపాలంబన నెనిమిదిపూజ్యనామంబులం బరఁగి కృపాణంబు ప్రహరణంబులలోనం బ్రధానంబై నెగడుచుండు. 449

క. సుమహితమగు నీఖడ్గా
గమమగుపుణ్యకథ వినఁగఁ గాంచిన పురుషుం
డమితయశంబును నధిక
ప్రమదంబును సద్గతియును బడయుఁ గుమారా!' 450

క. అని యిట్లు నకులునకు భీ
ష్ముని చెప్పిన కథ సుచిత్తమున విని కుంతీ
తనయాగ్రజుండు పురికిం
జనియెడు ప్రొద్దగుడు వినయసంభృతుఁ డగుచున్. 451

వ. సముచితంబుగా నమ్మహాత్ముని వీడ్కొనిచని యోగ్యవర్తనంబు లాచరించి వినోదగోష్ఠి నుండి విదురునిం దనతమ్ముల నుపలక్షించి 'ధర్మార్థకామంబుల యం దుత్తమ మధ్యమాధమత్వనిరూపణంబు సేయుఁడు చూత' మని పల్కిన నవ్విభునకు విదురుం డిట్లనియె: 452

-: ధర్మజునితో విదురాదులు ధర్మార్థకామంబుల
తారతమ్యంబు సెప్పుట :-
సం. 12-161-4

క. 'విను, ధర్మంబున ధన మగు,
ధనమున సిద్ధించుఁ గామతంత్రం, బటు గా
వున మధ్యమంబు నధమము
ధనకామము; లుత్తమంబు ధర్మం బధిపా!' 453

చ. అనవును బార్థుఁ డిట్టులను 'నర్థము మూలము ధర్మకామవ
ర్తనముల కట్టు గాకయు విరక్తత నొంది జటాదిధారణం
బునఁ జరియించువారికిని భూవర! యర్థము దేహకృత్యసా
ధన; మసురేజ్యకణ్వులను దానిన మే లని పూని చెప్పరే.' 454

వ. 'కావున నర్థంబు ప్రధానం' బనుటయు నకులసహదేవు లేక వాక్యతనిట్లనిరి: 455

తే. అర్థధర్మంబు లితరేతరాశ్రయములు;
గాన వానిలో నొకఁ డూఁదు మానవేంద్రు
జగము వోలఁ బుచ్చసంభృతార్థుఁ
డై నవానికిఁ గామ మప్రాప్య మరయ. 456

క. తమలో సరి ధర్మము న
ర్థము; నర్థంబునకుఁ గామతంత్రము ఫలరూ
పము; గావున నప్పురుషా
ర్థమునుం గొనియాడవలయు ధరణీనాథా! 457

వ. అనిన విని పవననందనుం డిట్లనియె: 458

క. దధిసారముచందంబున
నధిపా! ధర్మార్థసారమగు కామరసం
బధమ మనుతలఁపు సుఖసం
విధానబాహ్య మని నీవివేకమ యెఱుఁగున్. 459

క. విను; మిల యలరునఁ దేనియఁ
గొనుగతి నత్యంతసుఖము గొననగుఁ గామం
బున; నధికసుఖము లొందని
జనుసిరి దాఁ గొల్చు లేని సస్యమ కాదే! 460

తే. అనఘ! ధర్మార్థకామంబులందు నొకట
నర్థిఁ దగిలినమానవుం డధముఁ; డొకటి

మాని వర్తించునాతఁడు మధ్యముండు;
నడపు నన్నిఁటి నుత్తమనాయకుండు. 461

క. అని యిట్లందఱుఁ జెప్పఁగ
విని చిఱునవ్వున ముఖారవిందము చెలువం
బినుమడిగా ధర్మజుఁ డి
ట్లను వారలఁ గలయఁజూచి యాపర మెసఁగన్. 462

వ. ఏ నడిగిన తెఱంగునకు విదురునివాక్యంబు సిద్ధాంతంబు; దక్కఁటివారివచనం
బులు నొక్కొక్కమెయి నాదరణీయంబు; లది యట్లుండె; నామంతంబు
వినుఁడు: 463

క. భూతములు జరామరణో
పేతంబులు గాన మోక్ష మెదఁ గోరుట మే
లాతతవర్గత్రయసం
జాతమనోదుఃఖభారసహుఁ డగుకంటెన్. 464

వ. అని గోరిన దొరకొనునే యందుమేని. 465

క. మనమున ధర్మము నర్థం
బును గామముఁ గీలుకొనక పొరపొచ్చములై
చన సుఖదుఃఖంబుల మద
మును దైన్యముఁ బొందకునికి మోక్షకర మగున్. 466

వ. అనిన విని వారలందఱు నభినందించిరి; మఱునాఁడు నదీనందనుం గొలిచి
యుండి ధర్మనందనుండు 'నరపతులకు వలయువారును వలవనివారును
నెట్టెట్టివా'రని యడిగిన నమ్మహాత్ముండు నమ్మహీపతి కిట్లనియె: 467

ఉ. లాలిమిఁ బేర్చువారలును ధర్మనిధిజ్ఞులు సత్యవంతులున్
లోలత లేనివారు మదలోభనిరర్థకకోపహీనులు

స్నిలసమేతులుం బలుక నేర్చుట కార్యము కాన్పు పెంపుమైఁ
జాలుట గల్గుభృత్యులును సంపద సేయుదు రాత్మభ ర్తకున్. 468

ఉ. క్రూరుఁడు లోభియున్ శఠుఁడుఁ గొండియుఁడున్ జడుఁడుం గృతఘ్నుఁడున్
నేరనివాఁడు బొంకరియు నిందకు నోర్చునతండుఁ బంచయున్
ధీరతలేమి దుర్నయమతివ్యసనత్వము గల్గువారలుం
జేరువ నున్క భూపతికిఁ జెట్ట యొనర్చు నరేశ్వరో త్తమా : 469

క. ఒప్పనిగుణములఁ బరఁగెడు
నిప్పురుషాధములలోన నెల్లఁ గృతఘ్నుం
డొప్పడు గడు; నిట్లగుటం
జెప్పెడు నితిహాస మొకటి సెప్పెద నధిపా : 470

వ. అది కాశ్యపగౌతమాఖ్యానం బనం బెద్దలగోష్ఠిం బ్రవ ర్తిల్లు. 471

-: భీష్ముఁడు ధర్మజునకు నాడీజంఘునిచరిత్రంబు సెప్పుట :-

సం. 12-162-281

చ. విను మొక బ్రాహ్మణుండు కులవృ త్తము పెంపుఁ దొఱంగి బోయెదా
ని నొకతె నాలిఁ జేసికొని నెమ్మిఁ గిరాతులఁ గూడి వేఁటకుం
జనుఁ దిన మాంస; మద్దురితస క్తుఁడు భోగపరుండు గావునన్
ధనము ఘటింపఁగాఁ దగు విధం బని చూచి వణిగ్జనంబుతోన్. 472

వ. చెలిమి చేసి కొందఱు కోమట్లు బేహారంబు వెంట దేశాంతరంబునకుం జనఁ
దానును వారితోడం గూడి పోవం బోవ గిరిగహనదుర్గమస్థలంబున నొక్క
వనగజంబు. 473

ఆ. సాతులోని కుటికి జనముల నున్మద
లీల నేలఁబెట్టి కాలఁ జమరఁ

జొచ్చుటయును భీతి విచ్చి నల్దిక్కులఁ
బఱచి రెల్లవారుఁ బటురయమున. 474

క. అయనయుఁ గాంచిశీకుం
డై యుత్తరదిక్కు వాఁ తె సతిదూరముగా
నాయెడ నొకమార్గము గని
పోయెను దాను నటపోవఁ బోవం గెలనన్. 475

తే. పొదలతఁచున జొంపమై పొడవు బఱపుఁ
గలిగి వ్రటువఁదనమునఁ జెలుపు మిగిలి
యున్న వటభూరుహముఁ గని యుల్ల మచట
నిలువఁగోరిన నాభ్రూనినీడఁ జేరి. 476

క. పనలతల కుసుమగంధము
గొని సుడివడు గాడ్పు డప్పిఁ గొండొక దేర్పం
దనుపార నచటఁ గూర్చుం
డె; నతం డట్లుండ నచ్చటికి లలితగతిన్. 477

వ. ఒక్కమహాబకంబు వచ్చె; నది పద్మభవునకుం బ్రసాదపాత్రం బగుచు నాడీ జంఘుండును రాజధర్ముండు ననుపేళ్లం బరఁగు; నాకొక్కరకు నమ్మట్టి నివాసంబై యుండు; నప్పక్షి య ట్లేతెంచి యవ్విభునిం గాంచి ప్రియంబు దలకొనుచూడ్కి నాదరించి. 478

క. ఎందుండి యేమిపనికై
యెందుల కరిగెదవు భూసురేశ్వర! ప్రీతిం
బొందితి నినుఁ గని; తగియెడు
విందవయితి; నాకు నీదు విధముం జెపుమా! 479

వ. అని యడిగిన నతం 'డేను మధ్యదేశీయుండ; నొక్క మహనీయ చరిత్రునిపుత్రుండ; నాలస్యంబున వేదాధ్యయనాది విప్రకర్మవిరహితుండ నయి కామలోలత్వంబున బోయత యిల్లాలుగా బోయలం గలసియుండి, పేదరికంబునకు నలసి బేహారులవెంట నొక్కసాతుంగూడి పరదేశంబున కరుగుచోట గిరిగహనదుర్గమప్రదేశంబున. 480

క. వనకరి యొక్కటి యాసా
తునకుఁ గవిసి జనచయం బుఁ ద్రుంపఁ దొడఁగుదున్
విను, మెల్లవారునుం గను
కనిఁ బఱచిరి; భీతి నేను గానన భూమిన్. 481

ఆ. పఱచి, దిక్కుదప్పి భాగ్యంబుకల్మి నీ
దైననిలయునునకు నరుగుదేరఁ
గంటి' ననిన' 'మేలుగాక! నీదారిద్ర్య
మపనయింతుఁ; జింత యపనయింపు. 482

వ. అంతకు నియ్యాతిథ్యంబుఁ గయికొను' మని రుచిమంతంబు లగు మందాకినీ మీనంబులు సుపక్వంబులు చేసి మధురంబు లగు వన్యఫలంబులు దెచ్చి తృప్తి యగునట్లుగా నతనికి నాహారవిధి యొనర్చి, రాత్రి యగుటయుం బల్లవపుష్ప సాంద్రంబగుశయనంబు గల్పించి యబ్బకపతి యద్ధరణీసురుతోడి సముచిత సల్లాపంబులను సుఖనిద్రను నారాత్రి గడపి వేగుటయు నవ్విప్రు నాలోకించి.

క. 'విను, మిత్రుండును రజతముఁ
గనకము బుద్ధియును నాల్గుగారణములు మ
ర్త్యుని దారిద్ర్యము వాయుట
కని దేవగురుండు సెప్పె నన్నిటిలోనన్. 484

క. మిత్రుం డెక్కడు; కాశ్యప
పుత్రుఁడ వగు నీకు నేను భూసురవర! స
న్మైత్రి యనుష్ఠించెద నటె
పాత్రము గాకుండుదే యపారశ్రీకిన్. 485

తే. నాసఖుండు విరూపాక్షనామధేయుఁ;
డతనిపురము మధువ్రజ; మదియు మూఁడు
యోజనము లిచ్చటికి; దాని కుల్లతెరువు
వట్టి వేచని యాదైత్యభర్తఁ గనుము. 486

క. కాంచి యతనితో నేఁ బు
త్తెంచితి నని చెప్పు; మతఁ డతిప్రీతుండై
కాంచనమును రత్నంబులు
సంచితుగాఁ జేసి యిచ్చు నప్పుడ నీకున్'. 487

క. అని యప్పరిదెస సెప్పినఁ
జని యాతం డతనిఁ గాంచి సముచితభంగిన్
వినిపించె రాజధర్మున
కనుగల మగుసఖుఁడ ననియు నతని పనువునన్. 488

తే. అరుగుదెంచితి ననియు ధనార్థి ననియు
నిట్లు వినిపించుటయు రాక్షసేశ్వరుండు
దేఱుకొనఁ జూచి యాత్మ నిప్పాఱుఁ డధముఁ
డగుట దోఁచుచు నున్నది యడుగవలయు. 489

వ. అని తలంచి. 490

క. కులమును విద్వయు వృత్తముఁ
గల రూ పెఱిఁగింపు మనినఁ గలఁగక తన్నుం
దెలియంగఁ జెప్పె విప్రుం
డలఘుం డగు ననురపతియు నవిక్రతుఁ డగుచున్. 491

క. ఇతఁ డెట్టిఁ డైన నే మగుఁ
నతనికి సఖుఁ డట్టి బకమహా తరసఖ్యం
బితనిం బాత్రముఁ జేయదె
యితనికిఁ దృప్తి యగునట్టు లిత్తు ధనంబుల్. 492

వ. అని నిశ్చయించి యతనికి నాహార సంభాదనంబులు సమీచీనంబులుగా నిర్వ
ర్తింపఁదగువారి నియోగించి, మఱునాఁడు కార్తికపౌర్ణమాసియైన భూసుర
సహస్రంబులు దనగృహంబున బసిండిపళ్లెరంబుల భోజనంబులు సేయను

బహుళదక్షిణలు ప్రతిగ్రహింపనుం గల నైమి త్తికక్రియానుష్ఠానంబులు గలి
గిన నమ్మహాజనంబులలోఁ గలపి యత్యంతాదరంబున. 493

క. మహనీయబహుళపూజా
సహితంబుగ భోజనంబు సంతృప్తిగ న
మ్మహితాత్ముండు నడపి దు
ర్వహభారము గాఁగఁ గనకరాసియు మణులున్. 494

చ. కుడిచినపళ్లెరంబును నకుంఠితహర్షముతోడ నిచ్చినం
గడుముదమంది యెత్తికొని గాఢభరంబున మార్చి మోవఁగా
మెడయును వీఁపు మూఁపులును మిక్కిలినొవ్వునఁ గొంకువోవ నె
క్కుడువెస నేఁగుదెంచెఁ గని కొక్కెర సమ్మదమంద మట్టికిన్. 495

తే. అట్లు సంతోషమునఁ దేలి యతని దప్పి
మోవ బకవల్లభుఁడు పక్షపుటయుగమున
నల్ల వీచి యాహారసమర్పణంబు
సేసి నిసి యైన సుఖనిద్ర సేయుచుండ. 496

-: నాడీజంఘుఁడు దుష్టబ్రాహ్మణునిచేమృతుండై మరల జీవించుట :-

సం. 12-166-2.3

వ. ఆదుర్బ్రాహ్మణుండు దనరేపటిపయనంబునకు నాహారంబు చింతించి 'యి
మ్మహాబకశరీరంబు గ్రొవ్వియున్నది దీనియందు మాంసబు సాలం గల;
దిది యేమటి నిద్రవోయెడుఁ జావనడిచి చెండికొని పోయెదంగాక!' యని పా
పనిశ్చయుండై చీర సక్కం గట్టికొని యొక్కకాష్ఠంబు గరయుగంబునం
జిక్క నమర్చికొని. 497

క. అందంద మెరయుఁ దలయు న
మందాటోపమునఁ బెక్కుమాఱు లరిచి చా

వుం దెలియఁ జూచి యలరెడు
డెందముతో నీఁక లన్నిటిని వెస కూడ్చెన్. 498

తే. టుఁడ్చిబొండుపుఁ బ్రచ్చి పే వురిపి నంజు
డంతయును బుచ్చి పొదకగా నమరఁగట్టి
కొనుచు వేగుఁబో కగుటయు జనియె; నట్టి
సమయమున మేలుకని దనుజప్రభుండు. 499

క. పొలవలచె నేమి కీడొకొ
కలిగెడు నని తలఁచి మనసు గలఁగఁగఁ దన వా
రలతోడ నుగ్గడించుచుఁ
జలియించుచు నుండఁ బ్రొద్దు జామెక్కుటయున్. 500

ప. రాజధర్మునిం దలంచి. 501

ఉ. నిచ్చలు వచ్చు రేపకడ నెయ్యు మెలర్పఁగ మత్సఖుండు; నేఁ
డిచ్చటి కేల రాఁడుఁ గుణహీనత విప్రునియందుఁ గల్మి నా
యిచ్చఁ దలంచితిం; దులువ యేమి దలంచెనొఁ యక్కటాఁ మదిం
బొచ్చెము లేదు నమ్మి బకపుంగవుఁ; డెట్లగునొక్కొ దైవమాఁ 502

క. అని తూత వగచి యారయఁ
బనిచెం బనిగఱపి భటులఁ బలువుర; వారుం
జని బకముడొక్క యేర్పడఁ
గని యతనికిఁ జెప్పిపుచ్చి కడువేగమునన్. 503

వ. అవ్విప్రుని చొప్పు వట్టి పోయి. 504

చ. పరిమెయిఁబాఱి వానిఁ గని పట్టి వడిం బెడగేలుగట్టి తె
చ్చి; రసురభర్త సూచి 'యిటు సేరఁగఁ దేవల దీక్షితఘ్ను నిం
బొరిగొని వే తినుం' డనినఁ 'బోకడమాలినవారమయ్యాఁ యి
ద్దురితశరీరముం దినఁగ దోసము మా' కని వార లొల్లమిన్. 505

వ. అతండు. 506

క. 'తినుఁడు తినకుఁ డొండేమై
నను జేయుఁడు వీని నేల నాముందటికిం
గొనివచ్చితి'రని పలికిన
దనుజులు పురి వెడలఁ దెచ్చి తద్గాత్రంబున్. 507

క. వెడగోఁతల నెత్తు రొలుకఁ
బడఁద్రోచిన వచ్చి కుక్కపదుపు వెనుకకున్
జడిసెఁ గబళింప నొల్లక
కడుపులు నకనకఁబడంగఁ గౌరవముఖ్యా! 508

వ. అని చెప్పి భీష్ముండు. 509

క. విను; మది యట్టిద; కుక్కలుఁ
దినఁగా రోయుం గృతఘ్నుదేహము మాంసం
బనిచెప్పు నాగమంబులు
మనుజేశ్వర! తెల్లమయ్యె మన కిచ్చోటన్. 510

వ. అని పలికి వెండియు నిట్లనియె: 511

క. పురపురఁ బొక్కుచు బకపతి
కరంకముం దేరఁ బనిచి గారవమున నె
య్యురుఁ దాను నగ్ని యిచ్చి య
సురపతి యున్నంత వచ్చె సురపతి నెమ్మిన్. 512

క. కని యతఁడు సంభ్రమంబును
వినయంబును బెరయ గారవించి యడిగె నా
తని రాజధర్మ నీవే
యని ద్వైన్యము దోఁప వగచి యశ్రులు దొరఁగన్. 513

వ. అడిగిన నమరవిభుండు 'నీసఖుండు చతుర్ముఖునకు సఖుం డగుట యెఱుంగవే? వానికి వగవ నేల? యవ్వారిజాసనుండు దనపాలికి ననుదినంబువాఁడుపచ్చటం గోరుచుండుం గావున. 514

క. పలుమాఱును రామికి ను
త్పలపడియెడు; దాన నిట్టిదశ నతఁ డొందెం;
జెలి యగుట నితని డొక్కకు
నలఘునిధిన్ వహ్ని యిచ్చి తది మేల కదా! 515

వ. అ ట్లగ్ని సంస్కారంబు సేసి వచ్చిన యనంతరంబ తచ్చితా సమీపంబున. 516

క. కడు నర్మిలిఁ గ్రేపుం జను
గుడుపఁ దొడఁగె నొక్కసురభి గుఱుపాల్చెరయం
బడు వత్సనక్తఫేనము
సుడిగాలిం దూలి పడియె సొదపై ననఘా! 517

వ. దానం జేసి యన్నాడీజఃఘుండు సంజీవితుం డయి యెప్పటియట్ల యొప్పెడు నాకారంబుతో నరుగుదెంచుచున్న వాఁ; డిట్లగుటకుం గారణంబును నద్దేవుని దివ్యచిత్తంబు మహానుభావంబ. 518

క. అని చెప్పె నంత బకపతి
సనుదెంచెను దనుజపతికి సమ్మదమెసఁగన్;
మును వాసవుఁ డజువాక్యము
నన పాశనిబద్ధుఁ జేసినాఁ డవ్విప్రున్. 519

క. ఆనాడీజంఘుండును
దాని నెఱిఁగి భూసురునకుఁ దనకతమున న
ద్దీనదశ యగుట కోర్వక
వాని విడుపు గోరి వేఁడె వరముగ నింద్రున్. 520

చ. అతఁడును దివ్యబోధమున నాసమయంబున బ్రహ్మసత్కృపా
న్వితుఁ డగు టేర్పడం గని వినీతతముం డగు రాజధర్మవాం
ఛిత మొనరించె; విప్రునకుఁ జేర్చిరి తెచ్చినవారు తద్ధన
ప్రతతియు దైత్యనాయకుఁడు పంప బకాధిపుఁ బ్రస్తుతించుచున్. 521

వ. అవ్విప్రుండు ధనసంచయంబు మోచికొని మరలి మరలి చూచుచు సంభ్రమం
బునం బోయెఁ; దదనంతరంబ. 522

క. సురపతియుఁ ద్రివిష్టపమున
కరిగె బకాధీశుఁడును నిజాలయమునకున్
గరిమంబు మెఱయఁ జనియెం
బరితుష్టం డగుచు దైత్యపాలుం దనుపన్. 523

క. అని చెప్పి తాత యిట్లను
మునుమునితో నాదరమున మఱియును 'బ్రహ్మ
ఘ్నునకును నిష్కృతి గలుగును;
వినుము, కృతఘ్నునకు లేదు విమలచరిత్రా! 524

క. ఆరయ మిత్రద్రోహము
దారుణ మగుపాతకము; గృతఘ్నతకంటెన్
వైరము గొని విడువవలయు
నారెడుదెఱఁగులవారి నాప్తుల నైనన్. 525

క. మిత్రుం డైహికములు నా
ముత్రికములు నైన భద్రములు దలకొలుపున్.
మిత్రధనంబులలోనను
మిత్రుఁడ యెక్కు డనుమాట మెత్తురు ప్రాజ్ఞుల్. 526

క. ఉత్తమకులజుఁడు సుగుణా
యత్తుండు సస్నేహమతియు నగు మిత్రునకుం

జిత్త మెలర్చు తెఱంగునఁ
బొత్తు మనఁగవలయు శుభముఁ బొందవలసినన్. 527

వ. అని యిట్లు కృతఘ్నతయు మిత్రద్రోహంబును నధికపాతకంబు లగుటయు-
సన్మిత్త్రిం బాటించుట శుభంబుఁజేయుటయు భీష్ముండు భీమాగ్రజునకుం
జెప్పె ననిన విని యయ్యుత్తమపురుషులయడుగుటలుననుత్తరంబిచ్చుటలును
నింత లెస్సలై చెల్లెడునే యటమీఁద జెల్లినతెఱంగు లెఱిఁగింపు
మనుటయు. 528

చ. స్మయభయదర్పితక్షుభితసామజమర్దనరక్షణక్రియా
శ్రయణవిలాసభాసురభుజా చరణ ప్రణతామరవ్రజా
జయ విభవప్రభుత్వధనసంపదుదా త్తచరిత్రకీర్త్యుపా
నయనకృతార్థసేవకజనాఁ మునిసంభృతయోగపూజనాఁ 529

క. తరణిశశినేత్రఁ జగదుప
కరణీయచరిత్రఁ బోధగాత్రతవస్సం
భరితశమమునిమనోజ్ఞా
భరణీయప్రాజ్ఞఁ విశ్వభారవిధిజ్ఞాఁ 530

మాలిని. వరదచరణలీలాఁ వైకృతాగమ్యశీలాఁ
విరతినిరతసేవ్యాఁ వేదవిద్యావిభావ్యాఁ
నిరవధికవిభూతీఁ నిశ్చయాతీతరీతీఁ
భరితకరుణదృష్టీఁ భక్తమాధ్వీకవృష్టీఁ 531

గద్యము :

ఇది శ్రీమదుభయకవిమిత్త్రి కొమ్మనామాత్యపుత్త్రి బుధారాధన
విరాజి తిక్కనసోమయాజి ప్రణీతం బైన శ్రీ మహాభార
తంబున శాంతిపర్వంబునందుఁ దృతీయాశ్వాసము.

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము - చతుర్థాశ్వాసము

-: ○ :-

శ్రీశ్రితవక్షస్థ్సలగౌ
రీశ్రితవామాంగసుభగరేఖాసంప
త్త్యశ్రాంతనూలలిత: స
మాశ్రితజననిత్యఫలిత : హరిహరనాథా : 1

-:భీష్ముఁడు ధర్మజునకు సర్వోత్తమంబగు ధర్మంబు సెప్పుట:-

సం. 12-168-2

వ. దేవా వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె: నట్లు బహుప్రకారంబుల శాంతనపుండు విహరింప రాజధర్మంబులు విని ధర్మనందనుండు దమ్ములుం దానును బ్రియం బందె; నమ్మందాకినీనందనుం డతనితో 'నాయెఱింగిన తెఱంగునం బజ్ఞాకరంబులగు వాక్యప్రకరంబు లవధ్యసింపితి; నింక నేమి విన నిచ్ఛసేసెద' వనిన నాదేవవ్రతునకు నన్నరదేవోత్తముండు వినయం బెసఁగ వినతుండై. 2

క. రాజోచితధర్మంబుల
యోజ విశదభంగిఁ జెప్పి తుజ్జ్వలవిసర
త్తేజోధన: నాకు సకల
భూజన పరమహితధర్మముం దెలుపు దయన్. 3

క. 'ఉత్తమ మెయ్యది?' నావుడు
నత్తటినీనందనుఁడు సమాదరసమ్య
క్చిత్తుఁ డగుచు నక్కురుభూ
పోత్తమునకు నిట్టు ఁనియె నుర్వీనాథా! 4

తే. విను, మనేకవిధంబుల విస్తరిల్లు
ధర్మములయం దొకండును దలఁప నిష్ప
లంబులే; దాత్మమోక్షావలంబి యైన
ధర్మ ముత్తమ మండ్రు తత్త్వజ్ఞు లధిప! 5

క. ప్రియములు నప్రియములును హృ
దయమునఁ బొరయమియ మోక్షదం బగు ధర్మం
బ యమహితా! తద్బోధవి
షయ మగు నితిహాసముం బ్రసన్నాకృతిగన్. 6

వ. చెప్పెద నాకర్ణింపుము; సేనజితుం డనురాజు పుత్రశోకార్తుం డయి యున్న
యెడఁ దదాప్తుం డగు విప్రుం డతని కిట్లనియె: 7

క. ఇది యేమి శోకమున వం
దెదు; పుట్టినవారి కెల్ల దెరు వారయఁగా
నిదియె; భవత్సుతుఁ డొకనికెఁ?
వదలు వనట; మూఢునట్లు వనరం దగునే? 8

వ. అనిన విని యజ్జనపతి 'నీ వేమిటఁజేసి పగపు వారి' తనవుడు నతం డతని
కిట్లనియె: 9

క. కదియుం గాష్ఠమఁ గాష్ఠము
నదిలో; మరికొంతసేపునకుఁ బాయును; నె
మ్మది నట్లుగఁ దలఁపఁగ వల
వదె పితృపుత్త్రాదిబంధువర్గము నధిపా: 10

క. తనకుం దా నెర వనినను
వినుఁ, బంధులు సతమె యన్వివేకంబున నే
జనులపయిఁ జేయ నర్మిలి
నను వగవొంద దది కారణముగ నరేంద్రా! 11

క. నరనాథ! సుఖము దుఃఖముఁ
బరువడి మైఁబొరయుఁగాక పన్నుగ నరునిం
బొరయునె యం దొక్కటి; యవి
పొరసిన వల దూఁద మోదమును ఖేదంబున్. 12

క. ఇది నాయది యనుఁ నూఁత
న్మది నెయ్యది పట్టుకొల్పినను వాసితమై
తుదిఁ జేటు నొంది వానికి
నది శోకము నావహించు నత్యంతంబున్. 13

క. వినుము, పురాతనజన్మం
బునఁ జేసినయట్టి కర్మములఫలములు ప్రా
జ్ఞునినై నఁ బొందు; వానికి
మనుజేశ్వర! మందు ధైర్యమహిమయ చుమ్మీ. 14

క. పరమసుఖము దృష్ణ యుడుగు;
టరయఁగ నిట్లగుట పింగళాలాపములం
బరిబోధిత మగు ; ధరణీ
శ్వర! చెప్పెదఁ దెలియ వినుము వానితెఱంగున్. 15

వ. పింగళ యనువేశ్య దనకూర్చువానిరాక వార్చి పెద్దయుంబ్రొద్దు వోవ
నంతకు నుండి వాఁడు రాకుండుటయును. 16

ఆ. ఏను వేఁడు జగుడు వాని నివ్వేదుఱ
పట్టఁ జదురుగలదె? భ్రాంతి దొఱఁగి

యొంటికంబ మొప్పు నింటివాకిళులు దొ
మ్మిదియు నెఱయమూసి నిదురవోదు. 17

క. పొంతకు వచ్చినవాని న
కాంతునిగాఁ గొనుచు నొరునిఁ గాంక్షింపక యే
నెంతయు నూఱడి మనమునఁ
జింత యొకఁడు లేక యున్నఁ జెందు సుఖంబుల్. 18

క. ఆశయ యింద్రియజయము వి
నాశముఁ బొందించుఁ; గావునం దొఱఁగెద నే
నాశను; సౌఖ్యము నిచ్చు ని
రాశయ; యని పలికి యట్టిదై నిద్రించెన్. 19

వ. అని విప్రుం డుపదేశించిన వాక్యంబులం గలంక దేఁటి సేరజిత్తు సుఖి యయ్యె; 'నీవును నట్లతాత్పర్యం బనుసంధించి శాంతి నొందు' మని చెప్పినఁ గుంతీతనయాగ్రజుండు శాంతనవుతో 'భూతక్షయావహం బగుకాలం బతిక్రాంతం బగు చున్నయది; యట్లుండ జనంబుల కెయ్యది కర్తవ్యంబు? లుపదేశింపు' మనిన నమ్మనుజపతిం బ్రీతిం గనుంగొని యమ్మహితాత్ముండు పితాపుత్ర సంవాదం బను నితిహాసంబు గల దాకర్ణింపుము దాన నీయడిగినయది దేటపడు నని పలికి యిట్లనియె: 20

-: మేధావి యను బ్రాహ్మణకుమారుఁడు దనతండ్రితోఁ జేసిన సంవాదము :-

సం. 12-169-2

సీ. వేదవిదుం డగు విప్రనందనుఁడు మే
ధావినామకుఁడు మేధావివరుఁడు
సత్సమయంబున జనకుతో 'నాయువు
జనులకు వేగంబ చనుచు నుండు;

దీనిపైఁ గనువెట్టి ధీరత దలకొల్పి
మేలు వాటిల్ల నెమ్మోముఁ జరించు
వారొకో?' యనవుడు వానికి నిట్లనుఁ
దండ్రి 'యాలును నపత్యంబు గలుగ

ఆ. తెఱఁగు నడపి యజ్ఞత్ప నిర్ధరుఁ డయి,
శమము నొంది కాననమున కేఁగి
సౌమ్యపృత్తి ముక్తి సాధించి మృత్యువు
నలఘునియతి గెలువవలయు ననఘ!' 21

వ. అనిన విని మేధావి దండ్రి కి ట్లనియెఁ: 22

సి. నిక్కమ కాలంబు నీకుఁ గొంత గలట్లు
వలికెదు; నీవు గర్భంబు సొచ్చి
నప్పటినుండియు నన్వేషణము సేయుఁ
గొనిపోవుటకు మృత్యు వని యెఱుంగు;
మివిరెడు నీటిమీనవుగావె దారపు
త్రాడిసక్తుం డగునతనిఁ గాన
నమున సుప్తుండై న నరుఁ బులి గొనుపోవు
నట్టులు సూ మృత్యు వపహరించుఁ;
తే. జేసినది సేయుచున్నది సేయవలయు
నది యనంగల కార్యంబులందుఁ దగులు
వాని మృత్యు వేపునఁ దనవశముఁ జేయుఁ;
గాన కాలంబు నేమనఁగాదు తండ్రి! 23

క. భీరుఁడు శూరుఁడు జడుఁడు వి
శారదుఁ డబలాత్మకుండు సబలుం డన లే;
దేరినయిన మృత్యువు దు
ర్వారంబై యపహరించు వైదికవర్యా! 24

క. వినుఁ, సంసృతి మృత్యువు ప
ట్టనఘా! నిస్సంగవృత్తి యమరగృహము నె
ట్టన నిట్లగుటం గనికొని
తునుముము సంసారరజ్జు దురితవిదూరా! 25

క. అమృతము మృత్యువు నన స
త్యము మోహము; గాన వినుఁ మహాత్మా: యే స
త్యమునన మృత్యువు గెల్చెద
సమసుఖదుఃఖుండ నగుచు శాంతిపరుఁడ నై. 26

తే. నాకుఁ బ్రజ గతి నిచ్చు ననంగ వలవ
దేన ప్రజ నయి పొడమెదఁగాన; యేను
నన్నుఁ గనుచున్నది మోక్షణఁబు సేయు
నాశపడ నట్టు లగుటఁ బ్రజాభియుక్తి. 27

క. వినుఁ,పశుయజ్ఞము హింసన
మనంతఫలదంబు గా దహంకృతి సహితం;
బనఘా: వాఙ్మనస నియమ
మను యాగం బిచ్చు నవ్యయానందంబున్. 28

వ. కావున నీవును. 29

క. కామక్రోధాద్యము లగు
నీమానసవికృతు లుడిపి యేకాంత గుహా
రాముఁడవై నిను వెదకుట
సూ మే; లొం డెల్ల నుడుగు సులభవివేకా: 30

క. అని పుత్త్రిం డుపదేశిం
చిన జనకుం డట్లచేసి చెందె సుఖంబున్
మనుజేంద్ర: యవ్విధము గని
కొని యూఁదుము సత్యధర్మ కుశలత్వంబున్. 31

వ. అనిచెప్పిన విని యజాతశత్రుండు శంతనుపుత్రునితో 'జగంబున ధనవంతులు నధనులుం గలిగి యుండుదురు; వారలకోన సుఖు లెవ్వరు దుఃఖు లెవ్వ'రని యడిగిన నక్కు-రుపితామహుఁడు 'శమ్యాకుండను నొక్క-శాంతిపరాయణ బ్రాహ్మణుండు సంసారంబు వదల విడిచి కూడుసిరకు నవసియుండునట్టి వాఁడు దొల్లి నాకడకు వచ్చి గోష్ఠిప్రసంగంబున నుపదేశించిన వచనంబులు గలవు; వాని విను మవి భవత్ప్రశ్నంబునకు నుత్తరంబు లై యుండు'నని పలికి యిట్లనియె: 32

తే. ధనము కలిమియు లేమియుఁ ద్రాసునందు
నిలిపి యెత్తంగ ములు సూపె నిర్ధనత్వ
మెక్కు-డై దానిదిక్కు-న; నెట్టులన్న-
వినుము, గుణదోషములభంగి విస్తరింతు. 33

క. ధనముగలవాఁడు మృత్యు వ
దనమున నున్నట్లు భయము దనచిత్తమునం
దనుకఁగ ముల్లల నుడుకును
విను, శిబిచోరాదిముఖ్యవిషయాపదకున్ 34

క. కోపంబును లోభంబును
నేపారి మనంబు గలఁప నెప్పుడుఁ జింతా
తాపంబు నొందు సధనుం;
డాపద గా కవ్విధము సుఖావహ మగునే? 35

క. ఎచ్చోటనైన నధనుఁడు
విచ్చలవిడి నుండు; లేదు వెఱపించుకయుం;
బొచ్చెపుఁజందం బొల్లఁడు;
మెచ్చరె సురలైనఁ బలుకుమ్మదువై యుండున్. 36

క. లోకముచందము గనిగొని
యీకానఁగ నగు ధనాఢులెల్లను గాల

వ్యాకులతఁ బొందఁ గలయవి
గాకుండమి యెఱిఁగి విడుపు గడుఁ జదు రెందున్. 37

క. ధనవత్త్వము దుఃఖకరం
బని కని తత్కాంక్ష విడుచు నతని కధనతా
జనితాత్మాధీనత్వం
బనుపమసౌఖ్యంబు సేయు నక్షీణముగన్. 38

-:భీష్ముఁడు ధర్మజునకు మంకియను
బ్రాహ్మణుని చరిత్రంబు సెప్పుట:-
సం. 12-171-4

వ. అని చెప్పె ననిన విని ధర్మతనయుండుపితామహుతో'ధనతృష్ణాభిభూతుండగు పురుషుం డేమిట సుఖి యగు' ననుటయు సత్యామరనదీనందనుండు 'ధనార్జనంబుతోడివిసుపుటం బుట్టినవిడుపున సుఖంబు గలుగు; నత్యర్థంబుఁ దెలి పెడునది యొక్క యితిహాసంబు గలదు విను'మని యిట్లనియె: 39

సీ. మంకినాఁ బరగు బ్రాహ్మణుఁడు ధనేచ్ఛమై
వర్తించు; శిక్షింప వలయునట్టి
గుజ్జు దోయిని జట్టిగొని ప్రీతి లంకించి
యుండ, లంకియతోన గండు మీఱి
పాఱె నకోఁడియల్ పడియున్న గనపలొ
ట్టేనుంగుపై; నది యెగసి పఱవ
నుభయపార్శ్వంబుల నురిపోసిన ట్లవి
వ్రేలి చచ్చినఁ, జూచి విప్రుఁ డడలి

తే. 'రత్నములుఁబోని వత్సతరంబు లకట
వ్రేలుచున్నవి లొట్టేన్గువెంటఁ దవిలి'
యనుచు నిర్వేదమొంది యిట్లనియెఁ దన్నుఁ
గరుణతోడఁ గనుంగొను నరులతోడ. 40

తే. సారమతిఁ బరికింపంగఁ బౌరుషంబు
కంటె దైవంబు ముఖ్యంబు గార్యసిద్ధి;
కెచటనేనియుఁ బౌరుష మెసకమెసఁగె
నేని యది దైవదత్తంబ; యింత నిజము. 41

వ. కావున. 42

క. మనుజునకు సుఖము గోరెడు
జనులకు నర్థక్రియావిశారదభంగుల్
పొనుపడ విడిచి భరములే
కునికియ యూహించిచూడ నుర వెబ్బంగిన్. 43

వ. అని పలికి యుద్దామంబై నకామంబు విడుపు వడకున్నఁ జిత్తంబునకు నిర్వ్యథి
గలుగునే? యనువిచారంబు పుట్టి తదీయోత్సారణం బూహించి యాచిత్త
ధర్మంబు నుద్దేశించి. 44

క. నీమూలం బే నెఱిఁగితిఁ
గామమ సంకల్పమునన కలిగెదు సంక
ల్పామర్శరహిత మగుచే
తో ముద్రం దాల్తు నేను; దుది యది నీకున్. 45

వ. అని కామం బనునది గోర్కి గావునఁ గోర్కియొప్పమి దేటపఱుపందలంచి. 46

తే. సొమ్ము గోరిన యంతన సుఖము గలుగ;
దది యుపార్జింపగా సిద్ధియగుట నిజమె?
కలిగెనేని యనేకచింతల నొనర్చుఁ;
జెడుట చావుతోఁ దుల్య; మయ్యెడును యేల? 47

వ. ఇచ్ఛానిర నంబు సుఖం బని వెండియు. 48

క. శోకశ్రమకృష్ణలకున్
నికలిమియ యోల మగుట నీ కగపడువాఁ
డే కర్తవ్యము గానం;
డోకామమ: నిమ్నఁదొఱఁగియుండెద సుఖివై. 49

క. నీ వాసపఱుప ధనములు
గావించెవఁబో, వినాశకముల నుడుపఁగా
నీపశమె? కాన నీచెడు
టేవగపుం దేదు పెనుపదే దైన్యంబున్? 50

చ. సులభమొ దుర్లభంబొ యని చూడ నెఱుంగవు; గన్నదానిపై
నలముట కామమా: యిడుమలం దఁగఁ జేయుదు; నిండు టేమిటం
గలుగదు నీకు; నీతెఱ: గగాధరసాతలభంగి; నీవుస
న్నాలముసఁ బోవకుండ నిసుఁ బుచ్చెద బచ్చెనరూపు పోకలన్. 51

తే. ధనముచేటున విసివి నామకము నిమ్న
నీడ విడిపెనో కామమ: యేసు శాంతి
దాంతిసత్యక్షమాభూతదయలఁ జెంది
నాఁడ; లోభాదు లొందవు నన్ను నింక. 52

తే. కామసుఖదివ్యసుఖములు కాంక్ష దొఱఁగు
మేలి షోడశాంశంబునఁ బోల లేవు;
గాన కామమ: నిను శత్రుకరణిఁ జంపి
బ్రహ్మపురమున నుండెద రాజుఁ బోలె. 53

-: అజగర చరిత వ్రతము :-

సం. 12-172-2,3

వ. అనిపలికి యివ్విధంబునం గోడెలు సచ్చినం బుట్టిన నిర్వేదంబున సకల
కామంబులం బరిత్యజించి దేవసముండై యుండె, నని చెప్పిన విని పాండ

వాగ్రజుం 'డేమివ ర్తనంబున నరుండు వీతశోకుం డగుచుఁ జరించుఁ నెద్దానం
జేసి పరమగతి వడయు' ననుటయు ననిమిషనదీనందనుం 'డజగరచరితంబను
నితిహాసంబు వినుము; దాన నీయడిగినయర్థంబు దేటపడు; దానిం జెప్పెద-
నాజగరనామధేయుం డగు నొక్కబ్రాహ్మణునిఁ బ్రహ్లాదుండు శమప్రకారం
బుపదేశింపు మని యభ్యర్థించిన నతం డతని కిట్లనియె: 54

క. అనిమి త్తము భూతంబుల
జననం; బవి రూపు సెడుట సంపన్నములై
యునికి విషాదము మోదం
బును జేయఁగలే వనిత్యములుగ నెఱిఁగినన్. 55

తే. వఱదఁ గాష్ఠముల్ గూడిన వడువు బంధు
సంగముం, బవి వాసినచాడ్పు తద్వి
యోగ; మింత సూచిన వాని నుమ్మలికము
హారయ నేరదు దానవవరతనూజ! 56

వ. ఈతెఱంగు లే నెఱుంగుదు; నాదెసఁ బ్రశాంతిం గని కాదె నీవు శమోపదేశం
బర్థించితివి వినుము: 57

క. మే లర్థింపను; గీడున
జాలింబడి తొలఁగఁ ద్రోవ; సరిఁ దూషింభా
వాలంబిమనస్కుఁడనై
యాలంబుగఁ జేసి నడతు నయ్యురదెలఁగున్. 58

క. సరసాన్నముఁ బిణ్యాకము
సరిగాఁగ భుజింతు; మృదులశయ్యాతలమున్
ధరణియు శయనరుచికి నా
కరయంగా నొక్కరూప యసురప్రవరా! 59

ఆ. నారచీరయేనిఁ జారుచీనాంబరం
బైనఁ గట్టికొనినయపుడు హృదయ

మొప్ప దొప్ప నసక యుండు; రూపాదుల
సలమికొనపు చతురాదికములు. 60

వ. అని వెండియు. 61

ఆ. చలన మేది పుట్టుఁజావునుం బిరుపెట్టి
యామిషార్థిజనుల నపహసించు;
చెలిమితోడ నేమికలిమి వాటింపని
రమణ మనికి యజగరవ్రతంబు. 62

ఆ. అనియతంబు లైన యాహారవిహరణ
శయనముల విధాత్యసంప్రయుక్త
భంగిఁ బరగు నంతరంగ నిర్భారవ
ర్తనము కలిమి యజగరవ్రతంబు 63

అ. నిత్యతృప్తి శౌచనిరతి ప్రాల్మ్య సమత్వ
మారఁ గలిగి చిత్సుఖానుభవము
ప్రచుర మగుట యజగరవ్రత; మది వినుఁ
యజ్ఞమున్లభంబు వాజ్ఞభూమి. 64

వ. ఇది శమప్రకారం బనియె నని చెప్పి భీష్మ్ముండు. 65

క. అజగరచరితము దనకును
నిజముగ నలవఱుప నేర్చు నిర్మలమతికిన్
వృజిన భయమన్యలోకము
లజేయములు గావు; మోక్ష మాయత్త మగున్. 66

వ. అనిన విని యజాతశత్రుండు 'బంధుమత్త్వకర్మ విత్తప్రజ్ఞలయం దెయ్యది
నరునకు సుప్రతిష్ఠం జేయు'నని యడిగిన నాపగాతనయుం డతని కిట్లనియె: 67

క. ప్రజ్ఞయ ప్రతిష్ఠ లాభము
ప్రజ్ఞయ నాకం బనంగఁ బ్రజ్ఞయ చువ్వే

ప్రజ్ఞయ కైవల్యంబును
బ్రజ్ఞాసాధ్యములు గాని పనులుం గలవే? 68

వ. బలి ప్రహ్లాద మంకి ప్రభృతులు ప్రజ్ఞన కాదె సమాధానసంపన్నులయిరి;
కాశ్యపనామధేయుం డగు ధరణీసురోత్తముం డొక్క యుద్ధతపురుషుని
రథంబు దాఁకి పడి తదవమానదూయమానమానసుండై యసుపరిత్యాగపర
వ్యవసాయుం డగుటయు నింద్రుండు స్వగాలరూపంబున నమ్మహాద్విజుని
పాలికి వచ్చి ప్రజ్ఞాసంబోధకంబగు సంవాదంబునం జిత్తప్రసాదంబు కావించె
నని విందు మెల్లభంగులఁ బ్రజ్ఞ యుత్తమాధికారం బనిన విని ధర్మ
తనయుండు. 69

క. నరవర! దానమఁ దపమును
గురుశుశ్రూషయును యజ్ఞకోటియు నెల్లై
పరిణతిఁ బొందం గలయవి
పురుషున కత్తెఱఁగు దెల్లముగ వినవలతున్. 70

వ. అనుటయు దేవవ్రతుం డన్నరదేవోత్తమున కిట్లను 'మేలు లనుబంధించు;
మేలు లట్ల కీల్గును ననుస్యూతంబు లయి తొడరు నాకర్ణింపుము'. 71

క. కఱపుపయిఁ గఱవు వొరయుచు
వెఱపుపయిన్ వెఱపుదోఁప విడువని యిడుమం
దొఱఁగమిపైఁ బురుషుఁ డిడుమఁ
దొఱఁగఁడు జేష్టపుచు నడచు దుష్కర్మములన్. 72

వ. అని మఱియును. 73

ఆ. ఉత్సవంబు మీఁద నుత్సవ మందుచు
సుఖము మీఁద సుఖము సొప్పడంగఁ
బుణ్యపదము మీఁదఁ బుణ్యపదంబున
కరుగు నరుఁడు సుకృతియైన నధిప! 74

క. పులుఁగులలోఁ బూత్యండక
ములు సారములై నధాన్యములలోనం బొ
ల్లులు బోలెను జూవె మను
ష్యులలో ధర్మరహితాత్ము లుర్వీనాథా! 75

క. చనినఁ జను నన్న నుండు
న్మనుజుఁ డొకటి సేయఁ జేయు నరనాయక! తో
డన తగిలి నీడవోలెను
విను, చేసినకీడు మేలు విడువవు వానిన్. 76

క. సమయం బైనను గుసుమఫ
లము లెట్టులు దోఁచుఁ దరువులం దజితోఁ గ
ర్మములం బొడమున్ సుఖదుఃఖములట్టుల నిష్ప్రియత్నకలితోద్భూతిన్. 77

క. తెలిసికొనఁ బడయ రొరు లా
ర్యులపోయెడితెరువు లరసియును జదలం బ
ఱులు నీళ్ళలోన మీనం
బులు వోయెడుత్రోవ లెఱుఁగఁ బోలునె యధిపా! 78

క. ఐనను గాథనిరూపణ
మానసుఁడై యార్యజనుల మహితవచనముల్
వీనుల నినుచుచు ధర్మము
లైనవి సేయుంగఁ దప్ప కగుఁ దత్పలముల్. 79

వ. అనిన విని కౌంతేయాగ్రజుండు శాంతనవునితో 'భూతసృష్టి యొవ్వానివలన నెబ్బంగనైనయది యెటింగింపు' మనవుడు నతం డిదియును మఱియుం గొన్ని యర్థంబులు భరద్వాజుం డడిగిన భృగుండు సెప్పె నప్పరిపాటి యుపన్యసించెద నాకర్ణింపు' మని యిట్లని కిట్టనియె: 80

భీష్ముఁడు ధర్మరాజునకుఁ బృథివ్యాదిభూతోత్పత్తిక్రమం బెఱిఁగించుట

సం. 12-175-5.

సీ. కైలాసశైలశిఖరమునఁ దేజోవి
రాజితు భృగు భరద్వాజుఁ డధిక
వినయంబుమైఁ జేరి మునినాథ! భూతస్మ
ష్టిప్రకారము నాకుఁ జెప్పు మనిన
నమ్మహితాత్ముఁ డిట్లను వినుమాయ
ణుం డవ్యయుం డనంతుండు భూత
సృజనంబు దలఁచి మున్ సృజియించెఁ దనదు స
హస్రాంశకమున నవ్యక్తుఁ డనఁగ

తే. మనసునన యజరామరు ననుపమాను
నతనివలన మహత్తత్వ మావహిల్లె;
నతఁడు దివ్యతేజోమయం బైనపద్మ
మొకటి గలిగింప బ్రహ్మ యం దుద్భవించె. 81

తే. అతని తలఁపునఁ బ్రభవించె నాకసంబు;
దానియందు జలంబు లుద్భవము నొందె;
సలిలమున నగ్ని మారుతజనన మొనరె;
ననల పవనయోగమున మేదిని జనించె; 82

వ. ఆబ్రహ్మ యఖిలభూతాత్మకుం డెట్లనిన: నతనికి శైలంబు లస్థులు; మేదిని మేదో మాసఁబులు; సముద్రంబులు రుధిరం; బాకాశం బుదరంబు; పవనుండు నిశ్వాసం.బగ్ని తేజంబు సరిత్తులు సిరలు, రవిచంద్రులు నయనంబు. లూర్ధ్వ లోకంబు శిరంబు, పాతాళంబు పాదంబులు. దిశలు బాహువులు; లిట్టనఁతా త్మకుండగు వాఁడు విష్ణుఁ; డిత్తెఱుంగున విశ్వంబు విష్ణునివలసం గలిగె; ననిన విని భరద్వాజుం డాకాశాదిభూతంబు లేనింటి ప్రమాణంబులు నడిగిన భృగుం డవి యనంతంబులు, దేవతలకుం గొలఁది వెట్టరాకుండు, నొక్కచోటు నిరూపించి యీభూతం బింతట నుండి యట లేదనరాదు; పంచభూతంబులు నిరవధికంబు; లది యెత్తెఱుం గనిన విష్ణునకు గౌణంబై యనంతుండను

నామంబుగలదు గాదె; విష్ణుండు జగన్మూర్తి విష్ణుతనుభూతంబయిన మహాభూత పంచకం బప్రమేయంబు గాక తక్కునే యని యెఱింగించిన. 83

సీ. విని భరద్వాజుండు 'మునినాథ! పుష్కరం
బున బుట్టె నన్నప్ప పుష్కరంబు
బ్రహ్మకు నాదినా బట్టయ్యె నెట్టకో!'
నావుడు 'విష్ణమానసభవుండు
బ్రహ్మ యాద్యుడు పుష్కరము దదాసనరూప
ముగ గల్పితంబయ్యె; మున్నుపిదప
ననునిశ్చయంబు లేకునికి బద్మజు డన
వలసియు నుండు నయ్యలఘుతేజు;

తే. బద్మ మది భూతధాత్రి; యప్పద్మమునకు
గగనమూర్ధిత మగు మేరునగము రుచిర
చారుకర్ణిక; యందుండి సకలజంతు
సృజనధుర్యత్వమహిమ నయ్యజుడు వెలుగు. 84

వ. అని భృగుండు సెప్పిన విని భరద్వాజుండు 'భూతంబు లైదగుట యేమిట' నని యడిగిన నతం డతని కిట్లనియె: 85

క. వాయువు చేష్టారూపము;
మ్రోయునెడ నభంబు; ద్రవము మునివర! జల; మూ
ష్మాయిత మనలము; గాఠి
న్యాయితము ధరిత్రి; యిట్టు లైదుదెఱంగుల్. 86

వ. 'ఈయయిదింటన కాదె జంగమంబులు స్థావరంబులు నై నయవి' యనుటయు భరద్వాజుండు 'స్థావరంబులయందు భూతగుణంబు లేమిటం గంటి'మని యడిగిన భృగుం డిట్లనియె: 87

సీ. అశనినిర్ఘోషంబు నాకర్ణనము లేక
వికృతి నెట్టులు వొందు వృక్షమాక

సముశక్తిసూవె శ్రోత్రము నిదాఘంబు సోఁ
కునవాడుఁ జోఁకెఱుంగుట; సమీర
శక్తిమార్గముఁ గని చాఁగెడుఁ గనుట సమీర
జశ్యక్తి పాదపసంజ్ఞఁ బరగుఁ;
బాదజిహ్వాలఁ గొని పానంబు సేయుట
జలశక్తి జిహ్వానై జంబు లైన

తే. కుసుమ ధూపాదిగంధముల్ గొనుట నెలమిఁ
దాల్చు నని చెప్పుఁ దరువు వేదంబు; ఘ్రాణ
మూర్వీశక్తి యిట్లయిదును నుల్లసిలుట
ననఘ! భూజంబు పంచభూతాత్మకంబు. 88

వ. శైలాదులయందు నిట్ల యూహింపఁ బెఱభంగులం గలిగియుండుఁ; బంచ
భూతాత్మకంబు గాని భూతంబు లేదనుట వేదనిశ్చయం బనిన విని
భరద్వాజుండు. 89

క. భూముఖ్యం బగు భూత
గ్రామంబు గుణంబు లైన గంధాదులఁ దే
జోమహిత! యనుభవించుట
యేమెయి నెద్దాని కావహిల్లుచు నుండున్. 90

తే. అనిన భృగుఁ డిట్టులను 'విషయములు నింద్రి
యములు మనసును గ్రమసాధనములు గాఁగ
నంతరాత్మ ప్రపర్యిష్టై యనుభవించి
తత్కృతము లగు మోదఖేదములఁ బొందు. 91

వ. అప్పురుషుండు. 92

క. క్షేత్రజ్ఞుం డనఁగ నిఖిల
గాత్రవ్యాప్తత్వమహిమ గలిగి సమీరా

సూత్రణమున జీవుండును
గోత్రమునై సర్వవర్తకుం డగుచుండున్. 93

క. అగునీతత్త్వము సత్త్వా
దిగుణత్రయవికృతి కత్యతీతంబై పూ
ర్వగురుత్వంబునకుం జన
విగతత్వంబునకు నెలవు విమలవిచారా! 94

ఆ. బుధుఁడు సూక్ష్మవిమలబుద్ధి నప్పురుషుని
నరసి కాంచి యతనియంద మనసు
దిగ్గవిడిచి యెగ్గులగ్గును బొందక
శుద్ధశాంతిఁ బరమసుఖము బొందు. 95

వ. అని వెండియు. 96

—: భృగుమహాముని భరద్వాజునకుం జెప్పిన
వర్ణాశ్రమాచారక్రమము :—
సం. 12-181-1.

సీ. ఆగమ సత్యధర్మాచార తపముల
కునికిపట్టులు గాఁగ వనజభవుఁడు
గలిగించె మును బ్రాహ్మణుల, మఱి కల్పించె
నృపవైశ్యశూద్రుల నిర్మలాత్మ!
బ్రాహ్మణాదికముగఁ బరగు నన్నాలుగు
జాతుల యుజ్జ్వలచ్ఛాయ లోలి
సొంపారుఁ దెలుపును గెంపున బసపుచా
యయుఁ గప్పు నయ్యు నంద్రార్యవర్యు

ఆ. లాత్మకర్మమెడలి యనులోమవృత్తి నె
జ్జాతి సొచ్చు నన్యజాతిపనికి
దాని కట్టి భంగి దలకొనుఁ బెక్కులు
పనులఁ జేసి జాకతనము వచ్చు. 97

క. సితరక్త పీతనీలము
లతులమతీ! మొదలు దొడఁగి యంతంతకు హీ
నతఁ దాల్చుఁ; గాన యెటిఁగిం
చితి నీపరిపాటిఁ గర్మశీలత కొఱకున్. 98

వ. అని మఱియును. 99

క. సత్యమ బ్రహ్మము; దపమును
సత్యమ; ప్రజలను స్రజించు సత్యమలోక
స్థిత్యాధానముఁ జేయును;
సత్యం బన్యతంబుచేత సంపిహిత మగున్. 100

వ. అట్లుంగాక ధర్మాధర్మంబు లనఁ బ్రకాశతమంబు లన బోధాజ్ఞానంబు లన స్వర్గనరకంబు లన సుఖదుఃఖంబు లనఁ బరగు బుధజనవ్యావహారికశబ్దంబు లకు నర్థంబులై సత్యాన్యతంబులు ప్రవర్తిల్లుం గావున. 101

క. అనఘా! దుఃఖాత్మక మగు
నన్యతం బడగించుటకుఁ బ్రయత్నమున సుధీ
జను లాచరింతు రనిశం
బును మోహవిఘాతి నియమములు నిష్ఠమెయిన్. 102

క. ఒలయు జరావ్యాధిప్రభృ
తులు శారీరములు; గాధతోదకశోకా
దులు మానసములు; దుఃఖం
బులు రెండువిధముల నిట్లు పురుషు నలంచున్. 103

క. శారీరమానసము లగు
నీ రెండువిధములు దన్ను నేఁపక యుండం
గోరికొని నియమములఁ బ్రతి
కారం బొనరింపఁగా సుఖం బొందు నరుఁన్ 104

క. విను, దుఃఖంబులఁ దెగఁదో
చిన పురుషుఁడు సౌఖ్యసక్తచిత్తుఁడు గాకా
రినవైరాగ్యముఁ జెందిన
ననుపమ మగు పరమపదము నమ్మొయి సేర్చున్. 105

వ. అనిన విని భరద్వాజుం 'డాశ్రమధర్మప్రకారంబుల సువ్యక్తంబులుగా నెఱిం
గింపు' మనుటయు భృగుం డిట్లనియె: 106

సీ. గురునకు భక్తుఁడై పరమాదరమున వే
దాభ్యస మెప్పుడు నాచరించు
చును శౌచశీలత వినయంబు ప్రియవణ
స్నానంబు భాస్కరానల నపర్య
పాటించు చుండుట బ్రహ్మచారికి వృత్తి;
ధనధాన్యములు గర్హితంబు గాని
తెరువునఁ బడసి యతిథిపూజ మున్నుగా
నన్నపానాదిభోగానుభవముఁ

తే. బొందువాఁడు గృహస్థుండు; గందమూల
శాకఫలము లాహారంబు శయ్య భూమి
వననివాసికి నిస్సంగవర్తనమున
భిక్ష ప్రబుకుగ యతిశాంతిఁ జేర్చియుండు. 107

క. ఫలకాంక్షి గాక నియతిం
జలిపిన నీయఖిలకర్మజాతంబును ని
ర్మలమోక్షపదముఁ జేర్చుట
గలుగు నవశ్యంబుఁ బుణ్యకరణప్రవణా! 108

వ. అనిన విని భరద్వాజుండు 'పరలోకంబన నొకండు గలదం ద్రీలోకంబున
కును నాలోకంబునకును విశేషంబెట్టిది యెఱింగింపవే!'యని యడిగిన భృగుం
డతని కిట్లనియె: 109

క. ఇది కర్మభూమి; భోగా
స్పద మాలోకంబు; ధర్మపరులకు సుఖదం;
బది సత్యశౌచసౌ జ
న్యదయాదులు లేనివారి కప్రాప్య మగున్. 110

క. ఈలోకము దుఃఖబహుళ;
మాలోకము భూరిసుఖనిరంతర; మందే
జాలియును లేక యొండొరు
తో లెస్సగఁ బొందియుండుదురు జను లనఘా! 111

తే. హస్తిమశకాంతరము గల దరసిచూడ
వాసగృహ శయనాసనవసనగంధ
మాల్య తౌర్యత్రికారామ మానినీజ
నాదిసుఖసాధనములకు నందు నిందు. 112

వ. అని వెండియు. 113

క. ఇవి పుణ్యలోకవిషయ
వ్యవసితవచనంబు; లధమమగులోకము ధ
ర్మవిదూరజనులు వొందుదు;
రవిరత బహుదుఃఖనిలయ మది విప్రవరా! 114

క. విను, మమకారవివర్జిత
మనస్కులకుఁ బుణ్యపాపమార్గంబులు లే
మిని లోకంబులఁ ద్రిమ్మర
రనఘా! పొందుదురు శాశ్వతానందంబున్. 115

వ. అని చెప్పి భృగుండు 'బ్రహ్మవిహితంబులగు ధర్మంబులు సంక్షేపరూపంబున నెఱింగించితి' ననిన భరద్వాజుండు ప్రముదితాత్ముం డగుచు నమ్మహాత్ముం బ్రశంసించి వినతుండై వీడ్కొనియె; నతనిచేత విన్నంతవట్టును నీకుం

జెప్పితి; నీ వింక నెయ్యది వినవల' తనుటయు ననిమిషనదీనందనుతో ధర్మ
నందనుం 'డాచారవిధి వినుమాంఛ నామనఁబునం బేర్చియుండు' ననవుడు
సతం డతని కిట్లనియె: 116

-: భీష్ముఁడు ధర్మజునకు నాచారవిధి యెఱిఁగించుట :-

సం. 12-186-2

సీ. సజ్జనులం దురాచారవంతుల దురా
చారంబు గష్టత్వకారి, యట్లు
గావున నాచారగతి వింట గడుఁలెస్స;
రాజమార్గంబున రచ్చ మంద
మూత్రపురీష విమోక్షంబు సేయమి,
శౌచియై వార్చి నిష్ఠను జలంబు
సొచ్చుట, సంధ్యల సూర్యు సేవించుట,
యర్కోదయా స్తమయముల నిద్ర

తే. వోవకుండుట, పంచార్ద్రిభావ మొంది
కుడుచు, టన్నంబు దెగడమి, వడిపదములు
గలుగ నిదురకుఁ జొరమి, సత్కర్మవేది
నారదుఁడు వివరించె నాచారములుగ. 117

తే. ఉదయ మగు సూర్యుఁ గనుఁగొను టొప్పు; దన్య
వనిత నగ్నయై యుండంగ వలదు చూడఁ;
దనపురీషంబు సూచుట ధరణినాథ!
కీడు; నిజపాపగుప్తి యకృత్య మరయ. 118

క. సురతంబు గుప్త మగుటయు,
గురుబ్రాహ్మణయును బ్రహ్మకులభజనము నా
యురవా ప్తిఁ జేయు లక్ష్మీ
కరంబులగు నూర్ధ్వలోకగతియు నొనర్చున్. 119

వ. అనిన విని యుధిష్ఠిరుం 'డధ్యాత్మవిద్య వినవలతుం జెప్పవే:' యనిన నత
నికి దేవవ్రతుం డిట్లనియె: 120

సీ. జలధితరంగలచాడ్పునఁ బొడమును
నడఁగును నుండు భూతాత్మునందు
భూమిప్రభృతిభూతములు; వానిగుణములు
గంధాది లింద్రియగ్రాహ్యకోటి;
యనఘ: శ్రోత్రంబాదియగు నింద్రియశ్రేణి
దర్వియుఁబోలె సాధనత నొందు;
మన సింద్రియములకుఁ బెనుఁబ్రాపు; బుద్ధిత
న్ముఖమున నిశ్చయంబునకుఁ దేరఁ

తే. బురుషుఁ డవ్విషయంబులఁ బొందు; నిట్లు
గాకయుండ నింద్రియములఁ గ్రమ్మఱించి
మనసుతోఁ గూర్చి బుద్ధిలోనన యడంప
బుద్ధి నిర్విషయస్థితిఁ బురుషు నొందు. 121

క. వినుమాత్ముఁడు క్షేత్రజ్ఞుం
డన భూతాత్ముఁ డనఁ బురుషుఁ డనఁ బరమేశుం
డన బుద్ధిసాక్షి యనఁగా
జననరహితుఁ డనఁగ బరగు శాంతిప్రవణా: 122

క. తనయంద తోఁచు విషయము
లనుభవగోచరము లగుట యవి మాయాసం
జనితస్వప్నంబై యా
త్మునికిం దను గాన లేమి మోసము దెచ్చున్. 123

క. వినుఁ, గుణములు మాయకు నొడ
లని యెఱిఁగి తమోరజస్సు లడఁచి సుసత్త్వం
బున నిలిచి సద్వివేకం
బున నదియుం ద్రోచి విమలబోధాత్ముఁ డగున్. 124

తే అరసి చూడ సత్త్వంబు సుఖాత్మకంబు;
సాంద్రదుఃఖమయంబు రజస్సు; బోధ
మాంద్యమూర్తి తమస్సు; సమత్వ మూఁది
యీయవస్థలఁ బొరయమి మాయపోక. 125

వ. అని యధ్యాత్మప్రకారంబు నిర్దేశించి భీష్ముండు వెండియు 'యోగంబు
సెప్పెద నాకర్ణింపు' మని యమ్మనుజపతి కిట్లనియె: 126

—: ధర్మజునకు భీష్ముఁడు యోగప్రకారంబు సెప్పుట :—

సం. 12_188-1

సీ. తెలివొంది మనసు నిశ్చలవృత్తి నేకాగ్ర
మైయున్కి గోరి నిష్ఠాతిశయము
కలిమి కృత్యంబు; మేఘంబున మెఱుఁగును
నలినపత్రంబున సలిలకణముఁ
బోలె మంతవ్యంబుపొంతఁ జరించుమ
నంబు, దానికిఁ బవనంబుగతియ
గతిగాన హితము మారుతధారణము; పవ
మానంబు గ్రమమున గాని నిలువ;

ఆ. దలయ విసువఁగాదు; తలకొని యమ నియ
మాదు లెనిమిదియును నభ్యసింపఁ
గా విచార మొలయుఁ; గలుగు వితర్కంబు;
మఱి వివేక మనిలు నెఱికిఁ దెచ్చు. 127

క. విను, మంతర్నాడిం జనఁ
బనుపడి పవనంబు బ్రహ్మపద మొందఁగ శాం
తినిరూఢమైన చిత్తము
గను; నానందంబు నంద కలయుం బిదపన్. 128

వ. అనిన విని కురుపతి కురుపితామహునితో 'జపవిధిప్రకారంబును, జపశీలురగు
వారు పోవుగతియును నెఱిఁగింపవే:' యనుటయు నమ్మహీవిభునకునమ్మహీ

హాత్ము డిట్లనియె 'జప్యంబు విషయంబుగా యమకాలమృత్యుభూసురేశ్వాకు
లకు సంవాదంబు ప్రవర్తించె; నయ్యితిహాసంబునుం జెప్పెద; మున్ను నా
యెఱింగిన తెఱంగునుం జెప్పెద నాకర్ణింపుము'. 129

-: యమకాల మృత్యు భూసురేశ్వాకుల సంవాదము :-

సం. 12–.89–6

సీ. వేదాంతవిదు లనుమోదించు నట్టిది
జపకర్మ; మత్యంతశౌచశాలి
యై కుశాస్తీర్ణసమావనీతలమున
గుశముష్టిసేకొని విశదచిత్త
వృత్తి నింద్రియములు విషయసక్తంబులు
గాకుండ నిలిపి, తదేకపరత
మత్స రాహంకార మాన దంభా పగ
మంబును బ్రహ్మచర్యంబుఁ గలిగి
తే. జపము సెల్లించుపురుషుండు సర్వలోక
విజయనిస్స్పృహ మగు జపవిధివిశోక
హర్షరాగాదికంబును నవ్యయంబు
నైన పదముఁ బొందించు నృపాగ్రగణ్య! 130

క. శౌచాదిగుణము లెడలుట
నీచత్వము వాటిలంగ నిశ్చలమతి దు
ష్టాచరితమైన జపవిధి
నాచెప్పిన సుగతి లేదు; నరకముఁ దెచ్చున్: 131

వ. అని చెప్పి వెండియు నిట్లనియె. 132

సీ. వేదవేదాంగసంవేది గౌశికుఁ డను
ధరణీసురుఁడు సంహితాజపంబు

విహితశీలతఁ జేయ వేయువత్సరములు
సనిన, సావిత్రి యమ్మునివరునకుఁ
బొడసూపి, తనుఁ జెప్పఁ, గడుభక్తితో నతం
డెటిఁగిన, 'నిచ్చెద నిష్ట మడుగు'
మనిన నాతండు జపాతినిష్ఠయ కోర,
నది యిచ్చి దేవి 'నీ కత్యుదాత్త

తే. గతియు నగు, ధర్మ మర్థి నీకడకు వచ్చు,
యముఁడుఁ గాలుండు మృత్యువు నరుగుదెంతు
రనఘ! నీకును వారికి నావహిల్లు
వాద'మని చెప్పి చనియె భూవరవరేణ్య! 133

క. ధరణీసురుఁడును జపత
త్పరుఁడై దివ్యాబ్దములు శతంబు గడపె; న
ప్పురుషవరుకడకు ధర్మము
పరమప్రీతిఁ జనుదెంచెఁ బౌరవముఖ్యా! 134

తే. అట్లు సాకారమై వచ్చి యతనితోడ
'నీజపంబున సిద్ధించె నిరతిశయము
లైనపుణ్యలోకములు; నీ వందుఁ జనుము
తనువుఁ జిత్తంబు విడిచి యుత్సవ మెలర్ప' 135

వ. అనిన విని యమ్ముని ధర్మంబున కిట్లనియె: 136

క. తనువు దొఱఁగి సను లోకము
లనఘా! యే నొల్ల మేల యైనను; దుఃఖం
బున కోర్చి నా తపంబున
కనుగుణమై యుండ దీని నగునె తొఱంగన్. 137

వ. అనుటయు ధర్మంబు 138

క. 'ఒడ లెట్లు విడువ వలదే
కడురమ్యము నాక, మింత గానవొకో!' నా
వుడు 'మేను వెలిగ నటవో
నొడఁబడ' నని పలికె బ్రాహ్మణో త్తముఁ డధిపా! 139

వ. అని పలికిన ధర్మం బతనితో 'నీవొడలు విడువ నొల్లవు పో, యమకాల మృత్యువులు వీరె వచ్చిరి; చూడు' మనియె; నయ్యవసరంబున వారలు వచ్చి యమ్మహీసురవరుముందఱ నిలిచి తమ్ముం బేర్కొని; రాతని నుద్దేశించి యముండు నీజపంబుఫలంబు సిద్ధించె ననియుఁ, గాలుండు నీకు నాకలోకారోహణంబునకుం గాలం బైనం దోఁచితి ననియు, మృత్యువు కాలచోదివనై నిన్ను నేఁడు గొనిపోవచ్చితి ననియుం బలుకుటయు, నమ్మాటలు గీటునం బుచ్చుచు వారలవదనంబులు విలోకించి సవినయవ్యాహృత స్వాగతుం డయి యవ్విప్రుం 'డేను మీకు నెప్పని సేయువాఁడ'నని పలికె; నట్టియెడఁ దీర్థయాత్రాపరుండైన యిక్ష్వాకుం డచ్చటికి నేతెంచి వారలందఱకుం బ్రణతుండై బ్రాహ్మణుం డతిథింగా నిరూపించి యాదరభరితుండై. 140

-: కౌశికునకు నిక్ష్వాకుమహారాజునకు నయినసంవాదము :-

సం. 12-192-2,3.

క. 'నాకలిమితోడ నిచ్చెద
నీ కెయ్యది యిష్ట' మనిన నృపతి 'నృపులు దా
నె కపరులు గొనువారలె?
యేకామ్యము లైన నిత్తు నీ వడుగు తగన్.' 141

వ. అనిన విని విప్రుం డవ్విభున కిట్లనియె: 142

క. 'కొనువారు ప్రవృత్తుఁగా
క నివృత్తులు గొందురయ్య? కామ్యఁబులు నా

మనమున లేవే? నేమియుఁ
గొన నిత్తున; కాన యధిపుఁ కోరుము తగఁగఁన్. 143

వ. పూజారూపంబున నిచ్చినయది యతిథి గైకొనుట యెగ్గుగా;' దనుటయు
నమ్మనుజపతి 'నీ విచ్చువాఁడవయేని నీసకలజపంబుఫలంబును నిమ్మ'నిన
నమ్మహీదేవుండు. 144

క. 'జపఫలమున సగ మిచ్చెద
నృప యంతయునైనఁ గొనుమునీ' వనపుడు' 'న
జ్జపముఫలం బెయ్యది, యని
నృపుఁ డడిగిన నాతఁ 'డేను నిరపేక్షుండన్. 145

క. కావున ఫల మిట్టిది యని
భావింప నెఱుంగ; నొరులఁ బనివడి యడుగన్
నీ వా ఫలఁబు గొను; మది
దా వినఁబడుఁ బిపప ధర్మతత్త్వజ్ఞులచేన్. 146

వ. అనుటయు నయ్యినతనయుండు 'ఫలం బిట్టి దని యెఱుంగవేనిం గొనలొల్ల'
ననపుడు నతం డితని కిట్లనియె: 147

క. నీ వడిగి తేను నిచ్చితి
భూవల్లభ! యింక సత్యమున కూనము గా
దే వరియింపుమి' నావుడు
నావసుధాధీశుఁ డద్ధరామరవరుతోన్. 148

వ. 'రాజులకు యుద్ధంబు సుకర్మంబు గావున నీతో వివాదయుద్ధంబు సేసితి
ననిన నతండు 'నీ వేమి సేసి తేమి? యది యట్లుండనిమ్ము.' 149

క. విను మిచ్చెద నని యామియుఁ,
గొనియెద నని పలికి పిదపఁ గొనకునికియు న

త్యస్పతంబులు; సత్యవ్రత
మునకుం దొలఁగంగ మనకు భూవర! తగునే. 150

క. సత్యమ తపమును యజ్ఞము
సత్యమ వేదంబు దాంతిశాంతులు నగుటన్
సత్యమ దొఱఁగుట నిర్మల
నిత్యానుష్ఠానములను నిష్ఫలము లగున్. 151

వ. అనిన విని ధర్మంబు వారల నుద్దేశించి యమూమలు విన 'వీరికి వివాదంబు వలదు; విప్రుండు దానఫలంబును, రాజు సత్యఫలంబును బొందువా' రనియె నట్టియెడ నాకంబు నరాకృతి దాల్చి వచ్చి త న్నెఱింగించి యయ్యిరువుర నాలోకించి 'వా దేనమీ రిద్దఱుం దుల్యఫలప్రాప్తు లయ్యెద రిట్లు సేయుం' డని పలికె 'నవ్విభుం డడ్డేని నితండును నాయిచ్చునది గొనవలయు'ననుటయు నమ్మని 'యేను దపస్స్వాధ్యాయనిరతుండం బరిగ్రహవిధియందు విరతుండ.'

క. అనపుడు నరనాథుఁడు 'నా
కును నీకును సరియ కాఁగఁ గోరెద సత్క-
ర్మసిరూఢి మత్సుకృతఫల
మనఘా! కొనవే యనుగ్రహంబు దలిర్పన్.' 153

వ. అని ప్రార్థించె; నప్పుడు వికృతవేషు లగు పురుషు లిరువురు దమలో వివాదంబు సేయుచు వచ్చి 'యవ్విభుండు మనల శాసింప నొడయం' డనుచు నిశ్శ్వాకునుందఱ నిలిచిరి; వారితెఱంగు వినుము. 154

తే. ఒకఁడు గోదాన మొనరింప నొక్కరుండు
తత్ఫలము వేఁడఁ బ్రీతి నాతండు నొసఁగఁ
గొనినవాఁ డిది దక్కువ దనకు నని త
లంచి యుత్తమగోయుగళంబు విడిచి. 155

వ. సత్పాత్రదానక్రియ నిర్వర్తించి తత్ఫలంబు మున్ను దనకు గోదానఫలం బిచ్చిన యతని కిచ్చువాఁ డయిన నతండు గొనువాఁ డయి యుండి కొనక యెడసేసి తిరుగం దిరుగ నప్పుడు ముట్టం బట్టిన వాడు పుట్టిన వచ్చినవారై

ర త్తెఱంగెల్ల ను క్తి ప్రత్యుక్తుల నప్పుడమిఱేనికి నేర్పడం జెప్పి రట్లు; నెప్ప
వినిన యవ్విభునితోడ దొలుత నొసంగినవా 'డితం డడిగిన నెమ్మిం బ్రతిగ్ర
హింపగా నొసంగితి; బ్రతిగ్రహం బొల్లనినన్ను నితండు నిర్బంధింపం
దగునే'యని చెప్పిన బిమపటియాతం 'డితండు గొనియెవ నని యొడంబడి
కొనమి పాతకం బగుట కర్మకాండవిదులెల్ల నెఱుంగుదు' రనవుడు గౌశికుం
డిక్ష్వాకు నుద్దేశించి'వింటె యప్పురుషుని వచనంబు' లని పలికి వెండియు. 156

క. నృపఁ నీవు మదీయం బగు
జపముఫలం బడిగి; తేను సమ్మతి నీఁగా
విపరీత ఫణితు లాడిన
శపియింతుఁ జుమీ! యెఱుంగఁ జాటితి నీకున్. 157.

తే. అనీన నాతఁడు భయమంది యాత్మలోన
'నొరుల యాగికి నకట చేయొడ్డకుండు
నట్టి నా కిది వలసెనే' యనుచుఁ గరము
సాఁచె నవ్విప్రుదెసకు నిశ్చయముతోడ. 158

ప. అతండు 'ననేకవర్షంబులు సేసిన జపఫలంబంతయు నీ కిచ్చితి'ననుచుధారవో
సిన నమ్మహీసురవరునాననం బాలోకించి భూపాలుండు 'నాకరంబున జ
లంబులు వడియె; మనకు నిద్దఱకును సత్కర్మసమత్వంబు గలుగవలదే! నా
యదియైన యాగఫలం బేను నీ కిచ్చెదఁ గైకొను'మని పలికె; నట్టియెడ
వికృతవేషు లగు నప్పురుషు లిరువురు నన్నరనాథు నుద్దేశించి 'యేను కామ
క్రోధులము;ధర్మయమాదుల చేతను మాచేతను మీరిద్దఱుం బరీక్షితులరైతి;
రింతియ కాని యిచ్చటయుఁ గొనుటయును నివి దె వాచరితంబులు; మీ
కుంబని గా'దని పలికిన విని యవ్విప్రుండు భూవిభునితో నిట్లనియె. 159

ఆ. శ్రద్ధయును బలంబు జపవిధియందు సా
విత్రి నాకు నిచ్చె; వేఱ జపము
నాచరింపఁ దగదు; నైన ను నిందఱ
యెదుర నీవు గోరి తివ్విధంబు. 160

క. కావునఁ బ్రార్థన సెఱుపం
గా వెఱచెద; నట్లుకాక గైకొంటి ధరి
త్రీవల్లభ! నీసుకృతం
బే వెఱపు దిగిచె నరుగు మీ వగ్గతికిన్. 161

వ అనియె నయ్యిరువుర సత్కర్మనిష్ఠావిశేషంబుకం బ్రీతులయి బ్రహ్మాదిదేవతలు వారలమీఁదం బుష్పవృష్టి గురియించుచు నయ్యెడకు నరుగుదెంచి యభినందించిరి; దేవతూర్యంబులు మొరయ సప్సరోగణంబు లాడుచుం బాడుచు నుల్లసిల్లె; నయ్యవసరంబునం గొఱకు నిశ్వాకు నుద్దేశించి నాకం బిట్టనియె: 162

తే. అనఘులార! సంసిద్ధుల గైతి రింకఁ
దడయ నేటికి నిర్మలోదాత్తగతికి
నుత్సహింతురు గా కన్న మత్సరాది
బంధకంబులఁ బోఁద్రోచి బ్రాహ్మణుండు. 163

వ. ధర్మయమాదులను నాదిత్యసంఘంబును సవినయప్రణామ సహితంబుగా నామంత్రితులం జేసి. 164

-: కాశికేశ్వాకులు బ్రహ్మపదప్రాప్తి లగుట :-

సం. 12-193-18

క. వాయువుల నియతవృత్తిమ
నోయంత్రణ బొమలనడుమ నూల్కొలిపి విచే
ష్టాయితశరీరుఁడై మూ
ర్ధాయోజితములుగఁ జేసి యత్తలఁ జేర్చెన్. 165

వ. అప్పుడు తదీయ బ్రహ్మరంధ్రోద్గతుండును మహాజ్యోతిర్జ్వాలాకృతియుం బ్రాదేశమాత్రుండును నగు పురుషు నెమరొక్కని పరమేష్ఠి సమాధానంబున వచ్చితే యని పలికి వెండియు. 166

తే. జాపకులకు యోగులకును సమమ పుణ్య
గతివిశేషంబు ప్రత్యక్షకలిత మందు
జాపకులు నిర్భరోత్థానశ క్తి నధికు
లనుచు వ క్త్రించు విచ్చి రమ్మనియె నధిప! 167

వ. అనుటయు. 168

తే. బ్రహ్మరంధ్రనిర్గతుఁ డైన బ్రాహ్మణుండు
బ్రహ్మవదనంబు సొచ్చె; భూపతియు నట్లు
వెడలి తద్వ్య క్తి మెప్పటి వికసనంబు
బొంద నందుఁ బ్రవేశించె భూపవర్య ! 169

క. దేవత లచ్చెరువడి య
ద్దేవుని నయ్యిరువురను నుతించి; రజుఁడు సం
భావించె ధర్మమును నవ
నీవర! యప్పరమవిభుఁడు నిరుపమలీలన్. 170

వ. తదనంతరంబ యంతర్హితుం డయ్యెఁ;దక్కినవారును నిజస్థానంబుల కరిగిరి; 'జాపక ప్రకారంబును దదీయసుగతివిశేషంబు నెఱింగించితి; నీ వింక నెయ్యది వినవల!' తనవుడు నాపగాసుతునితోడం గుంతీతనయాగ్రజుండు 'నిరతిశయ జ్ఞానయోగంబు విధంబు వినువాంఛ నాకుం గలదు సెప్పవే' యనిన నప్పురుషుం డప్పారవో త్తమున కిట్లనియె 'మను బృహస్పతి సంవాదం'బను నితిహాసంబు గల; దది నీయడిగినయర్థంబునకు బోధకం బయి యుండు నాక ర్ణింపుము:మను వాత్మీయగురుండగు దేవగురునకుం బ్రణమిల్లి యిట్లనియె:171

-: మను బృహస్పతి సంవాదము :-
సం. 12-194-2

సి. 'జ్ఞానయోగము కృపాసంపన్నబుద్ధి నా
కెఱిఁగింపవే' యన్న నెఱమి నాతఁ

డతనికి నిట్లను 'ననఘ! సత్కర్మమో
గ్రశ్ధ దానికిఁ గారణం; బ
నిష్టంబు ద్రోవను, నిష్టంబు దేరను
నరుఁడు కర్మాచరణం బొనర్చు;
నెయ్యవి సుఖము లొక్కింతకాలమునకు
నవియ దుఃఖంబులై యానహిల్లు;

ఆ. నింత యెఱిఁగి ఫలముఁనెడ నిరపేక్షుఁడై
నతఁడు సౌఖ్యదుఃఖయమముఁ ద్రోచి
కామముఖ్య విపదకంపితజ్ఞాన వి
శేషబుద్ధిఁ బరమసిద్ధిఁ బొందు. 172

వ. అని వెండియు. 173

క. అసమాలంబ మశబ్దము
రసగంధస్పర్శరూపరహితం బగుటం
బ్రబసరించు నింద్రియములకు
వసంబు గా దొందఁ బరమవస్తువు పుత్రా! 174

క. స్త్రీపున్నపుంసకత్వము
లాపరత త్త్వమున లేమి నది విను త త్త
ద్వ్యాపారాపేతం బయి
దీపించుచు నుండు బోధ దేహత్వమునన్. 175

తే. వెలుఁగుచుండెడి దీపంబు వేఱవస్తు
వులఁ బ్రకాశింపఁజేయున ట్లలఘునిత్య
బోధనజ్యోతి యింద్రియంబులను మాన
సమును దనప్రభ విగతజాడ్యములఁ జేయు. 176

క. విను, పురుషున కింద్రియములు
మనంబు గలిగించుఁ ద్రిగుణ మనుజేశునకుం
దనతనతెఱఁగునఁ గార్యము
లనేకములు సూపు సచివు లట్టుల వత్సా! 177

వ. అని మఱియును. 178

చ. అసలము దోఁచునే తరువునందుఁ గుఠారముఖంబు లైన సా
ధనములఁ ద్రవ్య సజ్జనహితా! తగఁ ద్రచ్చినఁ గాక; యట్లు యి
త్తనువు నలంగఁజేసి పరతత్త్వముఁ గాంతు మనంగ రాదు వి
న్ననువున నాగమో క్తమథనం బొనరించినఁ గాని యారయన్. 179

క. డెందమున కింద్రియములకు
నొండఁగ రాకున్నలేక యున్నే తత్త్వం
బెందు నపరభాగంబునఁ
బొందవు చూడ్కి లది లేక పోవునె సుమతీ! 180

క. వల యురి యోదము గాలము
గలిగికదా మృగముఁ బక్షిగజము ఝషము ద
ఱులు పట్టుదు రట్టుల త
జ్ఞులు విజ్ఞానంబుకలిమిఁ జూతురు పురుషున్. 181

క. పా మెఱుఁగుఁ బాముకాళులు;
ధీమంతుం డెఱుఁగ నేర్చు ధీసాక్షిత్వ
శ్రీమంతు, బరమపురుషుని
ధీమలనిర్మోచనంబు తెఱఁగు నెఱిఁగినన్. 182

క. కలుగుం దోఁపమి యమవసఁ
గలుగునె యంతట యమృతకరునకు నాశం
బలఘుపరవస్తువునకుం
గలదె యభావంబు మనసు గానని కలుచన్. 183

క. రవిబింబము రాహువుపయిఁ
గవిసినఁ బాసినను దోఁపకయుఁ దోఁచియు నుం
డువిధమ యజ్ఞానంబున
యవిరతి విరతుల యధీనుఁ డగు టాత్మునకున్. 184

క. విను, మానసప్రసన్నతఁ
దనుఁ గనుపురుషుండు గలుషతం గానఁడు దే
హినినీట రూపు సూడఁగ
ననువై కలఁక నది లేనియట్టుల పోలెన్. 185

తే. ఇంద్రియంబులు దమయిచ్ఛ నిట్టు నట్టుఁ
దిరిగెనేనియు దుఃఖముల్ దెచ్చు; నవియ
కట్టువడి సుఖ మొనరించుఁ; గాన యాత్మఁ
గావవలయు నింద్రియజోరగణముపలన. 186

క. పాపక్షయమున బోధం
బాపాదింపఁబడి మెఱుఁగుటద్దము కరణిం
జూపునకు వచ్చుఁ దనుఁ దా
నాపురుషుఁడు గాంచు పనికినై తన్మయతన్. 187

తే. ధ్యానయోగ నిశ్చల మగు నంతరంగ
మెడల విడుచు గుణంబుల నిర్ధశాంత
మైన నిర్గుణవస్తువునంచుఁ గలయుఁ;
బరమపద మది; దానికిఁ బరము లేదు. 188

వ అని పలికి సమ్యగ్జ్ఞానంబునకు మాయమాటు గావున దాని మొఱంగు తెఱంగు
దేటపఱుపం దలంచి యిట్లనియె: 189

-: బృహస్పతి మనువునకు ఉపదేశించిన మాయాప్రకారము :-

సం. 12–198- 1,2

క. వినుఁ, మాయావిధ మిట్టిది
యని యారయ వెరవుగలుగ దవనిం జరణం
బనఘా! మోపనిజంతువు
ననుఁ జొప్పరయంగరాని చందం బొందున్. 190

క. గుణమూ ర్తి మాయ దానిని
గణుతించెద నన్నఁ దెగడు గ్రాహ్యత్వంబున్,
గుణములఁ బెడఁబాపంగా
గణనాతీత మగువెలుఁగు గనుఁ దాన తనన్. 191

తే. వినుఁ, నృప! స త్త్వమును రజస్సును దమస్సు
ననఁగ గుణములు మూప్పిరి గొనుచు నాత్మఁ
జుట్టుకొను; నొండుమెయిఁ దెగ విట్టలముగ
నొలయు వైరాగ్య మను కొడవలిన కాని. 192

వ. అని నిర్దేశించి వెండియు. 193

ఆ. మణిమయములుఁ గనకమయములు రజతమ
యములు మఱియు మృణ్మయాదికములు
నైన పెక్కు-పూసలందుఁ ద్రా డున్నట్లు
భూతకోటియందుఁ బురుషుఁ డుండు. 194

క. ఏకరసమయక్షేత్ర మ
నేకౌషధిరసమయం బయినయట్లు సుమీ!
యేకవిధమైన బుద్ధి య
నేకము లగుకర్మములమెయిం బోక నృపా! 195

ఆ. జలము పృథివికంటె, జలముకంటెను దేజ
మంతకంటె వాయు, వాకసంబు
దానికంటెఁ బెద్ద; వానికెల్లను బెద్ద
మనసు; బుద్ధి పెద్ద మనసుకంటె. 196

తే. ధరణి మొదలైన పంచభూతములకంటె
మనసుకంటెను బుద్ధికంటెను మహ త్త
రంబు గాలంబు; గాలత త్త్వంబు మిగిలి
యుండు విష్ణుఁ; డీజగముల కొడయుఁ డతఁడు. 197

క. ఆదియు మధ్యము నంతము
నాదేవేశునకు లేమి నవ్యయుఁ డతఁ; డీ
వేదములను నానావిధ
వాదములకుఁ జేరుగడ భపక్షేపి నృపా! 198

క. అనుభవము ప్రమింగు శాంతిం
గనునది నిర్భేదసత్ప్రికాశం బది; దా
విను, తలఁపునకును బలుకున
కు నగమ్యము; గర్మముల కగోచర మనఘా! 199

క. మనసు గొని, మనసు బుద్ధిం
గొని, బుద్ధిని దర్శనంబు గొని, దర్శనమున్
వినుకమమున నొదిఁగించినఁ
గను బుధుఁ డక్షరుని విష్ణు ఘనబోధమయున్. 200

క. అమృతం బచ్యుత మమలం
బమేయ మవ్యయ మనంత మవ్వెలుగు యమా
ద్యముల నలవడినచిత్తము
శమాతిరేకమునఁ బొంద సంవేద్య మగున్. 201

క. అని గురుఁ డుపదేశించిన
వినిి, మనువు గృతార్థుఁ డయ్యె విద్వన్నుతఃి నీ
వును నలవరింపుమీ మన
మ న నివ్వాక్యముల యర్థముం దత్పరతన్. 202

వ. అనిన విని పరమహర్షంబునం బొండవాగ్రజుండు పితామహుం బ్రశంసించి 'మహాత్మా! మహనీయుం డగుకృష్ణుని మాహాత్మ్యంబు వినవలతుం జెప్పవే, యని యడిగిన నతం డమ్మహీపతితో 'నారదజామదగ్న్యకూర్మ్మడేయవ్యాస వాల్మీకిప్రభృతిమునీంద్రులు సెప్ప వినినతెఱం గెఱింగించెద నాకర్ణింపు'మని యిట్లనియె: 203

క. కృష్ణుఁడు బ్రభవిష్ణుం డగు
విష్ణుం డనిలాగ్నితోయ వియదిలలఁగ్రియా
నిష్ణాతత్వవినోదన
త్ప్ణ గల్పించెఁ దనదు దివ్యవిభూతిన్. 204

తే. అట్లు కల్పించి జలములయందు భవ్య
తల్పగతుఁ డైన నాభిఁ బద్మంబు దోఁచె;
నం దజుఁడు పుట్టి సృజియించె నందనుల మ
నంబునన సప్తసంఖ్యుల నరవరేణ్యా! 205

వ. మరీచియు నత్రియు నంగిరసుండును బులస్త్యుండును బులహుండును ప్రతు వును దక్షుండు ననం బరగు వారలయందు మరీచికిం గశ్యపప్రజాపతి జన్మించె; నతనివలన సురాసురగరుడనాగాది జాతిసంభవంబునుం గలిగె;నత నికి సూర్యుండును, నత్రికి సోముండును నుదయించి, రాజవంశంబులకుఁ గూటస్థులైరి; సూర్యసోమాన్వయజాతులై నన్నపతు లనేకు లనేకదేశంబు లేలిరి; దేశకాలవిశేషంబుల న్నృపకులంబులు బహుశాఖంబులై వర్తిల్లు; వాని నెల్ల గనవలసినయప్పుడు విష్ణుండు పరస్పరవిరోధజనితసంగ్రామంబులు నిమిత్తమాత్రంబులుగాఁ గల విశేషప్రకారంబుల నుపసంహరించు నద్దేవుండు

వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధాత్మకంబులగు చతుర్విధదివ్యస్వరూపం
బులు గలిగి జగద్భరణం బాచరించుచు నిట్లు లీలాజన్మంబులం బొంది క్రీడ
సలుపు' సని కృష్ణునిం జూపి 'యీభూతేశ్వరు మానుషసామాన్యదృష్టిం
జూచుట యజ్ఞానంబు; గృష్ణుండు భక్తపరతంత్రతం జేసి యుత్కృష్టచరితుల
యారాధనంబునకు భాజనంబయి భోగమోక్షంబులు గరుణామయకటాక్షంబుల
నొసంగు' ననినం బ్రీతుండై భీష్మునకుం బ్రణమిల్లి యుధిష్ఠిరుండు. 206

క. 'మునిజనవినుతచరిత్రా!
మనుజుం డెవ్వనిఁ దలంచి మహనీయ రం
జనసిద్ధిఁ బొందఁ గనుఁ నే
యనువు దలఁపు నలవరించు'నని యడుగుటయున్. 207

-: భీష్మ్రుఁడు ధర్మ్రజునకు విష్ణుమంత్ర ప్రభావంబు
తెలుం గెఱింగించుట :-

సం. 12-200-3

వ. ఆధర్మతనయుతోడ నద్దేవవక్త్రుం డిట్లను 'నారదునిచేత వినినతెఱంగు విపరం
చెద నాకర్ణింపుము.' 208

తే. పరము నక్షరు విష్ణునిఁ బ్రస్తుతించి
నారదమునీంద్రుఁ డంజలి నమితమైన
మస్తకముఁ జేర్చి భక్తిసమగ్రచిత్త
వృత్తి నల్లన యిట్లని విన్నవించె. 209

క. దేవా! మోక్షార్థిజనము
లేవెరవున నిన్నుఁ దలఁతు! రేజప్యము సం
భావింతురు! నా కానతి
యీవే భక్తపరతంత్ర యేర్పడఁ గరుణన్. 210

తే. ఆనిన నద్దేవమునిపలు కాదరించి
వరదుఁ డగు విష్ణుఁ డిట్లనుఁ: 'బరమభ క్తి
నిర్మలశ్రద్ధ యింద్రియనిగ్రహంబు
మన్మయధ్యానమునకు నమాత్యకోటి. 211

క. విను, వీతకల్మషున కవి
పనపడుఁ; గల్మషములెల్లఁ బాపఁగ నామె
చ్చిన యట్టి పరమసాధన
మనుస్మృతి జపించునది నియతిమెయి దానిన్. 212

తే. ప్రవణపూర్వక మగునమఃపదము పొంత
షడ్గుణైశ్వర్యవాచక సర్వవసన
నిర్వచన శబ్దములు గ్రమనిష్ఠమెయిఁ జ
తుర్థిఁ గూర్పంగ మంత్రంబు తోఁచు బెరసి. 213

క. తొలితొలి యిమ్మంత్రము ని
శ్చలమానసుఁడై జపించి జపియింపంగా
వలయు ననుస్మృతి దానం
గలుగుఁ జతుర్వర్గసాధకత పురుషునకున్. 214

క. అని మతియు దయ ననుస్మృతి
యను పేరం గలుగుదాని నమ్మునిపతి కి
ట్లని చెప్పె నచ్యుతుఁడు నిజ
మనఃప్రియంబై న యట్టి మహిత స్తవమున్. 215

సీ. అవ్యక్తు శాశ్వతు నఖిలప్రభవభూమి
భక్తవత్సలు విష్ణుఁ బరమపురుషు
నక్షయుఁ బ్రాంజలియై యాశ్రయించెదఁ;
బుండరీకాక్షుని భువనసాక్షి
నిత్యుఁ బురాణు వర్ణించెదఁ; బరు సహ
స్రాక్షు నక్షరుని లోకైకనాథు

భవ్యఁ గొల్చెద; భూతభవ్యభవత్ప్రభు
సర్వతో ముఖ భూసంప్రపత్తి
ఆ. నమృతు నచ్యుతుని ననంతు హృషీకేశు
రవిసహస్రనిభు హిరణ్యగర్భ
సబ్జనాభు సత్యు నాద్యంతరహితు భూ
గర్భఁ బ్రభువు భక్తిగమ్యుఁ దలఁతు. 216

తే. అచలు సూక్ష్మ పరేణ్యు సహస్రశీర్షు
నభయకారి సశీర్షు నారాయణుని స
నాతనుని యోగమూర్తి లోకాతిరిక్తు
ధ్రువుని నీశ్వరు హరి భక్తితోడఁ గొలుతు. 217

క. ఎవ్వఁడు సచరాచరగురుఁ,
డెవ్వని నాభీసరోజ మీనె విధాతన్,
నివ్వటిలు జగములన్నియు
నెవ్వనిచే నమ్మకుందు నెప్పుడు: గొలుతున్. 218

తే. స్థావరములు జంగమములు ధాతలోను
గాఁగఁ బ్రళయంబు నొందినకాలమునను
నిలుచు నెవ్వఁ డొకండ యానిత్యసత్య
లతిత శార్ఙ్గి బ్రపన్నుఁగాఁ గొలుతు నియతి. 219

క. కాలముఁ బర్జన్యుండును
నేలయు సస్యంబుఁ గ్రియయు నిష్క్రియయును ధ
ర్మాలోకమునై మహిమ
న్లీల సలుపు వాసుదేవునిం బ్రణుతింతున్. 220

క. అనలునకు రవికిని శశాం
కునకును గ్రహతారకములకును దేజం బె
వ్వనివలన నావహిల్లెడు
ననుపాధికతేజుఁ గొల్తు నవ్విశ్వాత్మున్. 221

తే. నాలుగింటను వెండియు నాలుగింట
రెంట నైదింట మఱియును రెంట వేల్చి
యజ్ఞశీలు రారాధించు నట్టివిష్ణు
డిష్టదాయి ప్రసన్నుఁడయ్యెడును నాకు. 222

ఆ. యజ్ఞధరుఁడు పంచయజ్ఞుండు లక్ష్మికి
నునికిపట్టు యోగమునకు నెలవు
సర్వమునకు నిష్టసదనంబుగా నొప్పు
వాని నాశ్రయింతు వరదుఁ బరము. 223

క. అగమనునిం బాంథు నఖిల
జగద్భరణ్యపరు నమూర్తి సాగరనిభబో
ధగరిష్ఠుఁ బంచకాల
జ్ఞు గుణాత్మకు నిర్గుణత్వశోభితుఁ గొలుతున్. 224

క. వ్యక్తమునకుఁ బ్రభవం బ
వ్యక్తం బాతత్వమునకు నవుల యను వచో
యుక్తికిఁ బరాయణం బగు
భక్తపరాధీను భవ్యభావ్యు నతింతున్. 225

క. జ్ఞానధాన్యపరాయణు
లైన మహాత్ములు జితేంద్రియత్వమహితు లె
వ్వానిం బొందిన మరలరు
వాని శరణుఁజొచ్చి బ్రదుకువాఁడ సుకృతినై. 226

క. లోకం బంతయు నెవ్వం
డేకాంశంబునన నిర్వహించుచు నగ్రా
హ్యాకారుండై వెలుఁగు ద
యాకరు నప్పద్మనాభు నభివర్ణింతున్. 227

వే. అయిదుదెఱఁగులఁ బ్రకృతిఁ బంచాననముల
లనుభవించు క్షేత్రజ్ఞు సత్త్వాదిగుణచ
యంబు లీల భుజించు మహత్త్వకలితు
సంశ్రయించు మదాత్మప్రపత్తిఁ గోరి. 228

క. మతిగలసాంఖ్యులు యోగా
న్వితులు నగుమహాత్ము లెవ్వనిం గని పునరా
గతి లేని సుగతి వడయుము
రతర్క్యవై భవునిఁ దలఁతు నప్పరమాత్మున్. 229

క. ఇనునడుమ వెలుంగుచు సో
మునిమధ్యమునం జలత్వముం బొందనిని
ల్పున వెలయుదీప్తి యగు వా
ని నిరంజను నంతరాత్మనిం బాపింతున్. 230

క. సోమార్కాగ్నిమయముఁ దా
రామయమును నిత్యసుస్థిరంబును నగుతే
జోమయతత్త్వము నాత్మా
రామత్వంబున నిరంతరంబును జూతున్. 231

క. గుణములకు నాదియై ని
ర్గుణమ్ములకు నాద్యుఁ డగు నరూపుని లక్ష్మీ
ప్రణయవరు నఘుని సూక్ష్మునిఁ
బ్రణుతింతుఁ బ్రసన్నుఁగాఁ బరము సర్వగతున్. 232

క కలయంగ నెల్లయెడలుం
దలలును లోచనములును వదనములు నగుని
ర్మలు నిర్వికారు నిన్నుం
గొలిచెద సర్వైకసాక్షి గోవింద హరీ! 233

క. నిను నెఱుఁగకున్న సంసా
రనిమగ్నత వోదు, గోచరము గావు మనం
బునకు నఖిలేంద్రియములకు
ననుఁ నే మనువాఁడ నింక నారాయణుఁడా : 234

క. రోషముఁ గామము రాగ
ద్వేషములును లేక భక్తి తిరమై యేకా
శ్లేషిణిగాఁ గొలుతు రవి
శ్లేషమనోనిలయవృత్తి సిద్ధులు నిన్నున్. 235

క. ఫలములు గోరక కర్మం
బులు నడపుచు వాని విమలబోధాగ్ని హతిం
బొలియించుచు నిర్ద్వంద్వత
నెలకొను నేకాంతిజనులు నినుఁ గంద్రు హరీ : 236

క. దేహసు నదేహ నఖిల
దేహిసమున్ నిన్ను భక్తిఁ దెలుతురు దురిత
వ్యూహమ్ముఁ బుణ్యచయమున
మోహత నిరసించు యోగిముఖ్యులు కృష్ణా : 237

చ. ప్రకృతియు బుద్ధ్యహంకృతులు భావము భూతచయంబు నింద్రియ
ప్రకరముఁ గేశవా! భవదుపాశ్రయభాసితవర్తనంబు లా
సకలమునందు నీవును బ్రసన్నత నిల్తువి నీకు నీవు వా
నికి నిలువంగఁ బట్టగుట నిక్కముగా నిటులై వెలుంగవే. 238

క. ఏకత్వం బన్యత్వమ
నేకత్వము గలుగు నీమహిమచందం బా
లోకింప నిపుణు లగు సు
శ్లోకులకుం బరమపదము సులభము శార్ఙ్గీ : 239

తే. అచరములును జరంబులు నైనభూత
సముదయంబులు మణులు సూత్రమున నున్న

కరణి నీయంద యున్నవి గాన సమత
నేకభక్తినే గొరెద నిమ్ము దేవ! 240

క. హేతురహితుఁడవు, కర్తవు
భూతస్రష్టవు, సమస్తభోక్త; వత్త్వం
బై తత్త్వము నగుదు జగ
న్నేతవు కూటస్థుఁడవును నీవ ముకుందా! 241

సి. ద్వేష్యంబుఁ బ్రియ మను వేర్పాటు లేదు భూ
తములయందెల్లను సముఁడ; నాకు
భూతసంయోగంబు బుద్ధ్యహంకారయు
క్తియు గుణత్రయసంగతియును లేవు;
ప్రారంభణంబు ధర్మాధర్మములు నింద్రి
యములపొందు విషయాభిరతియుఁ
బరిహృతంబులు; జరామరణమోక్షార్థినై
శరణంబు వేఁడెదఁ; గరుణ నాదు

తే. ఘ్రాణజిహ్వాలు మహి నుదకమున దృక్కు-
త్వక్కు దేజంబునందును వాయువునను
శ్రోత్ర మాకాశమునఁ గ్రమసూత్రితముగఁ
బొందఁజేసి గోవింద! యానంద మిమ్ము. 242

సి. ఇల జలంబుల జలఁబులు, శిఖి శిఖి, వాయు
వున వాయు, వంబరఁబునను నంబ
రంబు, చిత్తఁబునఁ జిత్తం, బహంకృతి నహం
కృతి, బుద్ధిఁ దగ నొదిగించి యింత
వట్టునుగూడ నవ్యక్తంబుఁ జేర్చి య
వ్యక్తంబు నిజభంగి యైనఁ ద్రిగుణ
సామ్యావ్యవస్థితి సడిసన్నఁ గారణ
భూతతన్మాత్రలు పొదువకుండఁ

తే. డొలఁగ బెట్టుట దొరకొనవలయు; దానఁ
బరమమున కేవలము నగుపదము గలిగి
యేన నీవను నైక్యంపుటెఱుక వొడముఁ
గాత గమనాగమనములు గ్రాఁగిపోవ. 243

క. హరియం దేనును నాయం
దరయంగా హరియుఁ గలము; హరి నాకును నా
హరి కేను ననశ్వరులము
హరిప్రసాదోదయము మహత్తరమహిమన్. 244

తే. బుద్ధియు ప్రాణమును నిన్నుఁ బొరయఁ జేయుఁ
జాలు భక్తి నా కొసఁగుము జలధిశయన!
పూర్వకర్మఫలంబులు పొందుఁగాక
యవి ఋణంబులు గడతేఱుటై సుఖింతు. 245

తే. నిన్ను నెప్పుడుఁ దలఁచెద; నన్ను నీవు
వత్సలుఁడ వయి వీఁడు నా వాఁ డనంగ
వలయుఁ జు మ్మయ్య! మఱవక వాసుదేవ!
దేవదేవ! మునీశ్వరభావనీయ! 246

క. తనుఁ దనయంద నిలిపి పే
రనువున బుద్ధికడ వెలుఁగు నచ్యుతుని సనా
తను నగ్రాహ్యునిఁ జిన్మయు
ననుఁ స్మరించునది యపునరావృత్తికినై. 247

క. పరమాత్ముని నారాయణుఁ
జిరంతనుని భక్తశేముషీనిష్ఠాస్వీ
కరణైకాయనుని నమ
స్కరణంబునఁ దలఁతు నతులషడ్విధభూతిన్. 248

తే. అని జపించి సర్వావస్థలందు ననుఁ వి
శిష్టభక్తి ననుస్మరించిన యతండు
సకలపాపంబులను బాసి శాంతి నొంది
యవ్యయానందపదమున నతిశయిల్లు. 249

తే. వైష్ణవియుఁ గల్మషప్రజధ్వంసినియును
నైన యీయనుస్మృతి ప్రాజ్ఞుఁడైన సజ్ఞుఁ
డైన నెవ్వాఁడు పఠియించు యజ్ఞదాన
సమయముల వాఁడు తత్ఫలశతము వడయు 250

క. సురపిత్పూజలఁ బావక
పరిచర్యలయందు నన్ను భక్తిఁ దలఁచుచుం
బరమనియతి నివ్వాక్యో
త్కరముఁ బఠించిన యతండు గనుఁ బుణ్యగతిన్. 251

క. వినుపించునది యనుస్మృతి
నను భక్తిం గొలుచు బహుజనముల కమావా
స్యను బున్నమ బారసిని స
వినయంబుగ దాన నెల్ల విభవముఁ గలుగున్. 252

క. జనము లనుస్మృతిఁ జదువఁగ
విని మ్రొక్కిన యంత్యజునకు విశ్రుతగతి గ
ల్గు ననిన సద్భక్తిజపిం
చిన యుత్తమజాతిజునకుఁ జెప్పఁగ నేలా. 253

ఆ. అఖిలకర్మఫలము నంతవంతంబు మ
ద్భక్తులకు ననంతపదము గలుగు;
నట్టు లగుటఁ దలఁపు మమరమునీంద్ర! ని
న్నది మదీయపదమహార్థిఁ జేయు. 254

క. జ్ఞానము గేవలకృప న
జ్ఞానికి నుపదేశవిధిఁ బ్రజనితము సేయం
గా నది సకలధరిత్రీ
దానంబునకంటె నధికతరఫలద మగున్. 255

క. కాపున నీ కేఁ జెప్పిన
యీవిధమంతయును బుద్ధహృదయులకుఁ గృపా
శ్రీవెలయఁ జెప్పుమీ; పు
ణ్యావహశీలురకు సులభమగు సర్వంబున్. 256

తే. అశ్వమేధసహస్రంబు లాచరించి
పడయ రాని మహోన్నతపదము నస్మ
దీయ భక్తిరసైకపరాయణుండు
వడయనేర్చు సుకరముఁగ బ్రహ్మపుత్ర ! 257

సీ. అని చెప్పె నిట్టు లయ్యనిమిషముఁనిపతి
యడుగంగ శంభుఁ డెయ్యది సమాద
రంబున నెఱిఁగించె రాజవంశో త్తమ !
తెల్లంబుగా నది యె ల్ల నీకుఁ
జెప్పితి; నేకాగ్రచి త్తుండవై పర
మాత్మ నన్నారదునట్ల భ క్తి
సంభృతశ్రద్ధానుషంగతాత్పర్యంబు
తోఁ దలంపుము కృతార్థుండ వగుదు

తే. పరమవరదరహస్యానుభావపూజ్య
మానమూ ర్తి యనుస్మృతి దీని జపము
బుద్ధిఁ బెనుచు, దుఃఖంబులఁ బోవఁ ద్రోచు,
బంధములఁ బాపు, నిత్యశుభంబు నొసఁగు. 258

క. అని భీష్ముం డుపదేశిం
చిన విని యానందభరితచిత్తుండై పాం
డుసృపాత్మజుఁ డప్పుణ్యా
త్మునకుం బ్రణమిల్లె వినయమునఁ దను వొప్పన్. 259

వ. ఇట్లు ప్రణామంబు సేసి యాధరణీవరుండు కురుపితామహుతో 'మోక్షమార్గ
బోధనప్రపంచం బుపదేశింపవే' యని యడిగిన నతండు 'వార్ష్ణేయాధ్యాత్మం
బనునితిహాసంబు గల; దాతంత్రంబు నీయడిగినది యై యుండు' నని పలికి
'వినుము వార్ష్ణేయనామధేయుం డగువాఁడు. 260

-: భీష్ముండు ధర్మజున కధ్యాత్మవిద్యాప్రకారం బెఱిఁగించుట :-

సం. 12-203- 1,2

క. మానితముని యొకఁడు సుఖా
సీనుండై యున్న నతనిశిష్యుఁడు వినయం
బూని నిలిచి మోక్షముతెరు
వానతి యీవే దయామయా నా కనుచున్. 261

వ. పాదములకుం బ్రణమిల్లినఁ బ్రబోధమహితాత్ముండగు నమ్మహాత్ముండు. 262

ఆ. భక్తి గలవు నాకుఁ బ్రజ్ఞానఘనుఁడ వ
ట్లగుట నీవు యోగ్యుఁడవు కుమార!
సదుపదేశమునకు సమవధానుండ వై
వినుము, నాదువాక్యవృత్తి తెఱఁగు. 263

వ. అని పలికి యిట్లనియె: 264

తే. కాలచక్రంబు నిరవధికంబు; దీన
సర్గములుఁ బ్రళయంబులుఁ జనుచు నుండుఁ;

ప్రళయమునఁ బరమాత్ముఁడు ప్రకృతిఁబొంది
యఖిలమును సృజయించుఁ గల్పాదియందు. 265

తే. భూతజాలంబులతో మునిపుంగవులును
దోఁచి మును ప్రళయంబునఁ దోఁపడంగి
చనిన సర్వవేదంబులు శాస్త్రములును
బడసి రద్దేవు దివ్యానుభావమునను. 266

క. న్యాయాద్యనేకతంత్రము
లాయంచితమతు లొనర్చి యఖిలజనాను
ష్ఠేయాచారముఁ బరి
జ్ఞేయములుగ విశదభంగిఁ జేసిరి పుత్రా! 267

క. అవి వినఁగ నెఱుఁగఁ జేయను
నవుఁ బరమబ్రహ్మబోధ మమరులకు మునీ
ప్రవరులకును దుర్లభ మ
య్యవగతము జనార్దనునక యలవడి యుండున్. 268

ఆ. సకలదుఃఖభేషజం బగున త్తెరు
వప్పురాణపురుషు నగ్గలంపుఁ
గరుణ నతనివలనఁ గనిరి మునీంద్రులు;
గ్రమముతోడ నర్వాగమ్య మయ్యె. 269

క. చైతన్యశక్తిఁ బురుషస
మేతత్వవిశేషమున వహించుఁ బ్రకృతి; త
జ్జాత యగును బుద్ధి; తదు
ద్భూత మహంకార; మదియుఁ బొరయుం జిత్తున్. 270

క. కలిగె వినుఁ మహంకారము
వలన నభము, దానఁజేసి వాయువు గ్రమసం

కలితజనములఁ దేజము
జలము నిలయుఁ దత్తదాత్తజన్యత్వమునన్ 271

వ. బుద్ధికి మహత్తను తత్త్వనిర్దేశంబునుం గలిగి యుండు. 272

క. వికృతులు మహదాదిక స
ప్తక ముభయవిధేంద్రియములు పదియు విషయ పం
చకమును మనసును గూడఁగ
వికారషోడశక మిది వివేకాభ్యర్థీ! 273

క. ఈసర్వము దేహత్వా
భాసిత మిది దేహి యైన పరమాత్ముని వి
న్యాసమునకుఁ గా నొదవి యు
పాసించుం గరణరూపమై యాకర్తన్. 274

తే. పుత్ర! వినుము నవద్వారపుణ్యపురము
నం దచింత్యసంవ్యాపకుఁడై శయించు
నీసమస్తభావంబుల నెనసి; యట్టు
లగుటఁ బురుషుండు నాఁ జను నవ్విభుండు. 275

క. అమరుం డవ్యయుఁ డజరుం
డమేయుఁ డమలస్వభావుఁ డప్పురుషుఁడు దే
హమున మహీజమునం దన
లమున్నగతి నుండు మథనలక్ష్యం డగుచున్. 276

ఆ. వినుము, యోగమథనమునఁ దోఁచు నత్తేజ;
మది ప్రబోధసాంద్ర మఖిలభూత
గణసమాశ్రయంబు; గావున శ్రవణద
ర్శనముఖక్రియాకరంబు దాన. 277

క. భూతము లవ్యక్తంబున
జాతములగు; నంద పెరుఁగు సమయుఁ; దదీయ
స్థితత్వమునన పురుషుం
డేతద్విధసాక్షితాసమిద్ధుఁడు వత్సా! 278

—: భీష్ముఁడు ధర్మజునకుఁ గాలచక్రప్రభావం బెఱిఁగించుట :-
సం. 12-204- 7,8

ఆ. వ్యక్తసప్తధార మవ్యక్తనాభంబు
షోడశకవికార సుపరిమండ
లంబు ధ్రువ మధిష్ఠితం బాత్మచేతఁ జ
క్రంబు దిరుగుచుండుఁ గాలవశత. 279

క. ఈచక్రంబున సకలచ
రాచరమయమైన లోక మవశానిష్ఠా
గోచరమై చరియించుట
సూచికొనన్ వలయుఁ దత్త్వశోధనదృష్టిన్. 280

తే. పొందు సత్త్వరజస్తమంబులు విశుద్ధ
నంతరాత్మఁ బాంసుప్రాత మనిలుఁ జెందు
నట్లు; సద్వివేకమునఁ దదనంతరంబు
బుధుఁడు గాంచి యగ్గుణములఁ బొరయకుండు. 281

క. వేదాంతవిదుఁడు చురభుఁ
డాదరము ప్రవృత్తి లక్షణాన్విత మగు ధ
ర్మోదయ మంద కలుగు; నది
లే దరయ నివృత్తి సౌఖ్యలీనత్వమునన్. 282

క. ఆర్యులుఁ బ్రవృత్తిలక్షణ
కార్యంబులచేతఁ జేసి గ్రాహ్యము నగు త

ధుర్యత్వమందు విడుప ర
నార్యములగు మదనమదభయక్రోధాదుల్. 283

తే. వినుము; దేహాభిమానికి వీనినెల్ల
దొబిగ దొరకొన దెంత శాంతునకు. నైన
గాన యేమిట దేహాభిమాన మెడలు
నట్టి చూ పభ్యసించు వేదాంతవిదుఁడు. 284

ఆ అడవి సొచ్చి యంతకంతకు నవులకు
నతికుతూహలమున నరిగి యరిగి
చూచుచుండునట్లు సూవె సంసారకా
ననమునందుఁ దిరుగు జనులనడపు. 285

క. విను, తెవు లడుపఁగ భేషజ
మునకుం దలకొనిన చందమున మది సత్యం
బును శౌచము శమమును దమ
మును నెలకొలుపంగవలయు మోహచ్యుతికిన్. 286

తే. భూమి మొదలుగఁ గలభూతములకు నింద్రి
యముల కన్నింటికిని సత్త్వ మాదియైన
గుణములకు నెల్లజగములకును దదీశ్వ
రునకు నరయ నహంకార మునికిపట్టు. 287

తే. స్మృతియ సంప్రీతియును బ్రసన్నతయు మతియు
నీదృశము లగు సత్త్వగుణోదితములు
రాగలోభరోషాదులు రాజసములు
దర్పశోక ప్రముఖములు తామసములు. 288

క. జ్ఞానమునకు నగ్గుణసం
తానం బడ్డంబుగాన తత్ప్రతిహతికై

పూని మును సాత్త్వికమునను
మానస మాన్పంగపలయు మహనీయధృతిన్. 289

క. విను, సాత్త్వికములు మది నెల
కొని రాజసతామసములకును విగతత్వం
బొనరించుఁ; బదంబడి స
త్వనిరూఢత బోధసంపదకు హేతు వగున్. 290

తే. క్రియ లహంకారమునఁ గల్గుఁ; గ్రియలవలన
దేహసంబంధ మెడలక తిరుగవలయు
జన్మపర్యాయములయందు; జన్మ మనఁగ
మిళిత నవశుక్ల శోణిత కలితవృత్తి. 291

ఆ. మాత్రమునఁ బురీషమున మూనుచును గర్భ
మునఁ బ్రవర్ధనమ్మునఁ బొంది వెడలి
సంతతాను బంధసంసారదుఃఖ ని
ర్మగ్నుఁ డగుచు నుండు మానవుండు. 292

క. ఇంతకు మూలము దృష్ణా
తంతులతయ వత్సఃవినుము; దానికి నడరం
గాంతాజనంబు దొలుప్రాఁ;
కింత యెఱిఁగి తృష్ణ దొఱఁగు టిచ్చు విముక్తిన్. 293

క. జానాజానంబులకుం
దాన యుపాశ్రయము బుద్ధి తత్త్వాహంకా
రానూనలక్షణాఢ్యం
బైనయెఱుక దాని జీవుఁ డని చెప్పు శ్రుతుల్. 294

ఆ. అతఁడు కాలకలితమైన కర్మమున సం
సారవర్తనంబు సలుపుచుండు;

స్వప్నసంప్రవృత్తి సలిపెడు నరుమాడ్కి-
నింద్రియములతోడ నెనయ బెరసి. 295

క. రాగపరిలిప్త మానస
యోగంబున నింద్రియంబు లుల్లసితములై
భోగు లగుట యుడిపిన నప
రాగత సంసారదుర్విరామము సేయున్. 296

క. పురుషు లఖిలభూతములను
బురుషులలో భూమిసురులు భూమిసురులయం
దరయంగ మంత్ర వేదులు
వరు లధికులు బోధయుతులు వారలకంటెన్. 297

క. జ్ఞానంబు దృష్టి నరునకుఁ
గాన నయనహీను నడపుకరణి యగుటఁ బ్ర
జ్ఞానవిహీనుని నడవడి
దీని నెఱుఁగవలయు నెఱుక దెచ్చికొనంగన్. 298

క. క్షమయును సత్యంబును శౌ
చమును సుధర్మములు బ్రహ్మచర్యం బత్యు
త్తమధర్మము వానికిఁ జి
త్తము నలవఱుపంగవలయు ధైర్యము పేర్మిన్. 299

క. పరిహాసము భాషణమును
నిరీక్షణము లోనుగాఁగ నింద్యంబులు సుం
దరులయెడ; దీని కే మని
చారఁ దగ; దట్లైన మనసు సొత్తురు సుదతుల్. 300

క. విసు, మాంసాస్థిమయం బని
వనితాఁగము సద్వివేకవైభవమునఁ గాం

చిన సందు మది దగుల; దా
పనికిని నాడీవిశుద్ధి ప్రాపగుఁ బుత్రా! 301

క. శారీరస్థితికిఁ బ్రథమ
కారణమై యుండు నాసికాదశకము సం
చారిక లగు నింద్రియముల;
కారయ నాడికలు మఱియు నై దమలమతీ! 302

తే. స్థూలభంగులు పదియును, సూక్ష్మభంగు
లైదు నివి; వీనికంటె నత్యంత సూక్ష్మ
భంగి హృదయంబు నడుమగాఁ బరగియున్న
నాడి యది సర్వగత యగుఁ జూడఁజూడ. 303

క. ఆచూపు మరిగి చిత్తం
బేచవికిం బోదు; పోయెనేని మరలుపన్
గోచరమగు వెలిచవులం
బాచిన లోచవిన నిలిగి పరమాత్మఁ గనున్. 304

క. ఆవిధము శుక్లగతిగను
భావమునకుఁ గాని పట్టువడదు వినుము శు
క్లావేశము సంకల్పజ
మావాసము శుక్లమునకు నఖిలాంగకముల్ 305

క. అరయఁగ సంస్పర్శమునన
తిరుగుడువడు శుక్ల మనుట తెఱఁగే సంక
ల్పరతిం గలదే చోఁకెడఁ
జరింప కుండంగవలయు సంకల్పంబుల్. 306

తే. అత్రిముని యింద్రదైవత్య మసి జనులకు
దెలిపె; నది కారణముగ నింద్రియ మనంగ
బరగు జూవె న్నబీజంబు; పరమ మెల్ల
ధాతువుల కిది; వినుపుత్ర! దానివిధము. 307

ఆ. శుక్లమునకు మనసు సూక్ష్మరూపము; మనో
బలము నిల్వరింపఁ బక్వబుద్ధి
యోపుఁ; దరుణవృద్ధు లోప రజ్ఞానదౌ
ర్బల్యమూఢవికలభావు లగుట. 308

క. కావున శుక్లస్థితికిం
గావించిన యట్టి పుణ్యకర్మము లగు స
త్సేవిత యమనియమాదుల
త్రోవ సొరఁగవలయు విషయదూరాత్మకుఁడై. 309

క. అరయఁగ విషయము లెంతయు
దురంతములు; వానియందుఁ దొడరినఁ జేటుం
బొరయుదురు; దొడరకున్నం
బరమపదవి యమ్మహానుభావులకు నగున్. 310

క. జననము జరయును మరణం
బును మొదలుగఁ గలుగు దుఃఖములు లోకమునం
గనుఁగొని బుధుండు మోక్షం
బున కుద్యోగించు నియతిఁ బూతహృదయుఁడై. 311

తే. వాఙ్మనఃకాయములు శౌచవంతములుగఁ
జేసికొని యనహంకార శీల శాంత
బుద్ధియై నిరపేక్షతఁ బొంది యఖిల
భూతదయ గల్గి మెలఁగంగ బోధ మొందు. 312

క. మనసును వాక్కును గాయం
బు నియంత్రితములుగఁ జేసి పొందుదురు ధనం
బునకై ప్రాముచ్చులు; దానిం
గనుఁగొనఁగా వలదె మోక్షకాంక్షికి వత్సా! 313

ఆ. బుద్ధిఁ గొని మనంబు వోనిక నిలిపి మ
నోభియుక్తి నింద్రియముల నాఁగి
విషయసమితి నెడల విడచిన వానికి
ననిమిషులు ప్రసన్న లగుదు రనఘ! 314

క. వినుఁ; దేవతాప్రసాదం
బున నిర్మలయోగతంత్రములు పనుపడు న
య్యనువున నిశ్చలమతి ని
ల్చునది శిథిలితాన్నపానసుఖతృష్ణుండై. 315

క. శాకకణమూలఫలపి
ణ్యాకాదుల భైక్షమైన యన్నంబున ని
శ్శోకత నాఁకలిపుచ్చుచు
లోకాలోకంబున నచలుఁడు గావలయున్. 316

క. జ్ఞానమ యింధనముగ వి
జ్ఞానాగ్నిం బ్రబలఁజేయ జరయు మరణమున్
నానావిధదుఃఖంబులు
తేని యమృత మక్షరంబు లెస్సి తోఁచున్. 317

క. వినుఁ! నిద్రాదోషంబున
గనుకలల రజస్తమోవికారంబులచే
మనసు దిరుఁగ బడఁగాఁ గఱి
చినవి మఱచి యపుడ దుష్టశీలుండ్ యగున్. 318

వ. అది యోగి కొప్పదు గావున. 319

క. వినుతజ్ఞానాభ్యాసం
బున సమధికజాగరత్వముం బడసి సక్య
జ్ఞనితం బగు నిద్రాభర
మునఁ బొందును యోగి యదియుఁ బోఁద్రోచు మదిన్. 320

వ. అని పెండియు. 321

-:భీష్ముఁడు ధర్మజునకు స్వప్నాద్యవస్థల తెఱం గెఱిఁగించుట:-

సం. - 12-209-1,2.

క. విలయం బింద్రియములకుం
గలుగఁగ విషయానుభవము గలిగినభంగిన్
మెలఁగును స్వప్నంబున మెయి
గలయట్టుల దేహి భావగతి యెయ్యదియో. 322

క. అని యి ట్లొలయువితర్క-ం
బు నెడ హృషీ కేశుఁడై న పురుషో త్తము ద
ర్శనమును గ్రమమున నెఱిఁగిన
మునివర్గము శిష్యవర్గమున్ బోధించున్. 323

క. క్రమమున నింద్రియములు లీ
నము లగు నది నిద్ర; కల యనం దత్సంస్కా-
రము మిథ్యావిషయప్రా
ప్త మగుట యప్పుడును దేహి దా సాక్షి యగున్. 324

తే. అనిలముఖదోషములను సత్త్వాదిగుణవి
కారముల జాగరంబునఁ గలుగునట్టి
తోఁపు బెరయంగఁ గల యయి తోఁచు; నది శు
భాశుభములకు సూచక మనియుఁ గలదు. 325

క. స్వాపావస్థం బ్రకృతి క
దీపిత వాటిల్లునపుడుఁ దెలి వెడలక తా
దీపించుఁ బురుషుఁ డిమ్మెయి
చూపు పబోధంబు పరమసూక్ష్మత పుత్రీ! 326

తే. తెలియ-మేల్క-నియుండుట, గలలు, నిద్ర
యను నవస్థాత్రయంబును నవులఁబెట్టఁ
జాలు విజ్ఞాననిర్మలసత్యబోధ
రూపనిర్భరానందస్వరూపుఁ డనఘుఁ 327

తే. వ్యక్త మవ్యక్తమును రెండు నవగతములు
గాక మోక్షంబు మార్గంబు గానరాదు;
వ్యక్త మది మృత్యు, వవ్యక్త మమృత-మనియె
నతుల విజ్ఞానఘనుఁడు నారాయణుండు. 328

క. అనఘుఁడు వినుఁ; డవ్యక్తం
బనునది త్రైలోక్యమునకు నాధారము; దా
ని నివృత్తి లక్షణం బగు
ననుపమధర్మ మని చాటు నాగమఫణితుల్. 329

తే. వినుము: బ్రహ్మోదితంబు ప్రవృత్తి ధర్మ;
మది గతాగతవ్యాప్తుల నావహించు;
బ్రహ్మ మండ్రు నివృత్తి ధర్మంబు; నమ్మ
హాశ్రయము మోక్షం బను నాగమములు. 330

క. కట్టినచీరయునుం బైఁ
బెట్టినచీరయును మౌళి బిగి యారంగాఁ
జుట్టినచీరయుఁ బోలెను
నెట్టన పొదివినది దేహి నిగుణత్రయమున్. 331

క. వినుఁ: సత్త్వరజస్తమముల
పెనఁకువ కవుల వెలుఁగొందు పెంపు గలుగు తు
ర్యనిరంజన తత్త్వము పర;
మనఘుఁ: యది భావనీయ మను వేదంబుల్. 332

క. వాకును మనసును గాయము
నేకాయనవృత్తి శౌచ మెడలని తపముం
జేకొనునది; యది బోధ
శ్రీకి ఘృతంబునకు వెన్నక్రియ జనకమగున్. 333

తే. బ్రహ్మచర్య మహింస నాఁబరగు పరమ
ధర్మములు రెండుసువ్వె యుత్తమతపంబు;
దానిఁ గలవాఁడు నిర్మలజ్ఞానయోగ
వంతుఁడై చూడనేర్చు సర్వంబు ననఘ! 334

క. ఆతతసంసారము తృ
ష్ణాతంతుస్ఫూతిబంధనంబున దృఢమై
చేతస్సంగతిఁ బాయమి
కాతెఱఁగు తపంబు పుత్ర! యౌషధము సుమీ. 335

క. వికసిత తృష్ణాలతికకు
నకుటిల మగు తపము దాత్రమై నఱకంగా
వికృతులఁ బ్రకృతినిఁ బురుషుని
నకలంకజ్ఞానదృష్టి నవలోకించున్. 336

క. అని యమ్ముని పలుదెఱఁగులఁ
దను బోధించినఁ గృతార్థతం బొందెఁ దపో
ధనుఁ డాశిష్యుఁడు నీవును
గనుకొను మేతద్వచోనికాయార్థంబుల్. 337

తే. అనిన విని ప్రీతుఁడై పాండవాగ్రజన్ముఁ
డాపగసూనుతో 'మిథిలాధినాథుఁ
డైన జనకుండు మోక్షంబు ననఘ! యేమి
కృత్యమునఁ గాంచెఁ నది యెఱింగింపు' మనుడు. 338

వ. అతం డతని కిట్లనియెఁ 'దత్సంబంధియైన యితిహాసంబు సెప్పెద. 339

క. వినుఁ మాచార్యులు నూర్వురు
జనకనృపాలునకు; వారు సతతంబును న
జ్జనపతి వినిపింతురు త
త్త్వనిరూపకశాస్త్రమును పృథగ్విధములుగన్. 340

క ఏనాఁ డెమ్మెయిఁ జెప్పిన
నావసుధాధిపుఁడు దాని ననుమోదించున్
భావము సంతోషశ్రీ
భావిత మగుచుండఁ గురున్నృపాలప్రవరా! 341

వ. అట్టియెడఁదత్త్వజ్ఞానఘనుండును నిర్ద్వందుండును సంశయరహితుండును నగు పంచశిఖుం డను మునివరుండు మహిం దిరుగుచుండి మిథిలకుం జనుదెంచె; నతండు కపిలాభిధాన యగు గురుకుటుంబిని చన్నుగుడిచి పెరిఁగినవాఁ డగుటం గాపిలేయుండు ననంబరగు; నమ్మహాత్ముండు హేతుమద్వాక్యవిశేషంబుల నయ్యాచార్యుల నూర్వుర నయ్యుర్వీపతిసన్నిధిన నిరుత్తరులం జేసిన, నాతం డతని విశేషజ్ఞత యెఱింగి, వారల విడిచి, తన్నుం బ్రబోధించుటకై ప్రార్థించి యతనికిం బ్రణతుం డైన నమ్మానసీయుం డనూనదయాయత్తచిత్తుండు గావున నాభూపల్లభునకు మోక్షోపాధిబోధప్రదంబు లగు వాక్యంబు లిట్లని యుపదేశించె. 342

-: పంచశిఖుం డను విప్రుండు జనకునకుఁ
దత్త్వోపదేశంబు సేయుట :-

పం. 12-211-6,8

ఆ. వినుఁ మవిద్య గామమునకుఁ, గామము గర్మ
మునకుఁ బుట్టఁ బట్టు లనఘ! యింత
వట్టుఁ గారణముగ వచ్చుఁ బునర్జన్మ
మంద్రు తత్త్వవేదులైన మునులు, 343

ఆ. ఒలసి లోభమోహములు దోషసంసేవ
నం బొనర్పఁగా ఘనత్వగాధ
యగు నవిద్య భూమిపై బహుకర్మబీ
జముల కంకురాదిశక్తు లొసఁగు. 344

క. ప్రియములు నప్రియములును హ్ల
దయమును జిక్కువడఁ దివ్వఁ దత్తదనేక
క్రియలకుఁ జొచ్చు నరుఁడు; మేన్
ప్రయ మగు బెఱుఁగఁడు వితతజరావ్యాధులచేన్. 345

క. ధనములు బంధులు భోగము
లనియెడు నస్థిరము లెల్ల నాత్మ కెరవు సే
సిన శాంతి యలవడును; మన
మున శాంతిశ్రీసమృద్ధి మోక్షము నిచ్చున్.' 346

వ. అనిన విని జనకజనవల్లభుం డమ్మునివల్లభునితోడ. 347

క. 'కేవలవై రాగ్యము మో
షావహ మగు నేని యట్టులైన విరక్తిన్
భావమున నరుఁడు దాల్చెడిఁ
బో; వా డవ్యయపదంబుఁ బొందునె?' యనుడున్. 348

వ. అవ్విప్రవరుం డతని కిట్లనియె. 349

క. 'విను నృపఃహర్షంబు ప్రియం
బనూనసుఖయుక్తి నిర్భరానందము శాం
తినిరూఢి యనఁగ మనమునఁ
బనుపడు; నవి సాత్త్వికాఖ్య భావంబు లగున్. 350

క. పరితాప మనభితోషము
నరేశ్వరాశోచనము జనవ్యాపా

దర మక్షమ యనియెడు నివి
యరయంగా రాజసంబు లగు భావంబుల్. 351

క. తలఁపులు గ్రందుగఁ బొడముట
గలగను చేమఱుట భ్రమము గదురుట జాడ్యం
బలసత యను నీభావం
బులు దామసకోటి యంద్రు బధులు నరేంద్రా! 352

క. కారణము గలిగియును ని
ష్కారణకలితంబు లయ్యు జనియించు ధరి
త్రీరమణ! మూఁడుదెఱఁగుల
నారయ నివి యస్థిరంబు లై తిరుగఁబడున్. 353

చ. జనవర! సౌఖ్యముం బొరసి సాత్త్వికభావ సముద్గమంబు సు
మ్మనియును, దుఃఖముల్ గదిరినప్పుడు రాజసభావభంగి సు
మ్మనియు, జడత్వసంగసమయంబునఁ దామసభావవృత్తి సు
మ్మనియును ద్రోచి వానఁ బడ కాత్మరతిన్ నిలుపిచ్చు మోక్షమున్. 354

వ. ఇవ్వెరవునకు వైరాగ్యంబు మూలం' బని చెప్పి వెండియు. 355

తే. 'వినుము: సత్త్వాదిగుణముల ననఘ! యాత్మ
తత్త్వమున లీనములఁజేయఁ దన్మయత్వ
దర్శనము; దాన నవి మహోదధి నడంగు
నేఱు లట్టుల రూపఱు వేఱులేక. 356

తే. నరుఁడు సుఖదుఃఖములవెంటఁ బొరయనీక
మలఁచి యాత్మునిఁ జేర్చిన మానసంబు
లీన మగు నంద జలములలోన నిడిన
లవణకణముచందమ్మున నవనినాథ! 357

క. తోలు దిగవిడిచి నాగము
లీల బొలుచుమాడ్కి గర్మలేపము దనతో
గీలుకొన నీక వెలుగు ని
రాలంబన బోధఘనుడు రాజవరేణ్యా !' 358

వ. అని బోధించె; నిట్లు పంచశిఖునిచేత బోధితుండై కాదె జనకుండు దనపురం
బైన మిథిల గాలునప్పుడు దుఃఖంబులం బొరయమించేసి తన కేమియుం
గాల దని పలికెం గొంతేయాగ్రజా! యాకర్ణింపుము. 359

క. అమలం బగు నీయితిహా
సము భక్తి బఠించినం బ్రశాంతి యొలసి దుఃఖ
ముల దొలగి మనుష్యుం
డమృతత్వావాప్తి మహితుడై వెలుగొందున్. 360

వ. అనిన విని ధర్మతనయుండు దేవవ్రతుతో 'నెట్టివాడు సుఖియును మంగళ
వంతుండును నిర్భయుండును నై వర్తించు' నని యడిగిన నప్పుడమిజేని
కప్పురుషవరుం డిట్లను 'దమసంపన్నునకు నీచెప్పినచందంబు గలుగు
నాకర్ణింపుము. 361

తే. సర్వవర్ణాశ్రమములకు శమము దమము
గలిగి యునికి విశిష్టప్రకార మగుట
బ్రాహ్మణునకు విశేషించి రాజవర్య !
దమసమాహితవృత్తి పెద్దయును వలయు. 362

వ. దమంబు సద్గుణంబులరాశి యవి యెయ్యవి యంటేని. 363

సీ. శౌచ, మక్రోధంబు, సంతోష, మార్జన,
మనసూయ, విగతదైన్యత్వ వృత్తి,
యప్రమాదంబు, దురభిమానరాహిత్య,
మతివాదవర్జన, మఖిలభూత

దయ, గురుపూజ, నిందాస్తుతి ప్రవణతా
త్యాగం, బపైశునత్వంబు, సాధు
జనసంగమం, బమృషాభాషణంబు,ని
స్పృహత, యహింస, సుశీలభావ,
తే. మింద్రియగ్రామజయ-మివియెల్ల దమము
నాకృతులు; వీనిఁ గలపుణ్యుఁ డభయుఁ డై హి
కములవలనను నాముష్మికములవలన
శాంతి మంగళ నిధిబోధ సౌమ్యమూ ర్తి.' 364

వ. అనినం బితామహునితోఁ బాండవేయాగ్రజుండు 'వ్రతస్థు లొక్కొక్కయెడ. భోజనంబులు సేయుదురు వారలకు వ్రతహాని లేకుండునే' యని యడిగిన నతనితో నతండు 365

తే. 'వినుము: విప్రకామార్థభోజనము లోను
గాఁగఁ గలుగు వేదో క్తప్రకార భోజ
నములు వ్రతహాని సేయవు నరవరేణ్య !'
యని నిరూపించి పలికి యిట్లనియె మఱియు. 336

వ. 'సదోపవాసియు సదాబ్రహ్మచారియు నమాంసభోజియు విభుసాశనుండును నమృతాశియు నస్వప్నుండును గావలయుఁ; దత్స్వరూపంబు లెట్టివంచేని

సీ. ఇరుప్రొద్దు గుడుచుచు నెడనెడఁ గుడువక
యుండునాతండు సదోపవాసి;
ఋతుకాలమున నాత్మసతియంద రతి సల్పు
భవ్యశీలుఁడు సదాబ్రహ్మచారి;
దేవపిత్రతిథిపూజావిధులం దిడి
మఱి నంజుపురుషుఁ డమాంసభోజి;
దనయట్లు పంక్తివారును భుజింప భుజించు
నంచితాత్ముఁడు విభుసాశనుండు;

తే. భృత్యవర్గంబు గుడిచినపిదప, గుడుచు
నాత, డమృతాశి; దివసంబునందు నిదుర
వోని పుణ్యు, డస్వప్నుఁ; డిప్పాలము లగు మ
హాధికవ్రతము లు దేహబాధకములు. 368

-:ఇంద్ర ప్రహ్లాద సంవాద ప్రకారము:-
సం. 12-192-2,3.

వ. అనిన విని కౌంతేయాగ్రజుండు శాంతనవునితోడఁ 'గర్మంబులు సంస్కార యోగంబున శుభాశుభంబులం బురుషుం బొందించు; వానికిం గర్త యప్పురుషుండ యగుట గాకుండుట నిశ్చయింప రాకుండు; నా కేర్పడం జెప్పవే' యనుటయు నప్పుణ్యుం డక్కురువరేణ్యున కిట్లను 'నింద్రప్రహ్లాదసంవాద సమాకర్ణనంబున నది దేటపడు; నాకర్ణింపుము: సత్త్వస్థుండును సంయమనిరతుండును ననహంకారుండును సమర్షక్రోధదూరుండును దుల్యనిందాస్తుతియును సమలోష్టకాంచనుండును నారాయణధ్యానపరాయణుండును నగు ప్రహ్లాదుం డొక్కయెడ నొక్కరుండ యాసీనుండై యుండ నింద్రుఁ డతని యంతరంగం బారయ వేఁడి చేరంబోయి. 369

క. సంపద లేమికి మది శో
కింపవు; శత్రువుల చేతికిని లోనగు టూ
హింపవు; నిను నూరకునికి
పెంపని పాటించె; దిట్టి బేలవు గదవే. 370

వ. అనిన విని హిరణ్యకశిపునందనుఁ డప్పురందరున కిట్లనియె: 371

ఆ. కలిమి లేమి యనఁగఁ గల వొక రెం;డవి
యత్న గౌరవము వియత్నతయును
గలుగవచ్చు ననుట గా గదిసూ బేల
తనము వినుము తెలియ ననిమిషేంద్ర ; 372

క. తేరకయుండఁగ జేరుం
దేరంగాఁ బొలియు విధియధీనంబులు గా
కారయ వి త్తంబులు పురు
షారంభాయ త్తములె మహాబుద్ధినిధీ! 373

క. శత్రుజనులు చెఱుచుటయును
మిత్రులు బ్రతికించుటయును మిన్నకయూప
త్పాత్రతయును సంపదయు వి
ధాత్రుఁడు సంధించుఁ జూవె తటితోఁ బురుషున్. 374

ఆ. భావములు నిజస్వభావంబునన తోఁచు
నడఁగు; నట్లు గాన యస్థిరతకు
నెలవు లని యెఱుంగనేర్చిన భావంబు
లంచుఁ దగులు నెట్లు డెంద మనఘ! 375

ఆ. ఏను గ ర్త ననుట యొఱుఁగమి దాఁ గ ర్త
యేని నేమిఫలము నెడలకుండ
నఖిలకర్మములును నాచరించుచు నున్న
వాఁడె కాన కర్త గాఁడు దాను. 376

వ. అని పలికి వెండియు. 377

క. అనఘా! విధివిహితంబుం
దనచేతఁగ దలఁప ఫలము దగులు నహంకా
రనిరూఢున; కనహంకా
రున కదిలేమి ఫలయుక్తి ద్రోవంజాలున్. 378

క. విను; విధికృత్యము లూరక
కనుఁగొనుచును సిద్ధ్యసిద్ధికల్పితసుఖదుఃఖనిరూఢిఁ బొందకుండఁగ
మనముం దొలఁగించు వెరవు మహనీయ మగున్. 379

క. కావున భూతానిత్యత
భావించుట యెపుడుఁ గలిగి బంధచ్ఛేద
ప్రావీణ్యము సంపరితో
షావహముగ నున్నవాఁడ నమరప్రవరా! 380

క. దాంతుఁడు ప్రజ్ఞావంతుఁడు
శాంతుఁడు నగువాని మానసం బాయాస
శ్రాంతముగా దెమ్మెయి ని
శ్చింతుఁడనై యుండుమును విశిష్టవిచారా!' 381

క. అనపుడు ననిమిషపతి 'యే
యనువున నీశాంతి నీకు నగపడియె మహా
జనపూజ్యా! చెప్పవే నా'
కని యడిగిన నిట్టులనియె నతఁ డాతనితోన్. 382

తే. 'ఆర్జవంబు ప్రసన్నత యాత్మవత్త్వ
మ్రపమాదంబు వృద్ధసేవాభినిరతి
మేలు సేయుఁ; ప్రజ్ఞాశాంతిశాలి యగుట
కాలపాకంబుతోఁ దాన కలుగు ననఘ!' 383

క. అనిన విని విస్మయము నె
మ్మనమునఁ దలకొత్తఁగా నమరపతి యభినం
దన మొనరించి పొగడుచుం
జనియె నిజావాసమునకు జగతీనాథా! 384

వ. అని చెప్పిన విని యప్పాండవాగ్రజుండు భూపాలునకు 'లక్ష్మీభ్రంశం బేమిటఁ గలుగుఁ' ననుటయు నయ్యాపగానందనుం డతని కిట్లనియె. 385

తే. వాసవునకును బలికి సంవాద మనఘ!
కలిగె నయ్యితిహాసంబు గర్ణగోచ

రంబు సేయుము నీదగు ప్రశ్నమునకు
నుత్తరం బది సెప్పెదఁ జిత్తమరల. 386

సీ. ఇంద్రుఁ డబ్జజు కడ కేతెంచి వినతుఁ డై
'బలి మహాసంపద వెలుఁగుచుండె;
నతని నిప్పుడు గాన; మాతఁ డెచ్చో నున్న
వాఁడొకో' యనుడు నవ్వారిజాస
నుండు 'నీతలఁ పొప్పకుండుట యెఱిఁగితి;
నై నను జెప్పెద ననృతవాది
గాకుండు; మీయుష్ణఖరగోహయంబుల
యందుఁ దా నొక్కటి చందమొంది

తే. యడఁగి యున్నాఁడు; వధియించు టనుచితంబు
వాని'నని పల్కి 'నటుసేయువాఁడఁ గాను
మాట వెట్టుదుఁ గన్నచో మాననీయ
వాక్య'యని వీడుకొనియె నవ్వాసవుండు. 387

వ. వీడ్కొని చని జగతిం జరియించి యొక్కచోట ఖరరూపంబున సంప్రీతుం
డయి యున్న యబ్బలిం గని బలారాతి యిట్లనియె. 388

-:ఇంద్ర బలిచక్రవర్తి సంవాద ప్రకారము:-
సం. 12-216-2.

క. ఏనుఁగులు సుటిరాఁ బే
రేనుఁగుపై మణిమయంపు టెల్లులు మెఱయం
గా నీ వేతెంతువు; మముఁ
గానికిఁ గొన వప్పు; డిపుడు గాడిద వై తేఁ 389

క. కనకమయయూప మొప్పఁగ
ననూనవిభవమున నీవు యాగం బొనరిం

చిన యొప్పను; నిప్పటి నీ
యునికియునుం జూచి నాకు నుమ్మల మయ్యెన్. 390

ఆ. ఉముక డినుచు నిట్టు లుండి నీతొల్లింటి
లీలఁ దలఁచి యుమ్మలింతొ లేదొ
యున్నరూపు సెప్పవన్న! గార్దభరూప
ధారణైకనిపుణ దానవేంద్ర! 391

సీ. అన విని బలి దేవతాధీశుతో 'నీకు
నావిభవంబు గానంగరాదు;
గుప్తమైయున్నది గుహయందు; నా కిచ్చ
వుట్టిన నప్పుడ పొలిచి తోఁచు;
నది యటులుండె; నీవధికుండ; వల్పుల
యెదుర రజ్జులు వల్కఁ జేటి పెంపు?
పొమ్ము దుశ్చ్యవన నీపోయెడు తెరు' వన్న
నాతండు నవ్వుచు నతనిఁ జూచి

ఆ. మున్ను పలికినట్ల మోమోటలేక ప
ల్కటయు నతఁడు 'భూతకోటి మంచు
వోలెఁ దోఁచు విరియు; బుద్ధిమంతులు దాని
కిచ్చ వగవ; రింత యెఱుఁగ వెట్లు?' 392

వ. అని వెండియు విరోచననందనుండు. 393

క. 'పొరి నరణంబు ననరము
మరణము జీవితము సుఖసమాగమమును దు
స్తరదుఃఖ సంగమంబును
దొరకొను నే నెపుడు సమతతోడన నిలుతున్. 394

చ. బలమును నొప్పు బుద్ధియును బ్రౌఢతయుం గలవారు లేనివా
ర లనక యొక్కభంగిఁ దటి రాకయ చూచి హరించుచుండు వి

చ్చలవిడిఁ గాలుఁ; డట్లగుట సారమతిం గని యున్నవాఁడ ను
మ్మలికయు నుబ్బు నాదుమది మందున కై నను లేదు వాసవా: 395

ఉ. గాడిదరూపు దాల్చి యుముకల్ దినుచుండఁగఁ జూచి యుల్లసం
బాడెదు శక్రు: శాంతిసమయం బగుటన్ విను మింకఁ గొన్ని నీ
వాడిన నాదు చిత్తమున నల్క- యొకింతయుఁ బుట్ట; దిట్లు నీ
వాడితె మున్ను? ని న్నెఱుఁగనా? వలదా ననుఁ నీ వెఱుంగఁగన్? 396

క. ఎఱమియు వాడుటయును దన
వలచిన యట్టివెఁ యెఱుంగవా విధిచరితం
బులు బలవంతంబు లగుట;
వలదె వివేకంబు పెద్దవారికి నింద్రా: 397

క. ఇటు గర్వించుట నీచత;
యెటవోయెదొ పొమ్ము; మానుమీ వలవని త్రు
ళ్లుట; వజ్రము నీవును బిడి
కిటితాఁకున నొఱగు దేను గినిసితినేనిన్. 398

క. ఇది మేలపుమాట సుమీ:
మది నుద్ధతి లేదు నాకు; మహితాశ్చర్యా
స్పద మగు విధాతృచెయ్దిం
దుది నీవును దుస్సువోదు; త్రుళ్ళు టుడుగుమీ. 399

వ. శాంతుఁడ వగు, మని పలికె; నట్టియెడ నవ్వీరోచననందను శరీరంబుననుండి సురూపయు సుగౌరయు నగు నొక్క- మగువ నిర్గమించినం గని కౌశికుండు విస్మయవికసితాక్షుం డగుచు నతనితో 'నివ్వనిత యెవ్వత?' యనిన నాతం 'డే నెఱుంగ; నీవ యీయమ నడుగు' మనుటయు నయ్యనిమిషపతి యమ్ముదియ మొగంబు గనుంగొని 'మాకు ని న్నెఱిఁగింపు' మనవుడు నద్దేవి యతనితోడ. 400

క. శ్రీయును భూతియు లక్ష్మియు
నాయభిధానములు; మీరు న న్నెఱిగమి పె
ద్దే యింద్ర! యెజ్జగంబుల
నేయుగములయందు నెఱిగ రెవ్వరు ననినన్. 401

క. అనవుడు సతండు 'నీ వీ
దనుజేశ్వరుఁ బాయుటకుఁ గతం బేమియొకో'
యనిన విని లక్ష్మి సత్యం
బును ధర్మము దమము దానమును నాయిక్కఁ. 402

క. అవి గలిగి పరాక్రమయుతుఁ
డవు పురుషునిపాల నిలుతు; సమరాధిప! యా
దివిజారి దొల్లి యట్టిఁడ;
యవినీతత నిపుడు బ్రాహ్మణాసూయమెయిన్. 403

క. తొల్లిటి సచ్చారిత్రము
లెల్లను దిగవిడిచెఁ; గాన ఁాతనికడ
నొల్లఁ; నిలువ వచ్చెద సుర
వల్లభ! నీపాల నెలమి వలసియింపం 404

ఆ. ఆగుణములు మఱియుఁ నాగమోదిత నీతి
చారములును గలిమిఁ గోరి యింద్ర!
నిన్నుఁ బొంది యేను నిల్చెద; నేమిట
నేమఱంగ వలవ దెపుడు నీవు. 405

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.

వ. అని పలికె నిట్లు లక్ష్మిచేతం బరిత్యక్తుండైనబలి యాఖండలు నాలోకించి. 406

క. అయనవశంబునఁ దేజో
వియుక్తుఁడై రవి ప్రతాపవిరహితుఁ డగు నా

క్రియఁ బొనుఁగుపడినఁ బొంగకు;
జయింతు నిను దేవదనుజసంగర మగుడున్. 407

వ. అనుటయు మహేంద్రుండు. 408

క. అది యట్టులుండె; నీతోఁ
బదరం బని లేదు నాకుఁ; బద్మభవునిమా
ట దలంప వలయు; నీపై
భిదురం బిడ; దనుజనాథ! ప్రియ మందు మెదన్. 409

క. అనిన విని యొండు వలుకక
దనుజాధీశ్వరుఁడు వోయె దక్షిణదిశకుం;
జనియె నుదఙ్ముఖుఁడై దివి
కనిమిషనాథుండు గౌరవాన్వయముఖ్యా :' 410

వ. అని చెప్పి యనిమిషనందనుండు వెండియుఁ బాండవాగ్రజున కిట్లను 'నింద్ర నముచి సంవాదం బను నితిహాసంబు హృదయప్రసాదకరంబు; దాని నాకర్ణింపుము.' 411

ఇంద్ర నముచి సంవాద ప్రకారము:-

సం. 12-29-1,2.

సీ. సిరిఁ బాసియును నొక్కచింతయు లేక వి
చలక్రం దడంగిన జలధివోలె
నముచి యేకాంతస్థలమున నుండఁగ నింద్రుఁ
డచటికి నేతెంచి యతనిఁ జూచి
'పేదపడ్డాఁడవు; ప్రియజనంబును బరి
వారంబు లే; దియ్యవస్థ కెంత
వగచెదవో దానవశ్రేష్ఠ!' నావుడు
నాతండు 'వగపు నిరర్థకంబు;

తే. వలయువస్తువు వగచిన వచ్చునయ్య ?
రామి యొక్కటియే శరీరంబు నెదయుఁ
దాపమునఁ బొందు; వగపున ధర్మ మేదు;
నే నింత యెఱుఁగుదు; వగవ నేమిటికిని ? 412

తే. సకల భూతంబులకును శాసకుఁడు గలఁడు
గాదె యొక్కరుఁ; డాతని కల్పనమునఁ
బ్రాప్తమైనది నీళ్లలు పల్లమునకు
పచ్చక్రియఁ దాన వచ్చు గీర్వాణముఖ్య ! 413

క. ఇది నా కయ్యెం గాఁగల
యదియై యనుగాథ నిశ్చయం బెవ్వని నె
మ్మదిఁ గలుగు నుబ్బు వగ సం
పద యాపద గలుగ వట్టి భవ్యన కింద్రా ! 414

క. ధైర్యంబునఁ వీర్యంబున
శౌర్యంబున బ్రజ్ఞఁ బడయఁజాలునె నరుఁ డె
కార్యము నప్రాప్య మయిన
నార్యం డది యెఱుఁగు గాన యడలఁడు శక్రా! 415

తే. మేలుఁ గీడును నరుఁ బొందుఁ గాలముల న
వశ్యమును; వాని గోరిన వచ్చుటయును
వినుము, ప్రోచినఁ బోవుటయును సురేంద్ర !
కలదె వానికిఁ! గావున వలదు చింత. 416

క. అని యిట్లు నముచి వలికిన
విని మెచ్చుచు దివికి నమరవిభుఁ డరిగెం బా
వనచరిత! యింక నెయ్యది
వినవల తనపుడును భరితవినయుం డగుచున్. 417

క. ఆసరపతి శాంతనవుని
తో నిట్లను 'నెద్దియేని దుర్దశయైనన్
మానవుఁ డెట్టిఁ డగుట మే
లానతియీవే దయామయా తేటపడన్. 418

వ. అని యడిగిన నయ్యుధిష్ఠిరునకు బుధశ్రేష్ఠుం డిట్లనియె: 419

క. 'ఏవిధమున దుర్దశలకు
భూవర! ధైర్యంబ మందు; భూరిధృతిమెయిం
జేవ గలుగు; దృఢనిశ్చయ
భావము నెవ్వగలఁ దొట్రువడ దెబ్బంగిన్. 420

క. ధృతి యారోగ్యము నొసగును;
ధృతి యుజ్జ్వలలక్ష్మిఁ దెచ్చు, ధృతి గీర్తిసము
న్నతిఁ జేయుఁ గాలగత్యవ
గతి గలిగినఁ గలుగు ధృతివికారవిదూరా! 421

-: ఇంద్ర బలి సంవాద ప్రకారము :-

సం. 12-220-6.

వ. ఏతద్విషయుం బైనయది యొక్కటి యింద్రబలిసంవాదం బనునితిహాసంబు గల దాకర్ణింపుము: దేవాసురులకు సమరంబు సెల్లిన నందు విష్ణునిమహాను భావంబున దేవతలకు గెలుపై రుద్రాదిత్యమరుద్వసుగంధర్వసిద్ధాదులు పరివేష్టింప నింద్రుం డైరావతారూఢుండై లీలం త్రిలోక్యంబును జరించు చుండి యొకప్పుడు సముద్రోపాంతంబున నొక్కగిరిగహ్వరంబున యుంగ ణంబున వై రోచనుం డగు బలిం గని, చేరం జని, యద్దనుజపతి దన్నుంజూచి నిస్సంభ్రమముండును వై మనస్యరహితుండునునై యునికి నిరూపించి యత నితో నిట్లనియె: 422

క. 'హీనస్థానమున విభవ
హీనత నిట్లుండి రిపులయెలమిఁ గనియు నీ

మానసమున శోకింపమి
దానవకులనాథ: యెవ్విధంబునఁ గలిగెన్. 423

ఆ. శౌర్యముననొ వృద్ధసంసేవబలననొ
తపముననొ యుదాత్తతానిరూఢి
గలిగి మమ్ము సరకుగాఁ గొన కున్నాఁడ
వేమికతము దీని నెఱుఁగఁ జెపుమ.' 424

వ. అనిన విని బలి యతని కిట్లనియె: 425

ఆ. 'సరకుసేయ వను చసడ్డనూటలు గొన్ని
యాడినంత నేమి యయ్యె నింద్ర!
నీదుశక్తి వింతయే? దైవవశమున
నెట్టిపాటివారు నెట్లుఁగారె? 426

క. నీవు మును హీనుఁ డగుటయు
నావలనం గాదు; నీకు ననుహీనదశా
భావితునిఁ జేయ రా; దివి
దైవకృతము; లట్లుగాన ధైర్యము వలయున్. 427

క. వినుఁ; పర్యాయఁబున సుఖ
మును దుఃఖముఁ జెఁదు జనులఁ; బురుషుఁడు ధైర్యం
బున గర్వంబు విషాదం
బు నడంగింపఁ దగు నంద్రు బుధు; లది వినమే. 428

క. చెలులుం బుట్టలును సహా
యులు విభవము పెంప కాలయుక్తి నవస్థం
దొలఁగించుట గలదె? మదిం
దెలిసి మనుము; మనికి యిట్టిదియ కా దెపుడున్. 429

క. నిను నే గెలుచుట కాలము
నన; నీవును గాలయు క్తి ననుఁ గెలిచితి; గా
వున నశుభమునకు శుభమున
కును గాలముసూవె క ర్త కుశికతనూజా ! 430

ఆ. నాకు నీకు నేల నాకేశ! శత్రుత్వ;
మేరికై నఁ గలదె యెందుఁ బాక
మునకుఁ దెచ్చుచుండు జనులఁ గాలము వృక్ష
ఫల విధముగ: రజ్జుపలుకు లుడుగు.' 431

వ. అని చెప్పి యంత నిలువక. 432

క. 'కా దిది విక్రమకాలము;
లే దిప్పుడు నాకు నలుక; లీలాత్మక రో
షాదరము గలిగినను నిను
నీ దగుపరిజనముఁ గూల్పనే పెడసేతన్.' 433

వ. అని పలికి వెండియు. 434

క. సిరి పెంపునఁ గడునొప్పెదు
సురనాయక! యిపుడు; మీఁదఁ జూచెదు నీకుం
బరిభవము దెచ్చుటకునై
కరము వెసన్ వచ్చు చేటుకాలము తెఱఁగున్. 435

తే. ఇంద్రు లెందఱు వో; రింద్రు లేల; బ్రహ్మ
లుండుదురె; తఱితోఁ దెగుచున్నవారు;
గాక దానవసంఘంబు గాలవశతఁ
బొందుచేటికి సెగ్గింప బొమ్మ నీవు. 436

క. క్రతువులు సేఁతయు దేవ
వ్రతములు సల్పుటయు వృత్తపంతుఁ డగుటయుం

గతమే కాలము ద్రోచుట
కతర్క్యావర్తనము గాల మది గొనదు సుమీ !' 437

క. అని యిట్లాడినమాటలు
విని దనుజునిఁ జూచి యవరవిభుఁ డుల్లములో
నన సంరంభంబు నుడిపి
కొనుచు నతని కిట్టు లనియెఁ గురువంశవరా! 438

క. 'అకట! భవచ్చిత్తము ని
ర్వికారమై భరితధృతి వివేక వినయశాం
తిక మగుచు వెలింగెడు; దీ
నికిఁ గారణమైననిష్ఠ నెటి యెట్టిదియో.' 439

క. అనిన నతఁ డతని కిట్లను
'విను మనిమిషనాథ! యేను వేఱొక చోటం
గొని వచ్చితినే చిత్తం
బున కవికృతిధృతివివేక ముఖ్యగుణంబుల్. 440

వ. కాలప్రకారం బెఱుంగుదుం గావునఁ గలంగ కుండుదు. 441

తే. చెప్పుచున్నాఁడఁ గాలంబుచేత నెల్ల
విధముఁ జొప్పడు జనులకు వినుము కాల
మప్రమాదవర్తన మధిక ప్రమాద
సంగమత్తులు వా రెట్లు భంగపడరు. 442

క. కళలుం గాష్ఠలు లోనుగఁ
గల చిదురలఁ గూర్చుకొనుచుఁ గాలంబు జనం
బుల వడ్డి కిచ్చునాతని
వల నలవడఁ బొదివి తనకు వశ్యులఁ జేయున్. 443

క. కాల మడఁగించు జనుఁ గ
ల్లోలిని గిరిఁ ద్రెంచుకరణి; లోభక్రోధా

శీలత్వకామభయములఁ
దేలుజనుఁడు కాలవృత్తి తెలుఁగు నెలుఁగునే? 444

క. ఇంతకు మును సూచితి నతఁ
డెంతయు నొప్పుగొని యుండె నిది గడుఁ జిత్రం
బెంతవెసఁ జచ్చెననుఁ దనుఁ
జింతింపఁడు జనుఁడు మూఢచిత్తత్వమునన్. 445

క. విను, భావాభావంబులు
గని యత్యుత్తమతపంబు గై కొనువిద్వ
జ్జనుఁడు గను గాలగతి యె
ల్లను గరతలశోభితామలకముం బోలెన్. 446

క. కాలగతి గనుట శాంతికి
మూలంబై యంతరంగమున కాత్మమయ
త్వాలంబనంబు నిచ్చుఁ; దద
దాలీనుండైన పురుషుఁ డక్షోభ్యుఁ డగున్.' 447

వ. అనిన విని పాకశాసనుం డతని వివేకపాకంబున కచ్చెరువొంది యభినందించి యతని కిట్లనియె: 448

ఆ. 'దనుజనాథ! యివ్విధంబునఁ గాలచా
త్రవేదివై పవిత్రశీల
యుతుఁడవై తి; నీవు కృతకృత్యుఁడవు; నీదు
వృత్తి గౌరవలయు నుత్తములకు. 449

తే. లోకమెల్లను నఱచేతిలోన నున్న
యట్లు గనికొని సత్త్వాదులైన మూఁడు
గుణములను బాయఁబెట్టి నిర్గుణత వెలుఁగు
నాత్మఁ గనుచున్నవాఁడ; వే మందు నిన్ను ! 450

క. కెలనికిఁ జూడఁగ దై న్యా
కలనం బగుచున్న యిపుడు గదిరినదశయుం
దొలఁగుం గావుతఁ గడుమే
లెలసి పరమసుఖముఁ బొందు మిచ్ఛావృత్తిన్.' 451

క. అని పలికి యుచితముగ వీ
డ్కొ-ని విభవం బెసఁగ నభ్రకుంజరము పయిన్
వినువీథిఁ జనియె సురలును
మునులును వేట్టింప భూతములు వినుతింపన్. 452

తే. అమృతపానంబుఁ జేసిన యంతకంటె
నద్దనుజపతి మధురవాక్యామృతమున
సంభృతానందుఁడై సురేశ్వరుఁడు దనదు
పురమునకు నేఁగి సుఖముండెఁ గురువరేణ్య! 453

వ. అని యిట్లు ధర్మతనయునకు భీష్ముండు పునర్భూతంబైన యింద్రబలి సంవా
దంబు సెప్పె నని చెప్పిన విని 'మఱియేమి సత్కథలు సెల్లెఁ జెప్పు' మని
యడుగుటయు. 454

చ. పరమమునీంద్రసంయమన పక్వవివేక విభూతిరమ్య వి
స్తర మహనీయతార్కిక వచఃకలనానభిగమ్య! దేవతా
సురపరిరక్షణోన్మథనశోభికటాక్షవిహార! నిత్యసుం
దరశుభకాంతిపూర! దురితప్రవిదారణ! వీతకారణా! 455

క. ఆదిత్యమరుద్వసురు
ద్రాది సకలదేవతామయాత్మక శ్రీసం
పాదన విధావిచక్షణ
పాదసరోజా మహర్షిభక్తసమాజా! 456

మాలిని. అమలహృదయవేద్యా! హవ్యకవ్యప్రసాద్యా!
శమసుఖమయమూర్తి! సర్వలోకప్రవర్తి!
కమలభవనిషేవ్యా! కామదూరానుభావ్యా!
యమనియమవికాసీ! వ్యాసచేతోనివాసీ! 457

గద్యము:

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధన
విరాజి తిక్కనసోమయాజి ప్రణీతం బైన శ్రీ మహాభార
తంబున శాంతిపర్వంబునందు చతుర్థాశ్వాసము.

347

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము -- పంచమాశ్వాసము

-: ○ :-

శ్రీకరణనిపుణ చరణ
వ్యాకోచాంభోజ నిత్యవాసముదిత సు
శ్లోకమునిచి త్తభృంగ మ
హాకరుణా మిళదపాంగ హరిహరనాథా!

-: శ్రీ శక్ర సంవాద ప్రకారము :-
సం- 12-221-3.

వ. దేవా వైశంపాయనుండు జనమేజయున కిట్టనియె : నట్లింద్ర బలి సంవాద
రూపంబునఁ గాల ప్రకారంబు విని యుధిష్ఠిరుండు దేవవ్రతునితోడ. 2

క. 'ఏమిట రూ పగుఁ బురుషుం
డేమెయి రూపు సెడు నాకు నెఱిఁగింపుము తే
జోమహిత! యనిన నతఁ డా
భూమిపతికి నిట్టు లనియె భూపప్రవరా! 3

వ. ఇవ్విషయంబునకు నొక్కయితిహాసంబు శ్రీశక్రసంవాదం బనం గలదు దానిం
జెప్పెద నాకర్ణింపుము: నారదమునీశ్వరుం డెందును నిజేచ్ఛం జరించు చుండి
యొక్కనాఁడు మందాకినికిం జని కృతస్నానుండై. 4

క. ఆనదియం దాచరిత
స్నానుండై నియతి నున్న శక్రుం గని య

చ్చో నయ్యిరువురు సల్లా
పానందమఁ బొందుచుండ నాకాశమునన్. 5

తే. బాలభానుబింబంబు గీడ్పఁబచునట్టి
దీప్తి మండలి దోఁచె నద్దేవపతియు
మునిపతియుఁ జూచుచుండ గ్రక్కున విమాన
మవతరించి యాసన్న యై యతివ యోర్తు. 6

క. పురుహూతుని కభిముఖియై
కరములు మోడ్చుటయు నతఁడు గారవమున 'నె
వ్వర వజ్జాననఁ యెచటికి
నరిగెదఁ వెందుండి రాక?' యనియె నరేంద్రా! 7

సీ. అనపుడు నద్దేవి యాదరభరితయై
బాలార్కబోధిత పద్మజాత
యైనట్టిదాన; శ్రీ యన లక్ష్మి నా భూతి
యనఁగ వెలుంగుదు ననఘ! యేను
స్వాహాస్వధామతి శ్రద్ధా ధృతి స్మృతి
మేధల దనుజుల మెచ్చి వారి
కడనుండి మెచ్చ కిప్పుడు నీకడకు నేఁగు
దెంచితి' ననిన నద్దివిజనాథుఁ
తే. 'డేమి కారణమున మెచ్చి? తేకతమున
మెచ్చ వై తివి దానవుల? నీమెచ్చు చొప్పు
మాకు నెఱిఁగింపు' మనిన నమ్మానసీయ
వాక్య యిట్లని చెప్పె నవ్వాసవునకు. 8

క. 'దానాధ్యయనాతిథి స
మ్మానాది విశిష్టగుణ సమగ్రతకలిమిన్
దానవుల నియ్యకొంటిని;
వాని విడిచి గర్వ్ లగుట వారి విడిచితిన్. 9

వ. సత్యధర్మపరుండ వగుటంజేసి నిపాల వసియింప రుచి వుట్టి వచ్చితి'నని చెప్పి వెండియు. 10

సి. గురుభ క్తినిరతులు సురపితృపూజన
పరులును సత్యసంభాషణులును
దానశీలురుఁ బరధనపరదార ప
రాఙ్ముఖచిత్తులు బ్రాహ్మణప్రి
యులు దివానిద్రావియుక్తులు వృద్ధదు
ర్బలదీనయోషితక్పారతులును
శౌచులు నతిథిభోజనశిష్టభోజులు
నేను మెచ్చుజనంబు; లిట్లుగాక

తే. ధర్మమెడలి కామంబు గ్రోధంబుఁ జాలఁ
గలిగి గర్వులై బలియు భైక్షంబు నిడక
పరుషవాక్కులఁ గ్రూరంపుఁజరితములను
మిగిలి వర్తించువారు నామెచ్చుగారు. 11

క. బుద్ధియు ధృతియును నీతియు
శ్రద్ధయు సన్నతియు క్షమయు శాంతియు ననఁగా
వృద్ధశ్రవ: యేడ్వురు మ
ద్వ్యాద్ధిప్రదదేవతలు శ్రుతిస్మృతి కథితల్. 12

క. అష్టమి యగు దేవత నేఁ
గష్టాత్మత యసురులందుఁ గని విడిచితి మ
త్తుష్టికరచరితు లగుటఁ ద్రి
విష్టపసదులకడ నిలిచి వెలసెద ననినన్. 13

క. అభినందించిరి దేవ
ప్రభుఁడును నారదుఁడు నపుడు పవనంబును సౌ
రభ సుఖసంస్పర్శంబుల
నభిరామం బగుచు వీచె నల్లన యచటన్. 14

ఆ. కురిసెఁ బుష్పవృష్టి; మొరసె గీర్వాణ దుం
దుభులు; సిరి వరింప నభినవోజ్జ్వ
లత్వ మొంది దివిజులకు నేత్రపర్వ మై
పొలిచి యింద్రుఁ డాత్మపురికి నరిగె. 15

క. శతమఖకమలావాసా
ప్రతిమ సమాగమ విశేషబహుమత మగు నీ
యితిహాసము శ్రుత మైనఁ బ
రితమైనను నెఱయ సంఘటించును లక్ష్మిన్. 16

క. ఇందుల తాత్పర్యము నీ
డెందము నొందించి యతిదృఢీకృతశీలా
స్పందితుఁడ వగుము; తిరమై
యిందిర నీకడ వసించు నిభపురనాథా! 17

క. అనిన విని ధర్మజుఁడు శాం
తనవునితో 'జనుల కెవ్విధము నాచారం
బున నెట్టిపాటిశీలం
బున నేవిద్యను మహాత్మ! ముక్తి దొరకొనున్.' 18

క. అనవుడు నతనికి నతఁ డి
ట్లను 'విను మితిహాస మొకటి యది నీప్రశ్నం
బున కుత్తర మగు; నేర్పడ
వినిపించెద గాఢతరవివేకనిరూఢా! 19

-: దేవల జైగీషవ్య సంవాద ప్రకారము :-

సం. 12-222-34

వ. అసితుండగు దేవలుండు జైగీషవ్యుండను సంయమితోడ నీవృత్తం బెఱింగి
కొనవలయు నెఱింగింపవే యనిన నమ్మహాత్ముం డమ్మునివరున కిట్లనియె: 20

ఆ. శాంతిమంతులైన సౌమ్యుల కెయ్యది
నిష్ఠ దానియందు నిరతిశయ స
మాదరంబు గలదు నాదుచిత్తంబున
వినుము తద్విధంబు విస్తరింతు. 21

క. వినుతించిన నిందించిన
ననఘా! మనమునఁ బ్రియంబు నప్రియమును లే
కునికియు వ్రేసిన నైనను
గనలు వొడమమియుఁ బ్రబుద్ధగణ్యగుణంబుల్. 22

ఆ. ఒకటి గోరి దాని కుల్లంబు గందంగ
జాలిఁ బడమి యేమి సంభవించె
నేని దానఁ దృప్తి నూనుట దప్పిన
పనికి వగవకునికి భవ్యగుణము. 23

క. హర్షంబును మానంబు న
మర్షము నపరాధమును సమదభావము ను
త్కర్షాపకర్షచింతలు
నార్షసమాచారముల నిరస్తగుణంబుల్. 24

క. అవమానమునకుఁ దృప్తిం
దవు నమృతము ద్రావినట్లి యంచితసమ్మా
నవిధికి నుద్వేగముఁ బొం
దు విషంబునఁ బోలె శమరతుఁడు మునినాథా! 25

క. చుట్టము, పగ యనుభేదం
బెట్టి జనులవలనఁ దగుల దెల్లప్పుడు నె
ప్పట్టున నద్దానను మదిఁ
బుట్టదు సంతోషహాని బుద్ధాత్మనకున్. 26

ఆ. ఇంద్రియముల గెల్చి హృదయంబు శాంతిసు
ఖంబుఁ బొంద నిర్వికారవృత్తి

యైనవానిపొందు మానితగతి దేవ
తలకుఁ బొంద నరిది ధర్మనిరత: 27

క. అని చెప్పె ననుడుఁ గుంతీ
తనయాగ్రజుఁ డాత్మసమ్మదముఁ బొంద నదీ
తనయునితో 'నెవ్వఁ డఖిల
జనప్రియుఁడు సకలస త్త్వసమ్మతుఁ' డనినన్. 28

-: ఉగ్రసేన శ్రీకృష్ణ సంవాద ప్రకారము :-
సం- 12-223-23

వ. అమ్మహాత్ముం డమ్మహీపతి కిట్లను 'నారదుని విషయంబుగా నుగ్రసేనునకుఁ గేశవునకు సంవాదంబు గలిగె; నది నీయడిగిన యర్థంబుఁ దేటపఱుచు దాని నాకర్ణింపుము'. 29

క. నరనాథ: యుగ్రసేనుఁడు
హరితో నిట్లనియె జనము లభివర్ణనత
త్పరు లగుదురు నారదునెడ;
నరయఁగ నతఁ డంతవాఁడె? యంబుజనాభా ! 30

వ. అనుటయు నాకృష్ణుం డగ్గురుమతి కిట్లనియె : 31

సీ. శ్రుతము నాచారంబు నతిశయవంతంబు
లెడ నహంకార మొక్కిం తయేని
లేదు, శీలము గడులెస్స, వేషము నిర్వి
కారం, బమత్సరగర్వమదుఁడు,
జననంబు దపము దేజంబును బుద్ధియు
వినయంబు నయమును విశ్రుతములు
ధైర్యంబు వచనమాధుర్యంబు శౌర్యదై
న్యక్రోధలోభనిరాసకత్వ

ఆ. మోజ యతనియందు నై జంబు; లీర్ష్యయు
నుద్ధతియు నసూయయును నవజ్ఞ
యును నెఱుంగఁ; డట్టిమునివరు నారదు
నఖిలజనులుఁ బొగడు టరుదె యధిప! 32

వ. అని చెప్పె నగ్గుణంబు లఖిలప్రియతరంబులు సకలసత్త్వసమ్మతంబు, లనిన విని ధర్మతనయుండు శంతనుతనయుతోఁ 'గాలావయవ ప్రకారంబులును యుగప్రమాణంబులును భూతవిధంబులు నెఱింగింపవే' యని యడుగుటయు నతండు 'శుకుం డడుగ వేదవ్యాసమునీశ్వరుండు సెప్పిన యర్థంబులు నీయ డిగినవియును మఱియు ననేకంబులుఁ గలవు సెప్పెద విను'మని యజ్జనపతి కిట్లనియె. 33

క. అనఘుఁ బరాశరసూను స
వినయంబునఁ జేరి భక్తి వినతుండై త
త్తనయుండు బుద్ధిసంప
న్నుఁడు శుకుం డిట్టులనియెఁ గౌరవనాథా! 34

తే. కాలవిధములు భూతసంఘప్రకార
ములును లోనుగ నెఱుఁగంగవలయు వాని
బహులకారుణ్యసంపద పల్లవింప
నాకు నెఱిఁగింపవే మునినాథవర్య! 35

-: వ్యాసుఁడు శుకునకుఁ జెప్పిన కాలావయవ నిరూపణము :-

సం. 12-224-6.

వ. అని విని భరితాదరుండై వేదవ్యాసమునీశ్వరుం డమ్మహనీయున కిట్లనియె: 36

క. కాలములకు భూతములకు
నాలంబనభూతమగు మహామహిమ ప్రగియా
లీల వెలింగెడు నప్పర
మూలోకం బెందు నిష్కళాత్మక మయ్యెన్. 37

వ. అది భావనీయంబు. 38

క. వినుము: నిమేషంబులు పదు
నెనిమిది యగు గాష్ఠ; గాష్ఠ లిరువదియుం దో
డన పదియుం గళ; యఱువది
యును మున్నూఱుగళలై ముహూర్తము నడచున్. 39

తే. మూడుపదులు ముహూర్తముల్ మోహదూర
మగు నహోరాత్ర; మట్టివి యన్నిగూడ
మాస; మవి రెండు ఋతు వను మహితసంజ్ఞ
బరగ; ఋతువు లాఱైన వత్సరము వత్స! 40

తే. అందు మూడేసి ఋతువుల కయనమామ
కంబు లగు; నుత్త రాఖ్య మొకండు దక్షి
ణాభిధాన మొక్కటియు గుణాభిరామ!
యవి యహస్సును రాత్రియు ననగ బరగు. 41

వ. అది యోగిజనంబుల నిర్దేశంబు. 42

తే. అనఘ! యు త్తరదక్షిణాయనము లమ్మ
హాత్మ లగ్నియు ధూమంబు నండ్రు; మఱియు
వినుము;శుక్లంబు గృష్ణంబు ననుట గలుగు
సుగతి కగతికి హేతువు లగుట జేసి. 43

క. సరుల నెలలు నేడులు బిత్ర
సురులకు దినము లగు నండ్రు సూరులు; వరుసం

బరగు కృతత్రేతాద్వా
పర కలియుగ వత్సరముల భంగిఁ దెలిపెదన్. 44

వ. ఆకర్ణింపుము. 45

-: చతుర్యుగ సంవత్సర పరిమితి ప్రకారము:-
సం – 12-224-18

సి. విబుధుల పండ్రెండువేలేండ్లు సనునంత
నాలుగుయుగములు నోలి నడచుఁ;
గృతయుగమ్మున కందుఁ జతురంశకములుఁ, ద్రే
తకు మూడుపాళ్ళును, ద్వాపరంబు
భాగద్వయంబునఁ, బర్యవసిత మగుఁ;
గలియుగ మంశ మొక్కటన తీఱు;
నిబ్భంగి పాళ్ళకు నిన్నియుగముల కం
బరయుగ్మవసువార్ధి పరిమితములు
తే. ఖవ్యయర్తుగుణంబులు గగనయుగళ
వేదనేత్రంబులును నభోద్వితయకరసు
ధాంశులును వచ్చు మున్నాట యఱువదింట
బెంప మానుషాబ్దంబులై పేర్చియుండు. 46

వ. ఇట్లు గృతయుగంబునకుఁ బదియేడులక్షలు నిరువదియెనిమిదివేలును, ద్రేతా యుగంబునకుఁ బండ్రెండులక్షలుఁ దొంబదియాఱు వేలును' ద్వాపరంబునకు నెనిమిదిలక్షలు నఱువదినాలుగువేలును, గలియుగంబునకు నాలుగులక్షలు ముప్పదిరెండువేలును మనుష్యవత్సరంబు లయ్యె; నిందు సంధ్యలును సంధ్యాంశంబులు ననుపేళ్ళఁ గొంతేసికాలంబు సెల్లు. 47

క. క్రమమున సంధ్యలు సంధ్యాం
శములు నసం బరగు బు।త: సకలయుగాద్యం

తములును యుగయుగమునకుం
దమలో నవి సరియ కాలతత్త్వం బరయన్. 48

వ. అది యెట్లంచేని దేవసంఖ్యం జెప్పెద: 49

క. నన్నూఱులు మున్నూఱులు
నిన్నూఱులు నూఱులును మహితవర్షముల
య్యన్ని యుగములకును గ్రమా
సన్నత సంధ్యలను వానిసంధ్యాంశములన్. 50

వ. ఇట్లు కృతయుగంబునకు సంధ్య లక్షయు నలువదినాలుగువేలు, దానిసంధ్యాంశంబు నంతియ; త్రేతకు సంధ్య లక్షయు నెనిమిదివేలు, దానిసంధ్యాంశంబు నంతియ; ద్వాపరంబునకు సంధ్య రెండులక్షలు, దానిసంధ్యాంశంబు నంతియ; కలియుగంబునకు సంధ్య ముప్పదియూఱువేలు, దానిసంధ్యాంశంబు నంతియ; యివి మానుషవత్సరంబులు. 51

క. వరుసఁ గృతత్రేతాద్వా
పర కలియుగములఁ దపంబు భవ్యజ్ఞాన
స్ఫురణము యజనము దోషా
దరమును మానవులకుం బ్రధానతఁ గలుగున్. 52

క. న్యాయంబులు ధర్మంబులు
నాయువులుఁ దనూబలములు నంతంతకు వ
ర్తాఃయెంతయుఁ దఱుఁగుం ద్రే
తాయుగముఁ దొడంగి మనుజతతి కరయంగన్. 53

తే. ఆయుగంబులు నాల్గు మహాయుగంబు
నాఁగఁ జనుఁ దత్సహస్రంబు నలువ పగలు
దానికొలఁదియ రేయును దీనినెఱుఁగు
ప్రౌఢజనములు సు మ్మహోరాత్రవిదులు. 54

తే. అతఁడు రాత్రి నిద్రించు నిద్రావసరమ
ప్రళయ మగు లోకములకుఁ; బ్రభాత మగుడు
మేలుకన; దివమున భూతజాలసృష్టి
పరతఁ బొందు; బర్యాయ మిప్పాటఁ జెల్లు. 55

వ. అని వెండియు. 56

తే. అనఘ! బ్రహ్మంబు దేజోమయంబు శుక్ల
మ్రగభాసిత మెద్దాని యతులసార
రసము విశ్వంబు నది యహర్ముహితకాల
బుద్ధమై చేయు బహువిధభూతసృష్టి. 57

వ. తత్ప్రకారం బెట్టి దనిన నమ్మహనీయత త్వంబువలన. 58

ఆ. విను: మహన్మనో గగన పవ నానల
సలిల భూము లనఁగ సంభవించు
మహితవిభవములు గ్రమంబున నేడురూ
పములు జన్యజనకభావ మొంది. 59

క. క్రమయు క్తిని శబ్దస్ప
ర్శము లను రూపరసగంధ సద్భావములుం
దమగుణములుగా నాకా
శము మొదలగు భూతములు ప్రశ స్తి వహించున్. 60

క. నరనుత! విను; మీస ప్త
స్వరూపములు పురుష లంద్రు సంయమివరు; లీ
పురుషులు గూడిన సృష్టికి
వెరవరు; లది సంఘటిలదు వేర్పడిరేనిన్. 61

వ. ఇట్టి మహిమ గలిగి. 32

క. తేజోరూపము బ్రహ్మము
ప్రాజాపత్యం బనంగఁ బరగి పురుషుఁడు
ద్భాజిష్ణు సత్యనిత్యా
వ్యాజమహిమ వెలుగుచుండు నకలంకమతిన్. 63

క. వ్యాపకుఁడు స్రష్ట బ్రహ్మ ప్ర
జాపతి నాఁ బరగి నిత్యసత్యాత్మత్వో
ద్దీపితుఁడై పురుషుఁడు ని
ర్లేపుఁ డనిర్దేశముం గలిగి వెలుఁగొందున్. 64

క. సుర సంయమి గరు డోరగ
నర కిన్నర గిరి సరి ద్వన పయోధులఁ ద
త్కరణీయములం జేయుం
బురుషుఁడు దివ్యాంతరంగమునఁ దలఁచి సుతా! 65

వ. ఇట్లు గలిగి వర్తిలుచున్న లోకంబులందు. 66

ఆ. పౌరుషంబుసూవె ఫలద మందురు గొంద;
అనఘ! దైవ మిచ్చు నండ్రు కార్య
ఫలము గొంద; పెల్ల ఫలము భూతస్వభా
వంబ యండ్రు గొంద అమితతేజ! 67

వ. ఇవి కర్మస్థులతెఱంగులు; సత్త్వస్థులు సమదర్శను లయి యుండుదురు విశే
షంబు వినుమ: 68

క. శివకరము దపము మేధా
ధవ సకలజనంబులకును దానికి మూలం
బవిరళ శమ దమ సంపద
లవ్వట నివి మనంబుతోడ నలవడవలయున్. 69

వ. స్వాధ్యాయంబు దపంబునకు బలం బిచ్చి తత్ఫలంబు గావించు. 70

క. అరయంగా శబ్దంబును
బరంబు నన రెండు సూవె బ్రహ్మములు గుణో
త్తర శబ్దబ్రహ్మభజన
పరుఁడు పరబ్రహ్మమహితపదముం బొందున్. 71

క. పరమబ్రహ్మమ భూతో
త్కరముం గలిగించు ప్రింగు; దా నిష్క్రియతా
స్ఫురితం బయ్యును బ్రకృతి
స్ఫురణను శబలత్వ మొంది పురుషవరేణ్యా! 72

వ. సృష్టితెఱంగు మున్నెఱింగించితి; సంహారప్రకారంబు సెప్పెద నాకర్ణింపుము:

తే. స్థావరములు జంగమములుఁ దన్నుఁ గలయ
విలయ మొందిన ఘటపృష్ఠవిధము దాల్చు;
భూమి నంబువుల్ ప్రింగు, నంబువుల నగ్ని,
యగ్ని ననిలుం, డనలుఁ ద్రావు నాకసంబు. 74

ఆ. ఆకసమును మనసు హరియించు గంధాది
యగు గుణాళితోడ; నఖిలభూత
ములును నిట్లు లయముఁ బొందిన ప్రగసియించు
మనసు నాత్మగుణము నెనసి విధుఁడు. 75

క. అతనిఁ బొదువు సంకల్పం;
బతులజ్ఞానంబు దాని నడఁచును విజ్ఞా
నితఁ డబ్బలముఁ బురుషదే
హితనుం గాలంబు వరుస నెడలం జేయున్. 76

క. కాలం బెడలిన విద్యో
న్మీలిత మగు బోధ మన్య మిశ్రత్వంబుం

దూలించి వెలుఁగుచుండు; వి
శాలమతీ! బ్రహ్మ మది, ప్రశస్తము శ్రుతులన్. 77

క. వినుఁ మీసంహరణంబును
దనవసు; మాతత్త్వ మవ్యిధంబున దివసం
బును రాత్రియు భూతములకు
జననము విలయమును జేయు సంక్రీడమెయిన్. 78

వ. అని చెప్పి పారాశర్యుం డార్యవర్యుం డగు శుకునితో వెండియు నిట్లనియెఁ:

సీ. జనియించి విప్రుండు జాతకర్మంబును
చౌలంబు నుప నీతి సంస్కృతియును
బడసి, యాచార్యునిపాల నధ్యయనంబు
సేసి, తా నాతనిచే ననుజ్ఞ
గాంచి; తక్కటివి మూఁ డంచితాశ్రమముల
యందు నొక్కటి పూననగు; గృహస్థ
ధర్మ మాశ్రయ మండ్రు తక్కినమూఁటికిఁ;
గావున నది పూని దైవపైత్ర

తే. కంబులైన ఋణంబులఁ గ్రాఁచు వడుగు
నాఁటినడవడి ఋషులఋణమ్ము దీర్చి
వచ్చి కాన కాషాయపక్వతఁ బ్రశుద్ధిఁ
బొంది మఱి యుత్తమాశ్రమ మొందు టొప్పు. 80

తే. క్రతువు సేఁత, సేయించుట, శ్రుతులు గాఢ
నియతిఁ జదువుట, చదివించుటయును, ధనము
లీగికొనుట-షట్కర్మంబు లింతవట్టు
నర్హకృత్యంబు లండ్రు ధరామరులకు. 81

-: దానగుణంబు సర్వవర్ణ సామాన్యంబుగా నిరూపించుట :-
సం. 12-226-14,15.

వ. దానానుష్ఠానంబు సర్వజాతిసామాన్యం బయిన యుత్తమధర్మంబు; పుణ్య పరులకు దాతవ్యంబుగాని వస్తువు లేదు; కావ్యం డనురాజు దనప్రాణంబు లిచ్చి బ్రాహ్మణప్రాణంబులు గాచె; నౌశీనరుండగు శిబి యాత్మాంగంబుల నొరస పుత్రునిని బ్రాహ్మణార్థంబుగా నొసంగెఁ: గాశీపతి యగు ప్రతర్దనుండు బ్రాహ్మణునకై నిజనయనంబు లిచ్చె; విదేహుండును జామదగ్న్యుండును గయుండును నొక్కొక్కతఱి సకలవసుంధరయును బ్రాహ్మణుల కిచ్చిరి; పాంచాల్యం డగు బ్రహ్మదత్తుండు శంఖనిధి విప్రోత్తములకు దానంబుసేసె; మఱియును బ్రాహ్మణులకుఁ బ్రాణశరీర మణిహిరణ్యకన్యాగవాది ప్రశస్త వస్తువు లనేకు లర్థుల కొసంగిరి; వారలకెల్లను సమకూరిన సద్గతుల విశేషంబులం జెప్పం బెద్ద యని వెండియు. 82

క. దానాధ్యయన యజనముల
నానావిధపాపములు వినాశముఁ బొందుం;
గాన యవి మేలు; హింసా
హీనత ధర్మవిధి లేని యెడఁ గడువలయున్. 83

ఆ. ధూతపాపుఁడైన పూతాత్మకుండు ల
ఘ్వాశి యగుచు నింద్రియముల గెల్చి
మనసులోనఁ గామమును గ్రోధమును జొర
నీక బ్రహ్మపదము నిచ్చఁ గోరు. 84

ఆ. ఇట్టివాఁడు వెడల నీసు నింద్రియజల
మన్యుపంకశోభమయ తటాది
ఘోరరూప యగు నసారసంసారవి
శాలనదిఁ బ్రశాంతశాలిహృదయ, 85

తే. ఘనతర ప్రజ్ఞ యను తెప్పఁ గలుగువాఁడు
సంసరణనది గడువంగఁ జాలుఁగాక
కామమును గ్రోధమును మదిఁ గలిగి ప్రజ్ఞ
చించునేని నక్కడచుట చిక్కువడదె. 86

క. గతహర్షభయక్రోధుఁడు
ధృతిమంతుఁడు నప్రమత్త ధీమహితుఁడు సం
శ్రితధర్ముఁడు దాంతుఁడు నగు
సతఁ డవసాదంబు నొందఁ డతులవివేకా! 87

క. ధర్మ మధర్మమవోలె న
ధర్మము దా ధర్మవిధి విధంబునఁ దోఁచుం;
గర్మసమితి నొక్కొక్కయెడ
ధర్మగతి యెఱుంగవలయుఁ దచ్ఛాస్త్రములన్. 88

ప. అని యుపదేశించి మఱియును. 89

క. జ్ఞానంబు వడయుటకు వా
జ్ఞానసము సునియతములు గావింతురు స
మ్మానితశాంతికొఱకు వి
జ్ఞానంబున నాత్మనియతి సల్పుదురు బుధుల్. 90

క. ఈతెరువున వేదవిదుఁడు
వీతామ్నాయుండు ధర్మవేదియుఁ బాప
స్పృతుఁడు సరియై కడతు ర
నాతురత జరామరణమహాంభోరాశిన్. 91

వ. ఆచారనేమియుఁ ప్రాణయుగంబును నపానాక్షంబును ప్రీవరూథంబును
నుపాయాపాయకూబరంబును ఘ్రాణశ్రవణవాహనంబును జ్ఞానసారథికంబును
సర్వతంత్రప్రతోదంబును ద్యాగరశ్మియును నగ్నుయోగరథంబు నెక్కి వెరవు

గలవాఁ డక్షరపదంబు సొరంజనఁజాలు;నారథికుం డాతంత్రంబు ప్రభావంబు
నంజేసి. 92

క. వరుసన ధరణీపవనా
బర జల తేజముల గెలుచు బలమెక్కి యహం
కరణంబు ద్రోచు బుద్ధిం
బరువడి నడఁగించుఁ బ్రకృతిపనిఁ బెడఁబాపున్. 93

ఆ. భూమిజయము దొడఁగి పురుషుఁ డంతంతకు
వృద్ధిఁబొందు యోగసిద్ధిఁ బొందుఁ;
బొగయు మిడుఁగుఱులును బొనుఁగు లేని శిఖియు
బహులశిఖలు నైన పగిది ననఘ ! 94

తే. వినుఁ;మహంకారజయము పృథ్వీముఖంబు
లైన వానిని బుద్ధిప్రధానమును జ
యించు నట్టిసంస్కారంబు నిచ్చుదాన
వగు మహానుభావంబు సంయమివరులకు. 95

వ. ఇది యోగప్రకారంబు. 96

తే. అనఘ! యింద్రియముల విషయముల మీఁద
నిగుడనీక మనంబుతో మగుఁడ దిగిచి
యాత్మఁ గూర్చుట సాంఖ్యుల యనువు; సాంఖ్య
యోగములు రెండు నారయ నొక్క తెరువ. 97

క. ఈరెండు ప్రకారంబుల
వారలకును మమత విడువవలయుఁట సరి; ని
స్సారపు సంసారమునకుఁ
గారణము మమత్వ మగుటఁ గవిజనముఖ్యా ! 98

వ. భూత తారతమ్యంబులు సెప్పెద నాకర్ణింపుము: జంగమస్థావరంబులయందు జంగమంబులు లెస్స;యవి జారాయువు నండంబును నుద్భిదంబును స్వేదం ఖును ననుజనక విశేషంబుల జనియించి బహుపాదంబులును ద్విపాదంబులును నై యుండు; నందు మనుష్యులు మేలు; మనుష్యులయందు జాతిధర్మోప ధారకు లెక్కుడు; జాతిధర్మోపధారకులయందు విప్రు లుత్తములు; విప్రుల యందు వేదజ్ఞు లుదాత్తులు; వేదజ్ఞులయందు ప్రవచనశీలు రుత్కృష్టులు; ప్రవచన శీలురయం దాత్మజ్ఞు లధికులు; వారలు సద్ధర్మవిదులు, సత్య సంకల్పులు, నధిభూతాధి దైవవేదులు నగుదురు; వారలం జూవె దేవతలు బ్రాహ్మణు లండ్రు; వా రెల్లవారికి నమస్కారాద్యుపచారాదరణీయులు; వారికి సరి లేరు; వా రాధారంబుగా సనుస్తజగంబులు ప్రవర్తిల్లుచున్నవి- యని చెప్పి యమ్మహాత్ముండు వెండియు. 99

తే. బ్రాహ్మణునకు ప్రధానవర్తనము వినుము !
నిర్మలజ్ఞానయుక్తుడై కర్మసమితి
నలఘునిష్ఠమై జలుపంగవలయు; దాన
సంశయములెల్ల బాయు, ప్రసాద మొందు. 100

క. ఇయ్యఖిలము సృజియింపఁగ
నెయ్యది ప్రభు వమ్మహామహితభూతము పొం
దయ్యెడి శుభంబు దపమునఁ
జయ్యన సిద్ధించు నది విసంశయ మనఘా ! 101

క. మైత్రిం బోలెడు ధర్మము
ధాత్రీదివిజులకు లేదు; దాని నడిపినం
బుత్రాః యేకర్మంబు ప
విత్రతయును వలవ; దది వివేకముఁ జేర్చున్. 102

వ, అనిన విని శుకుం డా సంయమివరున కిట్లనియె: 103

:వ్యాసుఁడు శుకున కుపదేశించిన పరబ్రహ్మప్రాప్తి సాధనప్రకారము:

సం 12-231-3.

క. పరమబ్రహ్మపదము న
ధ్వరముననో ప్రజ్ఞపెంపువలననొ యోగా
చరణముననో సాంఖ్యసమా
దరణముననొ పొందవచ్చుఁ దత్త్వజ్ఞవరా: 104

చ. అనుటయు నమ్ముని ప్రవరుఁ డాతని కిట్లను; నీవు పేరు గ్రు
చ్చినయవి యెల్ల మేల; సవిశేషతపంబును నింద్రియప్రవ
ర్తనముల నిగ్రహించుటయు రాగము లోభముఁ ద్రోవఁ జాలు నే
ర్పును దృఢవిద్యయుం గలుగుపుణ్యుఁడు వొందఁగనోపు బ్రహ్మమున్. 105

క. విను; మందు నొక విశేషం
బనఘా: బుద్ధీంద్రియంబులైదును బరముం
గను వెలుఁగున కడ్డము; వా
ని నడంగింపంగ మనసు నిపుణత యొప్పున్. 106

క. మనసు నియమింప భూతా
త్ముని యత్నం బోపు; నియమమునకున్ లోనై
మన సింద్రియములఁ గుదియిం
చిన, శబ్దాదులు దొఱంగి సిద్ధి దొరకొనున్. 107

ఆ. కనుట వినుట యాదిగాఁ గల యింద్రియం
బుల కగోచరంబు బుద్ధి దీప
రూపుగాఁగఁ దోఁచు రూపశబ్దాది గు
ణత్వరహితమైన తత్త్వ మనఘ: 108

చ. వినయము విద్యయుం గలుగు విప్రునియందును గోవునందు నొ
ప్పు నెఱయు హస్తియందు నొకపోఁకకుఁ బోవనికక్కయందు దా

ని నడిచి తెచ్చి వండి తిను నీచపుమాలనియందుఁ దుల్యాద
ర్శనులు దదంతరాత్ముని నిరంజనునిం గను నట్టి పండితుల్. 109

క. స్థావరముల జంగమముల
నావిభుఁడు వసించు నతనియందు నవి నిస
ర్గావాసిత నుండును ద
ద్భావన మెఱుఁగుట తద్ధైక్యపదముం జేర్చున్. 110

తే. క్షరము నక్షరమును ననం గలవు రెండు
మూర్తు లాత్మ; కఖిలభూతములను బూర్వ
మొలయు మృత మన దివమున నుండు నమృత
మనఁగ నపరంబు; రెంటిని గను బుధుండు. 111

క. ఈలోకంబుల నెల్లం
గాలము పక్వంబు సేయఁగా నెవ్వాఁ డ
క్కాలము పక్వము సేయం
జాలుఁ నతం డమ్మతు నజరు సత్యుఁ గనుటకున్. 112

తే. విను: నవద్వారపురమున వెలుఁగుచుండు
హంసుఁ; డతనిన యక్షరుఁ డమ్మతుఁ డంద్రు;
పరమ యోగి యాతత్త్వంబు భంగిఁ గాంచు
యోగ్యసత్క్రియాభ్యాస వైరాగ్యపరుఁడు. 113

వ. అని చెప్పి యప్పారాశర్యుండు వెండియు. 114

తే. అనఘ: వినుఁ, కామమును గ్రోధమును భయంబు
నిద్రయును లోభమును జాల నిందితములు
యోగిజనులకుఁ; గావున నుడుగవలయు
వీని నైదింటి నచలావధానవృత్తి. 115

శా. కామంబుం బెడఁబాచుఁ బండితుఁడు, సంకల్పంబు వర్జించి, ని
ద్రామోహంబు నడంచు, సత్త్వగుణచింతన్, లోభముం బ్రాజ్ఞ సే

వాముద్రం దొలఁగించుఁ, గ్రోధము శమవ్యాప్తిన్ మగుడ్చున్, మతి
శ్రీమాన్యా భయ మప్రమాదమున నిర్జించున్' దృఢస్వాంతుఁడై. 116

తే. శిశ్నము నుదరమును ధృతిఁ జేయుఁ గాలుఁ
జూడ్కిఁ జూడ్కిని వినికిని శుద్ధమాన
సమున మానసవాక్కుల విమలవిద్య
నవహితుండు రక్షించుఁ గులాగ్రగణ్య! 117

వ. మఱియు నొక్క తెఱంగు సెప్పెద. 118

తే. ఇంద్రియములలో నొక్కటి యేనిఁ బట్టు
వడక వెడలిన నాగంటిఁ బ్రజ్ఞ గాఱు
నట్లు కావున మనసు మున్నాఁగి వినికి
యాది యగు నెదుఁ గ్రమమున నాఁగవలయు. 119

క. మనసును నింద్రియములునుం
దనయం దొదుఁగంగఁ జేయుఁ దానుఁ దెలివి నొం
ది నిరంజనత్వసిద్ధి
గని యవధూమానలంబు కరణి వెలుంగున్. 120

మ. మన సేకాగ్రతఁ బొందఁ జేయ జనసమ్మర్దంబు వర్జించి శూ
న్యని కేతాద్రి గుహావివిక్త వన దేవాగార ముఖ్యంబులై
న నివాసంబుల నుండఁ గావలయుఁ; ద న్మన్నించినం గీడు సే
సిన హర్షంబు నమర్షమున్ హృదయముఁ జెందింప కక్షోభ్యుఁడై. 121

క. సమదృష్టిని జాయియుఁ గన
కముఁ జూచుచు సత్సమాధికలితం బగు వ్య
క్తము నడిపిన శబ్దబ్ర
హ్మము షణ్మాసముల యోగి యతివర్తించున్. 122

క. సుతఁ వినుఁ శబ్దబ్రహ్మము
నతివర్తించి భువనత్రయమునను యోగా
న్వితుఁ డగుమునిఁ గను నజుఁ శా
శ్వతు నచలుఁ బురాణతము నజరుఁ బరమాత్మున్. 123

వ. అనిన విని శుకుండు వేదవ్యాసమునీశ్వరునితో నిట్లను 'వేదంబు గర్మముల నాచరించుటయుం బరిత్యజించుటయుం జెప్పు; నివ్విధంబులు పరస్పర విరుద్ధంబులై యున్న యవి; యిం దెద్దాన నెట్టిగతి సిద్ధించు నేర్పడ నెఱింగింపవే' యనుటయు నతం డిట్లనియెఁ: 124

ఆ. వినుఁ: ప్రవృత్తి కర్మ' మనఘ! నివృత్తి ని
ష్కర్మ, మరయ బంధకంబు మోక్ష
ణంబు నగుట బోధనత్వసంపన్నులు
సారరు కర్మతంత్రకరణమునకు. 125

క. కొందఱు కర్మకరణ మభి
నందింతురు; వారలకు జననమరణములం
బొందక పోరాదు; మహా
నందముఁ బొందుదురు నిత్యనైష్కర్మ్యపరుల్. 126

ఆ. చిత్తశుద్ధి మాత్ర జేసె నేనియు నవి
ద్యాత్మకంబ చూవె యరయఁ గర్మ
మది దొఱంగు టంచితాత్మ విద్యాత్మక
ధర్మ; మదియ మోక్షదంబు సుమ్ము! 127

ఉ. గుమ్మడిపువ్వుఁ దేనియయుఁ గూపము నైందవరేఖ కాంతియుం
జుమ్మరయంగఁ గర్మఫలశోభనసంపద జున్ను నేఱుఁ బూ
ర్ణమ్మగు చంద్రబింబము ననం దగు; నిర్మలవిద్యగాధపా
కమ్ము ఫలోదయం; బది యభండసుఖాత్మపదంబు పుత్రకా! 128

వ. కర్మంబునం గానిదియై విద్య నయ్యెడునట్టి తెఱం గెఱింగించెద. 129

క. విను: రేఖామాత్రపుఁ జం
ద్రునియట్టుల జీవుఁ డతని దుష్పక్షముఁ బో
లిన యజ్ఞానము నపగమ
మున బోధనందసాంద్రపూర్ణతఁ బొలుచున్. 130

—: బ్రహ్మచర్యంబు బ్రహ్మవిద్యాప్రాప్తికి
ముఖ్యకారణం బని చెప్పుట :—

సం. 12-234-12.

వ. అని చెప్పిన విని 'విద్య యెట్టివారికి నలవడు నెఱింగింపవే' యనిన నందను
నితో గంధవతీనందనుం డిట్లనియె: 131

తే. బ్రహ్మచర్యసమేతతపంబు విపుల
కాననమున వానప్రస్థగణముపొంత
నిలిచి చేయుచుఁ బర్జన్యాలలకు నుచిత
కాలమునఁ జని యెత్తి భిక్షలు భుజించి. 132

క. నుతియు నమస్కృతియును లే
క తిరిగి, శుభ మశుభ మను వగం బొందక గో
ష్పితెరువు సొరకుండుట సు
వ్రత;మది యధ్యాత్మవిద్యఁ బ్రచురముఁ జేయున్. 133

ఆ. అనుడు నతఁడు 'కర్మ మఖిలంబు నీడఁ బో
విడుచు టొప్ప దండ్రు వేదవిదులు;
దాని నాదరింపఁ దగదొకో సంయమి
ప్రవర! సంయంబు వాపవలయు.' 134

వ. అనినం గర్మంబు విడువమియు విడుచుటయుం గలిగియుండుఁ దదీయ
యోగ్యతా విశేషంబు లెఱింగించెద. 135

సీ. వినుమని ముని యిట్టు లనుఁ: బ్రహ్మచారి గృ
హస్థ వానప్రస్థయతులు విహిత
కర్మనిష్ఠత సిద్ధిగాంతు; రాశ్రమ చతు
ష్కముఁ జతుష్పట్టికాఘటితమైన
నిఃశ్రేణి; తుదిముట్టు నెల వెక్కుటకు నిట్టి
క్రమవర్తనము సుకరంపుమార్గ;
మాయువు మొదలి నాలవుపాలు గురుపాల
దాసునియట్ల సంతతము బనులు

తే. ప్రీతిఁ జేయుచుఁ గుడిచిన పిదపఁ, గుడిచి
శయ్యఁ జెందిన నాతని చరణయుగము
గరయుగంబున నొత్తుచుఁ గలితనిద్రుఁ
డైన నిద్రించు బ్రహ్మచర్యాన్వితుండు. 136

క. రసగంధప్రముఖంబుల
దెస వేడుక లేక గురుమతికి వచ్చిన య
ట్టిసమయములఁ దగ వేదా
భ్యసనంబులు సేయుచుండు నాతఁడు నియతిన్. 137

వ. ఇది బ్రహ్మచారి ప్రకారం బాతం డాశ్రమాంతరగతుం డయి వర్తించు విధంబు
సెప్పెద. 138

సీ. సవినయంబునఁ దనశక్తితో గురునకు
దక్షిణ యిచ్చి, యాతండు వనుపఁ
గా సమావర్తన కార్యంబు నడపి వి
వాహమై, హవ్యకవ్యముల నతిథి

తోషణబాంధవపోషణంబు లసత్య
భాషల నిజదారపరత, బుత్ర
సంశిక్ష, గ్రతువిశేషంబుల నొక యాయు
రంశంబు గడపి, గృహస్థధర్మ

తే. వృత్తి, గృతకృత్యు, డగు; నగ్ని విడువ కడవి,
బూరిపంటల ఫలమూలములను భిక్షు
పూజ సలుపుచు, బరిశిష్టములు భుజించి
తపము సేత వానప్రస్థధర్మసరణి. 139

క. వానప్రస్థప్రక్రియ
దా నొక పా లాయువు, బదంపడి తుది పా
లైనను సన్న్యాసాను
ష్ఠానమునకు, జొచ్చువాడు శాంతాత్మకుడై. 140

వ. ఇట్లాయురంశంబుల నాలుగుం జెల్లుట యుత్తమధర్మ స్వరూపం; బంశత్రయ
కాలాచరితంబైన యాశ్రమ త్రితయంబు ప్రవర్తనంబుల, గషాయపక్వం
బగుటయు, జతుర్థాశ్రమంబు, జెందుట కృత్యంబు; దాని తెఱం గెఱింగిం
చెద నవహితుండవై యాకర్ణింపుము. 141

సీ. ఆత్మయం దగ్నిసమారోపణము సేసి
యజన మాంతరముగ నకృతసంధి
విగ్రహం డగుచు, బరిగ్రహవిముఖు, డై
ముండుండు ననికేతనుండు వృక్ష
మూలవాసియును గపాలధారుండు నే
కాకియు నక్రోధకామశోకు,
డును గా,గవలయు భిక్షునకు నిందాస్తుతుల్
దనయంద యడ,గంగ, దాను బరుల

తే. దిక్కువలుకక దివియెల్ల, బిక్కటిల,గ,
దానయున్నట్లు గనుచు నేమేని, గుడిచి

యెద్ది యేనియుఁ గట్టి యెందే శయించు
నతని దేవతల్ బ్రాహ్మణుఁ డంద్రు పుత్ర! 142

క. జననికరములకుఁ దొలఁగును
ఘనభుజగంబులకుఁబోలెఁ గనుఁ బీనుఁగుగా
వనితం దను బాటించిన
ననఘా! నరకముగఁ దలఁచు నతఁడు మనమునన్. 143

తే. అతనివలన భూతములకు నభయ మగుట
భూతములదెస నభయంబ యాతనికిని
బుత్ర! యీగు లెల్లవియును భూతములకు
నభయ మిచ్చోటఁ బోల వం ద్రార్యజనులు. 144

ఆ. జంతుపదములెల్ల దంతిపదంబులో
నడఁగుక్రియ నహింసయందు సకల
ధర్మములు నడంగుఁ; గర్మసంత్యాగికి
నైన భూతదయ సమర్హగుణము. 145

వ. కావున. 146

క జగములకెల్ల శరణ్యుం
డగుచు నమృతసిక్తమైనయట్టి మనసుతో
విగతాఖిలలేపస్థితి
గగనము నట్లుండు నతఁడు గణనాధికుఁడై. 147

వ. అని చెప్పి యప్పరాశరనందనుండు వెండియు నిట్లనియె: 148

వ్యాసుడు శుకున కుపదేశించిన యంతర్యాగ ప్రకారము

సం. 12-34-2.

తే. హృదయవేదికయందు సమిద్ధమూర్తి
వెలుగుచుండు తేజమునందు వేల్చుఁ బ్రాణ

ములను యాజి యట్లంతరమున నొనర్చి
యాగమునవీతకల్మషుడై వెలుంగు. 149

క. వినుఁ మాత్మతీర్థసంసే
వనము తెఱం గెఱుఁగునట్టివానికిఁ దిరుగం
జనవలయునె పెఱచోటుల
కని చెప్పుదు రాశ్రితులకు నధ్యాత్మవిదుల్. 150

తే. అవనిఁ బొందదు దివమున నప్రమేయ
మండజంబు హిరణ్మయ మండమధ్య
మున వెలుంగు నుజ్జ్వల పక్షఘనత దాని
నెఱుఁగు సంతతయోగసమేతుఁ డనఘ! 151

క. వినుఁ నూఱంచులుఁ బండ్రెం
డనుపమధారలును నై నిజాస్యము విశ్వం
బును బొదువఁ దిరుగుకాలం
బనుచక్రము; దురవబోధ మది; యడఁగు గుహన్. 152

ఆ. మనసు నింద్రియములఁ బనిగొని పురుషుండు
ప్రచురశిక్ష లేని రథ్యసమితి
నడుపు రథికుమాడ్కి నడవడి నని యాడ్చి
నట్టులైన నశుభ మావహిల్లు. 153

క. తనకు మహితప్రసాదం
బొనరక యున్నేనిఁ గీళ్కు లొలయునది; దృఢ
త్వనిరూఢమైనఁ జేకుఱు
ననంతపదసిద్ధి; దాని కను వెఱిగింతున్. 154

తే. సర్వసంకల్ప రహితుడై సత్త్వమున వి
నిశ్చలంబుగఁ జిత్తంబు నిలుపవలయు;
సత్త్వసక్తచిత్తంబు ప్రసాద మొసఁగు;
ధానఁ గాళంబు నడపుటుత్తమవిధంబు. 155

క. వినుము నివాసస్థానం
బునఁ గంపనరహితదీపము వెలింగెడు చా
డ్పున నంతరాత్మ వెలుఁగుచు
నునికి ప్రసాదంబుభంగి యుత్తమధిషణా ! 156

క. వినుత ప్రసాదవంతుఁడు
దనయందు నిరంజనముగఁ దన్ననిశంబుం
గనుగొనుచు నియతి నియతా
శనుఁడై యుండుట యొనర్చు శాశ్వతపదమున్. 157

తే. అతుల వేదాంతశాస్త్ర మహాంబురాశి
ద్రచ్చి పుచ్చి నవనీత మిచ్చితిని; స
మాదరంబునఁ గైకొను మనుసరించు
నిర్మలాత్మ తపస్వికి నీవు నొసఁగు. 158

ఆ. సకలరత్నపూర్ణ సర్వవసుంధరా
చక్రదానవిధియు సరి యనంగ
రాదు విశ్వవేదరాశి సారాధ్యాత్మ
విద్య యిచ్చుటకు వివేకధుర్య! 159

వ. అని యుపదేశించి యింక నేమి వల తనిన శుకుండు "దీనికంటె వినవలయు
నది గలదెఁ దీనిని సుద్భడంబుగా ననుగ్రహింపవే" యనుటయు ననుకంపా
విధేయుం డగు సాత్యవతేయుం డతని కిట్లనియె: 160

క. భూతంబులఁ బచరించుచు
భూతాత్ముఁడు వానిఁ దనవిభూతి నడంచున్
భూతాహరణంబు నిజ
ద్యోతనము; దదీయవృత్తి దుర్దశ పుత్రా ! 161

క. ఆవయవము లెట్లు కూర్మము
నివిడించును లోని కడఁచు నెటి నట్లుల భూ

తవితతి భూతాత్ముండును
బ్రవర్తన నివర్తనముల పాల్పడఁ జేయున్. 162

క. మాయాశబలుండై యటు
సేయక పోరామి భూతసృష్టి యొనర్చున్;
మాయఁ బెడఁబాప భూతని
ష్కాయాభావ మగు నదియ కవిజనముఖ్యా! 163

తే. గగన పవన తేజో జల ష్మా గుణములు
సూవె శబ్దాదికంబును శ్రోత్రముఖ్య
కంబునై చెల్లు విషయచయంబు నింద్రి
యవ్రజంబును సర్వంబు నడఁచు శమము. 164

క. విను యైదింద్రియములకును
మనంబు షష్ఠంబు, సప్తమత్వము బుద్ధిం
బనుగొను భవ్యక్షేత్ర
జ్ఞునియం దష్టమత గల్గు సుగుణాభరణా! 165

తే. తలఁచు మనమందు నిశ్చయదశ యొనర్చు
బుద్ధి సర్వైకసాక్షిత్వమున వెలుంగు;
నంతరాత్ముండు క్షేత్రజ్ఞుఁ డనఁగ వాని
మెఱపు సత్త్వాదిగుణము లై మెఱయు వత్స! 166

తే. స్వస్థతయు దుఃస్థతయు జడత్వమును గ్రమ వి
గణన సత్త్వరజస్తమోగుణము; లవి స
మీరితము లగు టడఁగుట యింద్రియంబు
లడరు టొడఁగుట బుద్ధికృత్యములు పుత్ర! 167

తే. అనఘ! యింద్రియములు విషయములు మనసు
బుద్ధియును నాత్మయును గ్రమంబునన యెక్కు;

డాత్మ బుద్ధి యనంగ నల్పాంతరంపు
వస్తువులు బుద్ధి యిన్నింట విస్తరిలుట. 168

క. కనుఁ గన్నె, వినుఁ జెవియై,
కొనుఁ జవి జిహ్వాయయి, మూరుకొను నాసికయై,
తనువై స్పర్శము గైకొను,
ననవద్యా! బుద్ధి యాత్మయంద నిలుచుచున్. 169

క. ప్రీతిం గడుఁ బొదలు, విషా
దాతురతన్ గ్రుక్కుఁ; దద్ద్వయము తేక సమ
త్వాతిశయంబున నిలుచును
నేత్యత్వంబునను బుద్ధి నెఱపు గుణములన్. 170

ఆ. తత్స్వభావ మెఱిఁగి తా నింద్రియాది స
ప్తకమ వెంటఁ బోక తన్నుఁ గనుచు
నున్నవానిఁ బొంద నోపునె దుఃఖదై
న్యంబు సుఖమదంబు నప్రమత్త. 171

ఆ. జలములందు నిలిచి జలపక్షి మునుఁగదు,
మేడిపండు మశకపీడఁ బొరయ;
దట్ల విషయసమితియందుఁ దా నది దన
యందు నుండు వికృతి నొంద దాత్మ. 172

వ. అని చెప్పి మఱియును. 173

క. వినుఁ మూర్ణనాభి తంతువు
జనియింపఁగఁ జేసినట్లు సత్త్వము గుణసం
జనకం బగు నది పురుషుఁడు
గనుట యుదాసీనతన వికారము గలదే? 174

ఆ. ఆదిని ధనరహితుఁ డగు నిరంజనుఁ జెంది
గుణము లెడల విడిచి క్రోధలోభ
ములకుఁ జొరవయీని ముని హృదయగ్రంథి
విరియ నడఁచి మోక్షవిభవ మొందు. 175

క. శమసంపద బ్రాహ్మణ జ
న్మమునకు సామగ్ర్య; మవ్వినయసారము చి
త్తమున కలవడ్డమునికి భ
యము శోకము మదము హర్ష మనునివి గలవే? 176

క. శమనిరతియు నాత్మజ్ఞా
నముఁ జువ్వే బుద్ధలక్షణంబులు; పర్యా
ప్తము లివి రెండు నరయ; మో
క్షము సాధించుటకు వేఱ కల్పన లేలా? 177

వ. అనిన విని శుకుండు 'ధర్మంబులకెల్లఁ బరమం బయినధర్మం బెఱింగింపవే' యనుటయు వాత్సల్యపరాయణుం డగునబ్బాదరాయణుండు 'సనాతనంబును మునిసత్తమసంస్తుత్యంబును నగునుత్తమధర్మంబు నెఱ్ఱెద; నేకాగ్రచిత్తుండవయి యాకర్ణింపు'మని పలికి యిట్లనియె: 178

-; ఇంద్రియనిగ్రహం బుత్తమ ధర్మంబుగ నిరూపించుట :-

పం. 12 - 242 - 1,2.

తే. ఎల్లకడలకు వెలువడు నింద్రియముల
బాలపుత్రులఁ దండ్రియుఁ బోలె నాఁగు
మవియు మనమును నిశ్చలై కాగ్రభావ
మొందు టుత్తమతప మది యుజ్జ్వలాత్మ! 179

క. అది ధర్మంబుల కెల్లం
దుదియగు ధర్మంబు, మనసుతో దానిఁ దగం

గుదియించి మేధతోడం
గదియింపుము నియతిఁ బుత్ర! కడుగాధముగన్. 180

తే. ఇంద్రియంబుల నాజింటి నిట్లు విషయ
ములకు నొలయక యుండంగ నిలువరించి,
తలఁపు లుడిగి, తేనియఁ బ్రమదమున నాను
భంగిఁ ద్యప్తుఁడవై యుందు పరముఁ గాంతు. 181

వ. అని వెండియు. 182

చ. తనకుసుమంబులన్ ఫలవితానము మూర్కొన నాన ప్రాను నే
రనిక్రియఁ గాననేరదు పరంబగుత త్త్వము నైజభంగి వి
న్ననువున నంతరాత్మ గను నైష్టికతం గను మింతవట్టుఁ బా
మెనసినతోలు వాయుక్రియ నీవు దొఱంగుదు పాపపుంజమున్. 183

వ. ఇవ్విధంబున శాంతి నొంది యవ్యక్తసంభవయు సంకల్పకూలయుఁ గ్రోధ
పంకయు నింద్రియగ్రాహయుఁ గామభుజంగయు మోహత్యణచ్ఛన్నయు
సంసారసాగరగామినియు నై ఘోరప్రకార యగుచు నకృతాత్మలకుం
గడవరానియట్టి లోభవాహిని సత్యతీర్థంబున ను త్తరించి. 184

క. సుత! నీవు సుప్రసన్నా
త్మతఁ బొంది నగాగ్రగతుఁడు మహివారలఁ జూ
చుతెఱంగున నీభూత
ప్రతతిం గనుఁగొనుచు నుండు పరితృప్తుడవై. 185

క. శాంతము ధర్మప్రచయం
బంతటికి విశిష్ట, మిమ్మహావిద్య మదీ
యాంతఃకరణము సాక్షిగ
నెంతయు సంప్రీతి నీకు నిచ్చితిఁ బుత్రా! 186

వ. అని యి ట్లుపదేశించి పరమసంవిదేకాయనుం డగు కృష్ణద్వైపాయనుండు
గృతార్థీభూతచేతస్కుం డగు నంధనుప్రతిప త్తికి నభినంధనవిశేషంబుగా

నధ్యాత్మవిద్యావిలాసవిషయంబు లగు వాక్యంబులు మఱియు ననుగ్రహించె
వానిం జెప్పెద. 187

క. వేదములుఁ దదంగము లు స
మాదరమున జదివినను సుయజమానత్వా
పాదకుఁ డైనను బ్రాహ్మణ
తాదశ దక్కనె ప్రశాంతిఁ దక్కఁ గుమారా ! 188

క. ఒరులకుఁ జెఱుపక తన
కొరులు చెఱవకుండునట్టి యొప్పెడు సమతం
దిరమైన నడవడిం గల
పరిణతచిత్తుండు సూవె బ్రాహ్మణుఁ డనఘా ! 189

తే. బంధనంబులలోఁ నెల్లఁ బరమబంధ
నంబు గామంబు; దద్వర్జనమున నాత్మ
యభ్రపటలంబు వాసిన యమృతకిరణ
పూర్ణమండలమునుబోలెఁ బొలుచు ననఘ ! 190

క. పరతత్త్వోపాసనత
త్పరుఁడై సంక్షీణకామభావత నున్నం
బురుషు సుఖ మొందు వృద్ధిం
బొరయుచు వపు వమృతకిరణుఁ బొందినమాడ్కిన్. 191

క. పొరిఁబొరి భూతముల గుణో
త్కర మవిశేషాన్వితముగఁ గనుఁగొను సంవి
త్పరు ధుఃఖంబు సుఖముచే
విరియుఁ దరణిచేతఁ దమము విరిసినభంగిన్. 192

ఆ. తనది యనక యేమిధనమునఁ బ్రియమందు,
నెద్ది గుడువకుండ నెసఁగుఁ దృప్తి,
యిచ్చఁ బొందు లేక యెయ్యది బల మిచ్చు
దానిఁ గనుట శ్రుతులతలఁపు గనుట. 193

క. పరిపాటిఁ గర్మ మెడలఁగ
వరుస గుణము లడఁగ విషయవర్గము పొందుం
బొరయక యుండెడు బ్రాహ్మణు
జరయును మృత్యువును బొరయఁ జాలవు వత్సా! 194

తే. అనఘ! దేహంబుకంటె వేఱయిన దేహి
సూక్ష్మరూపము శాస్త్రోక్తసుకృతములఁ బ్ర
శాంతజనములు గాంతురు; సాధనముల
నాదరింపరు దర్శనానంతరమున. 195

క. ఇనురూపము జలములఁ దోఁ
చినక్రియ బుద్ధిఁ బ్రతిబింబసిద్ధత వెలుఁగొం
దిన యాత్మను బరమార్థతఁ
గను; సత్త్వస్థులకు నిజము గానంగ నగున్. 196

క. అనఘ! దివసంబు రాత్రియు
నను నివి భానునకు లేని యట్టులు సతతం
బును బరమయోగయుతుఁ డగు
మునికి వివేకావివేక'ములు లేకుండున్. 197

క. కరణంబులు దొడరిన ని
ష్కరణత నున్నను శమంబు గలయోగికి సు
స్థిర మగు సమాధి యని ముని
వర! శాండిల్యుండు శిష్యవరులకుఁ జెప్పెన్. 198

సీ. వికు; మోహబీజ సంజనితంబు గామ్రు
మంబు; ప్రమాదజలంబు దనకుఁ
బరిషేచనంబుగఁ బెరుఁగు నజ్ఞానస్థి
రాధారకలితమై; యం దసూయ
పత్రసంపద; యది చిత్రతరంబు, మా
సక్కంధదృఢత నున్నతి వహించు;

శోకశాఖంబు ననేకచింతోపశా
ఖంబు బురాకృతకర్మసార

తే. ఘనముఁ దృష్ణాలతాపరిగతము నగుచుఁ
బొలుచుఁ; దత్ఫలమునకు లుబ్ధులు గడంగి
ప్రాఁకి పడుదురు; విడువు శస్త్రముగ నది వి
ఖండితము సేసి బుధుఁడు దుఃఖములఁ దొఱఁగు. 199

సీ. పురము శరీరంబు, బుద్ధి తత్స్వామిని,
సర్వార్థచింతన సచివపదవి
నడుచుచునుండు, మనంబు శబ్దాద్యంబు
లై చెల్లువిషయంబు లైదుఁ దగు పు
రోహితవర్గంబు, శ్రోత్రాదులగు నింద్రి
యంబులు పౌరజనంబు; లిట్లు
పరఁగెడు రాజ్యంబు పరభోగమునకు దూ
షకులైన చొరలు రజస్తమములు

తే. వారికలపులఁ బడు బుద్ధి నేరకుండి
మనసు తోడ వేర్పడినఁ దానును మనంబు
నేకముఖతఁ గార్యము సూచునేని దుష్ట
లడఁగుదురు, భోగ మవ్యయ మగుఁ గుమార ! 200

వ. అని చెప్పె ననిన విని పాండవాగ్రజుండు భీష్మునితోఁ 'గార్యబలంబును వీర్య బలంబును మనోబలంబునుం గలుగు నుత్తమక్షితిపతు లనేకు లీకయ్యంబున మృతులైరి; నిజప్రాణంబునకు నొక్కరుండ నొడయుండు లేక తక్కఁ! మృత్యు వనునది, యెయ్యది? యేమిటం గలిగెఁ? నెట్లు ప్రజల సంహరించు? నెఱింగింపవే!' యనుటయు నతం డిట్లనియె: 201

-: భీష్ముఁడు ధర్మరాజునకు మృత్యుదేవత తెఱం గెఱిఁగించుట :-

సం. 12-248-7

సీ. వినుఁ, మకంపనుఁ డను మనుజేంద్రుఁ డాత్మజుఁ
డాహవంబున మృతుఁడైన వగపు

గదురంగ నుండి, నారదు నలవోక వ
చ్చినవానిఁ గని సవిశేషభక్తి
యుతముగా నాతిథ్య మొనరించి, తనవగ
పెఱిఁగించుటయు, నమ్మునీశ్వరుండు
గరుణ శోకనిరాసకారణం బైన యా
ఖ్యాన మొక్కటి సెప్పె; దానితెఱఁగు

తే. దేటపడునట్లుగాఁ బరిపాటితోడ
నఖిలమును నెఱిఁగించెద; నవహితుండ
వై వినంగ నీయడిగిన యర్థమునకు
బోధకం బగు నది కురుభూపవర్య ! 202

వ. అజుండు జగంబులు సృజియింప జంతుసంతానంబు వెరిఁగి సమ్మర్దం బధి
బంబై యూర్పువోవని యట్లయిన, నద్దేవుండు సంకటపడి సంహారప్రకా
రంబు విచారింపం దదీయచిత్తంబు కార్యదాహంబున మహోదహనుండు
జనియించి జగంబులు దహింపం జొచ్చిన. 203

తే. త్రినయనుఁడు వచ్చి యాతనిఁ దేర్చె; నాతఁ
డాతెఱం గెఱిఁగించి యయ్యగ్ని నుడిపె;
నపుడు పుట్టెఁ దదీయేంద్రియవ్రజమున
నొక్కయంగన రక్తాక్షి యుజ్జ్వలాంగి. 204

వ. పుట్టి దక్షిణాభిముఖియై పోవఁ గని, కమలసంభవుండు పిలిచి, 'మృత్యువ !
ప్రజలఁ బ్రబలదుర్బలభేదంబు లేక సంహరింపు' మనుటయు నవ్వనిత
వనటం గన్నీ రొలుక 'నీ కుడ్చవించి క్రూరకర్మంబు సేయుదునేఁ ధర్మకార్యం
నకుం బనుపు' మని పలికిన నయ్యగ్రభవుండు దోయిటంబట్టి యద్దేవుం
డమ్మృద్ధియయతో 'నిదియ పఁగా నుదయించినదానవు; నీవు ప్రజాసంహారంబు
సేయ వలయు' ననవుడు నాఖాల గాలిం దూలు తీవయుంబోలెఁ గంపంబు
నొందుచు. 205

క. 'మనుజుల హరించి బాంధవ
జనమున శోకంబుఁ జూడఁ జాలుదునె? తపం
బున కేఁగెద; సదయంబుగ
ననుజ్ఞ సేయంగ వలయు'నని ప్రణమిల్లెన్. 206

వ. దానికి నరవిందసంభవుండు మందస్మితంబుతో 'ని ట్లే లగు? జంతుసంహారంబు నీ కవశ్యకర్తవ్యంబు; దానిం జేయమి సువ్వే యధర్మం' బని నిర్బంధించిన నూరకుండి యన్నాతి పదంపడి యల్లన సురిగి ధేనుకాశ్రమంబున యత్యంతదీర్ఘకాలంబు ఘోరతపంబుసేసి, కౌశికి గంగ నంద యనునదులకుం బోయి వాయు వాహారంబుగా నతిదుష్కరవ్రతంబు లనేకవర్షంబు లాచరించి హిమశిఖరిశిఖరంబునకుం జని చతురాననప్రీతికరం బగు నిష్ఠాతిశయంబు సంయమంబున దాల్చియుండ నద్దేవుండు. 207

క. సన్నిధిసేసి 'తపమునెయి
నున్నఁ బ్రయోజనము గలదె? యుడుగుము పుత్రీ!'
యన్న 'శరణంబు వేఁడెద
నన్ను దయంగావు' మనియె నాతి యతనితోన్. 208

వ. అనిన విని యమ్మహాత్ముండు. 209

తే. ప్రజల హరియించు టిది నీకుఁ బరమధర్మ;
మేను బొంకెదనే? దీని నెల్లభంగి
నాచరింపన వలయు; మత్ప్రార్థనంబు
భగ్న మొనరించు టొప్పదు పద్మనయన! 210

వ. మఱియు నొక్క విశేషంబు సెప్పెద: నీయశ్రు జలంబు లే నంజలిపుటంబునం బట్టు టెఱుంగుదు గాదె; యవి నానావ్యాధిరూపంబుల మానవుల బాధించుఁ; గామక్రోధంబులు వానికిం దోడుపడు; వారు దానన తెగుదురు; నీవు నిమిత్తమాత్రం; బింతియ; నీకు వరం బిచ్చెద. 211

తే. పురుషుఁడును నంగనయును నపుంసకుండు
సగుము పుత్రిక ! పురుషుని నంగనను న
పుంసకునిఁ జంపువేళలఁ బొందకుండు
పాపమును; నిగి ధర్మమై పరఁగు నీకు. 212

వ. అని పలుకుటయ నప్పాలంతి శాపంబునకు వెఱచియు, నది యట్టిదికాక
యనుతలంపు దోఁచియుఁ, బ్రజాసంహారంబు సేయునధికారంబు పూనె.
మృత్యుదేవత ప్రాణాపహారిణి యగుఁ బ్రాణిజాలంబు దేహంబులం బాసి
దేవాదిభావంబులం బొందుచు మగుడ మనుష్యత్వంబు నొందుచుండు. 213

తే. భీమనాదుండు భీముఁ డుద్దాముఁ డప్ర
తర్క్యతేజోమయుఁడు జగత్రాణుఁ; డొడలు
మనుపఁ జెఱుపంగ నొడయుండు; ననుట మగుడ
నరుగుదెంచుట వింత గా దతని కెందు. 214

వ. అనినం 'దొల్లియు నిది వింటి; నాఁ డత్యంత శోకాక్రాంతుండ నగుట నవ్వి
నికి రిత్తవోయె; నేఁ డీయుపాఖ్యానంబున యర్థంబు పరిజ్ఞాతం బయ్యె. 215

క. అని పలికి యధిప! కుంతీ
తనయాగ్రజుఁ డిట్టు లనుఁ బితామహుతో 'స
జ్జనకోటి ధర్మమునకును
మనమున వెఱచునది యింత మాన్యం బగునే? 216

వ. ధర్మంబుతెఱం గిట్టి దని నిరూపించి యనుగ్రహింపుము.' 217

సి. అనుటయు నతఁ డిట్టులనియె: వేదంబుల
మీఁదిభక్తియు దృఢస్మృతియు సమ్య
గాచారమును రుచిరాకారములు ధర్మ
మునకుఁ గొందఱు బుధజనము లర్థ

మగుఁ జతుర్థాకారమం; ద్రయినను బాడి
దప్పియు బొంకియు ధనము గూర్చు
దెల్ల పాపములకు నెక్కుఁడు; బొంకమి
పరులసొమ్మల కాస పడమి సర్వ

ఆ. ధర్మములకు నధికతరములు; విధివిహి
తంబు గానియట్టి ధర్మ మనఘ !
చవుట నిడిన వి త్తుచాడ్పున రూపించి
చేయ నిహపరములఁ జెందు సుఖము. 218

వ. ధర్మంబు తెఱంగు సూక్ష్మంబు; ధర్మంబులు బహువిధంబు; లట్లుగావున ధర్మసర్వస్వ నై జస్వరూపనిరూపణంబు సేసి కరతలామలకంబుగాఁ బలికెద నాకర్ణింపుము. 219

క. ఒరు లేమేమి యొనర్చిన
నరవర ! యప్రియము దనమనంబున కగుఁ దా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమధర్మ పదముల కెల్లన్. 220

వ. అని చెప్పినం బ్రీతుండై తాతకుం బ్రణమిల్లి పాండవాగ్రజుండు 'ధర్మ స్వరూపనిరూపణం బింత యొప్పునే' యని యభివర్ణించి, 'యాగ్రహంబున నేమేనియు నడుగుచున్నవానింగా నన్నుం దలంపఁ దలదు; వలవనియట్టిది యడుగం దెఱిసికొనుటకై వలయునది యడుగుదు; నట్లుంగాక యడిగిన దానిని యడుగఁ బటయుం గలుగుఁ; గృప నాదరింపుము; సమ్యగాచారంబు ధర్మాకారం బని నిర్దేశించితి; వు త్తమాచారప్రకారం బెఱింగింపవే'! యనుటయు నమ్మనుజపతికి నమ్మహితాత్ముం డిట్లనియె: 221

తే. వేద మాచారములఁ జెప్పు వివిధగతుల
సకలహిత మగునట్టి యాచార మరయ

ననఘ ! వేఱొండు గలదె? మహాత్మ లెద్ది
యాచరించిరి దాని జేయంగవలయు. 222

వ. అని పలికి, 'తొల్లి జాజలి యను మునికి దులాధాకుండను వణిగ్వరునితో సంవాదంబు గలిగె; నది యితిహాసరూపంబున జెల్లు నేతద్విషయం బయి యుంతు; దాని జెప్పెద' నాకర్ణింపుము. 223

-: జాజలి తులాధారుల సంవాద ప్రకారము :-

సం. 12-252-1

సి. చలనంబు లేక జాజలి తపోనిష్ఠ నా
సిని డై యుండ బిచ్చికలు గూడు
గావించె దన్మ స్తకంబున; నమ్మిథు
నము గారణముగ నండములు గలిగి
పిల్లలై వ ర్తించి యెల్లెడ కెరగొన
నరుగుచు మరలుచు నవియు నవియు
నగ్గూట వసియింప నతడు దయాళుడై
వాని జోపక యుండి వత్స తనదు

తే. నియతి కెద మెచ్చి 'యీధర్మనిష్ఠ యెందు
గలదె' యనుటయు, ప్రమో సె నాకాశవాణి
'ధర్మపరుడైన య త్తులాధారు డింత
యాడ; డిట్లాడ నే' లని యద్భుతముగ. 224

వ. అట్లుప్రమోసిన విని వెఱగుపడి య త్తులాధారుం గానవలయు నని తలంచినం 'దులాధారుండు వారాణసీపురమున నున్నవాడను వాక్యంబును నంబరం బున వీతెంచె; నమ్మునియును మత్సరభరితుడగుచు నప్పురంబునకుంబోయి జనసంపూజ్యవాణిజ్యంబునం బ్రవ ర్తిల్లునతనిం గాంచిన, నతండు సముచిత సత్కారం బాచరించి యిట్లనియె: 225

తే. పిచ్చికలు గూఁడు శిరమునఁ బెట్టి తారుఁ
బిల్లలును సుఖలీల వర్తిల్లుచుండఁ
జిత్తవికృతి లే కెట్టులు సేయుదయ్య
తపముఁ సంభావనీయ వర్తనుఁడ వీవు. 226

వ. అనినఁ దదీయ బోధంబునకు విస్మయం బందుచు విప్రోత్తముండు 'నీవు
పణిగ్వర్తనంబున నుండ నెవ్విధం బగు ధర్మంబున నివ్విశేషంబు గలిగెఁ'
ననవుడు నతం డతని కిట్లనియెఁ: 227

సీ. విలుచుట నమ్ముట నొలయదు వంచన;
యర్థలాభంబున యనుభవింతు;
సరి సిద్ధ్యసిద్ధులు సమలోష్టకాంచన
మైయుండు మనసు; నిందాభినుతులు
హింసయు నాత్మప్రశంసయు లేవు; భూ
తంబులయం దెల్ల దయ ఘటిల్లు;
సభయదక్షిణ మగు సంచితసత్యయా
గము సెల్లుఁ; గోర భోగమును యశము;
తే. నెవ్వరికి మేలు సేసిన నింతసేసి
నాఁడ ననుబుద్ధి మమత యెన్నండు నాకుఁ
గలుగ; దేమిటి నేనియు వలపు నొల్ల
మియును బుట్టదు; నిక్క మింతయు మహాత్మ! 228

క. లోకం బెల్లను నేఁజి
త్రాకారము గాఁగఁ జూతు; నట్లగుడ మనం
బేకార్యకులం దగులదు
కోకనద దళాంబుబిందుగుణ మొనరంగన్. 229

వ. అనిన విని జాజలి తులాధారున కిట్లనియెఁ: 230

తే. తపములును యజ్ఞములు నీవు ధర్మములుగఁ
బలుకవై తివి; యార్యసంభావనీయ
పదములగు కర్మములలోనఁ బరిగణింపఁ
బడవొకో వేదశాస్త్రతత్పరులచేత. 231

చ. అనవుడు నాతఁ డిట్లను; 'నహంకృతియుక్తముఁ గామసంశ్రితం
బును నగునేని నట్టితపమున్, ఫలకాంక్ష యొనర్చు యజ్ఞమున్,
ఘనతరలోభవృత్తి యనుకాన్పున మెచ్చదు దేవకోటి; వా
న నగు గతాగతంపుభ్రమణంబులు గీళ్ళులు గాక మేలులే ? 232

ఆ. నిత్యతృప్తుఁ డైన సత్యయజ్ఞునియెడ
దేవతలును నధికతృప్తి లగుదు;
రమరతృప్తివలన నవ్యయానందంబు
సంఘటిల్లుఁ జూవె సంయమీంద్ర!' 233

తే. అనిన జాజలి 'యట్లేని ననఘ! నీవు
కర్మ ముడుగమి కెయ్యది కారణంబు ?
మాకు నెఱిఁగింపు' మనుటయు మహితబోధుఁ
డగు తులాధారుఁ డిట్లను నతనితోడ. 234

క. 'ధర్మారాముఁడు సంతత
ధర్మసఖుఁడునై యసంగతానిష్ఠమతిన్
నిర్మలుఁ డగువానికి ని
ష్కర్మత్వానందసిద్ధి గలుగు మునీంద్రా ! 235

ఆ. నగములెల్లఁ బుణ్యనగములు నదులెల్లఁ
బుణ్యనదులు వినుము భూసురాగ్ర
గణ్య! యకలుషఁ బకర్దమ మనఁ జాలు
నాత్మతీర్థ మెఱుఁగు నకలుషునకు. 236

క. కారణములవలనఁ గృత
ప్రారంభం బై నకర్మ మంచితగతికిం
గారణమే కర్తవ్య
త్వారబ్ధక్రియలయట్లు లనఘచరిత్రా!' 237

వ. అని చెప్పి యంత నిలువక 238

క. 'విను! మంచివారిచే నై
నను నితరులచేతనేని నాయెఱిఁగిన యీ
యను వొప్పదొ మేలో యను
ననుమానము వాపుదమె మహాధర్మనిధీ! 239

వ. అప్పని మనచేత నయ్యెడి; నీవు దండ్రివోలెం బెనిచిన మఱిగి నీతో నరుగు
దెంచి నీశిరంబు చక్కటిచదలం జేరువం బొలయు నిప్పులుఁగులం బిలిచి
కరంబుల ధరియించి యుపలాలింపుమా, యనుటయు జాజలి వానిం బిలిచిన
నవి దివిన నిలిచి యతనితో నిట్లనియె : 240

చ. మునివర ! ధర్మతేవత మముం బనుపన్ నిను నారయంగ వ
చ్చిన భటసంఘ మేము; విను చెప్పెద; మీసు గలంక పోరితం
బను నివి మత్సరంబు గలయట్టిమనంబునఁ బుట్టు; హింస వీ
నన జనియించు; సంయమిజనంబు విమత్సరమైన మేలగున్. 241

తే. స్పర్ధ సద్ధర్మమునకు నాశని; సుధర్మ
నాశనమునఁ జేసి నరుఁడు వినష్టభావ
మొందుఁ; గావున సంస్పర్ధ యుడుగవలయు
నిర్మలశ్రద్ధ గైకొని నిపుణుఁ డనఘ! 242

క. శ్రద్ధ రవితనయ సాత్త్వికి
బోద్ధవ్యావాప్తి శుభముఁ బొనరించు మన
శ్శుద్ధి స్వరూపఁ వానిఁ బ్రబు
ద్ధుఁడు వాటించుఁ జూవె పురుషాత్మికఁగన్. 243

క. అమరులు విమల శ్రద్ధా
సమేతములు గాని తాపసత్వము, గ్రతు మ
త్త్వము గై కొన రా సువిశే
షము గలిగిన మెత్తు రది ప్రశస్తం బనఘా! 244

క. విను మునివర! వాగ్వ్యత్తియు
మనఃప్రవర్తనము, గాచు మహితశ్రద్ధా
ధనసంపద; శ్రద్ధ యనం
జనునది జీవాత్మ సుప్రసన్నత సుమ్మీ! 245

-: తులాధారుఁడు జాజలికిం జెప్పిన బ్రహ్మగీతలు :-
సం. 12-56-7

వ. అని మఱియు నిట్లను; బ్రహ్మగీత లను వాక్యంబు లాకర్ణింపుము. 246

క. యాగంబునందు శ్రద్ధా
యోగము గల యశుచి శ్రద్ధ యొనరనిశుచి పు
ణ్యాగమసంపదఁ దుల్యులు
గా గణుతించిరి నిరూపకత నమరపతుల్. 247

క. విను, మజుడు-'శ్రద్ధ యతిపా
వని, యది గలవాఁడు గౌరవశ్రేష్ఠుం, డా
తనియన్నము భోజ్యోత్తరం'
బని నిర్దేశించె నెల్లయమరులు వినఁగన్. 248

ఉ. వారక వడ్డి కిచ్చి కుడువన్ వెరవారినదానశీలు నె
వ్వారికిఁ జేయుఁ జూపక ధ్రువంబుగ లోభగుణంబ పట్టి ని
స్సారత నుండువేదవిదు సామ్యముఁ జేర్చి రమర్త్యులందు న
వ్వారిజసూతి దాని యగువాఁ డధికుం డనియెన్ హవిర్విధిన్. 249

అ. దానగుణము శ్రద్ధలేనివానికి లేదు
గాన యివ్విధమునఁ గమలభవుఁడు
నిశ్చయించె నీవు నిర్మలశ్రద్ధాభి
పూతమతివి గమ్ము పుణ్యచరిత! 250

ఆ. వినుము; శ్రద్ధ గలుగు మనుజుండు పాపంబుఁ
దొలగఁ ద్రోవనేర్చుఁ దోలు డిగ్గ
నూడ్చి వెరవు గలుగు సురగంబు చాడ్పునఁ
గానమేలు శ్రద్ధదానుఁ డగుట. 251

వ. అని వెండియు 252

ఆ. మత్సరాది చిత్తమాలిన్యములు శ్రద్ధ
గలమనంబునందు నిలువనేర'
వనిసఁ దేజి యిట్టులనియె జాజలి తులా
ధారుతోడ నిభృతిఁ గౌరవేంద్ర! 253

క. 'మునులవలనఁ దత్త్వం బే
వినకుండుటఁజేసి యిట్టివిధము గలిగె నా
కనఘా! నీవాక్యంబుల
మనంబు దెలివొందె శాంతి మరగెద నింకన్.' 254

వ. అనిన నభినందించి తులాధారుండు. 255

క. తనతన తెరువునఁ గర్మం
బనుష్ఠితంబైన మేల యనఘ! నివృత్తిం
గని శ్రద్ధఁ గూర్పగా నే
ర్పెనయంగా వలయు దానియెడ యం దతఁడున్. 256

ఆ. అట్లుకాక యని ప్రియంబుమై వీడొక్కొ-ని
జాజలియును జనియె రాజవర్య!

యిహపరముల నెసకమెసఁగ సౌఖ్యము తులా
ధారుఁడును సమున్నతత్వ మొందె. 257

క. ఆవణిజుఁడు ధర్మస్థితి
దేవతలును మెచ్చునట్లు దెలియఁగ బలికెన్;
నీ వీవాక్యము లన్నిట
భావం బలవఱిచి కసటు వాపుము వత్సా! 258

వ. అని చెప్పినం బ్రమదంబు నొంది. 259

క. సురసరిదాత్మజుతోఁగురు
నరపాలో త్తముఁడు వినయనమ్రుం డగుచుం
జిరమో కార్యసమీక్ష య
చిరమో వలయునది కరుణఁ జెప్పు మనవుడున్. 260

వ. అతం డతని కిట్లనియె. 261

క. త్వరితము సేయక కార్యము
చిరంతన విమర్శనముగ జేసి యొనర్పన్
ధరణీశ్వర యోటువడఁడు
పురుషుఁడు సిద్ధియును వానిఁ బొందు ధృఢముగన్. 262

క. తాలిమి లేనిజనంబులు
మే లెఱుఁగక యట్టివాని మీఁదను జాడ్యం
బాలస్యం బిది యని దో
షాలోచన మాచరింతు రది మతి యగునే? 263

వ. ఆని చెప్పి వెండియు నిట్లను: నీయడిగినయర్థంబు మేధాతిథి యను ముని సుతుండు చిరకారి యనువాని వృత్తాంబు వినినం దెలియు ధానిం జెప్పెద.

-: చిరకారియను మునికుమారుని చరిత్ర :-

సం. 12-258-8

క. అతఁడు చిరకాల సువిచా
రితంబుగాఁ జేసి యాచరించుం గురుభూ
పతివర్య! యెద్దియును నది
గతముగఁ జిరకారినామకంబునఁ బరఁగున్. 265

సీ. విను మొక్కకారణంబున ముని పత్నిపైఁ
గోపించి చంప నక్కొడుకుఁ బనిచి
యెటయేని వెడలిపోవుటయును; బనులెల్లఁ
జిరవిచారముతోడఁ జేయుఁగాన
యచ్చిరకారి యిట్లని విచారించె- 'జ
నకుపంపు సేఁత మానంగ రాదు;
తల్లిఁ జంపుటయును దగదు: తండ్రి తలంపు
దప్పింతుఁ గా కని తలఁతునేని
తే. గల్మషం బంద్రు దాని సత్కర్మవిదులు;
మాతృరక్ష గర్తవ్య మెమ్మాడ్కినైనఁ;
బుత్రభావ మస్వాతంత్ర్యమునకు నెలవు;
పాప మడగింప నెవ్వల నోపు నొక్కొ! 266

క. జననీవధంబు సేసిన
ననుమానమె నరక మగుట యని యుడిగితిఁ బో
జనకావమాన మొనరిం
చిన వానికి నరకమున వసింపఁగ వలదే. 267

తే. తల్లి భస్త్రిక బీజంబు తండ్రి వెట్టు
వంశధరణార్థముగ నిది వారిభంగి;
యేను బొత్తులవాఁడ నయ్యిరువురకును;
వీరలం దిప్పు డెవ్వరి విడుచువాఁడ? 268

వ. అని విచారించి తలంచుకొని. 269

క. జనకుఁడు యే నై జన్మిం
చినఁవాడను; జనకుపంపు సేసినఁ బాయుం
దనయుని పాపము లనియును
వినియుండుదుఁ; దలఁపు లింక వేయును నేలా? 270

క. జనకుఁడు దపమును ధర్మం
బును విద్యయుఁ బరమదై వనును గావున, నా
తనికిఁ బ్రియంబగుపని సే
సిన దేవతలెల్లఁ బ్రీతిఁజెందుట గల్గున్. 271

వ. అని వితర్కించియుఁ దల్లి తెఱంగుఁ దలంచి. 272

చ. కరచరణాది సంఘటిత కాయము సంజననంబు వహ్ని పు
ట్టరణికిఁబోలెఁ దల్లిదెస నైనది గాదొకొ! యట్లుఁగాక దు
ర్భర మగు గర్భభేదమును బట్టికినై నిజదేహచింతపై
భర మొకయింత లేక పడు పాటులు నక్కట! యెక్కఁ డింతకున్. 273

ఆ. వచ్చిపోయి చూచువాఁడు గా కిడుమలఁ
బడునె తల్లివోలెఁ బట్టితోడఁ
దండ్రి! చెప్పు నిట్లు ధర్మశాస్త్రంబులు
నంబ గౌరవమున నధిక యగుట. 274

ఆ. బాలఁడై న గొడుకు ప్రౌఢుఁడై నను వృద్ధుఁ
డై న నొక్క విధమ యర్మిలియును
నరయు భరముఁ దల్లి కాపదార్థంబు జ
గంబు కలిమికెల్లఁ గారణంబు. 275

ఆ. క్షుద్రజంతువులకు గురులకు నెమ్మొ యిఁ
దలప నొక్కరూప తల్లివలయు

నూఱడిల్లఁ గలదె యొండు సోటుల సువ
స్తువు నివాసమైన చోటఁగాక. 276

క. అప్పుడ యసమర్థుఁ డగు
నప్పుడ దుఃఖి యగు శూన్యమై తోచు జగం
బప్పుడ మాతృవియోగం
బెప్పుడు వాటిల్లె నపుడ యెంతయుఁ దూలున్. 277

క. కలవాఁడు లేనివాఁడు స
బలుఁ డబలుఁడు మూఢబుద్ధి ప్రౌఢుఁ డనంగా
వల దెవ్వరికైన జనని
కలిమియు యత్యంతసౌఖ్యకరమై యుండున్. 278

తే. ఇట్టి జనని వధించుట యెల్లభంగి
నధికపాపపయోరాశియందు ముంచు;
దీని నెఱుఁగండె పసులవాడైనఁ వధకు
నేల తెంపువాటిలుఁ? జేతు లెట్టులాడు? 279

వ. అని యిట్లు పెక్కుభంగుల నూహించుచుఁ జిరకారి యగుట నతండు శీఘ్ర
కారిగాక యుండం దడవెంతయేనియుం గలిగె నంతకుం దదీయజనకుండు.

క. వెడపనికి నాలిఁ జంపం
గొడుకుఁ బనిచి వచ్చినాఁడఁ గ్రూరత్వమునం
గడవంబడు నొకొ పని యని
కడువెసఁ జనుదెంచె నశ్రుకణములు దొరఁగన్. 281

వ. అట్లు సనుదెంచు నప్పుడు. 282

క. చిరకారి యెట్టునుం దన
చిరకారితఁ జూపుఁకాక శీఘ్రపుఁజేతన్

దురటిల్ల జేయునే నను
వెరవరి వాఁ డిట్టిపనికి వేగిరపడునే. 283

వ. అని పుత్రు నుద్దేశించి. 284

చ. చిరముగ గర్భవాసమున జెందితి పుత్రఁ చిరంబుగాఁగ ని
న్నరసెఁ గదయ్య తల్లి యనయంబును నేఁ బనుపంగఁ బూనియుం
జిరమగు నట్టి యిత్తెఱగు సేఁత దలంచితయేని సత్కృపా
పర చిరకారి నాఁబరగు భాసితనామము సార్థకంబగున్. 285

ఆ. నాకు నా తపంబునకు నింద రాకుండ
దురితభయము నిన్నుఁ బొరయకుండ
నెమ్మిఁజేసి తన్న! నీచిరకారిత
సకలభూతములును సంస్తుతింప. 286

వ. అనుచుం జనుదెంచి నివాసంబు ప్రవేశించినం గని చిరకారి నిజకరంబున
నున్న వధసాధనంబు డిగ్గవిడిచి యగ్గౌతమవంశవర్య చరణంబులు శిరంబు
సోఁక ప్రణామంబు సేసెం; బత్నియుం జాఁగిమ్రొక్కెఁ; నయ్యిరువుర నెత్తి
శోకబాష్పంబు లానందాశ్రువులుగా నమ్మునివరుండు దనయుని గాఢాలింగ
నంబును మూర్ధఘ్రాణంబునుం జేసి దీవనలం బొగడ్తల నభినందించి
దానును వారును సుఖాసీనులై యుండి యిట్లనియెఁ: 287

క. కార్యవిచారము చిరముగ
ధైర్యముతో నడపవలయుఁ; దత్క్రియలం
దార్యుఁ డనార్యుఁడు వీఁడని
యార్యులు సేయుదురు నిశ్చయము జిరముగన్. 288

క. మిత్రత్వము శత్రుత్వముఁ
బాత్రతయు నపాత్రతయును బరికించు సుచా
రిత్రుఁడు చిరతరగణనా
సూత్రితముగ; దాన నెల్ల శుభములు నొందున్. 289

వ. అని నిర్దేశించె; న ట్లాచిరకారి చిరకారిత్వంబు సఫలత్వంబు నొంది వినుతిం
బొందె. 290

క. కావునఁ గురువంశో త్తమ!
నీవును సదసత్ప్రకార నిశ్చయము చిరం
బై వఱలఁజేయుమీ; యది
గావించుం జిరములై న కార్యఫలములన్. 291

క. విను: మచిరవృ త్తిఁ జేసిన
పని కర్తకు నావహించుఁ బశ్చాత్తాపం;
బనఘా! చిరభావితశు
ద్ధినిరూపణకృతము శుభము దేజముఁ దెచ్చున్. 292

వ. అనిన విని ధర్మపుత్రుండు 'ప్రజల శిక్షించువెర వెట్టి' దని యడిగిన నాప
గానందనుండు 'దొల్లి ద్యుమత్సేనుం డను రాజునకు నిజతనూజుం డగుసత్య
వంతునితోడ సంవాదంబు గలిగె; నది నీయడిగిన యర్థంబునకుం బ్రకాశం
బగుఁ; జెప్పెద నాకర్ణింపుము; వారిద్దఱుం బ్రజాశిక్షణెఱింగు మాటలాడు
సమయంబున- 293

సీ. 'వధము ధర్మంబుగా బుధులు సెప్పుదు' రని
యనుశాసనము సేయుజనకుతోడ
సత్యవంతుఁడు 'హింస కృత్యకర్మం బగు
నేని నకృత్య మిం కేది?' యనుడు
'ముచ్చులు ప్రల్లదుల్ సచ్చువారలయట్లు
గాకున్న బాధలు లోకమునకుఁ
బుట్టవె యనిన నబ్భూపతి యమ్మాట
కతఁడు 'సంపుటదక్క నన్యదండ
తే. విధిన శిక్షసెల్లించుట వెఱవుగాదె'
నావుడును బతి యట్లేల నడచు దృష్టి
దండవాగ్దండ ధనదండ తనువికార
దండములు సేయునది తప్పుదర మెఱింగి. 294

క. వినుఁ: చంపఁదగిన తప్పున
కనఘా! చంపుటయు వలయు; నా పుఁడు బంధుం
డనుఁజుడు దనుజుఁడు ననుఁమ
న్ననయును దుష్టునెడ రాజునకుఁ బాప మగున్. 295

తే. తాను మున్ను వినీతుఁడై తనదుమంత్రి
వరులఁ బుత్రుల భృత్యుల వరుసతోడ
వినయవంతులఁజేసి భూవిభుఁడు ప్రజకు
రక్షణముసేయ నిహముఁ బరంబుఁ గల్గు. 296

క. దోష మరసి కామంబును
రోషంబును లేక తగిసరూపునఁ జేయం
బోషక మగు ధర్మమునకు
వైషమ్యవిహీనమైన వధము గుమా! 297

క. చంపఁగఁ జూచియు లోభము
పెంపునఁ గ్రోధమునఁ గామపీడను మది శం
కింపక దుష్టులు గీ డొన
రింపఁగఁ జూడమె కలంకరేఁగు నహింసన్. 298

ఆ. వినుఁ: మహింస విప్రజనులను నెల్లభం
గులను వలయుఁ; బ్రజలవలనఁ గరుణ
గలిగి వారిఁ గీడు గదురక యుండంగఁ
గాపు పతి కహింసకత్వ మనఘ! 299

-: కపిల గో సంవాద ప్రకారము:-

సం. 12-260-5

ప. అనియె నని చెప్పిన విని యజాతశత్రుండు తాతతో 'నవశ్యక ర్తవ్యంబు
గృహస్థధర్మంబో? పరిత్యాగంబో? నిరూపించి చెప్పవే!' యనిన నతండు

'రెండును మాననీయధర్మంబుల; కపిలగోసంవాదం బనునితిహాసంబు వినుము; దాన నీవితర్కంబు వినిశ్చయదశం బొందు'నని పలికి యిట్లనుఁ; గపిలుండును సంయమిసత్తముండు దుత్తమాకృతియు భీతిరహితము నహుషసంభావితము నగునొకగోవుం గాంచి, నీవు వేదస్వరూపవు గావే యని పలికె; నమ్మాట వేదంబులవలనియాదరంబు లేమింజేసి వెడలిసదిగా నూహించి యప్పుడు గెలన నున్న సూర్యమరశ్మి యనుముని సూక్ష్మరూపంబున నగ్గోవు నందుఁ బ్రవేశించి. 300

క. 'వేదములు డాంబికత్వా
పాదనములు గాఁగ యతులు వలుకుదు: రవి స
ర్వాదరణీయంబులు: నీ
కాదరపాత్రములు గావొ!' యని పలుకుటయున్. 301

వ. అగ్గోవున కతం డిట్లనియె: 302

క. వేదములవలన నాకు న
నాదరమును నాదరమ్ము నను రెండును లే;
వేది గతంబుగ నడిగితో
నీదుతలం పెఱుఁగునట్టినేరిమి గలదే? 303

వ. అయినను నాయెఱింగినంత సెప్పెద; నాకర్ణింపుము; బ్రహ్మచర్య గృహస్థధర్మ వానప్రస్థవృత్తి పరివ్రజనంబు లనునాలుగాశ్రమంబులు; దేవయానంబుల యత్తెరపుల నడచుట సంసారులకు గర్తవ్యంబు; గావున. 304

క. వారలకు వేదవిహితా
చారంబులు వలయునది ప్రశస్తము హింసా
ప్రారంభ మాచరించుట
యారయఁగా మేలొ కీడొ యంచితమూర్తీ! 305

వ. అనుటయు సూర్యమరశ్మి యతని కిట్లనియె: 306

క. అలఘుమతిని యజ్ఞార్థం
బులుగాఁ బశువులను ధాన్యములఁ గల్పించెన్
జలజభవుం; డదిగాకయుఁ
దలకొని యజ్ఞంబు లతఁడు చాఁ జేయఁ డొకో ! 307

క. వినుఁ: మజ్ఞునకు బ్రాజ్ఞున
కును గలయది దివ్యసుఖము గోరుట; దీవ్య
త్వనిరూఢి యాగకరణం
బునఁ దక్కఁగ నొంటఁ గలుగఁ బోలునె చెపుమా ! 308

క. అమలిన గృహస్థ ధర్మో
త్తమముం గల్మషహరంబు దైవతసంభా
వ్యము నైన యజ్ఞకర్తృ
త్వము మునివర ! హింస గాఁగ దలఁపం దగునేఁ 309

చ. అనుటయు నిట్లనుం గపిలుఁ డాత్మసుఖైకపరాయణుండు మె
చ్చునె పెఱసౌఖ్యకోటి ? గతశోకుఁ డకాముఁ డనంగశీలుఁ డా
తని కవి యెల్ల నేటికి మదప్రదలోకము లొల్లమిన్ సనా
తన మగుమోక్షముం గొఱలి తా విడుచున్ గృహధర్మవర్గమున్. 310

వ. అనిన విని శ్యామరశ్మి యా సిద్ధప్రవరున కిట్లనియెఁ. 311

ఆ. ప్రజలు దల్లిఁ జెందు పగిది గృహస్థధ
ర్మంబు నెల్లయాశ్రమములుఁ జేరి
కాదె జీవనంబు గావించుకొను గృహ
యుక్తుఁ డోషధులకు నొడయుఁ డగుట. 312

క. వినుఁ మోక్షము గార్హస్థ్యం
బునఁ గా దని యెన్నఁ డెచటఁ బురుషుఁ డెవ్వం
డు నిరూపించి పలికెఁ; స
ర్వనిధానము గృహము వేదవాక్యఫలజ్ఞా ! 313

క. అలసులు ధనహీనులు నై
సొలసి క్రియలు విడుతు; రది విస్రూతత; దానం
గలదే సద్గతిఁ వేదం
బులు విడిచి యఘంబుపరతఁ బోవరె తండ్రీ ! 314

క. విదితము గర్భాదానము
మొదలుగ శ్రుతికలితమంత్రములు నిర్మలసం
పదలెల్లను బ్రాహ్మణునకు
నొదవించుట దగునె శ్రుతుల నొల్లకయుండన్. 315

ఆ. అనినఁ గపిలుఁ డిట్టు లని వివరించు నా
చారములను దేవసమితి నెల్ల
భూమిసురుల దృష్టిఁ బొందింతు రమ్యత మా
నంగఁ బ్రీతి నిచ్ఛభంగి యొలయ. 316

వ. అది యట్లుండె; వినుము చెప్పెద. 317

క. పాణి యుపస్థం బుదరము
వాణి యనఁగ మూయరాని వాకి ళ్ళివి గీ
ర్వాణులకు; వీని బుధుడు పు
రాణపురుషరక్షకై తిరంబుగ మూయున్. 318

తే. పుచ్చికొనఁడు ముందటఁ బైఁడిప్రోక యున్న
నలుకవొడమియుఁ బొడువను నడువఁ దొడఁగఁ
డట్టి యానైష్ఠికునిచేత నడఁగకున్నె
పాణి యనియెడువాకిలి బంధురముగ. 319

క. ఏవిధముగ కాంతనై నం
దా విహరణమునకు నెపుడుఁ దార్పఁడు; తనయం

దావిష్టము భార్యావ్రత;
మావెర వడ్డం బుపస్థ మనువాకిటికిన్. 320

క. తనుయాత్రకఁగా నశనము
గొనుఁ; బూర్ణముగాఁ గొనండు; గోరఁడు లౌల్యం
బున రానిదాని; నమ్మెఁ
మని యుదరద్వార మోపి మూసెన కాదే. 321

క. పలుకఁ డసత్యము, దూఱం
బలకఁడు, బెట్టిదము గాఁగఁ బలుకఁడు, వాదం
బులకుఁ జొరఁడు, వాణియనం
గలవాకిలి యట్టిబుధుఁడు గప్పంజాలున్. 322

తే. ద్వారములు నాల్గు మూయంగ దక్షుఁ డైన
వాఁడచూవె బ్రాహ్మణుఁ; డట్టివాని కేల
తపములును యజనంబులు దాననులును
వ్రతములును వేదకింకరత్వంబు దొడఁకు. 323

తే. ద్వంద్వములు లేక పేర్మికి వ్రస్సిపడక
ప్రకృతి వికృతులఁ గనుచుండు బ్రాహ్మణత్వ
శాలి; యాసదాచారంబు సలుపలేని
వాఁడు ఫలకాంక్షియై కర్మవశతఁ బొందు. 324

వ. అని నిర్దేశించిన గోవునం దడంగి యునికిదక్కఁ సన్నిహితుండై స్యూమరశ్మి తన పేరు సెప్పి, 'యేను ధర్మనిర్ణయం బెఱింగికొనవలసి గోవిలీనుండనై పలుకుచుండితిఁ గాని యొండుగాదు; మహాత్మా! ని న్నాశ్రయించితి; వేదంబులు ప్రమాణంబు లగుట యూఁది వర్ణాశ్రమవిహితాచారంబులు నడవుటయుం బరిత్యాగంబునుం గల; దెయ్యది యత్యంత విధేయంబు? సువ్యక్తంబుగా నెఱింగింపవే; నీవు ధర్మసూక్ష్మత్వదర్శి; వేను శుశ్రూషకుండ; నన్ననుశాసింపు' మనవుడుఁ గపిలుండు ప్రీతుండై యతనికిట్లనియె. 325

క. జ్ఞానంబు నాశ్రయించిన
వానికి నేపనులఁ గీడు వాటిల్లదు; ప్ర
జ్ఞానరహితుండు గామా
ధీనతమెయిఁ గర్మసమితి త్రిప్పున జిక్కున్. 326

క. అనహంకారుఁడు సక్రో
ధనుఁడు నతృష్ణుండునై నతఁడు శుభ మశుభం
బను భేదముఁ బొరయఁడు; విడు
పున సమతాసుఖమయత్వముం గనుచుండున్. 327

క. విను; మెఱుక గలర మీ రె
ల్లను నేకాత్మత్వసిద్ధిలాభం బెందే
ని నొకని కలవడు; నాతం
డనుమానింపఁ; డఖిలక్రియలుఁ బోఁద్రోచున్. 328

వ. అనిన విని స్యూమరశ్మి యమ్మునివరున కిట్లనియె: 329

ఆ. వేదశాస్త్రసరణి విడుచు టున్మార్గవ
ర్తనము మోక్షపదము రాదు దాన
ననఁగ విందు నంచితాత్మ ! వేదంబులఁ
గైకొనమియ కీడు నాకుఁ జూడ. 330

వ. 'నామనంబు సందియంబుఁ బాపవే' యనినం గపిలుం డమ్మహాద్విజునితో 'వేదంబుల నేల కైకొనకుండ వచ్చు? నవియ చూవె లోకంబులకుం బ్రమాణం బు'లని పలికి యిట్లనియె: 331

-: కపిలుఁడు స్యూమరశ్మికి వేదంబులు ముఖ్య ప్రమాణంబులుగాఁ జెప్పుట :-

సం. 12-262-14,1

క. ఆరయంగా శబ్దంబును
బరంబు నన రెండుసూవె బ్రహ్మములు; గుణో

త్తర శబ్దబ్రహ్మభజన
పరుఁడు పరబ్రహ్మ మహితపదముం బొందున్. 332

క. మనమున నెద్దియుఁ గోరం
డనసూయయు శమము దమము నతులజ్ఞానం
బును గల గృహపతి ధర్మం
బని నడపును వేదచోదితాచారములన్. 333

క. భూతదయయు ననహంకా
రాతిశయముఁ గలుగు విమలుఁ డప్రాయశ్చి
త్తాతురుఁడు సూవె విధులు సు
నీతములై నను దృఢాత్మనిష్ఠకతమునన్. 334

క. విను, శాంతులైన విప్రులు
మనుజేంద్రులు గృహమునంద మహితవ్రతసం
జనిత పరిజ్ఞాననిరం
జనులై పడయుదురు సూవె శాశ్వతపదమున్. 335

తే. బ్రహ్మచర్యాదులగు నాల్గుఁ బాదమహిమ
గాఁగఁ బరఁగెడు ధర్మమొక్కటియ చూవె:
యెవ్వఁ డెందు వర్తించిన నేమి; సకల
కర్మఫల రూపకత్వ మొక్కటియ కాదె? 336

క. సంతోషామృత సుఖిత
స్వాంతుం డగునేని యట్టివాఁడు గృహంబుం
గాంతారదేశమును నొ
క్కంతగ నిశ్చింతవృత్తి నక్షోభ్యుఁ డగున్. 337

క. విను, తృష్ణారాహిత్యం
బున నాలవునాశ్రమంబుఁ బొందుదురు మహా

జను ; లది యుపనిషదు క్తం
బనక యవైదిక మనంగ నగునే నీకున్ ? 338

క. జ్ఞానము ధర్మమున కధి
ష్ఠానము, మూలంబు పరమసంతోషము భ
వ్యానూనత్యాగము రూ
పానందము ప్రాఁకు దాని కను వేదంబుల్. 339

క. ఏదియుఁ దలఁప నసేవ్యము
గా దాశ్రమసమితిలోనఁ ; గావున శుచులై
యేదాన నున్న సంసా
రోదధి యాదరికిఁ బోవ నోపుదురు బుధుల్. 340

క. సంతోషంబున నేగతి
శాంతాత్మున కొదవు దాని సద్గతిగా వే
దాంతవిదులు గొనియాడుదు ;
రింత నిజము ; దీని నీవు నెఱుఁగు మనింద్యా ! 341

తే. వేదతాత్పర్య మారసి వేదితవ్య
మెఱుఁగువారలు వేదజ్ఞు ; లట్లుగాని
వారు వేదపాఠకులు ; సర్వంబు నరయ
వేదపరినిష్ఠితము సూవె విప్రవర్య ! 342

క. త్యాగ మొక నెలవు శమసం
యోగం బుత్తరము దాని కూర్ధ్వము సంతో
షాగమము మోక్షలాభో
ద్యోగికి నివి గమ్యభూము లుత్తమధిషణా ! 343

వ. అని యిట్లుపదేశించి. 344

సి. వేదితవ్యం బన విదితంబు నా ఋతం
బనఁగ సత్యం బన నతిశయిల్లి,
సంభృతస్థావర జంగమం బనఁగ స
ర్వాత్మకం బన శుభం బనఁగ వెలసి,
యవ్యక్త మనఁగ బ్రహ్మంబు నా నుత్తర
మనఁగ శివం బన వినుతికెక్కి,
ప్రభవం బనఁగ నవ్యయ మన శాంతి నాఁ
దేజంబు నా నెందుఁ దేజరిల్లి,

తే. క్షమ యనఁగ నంబరం బనఁగా ధ్రువంబు
నా ననామయ మన నొప్పి, లీనరూప
బుద్ధి సంప్రాప్య మగు తత్త్వమునకు వేద
మానిత బ్రాహ్మణులకు నమస్కరింతు. 345

వ. అని పలుకుటయు సూర్యమరశ్మి ప్రీతుం డగుచుఁ గపిలునిం బ్రశంసించె; నియ్యితిహాసంబు తాత్పర్యంబు నీవుం గనికొను మని చెప్పినం దద్దయుఁ బ్రియంబంది ధర్మనందనుండు 'ధర్మార్థకామంబులు మూఁడును వేదశంసితంబులు; వీనిలో నెద్దానిలాభంబున విశేషంబు గలిగియుండు నెఱింగింపవే!' యనిన గాంగేయుండు 'గుండధారుండనువాఁడు నిజభక్తున కుపకారంబు సేసిన ప్రకారం బితిహాసరూపంబునం బ్రవర్తిల్లు; నది భవత్ప్రశ్నంబునకు నుత్తరంబై యుండు వినుము చెప్పెద'నని యప్పుడమిఱేఁ కిట్లనియె: 346

-: కుండధారుం డను దేవానుచరుని వృత్తాంతము :-

సం. 12-263-2.

సి. యజ్ఞార్థ మొక్కఁ బాహ్మణుఁడు ధనార్థియై
తపము సేయఁగఁ గుండధారుఁ డనఁగఁ
బరగెడు దేవానుచరుఁ డచ్చటికి వచ్చి
యభిలాష మే రూపఁ మనుఁడు 'నర్థ

సిద్ధిఁ గోరెద'నని చెప్పినఁ బ్రీతి నా
తఁడు మాణిభద్రుని ధనదభృత్య
నియతిఁ దలంప సన్నిధిసేసె నయ్యక్షుఁ
'డతఁడు మదాశ్రితుండైన యితని

తే. ధనసమగ్రునిఁ జేయవే' యనిన 'నెంత
ధనము వలసిన నిచ్చెద' ననియె మాణి
భద్రుఁ; డమ్మహాత్ముఁడు మర్త్యభావ మస్థి
రత్వదూషిత మను విచారంబు పుట్టి. 347

క. ధన మేటికిఁ నీవిప్రుని
మన మొలయఁగ వలయు ధర్మమార్గంబున; దా
నన సర్వసంపదలు నగు
నని నిశ్చయమొంది వినయ మతిశయ మందన్. 348

ఆ. యక్షవరునితోడ నవ్విచారము మృదు
వచనరచనఁ జెప్ప వాఁడు వాని
కాత్మఁబ్రీతిఁ బొంది యనుమతి సేయంగ
నధికభక్తినిరతుఁడై యతండు. 349

క. దేవతలను బ్రార్థించిన
నా సుధాశనుని చిత్త మాప్రొద్ద తప
స్సేవనతత్పర మగుఁడు
న్దేవానుచరునకు నిట్లనియె నతఁ డధిపా! 350

క. అనఘా: భవదీయ దయ
న్మనంబు దెలివొందె నిపుడు నా; కే నొల్లన్
ధనము; తపంబ యొనర్పఁగ
ననుజ్ఞ సేయంగవలయు నాదరణమునన్. 351

ఆ. అనిన 'నట్లకాక యాచరింపుము ధర్మ'
మనుచు నరిగె నిర్జరానుచరుఁడు;

భూసురుండు మూలములును బ త్త్రిములు నా
హారములుగఁ జేసె నధికతపము. 352

క. క్రమమున జలపవనము లశ
నములుగఁ గొని తపముసేసినం గాయముఁ జి
త్తము మానుషంబు లగుచం
దములు విడిచి దివ్యమహిమధామము లయ్యెన్. 353

వ. అట్లు సిద్ధుం డగుటయు. 354

క. నను నెవ్వ రాశ్రయించిన
ధన మొసఁగుదు రాజ్య మిత్తుఁ దద్దుర్లితములం
దునుముదు నను నగ్గలికలు
మనమున జనియింపఁ జొచ్చె మనుజాధీశా! 355

వ. అవ్విధంబున మహానుభావుండై. 356

తే. ఆతఁ డతిభ క్తిఁ దలఁచె దేవానుచరుని
నపుడ యక్కుఁండధారుఁడు నరుగుదెంచె
నరుగుదెంచిన నతఁడు నిజానుభావ
జనితగంధపుష్పములఁ బూజన మొనర్చి. 357

ఉ. చక్కఁగఁ జాఁగిమెక్కుటయుఁ జయ్యన నెత్తి మనం బెలర్పఁగా
నక్కునఁజేర్చి యిట్లనియె నద్దివిజానుచరుండు 'శంకఁ దా
దక్కి ధనంబుఁ గామమును ధర్మముతోఁ గలయంగ నెన్నునేఁ
యక్కట! యిట్లు వేద మని యప్పురుషార్థము నోలి మేలగున్'. 358

వ. అని ధర్మం బగ్గించి. 359

క. ఆసుకృతము గడయెద్ది మ
హాసత్త్వా యోగసేవనారామత ను

ధ్యాసితుఁడ వగుచు నిష్ఠా
వ్యాసంగవిహారి వగు మనామయలీలన్. 360

క. అని యతఁడు నిజనివాసం
బున కరిగెను విప్రవరుఁడు మునిజనములు పూ
జనము లొనరింప ఖేచరు
లనుమోదింప విహరించె నప్రతిహతుఁడై. 361

-: నారద ప్రవర్తితంబగు నితిహాసము :-

సం. 12-164-2

వ. ఆని చెప్పి యప్పురుషవరుం డప్పాంచరా గజుతో వెండియు నిట్లను: నొక్క ధర్మసూక్ష్మత సెప్పెద నాకర్ణింపు - ముంచప్పృత్తి యగు విప్రుం డొక్క రుండు భార్యాసహితుండై వనంబున నుండి యజ్ఞాచరణంబునకుం దొడంగి యహింసాపరుం డగుటం బహువిధ యుడిగి ఫలమూలంబుల హవిస్తంత్రంబు నడపంజూచె; నది విహితాచారంబు గామి యెఱింగియు శాపభయంబునం దత్పత్ని యమ్మహీసురవరు నెమర నిలిచియుం బలుకకుండెఁ; బాకశాసనా దులు హవిర్భాగంబులు గొనం గడంగమి నగ్నియుం బచనశక్తిం దొఱఁగెఁ; నట్టియెడ నాసమీపంబునం దిరుగు హరిణంబు మనుష్యవచనంబులం దత్పత్ని దూఱి యమ్మహీసురవరు నెమర నిలిచి తన్ను హింసించి యాగంబు సెల్లింపు మనిన నతం డట్లు సేయుం బొమ్మనవుడుఁ గొన్నియడుగులు వోయి మగిడి యాకృష్ణమృగంబు 'నాయిచ్చ దివ్యదృష్టిం గనుఁగొను; మేను జెప్పినట్లు సేసిన నిన్నభినందించువారై యప్సరఃకాంతలును గంధర్వులును వీరె విమా నంబుల నేతెంచినవా' రనుటయు నవ్వి పుండు నిలోకించి దివ్యత్వసిద్ధికై దాని హింసించువాఁ డగుటయు దానం దదీయ తపంబునకు సుత్పాతంబులు పుట్టె; నేణరూపంబున వర్తించు నాధర్మదేవత యాభూదేవునకు సన్నిధిసేసి 'నీయజ్ఞశ్రద్ధకు సంతోషించి ధర్మసూక్ష్మత్వంబు దెలుపవచ్చితి; నర్హాంబగు హింసావిశేషం బహింస్రావ్రతహానిం జేయదు; క్రతువుగదా యని యనర్హా హింస గర్త్యంబు గా'దని నిర్దేశించి తత్పత్నీసమాధానంబునం దపశ్శక్తి ప్రత్యాసత్తియుం జేసి యాగవిశేషవిధానంబు వరప్రదానంబున నిర్వహించె; నయ్యితిహాసంబు నారదప్రవర్తితంబని చెప్పిన నప్పుడమిఱేఁడు ప్రీతుండై.

-: భీష్ముఁడు ధర్మజునకు ముక్తిమార్గము దెల్పుట :-

సం —12—2ఓ5—2

క. పురుషుం డేమిటఁ బాపా
చరణమునకుఁ జొచ్చు ధర్మచర్యకు మూలం
బరయఁగ నెయ్యది రెంటిం
బొరయుం డెద్దాన నెట్లు వొందును ముక్తిన్. 363

వ. అని యడిగిన నతనికి భీష్ముం డిట్లనియె: 364

సీ. గంధరసాదులకాంక్ష లోభము మోహ
మును దెచ్చు; నద్దోషమునకు మనసు
లోనైన ధర్మవిలోపంబు వాటిల్లు;
దానఁ బాపము సేయుతలఁపు లొదవుఁ
బ్రజ్ఞ నక్కఁడులు బావించి సద్దోషిఁ
బరగంగ విషయతత్పరత మాను
నది, ధర్మబుద్ధికి నాలవాలంబగు
ధర్మాచరణములఁ దనివి సనక

తే. హృద్గతద్వంద్వముల నెల్ల నెడల విడుచు
ననఘ! యనపాయమగు నుపాయమున ముక్తి
వడయుఁ; బదపడి యేను నీయడిగినంత
పట్టుఁ దెలిపితి; ధర్మనిర్వాహి వగుము. 365

తే. అనుడు 'ననపాయ మగు నుపాయం బనంగఁ
జెప్పి తొక్కటి మోక్షంబుఁ జెందు తెఱఁగు
దానిఁ దెలియంగ నెఱిగింపవే నరేంద్ర
ముఖ్య!' యనియె నకుఁ్కరువంశముఖ్యుఁ డధిప. 366

వ. అనుటయు నమ్మహీకాంతునకు శాంతనవుం డిట్లనియె; 367

క. వినుము: ఘటము సేయుట సా
ధనములు లేకున్న నగునె? ధరణిప! పూర్వాం
బునిధికిఁ జనుమార్గ మపర
వనరాశికిఁ జనునె? వెరవు వలయుం దెలియన్. 368

వ. అడిగి మేలు సేసి తాకర్ణింపుము. 369

సీ. క్షమఁ గ్రోధ మక్కృతసంకల్పతఁ గామంబు
చిరనిద్ర సత్త్వసంసేవనమున
గాఢధైర్యమున రాగద్వేషము లుభయ
మప్రమాదమున మోహంబు భ్రమము
వినివర్తనాభ్యాసమున రోగములు నుప
ద్రవములు హితము మితంబుఁ గాల
యోజితంబును నగు భోజనంబున జీవ
సందర్శనమున నిశ్వాస మఖిల

తే. విషయములు నంత విరసతావేక్షణమున
నిత్యసంతోషమున లోభనిరతి కృపన
ధర్మ ముచిత కృతావేక్ష ధర్మ మవుల
ద్రోవ నేర్చుట ముక్తికిఁ ద్రోవ యధిప! 370

తే. తాను గ్రోధాదు లెడలించుఁ గాని ముక్తి
దెచ్చి యీ దొకభంగి ముక్తికిఁ బథంబు
నగుట ననపాయ మగు నుపాయం బనఁగ
వలసె నీనేర్పు పే రిందువంశవర్య! 371

చ. అనుడు నజాతశత్రుఁ 'డిటు లన్నులదమ్ములు లోనుగాఁగ దృ
ష్ణ నఖిలబంధుకోటులను జఁపెడు తెం పొలసెన్ మహాత్మ!యే
యనుపునఁ దృష్ణ్రతోపువడు? నట్టి సమంచితచిత్త ధర్మముం
బనుపఱుపంగ జాల కలభాషణ పంక్తి ననుగ్రహింపవే!' 372

క. అనుటయు దేవవ్రతుఁడ
మ్మనుజపతికి నిట్టులనియె: 'మాండవ్యునితో
జనకుఁడు సెప్పినమాటలు
విను; మవి తృష్ణ నడఁగించు వెరవు నొసర్చున్.' 373

-: జనకరాజ మాండవ్య మహామునుల సంవాద ప్రకారము :-

సం- 12-268-3.

వ. జనకునికడకు మాండవ్యుండు వచ్చి వితృష్ణత్వశిక్షఁగోరిన నమ్మేదినీశ్వరుం డాదరభరితుండై. 374

సీ. ఆర్థముల్ దుఃఖదోషాకరంబులు ; విను,
మేమిటిపై నాశలేమిఁ జేసి
పొరయవు ననుదుఃఖములు మునినాయక !
మిథిల గాలంగ నేమియును నాకు
గాలని యట్లుండెఁ; గామసుఖంబును
దివ్యసుఖంబును దృష్ణ విడుచు
సుఖమఁ బోలునె ? యర్థసులభతతోడన
గోవుఁతో బెరిఁగెడు కొమ్మలట్లు 375

తే. తృష్ణ దానును పెరుఁగుఁ దదీయసక్త
మమత గలుగు ; మాబంధులు మాధనములు
మానివాసఁబు లనమి మమతత్వ మెదఁది
రంబు గాకున్న నింకుఁ దృష్ణాంబురాశి.

క. దొరకొన్న ననుభవించుచు
దొరకొనమికిఁ జింతనొంది దురపిల్లక ని
ర్భరుఁడై యున్నను దృష్ణకుఁ
జొరవచ్చునె యతని మనసు సువ్రతశీలా ! 376

తే. విడువరాదు దుర్మతులకు నొడలు ముదియఁ
దాను ముదియదు ప్రాణాంతమైన రోగ;
మనఘ! తృష్ణవర్ణితకాముఁ డై నతండు
దానిఁ బోఁద్రోచి సౌఖ్యసాంద్రత్వ మొందు. 377

క. శోకప్రమదాది ద్వం
ద్వాకులుఁడవు గాక శాంతి నంతఃకరణ
శ్రీకిఁ బరిరక్ష సేయుము
నీకు వితృష్ణత్వసౌఖ్యనిత్యత గలుగున్. 378

క. అని చెప్పిన నమ్మునిప
మ్మనుజపతిం బ్రస్తుతించి మనము ప్రశాంతిం
బనుపడఁగఁ బ్రీతి వీడ్కొ-ని
చని పర్తిల్లెను వితృష్ణసరణిఁ గుమారా! 379

-: పితాపుత్ర సంవాదము :-

వ. అనిన విని ధర్మనందనుండు శంతనునందనుతో 'సర్వభూత భయావహం బగుచుం గాలం బతిక్రమించు చుండుఁ బురుషుం డెద్ది యాచరించుట మేలు? దీని మున్ను నడిగి విన్నవాఁడ; నిది పెద్దయు వినవలయునది; గావున నడి గెదం జెప్పవే!' యనుటయు నమ్మహాత్ముం 'డీయర్థంబు దెలియుటకు ముంద రేను చెప్పిన పితాపుత్రసంవాదం బను నితిహాసంబు లెస్స; యందుఁ గొన్ని వాక్యంబు లప్పుడు నెప్పనియవియునుం గలవు చెప్పెద వినుఁ: మధ్యయన పరుం డగునొక్క- బ్రాహ్మణపుత్రుం డన్వర్థనామధేయుండు మేధావి యను వాఁడు దండ్రి కభిముఖుండై. 380

సీ. 'ఆయువు దఱుఁగు నంతంతకు ధీరుఁ డె
య్యది సేయువా?' డన్న నతండు 'బ్రహ్మ
చర్యంబు వేదాభ్యసనమును సంతాన
సంపాదనంబు యజ్ఞ ప్రవ ర్త

నంబును జేసి వానప్రస్థధర్మంబు
నడపి యాచరిత సన్న్యాసుఁ డగుట
కృత్యం' బనుడు జరామృత్యువుల్ జనమా
దిగ వెను తగులంగ దిగులులేమి

తే. మీను వలదన్నుఁ బొదువుట గాన కిష్ట
వృత్తి విహరించుచుండెడు విధమకాదె;
యెల్లి సేసెద ననక మే లిపుడ చేయు;
మనఘు! వార్చునె మృత్యువు జనుల పనుల. 381

వ. అని పలికి పుత్రుండు వెండియు. 382

క. కృత మిది యకృతం బిది యిది
కృతాకృతం బనుచు నరుఁడు గింక ర్తవ్య
త్వతిరోహితాత్మ హితసం
స్మృతియైనఁ గృతాంతుఁ డతనిఁ జేర్చుఁ దనపురిన్. 383

క. అనఘా! మృత్యువు నమృతం
బును దేహమునంద కలవు; మోహము మృత్యు
త్వనిరూఢ; మున్న రూపుం
గను టమృతత్వోపహితము గాఁగ నెఱుగుమీ! 384

క. ననుబోఁటికిఁ బశుయజ్ఞం
బున హింసకుఁ డగుట దగునె? భూసురవర! హిం
సనరహితమైన శాంతియ
జనమున బ్రహ్మాధ్వరంబు సలిపెద నియతిన్. 385

క. యోగంబుఁ దపంబుఁ బరి
త్యాగంబును గాక యొండు లగునె హితంబుల్;
రాగము సరిముఃఖంబును
ద్యాగముఁ బోలెడి సుఖంబు ;రయం గలవే? 386

క. ప్రజ యేన కాన నన్నుం
బ్రజ సుగతికిఁ బుచ్చు నని భరంపడి కోరం
బ్రజ విడిచెద; నాయుం దది
యజేయమును నవ్యయంబు నగుపద మిచ్చున్. 387

ఉ. 'కావున లోకసంక్షయము గన్గొని యెల్లెడ నిర్మముండవై
నీవును శాంతియున్ సమతనిష్ఠయుఁ బూని గుహాప్రవేశసం
భావన నాత్మదర్శనవిభాసివి గ' మ్మనినం దదీయవి
ద్యావచనంబులం జనకుఁ డట్టిఁడయై వెలిఁగెం గృతార్థతన్. 388

క. నరనాథ! యమృత మగు సు
న్నరూప గను దీవు మరగు నాచెప్పినయి
ప్పుర మేతిహాస వాక్యో
త్కరంబు నర్థంబు చిత్తగత మగుచుండన్. 389

వ. అని యడిగిన భీష్ముం డత్యాదరంబున. 390

తే. 'అధిప! లఘ్వాశియై యింద్రియప్రపంచ
జయము గలిగి మోక్షార్థోక్తసారధర్మ
నిరత నుండెడివానికిఁ బరమ మగు ప
దంబు తంగేటి జున్ను చందంబు నొందు. 391

వ. అని పలికి మఱియు నిట్లను: హారీతగీతి యనువాక్యసంచయం బాకర్ణింపుము:
దాన మోక్షధర్మంబులు వేటపడం జెప్పెద; హారీతుం డను మునివరుండు
విద్వజ్జనంబులు దనవలనం బ్రవ్రజనంబు సమీచీనప్రకారంబుగా నెఱుంగ
నపేక్షించిన. 392

-:హారీతుండు విద్వజ్జనుల కుపదేశించిన తత్త్వప్రకారము:-

సం. 12-269-2

సీ. వారి కిట్లనియె: నిష్ఠారంభమతి నిలు
వెడలి కోర్కుల కెల్ల విముఖుఁ డగుచు

జనముల కీడు వాక్చక్షుర్మనోవర్త
నములఁ గూర్పక మైత్రి సమత గరుణ
గలిగి నిందాప్రశంసల భేదమును నుబ్బు
లెక పొడింటను నేకతంపు
గుడిమ్రాని పొంతను గుహలోన నుండుచు
డంపకములకు వంటకములకును

తే. భోజనములకుఁ దజియైన ప్రొద్దు గడపి
భిక్ష గొనుఁ బ్రీతి మన్నన పెద్దవెట్టు
నట్టియెఁడ దక్కి క్రొత్తగా నరుగు యతి జి
రతరంబు నాత్మారాముఁడై చరించు. 393

తే. అనిన వారు కృతార్థులై యతనిఁ
బ్రస్తుతించి'రని చెప్పె; విని నరదేవవరుఁడు
దేవతటినీతనూజుతో 'భావశుద్ధి
కలిమి యొప్పుఁగదే' యని పలికి మఱియు. 394

తే. రాజభావంబు తొడుసునఁ గ్రచ్చుకొన్న
మనసుతో నుండ కెన్నఁడో మరలి యింద్రి
యముల నిర్జించి సత్త్వాదు లప్రలఁద్రోచి
యేను శాంతిసుఖంబున కెలయు టనఘ! 395

చ. అనుటయు నాతఁ డిట్టులను నక్కరుభర్తకు వేగమేటికిన్
ఘనభుజ యెల్లచందములుఁ గాలముతోడివ చుమ్ము; వర్ణధ
ర్మనిరతి చిత్తపాకము ప్రమంబునఁ దెచ్చుఁ; గషాయపక్వతం
బనుపడ కర్హుఁడేలగు నృపాకకుమారుఁడు సన్న్యసింపఁగన్. 396

వ. ఇవ్విషయంబున వృత్రగీత మును నితిహాసంబు గలదు వినుము; వృత్రుండు
భండనంబునం బడిన నెత్తికొని పోయి పెట్టుకొని యున్నయెడ నయ్యవస్థ
నొందియు విషాదంబు లేక యున్న యద్దనుజవిభునితో శుక్రుండు 'వైరి
హృతవిభవుండ వైన నీకు మనోవ్యథలేమికిఁ గతంబేమి?' యని యడిగిన
నతం డతని కిట్లనియె: 397

-: వృత్రగీత :-

సం. 12 - 270 - 13.

తే. 'కలిమియును లేమియును విను కాలవశగ
తములు; బోధవిహీనుల దర్పదైన్య
కలిత సుఖదుఃఖములఁ బెట్టుగాక యర్థ
ముల యనిత్యత యెఱిఁగినఁ గలదె వికృతి. 398

వ. అర్థంబుల యస్థిరత్వంబ కా దాకర్ణింపుము. 399

క. దైవతమానుష తిర్య
గ్భావంబులఁ బొందుచును వికారిణియై భూ
తావలి దిరిగిన వెంటన
వేవిధములఁ దిరుగుఁ గర్మవివశత్వమునన్. 400

క. ఏనిది యంతయు నెఱుఁగుదుఁ
గాన వగపునుబ్బు నాకుఁ గలుగ'వనుడు 'ని
మ్మానవిహీనపుమాటలు
దానవకులనాథ ! నీకుఁ దగునే యాడన్?' 401

వ. అని యతని మనశ్శుద్ధి యెఱుంగుటకు నై భార్గవుండు. 402

క. అనయము నీసు వొనర్చిన
విని యతనికి నిట్టులనియె వృత్రుఁడు 'విజయం
బునకునయి తపము సేయనె
మును తత్సుకృతమునఁ గొననె మూఁడు జగములున్. 403

క. ఆయైశ్వర్యము గ్రమ్మఱ
మాయుటకుం గారణంబు మాన్యచరిత! లే

దే యొక దుష్కృత; మది యిటు
సేయుం గాకేమి? యేల చింతింపంగన్. 404

క. విను; మనఘ! యింక సుకృతం
బునకుం జొర; దుష్కృతంబు పొంతకుఁ బో, నే
ననుపము నచ్యుతు నవ్యయు
ననంతుఁ జెందెద ననామయత నవ్విష్ణున్. 405

చ. అనిమిషనాథుతోడి యనియప్పుడు గంటి ననంతు నాద్యు వి
ష్ణుని నలవోకఁ; దన్మహిమ సుప్రత నాకెజీఁగింపు; కర్మసం
జనితవిశేషతం గలుగుచాయలలోపల నెద్ది యవ్విభుం
గనుటకు నర్హ? మయ్యెఱుక గల్గఁగ జేయుము నాదుబుద్ధికిన్. 406

ఆ. అనిన 'నట్లకాక వినుము చెప్పెద' నని
యసురగురుఁడు పలుకు నవసరమున
నచటి కరుదెంచె నఖిలమునీంద్ర స
మ్మాన్యుఁ డగు సనత్కుమారు డధిప! 407

వ. వచ్చి యభిపూజితుండై సమున్నతాసనంబున నున్న యమ్మహాత్మునితో
శుక్రుండు విష్ణునిమాహాత్మ్యంబును వర్ణవిశేషంబులు నిద్దానవేంద్రునకు నెఱిం
గింపవే యనిన నతండు ప్రసన్నవదనుం డగుచు నిట్లనియె: 408

ఆ. వినుము దనుజనాథ! విష్ణునియం దఖి
లంబుఁ గలుగు నిలుచు లయముఁ బొందు;
నతనిభక్తి నింద్రియజయంబునకు బోలె
దానధర్మవిధులఁ గానరాదు. 409

వ. అవి ప్రయోజనపడుటయుం గలిగి యుండు; నదియునుం జెప్పెద; మున్ను
విష్ణునిమహిమ యాకర్ణింపుము. 410

తే. ధరణి పాదంబు లతనికి; శిరము దివము;
దిశలు బాహు; లతఁడు సర్వదేవమయుఁడు;
భూతనిక్షేపసంహారములు దదీయ
మానసస్వైరలీలలు దానవేంద్ర! 411

వ. వినుము జీవావస్థలు ఛాయలై యుండుఁ ; గృష్ణంబును ధూమ్రంబును హరి
తంబును హారిద్రంబును రక్తంబును శుక్లంబును నైనవి యాఱు గల వద్దశా
విశేషంబులు. 412

తే. అనఘ! విష్ణునిహారంబులైన విషమ
వివిధవిక్షేపసంహారవృత్తు: లందు
భ్రమణ మొందెడి జీవుని బహుళకర్మ
ముల వశంబున నాతనిఁ బొందుచుండు. 413

తే. తన్ను నుత్తమమధ్యమాధమము లైన
ఛాయ లొందంగఁ బ్రచురపర్యాయవృత్తి
జీవుఁ డమరత్వముఖ్య నానావిధముల
నొంది యెక్కు-చు డిగ్గుచు నుండుఁ జూవె. 414

క. మే లొనరింపఁగ దొరకొను
మేలిమిగలచాయ కీడు మెయికొని చేయన్
లోలత్వరహిత చాయకుఁ
చాలం గీడ్పాటు వొలయుచందము వచ్చున్. 415

వ. కావున. 416

క. రసకర్మజ్ఞుఁడు దారకు
పసిండి సేఁతకుఁ బ్రయత్నపరుఁడై శుద్ధ
త్వసమగ్రము సేయు క్రియ
న్వాసువక నరిశుద్ధి జీవునికిఁ జేయు టురున్. 417

క. వినుఁ: కుసుమంబుల వాసిం
చిన నొప్పనికంపు విడిచి చెందును సౌర
భ్యనిరూఢిం దిల లట్టుల
యనఘా! సుకృతముల జీవుఁ డకలంకుఁ డగున్. 418

క. అంతంతకు సత్కర్మము
లెంతయుఁ బెనుపొంద జీవుఁ డెక్కుడు చాయం
జింతాకలుషము వాయఁగ
సంతోషామృతము నాని సంశుద్ధుఁ డగున్. 419

వ. ఎక్కుఁడుచాయ శుక్లత్వంబు. 420

క. జీవుఁడు శుక్లచ్ఛాయా
భావితుఁడై నపుడు విష్ణు భావించుటకుం
దా వెరవరి యగుఁ; దద్గత
భావ మొసఁగు గుఱుములేని పండగు నెలవున్. 421

వ. అనిన విని వృత్రుం 'డదీనంబులు నమృతస్వరూపంబులు నగు భవదీయ వచనంబులు వినికింజేసి విశుద్ధుండ నై తి'నని పలికి ప్రాణంబులు విడిచి విష్ణునిం బొందె' నని చెప్పుటయు నప్పాండవేయాగ్రజుండు 'వృత్రుని విజ్ఞానంబును విష్ణుభక్తియు నింతయొప్పునే?' యని యగ్గించి 'యతండును నాఖండలుండును భండనంబు సేసినతెఱం గెఱింగింపవే' యనుటయు ననిమిషనదీనందనుం డతని కిట్లనియె: 422

-: ఇంద్ర వృత్రాసురుల యుద్ధ ప్రకారము :-

సం. 12-272-7

సీ. ఇంద్రుఁ డుజ్జ్వలరథం బెక్కి దేవానీక
సహితుఁడై వృత్రుపైఁ జన, నతండు

దనుజసైన్యముఁ గొని తాఁకెఁ దత్సంగర
మవ్యాసవునకు భయం బొనర్చెఁ;
బర్వతప్రతిమరూపమున నయ్యసుగయు
గ్రతఁ జూచి వడఁకు దైవతకులేంద్రు
నద్దానవుండు మాయాబలంబున మోహి
తునిఁ జేయ సొగయుడు మునినమాజ

తే. సంస్తుతముగ రథంతరసామశక్తిఁ
జేసి యమ్మూర్ఛ దేర్చి వసిష్ఠుఁ డతని
తోడ నజుఁడును హరియు రుద్రుండుఁ బోరు
గనుఁగొనంగ వచ్చినవారు గడఁగు మనుడు. 423

చ. అతఁడు గడంగ దేవగురుఁ డప్డు మునీంద్రులుఁ దాను నమ్మరు
త్పతివిజయంబు గోరి హరుఁ బ్రార్థనసేయఁ దదీయతేజ ము
ద్ధతచటులజ్వరం బగుచు దైత్యపతిం బొదివెన్ సురేశ్వరో
ద్యతకులిశంబుఁ బొందె హరి దత్సమయంబునఁ గౌరవేశ్వరా ! 424

తే. ఇంద్రునకు రుద్రుఁ డత్తఱి నిట్టులనియె:
'ననఘ! యిరువదివేలు దివ్యాబ్దములు మ
హాతపం బొనరించె నీయసుర; వీని
కొసఁగెఁ బద్మజుఁ డధిక మహోగ్రబలము'. 425

క. అని చెప్పి' యబ్బలము నా
ఘనతేజముచేత నడఁగు; గడఁగు' మనుడు న
య్యనిమిషనాథుఁడు వజ్రం
బున వైవ నతండు వడియె మునిగణ మలరన్. 426

క. సుర లాశ్చిరి, తూర్యంబులు
మొరసె ననేకంబు, లపుడు మోదమున మునుల్
హరిహరులం గీర్తించిరి,
సురేంద్రు నగ్గించి రధికశుభవాక్యములన్, 427

క. విను విష్ణుని సంస్పర్శం
బున నప్పుడ చూవె కసటు వోయిన నతనిం
గనుటయు శాంతిం బొందుట
యును గురువర. కలిగె వృత్ర నుల్లంబునకున్ 428

వ. అని పలికి భీష్ముండు వెండియు నవ్విభున కిట్లను; నట్లు వృత్రుని జయించి.

చ. హరునకు మ్రొక్కి, 'మీకరుణ నార్తి దొలంగి యనూనసౌఖ్యముం
బొరసితి' నంచు వీడుకొనిపోయె మహేంద్రుడు; బ్రహ్మహత్య యా
సురపతి నప్డు వెన్కొనియెఁ; జొచ్చె బిసాంతర మాతఁ డందునుం
బరిగొని యుగ్రవృత్తి నదిపట్టెఁ జలంబున నమ్మహాత్మునిన్. 430

ఆ. బ్రహ్మహత్య దన్నుఁ బట్టిన నమరేంద్రుఁ
డజునికడకు నేఁగి ప్రార్థనంబు
చేసి 'దీనిఁ బాయఁజేయవే' యన నతం
డది దొలంగజేయు ననువు దలఁచి. 431

వ. అగ్ని నోషధి వృక్షతృణంబులను వనితాజనంబులను జలంబులను దలంపున రావించి 'వృత్రునివలన వాసవునకుం బాటిల్లిన బ్రహ్మహత్య చతుర్భాగంబులు సేసితి; మీర లొక్కొక్కపాలు గైకొనుం డని పనిచెఁ; బనిచిన వారు 'దేవా! నీపంపు సేసెదము; మాకు నిష్కృతి యెట్టిది? దాని నీదివ్యచిత్తంబున నవధరింపవలయు' నని పలికిన, నగ్నికిని నోషధి వృక్ష తృణంబులకును వనితాజనంబులకును జలంబులకును వరంబులుగాఁ గ్రమంబున 'నీవు ప్రజ్వలింపక హవిఃప్రదానంబు సేయువాని యందును మీకుఁ బర్వకాలంబుల భేదనచ్ఛేదనంబు లాచరించువానియందును మీరు రజస్వల లై యుండ మీతో సురతంబు సలుపువానియందును మీలో మలమూత్రశ్లేష్మంబులు విడుచువానియందును మీమీకడ నున్న బ్రహ్మహత్య ప్రవేశం పగలయది' యని నిర్దేశించిన, దానికిం బ్రియంబంది యగ్ని ప్రముఖంబులు శతమఖు బ్రహ్మహత్య పాళ్ళు ధరియించి; రిట్లు విరించి ప్రసాదంబునం గల్మషంబు దొలంగి యాఖండలుండు దదనుమతి నశ్వమేధంబు సేసి, నాకసామ్రాజ్యంబున సర్వలోకపూజ్యత్వంబు నొంది వెలింగె నని చెప్పి వెండియు నిట్లనియె: 432

తే. ఒదవు వృత్రుర క్తమున బుద్బుదము లెసఁగి
పుట్టకొక్కఁలై యవి జనభోజ్యభావ
మొంది విప్రాదిక ద్విజయోగ్యతాభి
సన్నములు గావు ధర్మసంపన్నచరిత! 433

క. ఆవాసవుచందంబున
నీవును శత్రుజయకీర్తనీయుఁడ వగుచున్
భూవిబుధుల కెపుడుఁ బ్రమో
దావహుఁడవు గమ్ము భారతాన్వయముఖ్యా! 434

తే. పర్వములయందు విప్రసభను సభక్తి
కంబుగా నెవ్వఁ డీశక్రకథఁ బఠించు
వానిఁ బాపము లొందవు మాననీయ
ధర్మములయందు రతుఁడగు ధర్మతనయ! 435

ప. అనిన నతండు ప్రీతుండై 'వృత్రుండు జ్వరంబుచేతం బొదువంబడియె ని
వింటి; దాని జననంబును దత్ప్రకారంబును నెఱిగింపవే' యనుటయు భీష్మం
డాభూపతి కిట్లనియె: 436

-: దక్షమఖధ్వంసంబునప్పుడు శివుని వలన జ్వరం బుద్భవించిన ప్రకారము :-

సం. 12-274-4

సీ. రజతాచలంబున రత్నతటంబున
నంబికాసహితుఁడై హరుఁడు పేర్మి
నమరమునీంద్రయక్షాదులు గొలువంగ
నుండు; నట్లుండగ నొక్కనాఁడు
దేవర్షికోటు లతిప్రమదంబునం
జనఁ జూచి, 'వీ రేమి పనికి నెచటి

కరిగెద' రని పతి నడిగె భవాని; యా
తఁడు దక్షుచేయు నధ్వరమునందుఁ

తే. దమ హవిర్భాగములు గొనుదాని కనినఁ
బొలఁతి 'నీవేల పో'వనుపలుకు పలికె;
'నాకు మునుభాగపరికల్పనంబు లేమి
నతఁడుఁ బిలువఁ, డేనను బోవ'నయె భవుఁడు. 437

క. తనపతికి భాగకల్పన
మొనరింపఁడు దక్షుఁ డని మహోగ్రపుఁ గోపం
బున బొమలు ముడివడఁగ న
వ్వనిత పలుకుమాని యుండె వసుధాధీశా ! 438

సీ. దేవిచిత్త మెఱింగి దేవుండు ప్రమథసం
ఘంబులు దాను నాక్రతువు సెఱుప
నరిగె; యజ్ఞాంగఁబు లన్నింటఁ బ్రమథులు
గాసి సేయుచును రక్తములు సల్లి
యార్పంగ మృగరూపమై గగనంబున
కెగసె నధ్వరము; ము న్నీశునుదుట
నలుకఁబుట్టిన ఘర్మజలకణ మిలబడ్డఁ
బెనుమంట లెగసిన జనితుఁ డయ్యె

ఆ. నందుఁ బురుషుఁ డొకరుఁ డరుణనేత్రకము నీ
లఁబు నూర్ధ్వరోమకఁబు ఘోర
భంగిఁబు నె నయంగంబుతో స ప
తంతుదాహి యగుచు ధరణినాథ ! 439

క. సురలు మునులు భయమునఁ బఱి
చిరి నలుగడ; బ్రహ్మ వచ్చి శివుఁ గని వినయో
త్తరముగ మ్రొక్కుచు 'నమరులు
పరికల్పించెదరు నీకు భాగము భక్తిన్. 440

వ. స్వామీ కోపం బుపసంహరింపుము.' 441

క. నావుడు నల్ల నగుచు న
ద్దేవుఁడు గరుణించి మునుల దేవతలను సం
భావింప భాగకల్పన
భావించిరి వార లాజగత్ప్రభువునకున్. 442

వ. అప్పరమేశ్వరుండు సుప్రసన్నుండై యనిమిషులకు మునిగణంబులకు నానందం బొసంగె; శతానందుం డయ్యందుశేఖరునితో 'దేవా! నీనుదుటి చెమటం బుట్టిన యప్పురుషుండు జ్వరం బను నామంబునం బ్రశస్తుం డయి యెందునుం జరియించు; నీజ్వరంబేకముఖత్వంబునం బృథివికి దుర్భరం బగు; బహువిధంబుగా సృజియింపవే' యనుడు సగ్గిరీశుండు కరులకు శిరస్తాపనం బును, భుజంగంబులకు నిర్మోకంబును, గోవులకు ఖురాంతర్బాధనంబును, మృగంబులకు నైజస్వరూపదర్శన ప్రత్యవరోధనంబును, దురగంబులకుఁ బార్శ్వ శోషణంబును, మయూరంబులకుఁ బత్త్రిద్వేదనంబును, గోకిలంబులకు నేత్రరోగంబును, శుకంబులకు హిక్కయు, నజంబులకుఁ జిత్తభ్రమణంబును, శార్దూలంబులకు శ్రవంబును, మనుష్యులకు జననమరణాదులయెడ వేదనా వేశంబునుంగా విభాగించె; నివి జ్వరప్రకారంబు;జ్వరంబు మాహేశ్వరం బగు తేజంబు గావున సర్వజనంబులకు నమస్కార్యంబును మాననీయంబును నై యుండు. 443

క. జ్వరకథ వినినఁ బఠించినఁ
బురుషుం డారోగ్యసిద్ధి బొందలఁ, దేజ
స్ఫురణముఁ జిత్తసమాధియు
దొరకొనుఁ గోర్కులు ఫలించు దుగ్ధితము లడఁగున్.' 444

క. అని చెప్పి యమరతటినీ
తనూభవుం డాదరమున ధర్మసుతునితో
ననఘా ! నీ విం కెయ్యది
వినవల తనవుతు నతండు వినయానతుఁడై. 445

-: శాశ్వత త్వం బెఱుంగనివాఁడు సేయవలసిన విధము :-

12-276-3

తే. శాశ్వత త్వ మెఱుంగక సంశయాత్ముఁ
డగుచు బరమార మిటిది యనఁగలేని
యట్టివాఁ డేమికర్మంబు నాచరించు
వాఁడు సెప్పవె ధర్మప్రవ ర్తనజ్ఞ ! 446

వ. అని యడిగిన నమ్మహామతి యతని కిట్లను: గురుపూజయు వృద్ధోపసేవనం
బును విద్యాశ్రవణంబు నవశ్యక ర్తవ్యంబులు; మఱియుకుం జేయవలయు నవి
నారదగాలవసంవాదంబు వినినం దెలియు చెప్పెద; నారదు నాశ్రయించి
గాలవుండు. 447

క. నానాశాస్త్రంబుల న
ర్థానేకత్వంబు గనుచు నప్రా ప్తసుఖ
జ్ఞాన పరినిష్ఠ మగుమ
న్మానసముం దేర్పవే సమగ్రవివేకా ! 448

వ. అని యభ్యర్థించిన నద్దేవముని యమ్మహాద్విజున కిట్లనియె: 449

క. చతురాశ్రమముల వ్యవ
స్థితులు పరీక్షించి యందుఁ జెందఁ దలఁచి త
ద్గతి సూక్ష్మదృష్టిఁ గనుఁగొని
సతతంబు ద్రివర్గచరిత సౌమ్యుం డగుచున్. 450

తే. పాపకర్మంబు లెల్లను బాయఁబెట్టి
పుణ్యకృత్యంబు లగువాని బురుషుఁ డోపి
నట్లు శుద్ధమనస్కుఁడై యాచరించు
వాఁడు సజ్జనసంగతి వలయు నెపుడు. 451

క. వినుఁ: సర్వభూతములయం
దును మార్దవయుక్తుఁడై మధురవాగ్వృత్తిం
బనుపడఁగ వలయు నార్జవ
మనూనముగ దేవపిత్రసమర్చకుఁ డగుచున్. 452

క. అనహంకారము నప్రా
ర్థనమును విషయములఁ బెద్ద దగులమియును మే
లనఘా! పరుఁ నిందించుట
దను వర్ణించికొను టనుచితము లెయ్యెడలన్. 453

క. వినుఁ: మలసుంతును గర్వియు
ననర్థభాషియును మత్సరాలీఢుఁడుఁ గ్రో
ధనుఁడునుగా వలవదు శ
క్త్యనురూపతఁ జేయవలయు నాతిథ్యంబున్. 454

క. వేదాధ్యయనంబుఁ దదం
గాదరణము యజ్ఞవిధిసమారంభము ధా
త్రీదైవతసమ్మాననము
నేదేశమునందుఁ గలుగు నిరవది నిలువన్. 455

క. ఇత్తెఱఁగునఁ బురుషుం డ
త్యుత్తమచరితముల నడచుచుండఁగఁ బాయుం
జిత్తంబు కలఁక; బోధో
త్పత్తికి నది మూల మగు నధర్మవిదూరా! 456

క. అని చెప్పె ననుడుఁ గుంతీ
తనయాగ్రజుఁ డమరతటినీతనయునితో ని
ట్లను గాలపాశసంఛే
దనమును నఱుఁబోవి యెవ్వఁడును జేయున్. 457

వ. అని యడిగిన నతం డతని కిట్లనియె: 458

-: అరిష్టనేమి యనుముని సగరున కుపదేశించిన ధర్మ్మోపకారము :-

సం. 12-277-2:

ఆ. వినుఁ: మరిష్టనేమి యనుముని నడిగె నీ
యడిగినట్ట సగరుఁ; డమ్మహాత్ముఁ
డన్నరేంద్రునకుఁ బ్రియంబునఁ జెప్పిన
సౌమ్యవాక్యములు ప్రశాంతిఁ జేయు. 459

వ. వానిం జెప్పెద నవహితుండవై వినుము; సగరుం బ్రబోధించుటకు నరిష్ట
నేమి యిట్లను: ధనధాన్యపశుకళత్రపుత్రాదులసందడిం బడి డెందం బాకులం
బగునేని ముక్తిమార్గంబు దుర్గమంబై యుండు. 460

సీ. వృద్ధకళత్రంబు బుద్ధి మత్పుత్రుల
విడిచి నిర్భరత వివిక్తదేశ
మునకుఁ బోవలయు; సపుత్రుం డపుత్రకుం
డను విశేషంబు లే దతులశాంతి
వైరాగ్యములు గలవానికి; వినుఁ: నృప
వర్య ! బంధులఁ బ్రోవవలదె యనుత
లంపున సంసారలంపటుం డగువాఁడు
బేల; దా మృత్యువుపాలు వడిన
ఆ యపుడ వారి నరయ నబ్బునే? యద్దశఁ
దలఁచి ముక్తి గోరఁ దగదె? యట్లుఁ
గాక తరకు వారు గలుగుదురే యప్పు?
డదియుఁ దలఁపవలయు నదియ కాదె. 461

తే. భూతములపుట్టుఁ జేష్టయుఁ బొలియుటయును
జూచునేర్పు గలుగువాఁడు సూడనేర్పు

మోక్షమార్గంబు చిత్తంబు మూఢమైన
సక్తఁ డగు లోకగతి నెట్లు ముక్తి గలుగు 462

క. అనఘ! దురన్నము శాల్యో
దనమును భూమియును మృదులతల్పము నజిన
మ్మును సురుచిరచీనాంబర
మును సరి యెవ్వనికి నతఁడు ముక్తిం బడయున్. 463

తే. నేలయెల్లను నేలిన నృపుల పుట్టు
నిగిపోకయుఁ జూపాదిగాఁగఁ గలుగు
శక్తు లెడలినఁ జెడు మేనిచందమును ద
లంప నేర్చునతడు మోక్షలక్ష్మిఁ జెందు. 464

క. ధనయోగము దుర్లభ మని
యును గేశము సులభ మనియు నూహించుచు నె
మ్మనమున మర్త్యత్వము గీ
డని యెఱుఁగునతండు గను మహానందంబున్. 465

క. కావున గృహస్థవృత్తిన్
నీ వతిలోలుఁడవు గాక నెఱిఁ జేయుము ర
క్షావిధి ధరణీప్రజకుం
గైవల్యము దాన నీకుఁ గలుగుం జులుకన్. 466

క. అని బోధించిన సగరుం
డనయనముఁ దెలివొంది నియతుఁడై ప్రజ రఁక్షిం
చె నరేంద్రుఁ నీవుఁ దద్వ
ర్తనమున నెగడుము జనాభిరంజన మొప్పన్. 467

తే. అనినఁ బ్రియమంది పాండవేయాగ్రజుండు
'ధర్మవిద్వేషపరు లగు దానవులకు

మంత్రియై యుండు శుక్రత్వమహిమ యెట్లు
గలిగె భార్గవునకుఁ బుణ్యగణ్యచరిత!' 468

-: శుక్రనామంబు భార్గవునకుం గలిగిన విధము :-

సం. 12-278-4

చ. అనవుడు భీష్ముఁ డిట్లనియె: నాతడు యోగబలంబు పెంపునన్
ధనదుని మోసపుచ్చి తదుదాత్తధనం బవలీలఁ గొన్న నె
మ్మనమున నొచ్చి చెప్పెఁ బురమర్దనుతోట నతండు దానికిం
గనలున నమ్మహేశ్వరుఁడు గన్నుల నిప్పులు రాలుచుండగన్. 469

ఆ. శూల ముగ్రత నెత్తి యెచ్చోటనున్న
వాడు భార్గవుఁ డనుచు దుర్వార కోప
వివశుఁ డగుటయు, నాతఁడు వెఱచి చాల
దూరముగఁ బోయి తుప్పలఁ దూలియుండె. 470

క. అమ్మెయి నిలుచుటకును జి
త్తమ్మోర్వమిఁ దల్లడంబు దనికినఁ గడువే
గమ్మునఁ ద్రిపురహరుని హ
స్తమ్మునఁ జొప్పడియెఁ గని యతఁడు వెస; ఱిమింగెన్. 471

ఆ. కడుపులోననుండి కలగొనఁ బాఱెడు
విబుధవైరిగురుఁడు వెడలకుండు
నట్లుగాఁగఁ దెరువులన్నియు మూసి శి
శ్నంబు మూయ కంగజన్మరిపుడు. 472

క. వెడలు మని తెరువు సూపిన
వెడలెను భృగునందనుండు పెండియుఁ గోపం
బడరఁగ నాతనిఁ గనుఁగొని
యెడు రుద్రునిఁ జూచి దేవి యిట్లనియె న్మపా! 473

క. నీకడుపున జన్మించుట
నాకం గొడుకయ్యె నితఁడు; నాసుతులకు సు
శ్లోకా: యలుగం దగునే
నీకు సుఖిం జేయు మీతనిం గృపతోడన్. 474

తే. అనిన దేజస్వి జేసి చంద్రార్ధమౌళి
శిశ్నమున నిర్గమించుటఁజేసి యితఁడు
శుక్రుఁ డనుపేర వర్తించు; సుదతి! నీకుఁ
బ్రియ మొనర్చితి' ననియె సంప్రీతితోడ. 475

తే. ఆనఘ! యిది భార్గవుఁడు శుక్రుడైన తెఱఁగు
నావుడును ధర్మజుఁడు శాంతనవుని తోడ
'నీదువాక్యామృతమున నానెమ్మనంబు
తృప్తిసనదు; సద్ధర్మంబుఁ దెలుపు మనియె. 476

వ. అనవుడు నమ్మహానుభావుం డమ్మహీనాథుతోఁ 'బరాశరగీతా శ్రవణ ప్రవ
ణుండ వగు మది ధర్మప్రబోధకం బగు'నని పలికి యిట్లనియె: 477

-: జనకునకుఁ బరాశరముని యుపదేశించిన ధర్మప్రకారము :-

సం. 12-279-3

సీ. జనకభూపతి యడిగినఁ బరాశరముని
ధర్మసంబోధనతానిరూఢి
నిట్లని యెఱిఁగించె-నిహపరసౌఖ్యముల్
ధర్మకార్యము లని తలఁచి నరుఁడు
ఫలము బీజంబునం బడయునట్టుల ధర్మ
మున సౌఖ్యసంసిద్ధిఁ బొందవలయు;
సుకృతదుష్కృతములు సుఖమును దుఃఖంబు
గుడువఁజేయక నరు విడువ దధిప!

తే. వాఙ్మనోదృష్టి కలిత ప్రవర్తనములఁ
గాయచేష్టితములను నన్యాయపథముఁ
బొరయ నీకున్న సత్పథనిరతి గలుగు;
సత్యశమదమాహింసలు సత్పథములు. 478

క. అనఘుం డింద్రియహయభృత
మనోరథరథంబు నాఁగు మహితజ్ఞాన
త్వ నిరూఢరశ్మి శక్తిని
జననాయక: దుష్పథమునఁ జనకుండంగన్. 479

ఆ. పడయరాని యాయు వొడలికిఁ గలిగినఁ
బాపకృతుల దానిఁ బడటఁ గలుప
నగునె? పుణ్యవిధి సమాచరణములఁ గై
సేయవలయుఁగాక చెలువు మిగుల. 480

క. దురితంబులు దొడరు మహిత
కరణంబున మేలు వడయఁగాఁ గోరుట భూ
వర! దుస్సలిలస్నానా
దరము తెఱఁగు సూవె! యెవ్విధంబునఁ దలఁపన్. 481

క. సమదర్శియై యఖిలభూ
తములను దనయట్లకాఁగఁ దలఁచుచు నెవ్వం
డమలన్యాయపరుం డగు
నమరు లతని వందనీయుఁ డండ్రు నరేంద్రా: 482

క. ధన మించుకేని ధర్మం
బునఁ బడసినయట్టి దైన భూవర పాత్రం
బున నిడిన నది మహాఫల
జనకం బగు నండ్రు వేదసంవేదిజనుల్. 483

తే. మునులబుణ మధ్యయన మున ననిమిషుల బు
ణంబు క్రతువున నతిథిబుణంబు పూజఁ
దీర్చునది శ్రాద్ధమునఁ బితృదేవతల బు
ణంబు నరులబుణము రంజనవ్రతమున. 484

క. నారదపర్వతదేవల
భారద్వాజాదు లైన పరమమునులు ధ
ర్మారంభంబునఁ బడసిరి
గారవ; మ ట్లగుట ధర్మకరణము వలయున్. 485

క. వినుఁ మర్త్యుఁడగు ననర్త్యం
డనఘా! విష్ణుస్తుతి క్రియం దపము నధ
ర్మనిరూఢి నివి మనంబున
ఘనపరిబోధంబుఁ గూర్చుఁ గావున నధిపా ! 486

అ. అహితాగ్నిఁ బుణ్యుఁ డను శ్రుతి జనియు
జనకుఁడును గురుండు సద్గతియును
దేజమును బలంబు ధృతియును బుద్ధియు
నగ్ని యగుటఁ జేసి యమలచరిత ! 487

తే. సుజనసంగతి కర్తవ్య కుజనుఁ డైన
దాన నిర్మలుఁడయ్యెడుఁ గాన వినుము:
శూద్రజాతి భూదేవశుశ్రూషఁ గాదె
యిహముఁ బరమును బడయుట మహితవృత్తి. 488

క. అనఘా! మర్త్యులజీవన
మనిత్య మని యెఱిఁగి సుఖమునప్పుడు దుఃఖం
బున యపుడు ధర్మ మేమఱి
కునికియ యెజ్జాతికైన నుర వూహింపన్. 489

తే. పాప మించుక దొడరిన పనియు నెట్టి
ఫలము గలిగిన వల; దల్పఫలవిధాయి
యైన పుణ్యమిశ్రితకార్య మాచరించు
నది శివం బగు; దాన నిహమ్ము౯ బరమ. 490

తే. యజ్ఞపరుఁడు రక్షకుఁడు నుపార్జకుండు
విప్రభూషకుఁడు గాని విప్రరాజ
వైశ్యశూద్రులు దక్కటివాని నెట్టి
ధర్ములఁ జేసిరేని నధర్మపరుల. 491

ఆ. ధర్మలబ్ధమైనధనము పాతికయేని
బహుళఫలము నిచ్చు౯; బాపవృత్త్యా
ర్జితంబు కోటియైన నిష్ఫల మంద్రు
దానశాస్త్రవిధులు మానవేంద్ర ! 492

క. నృపధర్మవైశ్యధర్మము
లపాపకర్మములు; జీవనాభావము పా
లుపడిన బ్రాహ్మణునకు నర
కపాత మగు శూద్రకర్మకర్తృత్వమునన్. 493

క. రాజునకును ధర్మము శ
స్త్రాజీవిక యొఁడ; వైశ్యఁ డాపద యైనన్
రాజవర మధువు మాంసముఁ
దాజట్టి యిడంగఁ బొందు దౌర్గత్యంబున్. 494

క. జనవర కృషిఁ బశుపాలన
మున నేనియు బ్రదుకు ధర్మముగ నార్యులు శూ
ద్రునకు విధింతురు జీవన
వినాశమున వాని వృత్తి వినిహత గామిన్. 495

సీ. వినుఁ: తొల్లి ధర్మవర్తనము లసహ్యంబు
లైన దానవులు మహాగ్రహమున
నరులయం దెలసిన, నరవర! వారలు
దర్పరోషముల నధర్మవృత్తి
దగిలినఁ, గలఁగె వేదములును గతువులు;
సురలు విషణ్ణులై పురహరునకు
నంతయు నెఱిఁగింప నతఁడు త్రిశూలంబుఁ
బనుప దైత్యావిష్టభావ మడఁచె

తే. నది; మహామునుల్ మృడునిఁ బజాభిరక్ష
ణమునకై నిల్ప శ్రుతులు జన్నములుఁ దొంటి
చందుఁ జెల్లె నమరులు సంతసింప;
ననఘ! నీవును బాలింపు మట్ల ప్రజల. 496

క. అని చెప్పి తపము పెంపును
వినిపించుట కిట్టు లనియె: విద్యాధరస
న్మని దేవతాగణంబులు
వినుతతపంబు నన మహితవిభవముఁ బొందెన్. 497

చ. కమలభవుండు దాఁ దపము కల్మిన కాదె సృజించె నెల్లలో
కములను; నాదిరాజు లధికంబగు పెంపు వహించు టెల్ల ను
త్తమతప మాచరించుటన; తద్దయు సౌఖ్యకరంబు లైన భో
జ్యములును గంధమాల్యములు శయ్యలు భవ్యతపఃప్రభూతముల్. 498

తే. దారధనమిత్రపుత్రకాద్యంబు లగు ప
దార్థము లసంగమునఁ జిత్త మలఁతఁ బొంది
విసివినప్పుడు నిర్మల విపులతపము
గారణం బగు నుపశాంతి కలిమి కనఘ! 499

క. విను; లోభము సంతోషం
బును దుఃఖసుఖప్రదములు పురుషున కవి సం

జనితము లగుట తపము లే
కునికిని గలుగుటనుజూవె యుర్వీనాథా ! 500

తే. అనఘ! సుఖదుఃఖములు వచ్చినపుడు ముదమి
షాదములు లేక సంప్రా ప్తసముపభోగ
రతుఁడు నప్రాప్యవాంఛానిరాసకుండు
నగుట సారతపోరూప మండ్రు బుధులు. 501

క. వరధర్మము నర్థంబును
సరసం బగువిషయసుఖము సద్గతియుఁ దపఃపరిపాకమునన కలుగున్
నరునకుఁ దత్తద్విధా త్త నై పుణుఁ డై నన్. 502

వ. అనిన విని జనకుండు 'వర్ణంబుల యుత్కర్షాపకర్షత్వంబులకు మూలం బెయ్యది ? దానిని దాన పుత్రుండై జన్మించు నం, ద్రదియు విసంశయం బగుట నెఱింగింపవే' యనుటయుం బరాశరుం డతని కిట్లనియె : 503

తే. పద్మభవముఖబాహూరుపాద సంభ
వములు గాన భూసురరాజవైశ్య శూద్ర
భావములు తారతమ్యసంప్రా ప్తి నొందె
జననదేశగుణంబుల మనుజనాథ ! 504

క. తాన సుతుఁ డగుట దెలియం
గా నగు మును; లాత్మవీర్యకలనం బెచ్చో
నె నం జేయఁగ మునిభా
వానూనత ఋశ్యశృంగుఁ డాదిగఁ గనుటన్. 505

ఆ. అనిన జనకుఁ డిట్టులను 'వినినవియైన
వలయుఁ దెలియ వినఁగ వర్ణధర్మ
సమితిఁ గల విశేష సాధారణత్వంబు
లేర్పరించి చెప్పవే మునీంద్ర!' 506

వ. అనుటయు బరాశరుం డిట్టులనియె : 507

సీ. వినుము: ప్రతిగ్రహంబును యాజనంబును
సధ్యాపనమును ధరామరులకుఁ,
బ్రజరక్ష ణృపునకుఁ, బశుపాలనము గృషి
వాణిజ్యమును నివి వణిజులకును,
శూ దజనులకు శుశ్రూషయు శ్రుతులు వి
శేష ధర్మములుగఁ జెప్పు; సత్య
శౌచంబులును నహింసయు ననసూయయు
శ్రాద్ధంబు నతిథిపూజనము నాత్మ
తే. దారపరతయు సర్వసాధారణంబు
లనఘ! వీనను నిజవృత్తులను సమస్త
జాతులును నిహపర సౌఖ్య సంపదలకు
నాస్పదము లగు; నింద్యంబు లన్యవిధులు. 508

క. భూవర! నాకుం జూడం
గా విష్ణుఁడు దైవ; మట్లు గావున నతనిన్
భావించు టెల్లవారికిఁ
గావించును మోక్షమయసుఖము పెన్నింటన్. 509

క. అనిన విని జనకభూవిభుఁ
'డనఘ! యహింసనము లైనయవి యెయ్యవిఁ య
ప్పను లెఱుఁగఁ జెప్పవే నా'
కనుడు నతని కిట్టులనియె నమ్మని యధిపా! 510

-:జనకునకుఁ బరాశరముని వివరించిన హింసాహింసల ప్రకారము:-

సం. 12-280-12.

ఆ. శమము దమము లేమి జనులకు హింసనొ
నర్చునుఁ గాన ధరణినాథ! వినుఁ; య

హింస శమదమములు హృదయంబునకు నెప్డు
నలవడంగఁ జేత యంద్రు బుధులు. 511

వ. అని చెప్పి పెండియుం బరాశరమునీశ్వరుం డిట్లనియె : 512

క. దురమున జయము గొనుటకై
నరపతులకు వలయు హింసనం బెట్లును ద
త్పరిహరణస్థానములును
ధరణీశ్వర! కలవు సెప్పెదను విను వానిన్. 513

క. పడినం బాఱినఁ గైదువు
వడినను వాహనము వడినఁ బార్థివముఖ్యా!
పొడువఁ దగదు శత్రుని; నె
య్యెడల నహింసనముఁ బోల వే సుకృతములున్. 514

క. న్యాయమున సంగరంబుం
జేయఁగ శస్త్రాగ్ని దన్నుఁ జెందిన దానం
గాయంబు విడుచు పురుషుఁడు;
వే యేటికి మోక్షలక్ష్మివిభుఁ డగు నధిపా! 515

క. తనతోఁ దుల్యుం డైనను
మనుజాధిప యధికబలసమగ్రత్వము గ
ల్గిన నని శత్రుని వధియిం
చిన నరపతి పుణ్యలోకసిద్ధిం బొందున్. 516

వ. అని మఱియును 517

క. భూతంబులు నింద్రియసం
ఘాతము సత్త్వాదిగుణనికాయముఁ గాయం
బై తోఁచు బెఱిఁగినను ధ
ర్మేతరకృత్యములు సేయునే నరుఁ డనఘా! 518

క. జాతుఁడు మృతుఁ డగుట ధ్రువము;
భూతోల్లాసము లనిత్యములు; వినుఁ: సద్యఃపాతియగు శరీరంబున
కై తొఱఁగునే ధర్మపథము నార్యం డనఘా: 519

తే. ఉత్తరాయణమును సంగరోత్తవాది
కారణంబులుఁ గలుగు సత్కర్మపరుని
మరణమునకు; దుష్కాలంబు గరళరజ్జు
జలముఖములుఁ బాటిలు దుష్టచరితుమృతికి. 520

కి. మానవులకుఁ దలఁపఁగ న
జ్ఞానము నట్టిపగ లేకసంగత కృత్యా
ధీనుం డై రూపు సెడును
దానం గావున నుదాత్త ధర్మవిధిజ్ఞా! 521

క. మానుషజన్మము మే లతి
హీనపుజాతిని జనించె నేనియు నన్యం
బైన జననంబుకంటెను
దాన సుగతి వడయ నగుటఁ దత్త్వప్రవణా ! 522

క. దానములఁ బుణ్యతీర్థ
స్నానంబుల నతిథిపూజనంబులను ఫలా
దాననిరతుండు గాకీ
మానుష్యము గారవించు మతి నిత్యఁ దగున్. 523

వ. అనిన విని జనకజనేశ్వరుండు పరాశరమునీశ్వరునితో 'మే లెయ్యదిఃపరమ గతి యెయ్యది? కృతంబైన నెద్దానికి నాశంబు లేకుండు నెఱింగింపవే' యనవుడు నమ్మహీపతి కమ్మహాత్ముం డిట్లనియె. 524

ఆ. అరయ మే లనంగ మంచితజ్ఞానంబు
పరమగతి మహాతపంబు చేటు

లేనిక్రియ; మిట్లుగా నెఱుంగుట సర్వ
వేదవాక్య తత్త్వవిత్త్వ మనఘ! 525

వ. అని చెప్పి వెండియు. 526

క. విను: సుమతి విషయముల నం
దునికి గలిగెనేనిఁ బొందఁ డుదకంబులఁ బొం
దని బిసరుహపత్త్రిము చా
డ్పున; నది విజ్ఞానఫలము భూపవరేణ్యా ! 527

తే. అనఘ ! మూఢాత్మచిత్తంబునందు విషయ
జాల మత్యంతగాఢసంసక్తి నొందు
లక్కరసము దండాదులఁ జిక్కఁబట్టు
చందమున; దీనిఁ గనుట ప్రశాంతికరము. 528

క. ఇనరుచిఁ బాషాణము ర
శ్మినిరూఢం బైనయట్ల చిత్తము సద్భా
వనమున సదాత్మకం బగు
ననామయస్థితికి మూల మది మనుజేంద్రా ! 529

క. అరయఁ గదళీగర్భా
సారము సంసార; మిట్టిచంద మెఱిఁగినం
జేరవుజననమరణములు;
గారించుచు దీనిభంగిఁ గాసకయున్నన్. 530

క. ఒరులపనికిఁగా నిజహిత
విరహితుఁ డగునట్లుగాదె వివిధేంద్రియకా
ర్యరహితుండై యాత్మసము
ద్ధరణంబును జేయకునికి ధరణీనాథా ! 531

క. తనగృహమున నభ్యాసం
బున మెఱఁగెకు నంధుచందమున సంసారం
బునఁ దిరుగు మూఢుఁ డెఱుఁగఁడు
వినుతం బగు మోక్షపదము విమలవివేకా ! 532

క. వినుము: మృణాళంబున నం
టినరొంపి జలంబులం గడిగినను బెడఁబా
సినక్రియ విమలజ్ఞానం
బున సంసారంబు వాయుఁ బురుషు నరేంద్రా ! 533

క. నరనాయక శిశ్నోదర
పరాయణుం డగుచు నొంతు పరికింపని దు
ర్నరుఁ డెలుకఁ బిల్లి వొదివిన
పరుసున జర వొదువ ము క్రిఁ బడయఁక పోలియున్. 534

తే. ప్రవేగు పెద్దెన నోడ వారిధిఁ దరింప
లేని భంగి మనోభవాలీధవృత్తి
యగుచు నుండు జీవుండు భవాబ్ధి యుత్త
రింప లేఁ; డిది నిజము గరిష్ఠచరిత ! 535

క. పడియెడు దుఃఖము లరయం
గడుఁ బె క్కల్పములు గను సుఖంబును; వీసం
బడయఁగ నగుమే లెయ్యది
విడుప యురవు శుభము పొందు విద్యాప్రవణా ! 536

క. మిత్రులు భార్యలు భ్రాతలఁ
బుత్రులు నిజకార్యపరులు బోధము సు మ్మా
త్మత్రాణమునకు మూలము
ధాత్రీపతివర్య! యెవ్వఁ డుర్వీశుఁడు జూడన్. 537

ఆ. ధీరుఁడై యభేదదృష్టియ పాటించు
చుండు నట్టి పురుషు నొక్కమాటు
విడువ దర్కు నంశ విభవంబు చాడ్పున
బోధలక్ష్మ పెంపు భూపవర్య! 538

క. అని యిట్లు పెక్కుభంగుల
మునివరుఁడు పరాశరుం డమోఘప్రజ్ఞా
ఘనత యొలయంగఁ జెప్పిన
జనకుఁడు ముదమందె భరతసంతతివర్యా! 539

-: హంసగీత :-

సం. 12-288-1,2.

సీ. అనిన ధర్మసుతుండు హర్షమ్ము దనదు చి
తమున నిండార శాంతనవుతోడ
'దమమును సత్యంబు క్షమయును నెల్లెడ
వినుతింపఁబడు నార్యజనులచేత;
నవి యంతలెస్సలే'యనవుడు నతనికి
నతఁడిట్టులను 'విను హంసగీత;
యది యుత్తరం బగు నధివ! నీప్రశ్నంబు
నకు; దానిఁ జెప్పెద; నలినభవుఁడు

తే. పసిడిరాయంచయై కేలిపరత నొంది
తిరుగ, నొక్కెడ సాధ్య లద్దేవుఁ గాంచి
'పక్షివర! నీవు విద్యలఁ బ్రౌఢుఁ డగుట
సెప్పఁగా విందు మాశ్రయించెదము నిన్ను. 540

వ. ఏము సాధ్యుల' మని పలికి సవినయంబుగా నిట్లనిరి. 541

తే. ఉత్తమం బెద్ది నీచిత్త మొలయు నెందుఁ;
బురుషుఁ డెయ్యది గల్గినఁ బొందు నఖిల

కర్మబంధమోక్షము; నట్టిధర్మ మెఱుఁగఁ
జెప్పవే : కరుణాలత చిగురులొ త్త. 542

వ. అని యడిగిన నాదరించి యయ్యంచ వారల కిట్లనియె. 543

క. క్షమయును దమమును సత్యము
నమేయమహిమాస్పదంబు లన విందుము; ధ
ర్మములం దెల్లను నభివ
ర్ణ్యము లవి హృద్గ్రంథిభేదన ప్రౌఢంబుల్. 544

వ. అని చెప్పి వెండియు 545

క. పరమధర్మభేదులును నయ
విరహితములు ధర్మకార్యవిముఖంబులు సి
ష్టురములు నగు మాటలు స
త్పురుషుం డాడఁ డవి సత్యములు గాకునికిన్. 546

క. జనములు దను నవమానిం
చిన నిందించినను మాఱు సేయక సైరిం
చిన శాంతాత్ముఁడు వారల
మును చేసిన యట్టిసుకృతముల నాఁచికొనున్. 547

క. కీ డాడిన మేలాడుచుఁ
దాడన మొనరించిరేని దరహాసముతో
నీడంబోదును గ్రోధో
ద్రేక వికారము దెప్పఁడును మదీయ హృదయమున్. 548

తే. వేదసారంబు సత్యంబు; వినుఁడు, సత్య
సారమూ ర్తి దమము; దమసార మనఘు
లార! మోక్ష; మీపరిపాటి గారవమున
నాదరించు జనంబుల కంచు ముక్తి. 549

క. దమమునఁ గర్మేంద్రియముల
శమియింపఁగ జేత యది నిసర్గగుణంబై
రమియించు నెప్పురుషుచి
త్తము దాన నతండు సర్వధర్మకరుఁ డగున్. 550

క. ఆ తెఱఁ గఘములఁ బాచును
పాతకములు వాయ మొగులు వాసిన సంప్ర
ద్యోతితుఁ డగు నమృతాంశుని
భాతి వెలుఁగు నాత్మమోక్షపద మది సుండీ ! 551

క. మనసును వాక్కును రక్షం
బనుపడు నెవ్వానికి ప్రతితపస్త్యాగము లా
తనిచేతిలోని వగు నని
మునిజనములచేత విందుము నిరంతరమున్. 552

క. పలుకు వడి నతనిఁ బాపం
బులు విడుచుం: బలికి నతనిఁ బొందును పాపం
బులు; నొరుపాపము దనపై
నొలయింపఁగ నేల? నింద యుడిగినఁ గాదే ! 553

క. కుపితుఁ డగువాని వ్రతమును
జపమును దేవార్చనంబు శ్రాద్ధక్రియయుం
దపమును దానము యజనము
నపగతములుగాఁగఁ జేయు నంతకుఁ దలుకన్. 554

చ. పలుకక యుండుకంటెఁ దగఁ బల్కుట మేలు; వినుండు, సత్యముం
బలుకుట ధర్మమార్గమునఁ బల్కుట సర్వజనప్రియంబుగాఁ
బలుకుట యోలి నెక్కుడగు భంగులు; వీని నెఱింగి యొండుమైఁ
బలుకక నాల్గుచందములఁ బల్కఁగ మెత్తురు వాని దేవతల్. 555

క. సత్యాక్షనూదమంబులు
సిత్యపదంబునకు నెక్కఁనిచ్చెన లవి సం
గత్యనుగతములు సత్యాం
గత్యం బటుగాన ముఖ్యకార్యము సుండీ ! 556

వ. అని సత్యాక్షమూదమప్రకార విషంబులైన వాక్యంబులు సెప్పిన విని కృతా
ర్థులై సాధ్యలు సంతోషించి వెండియు హంసంబున కిట్లనిరి. 557

క. ఏమిట లోకం బావృత ?
మేమిటఁ దావెలుఁగకుండు ? నేమిట మిత్రి
స్తోమంబు విడుచుఁ దనుఁ గా
దేమిట మోక్షంబు ? మాకు నెటిఁగింపు దయన్. 558

వ. అనుటయు. 559

ఉ. ఆనతవైరి యిట్టులను హంసము వారలతోడ లోక మ
జ్ఞానముచేత నావృతము; సంభృత మత్సరుఁడైన వేఱగుం
దాను ప్రకాశసంపదకఁ దన్ విడుచుం దెగి మిత్రికోటితో
భానుగతిన్ విమోక్షపద మందదు సంగముకల్మి నెమ్మెయిన్. 560

వ. అనిన వారు మరాళంబున కిట్లనిరి. 561

క. ఎవ్వఁడు రమించు నొక్కఁడ ?
యెవ్వఁడు పెక్కఁండ్రఁ బ్రీతి నెసఁగఁగఁ జేయున్ ?
నివ్వటిలు నెవ్వనికి బల?
మెవ్వఁడు కలహంబు వెంట కెంతయుఁ దొలఁగున్ ? 562

వ. అని యడిగిన హంస యిట్లనియె: 563

క. ప్రాజ్ఞుఁడు రమించు నొక్కఁడ;
ప్రాజ్ఞుఁడు పెక్కఁడ్రఁ బ్రీతిఁ బరఁగఁగఁ జేయుం;

బ్రాజ్ఞుఁడు బలవంతుం డగుఁ;
బ్రాజ్ఞుఁడు కలహమునఁ దొట్టుపడక తొలంగున్. 564

వ. అని చెప్పిన రాయంచతో సాధ్యు లిట్లనిరి: 565

తే. విప్రుఁ డేమిట దేవత్వవిభవ మొందు?
నేమికతమున సాధుత్వ మెసక మెసఁగు?
నతని కెద్దియ సాధుత్వ మావహించు?
మానుషుం డగు నెద్దాన మహితమూ ర్తి! 566

చ. అనుటయు హంస మిట్టులను నధ్యయనంబున దేవభావముం
గను; వ్రతవృ త్తి సాధు వనఁగాఁ జరియించు; జనం బసాధునాఁ
జనుఁ బరివాదశీలమున; శౌచవిహీనత మృత్యుభీతి వొం
దిన మదిలోన నెక్కొనిన దీనత విప్రుఁడు మానుషుం డగున్. 567

క. ఆని పలికి సాధ్యులకుఁ దన
తనువిభవము సూపి సమ్మదంబున వారల్
దనుఁ గొలువ నిజనివాసం
బున కేఁగె నజుండు నగవు మొగమున నెఱయన్. 568

వ. అని చెప్పి భీష్ముండు. 569

ఉ. సాదరవృ త్తి సాధ్యులఁ బ్రహర్షసమేతులఁ జేయఁబూని సం
వాదము సేసె దేవమునివంద్యుఁ డజుం; డిది సేయు నాయురు
త్పాదన మిచ్చు సంతతశుభంబులు గీ ర్తి యొసర్చుఁ బుత్రపౌ
త్రోదయ మావహించు భరతో త్తమ! తన్ వినినం బఠించినన్. 570

వ. అనిన విని ధర్మనందనుండు శంతనునందనుతో 'సాంఖ్యయోగంబుల తార
తమ్యంబులుం దత్స్వరూపంబులు నెఱింగింపవే' యనుటయు నమ్మహీపతికి
నమ్మహాత్ముం డిట్లనియె: 571

-: భీష్ముఁడు ధర్మజునకు యోగతంత్ర ప్రకారము చెప్పుట :-

సం. 12-286-2.

క. తెలుపుదురు సాంఖ్యులును యో
గులుఁ దమతమ తెఱఁగు మేలగుట కారణసం
కలితముగ; నాకుఁ జూడఁగ
నలఘుగుణా ! యొక్కరూప యయ్యురుదెఱఁగున్. 572

క. ప్రత్యక్షహేతువాదులు
సత్యపరాయోగపరులు సాంఖ్యులు; శాస్త్ర
ర్థాత్యంత నైపుణులు స
ద్ధత్యాకలనంబు సరియు తదుభయమునకున్. 573

క. ఆతెరువులు రెంటికి వే
ఱై తోఁచుట దర్శనంబునంద నరేంద్రా !
భూతహితము సద్ధృతచ
ర్యాతిచయము శౌచమును నియతకృత్యంబుల్. 574

వ. అనిన విని యుధిష్ఠిరుండు 'భూతదయయును సద్ధృతధారణంబును శౌచం
బును దుల్యంబులై సాంఖ్యయోగంబులకు దర్శనంబు వేఱగుట యెట్లు వివ
రింపవే' యనుటయు నన్నరదేవునకు దేవవ్రతుం డిట్లనియె : 575

క. యోగులకు యోగబలమున
రాగము మోహంబునుం జిరస్నేహముఁ గా
మాగమముఁ గ్రోధము గుణా
యోగము వరుసఁ బెడఁబాప నున్నతి యొలయున్. 576

చ. ఘనరుషమున్ సముద్ధతమృగంబును జాలము వ్రచ్చి వాగురా
వినిహతిఁ జేసి యిష్టపదవిం జనుచాడ్పున యోగతంత్రరో
ధన మగు లోభజాతదురితవ్రజముం బెడఁబాచి సత్పథం
బునఁ జరియించు యోగి సుఖమూర్తిత సుస్థితగా వహించుచున్. 577

ఆ. యోగబలము లేని యొకభంగి యోగి బల్
ద్రోపు లేని మీను నేపులేని
మృగము వలయు నురియుఁ దెగిపోవ నుఱుకంగ
లేనియట్ల భవనములోన నడఁగు. 578

ఆ. అల్పమైన యగ్ని యడఁగు నింధనములు
మీఁదవై వ బలము మిగులలేని
యోగమట్ల తనకు నురునట్టిదానన
సాద మొందు సకలజనమనోజ్ఞ ! 579

ఆ. ఇద్ధమైన యగ్ని యింధనసంపద
నతిశయిల్లు నట్లు లధికబలస
మగ్రసారయోగమహిమయు నంతంత
కగ్గలించు వ్రతము లగ్గలింప. 580

క. స్రోతోవేగము పటుగతి
వీతబలుం దిగుచునట్ల విషయము లీడ్చుం
జేతోబలసంభృత యో
గాతిశయుఁడు గానివాని నంచితచరితా ! 581

క. నదిరయము వారణేంద్రుఁడు
గుదియించిన యట్లపోలెఁ గురువర! ధైర్యా
స్పదమగు విషయోల్లాసమఁ
గుదియించును యోగసిద్ధి గురుహృద్బలుఁడున్. 582

తే. కుపితుఁ డగు నంతకుండును గ్రోధఘోర
మృత్యువునునై న నియమ సమృద్ధ యోగ
బలుని దెస వోపఁజాల; రప్రతిహతముగ
నెందుఁ జరియించు నతఁడు నరేంద్రముఖ్య ! 583

క. భోగంబుఁ దపముఁ బొరిఁబొరి
రాగవిరాగతల హృదయరంగమునకుఁ గే

లీగతులఁ దెచ్చి యార్చుచు
యోగి యనుభవించుఁ దగిలియుండం డెందున్. 584

క. జగతీపర యోగస్థూ
లగతులు సెప్పితి; వినం గలదు సూక్ష్మవిధం
బగు మార్గప్రచయము; ద
న్నిగదన మవధానమున వినిన మతి దేఱున్. 585

క. ఏమిగతి లక్ష్యభేదముఁ
దా మేలుగఁ జేయు ధన్వి తత్పరుఁడై యో
గామలచిత్తుఁడు మోక్షం
బామెయి సాధించువాఁ డహంకృతిదూరా ! 586

ఆ. నేతికుండ మోచి యేతెలివున సోబ
నాలుప్రాఁకు నైపుణంబు గలుగు
పురుషునట్ల యోగపరిణతుండును నాత్మ
నేమఱక విముక్తి కెక్కవలయు. 587

తే. రథికునకుఁ గలమరికి సారథియుఁ గర్ణ
ధారుఁడునుబోలె నాత్మకుఁ దాను సుపథ
వర్తనైకవిధాయి గావలయు యోగ
ధారణానిశ్చలుం డగు ధీరుఁ డధిప ! 588

క. శిరమును నాభియు హృదయము
నురమును గర్ణములుఁ బార్శ్వయుగళము నాత్మా
దరణీయస్థానము ల
య్యిరవులఁ గను యోగి యాత్మ నిభపురనాథా ! 589

వ. అనిన నజాతశత్రుం డాపగాపుత్రునితో నిట్లనియె : 590

తే. యోగి యెట్టియాహారంబు లుడుగవలయు ?
నాతఁ డెబ్బంగి భోజ్యంబు లనుభవించి
బలము వడయు వాఁ ? డిది నాకుఁ దెలియఁజెప్ప
వే జన స్తవనీయ సమిద్ధబుద్ధి! 591

సీ. అనవుడు నతనితో నతఁడు 'సుస్నిగ్ధంబు
లైన యాహారముల్ మానువాఁడు
యోగి; నీరసముల నుదకంబులను జాల
నాఁకలివుచ్చుచు, నవియు నుదర
మధికపూర్ణం బగునట్లుగాఁ గొనక వ
ర్తించుట బలము వర్ధింపఁజేయు ;'
ననిచెప్పి వెండియు ననుఁ 'గామమ ను గ్రోధ
మును నిద్రయును దృష్ణయును భయంబు

తే. రతియు నరతియుఁ బవనంబు గతియు నుడిపి
ధారణానిశ్చలుం డయి తన్నుఁ దాన
కనుచు నుండెడు యోగి దుర్గ్రహపుఁజోటు
వెడల నరిగి సుఖస్థానవిభవ మొందు. 592

క. జనవర యసిధారా వ్రత
మనఁ దగియెడు ధారణానియతి పనుపడు నె
వ్వనిచి త్తంబున నాయో
గ నిరూఢుల కరిదియైన కార్యముఁ గలదే ? 593

క. యోగనిరూఢుఁడు సంగ
త్యాగానందైకరతుఁ; డతనికి జననసం
యోగము మృతిదైన్యంబును
భోగాభోగ సుఖదుఃఖములు లే వధిపా ! 594

క. అతనికి సరిత్సముద్ర
క్షితి భృద్ద్వీపములు గేలికిం బట్టులు ; దా

మతిఁ దలఁచెనేనిఁ బరిశాం
తత నున్నను గుడియు గుహయుఁ దగు మందిరముల్. 595

క. విముఖుం డగుటయుఁ గీళులు
దమయంతన చెందు జనులఁ దా వారలకున్ ;
సుముఖుం డగుటయు శుభములు
సమాకూరును శివునియట్ల చరితము లెల్లన్. 596

వ. అని చెప్పి వెండియు. 597

తే. యోగతంత్రంబు సకల శాస్త్రోచితంబు ;
విను, విశేషించి లోకైకవిభుఁడు సెప్పె ;
దీని నారాయణుఁడు మునిమాననీయ
మిది మనంబునఁ దెలిసికొ మ్మిద్ధచరిత ! 598

వ. అనిన విని ధర్మతనయుండు 'యోగతంత్రప్రకారంబు భవత్ప్రసాదంబునం
బ్రబుద్ధంబయ్యె; సాంఖ్యస్వరూపం బెట్టిందిఁ యెఱిగింపవే' యని యడిగిన
నతనికి దేవవ్రతుం డిట్లనుఁ : గపిలాదిమహామునిదర్శితంబైన మార్గంబున
వివరించెద : 599

-: భీష్ముఁడు ధర్మజునకు సాంఖ్యస్వరూప నిరూపణంబు సేయుట :-

సీ. వినుము : దృఢజ్ఞానమున విషయంబుల
భంగి లెస్సగ నారయంగ వలయు
ననియుఁ దిర్యఙ్మనుష్యామరపితృసిద్ధ
గరుడ గంధర్వ కిన్నరుల యందు
వేఱుచందంబులై విలసిల్లు శ్రుతివాక్య
దృష్టంబులగు దానఁ దెలియ నరయు

పరిచయంబున భేద పరభోధ మేమిటి
కనరాదు తోఁచిన యప్పు డవియు

తే. దురితకరముల యనివానిఁ దొడరకుండ
వలదె; లెస్సగ నెఱిఁగినవచ్చుఁ దొలఁగ
నేమఱమి దక్క నొండొకం డేల చోర
జనులఁ జిట్టంగ నడుచుట కనఘచరిత ! 600

చ. తలఁపఁగ నాయు వింతియ కదా యని సౌఖ్యము దుఃఖముం బొరిం
గలుగవె కాలవృత్తినని కర్మము లిట్లని వేదచోదనం
బుల బహుభంగు లిట్టి వని బుద్ధికి సత్త్వరజ స్తమోగుణం
బులకుఁ బ్రవర్తనంబు లివి పొమ్మని కాంచుట చాల మేలగున్. 601

సీ. ఇంద్రియార్థంబుల నేనింటి నైదింద్రి
యములును, గాష్ఠంబునందు వహ్ని,
పవనుండు బయలను, బావకునందుఁ దో
యములును, భూమి దోయముల, బలము
గౌశికునందును, గ్రాంతి యుపేంద్రుని
యందును, నర్థంబునందు లోభ
మును; దమస్సున బుద్ధియును, రజస్సునఁ దమ
స్సును, సత్త్వమున రజస్సును గరంబు

ఆ. దగులు; సత్త్వ మాత్మఁ దగులు; నాత్మండు నా
రాయణుఁడు మహేశుఁ డనఁగఁ బరగు;
పరముఁ దగులు నతఁడు; పరము మోక్షంబునఁ
దగులు; మోక్ష మెందుఁ దగుల దధిప ! 602

క. ప్రకృతి బదాఱువికారము
లకు నాశ్రమ; మాత్మ కది నెలవు; వినుమాత్మం
డకుటిలతేజోరూపతఁ
బ్రకృతియు వికృతియును గాక ప్రస్ఫురితుఁ డగున్. 603

తే. ఆత్మునకు రెండురూపంబు లనఘ ! కలవు ;
విషయ సంగతి నొక్కటి విస్తరిల్లుఁ ;
దదుదుపభోగంబు లేక మధ్యస్థభావ
మొంది యొక్కఁడు వెలుఁగుచునుండుఁ జూవె ! 604

క. పవనం బేకము; ప్రాణా
దివిభేదము లైదు; విన, తదీయంబులు వా
నివిధంబు లరయ నిశ్చల
మవుఁడి యాసుక్రత మంతరాత్మునిఁ జూపున్. 605

క. విను: గర్భవాసదుఃఖం
బును జన్మవ్యధయు బాల్యము విమూఢత్వం
బును రాగక్లేశజరా
జనిత కృపణతలును జూపు సంగముఁ బాపున్. 606

ఉ. చెందుచునుండుఁ బుణ్యములు సేసి సురత్వము, మధ్యకర్ముఁడై
యొందు నరత్వమున్, దురితయోగమునం బశుకీటభావముం
బొందు, సుఖంబు దుఃఖమును బొందఁగ జీవుఁడు దీనిభేదశ
క్తిం దెలియంగ నేర్చినమతిం గలయాతఁడు గోరు మోక్షమున్. 607

క. క్షయవృద్ధులఁ జంద్రుఁడు న
బ్ధియు లోనుఁగ బొందుచుండఁ దెలియఁడు బంధు
క్షయమునకు వగచు నజ్ఞుం
డయమహితా! దీని నెఱుఁగు టమలతఁ దెచ్చున్. 608

క. తనదేహము దోషములం
గని వేవురలో నొకండు గలుగు విముక్తిం
గనుపని కుద్యోగించుట
కనఘా ! వెక్కండ్రు లే రహంకృతి కతనన్. 609

వ. అనిన విని యుధిష్ఠిరుండు 'దేహదోషంబు లెవ్వి యెఱింగింపవే' యనుటయు
ననిమిషనదీనందనుం డతని కిట్లనియె: 610

క. విను; కామముఁ గ్రోధము భయ
మును నిద్రయు నిశ్వసనము భూవర! దేహం
బునఁ గలదోషము; లీయై
దును బాపెడి తెఱఁగు సెప్పుదుం దెలియంగన్. 611

సీ. క్షమ క్రోధమునకు, సంకల్పవర్జనము గా
మమునకు, నప్రమాదము భయంబు
నకు, సత్యసంసేవనము నిద్రకును, లఘు
భోజిత నిశ్వాసమునకు వైరు;
అని చెప్పి వెండియు ననుననేకము లగు
దోషముల్ దొలఁగంగఁ ద్రోచు వెరవు
లును బెక్కు; లవి గనికొను వివేకము గల
పురుషుండు దన్మార్గపరిచయమున

తే. విష్ణుమాయను దోఁచు నీవిష్టపములు
భిత్తిచిత్రంబు విధంబున ఫేనభంగి
బుద్బుదాకృతి గాఁగను బుధుఁడు దీని
సరకు సేయక మోక్షంబుతెరువు వెదకు. 612

-: ఆత్మ పరమపదంబుఁ బ్రాపించెడు ప్రకారము :-

సం. 12-290-80,81.

వ. ఇది సాంఖ్యప్రకారంబు; బహిస్స్పర్శంబులు దపోదండంబునం దొలంగన్
జడిసి యానపాత్రరూపంబుగా దీని నవలంబించిన యార్యుండు ప్రజ్ఞాకర్ణ
ధార సామర్థ్యంబున దుఃఖోదంబును వ్యాధిమృత్యుమహాగ్రాహంబును భయో
రగంబును హింసా వేగంబును రాగపంకంబును దృష్ణావర్తంబును నానా
ప్రీతిరత్నంబును సత్యతీరంబును నగు సంసారసాగరంబు నుత్తరించు;

నాసుకృతి నట సూర్యుండు దనరశ్ముల వహించి నడపు; పద్మతంతు సన్నిభం బై న మార్గంబు ప్రవేశించి చనంజన సూక్ష్ముండును శీతలుండును సుగంధియు సుఖస్పర్శుండును స ప్తమారుతశ్రేష్ఠుండును నగు పవనుం డెమరొ్క-ని నభః పరమగతిం జేర్చు; నభంబు తమఃపరమగతిని, తమస్సు రజఃపరమగతిని, రజస్సు స త్త్వ పరమగతిని, స త్త్వంబు నారాయణుని, నారాయణుండు పరమంబునం జేర్ప నందుం గలసి తన్మ యుండై యమృతత్వనిత్యం డగు,నని చెప్పిన విని పాండ వాగ్రజుం 'డట్ల మృత స్వరూపశాశ్వతుం డగు నమ్మహాత్ముండు దనపూర్వవృ త్తంబు దలఁ చునో తలంపకుండునో? దాని నిశ్చయం బతిగహనంబు; మోక్షంబు దలంచి పరమజ్ఞానమగ్నుం డగుటం బురుషున కెద్ది దశయో యనువితర్క-ంబున నది ప్రవృ త్తిధర్మంబునకంటె మే లనరాకున్నది; యీ రెండు దెఱంగులుం దెలుప నీవ కాక యీలోకంబున నొరులు గలరే?' యనుటయు నజ్జనపతికి జాహ్నవీ నందనుం డిట్లనియె: 613

క. అడిగితి లెస్సఁగఁ; బ్రశ్నము
గడుసంకట; మెట్టియెఱుక గలవారలు నె
ప్పుడు సంశయించుచో టిది;
దడయక యు త్తరము సెప్పెదం దేటపడన్. 614

వ. కపిలదర్శనవిదు లగు మునీంద్రుల పరమమతం బిది; యవహితుండవై యాక ర్ణింపుము. 615

సీ. పురుషుని నింద్రియంబు లెఱుఁగ వవి మన
స్సనులు గావున మనస్సంగమమునఁ
గనువాని నతఁడు ము క్తత్వంబు లేనియ
ప్పుడుఁ గల్గినను నది పురుషునందు
సమమ నిర్విషభుజంగము లట్ల నిశ్చేష్ట
నున్న యింద్రియములఁ గన్నఁ గాన
కున్నను నేమి? యయ్యుదిత విజ్ఞానామృ
తస్వరూపునకు నాతండు దొఱఁగఁ

తే. గాష్ఠకుడ్య కుసూలాదికముల చంద
మొందు; నట్లుగాకయు నింద్రియోత్కరంబు
శరధి ఫేననిభం బయి విరియు నవ్వి
భూతి యీశ్వరు తెఱఁ గాత్మ బొందకున్నె ? 616

క. వినుఁ మింద్రియ సహితముగా
మనుజాధిపఁ బోధపూరమగ్నత్వము గ
ల్గిననుం దత్సూక్ష్మగతులఁ
గనుఁ బురుషుఁడు; గనియు నిర్వికారత నుండున్ 617

తే. భూతములను గుణంబుల బుద్ధి మనసు
నడఁచికొని జీవుఁ డొందు నారాయణునిఁ ద
దీయమాహాత్మ్యమున మాననీయ పరమ
పదము గనుఁ; గాన నిష్పుణ్యాపాపుఁ డతఁడు. 618

క. పునరావర్తనరహితుం
డనఘా! పరమాత్ముఁ జెందినట్టి పురుషుఁ; డ
వ్వినుతావస్థను మోక్షం
బని చెప్పుదు; రంతకంటె నధికము గలదే? 619

వ. అని చెప్పి వెండియు, 620

క. గురునివచనంబు తెఱఁగునఁ
బరమార్థ నిరూపణంబు పని నియతిం వ
త్పరుఁడై నడపం జాలిన
పురుషునిఁ దడయక ప్రశాంతి వొందు నరేంద్రా ! 621

చ. జనవర! సాంఖ్య మిట్టిది; ప్రజాపతి పూజ్యము; బ్రహ్మభావభా
జనత ఘటింప దీని సరి సమ్యగుపాయము లెందు లేవు; నె
మ్మనమున సంశయింపక సమాహిత చిత్తత దీని నూఁదు; ని
స్తనుఁ డగు నమ్మహేశునకుఁ దాఁ దను; విం కిట వేయునేటికిన్ 622

తే. వేద శాస్త్ర పురాణసంవేదితంబు
లైన బహువిధ సంపరిజ్ఞానములకు
నెల్ల నిది సేరుగడసూవె యేఱులకు స
ముద్రమును బోలె నుపశాంతి భద్రచిత్త! 623

వ. యోగ్యులును సాంఖ్యులును జూచు వెరవు లాకర్ణించితి కాదె; యిది యి
ట్లగుటం జేసి దర్శనభేదంబు గల దంటి; నదియును నల్పాంతరం; బదియు
నుంగాక. 624

ఆ. యోగి చూచుభంగి నుర్వీశ! సాంఖ్యుఁడుఁ
జూచు; సాంఖ్యుఁ డరయు చొప్పు యోగి
వరుఁడు నరయుఁ; గాన వారిద్దఱును నొక
తెరువు వార యంద్రు పరమమునులు. 625

క. విను, సాంఖ్యమ్మును యోగము
నను పేళ్లుఁ గాని, దీనియందదియును దా
న నిదియుఁ దోఁచుచు నుండుం;
గను దత్త్వవిచారి యొకఁడ కానీ రెంటిన్. 626

క. ఈతెరువునఁ జరియించుచు
నేతెఱఁగునైనఁ దప్పెనేనియుఁ బురుషుం
డాతత నాకసుఖము గనుఁ;
దోఁతెంచును మగుడ సద్బుధుల వంశమునన్. 627

ఆ. మఱియు నిత్తెఱంగు మనసున నెలసిన
వినుతమోక్షలక్ష్మివిభుతఁ గాంచు;
నిట్టితెరువు సూప నెవ్వరి కలవి నా
రాయణునక కాక యమలచరిత! 628

వ. నారాయణప్రణీతంబై యక్షరప్రదర్శకంబైన యిత్తెఱంగుఁ జిత్తంబున
నలవరింపు మని దేవవ్రతుండు ధర్మనందనునకుం జెప్పెనని యిట్లు వైశంపా

యనుండు జనమేజయునకుం జెప్పిన; నట మీద వర్తించిన విశిష్టసల్లాపంబులు
సెప్పవే' యని యడుగుటయు 629

శా. లీలాస్వీకృతచక్రశూల ! వినతాశీరక్షణాలోలః దు
శ్శీల స్వాంత విదూరః వేదజలదశ్రేణీ మయూరాః సమి
త్కాలీఖండితదైత్య నిర్జరగణ క్షేమ క్రియా నిత్య ని
స్త్రైలోక్యత్వనిరంజనాగ్రవిహృతీః సంస్థాపకవ్యాహృతీ! 630

క. సురమకుటఘటితరత్న
స్ఫురితచరణపింఛదామ భుజగాభరణా !
కరుణామయదివ్యాంతః
కరణ జరామరణ నోదకపదస్మరణా ! 631

మాలిని. జపయజననిష్ఠావ్యా! సంగనిర్ముక్తభావ్యా !
విపులదురితభేదిః విశ్వలోకప్రమోదీః
యపరిమితవిభూతీ! యప్రమాణస్వరీతీ?
యుపనిషదవగమ్యాః యోగభావ్యైకరమ్యా! 632

గద్యము:

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధన
విరాజి తిక్కనసోమయాజి ప్రణీతం బైన శ్రీ మహాభార
తంబున శాంతిపర్వంబునందు బంచమాశ్వాసము.

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిపర్వము -- షష్ఠాశ్వాసము

-: o :-

శ్రీ సంధానప్రౌఢ ద
యాసంభృత భక్తమోద! యఖిలజగద్ర
క్షా సక్తి వినోద! శమా
భ్యాస నిరతనిర్వికేద! హరిహరనాథా! 1

-: భీష్ముని ధర్మజుండు ప్రశసించి యత్తర త్తరంబుల నడుగుట:-

సం. 12-291-1.

వ. దేవా వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె: నట్లు యోగసాంఖ్యవిదు లక్షరంబు నొంది యానందస్వరూపు లగుదు రని చెప్పిన విని, ధర్మతనయుండు దేవవ్రతునితో 'నీవు పరమజ్ఞాననిధి వని వేదసంవేదు లగువిప్రులు సెప్ప నప్పలుకులు నిన్ను సాంఖ్యయోగప్రవీణు లయినయతులును మునిపతులును వర్ణింప నవ్వచనంబుల నాకర్ణించుచుం బ్రమోదంబునం బొందుచుండుదుము; దక్షిణాయనశేషదినంబు లింక నల్పంబు; లర్క్కండు మరలంబడిన(బరమగతిం బ్రాపించెదవు; మఱి మే మెవ్వరిచేత వినువార ము? కురువంశంబునకుం బ్రజ్ఞా మృత ప్రదీపితం బగు దీపంబుగావె! భవత్తేజంబు నాశ్రయించెద' మని తన వారలం గలపికొని పలికి 'నీవు నిర్దేశించిన యక్షరం బనునది యెట్టిది! క్షరం బెయ్యది? యెఱింగింపవే' యనుటయు నతండు' వసిష్ఠజనక సంవాదంబనం బరగు విశిష్టేతిహాసంబు గలదు; దాన నీయడిగిన యవియును మఱియు

నెఱుంగవలయునట్టివి యనేకార్థంబులును దెలివిపడు విను మని సుప్రసాద
భరితుండై. 2

సీ. అనఘ! సుఖాసీనుఁ డైన వసిష్ఠసం
యమిఁ గాంచి భక్తిఁ బాదముల కెఱిఁగి
జనక భూనాథుండు వినయంబుతోడ ను
పాసించి 'మునివర! యక్షరం బ
నాది శివం బన నపునరావృత్తిసి
ద్ధిద మగుచుండు నెయ్యది యెఱుంగఁ
జెప్పవే' యనుడు నాశ్రితవత్సలుం డగు
నమ్మహాత్ముఁడు దెలియంగఁ జెప్పె;

తే. 'నద్దయాళుని చెప్పిన యత్తెఱంగు
ప్రస్ఫుటంబుగఁ జెప్పెదఁ బాండవాగ్ర
జన్మ! నీ' కని వలికి యజ్ఞాహ్నవీత
నూఁడు డిట్లను నాననాంభోజ మలర. 3

—: వసిష్ఠ జనక రాజ సంవాద ప్రకారము :-
సం. 12-291-7.

వ. జనకజనేశ్వరు బోధించుటకై వసిషమునీశ్వరుం డిట్లనియె: 4

క. నయనముఖపాణిపాదము
లయమహితా! యెందుఁ గలిగి యాద్యంతపరి
క్షయవృద్ధిరహితమై ని
ర్ద్వయ మగుతత్త్వంబు నక్షరం బండ్రు బుధుల్. 5

క. క్షర మండ్రు దానివలనను
క్షరియించిన తత్త్వములను జనవత్సల! య
య్యిరువదినాల్గింటిని దర
తరమ విభాగించి చెప్పెదం దెలియంగన్. 6

తే. అక్షరము విక్రియాశబలాత్మకత్వ
మొందు; నవ్విక్రియకును బే ళ్లొలసెఁ బ్రకృతి
యనఁ బ్రధానంబు నాఁగ నవ్యక్త మనఁగ;
దానఁ బుట్టు మహన్నామతత్త్వ మనఁగ: 7

తే. విను, మహంకార మాతత్త్వమున జనించు;
దాన భూతపంచకమును దద్గుణంబు
లైన శబ్దాదివిషయంబు లైదు నింద్రి
యములుఁ బదియును మనసును నావహిల్లు. 8

క. క్షర మయ్యీరువదినాలుగు;
నరనాథ! యక్షరంబునకు నెయ్యోడలన్
క్షరభానము లే; దయ్యా
క్షరము విలాసములు సూవె క్షరతత్త్వమ్ముల్. 9

వ. ఈచతుర్వింశతి తత్త్వంబులును విజ్ఞానగోచరంబులు; పంచవింశతితమంబై
యక్షరం బనం బరగు నిప్పరమతత్త్వంబు వినుఁ; మవిజ్ఞేయం బవ్యయం బక
లంకం బనామయం బమృతంబు. 10

క. జననాథ! యక్షరం బెం
దును గ్రీడఁ జరించుఁ; ద్రిగుణదోహలపరమై
తనకుఁ బ్రబోధము లేకు
న్నను నానాయోనిగతజననము ల వెంటన్. 11

క. విను, సత్త్వరజస్తమముల
యనుసరణమువలన వివిధ మగు యోనిగణం
బున నెలసినయాతత్త్వము
దనుఁ జూడఁగలేక యవియ తా నని యుండున్. 12

ఉ. సత్త్వరజస్తమోగుణవశస్థితి నక్షర మర్థ్వధర్మసం
గిత్వము మధ్యకర్మతయుఁ గిల్బిషకృత్యము నొంది యొంది వి

వ్యక్త్వానరత్వగోమృగ ఖగాదిక తిర్యగనేక హీనజం
తు త్వములన్ సుఖంబులును దుఃఖములున్ నరకంబులుం గనున్. 13

క. జనవర! శుక్లము లోహిత
మును గృష్ణము నై న వర్ణముల నక్షర మొం
దును సత్త్వరజ స్తమముల
యనుసారంబున నవర్ణమయ్యు వికృతమై. 14

క. అగుణం బయ్యును నిమ్మొయిఁ
బ్రగుణతఁ బ్రాపించు నక్షర మహంకార
స్థగుణం బూఁదిన విడిచినఁ
దెగు నన్నియు నిర్వికార దీప్తంబు నగున్. 15

వ. అని చెప్పి వెండియు. 16

చ. వ్రతువులఁ దీర్థయాత్రలను రాత్ర్యశనంబుల భూమిశయ్యలన్
వ్రతపరినిష్ఠలన్ జడలు వల్కలముల్ వివిధంపుదండముల్
సతతముఁ దాల్చుటన్ వపువుసంకటపాటున బెట్టు నాద్య మ
చ్యుత మమలంబు దాను దమఁ జూడక యక్షర మప్రబుద్ధమై. 17

క. అమృతము నభవము నజరము
నమలము నగు తన్ను మృతము నాహితభవమున్
సమధికజరమును మలసహి
తముగా నక్షరము మమతఁ దలఁచు నరేంద్రా! 18

ఆ. తనకుఁ దాన బంధ మొనరించుకొనియెడు
పొత్తినూలికాయపురువుభంగి
నగుణమయ్యు సగుణతావాప్తి బొందు న
క్షరము ప్రకృతిగుఁ గు సంక్రమించి. 19

ఆ. అమలవాయు సేవనము నిర్మలత్వంబు
గలుగఁగాఁ బదాఱుకళలఁ బూర్ణుఁ

డగు సుధాంశుమాడ్కి నక్షర మమలినా
ఖండశాంతిబోధఘనత వెలుఁగు. 20

వ. అనిన విని జనకుం డమ్మునీశ్వరున కిట్లనియె: 21

క. వనితకుఁ బురుషునకుం దన
తనయంతన రూపొకం డొదవఁజేయఁగ వి
న్ననువు గలుగ దొండొరువుల
నెనయుటఁగాని శ్రుతిమతము నిట్ల మహాత్మా! 22

క. వనితగుణంబులు చర్మం
బును మాంసము శోణితంబుఁ బురుషగుణతతిన్
విను మజ్ఞానిస్నాయువు
లనఘతసోవిభవ! యిట్ల యని శ్రుతి సెప్పున్. 23

వ. అది తిర్యఙ్మనుష్యాదులైన సకలయోనులయందును జన్యంబు లావహిల్లెడి
తెఱంగు. 24

క. నరనారీసంబంధము
వరుసగదా పురుషునకును ప్రకృతికి ననో
న్యరమణ; మది సర్వజనన
కర; మిట్టులు శ్రుతులు సెప్పుఁ గారుణ్యనిధీ! 25

క. వినుము, ప్రకృతి పురుషుల భం
గి నిరూపింపంగ ముక్తికిని మార్గంబుం
గను వెరవు లేక యున్నది;
మునినాయక! యెఱుఁగఁజెప్పు మోక్షపదంబున్. 26

క. అనుపమ మజర మతీంద్రియ
మనామయ మనంత మమల మన వెలుఁగు నొకం
డని వేదశాస్త్రములచే
విని యుండుదు; దానిఁ దెలుపవే నాకున్. 27

వ అని వేఁడిన నమ్మునివరుఁడు సాదరంబుగా నతని కిట్లనియె : 28

: వసిష్ఠు జనకున కఱుఱఱుర తత్త్వంబుల తెలుం గెఱిఁగించుట :

సం. 12-291-13

సీ. గ్రంథంబు ధరియింతుగాని నీ కర్థభో
ధంబు లే దర్థబోధవ్యపేత
మగు గ్రంథధారణ మ్రపయోజన; మర్థ
నిశ్చయ మెఱిఁగింతు; నిపుణబుద్ధి
నవధరింపుము! సాంఖ్య మనుసరించును యోగ
తంత్రంబు; నదియుకు దానితెరువు
నొందుఁ; గావున సాంఖ్యయోగంబు లేకఁబ
యని కండ్రు ప్రాజ్ఞులు మనుజనాథ !

తే. సాంఖ్యమునకు యోగమునకు జనని ప్రకృతియ;
పురుషవనితానపుంసకంబు లనఁ బ్రకృతి
లింగములు గల; వాత్మం డలింగుఁ డతనిఁ
జెంద దది యెద్దియును నని చెప్పు శ్రుతులు. 29

క. విను, బీజంబున బీజం
బును దేహమునందు దేహమును నింద్రియముల్
దనతనవలనం దానును
మనంబునకు మనసు పుట్టు మహితవిచారా ! 30

తే. ఇతఁ డబీజుం డదేహుం డనింద్రియుండు
వీతమానసుఁ డని యాత్మవిధము సెప్పు
వేదములు; భవదుఃఖకర్మాదికములు
నాతనికి లేవు నిర్గుణుం డగుటఁ జేసి. 31

చ. ప్రకృతి యలింగ; తజ్జనితభంగులు లింగము; లట్టులయ్యు రం
జకగుణశీల లింగచయసంగతిఁ దాను సలింగయయ్యెఁ మూ

ర్తికలన లేక యుండియుఁ బరిస్ఫుట పుష్పఫలాదిసూచక
ప్రకరముచేత మూ ర్తమయి రంజిలదే ఋతువేళ సూడఁగన్. 32

క. కావున, గుణములు ప్రకృతివ;
యేవిధమునఁ జూచినను మహేశ్వరుని గుణి
త్వావేశము పొరయ; దస
ద్భావము సద్భావ మగునె భరితవివేకా ! 33

వ. ఇది యక్షరక్షరవివేకం; బేకం బనేకంబు దర్శనం బదర్శనంబు ని స్తత్వంబు
ద త్త్వం బపవర్గంబు వర్గం బని యక్షరక్షరంబుల పర్యాయనిర్దేశంబు; లక్ష
రంబు నప్రబుద్ధులు గానరు;' ప్రబుద్ధ లగుసాంఖ్యులును యోగులును బుద్ధి
కిం బరంబై పంచవింశతితమం బయిసయూత త్త్వంబు నాలోకింతు; రని
చెప్పిన వసిష్ఠతో నవ్వసుమతీవల్లభుండు. 34

సీ. 'కలదు నానాత్వ మేకత్వ మాత్మునకు న
విద్యయు విద్య నా విందు; నదియు
నదియును నెఱిఁగింపు; మక్షరక్షర భేద
మీవు సెప్పితి, బుద్ధి యెంతయేని
నస్థిర గాన యయ్యవబోధమును మా సె;
సాంఖ్యయోగంబుల చందనమునును
దెలియంగఁ జెప్పఁగావలయు నా' కనుడు న
మ్మని యిట్టులనియె నమ్మనుజపతికి

తే. 'యోగ మనఁగను ధ్యానంబు రాగరహిత
యదియు వినుము: ప్రాణాయామ మనఁగ నొకటి
మనసు నేకాగ్రతావృ త్తి యనఁగ నొకఁడు
పరఁగు సగుణత్వనిర్గుణభావగతుల. 35

వ. తదనుష్ఠానప్రకారంబు సెప్పెద. 36

క. మలమూత్రంబులకాలం
బుల భుక్తికినంతరమున భూవర! యోగం
బలవఱుచు రెండు మార్గం
బులును నిషిద్ధంబు లండ్రు పూర్వాచార్యుల్. 37

సీ. కొంచెపుటశనంబు గొనుచు, సంగంబులఁ
బాసి, యింద్రియములపజ్జఁ జనమి,
శబ్దాదియైన విషయజాత మంతరం
గంబున సందడిగాక యుండ
సద్బుద్ధి దృఢమగు సాధనంబుగఁ గొని
మరలిచి, యాత్మన మనసు నిలిపి,
యపగతసంకల్పుఁడై యుపలస్థాణు
భంగికస్థితిఁ బనుపడి దివంబు
తే. రాత్రియును యోగసేవానురతి నివాత
దీపమునుబోలె వెలుఁగునాత్మీయమూర్తిఁ
గనుచు నెడనెడ నుపరమకాలములు స
నంగ వర్తించి యోగి యానంద మొందు. 38

వ. ఇది యోగప్రకారంబు; సాఖ్యంబు తెఱం గెఱింగించెద. 39

తే. ప్రకృతివాదు లవ్యక్తంబు ప్రకృతి యండ్రు;
ప్రసవధర్మిణి యైన యాప్రకృతి దన్ను
బుద్ధ్యహంకారములుఁ బంచభూతములును
విషయములు నింద్రియములుఁగా విస్తరించు. 40

వ. పురుషునివలన నివి యెల్లనుం గలుగుఁ; బురుషుం డింతకు నధిష్ఠాతయై
యుండు. 41

క. అనులోమంబున సృష్టియు
జనవర! ప్రతిలోమవృత్తి సంహారముఁ గ

ల్గును; జననప్రళయంబులఁ
దనకు బహుత్వంబు నేకతయు శోభిల్లున్. 42

వ. క్షేత్రం బన నవ్యక్తం బనం బ్రకృతి యనం బ్రధానం బనం బరగు తత్త్వం బొక్కటియ; దానిన సత్త్వంబు నంద్రు; జీవుం డాక్షేత్రంబు నెఱింగెడి వాఁడు గావున క్షేత్రజ్ఞుఁడును నవ్యక్తపురంబున వసియించుటంజేసి పురుషుండు నన వెలుంగు; క్షేత్రక్షేత్రజ్ఞులు వేఱగుట ప్రస్ఫుటం; బవ్యక్తంబు జ్ఞానంబు; పురుషుండు జ్ఞేయుండు; ప్రకృతి సగుణాత్మక; పురుషుండు నిర్గుణుం; డిది సాంఖ్యప్రకారం; బిట్లు పరిసంఖ్యానరూపంబునఁ జతుర్వింశతి తత్త్వంబుల నేర్పరించి పురుషుండు దన్నుఁ దాన చూడం గైవల్యంబు సిద్ధించు; నిట్టిది యపునరావృత్తిపదంబు; తత్త్వసమూహం బ్రపబుద్ధం; బదిక్షరంబు; పంచవింశతి తత్త్వవిశిష్టుం డగుపురుషుండు ప్రబుద్ధుం డక్షరం బనం బరగు; నిత్తెఱం గెఱింగినవా రెల్లవలనను నిర్భయులు; భూవర!
యోగంబును సాంఖ్యంబును నక్షరంబును జెప్పితి; విద్యావిద్యలు సెప్పెద నాకర్ణింపుము. 43

—: విద్యావిద్యల ప్రకార నిరూపణము :—

సం. 12-295-1

ఆ. విద్య యనఁగఁ బంచవింశతితమతత్త్వ
మైనయక్షరంబు మానవేంద్ర!
విను, మవిద్య నాఁగఁ జనుఁ బ్రధానము దేట
పటిచెదను విశేషభంగులెల్ల. 44

వ. కర్మేంద్రియంబులకు బుద్ధీంద్రియంబు విద్య, బుద్ధీంద్రియంబులకు మనస్సును మనస్సునకు భూతపంచకంబును భూతపంచకంబునకు నహంకారమును నహంకారంబునకు బుద్ధియు బుద్ధికి నవ్యక్తంబును నవ్యక్తంబునకుం బంచవింశతితమతత్త్వంబును విద్యలని చెప్పి వెండియునమ్మునివరుం డిట్లనియె: 45

తే. క్షరము నక్షరమును ననఁ గలుగు రెంటి
నేర్పఱిచి మున్ను సెప్పితి; నింక నొకటి
సెప్పఁ గలదు; సమగ్రవిశేషకలిత
మవహితుండవై విను విదేహాధినాథ ! 46

సీ. జీవుండుఁ బ్రకృతియు భూవర! యక్షర
క్షరము; లీరెంటిని క్షరము లనియు
నార్యులు సెప్పుదు; రక్షరంబులు నందు
రాద్యంతరహితంబు లగుట; యీశ్వ
ర త్వంబు గల్గుట తత్త్వాదికము లనఁ
జనుట రెంటికి సదృశంబు సూవె!
ప్రకృతిగుణంబులై పరగెడుమహదహం
కారాదికంబులఁ గలసినపుడు

ఆ. క్షర మనంగవచ్చుఁ బురుషుని ప్రకృతిఁ దా
నని తలంచుఁ గాన; యదియుఁ బురుషుఁ
బొంద గుణవికారములు లేమి నిర్గుణ
మక్షరం బనంగ నగును దాని. 47

వ. ఎప్పుడు పురుషుండు ప్రబద్ధుం డయ్యె నప్పు డతండు. 48

ఆ. ఇంతకాలమేని యెఱుఁగక సంగాభి
భూత యగుచు నప్రబోధకలిత
యైనయట్టిప్రకృతి యేనంటి నిస్సంగ
బోధమహిమ గానఁ బోలదయ్యె. 49

క. ప్రకృతికి నాకును నుదకము
నకు మత్స్యంబునకుఁ బోలె నైసర్గికమై
ప్రకటం బైనది వేర్పా
టకటఃయహంకారవశత నది యే నంటిన్. 50

క. ప్రకృతి గుణంబులఁ గొని బహు
వికృతరూపముల నట్లు వెట్టిగొలిపె నే
నకలంకుండ నరూపుఁడఁ
బ్రకృతి దొఱఁగి నిలిచెదను నిరంజనమహిమన్. 51

తే. ప్రకృతి సేసెసె యీయపరాధ; మరయ
నాయదియకాక వేఱొకండే? యసంగ
కలితుఁ డగు నేను దానితోఁ గలయనేల?
కలిగె బహురూపములు దానఁ గాదె నాకు. 52

క. మమతం గాదె బహుజ
న్మము లయ్యెడు; దీని విడిచి నానాయోని
భ్రమణంబుం బాసెద; న
త్యములుఁడ నగునాకుఁ బ్రకృతి యాశ్రయ మేలా ? 53

తే. ఎన్ని రూపులు గొనివచ్చి యెట్లు పొడవు
సూపెనేనియు ప్రకృతినేఁ జూడ మమత
నా నహంకార మనఁ గల్గు వానిఁ జేర
నీక ప్రోచినఁ ప్రకృతి దా నెట్లు దోఁచు? 54

క. నిశ్చేతనయును నెంతయు
దుశ్చేష్టయు నైనప్రకృతి దొఱఁగి సముద్య
న్నిశ్చయవృత్తి నిరామయ
నిశ్చలనిర్మలపదైకనిరతుఁడ నగుదున్. 55

వ. అని యిట్లు పరమసంభోధనంబునం జేసి క్షరం బగు నవ్యక్తంబు దొఱంగిన పంచవింశకుం డక్షరం బనం బరగు; నక్షరంబునకుం బరం బైనదానిం బెక్కం డ్రెఱుంగరు; సాంఖ్యసూక్ష్మత్వదర్శకులు గాంతురు; క్షరాక్షర పరంబు లప్రబుద్ధబుధ్యమానబుద్ధంబు లను నిర్దేశంబులు గలిగి యుండుఁ; బరతత్త్వ నిర్దేశంబునం బొల్చు షడ్వింశకంబు బుద్ధంబును విమలంబును నప్రమేయంబును సనాతనంబును నై పంచవింశంబును జతుర్వింశంబునుం గనుచు వెలుంగు నని చెప్పి వెండియు. 56

క. వినుఁ, దృశ్యంబు నదృశ్యం
బును నగు జీవపరతత్త్వములు బ్రహ్మసమా
ఖ్యను నెగడుఁ; బ్రకృతి కది లే;
దనఘా! యక్షరము తెఱఁగు నభివర్ణింతున్. 57

ఆ. ప్రకృతి దొఱఁగి తన్నుఁ బరికించు జీవుండు
పరము గాంచునపుడు ప్రకృతిసగుణ
తానిరూఢి యడఁగి తన్మయత్వము నొంది
జీవకేవలత్వసిద్ధి యొలయు. 58

క. వినుఁ, కేవలుఁ డగుజీవుఁడు
దనుఁ బరముం గాఁగఁ జూచి తల్లీనత్వం
బున వెలుఁగు; నది నిరామయ
మనంత మగుపదము సూవె యతులవివేకా! 59

క. ఈనెఱి పురుషునకుం గల
నానాత్వైకత్వములును నరనాయక! శా
స్త్రానూనదృష్టిఁ గనుఁగొనఁ
గా నగుఁ దాత్పర్యశుద్ధికలితాత్మునకున్. 60

క. అనఘా! మోక్షము తెఱఁ గిది;
వినుఁ, మోక్షణ మిట్లు పంచవింశకునకుఁ గాఁ
గనినది యతండు ప్రకృతిం
దనుఁగా గొని తద్గుణములఁ దగులుట వలనన్. 61

తే. తగులు వాసి షడ్వింశకత్వమునఁ గలయఁ
దనకు మును లేనికేవలత్వమును నిర్మ
లత్వశుచితాస్వతంత్రసత్త్వపరత
లొందుఁ దద్ధర్మ సమవాయ మొలసి యధిప! 62

63

వ. అని యిట్లు ప్రబోధించి.

క. శివమును బరమబ్రహ్మము
నవికృతియు సనాతనంబు నగు పదమును భూ
ధవ: యెఱిఁగించితి నిర్భయుఁ
డవు గ; మ్మిలవఱుపు మిది దృఢంబుగ నాత్మన్. 64

తే. దీని నెఱిఁగించు నపుడు భక్తియును శమ ము
దమము సంశ్రయమును వేదతత్పరతయుఁ
గలుగఁ జూచి యెఱింగింపు; కానివాని
కీకు మావిద్య పాత్రదానై కనిరత: 65

ఆ. అఖిలరత్నపూర్ణ యగు వసుంధర యెల్ల
నొసఁగితేని నొసఁగు యోగ్యతాభి
యుక్తి లేనివాని; కొసఁగకు మీవిద్య;
తగినపాత్ర మైనఁ దడయ కిమ్ము. 66

క. అని చెప్పె; నియతుఁ డై విని
జనకన్యపాలుఁడు గృతార్థజన్ముం డయ్యెన్
మనుజేంద్రవర్య! నీకే
వినిపించితిఁ దదితిహాసవిధ మేర్పడఁగన్. 67

వ. అని పలికి భీష్ముడు పాండవాగ్రజున కిట్లనియె: 68

క. ఇది బ్రహ్మవసిష్ఠునకు
న్సదయుండై చెప్పె; నతఁడు నారదునకు సం
విదితంబు సేసె; నమ్మని
మదాత్మకుం దేటపఱిచె మహనీయకృపన్. 69

క. ఏను వసిష్ఠ వచనముల
కా నెఱిఁగించితి; మనంబు కలఁక విడిచి యీ

జ్ఞానం బలవఱపుము పర
మానందప్రదము కౌరవాన్వయముఖ్యా ! 70

క. క్షరమును నక్షరమును ద
త్పరమును నెఱిఁగితి విశోకభయమోహుఁడవై
కురువర! యానిశ్శ్రేయస
కరప్రబోధంబు నూఁదు గాఢాదరతన్. 71

వ. అని చెప్పి వెండియు, 72

సీ. వేఁటవేడుక నడవికిఁ జని వసుమంతుఁ
డనువాఁడు జనకుని తనయుఁ డొక్క-
చో భృగువంశతేజోవర్ధనుం డగు
నొకమునీశ్వరుఁ జూచి యుచితవృత్తిఁ
జేరి వినమ్రుఁడై చిత్తానువృత్తిమై
'నిహపరంబుల కెద్ది హితము సెప్ప
వే' యన్నఁ గృప నతం డి ట్లను 'భూత హి
తాహితాచరణంబు లధిప! సౌఖ్య

ఆ. దుఃఖముల నొనర్చు; దుర్వారతృష్ణిత
న్నిరసనంబు మేలు నరులు జుంటి
చవియకాని నెగులుఁ జఱి రయంబున నెక్కి-
తారు విఱుఁగఁబడుటఁ దలఁప లేరు'. 73

క. ధర్మంబుఁ బరిజ్ఞానము
నిర్మలమతి నభ్యసించి నృప! యనిశంబున్
ధార్మిక సంగతి గలిగినఁ
బేర్మి యుభయలోకముల నభిష్టత్య మగున్. 74

వ. అని మఱియును. 75

తే. బ్రాహ్మణప్రార్థితము లై నపనులు సేయు;
మిమ్ము ధనము పాత్రములకు; నిచ్చి వగవ
కుండు; మక్రోధకామత్వ మొలయఁ జేయు
మతికి ధృతి సాలఁ గల్గుము మనుజనాథ! 76

వ. ధృతిలేమింగాడె మహాభిషాఖ్యుం డగు నృపముఖ్యుండు త్రివిష్టపంబుననుండి విభ్రష్టుం డయ్యె; ధృత్యాలంబనంబునంగదా యయాతి యాపద నిస్తరించె. 77

క. అనిన విని యాన్యపతి య
మ్మునివచనము లూఁది కామమునకుఁ గ్రోధం
బునకుం దొలఁగించి తనదు
మనము ధృతికి ధర్మమునకు మరుగంజేసెన్. 78

వ. అని చెప్పినం బ్రియంబంది ముందాకినీనందనుతో ధర్మనందనుండు 'ధర్మా ధర్మవియుక్తంబును సర్వసంశయవిముక్తంబును జన్మమృత్యురహితంబును నిత్యంబును శుచియును శివంబును నవ్యయంబును బరంబును ననాయాసంబును నగునట్టిదాని నెఱింగింపవే' యని ప్రార్థించిన నతండు 'యాజ్ఞవల్క్య జనక సంవాదం బితిహాసరూపంబునం బ్రవర్తిల్లు; నది వినిన భవదభ్యర్థితంబైన యర్థంబు ప్రతిభాసించు; మఱియు వలయునవి యెఱుంగనగుం; జెప్పెద'నని పలికి యతని కిట్లనియె: 79

-: యాజ్ఞవల్క్యజనకరాజ సంవాద ప్రకారము :-

సం. 12-298-3.

ఆ. వినుము; సకలలోకవిశ్రుతవిజ్ఞాన
ఘనుని యాజ్ఞవల్క్యఁ డనుమునీంద్రు
వినయ మొప్పఁ గాంచి వినతుఁడై మిథిలేశుఁ
డైన జనకనృపతి యతనితోడ. 80

వ. 'ఇంద్రియఁబులు నవ్యక్తంబును బ్రహ్మంబును బరంబును భూతసర్గప్రళయం
బులును దత్కాలసంఖ్యలును దేటపఱచి భవదీయదయాళుత్వంబు నెఱపవే'
యనిన నమ్మునివరుం డమ్మహీవరున కిట్లనియె: 81

సీ. అధిపఃసర్గముఁ బ్రళయంబు నవ్యక్తంబు
దా నొనరించుఁ; దత్కాలసంఖ్య
వినుఁ; కల్పములు పది దినమున; కంతియ
రజనికాలంబు; సర్గంబు పగలు
నేయు; రే ప్రళయంబు నెల్లించుఁ; దొలుతన
శేషభూతములకు జీవనముగ
నోషధికల్పన మొనరించు; దానికై
హైరణ్యమైన మహాండమున వి

తే. ధాతఁ బుట్టించు; నతఁడు భూతముల నెల్ల
జనన మొందించు; భూమ్యాది సారభూత
గంధముఖ్యగుణోత్కరగ్రాహకములు
శ్రోతముఖములు దత్స్వామి సూవె మనసు. 82

వ. అది యెట్లంటేని. 83

క. వినుటకును గనుటకును సా
ధనము లై న చెవియుఁ గన్నుఁ దనతనయంతన్
వినుం గానను నేర్చునె
మనఃప్రభావమునఁ గాక మనుజాధీశా! 84

తే. ఇంద్రియములెల్ల నట్టివ; యెలసి యొండు
వలన మనసున్నం దమతమ వర్తనముల
నిగుడ నేరమి దెల్లంబు నృపవరేణ్యఃి
యిట్టు లగు టజ్ఞులకునై న నెఱుఁగ వచ్చు. 85

తే. మనసుచేతివే యింద్రియమహిమలెల్ల;
సుపరతం బైన మనసుతో నుడిగి మడఁగు
నింద్రియములు పరమ మొందెనేని దాన
మనసు మగుడదు విషయతృష్ణన చరించు. 86

క. కావున, నింద్రియచేష్టల
నేవలనికిఁ బోవ నీమి యింతకు ముఖ్యం
బై వడిగొను మనసు దిగువఁ
గావలయును మఁగుడ దీనిఁ గనుఁగొను మనఘా! 87

వ. ప్రళయప్రకారంబు వినుము: రాత్రి యగుటయు నవ్యక్తం బహంకృతి పురుషు బోధించిన నతండు పంద్రెండుమూర్తులు గైకొని రశ్మిజాలంబుల జరాయుజప్రభృతి సర్వభూతంబులను రూపుమాపినం గూర్మపృష్ఠంబు నుంబోని పృథివి జలమయం బగు; జలంబు లోకంబులెల్లం దమమయంబు కాఁ చేర్చి తన్నుం గాలాగ్ని సుడియింపం గుదియుఁ; బ్రజ్వలజ్వాలాభీలం బగు నయ్యనలం బనిలంబుచేతం జెడు నెందునుం దానయై పరగు; నమ్మహాఖలు నాకసంబు గ్రమింగు; నతివితతం బగు నవ్వియత్తత్త్వంబు మనంబు గ్రసియించు; మనంబు నయ్యహంకారాధిష్ఠితపురుషుండు గణించు; నయ్యహంకృతి నవ్యక్తంబు లోఁగొను; నిట్లు రేయి వోయిన నెప్పటివిధంబు ప్రవర్తిల్లు. 88

క. ప్రీతిగ నధ్యాత్మము నధి
భూతము నధిదైవతంబు భూవరసంప్ర
ద్యోతితములుగాఁ జెప్పెద
నా తెఱఁగు ప్రబోధకారి యగు నూహింపన్. 89

—: అధ్యాత్మాధిభూతాధి దైవత ప్రకారము :—

సం. 12 - 301 - 1

సీ. పాదపాయూపస్థపాణివాక్కులు విను
మధ్యాత్మములు; దత్ప్రమానుయుక్తి

గంతవ్యమును నిసర్గంబు నానందంబుఁ
గ ర్తవ్యవ క్తవ్యకములు నయ్యె
నధిభూతములు వాని కధిదై వములు వరు
సన విష్ణుమి త్రిప్రజాపతులును
శక్రపావకులును జక్షువు జిహ్వాయు
ఘ్రాణంబుఁ ద్వక్కు శ్రోత్రంబుఁ జూవె

తే. యనఘ! యధ్యాత్మములు రూపమును రసంబుఁ
జాలుపడ గంధసంస్పర్శశబ్దములును
దదధిభూతంబు లధిదై వతములు సూర్య
జల మహీ వాయు దిశ లంద్రు శాస్త్రవిదులు. 90

క. మన మధ్యాత్మము; దానికి
ననఘా! మంతవ్య మందు రధిభూతము; చం
ద్రుని నధిదై వతముగ బుధ
జనములు సెప్పుదురు శ్రుతివచఃప్రతిపత్తిన్. 91

తే. బుద్ధి యధ్యాత్మ మనఁ జను భూతవర్య!
దాని కధిభూత మంద్రు బోధ్యవ్యమైన
దానిఁ బొల్చు తదీయాధిదై వతంబు
వినుము క్షేత్రజ్ఞుఁ డని చెప్పు వేదచయము. 92

క. ఆరయ నధ్యాత్మ మహం
కారం బధిభూతనామకం బభిమానం
బారూఢయశఃపరమో
దారాత్ముఁ డధిదై వతం బన నెగడున్. 93

తే. ధరణివల్లభ! చిత్త మధ్యాత్మ మనఁగఁ
బరగుఁ జేత యితవ్యంబు భావితాత్మ
లై న మహనీయు లధిభూత మంద్రు; బ్రహ్మ
మంచితాధిదై వత మను నాగమములు. 94

వ. అని చెప్పి ప్రకృతిపురుషప్రకారంబులు వినుట మనోనిర్వికారత్వకారణం
బగు ననుపలుకు పలికి యిట్లనియె : 95

క. ప్రకృతి దనయిచ్చఁ గ్రీడా
ర్థకముగ సత్త్వాదిగుణవితానము నానా
వికృతులఁ బొందింప నసం
ఖ్యకవిధమై పరగుచుండునది మనుజేంద్రా! 96

క. దీపమున ననేకము లగు
దీపములు పరంపరానుదీప్తాకృతులై
వ్యాపించు చందమున గుణ
రూపంబులఁ బరపుఁ బ్రకృతి రోషవిదూరా! 97

సీ. సత్త్వగుణంబులు సంతోషమానంద
మారోగ్య మక్రోధ మార్జవంబు
శుద్ధిప్రకాశత సుస్థిరత్వ మహింస
నిర్మలశ్రద్ధ వినీతి లజ్జ
సత్యంబు శౌచంబు సమత యాచారం బ
కార్పణ్య పైశున్య కామవృత్తి,
విను, రజోగుణములు విగ్రహదర్పాభి
మాన కామ క్రోధ మత్సరములు

ఆ. కరుణలేమి భోగకాంక్ష యహంకార
ముమ్మలిక, తమోగుణమ్ము లప్ర
కాశ మోహబహుతరాశన వాదప్ర
మాద మౌర్ఖ్యమరణ ఖేదనములు. 98

క. ప్రకృతికిని గుణములం గొని
యకలంకుం డైన యంతరాత్ముని వేవే
ల్వికృతులఁ బొందించుట పా
యక కలుగుం దత్స్వభావ మది యరయంగన్. 99

క. పురుషుఁడు చైతన్యాత్ముఁడు
నరనాయకఃప్రకృతి చేతనారహిత జగ
ద్ధురఁ బురుషుని వెలుఁగునఁ దా
ధరియించుం బురుషుఁ దిగుచుఁ దనమెయిఁ దిరుగన్. 100

ఉ. సత్త్వరజస్తమోగుణవశస్థితిఁ గేవలపుణ్యమిశ్రకా
రిత్వ విరుద్ధకర్మములఁ బ్రేరితమైనను నూర్ధ్వలోకసే
వి త్వము మానుష త్వపదవీకలనంబును రౌరవంబు నా
తత్త్వము తన్నెఱుంగమి ప్రధానముచేతల నావహిల్లినన్. 101

క. తను నెఱిఁగిన నవ్యక్తము
చనవునఁ బోఁ డాత్మఁ డజరశాశ్వతవిగతాం
జన విమలాచ్యుతపదముం
గని యక్షరుఁ డగు నిజప్రకాశస్థిరతన్. 102

వ. అనిన విని జనకపతి యమ్మునిపతితో 'ననాదినిధనంబులు నమూర్తంబులు
నచలంబులు నగ్రాహ్యంబులు నగు పురుషప్రకృతితత్త్వంబులయం దొక్కటి
సచేతనంబై యుండఁ దక్కినయది చేతనారహితం బగుటకుం గతంబేమి
యెఱింగింపవే' యనుటయు నతం డతని కిట్లనియె: 103

క. సగుణం బగుణం బగునేఁ
యగుణము సగుణ మగు నెట్లుఁ లవ్యక్తము ని
త్యగుణసమవేతమై జడ
త గలిగి యుండంగఁ బురుషధర్మము గలదే? 104

క. పురుషుని కలరూ పెఱిఁగెడు
పరిబోధము లేకయుండుఁ బ్రకృతికిఁ; ప్రకృతిం
బురుషుఁ డెఱుంగును దనకుం
బరంబు లేదనియుఁ గను శుభస్థిరదృష్టిన్. 105

క. కావునఁ బ్రకృతి యచేతన;
భూవల్లభ! చేతనుండు పురుషుఁడు; సమ్య
గ్భావన యలవడిన మునీం
ద్రావలి యిమ్మెయి సునిశ్చయంబుగఁ బలుకున్. 106

వ. అని వెండియు. 107

ఆ. తాను ప్రకృతిఁ ప్రకృతి తనయందు నిల్చు ని
ల్చినను దాన వికృతిఁ జెందకుండుఁ
బురుషుఁ డుదకమత్స్యముల యుదుంబర మశ
కముల సంగమంబు కరణి గలుగ. 108

ఆ. జలముఁ గదిసియుండ జలముచే నార్ద్రింబు
గాక యుండునట్టి కమలదళము
భంగి నంతరాత్మ ప్రకృతిఁ బొందియును ద
ద్వికృతిఁ బొందకుండు వీతదోషఁ. 109

వ. ఇది సాంఖ్యానుభావంబు; యోగంబు తెఱం గెఱింగించెద: 110

క. విను, సాంఖ్యసమజ్ఞానం
బును యోగసమానబలము భూవర! లే వెం
దును; నవి రెండును వేఱుగఁ
గనుఁ బాలిఱుఁ డొక్క తెరువకా నేఁ గందున్. 111

క. జననాథ! మనోధారణ
యును ప్రాణాయామవిధియు నుపయోగ్యములై
చను నిర్గుణమును సగుణం
బును ననఁగా రెండుతంత్రములు యోగమునన్. 112

క. ప్రాణాయామము ప్రగమునఁ
ప్రాణోత్పీడనము గానిభంగి నడుపుచున్

ఘోణాగ్రస్థితి విషయ
శ్రేణి దొఱఁగి యుండి యోగసిద్ధతఁ బడయున్. 113

వ. ఎట్లంటేని. 114

తే. కరము నియతుఁ డె కొంతేసికాలములశ
రీరధర్మావిరోధిగా రేయుఁ బగలుఁ
బ్రాణసంయమనము నడపంగవలయు;
దాన చిత్తంబు దనువు శుద్ధత వహించు. 115

వ. అది సిద్ధత్వసంపదకు మూలం; బిది సగుణతంత్రంబు తెఱఁగు; నిర్గుణతంత్ర
ప్రకారం బెఱింగించెద: 116

తే. ఇంద్రియంబులు మనమునం దివురఁ జేసి,
మనసుఁ దిగిచి యహంకారమున నడంచి,
బుద్ధిలోన నహంకృతిఁ బుచ్చి, బుద్ధి
ప్రకృతిఁ గలఁపఁ దద్ధ్యానపరత గలుగు. 117

క. ధ్యానైకతత్పరాత్ముఁడు
గానఁ బడయు నజరు నిర్వికల్పు విమలు ని
త్యానందసత్యశుద్ధ
జ్ఞానమయుం ఖరము నచలు శాశ్వతుని శివున్. 118

చ. ఉదితసమగ్రబోధుఁ డగుయోగికి నిశ్చలదీపరూపసం
పద సుఖసుప్తభంగి ఘనపంక్తులు లేని వియత్తలంబు నొ
ప్పిద మొదవుం దరంగముల పెల్లునఁ దాఁ జలితంబు గానివా
ర్ధిదశ నతం డకంపుఁ డగు ధీపరివృత్తులు గల్గె నేనియున్. 119

క. భేరీశంఖాదిక నా
నారవములు వొడమెనేని నాతఁడు దానం

గారింపఁబడఁడు వీత వి
కారస్థితిఁ బొలిచి యుండు గగనముభంగిన్. 120

క. తేనియకుండఁ గొనుచు సో
పానము లేమఱుట లేక ప్రాఁకినక్రియ నా
త్మానందరసం బొక కణ
మైనఁ జిలుకనీక తుదికి నాతం డెక్కున్. 121

క. అనఘ! యిది యోగపథ మిం
దనలసుఁ డై చనఁగఁ జాలు నతఁడు కృతార్థుం
డనితరసులభపదప్రా
ప్తినిరూఢుఁ డనామయుం డభిష్టుతుఁ డెందున్. 122

వ. అని యుపదేశించి వెండియు. 123

సీ. నరనాథ యుత్కృష్టమణిప్రదేశంబులు
పాదజంఘాజాను పాయు గుహ్యా
ములు నూరుపార్శ్వనాభులు బహువక్షోగ
హాననగ్రీవనాసాంబకములు
భ్రూఫాలమస్తకంబులు నోలి విష్ణుండు
వసుసాధ్యమిత్రులు వసుధయును బ్ర
జాపతి మరుదిందు సంక్రందనస్థా ణు
లును నరుం డనుమహాముని యు విశ్వ

తే. దేవదిగ్గంధవహులును బావకుండు
నశ్వినీపితృశతానందులు నందు వెలుఁగు
చుండ్రు హృన్మయపవనక్రమోత్క్రమముల
నొందు నద్దైవతంబుల యోగివరుఁడు. 124

-: యాజ్ఞవల్క్యుఁడు జనకునితో మరణసూచకంబులఁ జెప్పుట :-

సం. 12 - 305 - 7

వ. అని చెప్పి మఱియు నిట్లను, 'నరిష్టంబుల తెఱం గెఱుంగవలయుం గావున నెఱింగించెద నాకర్ణింపుము'. 125

సీ. ధ్రువమండలమున నరుంధతిఁ గనుశక్తి
గంటికిఁ గలుగంగఁ గానకున్న,
ముక్కున వలపటఁ జెక్కు వాసినయట్టు
దోఁచినఁ, బూర్ణచంద్రుండు మలినుఁ
డై కానవచ్చిన నాయువు సంవత్స
రంబునఁ గడచను రాజముఖ్య !
కాంతి దొల్లిటియట్లు గాక యంతకు నెక్కు
డైనను గడుఁ జెడ్డ నట్లు ప్రజ్ఞ

తే. క్రొత్తగాఁ బెద్దయైనను గొంచెమైనను
నాఱునెలల మరణదశ యగుట గలుగు;
నిందుమండలమున రవి యందు నడుమఁ
దెఱపి గాంచినఁ దెగు నేడుదివసములకు. 126

క. వినుఁ: గుడిలో నున్న సమయ
మున సురభిద్రవ్యములను బొల వల్చుట గ
ల్గిన నాఱుదివసములఁ గ
ల్గును మృత్యుసమాగమంబు గుణరత్ననిధీ! 127

తే. ముక్కుఁ బ్రాలుట కర్ణముల్ ప్రొగ్గఁబడుట
రదన వైవర్ణ్య మక్షి విరాగభావ
మంగమతికృష్ణ మగు టుల్ల మడరఁ జెడుట
సూచకములు సద్యోమృత్యుగోచరతకు. 128

తే. కారణములేక దాపలికను ద్రవించు
నెత్తి చక్కటి ధూమంబు నెగయు నపుడ
మరణదశ యావహిల్లెడు మానవునకు
జనకనృపః యివి బ్రహ్మ నెప్పిన విధములు. 129

క. వినుఁ యోగివరు డరిష్టము
కనుఁగొని యనిశమును యోగగతియుతసాంఖ్యం
బనపాయత నడుపుచు నా
త్మునిఁ బరముం జేర్చి కాలముం గబళించున్. 130

వ. ఇవ్విధమున నతండు. 131

ఆ కాలకబళనైకళీలుఁడై మృత్యువు
గెలిచి శాశ్వతము నచలము శివము
నచ్యుతము ననామయము నమృతము నవ్య
యంబు నగుపదంబు నందు నిలుచు. 132

వ. అని పలికి యాజ్ఞవల్క్యమునీశ్వరుండు జనకజనేశ్వరుతోఁ 'బరంబు దేట పఱుపు మని నీ వడిగి; తాప్రశ్నంబు సూక్ష్మం; బుత్తరం బనహితుండ వయి వినుఁ' మని యిట్లనియెఁ: 133

సీ. మహనీయతపమున మార్తాండు నాకుఁ బ్ర
సన్నుఁగాఁ జేసితి సదయదృష్టి
ననుఁ జూచి యద్దేవుఁ 'డనఘ! వరంబు నీ
కిచ్చెద నీకోర్కి యెద్ది సెప్పు'
మనవుఁడు బ్రణతుండనై 'యజుస్సంప్రాప్తి
గోరెద' ననిన నవ్వారిజాప్తుఁ
'డట్లేని వాగ్దేవి నావహించెద; విప్ర
తంబుగాఁ జేయు మాస్యంబు విప్రఁ'

తే. యనియె నవ్వచనము విని యాననమ్మ
సంతసమున విచ్చితి సరస్వతియు నాదు
ననువుఁ జొచ్చెఁ బదంపడి దాహ మొంది
తన్ను నెఱుఁగక వెగడొందు నన్ను నిరుఁడు. 134

క. కనుఁగొని యించుక సేపునఁ
దనువడు నని పలికెఁ బిదపఁ దనువడుటయునుం
బనుపడియె నప్పు డద్దే
వుని వదనాబ్జమున నావెవుల కింపారన్. 135

క. భూసురవర: వేదము ప్రతి
భాసిల్లుచు సంతత ప్రపత్తి గలుగు ను
ల్లాసంబు బుద్ధి నొందు స
మాసన్నంబు లగు సాంఖ్యమతయోగంబుల్. 136

ఆ. యోగసాంఖ్యసిద్ధి నొందు నిష్టాప్తి
సనుము సమ్మదమున ననుమృదూక్తి
లుద్భవించె; మోద ముత్కటమయ్యె నా;
కమ్మతవృష్టిఁ దోఁగినట్టు లైతి. 137

వ. తదనంతరంబ యద్దేవుం డస్తాచలంబువలని కరిగె; నేనుం బరమానందకంద
ళిత మనస్కుండ నగుచు మందిరంబున కేతెంచి సంస్వతిం దలంచు
చున్నంత. 138

క. వినుము: వినుతస్వరవ్యం
జనభూషిత యగ్రభాగ సంస్ఫురదోంకా
ర నితాంతహృద్యమధుగ
ర్భనిజాకృతి విశదముగ సరస్వతి దోఁచెన్. 139

-: విశ్వావసునకు యాజ్ఞవల్క్యుఁ డుపదేశించిన తత్త్వప్రకారము :-

సం. 12 - 306 - 30

వ. తోఁచిన నత్యంతభక్తిం బ్రపత్తిసేసి సూర్యప్రసాదలబ్ధయుఁ బంచదశశాఖా సమన్వితయు నిఖిలోత్తరసంహితయు నగునయ్యజుర్వచోమూర్తి ధరియించి శిష్యులం బరిగ్రహించి వారల నధ్యయనంబు సేయించుచు, నిశ్వాజ్మయ బ్రహ్మంబునందు వేదితవ్యం బెయ్యదియో యని విచారింప, విరోచను మహానుభావంబునం జేసి యోగసాంఖ్య రూపోపాయప్రకారంబు దోఁచెఁ; బదంపడి తదుపేయం బగు వేదవేద్యంబును నద్దేవుని కరుణావిశేషంబునం బ్రతిభాసించెఁ; గొఁడొకకాలంబునకు విశ్వావసుం డను గంధర్వేశ్వరుండు నాకడకుం జనుదెంచి తన్నెఱింగించి యేను జేయు నతిథిపూజనం బత్యాదరంబున గైకొని 'విశ్వావిశ్వంబులు మిత్రావరుణులు జ్ఞానజ్ఞేయంబులుఁ దపోతపంబులు సూర్యాతిసూర్యులు విద్యావిద్యలు వేద్యావేద్యంబులుం జలాచలంబులు ననునవి వేదోదితంబులు; వానిం దేటపఱుపవే' యని యడిగిన నవహితుండవై విను మని పలికి విశ్వంబు భూతభవ్య భవత్కరం బగు నవ్యక్తం బవ్యక్తనామప్రకృతియ విశ్వంబు నిర్గుణుండగు పురుషుండు మిత్రావరుణులు పురుషప్రకృతులు జ్ఞానజ్ఞేయంబులుఁ దపోతపంబులు సూర్యాతిసూర్యులును ప్రకృతిపురుషుల కా నెఱుంగుము; విద్యావిద్యా వేద్యావేద్యాచలాచలంబు లను శబ్దంబులు వరుసం బురుషునకుం ప్రకృతికిని వాచకంబు లని చెప్పి వెండియు నిట్లనియె : 140

ఆ. అజము లవ్రణంబు లక్షయంబు లతీంద్రి
యములు ప్రకృతిపురుషు లనఁగఁ బరగు
రెండుతత్త్వములు నఖండరూపతఁ బొంది
నపుడు ప్రకృతి పురుషునట్ల కాన. 141

వ. అని తెలిపి మఱియును. 142

క. విను, వేదవేద్యము నెఱుం
గని యాతని వేదపాఠకలనంబు సుధీ
ధన వేదభారవహనం
బనఁ జను నింతియ నిరర్థకాయాసంబై. 143

ఆ. క్షరము నక్షరంబుఁ గానంగఁ బోలు వే
దార్థచింతనమున నమ్మిథునము
నందుఁ బూర్వ మురివి యపరంబు సేపట్టి
నిలువ వలయు నధికనిష్ఠ గలిగి. 144

తే. అక్షరం బగుపంచవింశాఖ్యత త్త్వ
తత్పరత నున్నఁ గేవలత్వము ఘటిల్లు;
వినుము, కేవలత్వమున షడ్వింశదర్శ
నంబు పురుషున కొదవి తన్మయత గలుగు. 145

క. పురుషుని నవ్యక్తము రెం
డురూపులుగఁ జూచు టొప్పెడు తెఱం గతఁడుం
బురుషోత్తముండు నరయఁగ
నిరువురుగా; రతఁడ యాతఁ; డిది నిజము సుమీ ! 146

క. పురుషోత్తమషడ్వింశక
పరమేశ్వరనామకములు పరగును వినుఁ, మా
పరమునకు నదియ నిష్కళ
నిరంజనానందబోధ నిత్యం బనఘా ! 147

వ. అని చెప్పిన విని విశ్వావసుండు పంచవింశకతత్త్వంబునకుం బరంబు గలుగు టయు నది రూపింప నేకం బగుటయు నారద జైగీషవ్య దేవల కపిల శుక సుమంత పైలాదు లైన పరమునుల గోష్ఠివిశేషంబుల విందు; వినినను నిస్సంశయం బగు బోధం బుదితంబు గామి ని న్నాశ్రయించితి; నీవు సంయమి లోక సురలోక బ్రహ్మలోక ప్రఖ్యాత ప్రజ్ఞాన సంభావనీయుండవు మదీయ సందేహాపనయంబు సేయవే యనుటయు నాదరాయత్తచిత్తుండనై. 148

క. మునిగోష్ఠివలని కొఱతయె
విను, భవదీయాంతరంగవృత్తి కలుషమై
నను సంశయాత్మునింగా
నొనరించుచు నున్న యది సముజ్జ్వలతేజా ! 149

వ. ప్రసన్నైకాగ్రచిత్తుండ వై యాకర్ణింపు మని యిట్లంటి ; 150

క. పురుషున కవ్యక్తపరి
స్ఫురణ శబలవృత్తి గలుగఁ బోయిన నతనిం
బురుషోత్తముఁ డనరు జనన
మరణాదివికారయుక్తి మాటయి యజ్ఞుల్. 151

వ. అని వెండియు. 152

తే. ప్రకృతి పురుషునిఁ గానదు; ప్రకృతిఁ గనుచు
నునికిఁ బురుషుండు పరమునిఁ గనుటలేక
యుండుఁ; గనుఁ దద్ద్వయమునుఁ బరముండు; పరమ
వీక్షణము పురుషున కగువెరవు వినుము. 153

క. స్నేహసహవాసములు స
మ్మోహము దలకొలుపఁ గాలమున ముసుఁగుచు గా
ఢాహంకారమమత్వము
లీహఁ బెనుపఁ బ్రకృతిఁ బురుషుఁ డే నను చుండున్. 154

క. అది లెస్సగ విడిచి ప్రకృతి
కుదకనిభాకలనమును ఋషోపమ దనకుం
బదిలుఁ డయి చూడనేర్చిన
విదితం బగు దానితోడివేర్పా టనఘా ! 155

ఆ. ప్రకృతి దొఱఁగి తన్నుఁ బన్నుగాఁ జూచు వి
వేకదృఢతఁ బంచ నింశకుండు

సంగరహితమైన షడ్వింశపదము ని
స్సంశయముగఁ గాంచు వంశవర్య! 156

క. జననజరామృత్యుభయం
బున యోగసమేతసాంఖ్యముం దిరముగ నూఁ
దినయతులు నిర్మమత్వం
బునఁ బడయుదు రప్పరంబు పొం దచలముగన్. 157

వ. అపునరావృత్తిపదం బగు నప్పదంబు సూవె పరం బని చెప్పి
వెండియు. 158

క. నెట్టన చూడమి నయ్యెడు
నట్టిది యొకచూపునం బరానందంబున్
గట్టిగఁ జేయఁగ వికృతులు
పుట్టక పురుషుండు తత్పబోధాత్ముఁ డగున్. 159

క. పురుషోత్తముండు బురుషుఁడు
నిరువు రగుట గలదు గలిగెనేనియుఁ బురుషుం
బురుషో త్తమునందుఁ గలవు
వెరవున నేకత్వమహిమ విజ్ఞాత మగున్. 160

క. ఇది విజ్ఞానము కృత్యము
తుది విజ్ఞానాత్ముఁడు నగు దుర్లభము ప్రశాం
తి దశాహీనాత్ముల క
ప్పద మది మోక్షంబు మమత వాసినఁ గల్గున్. 161

వ. అని యుపదేశించిన విని విశ్వావసుండు ప్రమోదంబు నొంది 'పథ్యంబును హితంబును దథ్యంబును నగుతెఱం గనుగ్రహించితి; భవదీయప్రసాదంబునం గలంకదేఱి నిర్మలుండ నయితి' నని పలికి సభక్తికంబుగా ప్రదక్షిణంబును ప్రణామంబునుం జేసి నిజస్థానంబున కరిగె నని చెప్పి, యాజ్ఞవల్క్యముని నాథుండు జనకజనాథుతో వెండియు నిట్లనియె: 162

క. మానవపతిస త్తమ! యీ
జ్ఞానము బ్రహ్మాదిదివిజసంయమిమత మె
వ్వానికి మోక్షంబునకుం
దాన తెరువుతెరువు లొండ్లు దలఁపం గలవే. 163

ఆ. జ్ఞానమునన కాని జన్మజరామృత్యు
వుల జయించునట్టి యలఘు మోక్ష
పదము గల్గ నేర; దచికారణముగ సు
జ్ఞాన మెల్లభంగి సాధ్యతమము. 164

క. గురుఁ డెవ్వఁ డైన నగు ని
వ్వెర వుపదేశించువాఁడ వేల్పుగ శ్రద్ధా
పరమతి గావలయు జనన
మరణంబులు శ్రద్ధ లేని మనుజునిఁ బొదువున్. 165

క. విను, మజ్ఞానంబునఁ గ
ర్మనిరూఢత గలుగు దాన మఱఁగవు జననం
బును మరణము; సమ్యగ్జ్ఞా
ననిత్యఁ డగువాఁడు మోక్షణముఁ జుల్కఁ గనున్. 166

క. ఈ వెర వూఁదుము నృప! నను
నీ వడిగిన యంతయును వినిశ్చయకృతి సం
భావితము గాఁగఁ జెప్పితిఁ;
బోవిడువుము శోకమోహమును; నిలుపు ధృతిన్. 167

క. అని చెప్పిన ముదితుండై
జనకుఁడు శోకాభావసంగవిరహితం
బును బ్రహ్మధ్యానపరం
బును నగుచిత్తంబుతోడ ముదితుం డగుచున్. 168

వ. ఉండెం బాండవాగ్రజా! యీయాజ్ఞవల్క్యమునివరువాక్యరూపంబునన
యే నిర్మలనీయజ్ఞానంబు నీకుపదేశించితిననిచెప్పిభీష్మఁడతనితోఁ నీవిందుల

తాత్పర్యంబు గలిగి యార్యగర్హితంబు లగు శోకమోహాదిప్రాకృతభావంబులం
దొఱంగి సుఖి వగు' మనిన విని యక్కొంతేయాగ్రజుండు సంతుష్టాంత
రంగుండై యగ్గాంగేయునకుం బ్రణమిల్లి 'గృహస్థధర్మంబు పరిత్యజింపక
మోక్షంబు వడయుట గలుగనోపునే ? మదీయచిత్తంబు సంశయాయత్తం
బగుచుండు; నిక్కాలుష్యంబు వాపవే' యని యభ్యర్థించిన నతండు 'జనక
సులభాసంవాదం బను నితిహాసంబు గలుగు దాన నేతత్సంశయంబు వాయు
దానిం జెప్పెద విను' మని పలికి యతని కిట్లనియె. 169

:- భీష్ముఁడు ధర్మరాజునకు జనక సులభా సంవాదంబు సెప్పుట:-

సం. 12-308-3

క. సులభాభిధాన యగు నొక
లలన విమలయోగధర్మలంపటు జనకుం
గెలన విని యతనిబోధము
కొలఁది పరీక్షింపఁ దనకుఁ గోర్కి వొడమినన్. 170

వ. నియమాచరణకృశం బగుశరీరంబు యోగప్రభావంబున డాఁచి సుందర
సుకుమారం బగునాకారంబు వహించి జనకుం గాంచి భిక్షావృత్తిత్వసూచ
కంబు లగువచనంబు లుపన్యసించిన, నతం డాసనపాద్యార్చనంబు లాచరించి
మహనీయం బగుభోజనం బొనర్చిన సంతృప్తిం బొంది యవ్వీదేహపతికి
నాసన్నం బగు నుచితాసనంబున నాసీనయై యుండి యాతండు ముక్తుండగు
గామి గనికొను తలంపున నిజానుభావంబున నతనిచిత్తంబు ప్రవేశించి మార
వికారంబు భావించి. 171

క. తనలోచనదీప్తుల న
మ్మనుజపతిమొగంబునందు మల్లడిగొనఁ జే
సిన నమ్మహాత్ముఁ డప్ప
ద్మనయన తలఁ పెఱిఁగి జనితమందస్మితుఁడై. 172

ఆ. ఎచటనుండి యెచటి కేఁగెదఁ వెవ్వరి
దానఁ వేమి వెంటఁ దగిలి నడతు ?

సుదతి! నాకుఁ జెప్పు; మది యట్లు లుండె; నా
మాట లీవు విను సమాదరమున. 173

సీ. పంచశిఖుఁ డను పరమమునీశ్వరు
శిష్యుండ; నతనిచే శిక్షితంబు
గమలాక్షి! సాంఖ్యయోగక్షితిపాలనం
బులఁ ద్రివిధం బగు మోక్షధర్మ;
మట్లు గావున సంశయము లేక ముక్తకా
మస్థితి నమ్మాఁడు మార్గములను
నడచి పరంబున కెడపడకుండుదు;
ముక్తివై రాగ్యైకమూల సూవె;

తే. విను, విరక్తి దృఢజ్ఞానజనిత గాన
దీపితజ్ఞానమున విరక్తియు ధరింపఁ
బడిన బుద్ధి నిర్ద్వంద్వత బరఁగు; నింటి
యంద నిల్చి నిస్సంగుఁడ నై చరింతు. 174

క. వనితా! చందనమునఁ బూ
సినఁ గత్తిని ప్రేసినను సుచిత్తత నా క
జ్ఞను లిరువురయందును సరి
కనకము లోష్టమును సమము కాఁ గనుఁగొందున్. 175

తే. జ్ఞానమును గర్మమును రెంటిసంగమంబు
నిష్ఠలుగ మోక్షవిదులు వర్ణింతు రాత్మ
శాస్త్రములు గని మద్గురుశాసనంబు
సుగమపదము తృతీయంబు సూవె యబల! 176

ఆ. కీడు గని యొకండు గృహధర్మ ముడిగి స
మాశ్రయించు నాశ్రమాంతరంబు;
దాన సంగ ముడుగఁగా నేర దది యొల్ల
మియును వంపు గాన మీకఁ యన! 177

క. దండము గాషాయంబును
ముండితయు గమండలువును మోక్ష మొసగ; వె
ట్టండేని లింగములకు న
ఖండజ్ఞాన ప్రదత్వకలనము గలదే? 178

క. మగువా! దుఃఖము శిథిలం
బగు నని లింగములు దాల్తు రమ్మోయి లే దె
ట్లు గొడుగు నందుం గావున
వగవగ మోక్షదముగాగవలయున్ గొడుగున్. 179

ఆ. జ్ఞానమనన కాని మానిని లింగమా
త్రమున ముక్తి యగునె? రాజ్యబంధ
రాగబంధనిఖిలభోగబంధములఁ బ్ర
జ్ఞాసి దునిమినాఁడ నది గతముగ. 180

వ. ఇట్లు ముక్తుండ నై యున్న నాయెడ ముక్తత్వాముక్తత్వంబు లారయ
వేఁడివచ్చి మచ్చిత్తంబు మెత్తన చొచ్చి; తిదియ ప్రయోజనం బట్లుంగాక.

తే. బ్రాహ్మణివి యోగినివి పరభార్య వబల!
భర్త ప్రోషితుఁ డేను నృపాలసుతుఁడ
వినుము, గృహమేధి నాచారఘనుఁడ; నిట్టి
నేను నీవు గమించుట నింద దేదె? 182

వ. స్వతంత్రవై నీవు చేసిన యీయవినయంబున నెయ్యది వాటిల్లిన నది
నీయంద నిలుచుంగాక యని పలికి వెండియు. 183

క. నావలనిరాగముననే
నీ వి ర్లైతి; నను గెల్చు నిపుణతకుం గా
కీవెడమాయల నిప్పుడుఁ
బోవిడువపు యోగశక్తి పొలుపు కలిమినే. 184

క. నిను డాఁచి కుటిలభావం
బున దుష్టచరిత్ర వై తి ముక్తులతెఱగే
వనిత! యిది యే బయలుపటి
చినవై నను మానవలదె చెన్నఁటి చూపుల్. 185

క. అని తన వైరాగ్యంబును
ఘనబోధము మహిమయుం బ్రకాశింప మనం
బున సరకుగొనక యి ట్లం
వ్వనితఁ బలికి యన్నరేంద్రవర్యుఁడు మఱియున్. 186

క. తను వొప్పెడునది యౌవన
మును నూతన మిట్టి నీకుఁ బొలఁతీ! యోగం
బున నింతచొరవ యెమ్మెయిఁ
బనుపడియెం జెపుము; దాఁపఁ బనిలే దింకన్. 187

వ. అనుచు. 188

క. తను సరకుసేయ కిట్లం
జననాథుఁడు వలుక నవ్వచవములు దెలియన్
విని సులభచతురముగ ని
ట్లను నించుక గొంకులేక యవ్విభుతోడన్. 189

క. శ్రోతకుఁ దనకుం బ్రియ మగు
నేతెరువున నట్టిమెయి సమీరిత మైన
జూ తగువాక్యం బది నృప
సూతీ! పెఱపలుకు బాలిశులచొ ప్పరయన్. 190

వ. భవదీయవాక్య వైదగ్ధ్యం బట్లుండె; నీవు న న్నెవ్వరిదాన వెచ్చటనుండి వచ్చి
తెటు పోయె దని తొలుత నడిగి తవహితుండవై వినుము చెప్పెద. 191

-: జనకుని ప్రశ్నంబులకు సులభ ప్రత్యుత్తరంబు లిచ్చుట:-

సం. 12-308-95, 96.

క. వినుఁ పాంసూదకములచా
డ్పున జతుకాష్ఠములభంగి భూతంబులకున్
మను జేంద్రఁ కలుగుఁ బొం; దా
పని సన్యోన్యసమధీనభావము గలదే ? 192

ఆ. ఒక్కమేనియంద యుర్వీశ! పంచభూ
తములు దశమితేంద్రియములు మనసు
బుద్ధియును ప్రధానమును గల వివి యొక్కఁ
డొకటి యవియె యేల యొండు సెప్ప. 193

వ. నిక్కంబునకు నెవ్వరు నెవ్వరివారుం గామి తెలియవే యని పలికి
వెండియు. 194

తే. సకలలోకములను సదశ్వంబుకరణి
ధావనము సేయుచుండుఁ బ్రధాన మింత
యెఱిఁగి జననాథ! యెవ్వరి నెచట నుండు
వార లను వార మమ్మాట వలను సెపుమ. 195

తే. నీవు నీయందు నినుఁ గను నెఱియ యొరుల
యందుఁ గానంగవలవదే యధిప! తన్ను
నొరుల నొక్కటిగాఁ జూచు పురుషుఁ డెచట
మీర లుండుదు రెవ్వరివార లనునె. 196

తే. అరులు మిత్త్రి లుదాసీను లనుచు సంధి
విగ్రహాది షడ్గుణముల వెరవు లొకరుఁ
డలవరించుచు విజయంబు నాసపడుచు
నుండు నటె; ముక్తి తెఱఁ గిటు లున్నె యరయ 197

ఉ. కావున నీవు ముక్తుఁడవు గా విటు గాక యు నిన్ను ముక్తు గా
భూవర! చూచె దిక్కలఁకబుద్ధులు సెప్పి తగం దొలంగఁగాఁ
ద్రోవఁగ బాడి బంధులకు దుర్మతి వుట్టిన యట్టిమర్త్యు వా
వేవిధినై న మందు లిడి యెప్పటిబుద్ధి ఘటించు చాడ్పునన్. 198

వ. ఏ నెట్లు ముక్తుండగా నంచేని విను మింకనుం జెప్పెద. 199

సీ. వర్గత్రయంబునవలనను సప్తాంగ
ములయందుఁ జిత్తంబు మెలఁగుచుండ
రాజులు మజ్జనభోజననిద్రావ
సరములు లోనుగా జనులు సేయు
విజ్ఞాపనము విని యాజ్ఞాపనం బొన
రించుచు మంత్రులుఁ బ్రేమపాత్ర
తరుణులు నస్వతంత్రతఁ జేయ నర్థుల
కొసరి తిండియు ధనగుప్తిమీఁది

తే. భరముఁ దమలో విరోధు లై పట్టి మనసుఁ
జిక్కువఱుపంగ బెక్కండ్రు సిరికి నడువఁ
బరిహరించుచు బహుదుఃఖపరులు నల్ప
సౌఖ్యులును నగుచునికి రాజ్యంబు తెఱఁగు. 200

ప. వారలు ముక్తులు గామి దెల్లం; బది యట్లుండె; నీకు విశేషించియు. 201

చ. సదయమనీషఁ బంచశిఖసంయమి మోక్షము దెల్పనంటి నీ
హృదయము నాదుచొచ్చటకు నెంతయు రోసితి; ముక్తుచందమే
యిదిఁ నిరపేక్షుఁ డైన విను మెయ్యది యెట్లయినం బ్రశాంతిసం
పద నొకయింతయుం గలఁగబాఱక యుండఁడె నిర్వికారుఁ డై. 202

క. విను; శూన్యస్థానంబున
నునికి యతికిఁ గృత్య మగుట నుర్వీశ్వర! ము

క్తుని మానసంబు శూన్యం
బని చొచ్చితి ముక్తి లేమి నది దప్పయ్యెన్. 203

వ. అట్లుంగాక. 204

ఆ. కాలుఁజేయు మొదలుఁగాగల నాయంగ
కములలోన నిన్నుఁ గలయ దొకటి
యేని; రిత్త యిప్పు డేటికిఁ గటకం
బడుచు నిట్లు దూరఁ బలికి తధిపఁ 205

వ. అని యమాత్యుల దిక్కఁజూచి. 206

ఆ. వీరు పెద్దవారు వీరలు విన నిట్టి
తులువమాటలాడ దొరకుఁ దగునెఁ
యెదిరిఁ దూలపుచ్చు టే మంచి వెరవుఁ గాం
భీర్యహాని దలఁచు పెంపు లేదెఁ 207

క. వనితల పురుషులయెడఁ బు
ట్టినయది వెల్లివిరిసేఁత దిమ్మరితన మె
ట్టి నికృష్టం డైనను ని
ప్పనికిఁ జొరఁడు; దగునె యిది నృపాలసుతునకున్. 208

చ. బిసరుహపత్ర లగ్న జలబిందువుచాడ్పున సంగవర్జితో
ల్లసనమునన్ వసించితి నిలావరఁ నీమది నిట్టిదానిఁ గాఁ
బొసఁగనెఱుంగనైతి; ననుఁ బొంకఁగు టేర్పడియెన్ విముక్తిచొ
ప్పు సదయవృత్తి నీకు మునిపుంగవు చెప్పుట మాటలేటికిన్. 209

క. నీవు గృహధర్మపరతయుఁ
బోవిడిచితి నీకు మోక్షమును విదితముగా
దేవలనికిఁ గాకిట్లుధ
రావరఁ మిథ్యాప్రబోధరతుఁడై తరయన్. 210

క. ముక్తులు ముక్తులఁ గలయుట
యుక్తమ; యది నభము నభము నొందు తెఱఁగు; నీ
ముక్తత బొం కని దీనిని
సక్తతగా నీవు గనుట సాలదె తెలుపన్. 211

వ. మనము ముక్తులము గాకున్నను మనకు సాంగత్యము గలుగుట నింద్యంబు గా దెట్లంటేని. 212

సీ. నిఖిలజన శ్రోత్రసుఖకరం బగుచరి
త్రమునఁ బెంపారెడు ప్రథనన్నృపతి
కులమునఁ బుట్టితి; సులభ నాపేరు; మ
త్పూర్వులు శతశృంగమ నను ద్రోణ
మునను శక్రద్వారమున మహాధ్వరములు
సేసిరి; విను, పాకశాసనుండు
దమపాలి కేతేరఁ దద్గోష్ఠిఁ బరమార్థ
చింత సేయుదురు; భూకాంత! యేను
తే. నాకు నెనయైన పురుషుండు లేకయునికి
మోక్షధర్మప్రవర్తనమునఁ జరింతుఁ;
గాన నీచూచువర్ణసాంకర్య మస్మ
దీయసాంగత్యమున లేమి దెల్ల మరయ. 213

క. నను డాఁపనేల? దానం
గనియెడునది గలదె? ముక్తి గలదో లేదో
జనకున కరసెదఁ గా కని
చనుదెంచితిఁ; దప్పె యది విచారింపంగన్. 214

క. అని యిట్లు వలుకుపలుకులు
విని పలుకక యున్న జనకవిభునాననముం
గనుఁగొని సులభ నగుచు ని
ట్లనియె నతనితోడఁ గౌరవాన్వయముఖ్యా! 215

తే. అగ్ని వెచ్చనొ చల్లనో యని మనమునఁ
గరము సంది.యు మందుట గాదె నిన్ను
నధిప! ముక్తుండవో కావొ యని తలంచు
టది మదీయబాలిశభావ మని తలంపు. 216

చ. జనవర! నీసుభాషల నసత్య మొకండును లేదు; నీవు స
న్మునిగణకీర్త నీయుఁడవు; మోక్షము నీకఱచేతిలోనిదై
యునికి దృఢంబుగాఁ గనియు నొండొకచందము మాటలాడితిన్
నిను నగుపింపఁగా వలసి నీదగుమన్నన శంక వాసినన్. 217

క. అవియెల్ల నసత్యంబుల
యవనీశ్వర! యరయవచ్చుటది యొక్కఁడు ని
క్కువ; మీయపరాధము భవ
దవిరళసౌజన్యమగ్న మగుఁగాక తగన్. 218

క. సులభానామము సంస్కృతి
పొల మొల్లక తిరుగుటయును భూలోకవరా!
కలరూప నేఁటి కిచ్చట
నిలిచెద నీవు మునిసేవనీయుఁడ వగుటన్. 219

తే. అనినఁ దానును మంత్రులు సవ్విభుండు
సులభఁ గొనియాడె; నాఁడెల్ల నలఘుగోష్ఠి
బ్రియము రెట్టింప నయ్యోగినియును దారు
నెమ్మి నొక్కట నుండిరి నృపవరేణ్య! 220

వ. మఱునాఁ డజ్జనపతి యనుమతిసేయ నమ్మహానుభావ నిజేచ్ఛం జనియె నని చెప్పిన నప్పారహోత్తముండు ప్రమోదాయత్తస్వాంతుం డయి శాంతనవునితో 'శకుని కెవ్విధంబున వైరాగ్యంబు సొప్పడియెం జెప్పవే' యనుటయు నతండా ధర్మసుతున కిట్లనియె. 221

—: వేద్యవ్యాసుఁడు శుకున కుపదేశించిన వైరాగ్య ప్రకారము :—

సం. 12 – 309-2

సీ. ప్రాకృతజనులవర్తనములవెంటఁ జి
త్తమున జరామరణముల కలిమి
దలఁపక యేమఱి మెలఁగెడు శుకుఁ జూచి
విపులధర్మజ్ఞాననిపుణధిషణుఁ
డై నవేదవ్యాసుఁ డాతని కిట్లను-
మనసు నింద్రియములు మర్దితములు
గాఁజేయు ముత్పథగాములుగా నీకు
మ్రక్రోధసత్యశమార్జనములుఁ
తే. దపము దమము నహింసయు ధర్మమునకు
నాకృతులు వీనిఁ బాలింపు మాఁకలియును
నీరువట్టును దగియెడు నెఱి నడంచి
దేఁహతాతిథిశేషోపజీవి వగుము. 222

క. నురువున నొనరించినపం
జరంబులో నున్నపులుఁగుచాడ్పున మేనం
బురుషవరఃజీవ ముండుట
పరికింపక యేమఱంగఁ బాడియె నీకున్. 223

తే. ఎన్నికొనుచుండఁ జనుచుండు నేండ్లు లివ్వి
ధమున నాయువు దోడ్తోడఁ దఱిఁగి జీవ
హాని వాటిల్లఁగాఁ బుత్రఃయనవధాన
నిద్రమోహితుఁడై యున్కి నీకుఁ దగునెఃఁ 224

క. విను, మాంసశోణితవివ
ర్ధన మగు నైహికమునందుఁ దత్పరులు పరం
బని యొకటి కలిమి దలఁపరు;
గొనరు బుధులమాట నాస్తికులు వినయనిధీ! 225

తే. బుద్ధిమంతుల తెరువునఁ బోక యుత్ప
థ్రపవర్తుల నడచుపథంబునందుఁ
జనుట విను, మప్పటికిఁ జూడఁ దనకుఁ జాల
నించి యుండు నాపద యెనరించుఁ బిదప. 226

చ. తన తన ధర్మమున్ నడపి దానన సంతసమంది శాంతభా
వనరతి నుండువారిఁ గని వారలచెప్పెడుధర్మవృత్తి ని
చ్చెనయుఁగ నూఁది సత్పదముఁ జెందుట కెక్కుమ పొ త్తినూలి ప్రపు
వ్వునెనయుఁ గాకు బంధకుఁడవుం దన కజ్ఞుఁడు దాన యమ్మెయిన్. 227

తే. అస్థిరేంద్రియసలిలమయంబుఁ గామ
రోషదారుణగ్రాహ ప్రదూషితంబు
నై న సంసారసాగరమతుల ధైర్య
పోతపా తిక ని సరింపుము కుమార! 228

క. కామాదిత్యపుఁడై నరుఁ
డేమఱియుండంగ గొఱియ నెత్తెడు పులియు
ద్దామత మృత్యువు గొని చను
నామూఢుని యట్లు గాకు మతులవివేకా! 229

తే. బ్రాహ్మణత్వంబు గడుదుర్లభంబు; దాని
నెట్టకేలకుఁ గని కడయెద్దుఁజేయ
వలదె తపము దమంబు నిశ్చలవివేక
సంపదయు నూఁది నరుఁడు దుస్సంగ ముడిగి. 230

క. విను; విప్రశరీరము సుఖ
మునకే? బహునియమదుఃఖముల నిహమునఁ జెం
దను నిత్యసౌఖ్యముం బర
మునఁ బొందను బుట్టెఁగాక బోధప్రవణా! 231

క. బలితపుటురి గామంబున
నిలుచుట యారజ్జు ద్రెవ్వ నీలిగి సుమతుల్
వెలువడి చని సుఖ లగుదు ర
వ్వల నెఱుఁగరు పడుదు రంద వత్స! దుర్మాతుల్. 232

తే. తాను దెగునేని బాంధవదారపుత్ర
మిత్రులను నజ్ఞనంబు లేమిటికి విగత
చింతుఁడై గుహ సొచ్చి యశ్రాంతబుద్ధిఁ
దడవి కానంగవలవదె తన్నుఁ దాన. 233

తే. జరయు మరణంబు మర్త్యుని జన్మమాది
గాఁగ వెనువెంటఁ దగులు నగ్గంబు వేచి;
యెల్లి సేసెద ననక మే లిపుడ చేయు;
తనయ! వార్చునె మృత్యువు జనుల పనులు? 234

ఆ. అశ్మశానగమను లంతియ చుట్టంబు
లగ్నిఁ గలపి మరల నఖిలమైన
జ్ఞాతిజనము దీనిఁ జర్చింప కందఱు
యందు మమతఁ బెనుచు నజ్ఞుఁ డనఘ! 235

క. లోకము కాలముచే ని
ట్లాకులపడుచునికి గాంచి యధికధృతిని ధ
ర్మైకాంతతానిరూఢిం
గైకొని శ్రోవంగ వలదె కాలవిక్రతులన్. 236

క. మానుషము దుర్లభము సో
పానం బగు నది వివుక్తిపదము గనుటకున్;
దానిఁ గని తొంటిచందము
రానిక సముద్యమమునఁ బ్రాఁకఁగ వలదే. 237

క. అనఘా! తపోవనమునన
జననంబును మరణదశయు సంప్రా ప్తము ల
య్యెనయేని వాఁడు ముక్తుఁడె
మనంబు బహుకామవికృతి మగ్నంబై నన్. 238

తే. భోగములు సంపరిత్య క్తములుగఁ జేసి
కేవలాంగుఁడై నిర్మలభావయు క్తిఁ
దపము గృహమున నేనియుఁ దత్పరతఁ జ
రించి సంసారజలధిఁ దరించు నరుఁడు. 239

క. విను; దారపుత్రమిత్రులు
సనిరి కొడుక! మున్ను చనినజన్మంబుల నీ
కును వారు వారలకు నీ
వును మఱుపుట్టువులఁ గొఱయవుట గల్గెనొకో ! 240

ఆ. ఏన కలను; నాకు నెవ్వరివానిఁగా
నాత్మఁ దలఁతు నన్ను నట్టివాని
నెందుఁ గానఁ; గాన యెవ్వరివాఁడను
గా ననంగ వలదె మాననీయ! 241

క. దారాపేక్షం గష్ట
ప్రారంభముఁ బూని యిహమునందుఁ బరమునన్
వారని సంక్లేశంబులఁ
గూరు నరుఁడు; దానిఁ జేయ గొనకొంత్రె బుధుల్ ? 242

చ. ధన మది యేల భోగమును దానము లే దగు నేని; శత్రుమ
ర్థన మొనరింపఁడేని బలదర్పము లేల? సధర్మవృత్తికిన్
గొనకొనఁడేని విన్క ముసికుంజర యేల జితేంద్రియుండు; గాఁ
డనఁ జనునేని నాత్మవిధ మారయు నాక్రమ మేల చెప్పుమా ! 243

క. అని యిట్లుపదేశించిన
వినిశుకుఁడు విముక్తిమార్గవిదుఁడై చనియెన్
జనకుఁ దొఱఁగి నిశ్చలదీ
పనిభాత్ముం డగుచుఁ గురున్నృపాలవరేణ్యా ! 244

క. అనిన విని దేవతటినీ
తనయుతోఁ బాండురాజతనయాగ్రజుఁ డి
ట్లనుఁ బ్రీతియు వినయము నా
ననమునఁ దఱుకొత్త నరతనయవంశవరా ! 245

-: భీష్ముఁడు ధర్మరాజునకు శుకుని జన్మప్రకారంబు నెప్పుట :-

సం. 12-310-1

వ. 'కృష్ణద్వైపాయనపుత్రుం డనుమాత్రమకాని శుకుని జన్మంబు తెఱంగును,
నతనిత ల్లిని, నతండు బాల్యంబున మహాసుభావుం డగుటకుం గతంబును,
నతండు సిద్ధివొందినభంగియు నెఱుంగ; నవియెల్ల నెఱింగింపుము.' 246

సీ. అనవుడు నతఁ డిట్టు లను నాతనికిఁ 'గర్ణి
కారవనం బన గలదు మేరు
తటమున; నం ద్రితనయయుఁ దానును
బశుపతి లీలమైఁ బ్రమథగణము
గొలువ నుండఁ దనూజుఁ గోరి వేదవ్యాస
సంయమి దత్ప్రదేశమున యోగ
బలమూర్జితముగఁ దపం బొనరించె; యో
గమునకు రాజసూయములు నశ్వ

ఆ. మేధములును నపరిమితము లై నను సరి
గావుసూవె! వినుము, కౌరవేంద్ర!
త త్తపోవిశిష్టతకు మెచ్చి శివుఁడు ప్ర
త్యక్షమై 'యభీష్ట మడుగు' మనిన. 247

వ. అమ్మునీశ్వరుండు భక్తిసంభ్రమభరితుం డగుచుం దండప్రణామంబు సేసి.

క. 'జలపవనాంబరవసుధా
నల సమవీర్యుఁ డగుపుత్రు నా కొసఁగంగా
వలయు'ననుఁడు 'నిచ్చితి' నని
పలికి చనియె నమ్మహాకృపామూర్తి నృపా ! 249

వ. ఇట్లు లబ్ధవరుఁ డగుచు సత్యవతీసుతుం డగ్నికార్యపరుం డై యరణి వుచ్చి కొని మథింపం దొడంగిన ఘృతాచి యను నప్సరోవనిత లోచనగోచరం బగుటయుఁ దానునుం గామగోచరత్వంబు నొందిన నయ్యిందువదన యమ్మునితెఱం గెఱింగి వంచనం జిలుక యయియుండె; నతండును ధైర్యం బవలంబించి యరణికార్యప్రవణుండై యుండం బ్రబలుం డగు నంగజునిచెయ్ది నప్సరోరూపాతిశయసక్తచిత్తుం డైన యాసంయమి శుక్లం బయ్యరణి యందుఁ బడియె; నవ్విప్రుండు నిర్విశంకం బగు నంతఃకరణంబుతో నరణి మథనం బొనరించిన. 250

తే. అయ్యరణిఁ బుట్టి జనకసమాకృతియును
భూరికాంతియు వెలుఁగంగఁ బొలిచె శుకుఁడు
యాగకాల సుసంభృత హవిరవాప్తి
మహితతేజస్కుఁ డగు హుతవహునిమాడ్కి. 251

సీ. అపుడు మందాకిని సాకార యై వచ్చి
మంగళస్నానసమన్వితుఁడుగ
నొనరించె; నాకసంబుననుండి పడియెఁ గృ
ష్ణాజినదండంబు లతనియెదుర;
దివ్యదుందుభులును దేవాంగనాగాన
ములును వీతెంచె; నద్భుతముగాఁగఁ
గుసుమవర్షంబులు గురిసె; నింద్రాదిదే
వతలు గారవమున వచ్చి; రంబి

తే. ఁ సమేతుఁడై యేతెంచి కామవైరి
యతని నుపనీతుఁ గావించె; నమరనాథుఁ
డుజ్జ్వలంపుఁ గమండలు వొసఁగె; నిచ్చి
రమరు లెన్నండు మాయనియంబరములు. 252

క. మృగపక్షిసమూహము లా
దిగఁ గల్గు చరాచరముల దివ్యప్రభవుం
డగు శుకునిపు ట్టొనర్చెం
బ్రగాఢతమ సంప్రమోదభరితంబులుగాన్. 253

క. జనియించిన మాత్రన య
మ్మునిపకిశోరమును వేదములు వొందెను; ద
జ్జనకు మునుపొందిన తెఱఁ
గున నబ్బాలుఁడు వరించె గురుఁడుగ ధిషణున్. 254

వ. ఆచారపరిపాటి యవలంబించి యి ట్లుపాధ్యాయవరణంబు సేసి. 255

తే. అతఁడు సదివింప వేదవేదాంగధర్మ
శాస్త్ర రాజ్యనీత్యాధిక సకలవిద్య
లును గ్రమంబునఁ జదివి యమ్మునికుమారుఁ
డచ్చటన యుండె ప్రతిచర్యలందుఁ దగిలి. 256

వ. దేవతలకు లోనుగా నామంత్రణీయుండును మాననీయుండును నగుచు నట్లుండు నయ్యారణీయుండు నిజాశ్రమంబున నున్న తండ్రిపాలికిం జను దెంచి తదనుసరణప్రక్రియం బ్రవర్తించు నెడ నచ్చేరువం జరియించు మునికుమారులతోడి యాటలు మరిగి లోకంబుతోడిపాటియై యాత్మానుసంధానంబు సేయలేక మెలంగుచున్నం జూచి యాసత్యవతీసుతుండు సాంఖ్యయోగశాస్త్రంబు లతనికి నధిగతంబులు గావించె; మఱియు దేహంబునందలి యహంకారంబంతయు బంధులవలని మమతయుం బాయునట్టివాక్యంబులుపదేశించె; దానం బ్రబోధం బుదయించుటంజేసి యమ్మహామతికి బ్రహ్మచర్య గార్హస్థ్య వానప్రస్థభిక్షుకంబు లను నాశ్రమంబులు మూఁటను బుద్ధి

రమింపదయ్యెఁ నయ్యెఁ బరమపరుం డప్పారాశర్యుతో 'మోక్షప్రదం
బెయ్యది దాని నెఱింగింపవే' యనుటయు. 257

ఆ. అతఁడు మోక్షధర్మ మగుట నిరూపించి
యమ్మహాముసీంద్రుఁ డతనితోడ
వత్స కానఁ బొమ్ము వై దేహుఁ డగు జన
కక్షితీశు వినయగౌరవమున. 258

క. గగనంబునఁ జను టుడుగుము;
తగంగఁ బాదప్రచారితన చను మిథిలా
నగరమునకు; నమ్మునిమా
న్యగుణుం గను; మోక్షధర్మ మతఁ డెఱిఁగించున్. 259

క. ఆరాజన్యు నేడ నహం
కారిత మమకారితయును గర్తవ్యము; గా
దేరికి నైనను బూజ్యుం
డారయ నాతఁడు; వినీతియ తగుం జుమ్మీ ! 260

ఆ. అనిన నట్లకాక యని మేరుముఖనగం
బులు ననేకనదులుఁ బలుదెఱఁగుల
దేశములను వివిధతీర్థంబులును జుల్కఁ
గడచివచ్చె భరతఖండమునకు. 261

వ. వచ్చునప్పు డెయ్యెడ నేపదార్థంబులఁ జూచినం జూడనివాఁడపోలె వచ్చె;
నిట్టువచ్చి విదేహజనపదంబు సొచ్చి మిథిలాపురంబు నుపవనంబు దఱిసి చని
తటీయ ప్రాకారద్వారదేశంబు సేరిన సమయంబున. 262

ఆ. ద్వారపాలు రచట వారింప శాంతిమై
నూరకున్నఁ జూచి వారు వెఱచి
లోని కెఱుకచేసి లోఁగుచు వారు ద
న్ననుప నరిగె నృపగృహంబు సేర. 263

క. అచట బ్రతిహారు లాఁగిన
నచలితశమవృ త్తి నుండె; నవ్వే్రతధరుల్
ప్రచలితమతులై యాతెఱఁ
గుచితంబుగఁ జెప్ప న్యపతియుఁ బురోహితునిన్. 264

తే. అరయఁ బుత్తెంచె నాతఁడు నరసి పోయి
నిజ మెఱిఁగింప భ క్తివినీతిసంభ్ర
మములు ముప్పిరిగొనఁగ నమ్మనుజనాథుఁ
డఖిలమంత్రులు బుధులుఁ దో నరుగుదేర. 265

చ. శిరమున నర్ఘ్యపాత్ర గొని చెచ్చెర వచ్చి ప్రియం బెలర్ప న
గ్గురుసుతుఁ గాంచి యంతిపురికోటకు లోనగు నొక్క సౌమ్యమం
దిరమున కమ్మునిం గొనుచు దేవసమ్రతిపత్తి నేఁగి ర
త్నరుచిరకాంచనాసనమునం దగ నుంచి సునీతపాద్యుఁ డై. 266

క. లలితాక్షతములఁ గుసుమం
బులఁ బూజితుఁ జేసి యర్ఘ్యమును గోవును న
క్కులపతికి నిచ్చె; విధిపరి
కలనజ్ఞుం డైన యతఁడుఁ గై కొనియెఁ దగన్. 267

వ. జనకుండు సవినయంబుగా నిలుచుండి యమ్మని యనుమతిసేసిన మఱి
మహియంద సమాసీనుండై తానును మంత్రులు విద్వజ్జనంబులు గొలిచి
యుండె; నట్టియెడ నన్నరపతి పరివారజాతం బెల్లను కౌతుకంబునం జను
దెంచి యంతంత మ్రొక్కుచుం జూచుచుండ. 268

తే. రూపవిభ్రమముల నప్సరోజనంబుఁ
గ్రేణిసేయు వారాంగనాశ్రేణి గీత
నృత్యనిరతి నారాధింప నిర్విశేష
యోజితేంద్రియుఁ డై యతఁ డుండె నధిప! 269

చ. అతనికి నన్నపానముల నంచితభ క్తి నొనర్పఁగాఁ బురో
హితు నియమించి యవ్వసుమతీశ్వరుఁ డద్దివశేషయామినుల్

చతురము భక్తియుక్తమును సంప్రమదంబునుఁగా నయించె స
మ్మిత మృదుసారభాషణసమీరణతం దదుపాంతవర్తి యై. 270

వ. మఱునాఁ డమ్మహీపాలుండు గాలోచితకృత్యంబు లాచరించి కృతకరణీ
యుండును సుఖాసీనుండును నై యున్న యమ్మునిపాలికి సూరిజనసమే
తంబుగాఁ జని పరివేష్టించి యుండి కేలు మోడ్చి మీ రిట విచ్చేయుటకుం
గతం బేమి?' యని సవినయంబుగా నడిగిన నమ్మహాత్ముండు 'మా తండ్రి
పంపున మోక్షమార్గబోధార్థి నయి వచ్చితి; విప్రునకుం గర్తవ్యం బెయ్యది;
మోక్షం బేమిటం బడయ వచ్చు నెఱింగింపవే' యనుటయు నతండు సవిశేష
సమాదరుం డై. 271

—: జనకుఁడు శుకున కుపదేశించిన మోక్షధర్మప్రకారము :—

సం. 12 - 313 - 9:

సీ. వినుఁ: యుపనీతుఁడై విప్రుండు బ్రహ్మచ
ర్యంబు వేదాభ్యసనంబు నడపి,
దారసంగ్రహము సంతానసంపాదనం
బును నధ్వరక్రియయును నొనర్చి,
దేవపితృతిథిపూజావిధిపరుఁ డగు
చుండి, వనమునకు హుతవహప్ర
యుతముగఁ జని, యందు నతిథులఁ గొనియాడి
వ్రతము గషాయపక్వత నొనర్ప

ఆ. నగ్ను లాత్మయంద యారోపితములుగఁ
జేసి వీతరాగచిత్తవృత్తిఁ
బరమశాంతిఁ బొంది బ్రహ్మాశ్రమపదంబుఁ
బొందువాఁడు లోకపూజ్యచరిత! 272

వ. అనిన విని యమ్మునివరుండు. 273

క. జ్ఞానోదయ మై యుండఁగ
మానక వెండియును నాశ్రమత్రయవాసుం
డై నిలిచి తత్క్రియాను
ష్ఠానము క్రమవృత్తి నడపుటయు వలయునొకో! 274

తే. జ్ఞానవిజ్ఞానదృష్టి శాశ్వతకతత్త్వం
డయ్యెనేనియు విడువ రాదాశ్రమముల
క్రమసమారూఢి యనునె వేదములు దీనిఁ
దెలియ జెప్పవె మోక్షవిత్తిలకజన్మ! 275

వ. అనవుడు నతం డతని కిట్లనియె. 276

తే. జ్ఞానవిజ్ఞానములు మోక్షసాధనములు
గురుని యుపదేశమున కవి దొరకొనంగ
దానమోక్షంబు గాంచినవాఁడు విడుచు
నయ్యుపాయద్వయంబును నతులబుద్ధి. 277

క. లోకోచ్ఛేదముఁ గర్మ
వ్యాకులతయుఁగాక యుండ వలయుటకై సు
శ్లోకా! చతురాశ్రమములు
గైకొని నడపిరి దృఢంబుగాఁ బూర్వమునుల్. 278

తే. అందుఁ దుదమొట్ట నడచిన నందవచ్చు
ముక్తి; బహుజన్మసంసిద్ధ మోక్షకార
ణముల శుద్ధుఁడై ప్రథమాశ్రమమున యంద
కాంచు మోక్ష మెందేని నొక్కరుఁడు మునిప! 279

క. వానికి మూఁడాశ్రమముల
లో నిలువఁ బ్రయోజనంబులుం గలవె తమో
ధీనతను రజఃపరత
న్మానవలయుఁగాక సత్త్వనైష్ఠికమతి యై. 280

తే. సత్త్వమార్గాభిరతి యాత్మతత్త్వదర్శ
నంబు గావింపఁ దనుఁ దాన నరుఁడు గాంచు;
విశ్వమునఁ దాను దనయందు విశ్వమును వ
సించుటయుఁ జూచుచును ముక్తిఁ జెందియుండు. 281

వ. ఇవ్విషయంబున యయాతివాక్యంబులు గల వాకర్ణింపుము. 282

అ. జ్యోతి యాత్మయంద యున్నది కాన శ
క్యము సమాహితాత్మఁ డైన మునికి
నొరులవలనఁ దనకు నొరులకుఁ దనదెస
భయములేక యున్నఁ బరముఁ గాంచు. 283

క. కోరికయు నొల్లమియు లే
కేరూపున భూతములకు నెగ్గు తెఱఁగుం
జేరక యకామవృత్తి ద
పోరతి నున్నతఁడు బ్రహ్మముం బ్రాపించున్. 284

క. వినఁ జూడం బడునం దె
ల్లను సమతం బరముఁ గనుచు లౌల్యనిరసనం
బున సుఖదుఃఖాదిద్వం
ద్వనిరూఢుఁడు గాక యున్నతఁడు ముక్తిఁ గనున్. 285

క. ఇనుమును గనకము నింపయు
వినుతియె సమములుగఁ గొనుచు వివిధాంగకముల్
దనలోన నడఁచుకమఠము
ననువున నింద్రియము లడఁచు నతఁడు గను శివున్. 286

వ. అని చెప్పి. 287

తే. అవ్విశేషంబులెల్ల నీయందుఁ గలుగు
టనఘ! భవదీయజనకదయాసమృద్ధి

సిద్ధదివ్యబోధంబునఁ జేసి
తోఁచె నవ్విధముకంటె నీచంద మధికతరము. 288

క. నీ వట్టిఁడ వగు టెఱుఁగవు
భావంబున సంశయమును భయమును బాల్యం
బావేశింపఁగఁ జేయ న
భావితనిశ్చయుఁడ వగుటఁ జరమమునీంద్రా ! 289

క. జ్ఞానము విజ్ఞానము నీ
మానితగుణములగునవి నమ్రగము లైనం
గానేరదు మోక్షపదము
గానుపు దృఢనిశ్చయుండు గాకున్నేనిన్. 290

తే. ఒక్కకొఱఁతయు లేదు నీ వుదితమోక్ష
బోధుఁడవు సంశయమ లెల్లఁ బోవవిడిచి
నిశ్చయింపుము నీకన్న నెలవు శాశ్వ
తంపునెలవుగ విషయావికంపితాత్మ ! 291

-: శుకుఁడు హిమవంతంబున నున్న వ్యాసునియొద్దకు వచ్చుట :-

సం. 12 - 314 - 2

క. అని బోధించిన జనకువ
చనములు విని శుకుఁడు విగతసంశయుఁడై శాం
తినిరూఢిఁ బరమసౌఖ్యం
బు నొంది తనుఁ దాన కనుచుఁ బోవుచునుండెన్. 292

తే. మారుతముతో సమానధర్మత్వ మొంది
యత డుదజ్ముఖుండై నిఖిలామరులును
మునులు గరుడగంధర్వాదులును గుతూహ
లమున వసియించు శిరశ్శైలమున కరిగె. 293

సీ. కురువంశముఖ్య! యగ్గిరి పుణ్యావిభవస
మేతంబు; విను, మమ్మహీధరమునఁ
బరమేశ్వరుండు దపం బేకపాదస్థుఁ
డై బహువర్షంబు లాచరించెఁ;
బుత్రలాభార్థిత్వమునఁ గృష్ణుఁ డుత్కృష్ట
నియమాచరణములు నిష్ఠసలిపె;
షణ్ముఖుం డాత్మీయశక్తి ప్రభావంబు
దెలిపి దేవాధికతేజుఁ డయ్యె;

తే. మఱియుఁ బెక్కండ్రు మునులు నమర్త్యులును సు
చరితములఁ బెంపునొంది రాశైల మావృ
షాంకునకుఁ గూఁతు నిచ్చె; యాగాంగయోని
యగుట నజుఁడు దదాత్మత్వ మర్థిఁ బొందె. 294

వ. అట్టి మహామహిమగల గు నాహిమవంతంబునకు మున్న వచ్చి సుమంతు వైశం
పాయనజై మినిపై ల నామధేయు లగుశిష్యులం గరుణావిధేయుం డగుసాత్య
వతేయుం డధ్యయనంబు సేయించుచుండం బుణ్యతమంబుగుతదాశ్రమంబు
భానుప్రభానిభం బగు నిజకాంతివిసరంబున వెలుంగ నయ్యారణేయుం డమ్మని
పాలికిం జని తాను యోగబలంబున ననేకంబు లై న గిరిసరిదరణ్యాంబులు గడచి
యెందునుం దగులువడక కార్ముకజ్యానిర్ముక్తశరంబుచందంబున నేతెంచుట
కుం బ్రీతుం డగు నప్పాశనందనుపాదంబుల కభినందనంబు సేసిన నతం డభి
నందింపనాసన్నక్షమాసీనుండై జనకజననాథసంవాదవిధంబు విన్నవించి విశేష
మ్మదం బావహించె;నిట్లరణిసుతుసమాగమంబు నొంది. 295

క. అమ్మునియును శిష్యులతో
నమ్మహితాత్ము నునిచికొని యధ్యాపనశీ
లమ్మగుచిత్తముతోడ సు
ఖమ్మండఁగ నొక్కనాఁడు గౌరవ మొప్పన్. 296

వ. కొలిచియుండు సుమంతుప్రభృతులు నలువు రతనితో 'దేవా! శుకుండు మొద
లుగాఁగల యే మేవురము వేదవిషయప్రఖ్యాతి నెల్లవారికంటె నెక్కు-డు
గావలయు; మమ్ముంబోలె నొడ్ల నాదరాధిక్యంబున భరంపడి సవిశేషంబుగా
నధ్యయనంబు సేయింపకుండుట మాకు వరం'బని విన్నవించిన వీతపక్షపాత
చిత్తుం డగు నత్తాపసోత్తముండు. 297

తే. భక్తుఁ డగుబ్రాహ్మణునకు వాగ్బ్రహ్మ మఖిల
మును బ్రియంబున నిచ్చుసజ్జనునిచేతి
లోనియది బ్రహ్మలోకంబు; దీని మీర
లేర్పడఁగ నెన్నఁడును విని యెఱుఁగ రెట్లు ? 298

క. వినుఁ డెల్లవారు దుర్గం
బును గడచి శుభంబు నొంది పురుషార్థములం
గనువార కాక యనియెడు
ననుగ్రహము వలదె యిట్టు లనఁ దగునే. 299

చ. అనుటయు వార లొండొరుల యాననముల్ గనుగొంచు నవ్వి యి
ట్టని రటులేనిఁ బోదుమె దయాపర శైలను డిగ్గి భూమి నెం
దును జరియించి యధ్యయనదోహలులం జదివించి యాజనం
బు నడపి నీకృపారసముపొంగు నిగుడ్తుమె యెల్లచోటులన్. 300

చ. అనవుడు 'మున్న యిట్టులనరైతిరి; వోవఁగ నీను మిమ్ము; నెం
దును గడువెడ్డు వెట్టితిరి దోహల మిమ్మెయి నుండ జాణ లై
నిను నిటు వే ఱొకం డడిగి నావచనంబులు మీమనోరథం
బున కిటు సాధనంబులుగఁ బోకలఁబోయితి' రంచు నవ్వుచున్. 301

తే. తమ్ము సంప్రీతిఁ గనుఁగొను నమ్మునీంద్రు
చరణకమలంబులకుఁ జక్కఁ జాఁగి మ్రొక్కి

రన్నలువురును; వారల నతఁడు దివిచి
కరుణ సిగురొ త్త బిగియారఁ గౌఁగిలించి. 302

న. దీవించి'యెయ్యదిసేసిన నప్రమాదాయ త్తచి త్తులరై చేయుండు; త్రిలోకంబు లందును మీకుం బ్రియంబై నచోటుల వ ర్తిల్లుం డని వేడుకొలిపిన జని వార లధ్యాపనయాజనవిశేషంబుల నశేషదేశంబులు నలంకరించుచుండి రట్టియెడ.

క. నారదుఁడు వచ్చి ప్రీతిం
బారాశర్యునిఁ గాంచి 'బ్రహ్మనినాదం
బీ రున్నచోట లేమికిఁ
గారణ మేమియొకొ' యనుడు గారవ మెసఁగన్. 304

క. అతఁ డతనితోడ 'శిష్య
ప్రతతి యిచట లేమి యనుడు బ్రహ్మర్షి వరా
సుతుఁడును నీవె నను ద
ద్వ్రతంబు సెల్లించుచుండవలదే యనినన్. 305

క. నారదునివచనములుఁ బెం
పారం గొనియాడి భువనమంతయు నాదా
పూరితముం జేసె నమ్మునిఁ
సారాధ్యయనమునఁ బ్రతసంయుక్తుండై. 306

వ. ఇ ట్లయ్యిరువురు నధ్యయనంబు సేయ మహావాయువు బెట్టువీచిన నవ్విశేష జ్ఞుండు పుత్రుతో ననధ్యయనసమయం బగుట సెప్పి తదధ్యయనంబు వారించి తానును నూరకున్న, నయ్యారణేయుండు 'నియ్యత్యధికమారుతం బెక్కడిది ? యని యడిగిన నఖిలభూతవేదియగు వేదవ్యాసుండు దేవయానంబునవిష్ణుండును బిత్యయానంబున భానుండును నూర్ధ్వాధోగమనపర్యాయరూపంబునంబ్రవ ర్తిల్లుదు రది పవనాలంబనకలితంబై చెల్లుఁ; బవనుల వినుము దెప్పెద: సమానుండు దైవతసంఘసంభవుం, డతనికి నుదానుండును, నుదానునికి వ్యానుండును, వ్యానునికి నపానుండును, నపానునికిఁ బ్రాణుండునుజనియించిరి; జగంబులు

వీరిచేత సంవ్యాప్తంబులై యుండుం; బ్రవహుం డావవహుం డుద్వహుండు సంవహుండు విసహుండు బరాహుం డనం బవనులు సప్త సంఖ్యు లదితిపుత్రు లఖిలభువనవ్యాప్తులై చరియింతురు; వారు సమానాదిపవనపంచక మహితా తాత్ములు,వారలవలన వర్షంబులకుం బ్రవర్తనివర్తనంబులు గలుగుచుండు; వివిధదై వతవిమానంబులకును మహితయానం బావహిల్లు; నొకొక్కనాఁడువిష్ణుని విశ్వాసవేగంబు. 307

క. అప్పవనములను గలఁచిన
నిప్పరు సగు వికృతవాయు విది దీని రయం
బిప్పుడు మహనీయం బగు
నిప్పర్వతమును జలింప నెసకం బెసఁగెన్. 308

తే. ఇట్టి యప్పుడు సదివిన నెల్ల భంగి
నెడరువుట్టుఁ; గావునఁ జదు వుడుగవలసె;
ననియెఁ బదపడి ప్రకృతిస్థ మయ్యెఁ బవన;
మఖిలభూతంబులకు సౌఖ్య మావహిల్లె. 309

వ. స్నానకాలం బయ్యె ననిపలికి పుత్రునకు 'నీవు చదువుచుండు' మని చెప్పి యప్పారాశర్యుం డాకాశగంగాప్రపాతప్రదేశంబునకుం జనియె; నయ్యారణీ యుండును నారదుం డాకర్ణింపఁ గొంతసే పధ్యయనంబు సేసిన నద్దేవముని మెచ్చి యతనితో 'నీకు మేలొనర్చెద;నిష్టంబు సెప్పు'మనిననతం'డీలోకంబునం బుట్టినవానికి హితం బెయ్యది దానిం జెప్పవే' యనుటయు నమ్మహాత్ముండు' దొల్లిసంయములకు సనత్కుమారుండు సెప్పినవాక్యంబు లేతత్ప్రయోజనంబు లయి యుండు వానిం జెప్పెద వినుమని యిట్లనియె: 310

—: నారదుఁడు శుకున కుపదేశించిన తత్త్వప్రకారము :—

సం. 12 - 316-5

తే. తపము సత్యంబు కన్ను విద్యయ సుఖ:బు
విడువ దుఃఖంబు రాగంబ వినుఁడు నరుఁడు

ముక్తి కుత్సహింపక భవసక్తుడైన
నొండు పుట్టువునం దది యొంద రాదు. 311

క. ఆరయఁ గామముఁ గ్రోధము
వెరులు ముకి కవి రెండు వారించిన సం
సార మనాకారం బగు
నేరిమి యొఁ డేల ముక్తినెలవు గనుటకున్. 312

క. అపరిగ్రహసర్వారం
భపరిత్యాగములు గలుగు పండితునకు దుఃఖ
పుఁదెరువు వాటిలదు మో
క్షపదము సొప్పడి తదాత్మకసుఖం బొందున్. 313

క. భూతంబుల దర్శింపమి
భూతాస్పర్శనము భూతముల యెడ సంభా
షాతరలత నొందమి సూ
రే తెరువు విమోక్షసుఖగరిష్ఠత వడయన్. 314

ఆ. హింస లేక యునికి యింద్రియజయము వై
రాగ్యమచపలత్వమనుగుణములు
నాల్గుఁ గలుగు నట్టినరునకుఁ గరతలా
మలక మంతరాత్మ మహిమ యెల్ల. 315

క. అమ్మునిపతివాక్యములవి
ధ మ్మిది; దీనిం బ్రబగాఢతత్పరతం జి
త్తమ్మున నిడి తెలిసినడవు;
మిమ్మొయి సమకూరు నీకు నిహపరసుఖముల్. 316

వ. అని చెప్పి వెండియు. 317

ఆ. పుత్రదారబంధుమిత్రసక్తుఁడు రొంపిఁ
బడినగజమునట్లు యెడురు నొందు;
భోగజాలపరుఁడు వాగురాజాలసం
పతిత మృగఋషములభంగిఁ దలరు. 318

వ. ధర్మాధర్మంబులును సత్యాసత్యంబులును దొఱంగవలయుఁ; దొఱంగుటెట్లు
సొప్పడు నంటేని. 319

సీ. వినుఁ: మధర్మం బహింసనమున నెడలు; ధ
ర్మంబు సంకల్పవర్జనముచేత
నవ్యాప్తిఁ బొందు; సత్యాసత్యములు బుద్ధిఁ
గొని త్రోవ నగునని మునివరుండు
మఱియును జెప్పు నాత్మవిభావనంబున
బుదివిలీనతఁ బొందు శోక
భయహేతువులు నిచ్చఁ బడివేలు వాటిల్లుఁ;
బండితుం డందుఁ బొందడండు భూత

తే. ములును నింద్రియములు నొక్కఁ ద్రోవుగట్టి
యున్నవీనికి వగఁబొందుటూరివారి
కొలయునెడరుల కెల్లఁ దానుమ్మలకము
గట్టికొని కుందునట్టులు గాదె పత్స ! 320

చ. అన విని సంశయం బురివి యమ్మునితో నరణీతనూజుఁ డి
ట్లను 'భవదీయదివ్యవచనామృత మాని యరోగచిత్తతం
గని కృతకృత్యతం బొరయఁ గాంచితిఁ; బొందెద యోగసిద్ధి సూ
ర్యునిమహితప్రసారమున నూని సమస్తము డిగ్గఁ ద్రావెదన్.' 321

క. అని పలికి యమ్మునీశ్వరు
ననుజ్ఞగొని తండ్రికడకు నరిగి వినతుఁ డై

తననిశ్చయంబు సెప్పిన
విని యతఁడలరెం దదీయవిజ్ఞానతకున్. 322

ఆ. సంప్రమోద మందు సాత్యవతేయునిఁ
గని ప్రదక్షిణంబు గాఁగ వచ్చి
నరుగ నుత్సహించె నారణేయుఁడు దానిఁ
గాంచి వత్సలత్వగౌరవమున. 323

వ. ఆ బ్రహ్మర్షిసత్తముండు. 324

క. ప్రమద మొనర్చెదు నానయ
నములకు నంత కటు నిలుము నాఁగా నిఃస్నే
హము నిస్సంశయముం దన
యమలమతిం బల్లవింప నాశకుఁ డరిగెన్. 325

ఆ. జనకు విడిచి యిట్లు సని సిద్ధచారణ
సముదయోపసేవితమును యోగ
సేవనార్హావిధము నై వెలుఁగొందు కై
లాసశిఖరితట మలంకరించె. 326

సీ. వినుఁ మందు సమము వివిక్తంబు నగుచోటఁ
బ్రాఙ్ముఖాసీనుఁడై పరమయోగ
రతిఁ బదప్రభృతిగాత్రములఁ గ్రమంబుగ
నాత్మధారణము సేయంగ, నంత
నినుఁ డుదయించినం గని పాణిపాదసం
యమ మొప్ప నద్దేవు నాశ్రయించి
నిర్విషయం బగు సర్వాత్మతత్త్వంబు
గాంచి విశిష్టయోగక్రమంబుఁ

తే. బొంది నారదమని యలవోక యచటి
కరుగుదెంచిన వినతుఁడై యాత్మయోగ

సిద్ధి యెఱిఁగించి నీకృపఁ జేసి తెరువు
గంటి నరిగెద విగతసంగత్వ మొంది.

327

క. అని పలికి విమలయోగం
బున నాకసమునకు నెగసిపోయె గరుత్మం
తునిభంగి నపుడు సాధ్యులు
మునులుం గని విస్మయమున మునుఁగుచుఁ దమలోన్. 328

తే. అచిరకాలంబునన యమ్మహాత్ముఁ డిట్లు
యోగసిద్ధిఁ బ్రాపించునె యుల్ల మెంత
నిర్మలమొ పితృభక్తివినిశ్చలత్వ
సంపదన చూవె యాతఁ డీపెంపు వడసె. 329

-: వ్యాసుఁడు వెనుకొన శుకుఁడు యోగమార్గంబున
నదృశ్యం డగుట :-

సం. 12-320-2,3

వ. అని మఱియు ననేకభంగులం బ్రస్తుతించుచుండి; రట్టియెడ శుకుండు మృగ పక్షిశైల సరిత్సరసీతరుగుల్మలతలం గలయం గనుంగొని 'మాతండ్రి నావెనుకం జనుదెంచి నాదగుపేరం బిలిచెనేని మీరెల్ల నో యనవలయుంజుండీ'యనిన 'నవి యట్లచేసెద మనియె నా బ్రహ్మర్షివరుండు దమోరజస్సత్త్వంబులం బ్రగమంబున డిగ్గఁ బ్రావియు యుత్తరాభిముఖుం డయి పోవ నొక్కమహా పర్వతంబు శృంగంబులు రెండత్యంతపీతశ్వేతంబులై మేరుహిమవంతంబులం దెగడుచుం గదిసి యనేకయోజనాయామవిస్తారంబులు గలిగి మార్గంబున కడ్డపడియుండెనతం డప్రతిహతగమనంబునం జన నవి దుత్తుములై రాలె; నద్భుతభంగి యగు నాసిద్ధపుంగవుపైఁ బుష్పవర్షంబు గురియుచు నమరగణంబు బహువిధంబులం బ్రణుతించె; నప్పారాశర్యపుత్రుం డయ్యెడం బ్రవహించు మందాకిని మీఁదం జదలం జేరువం జనియె; నట్లు సనుసమయంబున, 330

తే. నగ్న లై యప్పరస్త్రీజనంబులు సలిల
కేలి సలుపుచునుండి శంకింప కమ్మ
హాత్మఁ గనుఁగొని యెప్పటియట్ల నిర్వి
కారవృత్తి వర్తించిరి కౌరవేంద్రఁ! 331

వ. అయ్యవసరంబున సత్యవతీసుతుండు నిజసుతువెనుక మహాయోగగమనంబు
గైకొని తగిలె; నంతకు నయ్యారణీయుండు వాయుపథం బతిక్రమించి
సర్వభూతాత్మకుం డయ్యె; నప్పుడు. 332

తే. వెనుక నరుగుచునున్న నవ్వేదమూర్తి
తోడ సిద్ధచారణులు దత్సుతుఁడు శైల
శృంగవిధ్వంసియై పోక సెప్ప నెలుఁగు
పెంపు మిగుల శుకా యని పిలిచె నతఁడు. 333

వ. పిలిచిన నాసర్వగతుండు నిజప్రకారం బంతర్హితం బగుటఁ దేటపడ బయల
నో యనునాదంబు నిగుడునట్లు సేసెం దదనంతరంబ. 334

తే. సకలజంగమస్థావరసమితు లెల్ల
నో యనిన నద్భుతం బెద్ద నుద్భవింప
సత్యవతికొడుకు కొడుకువిశాలమహిమ
దెలిసి యప్పర్వతముమీఁద నిలువఁబడియె. 335

వ. ఇట్లు నిలిచిన యవ్వేదవ్యాసముసీశ్వరుం గాంచి జలవిహారంబుసలుపు నయ్యప్స
రోజనంబులు సిగ్గు నగ్గలిక గ్రందుకొన నందఱు నంబరంబులు ధరియించి;
రద్దివ్యబోధమహనీయుండు నిజతనయు చనునప్పుడు వారు శంకలేక
యునికి గని యతనిముక్తత్వముఁ దనసక్తతయు నిరూపించి ప్రియంబును
లజ్జయు నొక్కటఁ బొడమ నున్నంత. 336

క. సురమునిసిద్ధగణంబులు
పరివేష్టింపంగ నతనిపాలికి గంగా

ధరుఁ డేఁగుదెంచి నెవ్వగఁ
బొరయు నతనితోడఁ గరుణ వొంపిరి వోవన్. 337

వ. అనునయపూర్వకంబుగా నిట్లనియె: 338

క. 'జలపవనాంబరవసుధా
నలసమవీర్యుఁ డగు పుత్రు నా కొసఁగంగా
వలయు నని యడిగి తిచ్చితి
నలఘుతపోవిభవ! యేను నట్టికుమారున్. 339

వ. వాఁడును మత్ప్రభావంబునను భవత్తపోవిశేషంబునను బ్రహ్మతేజో
మయుండై దేవతలకుం బొందరానిపరమగతిం బ్రాపించె; దీనం జేసి
మోదంబు నందవలదె; విషాదంబునకుం బనియే'యని పలికి వెండియు. 340

తే. ఇలయు గిరులును శరధులు నెంతదాఁక
గలుగు నంతకాలంబును వెలయుచుండు
శకునికీర్తియు నీదుయశోవిభూతి
యును జనంబుల నీనుల కుత్సవముగ. 341

వ. అని నిర్దేశించి వలయునేని బుత్రసదృశయైన ఛాయ ని న్నెప్పుడు ననుగ
మింప దర్శించువాఁడవుగా కనియె; నిట్లనుగ్రహించి యాబ్రహ్మర్షిప్రవరుని
సంప్రీతునిం జేసి వీడుకొల్పి విశ్వేశ్వరుండు నిజేచ్ఛం జనియె; నింతవట్టు
నారదుండు నాకుం జెప్పె. 342

క. ఇది యితిహాసపరము; దనుఁ
జదివినవారలకు వినినజనముల కాయుఃప్రద మగు; లక్ష్మీకీర్తి
ఖ్యుదయంబుల నిచ్చు, సుగతియును గావించున్. 343

వ. ఆనియె 'నద్దేవముని చేత నావినినచొప్పున నీకుం జెప్పితి;నీ వింక నేమి వినవల'
తనుటయు ధర్మతనయుండు శంతనుతనయుతో 'బ్రహ్మచర్యాదు లగునాలు
గాశ్రమంబులవారును దమకు నుత్తమపదసిద్ధిం గోరి యారాధించు దైవం
బెయ్యది దయపల్లనింప నా కెఱింగింపుము.' 344

క. అనియె నని చెప్పి గురుభ
క్తినిరూఢుఁడు లోకమాన్యతేజుఁడు విద్యా
ఘనుఁ డగు నావైశంపా
యనమునివరుఁ డిట్టు లనియె నాతనితోడన్. 345

తే. వ్యాసమునినాథు షడ్గుణైశ్వర్యధుర్యు
నాగమవ్యాసకర్మఠు నమితతేజుఁ
గొలిచి తత్ప్రసాదంబున వలనుఁ బెంపుఁ
గలిగి యేను నారాయణకథ ఘటింతు. 346

వ. అని భక్తిపూర్వకంబుగాఁ బలికి జనమేజయున కిట్లనియె: 'నట్లజాతశత్రుం డడి
గిన నయ్యాపగాపుత్రుం డతనితో నారాయణ నారదసంవాదం బను నితిహా
సంబు మాతండ్రి నాకుం జెప్పె; దాన నీయడిగిన యర్థంబు దేటపడం
జెప్పెద.' 347

క. అని పలికి యాదరంబున
మనంబు మేదురముగాఁగ మనుజేశ్వర య
జ్ఞనపతివీను లమృతరస
మున నించిన యట్టిచందముగ నిట్లనియెన్. 348

-: భీష్ముఁడు ధర్మజునకు నారదనారాయణ సంవాదంబు చెప్పుట :-

సం. 12-321-7.

సి. వినుఁ: మవ్యయుఁడు సనాతనుఁడు విశ్వాత్ముఁడు
నైన నారాయణుం డను మునీంద్రు
బదరికాశ్రమమున భక్తివైఁ గొలిచి నా
రదుఁ 'డెట్టి సిద్ధి కారాధనీయ
మానతి యి'మ్మన్న నతఁడు "ధ్రువం బచ
లం బింద్రియాగోచరంబు సూక్ష్మ

మనుపమ మన సర్వమున కంతరాత్మ యై
వెలుఁగుత త్వము దక్క వేఱు కలదె

తే. యరయ నారాధ్యమై యజుఁ డాదిగాఁగ
సకలభూతంబులకును బూజ్యంబు దాన'
యనియె నిట్లన్న సరసఖుఁ డతికృపార్ద్ర
భావుఁ డై చెప్ప నప్పద్మభవసుతుండు. 349

వ. సంప్రీతుం డై సవిశేషవినయంబున నమ్మహాత్మున కిట్లనియె: 350

క. లోకేశ! నీవు ధర్మ
శ్రీకావలిగాఁగ నవతరించుట విద్వ
ల్లోకంబు సెప్పఁ; నమ్మా
లాకృతి యెట్లుండునో దయాత్మకమూ ర్తీ! 351

క. శ్రుతిపరతయు గురుభ క్తి యు
మతిఁ గల వొక కొంత కొంత; మన్నింపఁగఁ బా
త్రత గలిగెనేని నాకొసఁ
గు తదియాలోకనం బగుతెఱంగు కృపన్. 352

వ. అని వేఁడిన భ క్తపరాధీనుం డైన యమ్మహానభావుం డద్దేవసంయమితోఁ
"బరమైకాంతి వగుము: నీ కట్టిపెంపు సంపాదించెదం బొ"మ్మని యత్యా
దరంబున వీడుకొలిపినం బ్రీతుండై వియద్వీథిం జని యమ్మునిగనకన
గంబునందు నిజతాత్మ్యం డయి యుండి దుర్ధ్వనివంబు నుత్తరంబుచేరువ
నున్న శ్వేతద్వీపంబునం దనాహారులు నిందియవృత్తిరహితులు నస్వేదులు
సుగంధి శ్వేతాంగులు నగుపురుషులం గాంచె ననిన విని ధర్మపుత్రుం "డవ్వి
శేషంబులు ముక్తలక్షణంబులై యున్నయవి; యప్పురుషులతెఱం గెఱిం
గింపవే" యని యడిగిన శ్రీహరినామము తనకి కిట్లనియె: 353

క. వారలకథ మాతండ్రికి
గారవమున బుధులు సెప్పగా నే వింటిం
గౌరవముఖ్య! విశిష్టా
చాతురుఁడు నృపుఁ డొక్కఁ డుపరిచరవసు వనఁగన్. 354

ఆ. కలిగెఁ దొల్లి భూమిగలయంతయును నేలు
సత్యమును దమంబు శమము విష్ణు
భక్తియును నయంబు ఖలిమియుఁ గ్రతకుతూ
హలము బ్రాహ్మణప్రియంబుఁ గలఁడు. 355

వ. అమ్మహాత్ముండు. 356

చ. అలఘుతపంబు గోరి వసుధాధిపతిత్వము డిగ్గఁ ద్రావి కా
నలఁ జరియించుచుండ సురనాయకుఁ డాతని పాలి కేఁగి నె
చ్చెలి వయి నాకడం దగ వసింపుము వచ్చుఁ బోవుచున్నమే
లిలయును నేలు దివ్యతయు నిచ్చితి మెచ్చితి నీదునిష్ఠకున్. 357

తే. దేవభావంబునకుఁ దగ దీని నెక్కి
తిరుగు మెల్లడ నని రత్నదీప్త మైన
యొకవిమానంబు సంప్రీతి నొసఁగె; నతఁడు
నతనిమాటకు మిగులక యట్ల చేసె. 358

వ. దానంజేసి వసునామధేయుం డై నయతం డుపరిచరుం డనం బరఁగె; నదియు
నుంగాక వేఱొక్కటి యవ్విభునివిశేషంబు వినుము: కల్పాదియందు మరీచి
యత్రి యంగిరసుండు పులహుండు పులస్త్యుండు క్రతువు వసిష్ఠుం డని
యెడు మహామునులు చిత్రశిఖండినామధేయులు స్వాయంభువుం డనుమనువుం
దారు ననేకవర్షంబులు విష్ణు నుద్దేశించి తపంబు సేసిన నద్దేవుం డదృశ్యరూపం
బున వారల కట్టెదుర నిలిచి వారితో మీరు ధర్మశాస్త్రకరణప్రవణులరై
నన్నాశ్రయించితిరి; భారతి మీయందు నిలువ నియోగించితి; మీచేతం
బ్రణీతంబై సకలజగంబులకు హితంబును మర్యాదాప్రవర్తకంబునునై

శాస్త్రంబు వెలుంగు; నంగిరసు వలన బృహస్పతి యసునొక్కమహామతి జన్మించు; వానియం దాసందర్భంబు ప్రతిష్ఠించు నది' యని యానతిచ్చి వెండియు. 359

తే. 'ఉపరిచరవసు వనునొక్కనృపతివుట్టు
నాతఁ డర్హుఁ డాశాస్త్రంబు నధిగమింప;
నాబృహస్పతి సెప్పంగ నధిగమించి
తత్సమాచారనాయకత్వము వహించు. 360

వ. అమ్మహితాత్ముండు మద్భక్తుండు మీకుసంభావనీయుం'డని పలికి చనియె; నత్తెఱంగున యాపెంపు నొందిన యట్టి యవ్వసువు హయమేధంబునకుం బ్రవర్తించిన నమ్మరీచ్యాదు లగు సప్తసంఖ్యులును మఱియునుం దత్సము లగు మహానుభావులును ఋత్విక్కరణంబు లాచరించిరి; బృహస్పతి యుపదర్శనంబు నడపెఁ; బ్రజాపతిపుత్రులగు నేకుతుందును ద్వితుండును త్రితుండును మునిసత్తములు సదస్యు లై రిట్లు సెల్లు నయ్యధ్వరంబునందు. 361

తే. అన్నరేంద్రుం డహింసకుం డగుటఁ జేసి
పశువిశసనంబు లేకుండఁ బరమనిష్ఠ
నాతఁ డారణ్యకోద్గీతమైనవాక్య
సంచయము విష్ణుగుఱిచి పఠించె నధిప! 362

క. కరుణావిధేయుఁ డగు నా
హరి యతనికి ఁగానవచ్చునట్టులుగాఁ జె
చ్చెర వచ్చి హవిర్భాగా
హరణం బొనరించి చనుఁడు నతికుపితుం డై. 363

వ. దివ్యధిషణుం డగు ధిషణుండు గన్నీ రొలుక నన్నరపతితోఁ దనకై యెత్తిన పురోడాశభాగంబు విష్ణుం డెల్లవేలుపులుంబోలె నాకు దర్శనగోచరుండై కానక యదృశ్యుండై కొనియె'నని యుగ్గడించిన సయ్యుపరిచరుండు భరిత వినయుండై యతని ననునయించె; సదస్యులు సంభ్రమంబు లేక యన్నా కేశమంత్రితో నిట్లనిరి: 364

-:ఏకద్వితత్రితులు బృహస్పతికి విష్ణుదేవుమహిమ సెప్పుట:-

సం. 12-323-19,

సీ. అలుక మానుము; హరికై సముద్యత మైన
భాగంబు హరి గొన్న బదరనేల?
యతని దర్శింప శక్యమె నీకు మాకును?
నజునిమానసపుత్రు లైన యేము
హరిదర్శనము గోరి యధికతపం బాచ
రించుచుండగ నశరీరవాణి
'దుగ్ధార్ణవంబునందు విశాలరమణీయ
మగు నొక్కదీవి దెల్పారియుండు;

ఆ. నచటి కరుగు, డచట నతిసితవర్ణు ల
స్వేదు లింద్రియప్రవృత్తివిముఖు
లధికసురభిదేహు లాహారరహితులు
హరిపరాత్ము లైన నరులు గలరు. 365

క. వారలకు జూపు నిజతే
జోరూపము విష్ణు డపుడు, సూడగనై నన్
మీరును జూతు'రనిన బ్రియ
మారినచిత్తములతోడ నందఱము వెసన్. 366

వ. శ్వేతద్వీపంబునకుం జని యశరీరవాణి సెప్పినచందంబు మానవులం గంటి, మట్టిదీప్తివిశేషంబు లేలోకంబుల నెజ్జాతులకు లేవు, వారలు మానసజపపరాయణులై యున్నవా, రే మయ్యెడ నేకాంతిజనుల కింతనంత నున్నంత భాను సహస్రప్రభాభాసితం బగునొక్కదివ్యతేజోరూపంబు వారియగ్రభాగంబునం దోచిన వారు గూడుకొని భక్తిమయప్రణామంబులు సేయుచుం జేరి జయ పుండరీకాక్ష జయ హృషీకేశ జయ విశ్వభావన నమస్తే నమస్తే యనునెలుం గులు నింగి ముట్టంగొల్పి, రట్టియెడ. 367

క. మానయనంబులు దత్తే
జోనిహతము లగుడుఁ దెలియఁజూడ సశక్యం
బై నం జేడ్పడి యుండం
గా నొకభూతంబు వలికె గగనతలమునన్. 368

క. 'ఈదేవునిఁ గన్నట్టుల
కాదే యిప్పురుషవరులఁ గాంచుట మీకున్
ఖేదంబు వలదు నియమ త
పోదానము లితినిఁ జూపఁ బూఁట వడియెనే. 369

క ఏకాంతికభక్తిరతి న
నేకములగువత్సరముల కివ్విష్ణుని నా
లోకింపంగా దొరకొనుఁ
గాకిటు వేగపడ మీకుఁ గానఁగ వశమే.' 370

క. అని పలికిన విని క్రమ్మఱఁ
జనుదెంచితి మేము; విష్ణుచందం బిది, నీ
కనఘా! యలుగం బనిలే,
దనూనములు గాఁగ నడపు మధ్వరవిధులన్. 371

వ. అని యి ట్లేకద్వితత్రితులు సెప్పినం బ్రశాంతుండై పురుహూతపురోహితుం డయ్యాగంబు సుప్రయోగంబుగాఁ జెల్లించె, నాభూవల్లభుం డట్లు పుణ్యా పరుండగుచుఁ బ్రజాపరిపాలనం బొనరించె, నట్టియెడ నాకలోకంబున నసుర మునిగోష్ఠియందు సుర లధ్వరంబుల నజంబుల విశ్వసింపవలయు నని పలికి, మును లజంబు లన్నంతన యెల్లయుగంబులను ఛాగంబులఁగాఁ గొనరాదు, కృతయుగ విషయంబుగా వేదంబు లజంబు లోషధు లని చెప్పెం గాన యని రిట్లు వివాదంబై న సమయంబున నలవోకవోలె నుపరిచరవసు వయ్యెడకుం జనిన నారెండు దెఱంగులవారును జయాపజయంబులకు నతనిమాట పాటిగా నూఁది యడిగిన నాతండు. 372

క. 'భాగమ విశసనయోక్యము
యాగంబుల నెల్లయుగములందును' ననియెం
దా గీర్వాణులపక్షం
బై గెలుపది యపుడు వారి కగుటకు నధిపా: 373

వ. అనిన విని వేదారాపలాపంబునకుం గోపంబు నొందిన మునులళాపంబున నతండు భూవిపరపతితుం డయి యుండ నమరు లేతెంచి యతని యంతరంగం బునకుం దెలివియును నంగంబునకు డప్పి లేకునికియు నొసంగి విష్ణుప్రసా దంబునఁ బ్రత్యాపన్నుండ వగు దని యూఱడించి యరిగి, రన్నరవరుండును విష్ణుధ్యానజపపరాయణుం డగుచుండ నచిరకాలంబునకు విష్ణుండు విహగ పతిం బు త్తెంచి యె త్తించి కొనిపోయి శరీరంబుతోడన బ్రహ్మలోకగతుం గావించి సంభావించిన నమ్మహానుభావుండు పరమానందంబు నొంది వెలిగె. 374

క. కురునాథ: యుపరిచరవసు
చరితంబు ప్రసంగకలన సంప్రా ప్తంబై
బెర సెను నీవడిగిన య
ప్పురుషుల దివ్యానుభావముం జెప్పంగన్. 375

వ. అని పలికి భీష్ముం డాభూపతితో నారదువృత్తాంతంబు వివరించెద నాక ర్ణింపుము: 376

సీ. అని చెప్పి యిట్లను: నధిప: నారదుఁ డట్లు
లద్దీవియును నద్భుతాంగు లై న
యమ్మానవులుఁ దనయంతరంగంబునఁ
దోఁచినఁ బ్రీతి నందులకు నేఁగి
యమ్మహాత్ములు దన్ను నాత్మల నాదరిం
పంగఁ దా నత్యంతభ క్తిఁ బ్రణతుఁ
డై పరమైకాంతులగువారి కింతింత
నిలిచి దుష్కరతపోనిష్ఠఁ బూని

తే. యూర్ధ్వబాహుతఁ గదలకయుండి వివిధ
గూఢదివ్యనామో క్తిసంప్రౌఢి యచటి
సకలజీవుల నానందసభృతములఁ
జేయుచుండ విష్ణుస్తుతి సేయుచుండె. 377

వ. ఇవ్విధంబున నేకాంతియై సంస్తుతింప సితాసిత పీతారుణ పిశంగహరితవర్ణంబు
లను బహుశిరోబాహుపాదంబులను వేదికమండలు గ్రుక్కువాగ్నిధారణంబున
నోంకారసావిత్రీచతుర్వేదోచ్చారణంబులను మహాద్భుతం బయిన నిజదివ్య
రూపంబు నారదునకు దర్శనగోచరంబుగా నిలిచి విష్ణుండు వినయసంభ్ర
మోపేతభక్తిప్రణతుం డగునప్పరమమునిని నాదరించి యిట్లనియె: 378

-: శ్వేత ద్వీపవాసి యగు నారాయణుండు నారదున కుపదేశించిన
తత్త్వము :-

సం. 13-326-10,11

క. ననుఁ గానఁబడయ రెవ్వరు;
ననఘా! యేకాంతికులక యర్హాము మద్ధ
ర్శన; మీ వేకాంతికుఁడవు
ననహంకారుఁడవుఁ గాన యబ్బెం జూడన్. 379

వ. అని పలికి'వరంబు వేఁడు' మనుటయు నతండు 'దేవా! భవద్ధర్శనంబుకంటె
మిగుల వరంబునుం గలదే'యనుటయు నద్దేవుండు సవిశేషప్రసాదభరితుండై.

సీ. 'ఇంద్రియంబుల కందఁ డెల్లభూతంబులుఁ
దెగినను దెగకుండుఁ ద్రిగుణరహితుఁ
డఖిలంబునకు నాత్మ యన సర్వసాక్షినా
నజుఁ డన నిష్కలుం డన వెలుంగు

క్షేత్రజ్ఞుఁ డాతఁడు జీవుఁడు వాసుదే
వుండును సంకర్షణుఁడుఁ జూవె
వారు మనం బహంకారంబు వరుసఁ బ్ర
ద్యుమ్నానిరుద్ధనామోపహితము

తే. లింతయును మన్మయంబ యే నిరువదియును
నాల్గు నగు తత్త్వకోటికి నాథుఁ డైన
పంచవింశకాభిఖ్యుండఁ బరుమపురుషుఁ
డనియు నాపేరు మఱి పర మరయలేదు. 381

క. చిను; మేకాంతికుఁ డెవ్వనిఁ
గని నిత్యానందపదము గను నప్పరమా
త్ముని వాసుదేవు నిష్కలు
ననుపముగా ననుఁ నెఱుంగు టాత్మహిత మగున్. 382

క. భూతాత్మక మైన యఖిం
ధాతుచయము వెలిగ లేదు తను; వామొత్తం
బాతఁ జీవవ్యాప్తిస
మేతము గాకున్నఁ జేష్ట నెసఁగ వత్సా! 383

క. జీవశరీరములు పృథ
గ్భావాకలితములు గాఁగఁ గనుటయు వలయున్
జీవునిఁ గంటి ననుట మా
యావిలసన మస్మదీయ మది మునివర్యా! 384

క. జీవుఁడు మత్సముపేతుఁడు
గావు చెఱుఁగవలయు. దృఢముగా భక్తిమయం
బై వఱలు నాశ్రయంబున
నేవాఁ డొందు ననుఁ వాని కిత్తు విముక్తిన్. 385

క. ఆదిత్యమరుద్వసురు
ద్రాదిదివిజగణము నంబుజాసనుఁడు జతు
ర్వేదములు మదాత్మకతం
గాదె త త్తద్విశేష గౌరవ మొందున్. 386

తే. కమలగర్భు సృజించి సకలజగద్ధు
రానియుక్తునిఁ గావించి యే నివృత్తి
పరత నేకాకి నై దివ్యభవ్య మగు స
హాయముగ సంచరింతు మధ్యస్థవృత్తి. 387

వ. ఒక్కొక్కకాలంబుల జగద్ధితంబుగా జన్మకర్మంబులం బూనుదు; విమువు వారాహరూపంబు దాల్చి హిరణ్యాక్షుని, నారసింహమూర్తి ధరియించి హిరణ్యకశిపుని, భృగువంశంబున జామదగ్న్యుండని జనియించి సప్తక్షత్రం బును, దశరథుండనురాజునకు రామనామంబునం బుట్టి రావణాసురుం బరి మార్పం గలవాఁడ; భూభారంబు వాపుటకై యాదవకులంబున ప్రభవించి పురందరనందనుండై యవతరించిన నరుండు దొడ్డన కార్యంబు నిర్వ హింతు; నేను దొల్లి నరనారాయణు లనియెడు నామంబుల మూర్తిద్వయం బును ఋషిత్వంబును వెలయ నొలసి లోకరక్షణం బాచరించుచున్నవాఁడ; నమ్మూర్తుల పదంపడి కేలీమానుషత్వంబు గైకొని యిట్లు సేయు నయ్యవ తారంబునఁ గంసకాలయవన మురనరక బాణప్రముఖులైన కంటకులం జెఱుతు; నందు బాణాసురుం గాతు నని పూని మహాదేవుండు మహాసేనానీ సహితుండై యడ్డపడ నమ్మహాత్ముని జయించ బాణునిం బరాభవింతు; నింతకు మున్ను మత్స్యత్వకూర్మత్వంబుల నొంది నిఖిలచ్ఛందోబృందారక హితం బొనర్చితి; మచ్చరితంబులు నీకుం గర్ణగోచరంబులు గాకుండెడు నే; మఱియు ధర్మరక్షణార్థంబుగా నేమేమి సేయవలయు నవియెల్లనుం జేయు వాఁడఁ; గృత్యంబులు గృతంబులై న మదీయప్రకృతిం బొందుఁ; బరమేష్ఠి నందనా! నీ వేకాంతికుండ వగుట నీకు నాతెఱంగెల్ల నెఱింగించితి నని చెప్పి యమ్మునిం గని 'యనాహారులు ననింద్రియులు నస్వేదులు సుగంధిశ్వేత దేహులు నగునమ్మానవులం జూపి వీ రేకాంతికులు మన్నుయధానపరులునె

యున్నవారు; వీరలకు సమ్మర్దంబుగా మెలంగం దగదు; నీ వింకం బొమ్మని పరమాదరంబునం బలికి వీడ్కొలిపిన నద్దేవమునిసత్తముండు పరమానంద భరితుండై బదరికాశ్రమంబునకుం జనుదెంచి నరనారాయణులం గాంచి. 388

తే: భక్తి వీడ్కొని చని మునిప్రతతి కెందు
నచ్యుతాననోద్గతము వేదార్థమయము
యోగసాంఖ్యాత్మకము నైన వాగమ్మృతము
గర్ణపుటపేయముగఁ జేయు గారవమున. 389

వ. నారదుం డట్లు విష్ణుని దివ్యవాక్యవితతి విద్వజ్జనంబులకు వినిపించుచు బ్రహ్మ సభ కరగి యందునుం బ్రకటించె ననుటయు;నప్పద్మభవునకును నది వింతయే యనిన యకొంతేయాగ్రజుతో శాంతనవుం 'డాశతానందునకు నపరిజ్ఞా తంబునుం గలదె; యతనిం గొలువ వచ్చినట్టి సిద్ధసాధ్యాదులకు వినిపించె గాక' యని పలికి వెండియు నిట్లనియె: 390

క. క్రమమున వాఙ్మయ మగు న
య్యమృతము లోకమునఁ బరగె;నది మజ్జనకుం
డమితదయఁ జెప్పె నాకును;
శమయుతఁ యేఁ జెప్పితిని విశదముగ నీకున్. 391

క. మునులును సురలును దీనిని
విని కొనియాడుదురు; విష్ణు వినుతింతురు భ
క్తినిరూఢు లై ; జపింతురు
మనమునఁ; జర్చింతు రతిసమాహితు లగుచున్. 392

తే. నీవు నిట్టుల చేయు వినీతపరుఁడు
విష్ణుభక్తుండు శమదమాన్వితుఁడు నైన
యట్టివానికిఁ జెప్పుమీ యచ్యుతాన
నోద్గతం బైన యిప్పురాణో త్తమంబు. 393

క. నీవినినయుపాఖ్యానము
లేవియు సరిగావు దీని; కిది దీర్ఘాయు
శ్శ్రీవిభవారోగ్యముల
గావించు బఠించినం దగం దను వినినన్. 394

క. అని శాంతసవుఁడు సెప్పిన
విని మోదము నొంది పాండవేయులు దీనిన్
విసుచుఁ బఠించుచు విష్ణుం
గొనియాడుదు రధికభక్తిఁ గురువంశవరా! 395

వ. అని చెప్పి వైశంపాయనుండు వెండియు 396

ఉ. సాత్యవతేయుఁ డీపరమజప్యము భక్తిఁ బఠించుచున్ వియ
ద్ధత్యభిరాముఁ డై నియమతత్పరతం జను దుగ్ధవార్ధికిన్
నిత్యము విష్ణు గాంచి మహనీయతరం బగుపూజనంబు సం
స్తుత్యము గాఁగ జేఁతకుఁ గుతూహలసంపద పల్లవింపఁగన్. 397

వ. అనిన విని జనమేజయుండు మోదంబు నొంది యమ్మునిసత్తమునితోడ 'నీవు మోక్షం బత్యంతసుఖం బని చెప్పుదు; సకలజనంబులునభ్యుదయకరంబు లైన కర్మవిశేషంబులం దగిలి యుండుదు; రొరుల నన నేల? దేవతలునుదద్ధర్మంబు వాటింపక హవ్యభోజనపరత్వం బూని యుండుదు; రమ్మహాత్మ లట్లగుట యెట్లొకో యని యేను విచారించుచుండుదు; నత్తెఱంగు దేటపడ నెఱిం గింపవే' యని యడిగిన నప్పారాశర్యశిష్యం డాభూవరున కిట్లనియె: 398

క. విమలాత్ముఁడు పారాశ
ర్యమునీంద్రుఁడు శిష్యులను మహాభారతపం
చమము ఐగు వేదముల మే
రుమహీధరవాసి యై కరుణఁ జదివించెన్. 399

వ. అట్టియెడ నేనును సుమంతుపైలజైమినులు నే విప్పుడు నన్నడిగిన చందంబున నమ్మహాత్ము నడిగితిమి; దానికి సుముఖుండయి సర్వజ్ఞుండును సదయహృదయుండును నగు సాత్యవతేయుండు మాకు నిట్లని యానతిచ్చె. 400

తే. ఏ నతీతంబులును వర్తమానములు న
నాగతమ్ములు నగుజగదఖిలవర్త
నంబులును గను దివ్యబోధంబు గోరి
పాలకడలితీరంబునఁ దపంబుసేసి. 401

వ. నారాయణప్రసాదంబునం జేసి సిద్ధమకోరథుండ నైతిం గావునం గల్పాది
యందుఁ గమలసంభవప్రముఖబృందారకు లాచరించిన కృత్యంబులు గాన
వచ్చువానిం జెప్పెద దాన మీయడిగినయర్థంబు దేటపడు; వినుండు. 402

క. ఆదిత్యమరుద్వసురు
ద్రాదిసురులు మునులు నంబుజాసనుఁ గని మా
కేది కరణీయ మీశ! ద
యాదృష్టిని మమ్ముఁ జూచి యానతి యీవే! 403

వ. అని విన్నవించిన విని భరితాదరుం డగుచు నప్పరమేష్ఠి వారితో 'మీ కెయ్యది
కర్తవ్యంబో యనుతలంపు మున్న నాచిత్తంబునం బొడమి యున్నయది;
మీరు నిమ్మాట సెప్పి మేలు సేసితిరి; మీకును నాకును బ్రబలత్వం బెద్దానం
గలుగు దాని నుపదేశించుటకుం బురుషోత్తము శరణుసొత్తు రండని' పలికి
వారునుం దానును దుగ్ధవారాశితీరంబునకుం బోయి ఘోరం బగు తపంబు
బహుసహస్రసంఖ్యంబు లగు దివ్యవర్షంబు లాచరించిన వారలకు గంభీర
మధురప్రకార యగు వాణి యిట్లని వీతించె. 404

-: విష్ణుఁడదృశ్యరూపంబున బ్రహ్మాదిదేవతల కుపదేశించిన హితప్రకారము :-

సం. 12-327-47,48,49.

క. మీవచ్చినపని యెఱుఁగుదు;
నీవనజభవుండు జగము లన్నిటికి గురుం;
డేవిధిఁ బనిచిన నది శ్రుతి
భావితకర్మంబు దానఁ బరఁగుదు దగఁగన్. 405

వ. ఏనునుం జెప్పెద వినుండు 'వేదహితం బగు నొక్కయాగంబు సేయుం; డందు భాగంబు నాకుం కల్పింపవలయు'ననిన వారుం బ్రీతిఁ బొంది. 406

క. కమలజుపంచినక్రియ యా
గమువైష్ణవ మనఁగ జేసి కల్పించిరి భా
గము విష్ణున కం దతఁడ
య్యమరుల మునివరులపై దయను గగనమునన్. 407

వ. అదృశ్యండై నిలిచి వారలతో నిట్లనియె: 408

క. నాపంపునను బ్రవృత్తి
వ్యాపకయైనట్టిసత్క్రియం జేసితి రి
ట్లీపుణ్యంబునకును ఫల
రూపం బగు దాని నే నిరూపింతుఁ దగన్. 409

వ. మరీచి యంగిరసుం డత్రి పులస్త్యుండు పులహుండు క్రతువు వసిష్ఠుం డను వీర లవ్వారిజభవునకు మానసపుత్రు; లిమ్మహాత్ములు నట్టివార వేదాచార్యులు యజ్ఞకార్యధుర్యులు; వీరు విధింప సర్వయజ్ఞంబులును మానవులు మానసీయంబులుగా నడప మీకెల్లను నయ్యాగంబుల భాగంబులు కలిగి తద్భాగంబుల నాప్యాయితులై యుపబృంహణంబు నొందు; వారలు సనకసనందన సనాతనకపిల సనత్కుమారులు పరమేష్ఠినోనిర్మితులు సహజజ్ఞానవిజ్ఞానులు నివృత్తిపరులు నై సాంఖ్యయోగంబులకుం బ్రవర్తకు లగుచుండుదురు; వీరలచేత మోక్షధర్మంబులు సువ్యంజితంబు లగు; మీకుం దల్లియుం దండ్రియు గురుండును నివ్వారించియ; మదీయానుశాసనంబున నితండు సర్వానుశాసకుం డై వర్తిల్లువాఁడు; మత్ఫాలప్రభవుం డైన రుద్రుండు సర్వలోకారాధనీయుండును సకలవరప్రదుండునుం జుండీ; మీరు వొండు; వేదోదితకర్మంబు లిక్కమలభవుండును మరీచ్యాదిప్రజాపతులుం బంచినట్లు నడవంగలయవి; యివి కృతయుగం బనుపేరింటి యుత్తమకాలంబు; దీని యందుఁ బశువులు హింస్యంబులు గావు; సంశయంబు పలవ దని నిర్దేశించిన. 410

క. మునులును సురలును విష్ణు
న్వినుతించి నమస్కరించి నిజపదములకుం
జనిరి; పరమేష్ఠి యొకరుఁడ
చన కచ్చట నిలిచె; హరియు సన్నిహితుండై. 411

తే. హయశిరోభాసితుండును హస్తకలిత
లలితదండకమండలూజ్వలుఁడు సాంగ
వేదనముఖరముఖుండు నై యాదరార్ద్ర
దృష్టి నిగుడంగ నిలిచి యద్దివిజముఖ్యు. 412

వ. కౌఁగిలించుకొని, 'నీవు సర్వంబునకును విధాతవు గురుండవు ప్రభువవు నయి నడపుము; నీయందు సర్వాచారంబునుం బెట్టి సుఖినై యుండెద; నడపుట నీ కెప్పుడేనిఁ గడిందియై తోఁచెనప్పు డేను దోఁచి సమస్తంబును సునీతంబు సేయంగలవాఁడ' ననియెఁ, దదనంతరం బావిష్ణుం డంతర్హితుండయ్యె, నిట్లు యజ్ఞంబులం దగ్రభాగార్హుండును యజ్ఞధారియు నైన యప్పద్మనాభుండు ప్రవృత్తిధర్మంబు బ్రహ్మాదులకుం గృత్యంబు సేసి నివృత్తిధర్మంబునందు నిష్ఠుండును విద్యాసహాయుండును నై సర్వగతుం డగుచుఁ జరియించు నని చెప్పి యప్పారాశర్యుండు. 413

క. మొదలఁ గలిగించి జగముల
బదిలంబుగ నునిచి వానిఁ బదపడి తనయం
దొదిఁగించి మతియు నెమ్మొయి
నుదారగతి నడపు చిన్మయుని గొలుతు హరిన్. 414

ఆ. అజుని విశ్వరూపు నమరుని సర్వామ
రాధినాథు నాద్యు సాంగవేద
వేదితవ్యు నాత్మవేద్యు నీశాను న
వ్యయుఁ దపఃఫలాత్మ నాశ్రయింతు. 415

వ. అని మఱియు ననేకప్రకారంబుల నప్పరమమును యప్పుడు భావంబున నెల
కొన్న నారాయణుఁ బ్రస్తుతించి మమ్ముం గలయ నవలోకించి 'పూర్వ
వృత్తాంతంబు ప్రజ్ఞాదృష్టిని నాకన్నయది మీ కెఱింగించితి; విష్ణుని దివ్యచ
నంబుఁజొప్పున నడచునది; యప్పరమేశ్వరుం గొలువుండు వేదవాక్యంబులం
దత్పకీర్తనంబు సేయుం' డనియె; నేము 'నట్లకాక' యని బుగ్యజుస్సామం
బుల సా త్రిధాముం బ్రస్తుతించి మనంబుల నారాధించితి మని చెప్పి వైశం
పాయనుండు వెండియు. 416

సీ. సర్వజ్ఞుఁ డగు పరాశరనందనునిచేత
భాషితం బైన యిప్పరమపుణ్య
వృత్తంబు సదివిన విన్నను విప్రుండు
వేదవేదియు రాజు విజయశాలి
యును వణిజుండు లాభోపేతుఁడును శూద్రుఁ
డత్యంతసుఖియును నగు నరేంద్ర!
కన్య సద్వరకర గ్రహణంబు పడయు, గ
ర్భిణియైన కాంత సద్గుణునిఁ బుత్రుఁ

ఆ. గాంచుఁ, బ్రసవకాలకలయందు నెఱి దప్పి
యున్న బిడ్డ గలుగు నువిద సుఖక
రప్రసూతి నిర్భరత నొందు, వంధ్యసం
తానసిద్ధి సమ్మదంబు నొందు. 417

-: భగవన్నామ నిర్వచన ప్రకారము:-

సం. 12-328-3

వ. మఱియు నెవ్విధంబు మనోరథంబు లైనను సఫలంబు లగు ననిన విని జనమే
జయుండు 'గూఢంబు లగు విష్ణునామంబుల నిర్వచనంబులు వినవలతు వివ
రింపవే' యనుటయు వైశంపాయనుం డమ్మహీనాయకునితో 'నర్జునుం
డడుగం గృష్ణుండు వివరించిన నిజనామంబు నిరుక్తి తెఱం గెఱింగించెద
నాకర్ణింపు'; మస్పార్థు బోధించుటకై యద్దేవుం డిట్లనియె: 418

తే. నరుఁడు నారాయణుండు ననంగఁ బరగు
నిత్యపురుషులు నీవును నేనుఁ జుమ్మ;
భువనహిత మాచరింపఁగాఁ బూని వేడ్క
వచ్చి యిమ్మహి బుట్టినవార మనఘ! 419

వ. గూఢంబు లగు మదీయాభిధానంబుల యర్థంబులు దేటపఱిచెద నాక
ర్ణింపుము. 420

క. నారము లనఁగా జలముల
పే, రయనం బనఁగ నెఱవు. ప్రీతిగ నాకున్
నారము లనయం బగుటను
నారాయణుఁ డంద్రు జనులు నన్నుఁ గిరీటీ ! 421

క. వసియింతు నే జగముల,
న్వసియించున్ జగములెల్ల నాయం, దిమ్మై
పొసఁగి వెలుంగుచు నుండుట
నసదృశగుణ! వాసుదేవుఁ డనఁగఁ బరగుదున్. 422

క. వ్యాపించి రోదసీకుహ
రాపూర్ణత్వమున నునికి నధికక్రమణ
శ్రీపొలుపున విష్ణుం డను
దీపితనామంబునను ప్రతీకుఁడ నగుదున్. 423

తే. దమము నాఁ గల యుత్తమధర్మ మెడఁద
నలవఱిచి నన్నుఁ గామించు నార్యజనము;
దివియు భువియు నానడుమన తేజరిల్లు
నట్టు లగుట దామోదరుఁ డంద్రు నన్ను. 424

ఆ. అన్నమును జలంబు నమృతంబు వేదంబుఁ
బృశ్ని యనఁగ నొప్పుపేరఁ బరగు;
నది మదీయగర్భ మగుట విద్వజ్జను
లనఘ! పృశ్నిగర్భుఁ డంద్రు నన్ను. 425

క. ఇనరశ్ములుఁ జంద్రాంశులు
ననలశిఖలు గేశసంచయము నాకుం గా
వునఁ గేశవాభిధానం
గొనియాడుచుఁ ననుఁ బ్రబుద్ధజనంబుల్. 426

క. క్షేత్రము బ్రహ్మము నై లో
కత్రాణన మాచరింపఁగా వలసి పృథా
పుత్రియగ్నిషోములు
చిత్రస్థితి వెలుఁగుచుఁ బ్రసిద్ధాకృతులన్. 427

వ. అని చెప్పి బ్రహ్మక్షత్త్రిపవంబులు విప్రరాజనిర్దేశంబు లగుట దేటపడం బలికి విపులరాజులమహానుభావంబులు విలసిల్లినయెడలు నిదర్శనంబులుగా నిరూపించి యుపన్యసించి యవియెల్ల నగ్నీషోమమాహాత్మ్యంబు గావు చెటింగించి. 428

తే. బోధనస్థాపనంబులు బుధవరేణ్యా!
యగ్నియును సోముఁడును జేసి యఖిలజగము
నధికహర్షముఁ బొందింతు రవ్యయ ప్ర
వర్తనత్వంబు దమయందు వఱలుచుండ. 429

క. అనఘా! యగ్నీషోముల
ననుఁ గా భావింప జగమునకు నెపుడు హితం
బొనరింతు; దత్కృతమఁ లఁ
బొనరిన మద్భవ్యనామముల వివరింతున్. 430

ఆ. పరమవరదలోకభావనేశ్వర హృషీ
కేశనామకము లహీనచిత్త
యనియు మఱియు నిట్టులను యాగములభాగ
మాహరింతుఁ గాన హరియు నండ్రు. 431

సీ. గో వన మహి యవి గుహలోనఁ బడకుండఁ
జెంది యెత్తుటను గోవిందుఁ డనియు,
పీతలోమంబులచేత నొప్పార నా
విష్ణుం డగుట శిపివిష్టుఁ డనియుఁ,
గర్షణక్రియు భూమిఁ గావింతుఁ ఛాయయుఁ
గృష్ణంబు గావునఁ గృష్ణుఁ డనియు,
నలవడ సదసద్వ్యయంబును నాయందు
సమవేతమై యున్కి సత్యుఁ డనియుఁ,
తే. దా త్వికం బైన నాకు జాతత్వవికృతి
లేమి నజుఁ డనియు, నది లేకపోయి
నపుడు తదనంతరక్షయ మందకునికి
బుధు లధోక్షజుఁ డనియుఁ జెప్పుదురు నన్ను. 432

క. సత్త్వముననుండి తొలఁగమి
సత్త్వము నాచేతఁ జేసి సత్తఁ బొరయుటన్
సత్త్వమయజన్మఁ డగుటను
సాత్త్వతుఁ డనునామ మయ్యె జనవర! నాకున్. 433

తే. చ్యుతము లేకున్కి యచ్యుతుఁడ; వాత
ముఖ్యధాతుత్రయాకారమున శరీర
ధారకుండ నై యున్కిఁ ద్రిధాతువును న
నంగఁ బరఁగుదు మునివచనంబులందు. 434

క. ఘృత మర్చిస్సంపద యయి
ఘృతార్చి రభిదాన మొందెఁ గ్రీడి! వృషము వి
శ్రుతధర్మము ధర్మమయ
స్థితికతమున వృషఁ డనం బ్రసిద్ధి వహింతున్. 435

తే. ఆదిమధ్యాంతములు నాకు నరయలేమి
న య్యనాది యమధ్యుఁ డనంతుఁ డనఁగఁ

జెల్లు పేఱ్ఱలు, శుచులు నాచెవుల కింపు
లగుట మునులు శుచిశ్రవుఁ డండ్రు నన్ను. 436

అ. ఒక్కశృంగమునన యుర్వి యెత్తితి వరా
హావతారలీల యతిశయిల్ల
నట్టు లగుటఁజేసి యార్యజనప్రియ!
నాకు నేకశృంగనామ మయ్యె. 437

క. వినుత మగు లోకరేచన
మున నన్ను విరించుఁ డండ్రు బుధనుత రవియం
దనుపాధికవిద్యాస్థితి
నునికిం గపిలాభిధాన ముల్లసిత మగున్. 438

క. వినుఁ యోగంబు హిరణ్యం
బనఁ బరగును యోగగర్భుఁ డగుటను విద్వ
జ్జనములు హిరణ్యగర్భుం
డని ననుఁ గొనియాడుదురు మహాగుణశాలీ! 439

తే. నరుఁడు నారాయణుండు ననంగ లోక
రక్షణార్థంబు గాఁగ ధర్మమున కేను
బుట్టినాఁడఁ గావునఁ బాండుభూపతనయ!
నాకు ధర్మజుఁ డనియెడు నామ మయ్యె. 440

వ. ఇట్లు వుట్టి గంధమాదనంబున నేను దపంబు సేయుచుండ నక్కాలంబునఁ గాలాంతకుండు దక్షునియజ్ఞంబున కలిగిన నది భీతిం బఱతెంచి నాయురస్థ్సలంబు నొందిన మదీయకేశంబులు ముంజనిభంబు లగుటంజేసి ముంజకేశుండను పేరు గలిగె: నారుద్రుండు రౌద్రాకారంబున నయ్యజ్ఞంబు వెనుకొని నాపయిం గవిసిన నొక్కయిషీక పరశురూపంబుగా నభిమంత్రించి యతనిపయిం బ్రయోగించిన నతండు దాని ఖండితధారంబు సేయుటం జేసి ఖండపరశు వను నభిధానంబునుం గలిగె ననుటయు. 441

క. విని పార్థుఁ డిట్లు గలిగిన
యనియం దారుద్రునకొ జయము నీకో క
ల్లైను దానితెఱం గేర్పడ
వినఁ గౌతుక మొలసెఁ జెప్పవే విశ్వాత్మా ! 442

-: శివకేశవుల పరస్పర కోపప్రసాదముల విధము :-

సం. 12-309-2

వ. అనిన విష్ణుం డర్జునున కిట్లనియె: 443

సీ. రుద్రనారాయణ రూపప్రవర్తిత
మూర్తిద్వయము రణమునకుఁ జొచ్చి
పరమసంరంభంబు పాటింప నుద్వేజి
తము లయ్యె నఖిలభూతములు, శ్రుతులు
మునులకుఁ దోఁపవ, యనలంబు లాహుతుల్
గొనవయ్యెఁ, బగిలె దిక్కులు, నభంబు
ధరణి వడంకె, భూధరములు దర్దిరం
దిరిగె, దేవతలకు దిగులు సొచ్చె,

తే. నానసము పల్లటిల్లంగ నజుఁడు గలఁగె,
నిట్టు లెందును సంక్షోభ మెసకబొసఁగ
నావిధాత మునీంద్రులు దేవతలును
దస్సు వేష్టింప వచ్చె సత్వరము గాఁగ. 444

వ. వచ్చి రుద్రునకుం బ్రణమిల్లి సంప్రార్థనంబు దోఁప నిట్లనియె: 445

క. శివుఁడవు నీవు జగములకు
శివ మొనరింపంగ వలదె; చేయుము క్రోధ
ప్రవిహతి; విష్ణుం డనఁగా
శివుఁ డన నొకఁ డొట దివ్యచిత్తము యెఱుఁగున్. 446

తే. నిగమవేద్య మద్వంద్వంబు నిర్గుణంబ
మూర్తమనియెడు తత్త్వంబు మూర్తిభేద
కలనమున లోకమున ద్విధాకారి యయ్యెఁ
గాక హరి యన నీవసఁ గలదె వేఱు. 447

వ. ఆని బోధించి వెండియు. 448

క. నరనారాయణు లనఁగాఁ
బురహర ! జగదాదియైనపురుషులు మనముం
బరికింపఁ దన్మయత్వ
స్ఫురితులము ప్రసన్నదివ్యబుద్ధిం గనుమా! 449

అ. తెలుపు మితని ననుడుఁ దేజికోపంబు వో
విడిచి నన్ను గెలిచె మృడుఁడు పార్థ !
యేను నతనితోడ ని ట్లంటి మృదుసత్య
పథ్యమునిమనోజ్ఞభంగికముఁగ. 450

క. నిను నెవ్వఁ డెజిఁగె నాతఁడు
ననునెజిఁగినవాఁడ; నిన్ను నమ్మిగ సేవిం
చిన నదియ నన్నుఁ గొల్చుట
యనువాదిత లేదు భేద మరయఁగ మనకున్. 451

క. శ్రీవత్సము భూలాంకిత
మై వెలయుంగాక యిప్పు డాదిగ నాకున్
నీవును మత్ప్రాణ్యంకో
ద్భావన శ్రీకంఠుఁ డనఁగఁ బరగుము శర్వా ! 452

వ. అని యివ్విధంబున. 453

క. ఇతరేతరమతిసంభా
వితలక్షణకలన మొంది వృషవాహనుతో

నతినిర్మలసఖ్యము సే
సితి బ్రహ్మాదులును సంతసిల్లిరి విజయా ! 454

వ. మదీయనామ నిర్వచనంబులును రుద్రునితోడిరణంబున నైన జయంబు
తెఱంగును నీ కెఱింగించితి. 455

క. నానారూపంబుల ని
ట్టేను బ్రవర్తింతు జగము లిన్నింటను నీ
శానుఁడు నభవుఁడు నమృతుఁడు
నైన శివుని నీవు గొలువు మర్జున ! యెపుడున్. 456

తే. వీను రక్షింప జయము నీ కెసకమెసఁగె
సమరమున శూలపాణియై శత్రుకోటి
నీదు మునుమున వధియించు నిరుపమాన
తేజు రుద్రుఁగా నెఱుఁగుము ధీరచిత్త ! 457

వ. అనియె నని చెప్పిన విని జనమేజయుండు. 458

క. అరుదే సర్వేశ్వరుఁ డగు
హరితో డుగ జయము గొనుట యర్జునునకు; న
ప్పురుషోత్తము బాంధవు లై
పరగిరి పెఱవినుతు లేల పాండుసుతులకున్. 459

వ. అని పలికి యిట్లనియె: 460

క. నారదుఁడు పరమపురుషుని
కారుణ్యము వడసి వచ్చి క్రమ్మఱ నరునిన్
నారాయణునిం గాంచుట
సారమతిం జెప్పి తీవు సంయమివర్యా ! 461

-: నరనారాయణ నారద సల్లాపప్రకారము :-

సం. 12-331-36

వ. 'తదీయసల్లాపవిశేషంబులు విన వలతుం జెప్పు' మనిన నప్పుడమిఱేనికి వైశం పాయనుం డిట్లనియె : 462

క. నారదుఁడు వచ్చి నరునిన్
నారాయణుఁ గాంచి భక్తినమ్రుం డైనన్
వా రతనికి నాతిథ్యము
గారవమున నడపి యడుగఁ గా వారలతోన్. 463

వ. అద్దేవముని యిట్లనియె : 464

క. శ్వేతద్వీపంబున భవ
దాతతకృపఁగానఁ బోలె నచ్యుతుఁ దద్రూ
పాతిశయము మీచందమ
యాతనికడఁ గంటి మిమ్ము నద్భుత మెసఁగన్. 465

క. శ్వేతులు నింద్రియవర్జిత
చేతస్కులు నైన నరులఁ జెలువుగ మౌనో
పేతులఁ గంటి నచట వా
రాతేజోమూర్తికిని దయాపాత్రంబుల్. 466

వ. అద్దేవుండు వత్సలుం డయి వారలతోడం గూడి విహరించుచుండు; నామీఁదం గృపసేసి క్షేత్రజ్ఞప్రకారంబు సకలంబును దేటపడ ననుగ్రహించి యాగామి నిజప్రాదుర్భావంబుల తెఱంగెల్ల నెఱింగించె; శ్వేతద్వీపం బనునది శాంతి స్వరూపం; బందు సూర్యసోమాంశువ్యాప్తియు వాయుసంచారంబును

లే;దాలోకనాథునకు నేకాంతికజనంబులం గడచిన ప్రియులు లేకునికి యెఱింగి
యేకాంతినై యుండితి; నవ్విభుండు వీడుకొలుప మీకడకు వచ్చితి; నిచ్చట
మీకుం గారుణ్యాభాజనంబనై యుండెద; ననుటయు వార లతని కిట్లనిరి: 467

తే. పడసి తద్దేవు గానఁ దదాశ్రమములు
వింటి నీవు ధన్యుండవు గంటి మేము
నచట నీయున్న తెఱఁగెల్ల నిచట నునికి
మేలకాకయుండుము పరమేష్ఠితనయ ! 468

క. దైవముఁ బిత్యంబును ద
ద్దేవసమారాధనంబు దెల్లము శ్రుతిసం
భావిత మది తత్పరతన్
నీవేకాంతి వయి నిలువు నిర్మలహృదయా ! 469

ఆ. అనిన సంతసిలి యదేవమునిఁ వేయు
దివ్యవత్సరములు భవ్యతపము
నియతి నాచరించెఁ బ్రియమున వారు ద
న్నాదరింపఁగాఁ దదాశ్రమమున. 470

వ. అ ట్లేకాంతియై తపంబు సేసి యత్యంతశాంతి నొంది నారదుండు నరనారా
యణుల వీడ్కొని హిమవన్నగంబునకుం జని తన యాశ్రమంబునందు
బృందారకాది విశిష్టపూజితుండై యుండె నని చెప్పిన విని సంప్రీతుండైన
జనమేజయుతో వెండియు వైశంపాయనుం డిట్లనియె : 471

ఉ. పాండవవంశవర్య ! పటుపాపవినాశని యైన యిక్కథన్
నిండుమనంబుతో వినుట నీవు కృతార్థుఁడ వైతి ; శాశ్వతా
ఖండసుఖాత్మ విష్ణు నధికస్థిరభక్తి సమాశ్రయింపు ; నీ
కొండొకఁ డేల ? యిమ్మెయి మహోన్నతిఁ జేయు జగత్త్రయంబునన్. 472

క. లే వుభయలోకములు హరి
పై విద్వేషంబు గలుగు పాపాత్ములకున్ ;

భూవర : యిట్టిజనుల పిత్ర
దేవతలకు నరక మగుటఁ దెలుపును శ్రుతులున్. 473

క. హరి యాత్మ యెల్ల వారికి ;
నరవర : తనయాత్మపై మనంబున దృఢత
త్పరభావము లేని కుజనుఁ
బొరయవె యాపదలు ; వేఱ బోధన మేలా ? 474

క. మునివరుఁడు గంధవతినం
దనుండు నాగురుఁడు గరుణ దళుకొ త్తఁగఁ జె
ప్పిన వాక్యంబుల యర్థము
లనఘా! యివి; నీవు వీని నలవఱపు మదిన్. 475

శా. విద్వన్మోదవిధాయి నిర్మలవచోవిస్ఫూర్తి విఖ్యాతుఁ గృ
ష్ణద్వైపాయను నీ వెఱుంగుము విభున్ నారాయణుంగా విప
శ్చిద్వంద్యం బగుభారతాధ్యయనముం జేయంగ శక్తుండు ధ
ర్మాద్వైతుండు సరోజలోచనుఁడ కా కన్యుండు తద్వ్యాఖ్యుఁడే? 476

క. బహువిధధర్మంబులు లో
కహితంబుగ నిట్లు సెప్పఁగా నిర్మలతా
మహనీయధిషణుఁ డగున
మ్మహాత్మునక తీరుఁ గురుసమాజవరేణ్యా ! 477

—: హయగ్రీవ దేవ మాహాత్మ్యాభివర్ణనము :—

సం. 12-35-9, 10.

వ. అనిన విని సవిశేషసమ్మదుఁడై జనమేజయుండు వైశంపాయనుతో హయ
శిరోభాసితుం డగు విష్ణుండు వేధకు సన్నిహితుం డయ్యె నని చెప్పితి; నప్పురు
షోత్తముం డప్పు డేమిటికై యామూర్తి వహించె; నత్తెఱం గెఱింగింపు
మని యడిగిన నమ్మునియమ్మనుజపతి కిట్లనియె : 478

సీ. ప్రళయకాలంబున జలముల విష్ణుండు
యోగనిద్రారతి నొంది మేలు
కాంచి లోకంబులు గావింపఁ దలఁప న
హఁకార మెసఁగె; బ్రహ్మాభిధాన
కలిత మై తన్నాభికమలంబునం దిట్లు
జనియించి యా బ్రహ్మసకలసృష్టి
కాదిభూతములుగ వేదముల్ నాలుగు
గలిగించె; నప్పు డక్కమలనాభు

ఆ. నందు మును లయించినట్టి గుణంబులు
మూఁటఁ దొలుత సత్త్వమునకుఁ దోఁపు
కలిమి దాన నుండెఁ గమలోద్భవుఁడు రజ
స్తమము లసుర లయ్యె ధరణినాథ ! 479

క. విను కైటభుండు నామధు
వనఁ బేర్చిన యద్దురాత్ము లవ్వేదములం
గొని వేగ చని రసాతల
మున వైచిరి గాఢబంధనులఁ జేసి నృపా ! 480

ప. దాన నవ్వేధ విహ్వలించి. 481

క. లావును దృష్టియు గతియును
నావేదచయంబ నాకు నవి యడఁగిన నే
నే విధి సృజింతు లోకము
లేవాఁ డీయెడరు దలఁగు నిం కెట్లొక్కొ ? 482

వ. అని పలవించి. 483

ఆ. విష్ణు బహువిధములఁ బ్రస్తుతింప నజ్జల
శాయి హయశిరంబు సకలవర్ణ
భాసురంబు నై న పరమాద్భుతంపు రూ
పంబు దాల్చి వేదపరత నొంది. 484

క. పాతాళమునకుఁ జని యం
దాతత మై ప్రణవరూప మగు నాదం బు
ద్యోతితము సేసె నది యా
దై తేయులు విని పటుప్రతాపం బెసఁగన్. 485

క. ఆనాదము దెసకుం జన
దానవరిపుఁ డొండువలనఁ దా నరిగి తదీ
యానూన బంధ పీడిత
లై నశ్రుతులు విడిచి తెచ్చి యజునకు నిచ్చెన్. 486

తే. ఇచ్చి యెప్పటియట్ల యహీంద్రతల్ప
శయనుఁ డై యుండె; నట తమ చనినచోట
నెవ్వరి గాన కాదైత్యు లెచట శ్రుతులు
దారు మును వెట్టి రందు సత్వరముగాఁగ. 487

ఆ. అరిగి యచట వాని నరసి కానక రభ
సమున గ్రలయఁ దిరిగి శార్ఙ్గిఁ గాంచి
యుద్ధమునకుఁ బిలుప నద్ధరణీధరుం
డడరి సమయఁ జూచె నసురయుగము. 488

వ. ఇట్లు విష్టరశ్రవుండు సృష్టికార్యంబు నిర్విఘ్నంబుఁ జేసిన విధాత యప్పని
సునీతంబు సేసె; నాఁటనుండియు హయశిరోమహితయగు నమ్మూర్తి దక్ర్కన
మూర్తులకంటె నెక్కుడయ్యె; నాజగత్కర్తను వేదంబులు నాశ్రయించి
యుండు నని చెప్పి వెండియు. 489

క. హరిసత్త్వాదిగుణంబులఁ
బొరిఁబొరిఁ గలిగింపఁ జెంపఁ బొలియింపఁగ భూ
వరుఁ యవి యెక్కువఁ దక్కువఁ
బొరయుచుఁ బరివర్తనంబు బొందుచు నుండున్. 490

క. గుణవంతుఁడు గుణరహితుఁడు
గుణకల్పనతత్పరుండు గుణనాశనుఁ డై
పుణశాలి గుణనిబద్ధుఁడు
గుణమోక్షణకరుఁడు శార్ఙ్గి కురుకులముఖ్యా! 491

క. విను నారాయణపరములు
జననాయక! వేదములును జన్నంబులుఁ ద
క్కినపుణ్యసమారంభము
లును రసముఖగోచరంబులును భూతములున్. 492

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనుతో 'నేకాంతికజనులు లోకోత్తరు
లని చెప్పి; తయ్యేకాంతికత్వం బెట్టిది యెఱింగింపవే' యనుటయు నతం
డతని కిట్లనియె: 493

ఆ. సాంఖ్యయోగ పరమసారభూతం బిది
మున్ను వింటి యుద్ధమునకుఁ జొరక
కరుణ నార్ద్రుఁ డైన గాండీవి బోధింపఁ
గృష్ణు చెప్పినట్టి గీతలందు. 494

-:వైశంపాయనుఁడు జనమేజయున కేకాంతికధర్మ మెఱింగించుట:-

సం- 12-336-8.

క. నిర్మల మగు నేకాంతిక
ధర్మము నారాయణోదితంబై క్రియలం
గర్మతుఁ డగు బ్రహ్మమతిని
ధార్మికవర! యొలసె నతఁడు దయ సిగురొత్తన్. 495

క. దక్షునకు నెఱింగించిన
దక్షుఁడు బోధించెఁ దనదు ధాత్రు జగ

చ్చతుని నాసవిత్రండు మ
నుషితిపతి కిచ్చె నవ్వినుతధర్మంబున్. 496

క. మను విక్ష్వాకున కొనఁగె న
తనివలనఁ దదీయయోగ్యతాకలితులు స
జ్జనములు వడసి రనేకులు
విను నారాయణునిచేత విని నారదుఁడున్. 497

క. తగియెడు శిష్యుల కొనఁగెను
జగతీశ్వర యిట్టు లది ప్రశస్తంబై యి
జ్జగములను గలిగె; వినుమ
య్యగాధధర్మంబు దుష్ప్రతాప్రాప్య మగున్. 498

క. దాని కహింసయ మూలము;
దానన హరిప్రీతుఁ డగు నతండన ధరణీ
జానీ! క్షేత్రజ్ఞుం డనఁ
గా నొక్కఁడ యగుట దెలియఁగా వలయుఁ గదున్. 499

క. ఏకద్వితిచతుర్వ్యా
హాకారతఁ దోఁచుచుండు హరి భక్తజనా
లోకమున వాసుదేవా
ద్యాకృ ప్తముగఁ దత్తదుచితస్ఫూర్తిన్. 500

తే. వాసుదేవుండు ప్రథమంబు వసుమతీశ
యోలి సంకర్షణుండుఁ బ్రద్యుమ్నుఁడును ద్వి
తీయకంబుఁ దృతీయంబుఁ దెల్ల మచ్చ
తుర్థ మనిరుద్ధుఁ డిట్లు చతుర్విధములు. 501

క. ఈనెలవులఁ దోఁచును హరి
దా నొక్కఁడ యింద్రియప్రతతి కంద డే

కానూనభ క్తి కగపడు
దానికిఁ దపమును శమంబు దమమును వలయున్. 502

క. శాంతిపరినిష్ఠకు నే
కాంతికధర్మంబు గరతలామలక మగుం
జింతాతంత్రతటనా
త్యంతవిదగ్ధంబు సూవె యది మనుజేంద్రా ! 503

క. అనిన నతఁ డిట్టిధర్మము
గొనియాడక పత్రము లొండు గోరి నడపఁగాఁ
బని యేమి యెఱింగింపుము
జనములచందంబు నాకు సంయమివర్యా ! 504

క. అని యడిగిన వైశంపా
యనుఁ డతనికి నిట్టు లనియె నది గలదధిపా !
విను సాత్త్వికమును రాజస
మును దామసమును వికారములు మానసముల్. 505

తే. వికృతులందును సత్త్వస్థవిధము మేలు;
దాన హరిఁ బొందవచ్చు; నతండు నడపు
దత్పరికారుల కుశలంపుఁ దంత్రమెల్ల;
వార లేకాంతికులు; పెఱవారి వినుము. 506

క. కలగొన రాజసతామస
ములయిన భావములు వికృతిఁ బొందింపఁగ మ
ర్త్యుల కేకాంతికవృత్తిని
నెలకొనఁగా నెట్లు వచ్చు నిర్మలధిషణా ! 507

క. వారికిఁ బ్రవృత్తిలక్షణ
తారూఢం బైన ధర్మ మలవడు హరికిం

గారుణ్యపాత్రములు గా
రారయ వా రన్యపథసమాశ్రితు లగుటన్. 508

క. ఏకాంతిజనంబులు సు
శ్లోకుం డగుహరి మనంబులో నుండుదు; రా
లోకింప వారి కతనికి
నేకత్వము గలదు; దెల్ల మిది వేదములన్. 509

క. ఈతెరువు మద్గురుఁడు సం
ప్రీతిని దయ నన్ను నాదరించుచుఁ జెప్పెం
జేతశ్శుద్ధి కలనమెయి
పీతదురిత మైకభంగి విన్నది యధిపా ! 510

క. చాలిన నీవును హరి ని
ట్లాలోకింపుము నిరంతరానందశ్రీ
శాలి వగు దనిన నాథూ
పాలో త్తముఁ డాతపస్వీపతి కిట్లనియెన్. 511

తే. వేదములు సాంఖ్యమును యోగవిధియుఁ బాశు
పతముఁ బాంచరాత్రంబు నాబహువిధములఁ
జెల్లు బోధసాధనముల కెల్ల నిష్ఠ
యొక్కటియె; యివి భిన్ననిష్ఠోదితములొ. 512

వ. నా కెఱిఁగింపవే; వీనికిం బ్రవర్తకు లెవ్వరు వారలం జెప్పు మని యడిగిన
జనమేజయునకు వైశంపాయనుండు. 513

ఉ. ద్వీపమునం బ్రబోధపరిదీపుని వేదనిధానమున్ జగ
ద్వ్యాపకతేజు గంధవతియందుఁ బరాశరసంయమీశ్వరుం
డేపురుషోత్తముం బడసి యీధృతమోన్నతి నొందె లోకశి
క్షాపరు భారతాధ్యయనకారకుఁ గొల్చెద నమ్మహాత్మునిన్. 514

వ. అనుచుం గృష్ణద్వైపాయనధ్యానపరాయణుం డగుచుం బలికి యా
భూవిభున కభిముఖుండై. 515

క. వినుఁ మీతంత్రంబులకె
లను నరయఁ బరాయణం బలఘుతరసంవి
త్తనుఁ డగు నారాయణుఁడ; య
తనిఁ బొందఁగ ఋజువు లగు పథము లివి యధిపా ! 516

వ. వేదంబులకుం బ్రవర్తకుండు నారాయణనందనుం డపాంతరతముం డను
పేరం బ్రసిద్ధుం డగు వేదవ్యాసుండు, సాంఖ్యంబునకుం గపిలుండును,
యోగంబునకు హిరణ్యగర్భుండును, పాశుపతంబునకు శివుండును, పాంచ
రాత్రంబునకు విష్ణుండును ప్రవర్తకులు; పాంచరాత్రంబు వైష్ణవంబనం
బరఁగు; ననిన విని యజ్జనపతి యమ్మునిపతితో 'వేదవ్యాసుండు పరాశర
పుత్రుం డని చెప్పి; ఈపరమమునికి నారాయణనందనత్వం బెట్లు వచ్చె' నను
టయు నతం డతని కిట్లనియె : 517

సీ. హిమవన్నగంబుపాదమున మహాభార
తం బొనర్చుపరిశ్రమంబుదోఁప
భావించి శిష్యులు గావించుపరిచర్యఁ
దద్వినోదనపరత్వమున నొంది
వారికి వేదార్థభారతార్థంబులు
సాత్యవతేయుండు సదయబుద్ధి
నెఱిఁగించుచున్నట్టియెడ నేను లోనుగాఁ
గొందఱు తత్పాదవందనంబు

తే. భక్తిఁ జేసి 'నారాయణప్రభువుఁ డండ్రు
నిన్నుఁ; గృపఁ జెప్పవే మాకు నిర్మలాత్మ!
యత్తెఱం'గని యడిగిన నమ్మహాను
భావుఁ డత్యంతకరుణార్ద్రిభావుఁ డగుచు. 518

వ. మాతోడ నిట్లనియె: 519

-: వేదవ్యాసునకు నారాయణ నందనత్వంబు గలిగిన ప్రకారము :-

సం. 12 - 336 - 24

సీ. ఆదికాలమున, ప్రజాభివర్గమునకు
నారాయణుఁడు నిజనాభిపద్మ
మున బ్రహ్మఁగల్పింప భూతసంఘమ్ములఁ
నెల్ల నాతఁడు సృజియించె; నతని
ముఖమున బహువేదములు ప్రసరింపఁగఁ
జేసి వానికి మేలుసేఁత బుద్ధిఁ
దలఁచి యవ్విష్ణుండు నలఘుబోధుని నపాం
తరతముఁ డనియెడు తనయుఁ జిత్త

తే. మునన కల్పించి యతిభక్తి మొక్కి నిలిచి
యున్న యక్కుమారుని 'శ్రుతులన్నియును దృ
ఢావధానుండ వై విని నీవు వాని
నంచితవ్యాస మొందింపు' మనియెఁ బ్రీతి. 520

ఆ. అనిన 'నట్లకాక' యని యయ్యపాంతర
తముఁడు వేదభేదనము నొనర్చె;
దాని కవ్విభుండు దద్దయుఁ బ్రీతుఁడై
వత్సలత్వ గౌరవం బెలర్ప. 521

క. 'వేదవ్యాసుఁడ ర'మ్మని
యాదరమునఁ బిలిచి 'నాకు నాత్మజుఁడై సం
పాదించువాఁడ వధికా
హ్లాదము మన్వంతరంబు లన్నిటియందున్'. 522

క. అని యానతిచ్చి 'మజీయును
జననంబులు సీకుఁ గల్గు సంయమిమూన్వా!'

యనియుఁ బలికి వెండియు ని
ట్లనియెను విష్ణుండు పేర్చునర్మిలితోడన్. 523

క. నాచరితంబులుఁ దైర్ఘ్యలో
క్యాచరణంబులును ధర్మమఖిలంబు మదిం
జూచి త్రికాలజ్ఞత్వస
మీచీనత వెలయు మునులు మేటి యనంగన్. 524

క. ఉత్తరకాలంబున లో
కోత్తరుఁడు వసిష్ఠపౌత్రుఁ డుదితజ్ఞానో
దాత్తుఁడు పరాశరుం డను
నుత్తమసంయమికిఁ బుట్టు దుజ్జ్వలతేజా ! 525

క. నీవలనన కలిగి కురు
క్ష్మావలయం బేలునట్టి జనపతు లన్యో
న్యావిష్టరోషు లై రణ
సేవనమునఁ గులము తఱచు సెఱుతురు వత్సా ! 526

తే. కాలముల కీడుకతమునఁ గలఁగఁబడిన
వేదముల నీవు నాఁడును విమలబుద్ధి
నంచితవ్యాస మొందించి యఖిలదివిజ
మునిగణముల కొనర్తు సమ్మోద మనఘ! 527

తే. ధర్మసందేహములు నీవు నిర్మలంపు
వాక్యములఁ బాపి జగములవార లెల్ల
నఖిలసంశయచ్ఛేత్త పుణ్యాత్మకుండు
లోకహితవాణి యనఁగ సుశ్లోకుఁ డగుదు. 528

క. రాగిత్వము విడువదు నిను ;
రాగవిదూరుఁ డగు సుతుఁడు ప్రభవించును నీ

కాగమవిధానబద్ధియు
యోగము సాంఖ్యంబు మది సముదితంబు లగున్. 529

వ. అని నిర్దేశించి నీవు నిజేచ్ఛం బ్రవర్తింపు మని పలికి యద్దేవుం డంతర్హితుం డయ్యె నిది మదీయనారాయణసంభవత్వంబు తెఱం; గేను యమనియమ నిరూఢి నిర్మలతపఃకలనంబు చిరకాలం బాచరించి యప్పురుషోత్తము కారుణ్యంబు నామీఁద నంతకంతకు నెక్కుడగునట్లు సేసితి; నని మద్గురుండును ద్రికాలవేదియు నగు వేదవ్యాసుండు సెప్పె నని చెప్పి వైశం పాయనుండు జనమేజయునితో వెండియు నిట్లనియె : 530

సీ. అట్లు ధర్మజుఁడు నారాయణనారద
సంవాదకథ విన్నసమయమునను
నారదుఁ డచ్యుతు కారుణ్య మమ్మెయిఁ
బడసి క్రమ్మఱి వచ్చి బదరికాశ్ర
మమున నారాయణు మన్ననతోడి సం
భాషణంబును గాంచి పరమ తపము
వాఁజేత యెఱిఁగించి తదనంతరంబ య
య్యమరమునీంద్రుఁ డే మడిగినట్ల

ఆ. యడుగ ధర్మనందనాదులుఁ గృష్ణుండు
వినఁగ మద్గురుం డతనికిఁ జెప్పె
సురలు మోక్షధర్మపరులు గా కధ్వరా
యత్తచిత్తు లైన యత్తెఱంగు. 531

వ. ఇట్లు సెప్పి. 532

క. వేదవ్యాసుఁడు సుముఖత
నాదైవతమునికిఁ జెప్పె హయశిరుఁ డగు దా
మోదరుని దివ్యలీల స
మాదరమున ధర్మనందనాదులు వినఁగన్ 533

534

వ. అని చెప్పి వెండియు.

క. నిజనామనిర్వచనములు
విజయుం డడుగంగ నెల్లవియు నెఱిఁగించెం
ద్రిజగద్భజనీయపదాం
బుజుఁ డగుకృష్ణుండు భరితపుణ్యచరిత్రా! 535

536

వ. ఇట్లగుట మున్నెఱింగించితి.

క. వేదాదు లైన పథముల
భేదప్రాప్యంబు లగుట ప్రియ మెసఁగఁగ న
వ్వేదవ్యాసుఁడు చెప్పె స
మాదరమునఁ బార్థుఁ డడుగ నందఱు వినఁగన్. 537

క ఏకాంతికధర్మము సు
శ్లోకుం డగునాతఁ డడుగ లోకోత్తర యా
లోకారాధ్యుఁడు చెప్పె ద
యాకరమతి కృష్ణధర్మజాదులు వినఁగన్. 538

క. దైవవశంబున నేఁడును
నీవడుగఁగ నింతవట్టు నిస్సందేహం
బై వఱలఁగ నేఁ జెప్పితిఁ
బావన మిది యసదృశంబు పౌరవముఖ్యా! 539

వ. అని పలికి నారాయణనారద సంవాదాదికం బైన యివ్వాఙ్మయం బంతయు
బేరొక్కని. 540

క. నారాయణీయ మగు నీ
సారాఖ్యానంబు వినినఁ జదివిన సంప
త్సారోగ్యాయుస్సద్గతు
లేరికినైనం గురుక్షితీశ్వర! కలుగున్. 541

వ. అనిన విని యత్యంతాహ్లాదభరితాంతఃకరణుం డయిన యక్కౌరవేంద్రుతో నమ్మునింద్రుం డిట్లను; నిట్లు సకలలోకసంభావనీయసత్కథ లాకర్ణించి సముచీర్ణసంప్రీతుం డగునప్పాండవాగ్రజుండు. 542

తే. అమరతటినీసుతున కిట్టులనియె రాజ
ధర్మముఖ్యంబులగుసర్వధర్ముల ను
దాత్తకృప నెఱిఁగించి తత్ప్రోత్తమంపు
ధర్మమెయ్యది సెప్పుము ధర్మనిత్య! 543

వ. అనుటయు నాదేవవ్రతుం డన్నరదేవోత్తమున కిట్లనియె : 544

చ. అరయఁగ ధర్మతంత్రములయందు నిరర్థము లే దొకండు; నె
వ్వరి మది యెందు బ్రాలేఁ దగ వారలు దానిన పూని యాచరిం
తు; రదియ వారి కిష్టఫ దోహనకార్యమొనర్చు; నెల్లెడం
బురుషులఁ జూడమే తమకుఁ బోలినధర్మములన్ వెలుంగఁగన్. 545

-: ఇంద్రునకు నారదుఁడు సెప్పిన భృగునామకవిప్రుని చరిత్రము:-

సం. 12-340-4,5

వ. అది యట్లుండె; నప్రతిహతగతియై చరించుచుండి యొక్కనాఁడు నారదుం డాఖండలుపాలికిం జనిన నతం డతనికి సముచితసత్కారంబు లాచరించి సుఖాసీనుండై యున్న యమ్మునివరునాననంబునం జూడ్కి నిలిపి 'నీవు మెలంగునెడ నెద్దియేనియు నాశ్చర్యంబు గన్నయది గలదే'యని యడిగిన నమ్మహితాత్ముం డమ్మ హేంద్రునకుం జెప్పినకథ సెప్పెద నది భవత్ప్రశ్నం బున కుత్తరంబై యుండు; దాని వినుము; భాగీరథీదక్షిణతీరంబున మహా పద్మం బనియెడు పురవరంబునఁ గులశ్రేష్ఠుం డగు భృగుం డను విప్రుండు గలం డప్పురుషవరుండు. 546

సి. ధర్మనిత్యుండు సత్యవ్రతపరుఁ డహిం
సాశాలి యింద్రియజయవిభాసి

నిజ కర్మతత్పుండు నిష్క్రోధుఁ; డంచిత
న్యాయసంప్రాప్తధనముల దేవ
పితతిథిజ్ఞాతి మిత్రకార్యములు ని
ర్వర్తించు సువినయవంతు లైన
తనయులఁ గన్నాఁడు; ద న్నెల్లవారును
వినుతింప మన్నాఁడు; దనమనమున

తే నెట్టికృత్యంబు మేలొ యే నెద్ది సేసి
కృతపరాయణధర్మతాస్థితి వహింతు
నొక్కొ? యని చింతఁ బొందుచునుండు నాత్మ
నిష్ఠ యలవాటు కాంక్షించి నృపవరేణ్య! 547

వ. అట్లుండ నొక్కనాఁడు. 548

తే. తన గృహంబున కతిథి యుదాత్తుఁ డొక్క
బ్రాహ్మణుఁడు వచ్చె; వచ్చినఁ బరమభక్తి
యుక్తి నాతిథ్య మొనరించి యున్న యప్పు
డమ్మహాద్విజుతోడ నిట్లనియె భృగుఁడు. 549

సీ. అనఘ! నీమధురవాక్యంబులఁ జేసి మి
త్రత్వంబు వొంది మద్భావగతము
నీ కెఱింగించెద; నీవు నెయ్య మెలర్ప
హిత ముపదేశింపు; మేను నియతి
నాత్మావలోకన మాచరించెద నని
కొడఁగుదు; నది యలవడదు నాకు
లోకసామాన్యగుణాకలనంబున
బద్ధుండ నగుట; నెబ్భంగి నాత్మ

ఆ. నాత్మయంద కని యనామయత్వముఁ బొంది
ఖండరహిత మగుసుఖమున మునిఁగి
యుండువాఁడ? భూసురోత్తమ! చెప్పవే!
యనిన నతని కిట్టు లనియె నతఁడు. 550

క. వీనును నిట్టుల మోహా
ధీనుఁడ నై యాత్మ గాంచు తెఱఁ గొలయుటకుం
బూని పడుదు నెయ్యదియో
కానం దెరు వాశుభ్రకలనంబునకున్. 551

ఉ. కొందఱు బ్రహ్మచర్యమునఁ గొందఱు భవ్యగృహస్థధర్మముం
బొందుటఁ గొంద ఱిద్ధతపమున్ వనభూమిఁ దగం జరించుటం
గొందఱు నిష్క్రియత్వమునఁ గొందఱు యజ్ఞవిధానశాలితం
గొంద ఱనూనదానములఁ గోరి మొనర్తురు నిత్యసౌఖ్యమున్. 552

క. జననీజనకారాధన
మున గురుభక్తిని సువ్రతమున శాంతిని దాం
తిని సత్యమున నహింసను
వినుఁ కాంతురు మోక్షపదము వేర్వేఱజనుల్. 553

వ. అట్లు బహువిధంబు లగు ధర్మద్వారంబులు గలవు గలిగిన కలుచ నెల్లవారికి నాత్మానందం బలవడ నేర్చెనే; యొకటి యుపదేశించెద నాకర్ణింపుము. 554

తే. నై మిశారణ్యమునయందు గోమతి యనఁ
బరగు నుత్తమనది మహాపద్మ మనఁగఁ
గలదు పుణ్యహ్రదము దాని యలఘుతటత
లంబు నెలవుగా నుండు నాగం బొకండు. 555

క. ఆతీరోత్తమమున మాం
ధాతృఁడు తోనుగ విశిష్టతపముల నిహలో
కాతిశయముఁ బరలోక
ద్యోతనముం బడసినారు దొల్లి యనేకుల్. 556

వ. అప్పుణ్యక్షేత్రంబున. 557

తే. పద్మ, డనుపేరి యన్నాగపతి యుదాత్తు,
డఖిలధర్మజ్ఞు, డతుఁదయాన్వితుండు
సుజనసంభావ్యమానుఁ డస్తోకపుణ్య
నియతి నిత్యుఁ డాగంతుకప్రియతముండు. 558

ఉ. ఆతనిఁ గానఁ బొమ్మ్ర ప్రచురాదరణంబున నీదు కోర్కి సం
ప్రీతిగఁ దీర్చు నాగుణగరిష్ఠుఁడు నాపలు కూఁదు మన్న మో
దాతిశయంబు నొంది భృగుఁ డాధరణీసురవర్యుతో మహా
త్మా! తెలివొందె నామనము తావక పావన వాక్యసంపదన్. 559

క. అని పలికి యిట్లనియెఁ ని
ద్దినశేషము రాత్రియును మదీయనివాసం
బున నిలువు; నిలిచి మత్పా
వనుఁడవు గావలయు గౌరవశ్రీభరితా ! 560

క. అనిన నతఁ డట్ల చేయ న
తనిఁ బూజించుటను మధురతరసల్లాపం
బున ధర్మసత్కథావ
ర్తనమున నక్కొల మతఁ డుదాత్తతఁ గడపెన్. 561

క. వేగిన నామంత్రితుఁ డై
యాగుణనిధి వీడుకొలిపి యతఁడు ప్రియాణో
ద్యోగంబు సమీచీన వి
ధాగరిమప్రౌఢవృత్తి దగ నొనరించెన్. 562

-:భృగుం డను విప్రుండు పద్మ్మం డను సర్పరాజుం గనవచ్చుట:-

సం. 12-342-2

వ. ఇవ్విధంబున నుద్యుక్తుండై భృగుండు బంధుమిత్రజనసమ్మతం బగు
తెఱంగునం గదలి యెడనెడ బహుతీర్థసేవనంబు సేయుచుం జని పుణ్యం

బగు నై మిశారణ్యంబు సొచ్చి గోమతీతీరంబు సేరి సుప్రసిద్ధం బగు మహా పద్మహ్రదంబు తటంబునం బొలుచు భుజగేంద్రమందిరంబు గాంచి తగం బ్రవేశించి నట్టియెడ. 563

తే. భక్తి తోడ నన్నాగేంద్రుపత్ని యెదురు
వచ్చి తోడ్కొ ని చని యర్చ లిచ్చి 'మీర
లిందు రాకకుఁ గారణ మేమి సెప్పు
డెద్ది పనిచినఁ జేసెద నిద్ధచరిత !' 564

వ. ఆనుటయు నమ్మహీదేవుండు 'దేవీ! భవదీయ పతిం గానవచ్చితి ; నెచ్చో నున్నవాఁ; డవ్విభుం గానిపింపు' మనిన నతని కాభుజంగాంగన యిట్లనియె. 565

క. తనకు నెలవరుస వచ్చిన
నినరథవహనమున కాతఁ డేఁగినవా; డే
డెనిమిదివివసములకు నిట
సనుదెంచుం దథ్య మిది ప్రసాదప్రవణా ! 566

క. 'అతని తెఱం గిట్టిది వాం
ఛిత మెయ్యది యిత్తు ననఘ! చెప్పు'మనుడు నా
సతి కిట్లను భృగుఁడు 'భవ
త్పతిఁ గనుటయు కాక వాంఛ దక్కను గలదే?. 567

వ. అయ్యురగవల్లభు వచ్చునంతకు నుల్లవనంబున నిలిచెద; నవ్విభుండు వచ్చి నప్పుడు మఱవక నాతెఱం గెఱింగింపవలయును' నని పలికి పోయి భృగుండు గోమతీతటపుణ్యారణ్యంబున జప్యపరుండును నిరాహారుండును నై యుండె; నట్లుండ నా భుజంగపతి బాంధవులు దదీయపత్నీపుత్రసహితంబుగా నమ్మహీసురవరుపాలికిం జనుదెంచి మృదుమధురవాక్యంబుల ననునయించి 'నీ వాహారంబు గొనక నిలువం బొడఁగిననాఁటికి నేఁ డాఱవదినం బయ్యె; నే మతిథిపూజాపరులము; మాకు ధర్మవిరోధంబు గాకుండ మాచేయు నాతి

థ్యంబు నాదరింపు; మస్మత్ప్రార్థనంబున నన్నంబు ఫలంబు మూలంబు
మఱియు నెయ్యదియైనను భుజించి మమ్ము రక్షింపవే' యనిన వారలతో
నాసువ్రతశీలుం డిట్లనియె : 568

ఉ. ఇం తన నేల యేను భుజగేశ్వరు రాకయ వార్చినాఁడ; నా
కం తవునంతకుం గుడవ నాఁకలి నీళ్లలు ద్రావఁ దృష్ణ యొ
క్కింతయు లేదు గా కలిగి యే యటవీస్థలి కేఁగుదెంచి యే
కాంతమ యున్నవాఁడ నియమాభిరతున్ ననుం నేఁప నేటికిన్. 569

క. మీకును ధర్మవిరోధము
గాకుండుట కేన పూఁట గారవమున నా
లోకింపుఁ డింక దివస యు
గాకలనముఁ గల్గ వ్రతసమాప్తి యుఁ గలుగున్. 570

క. వినుఁ డష్టమ మగు దివసం
బున ముదమారంగ నిందు భుజగేంద్రుఁడు రా
కునికి గలిగెనేనియుఁ బర
దినమునఁ గుడిచెద భవన్మతిం బ్రియ మెసఁగన్. 571

వ. మీర లిత్తె ఱంగున కనుజ్ఞ సేయ వలయు నని సంప్రార్థనీయస్వరంబునం
బలికిన వార లందఱు నొడంబడి నిజనివాసంబులకుం జని రయ్యష్టమదివ
సంబున. 572

క. వరుసదినంబులు దీఱిన
నరవిందాపుండు దనకు ననుమతి సేయం
గురువంశముఖ్య ! తగ న
య్యురగాధీశుండు విభవ మొప్పఁగ వచ్చెన్. 573

ఉ. వచ్చిన సంభ్రమంబు గరువంపు టెలర్పున నుల్లసిల్లి మే
నచ్చుపడంగ జేయఁ జెలు వాభుజగేశ్వరుపత్ని యాతనిం

జెచ్చెరఁ దా నెదురొక్కని విశిష్టసమాదర యై యుపాయనం
బిచ్చి తదీయచిత్తమున కింపెసలారఁగఁ బాద్య మిచ్చినన్. 574

వ. సంప్రీతుండై సముచితప్రకారమున నుండె; నట్లున్న యన్నాగేంద్రుఁడు
సమీపాసీనయైన నద్దేవి నాలోకించి. 575

తే. 'అతిథిఁ సేమమె? తగదేవతాతిథిప్ర
పూజనంబులు నడుచునే పూర్వవృత్తి?
యెడలి యేను లేకునికి నేమేని వికల
మయ్యెనో చెప్పు' మనవుడు నామృగాక్షి. 576

ఉ. ఆతనితోడ నిట్లనియె'నంత యెఱుంగమి రాదు నీదు శి
ష్టాతిశయంబుకల్మి భుజగాధిపఁ నాకుఁ; దగన్ సమస్త దే
వాతిథిపూజనంబులు సమగ్రములై నడచెన్; సుహృజ్జన
ప్రీతియు మున్నపోలె నవిభేదత యొప్పఁగ నిర్వహించితిన్. 577

వ. అని వెండియు. 578

సీ. గురుభక్తి శిష్యులకును వేదపరత వి
ప్రులకును జనరక్ష భూపతులకు
న్యాయార్జనంబు వైశ్యజనంబులకుఁ ద్రివ
ర్ణారాధనంబు శూద్రావలికిని
బతివాక్యకరణంబు భటులకు సర్వోప
కారక్షమం బైన సారభూత
మనఁగఁ బెంపొందు గృహస్థాశ్రమంబుపై
వారనిప్రియ మెల్లవారలకును

తే. లోక మేల యే నేల యి ట్లేకతంబ
యింద్రియంబులఁ గుదియించి యిచ్ఛ నడఁచి
యుండువాఁడఁ గా కనుమతియోగికిని బ
తివ్రతాత్వంబు భార్యకు సువ్రతములు. 579

వ. కావున ధర్మసూక్ష్మసంవేది వగు నీదుచిత్తంబున ఖేదం బొక్కింత యేనియు దొడరునట్టివిధంబున వర్తింతునే; యొకండు విన్నపంబు సేయంగల దవధరింపుము; పరమపావనమూర్తి యొక్కమహీసురోత్తముం డిచ్చటికి వచ్చి యభ్యర్చితుండై భవత్పతి దర్శింప వచ్చితిననియెఁ; గార్యం బేమియని యడిగిన నాకుం జెప్పకుండె; నేను నీవట సనుటం జెప్పిన విని యట్లైన నా భుజంగవిభుండు వచ్చునంతకు నుల్లవనంబున నుండెద నతండు వచ్చిన నాతెఱం గెఱింగింపు మని చని యేడెనిమిది నాళ్లేని జప్యపరుండును నిరాహారుండును నై యున్నవాఁడు; నీ వచ్చటి కరిగి యతని సంభావింప వలయు; నని చెప్పిన నాసర్పగ్రామణి గుపితచిత్తుండై. 580

క. ఏనఱె యొక్కెడ కొక్కరుఁ
గానఁగఁ బోదునఱె దేవగణము నసురలున్
లోనుగ న న్నేచందము
మానుగ నడపుదురు తలఁపుమా చతురమతి! 581

తే. అనిన నీరాక వార్చి మహాశతోడ
నున్న విప్రుని యభిలాష మొక్కభంగిఁ
దీర్పకుండుట ధర్మమే ధీరశాంత
చిత్త! నీయట్టి యాచారవిత్తమ నకు. 582

క. ధరణిసురునాస సెఱిచినఁ
బొరసిన పాపాగ్నిఁ గాల్పఁ బూనెదవే నీ
పురుషార్థంబును సముచిత
పరత్వమును గృపయు ధర్మపాండిత్యంబున్. 583

క. విను మాశావిచ్ఛేదన
మునఁ బాటిలు బ్రహ్మహత్య భుజగోత్తమ! ధ
ర్మనిరూఢుఁ డైన పురుషున
కును దద్ద్విజునాసఁ దీర్పఁ గోరుట వలదే. 584

క. మౌనమున దృఢజ్ఞానము
దానంబున నభ్యుదయము ధర్మనిరత యా
శానిర్వహణంబున నర
కానీకనిహరణసౌఖ్య మగు నంత్రు బుధుల్. 585

తే. చాతకము వాన గోరెడు చంద మొంద
నెదురుచూచుచు నున్నవా డిందు నీదు
రాక కక్కట! యడవిలో బ్రాహ్మణుండు
రోష ముడుగును ధర్మనిరూఢహృదయ! 486

వ. అని పత్ని బోధించిన. 587

చ. ఆనయమున్ దేజి నాగపతి యక్కమాలాననమోము సూచి యి
ట్లను నొరుఁ గానఁ బొమ్మనిన యంతన రోషము వచ్చి యిట్టు లొ
ప్పని పలుకుల్ సగర్వమునఁ బల్కితి; దానికి శంకలేక చె
ప్పిన జతనంపుధర్మమునఁ బేర్మియు నాకు నొనర్చి తుగ్మలీ! 588

ఆ. కార్తవీర్య దశముఖప్రముఖులు జమ
దగ్నితనయ రాఘవాదు లైన
పురుషవరులచేతఁ బొలియరే సక్రోధ
వృత్తిఁ; గాన యలుక విడుపు మేలు 589

క. నీయట్టిభార్య గలుగుటఁ
దోయజదళనయన! యిట్లు దొలఁగితి దురితా
పాయంబునఁ బొరయక; యేఁ
బోయెద నవ్వీప్రకోర్కి పూర్ణము సేయన్. 590

క. అని పలికి సత్వరంబుగఁ
జని భృగుని గాంచె వినయసంభ్రమములతో
జనపాలోత్తమ! యతఁడు న
తనిఁ గని యుల్లమునఁ బ్రియము దళుకొత్తంగన్. 591

-: పద్ముఁడను సర్పరాజు భృగుఁడను విప్రుం గానవచ్చుట :-

సం. 12-349-2, 3.

వ. అంగంబులు వొదల నెదురుకొనియె; నిట్టిరువురు సుసంగతులై సుసంగత పత్త్రిప్రకరతరుచ్ఛాయాశీతల సికతాతలంబున సుఖాసీనులై; రయ్యహీంద్రుం డామహీసురవరునితో మధురస్వరంబున నిట్లనియె: 592

తే. అనఘ! నారాక వార్చి నీవధికనిష్ఠ
నిట్టు లునికిఁ గారణ మేమి? గోర్కి
యెవ్విధంబై న దాని నే నిపుడ నిర్వ
హించి పుచ్చెద; న త్తెఱం గెఱుఁగఁ జెపుమ! 593

వ. స్వజనంబులచేత నిచ్చట నీయునికి విని యభిగమ్యుండ వగు నీకడకుం జను దెంచితి ననవుడు నద్ధరామరవరుండు ధర్మారణ్యంబుననుండి నిన్నుం గాన వచ్చితి; మాననీయమహీసురసూనుండ; భాను నారాధింప నీచనుట భవదీయ వల్లభవలన నెఱింగి వాడినచేనివాఁడు మాన కెదురు చూచునట్లు భవదాగమ నంబు వార్చి నియతవృత్తి నున్నవాఁడ; మదీయ మనఃక్లేశంబు నిరసింప నీవ యర్హుండ' వనుటయు. 594

తే. 'నీవు కల్యాణమూర్తివి; నీమనోర
థంబు సఫలంబుసేసి కదా మదీయ
జననసఫలతఁ గలిగింతు'నను భుజంగ
మాధిపతిమోముఁ జూచి యిట్లనియె నతఁడు. 595

క. నాకోర్కి పిదపఁ జెప్పెద
లోకనుతా! యొకటి యడుగ లోలత్వము చి
త్తాకలిత మయ్యెఁ బ్రార్థన
సేకొని యది నాకు మున్ను సెప్పఁగలవలయున్. 596

వ. అనుటయు నయ్యురగవల్లభుం'డది యెయ్యది యడుగు' మనిన భృగుండు 'నీవు రవిరథంబు వహింపం జనినయెడఁ గనిన వినిన యట్టియాశ్చర్యంబులు గలవేని వాని నాకెఱింగింపవే'యనిన నతం డతని కిట్లనియె: 597

సీ. ఆశ్చర్యములకెల్ల నాస్పదం బాదిత్యఁ;
డాతని వలనన భూతజాల
మఖిలంబుఁ జరియించు; నది యచ్చెరువు గాదె:
యద్దేవునంశవు లందుఁ ప్రీతి
నమరులు వాలఖిల్యాదిమునీంద్రులు
సిద్ధులు శాఖలఁ జెంది యుండు
విహగకులంబుల విధమున వసియింతు;
రంతకంటెను నెక్కు డద్భుతంబు

ఆ. గలదె! యమ్మహాత్మవలనన వాయువు
వెడలి యతని నడిమి విపులరశ్మిఁ
బొంది వృష్టి గురియు నెందును నట్టిచో
ద్యములు గలవె భూసురాగ్రగణ్య! 598

క. రవి సృజియించును వర్షము;
రవియ మగుడఁ గిరణతతుల రసమంతయుఁ దాఁ
దివుచును విస్మయకారక
మవనీసురవర్య! దాని కధికము గలదే. 599

క. ఇనువేఁడిమి శోషించిన
జనముల యం దాత్మనిష్ఠశాశ్వతికత్వం
బున వెలుఁగుచుండు; దానికి
ననఘా: మిగులంగఁ జిత్రమైనది గలదేఁ. 600

తే. సూర్యువలకన బీజంబు ధార్యమాణ
మగుఁ జరావరధారిణి యైన ధరణి

చేత నంతకు మిగులఁ జర్చింప సక్క-
జంబు లెందును గలవె నిష్ఠానిరూఢ! 601

క. పరముండు నిరంజనుఁ డ
క్షరుఁ డజరుం డద్వయుండు శాశ్వతుఁ డగు న
ప్పురుషుఁడు రవియంద వెలుఁగు;
నరు దంతటికంటెఁ గలవె యగ్రిమవర్ణా! 602

వ. అని వెండియు 603

-: ఉంఛవృత్తి మహిమ :-

సం. 12-350-8

క. విన: మత్ప్యాశ్చర్య మొకటి
మనుజో త్తమ! యొక్క-నాఁడు మధ్యాహ్నమునం
దనవెలుఁ గినుని వెలుఁగుతో
నెనగా గగనమున నొక్క-ఁ డేతెంచె వడిన్. 604

క. అంబరపాటనమునఁ బో
లెం బెద్దయు మెఱయు తనదు లీలాగతి క
య్యంబరమణి యధికప్రభ
దంబున నభినఁ ఖుఁడుగా నుదగ్రస్ఫూ ర్తిన్. 605

చ. కదియఁగఁ బాఱుతెంచిన వికాసవిభాసిముఖారవిందఁ డై
యెదురుగఁ జేయి సాఁచె దివసేశుఁ డతండును లీలఁ గేలు నొ
ప్పిదముగఁ బట్టి రూపము లభిన్నతఁ బొందఁగఁ జొచ్చె బింబమున్
సదనముఁ జొచ్చునట్ల విలసద్గతి నింకిట యేమి సెప్పుదున్. 606

వ. అట్టియెడ. 607

చ. అరదము మీఁద మన్పొలుచు నాతఁడొ యిప్పటియాతఁడో దివా
కరుఁ డను సందియంబు భుజగంబులచిత్తములందుఁ బుట్టి యొం
డొరువులతోడ వారు గడు నొయ్యన పల్కఁగ నే వినీతి సు
స్థిరమృదుభాషినై యడిగితిం బ్రభువున్ ధరణీసురోత్తమా! 608

క. ఇతఁ డెవ్వం డని యమ్మొయి
నతిచకితాత్ముండ నగుచు నడుగుటయు నహిః
పతి నామీఁదఁ గృపాసం
గతమగు తన చూడ్కి వొలయఁగా వత్సలుఁడై. 609

సీ. సురయక్షగంధర్వగరుడోరగాదుల
లోన నెవ్వఁడుగాఁ డలోలుపాత్ముఁ
డుంఛవృత్తి మహీసురోత్తముం డస్థల
నియముండు ఫలమూల నీరమారు
తాహారుఁ డగు ముని యాకాంక్ష సేయఁడు
ప్రాప్తంబు గాని పదార్థములకు
సర్వభూతహితత్వశాలి యిమ్మొయి సిద్ధిఁ
బ్రాపించె నని చెప్పెఁ బ్రకటఫణితి

తే. ననఘ! యిట్టివిశేషంబు గనుఁగొనంగ
వినను గాంచితి ననిన నవ్యాప్రవరుఁడు
ప్రమద మెద నిండి పొంగారఁ బాఁపజేని
యాననము సూచి యిట్లను మానవేంద్ర! 610

క. ఇవి యన్నియు నాశ్చర్యము
లవుఁదెరువును నాకుఁ జూపి తన్వార్థత నొ
ప్పు వివిధశబ్దంబుల బో
ధవరేణ్యా! పోయి వచ్చెదం బ్రియమొందన్. 611

క. నను మఱవక పనుపం దగు
పనులెల్లను బనుపుశిష్యభావశుభము నా
కనఘ ! కలిగెను నీదెస
ననూనభద్రములు నీకు నయ్యెడు మెపుడున్. 612

చ. అన విని నన్నుఁ గాంచితి ప్రయత్నమునన్ వినిపింపు మీవు వ
చ్చినపని నాకు నీ కొకటి సేసితినే యిటు వృక్షమూలవా
సునిక్రియ లేచిపోక తగుచొ ప్పగునే భవదీయవాంఛ సె
ప్పిన నది యేను దీర్తు మటి పెంపెసఁగం జను భూసురో త్తమా ! 613

వ. అని వెండియు. 614

తే. అనఘ! నాయందు నీవు నీయందు నేనుఁ
గలము నీకు నీసర్వలోకంబు గలదు
చింత కవకాశ మెద్ది నిశ్చింతభావ
మొందు మనియె నానందశూకో త్తముండు. 615

వ. అనిన విని భృగుండు పద్మన కిట్లనియె: 616


తే. భోగివర! యిది యిట్టిద; భూతములను
నీవు నేనును సర్వగతావిశిష్ట
విధములము వేదితవ్యంబు విదితమయ్యె;
నిట్టి సందర్శనము వ్రత మింక నాకు. 617

క. ఈవిధము నిశ్చయము నే
భావింపఁగఁ గంటి నీకృపారతివలనన్
నీవు కృతార్థుఁడవు సుజన
సేవిత! యామంత్రణంబు సేసినవాఁడన్. 618

వ. అని పలికి యిచ్ఛిధంబునఁ గృతనిశ్చయుఁడై భృగుండు భుజంగవిభు వీడ్కొని దీక్షావిశేషకాంక్షం జేసి భార్గవకులపవిత్రుం జ్యవనుం గాంచి నిజవృత్తాంతంబు సెప్పి తత్కృతసంస్కారంబునం గృతకృత్యుండయ్యె; నిప్పుణ్యకథ యబ్భార్గవుండు జనకసదనంబున నారదునకు వివరించె; నద్దేవమునివరుండు దేవతావరునకు వినిపించె; నమ్మహాత్ముండు వసువులకుం జెప్పె; జామదగ్న్యతోడి సంగ్రామంబున నుద్దామచిత్తుండ నై న ననున్నం దేర్చుటకై వసువులు సకలభూతసమదర్శిత్వసంపాదకంబై న యీ యితిహాసంబు నాకుం జెప్పిరి; నీవు పరమధర్మం బెయ్యది యని యడిగిన నేను నీకుం జెప్పితి; సర్వసమతాసముపహితం బై న యనాకాంక్షిత్వంబు ధర్మోత్తమంబు నిరతిశయానందంబునకు నిధానంబు. 619

క. అని యిట్లు ధర్మసుతునకు
ననిమిషతటినీతనూజుఁ డధికప్రేమం
బునఁ జెప్పుట వైశంపా
యనుఁడును జనమేజయునకు నర్థిం జెప్పెన్. 620

వ. చెప్పిన విని జనమేజయుండు వైశంపాయనుతో 'నిత్తెఱంగునఁ బితామహుండుపితోపదేశంబు సేసిన నమ్మహీశుం డెవ్విధంబు దశావివేషంబు నొందె మునీంద్రా చెప్పవే' యనుటయు 621



ఉ. ఆగమ పుష్ప సౌరభ శుభాంగనివాస బుధాంతరంగ వి
ద్యాగృహమేధితా సుభగతామహనీయ సుధార్చనీయ ని
ర్భోగ సభోగసంపదనిరూప్య సుసంవిదవాప్యభక్తి ల
క్ష్మీగురునిత్య యోగిజనసేవిత శాంతిసుఖైకభావితాః 622

క. అభిమత ఫలసంపాదన
విభవమహీయఃప్రసాద విశ్రుతవేదా

ఋభువిభులోచననాంబుజ
ఋభ దరవిత్వాహరిత్వ సుభగహరత్వా : 623

మాలిని. వరబహునుత వేదవ్యాస విశ్వాత్మభాసా :
నిరుపమ తనులీలా నిత్యసత్వాధికృత్వా !
నిరతిశయ సమత్వోన్నిద్రగారుణ్యభద్రా !
భరితభువనవర్గా : భాస్వదానందమార్గా : 624

గద్యము.

ఇది శ్రీమదుభయకవిమి త్రి కొమ్మనామాత్య పు త్రి బుధారాధనవిరాజి
తిక్కనసోమయాజి ప్రణీతం బయిన శ్రీమహాభారతంబున
శాంతిపర్వమునందు సర్వంబును షష్ఠాశ్వాసము.

శ్రీమదాంధ్ర మహాభారతమునందలి శాంతిపర్వము సమా ప్తము.

V.R. NARLA MEMORIAL LIBRARY * V.R. NARLA D. P. R. I. Acc. No.

ئۇ

AOUA103B123

BL



నాగార్జున ఆర్ట్ ప్రింటర్స్, బర్కత్‌పురా హైదరాబాదు. 500 029.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA103B123
పుస్తకం పేరు	ఆంధ్రమహాభారతము శాంతిపర్వము
తారీఖు	31 December 2025
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	[illegible]
మొత్తం పేజీలు	643
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	CI BCI
లేని పేజీలు	NO
తయారు చేసినది	[illegible]
పేజీలు విడదీసినది	[illegible]
స్కాన్ చేసినది	C. Nageswari
పరీక్ష చేసినది	SARANYA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good